# కథా కౌముది

2015



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 150

*కౌముది మాసపత్రికలో 2015 జనవరి నుంచి డిసెంబర్ వరకూ వచ్చిన కథలు*

## విషయసూచిక


| ఏడాది | నెల | కథ పేరు | రచయిత(త్రి) పేరు | పేజి |
|---|---|---|---|---|
| 2015 | 01 | తల్లి గులాబి | మేడపాటి శ్రీనివాసరెడ్డి | 5 |
| | | బాడీ సర్వీసింగ్ | జి వారిజ | 10 |
| | | సీత రాసిన కథ | బాలి | 17 |
| | | ఎవరికి ఎవరు | మన్నెం శారద | 21 |
| | | పరివర్తన | పి బి రాజు | 27 |
| | | 'ఆత్మ' సందేశం | భవానీ ఫణి | 32 |
| 2015 | 02 | నాలుగు మెతుకులు | ఎనుగంటి వేణుగోపాల్ | 36 |
| | | వినాశాయచ దుష్కృతాం | కల్లూరి శ్యామల | 43 |
| | | కాకి రామం | కొట్టం రామకృష్ణా రెడ్డి | 51 |
| | | అదీ సంగతి | పోడూరి కృష్ణకుమారి | 57 |
| | | శివ శివ కరుణాబ్దే | ఆర్ శర్మ దంతుర్తి | 63 |
| 2015 | 03 | సాయం సంధ్య | స్వాతీ శ్రీపాద | 71 |
| | | నిజం ముంగిట్లో ఓ అబద్ధం | డా నారాయణ గరిమెళ్ళ | 75 |
| | | ఆనందమానంద మాయెనే | శ్రీకళ అబ్బరాజు | 77 |
| | | నిర్ణయం | సి హెచ్ కళ్యాణ చక్రవర్తి | 82 |
| 2015 | 04 | కామనార్థం | తాడికొండ కె శివకుమార శర్మ | 86 |
| | | స్వప్నసుందరి స్వప్నం | సుపర్ణ | 92 |
| | | అద్దం | నాదెళ్ళ అనూరాధ | 95 |
| | | కల చెప్పిన కథ | డా వింజమూరి అనసూయాదేవి | 101 |
| | | కథ రాయాలి | భవానీ ఫణి | 103 |
| | | తిరుగులేని ప్రయాణం | వేమూరి వెంకటేశ్వరరావు | 107 |

| | | | | |
|---|---|---|---|---|
| | | మగ బిడ్డ మాత్రమే | ఆర్ శర్మ దంతుర్తి | 114 |
| 2015 | 05 | అమ్మ కావాలి | శారద కాశీవఝుల | 122 |
| | | ప్రేమంటే | అనుపమ గాలి | 126 |
| | | వేప పూతలో తీపి | డేగల అనితాసూరి | 129 |
| | | ప్రేమచిత్రం | కొల్లూరు లావణ్య | 132 |
| | | వరదగూడు | బడుగు రవి కుమార్ | 138 |
| | | ఎక్కవలసిన రైలు | బాలమురళికృష్ణ గోపరాజు | 143 |
| 2015 | 06 | సరళ రేఖ | చంద్రమౌళి కళ్యాణ చక్రవర్తి | 147 |
| | | సంస్మరణ | డా భైరవభట్ల విజయాదిత్య | 150 |
| | | దైవం సాక్షిగా | పోలంరాజు శారద | 158 |
| | | పురుషులందు...! | డా పేరం ఇందిరాదేవి | 163 |
| | | హైటెక్ అత్తగారు | సాయిప్రజ్ఞ వడ్లమాని | 167 |
| | | పునరావృతం | ప్రసూన రవీంద్రన్ | 173 |
| | | చీకటయిన వెలుగు | జోషిబాబు | 180 |
| 2015 | 07 | సుల్తానీ | ఎన్ తారకరామారావు | 184 |
| | | అమ్మ డైరీలో ఆఖరిపేజి | డా ఎమ్ సుగుణరావు | 188 |
| | | రాగింంగ్ | ఆర్ శర్మ దంతుర్తి | 191 |
| | | న్యాయం | తిరుమలశ్రీ | 197 |
| 2015 | 08 | ఇనుపతెర | మధు పెమ్మరాజు | 203 |
| | | శ్లాప్ | వసుంధర | 210 |
| | | పరిమళం | నాదెళ్ళ అనూరాధ | 219 |
| | | నీ వల్లే | శశికళ  అబ్బరాజు | 225 |
| 2015 | 09 | ఎర్ర చందనం | పుట్టగుంట గోపికృష్ణ | 229 |
| | | దృశ్యం | సుభద్ర  వేదుల | 237 |
| | | కర్తవ్యధర్మం | వరుణ్ పారుపల్లి | 245 |

| | | | | |
|---|---|---|---|---|
| | | దృక్పథం | నాగలక్ష్మి వారణాసి | 250 |
| 2015 | 10 | ఆ బిడ్డ నాకు కావాలి | డా కె జి వేణు | 254 |
| | | కప్పదాట్లు | కర్లపాలెం హనుమంత రావు | 263 |
| | | ఋణం తీరిపోయింది | తిరుమలశ్రీ | 269 |
| | | కనువిప్పు | అంజన కె | 275 |
| 2015 | 11 | దానిమ్మ గింజలు | తాడికొండ కె శివకుమార శర్మ | 280 |
| | | ఎవరికెవరు ఈ లోకంలో | కాకాని చక్రపాణి | 289 |
| | | చివరకు మిగిలేది | నాగేశ్వరరావు | 297 |
| | | ఏక్సిడెంట్ | ఆనంద్ వేటూరి | 301 |
| 2015 | 12 | ఫోటో నవ్వుతోంది | దావులూరి జయలక్ష్మి | 308 |
| | | వసంతంలో మూగవోయిన కోయిల | డా యండమూరి సత్యకమలేంద్రనాథ్ | 313 |
| | | అట్టు | శ్రీకళ అబ్బరాజు | 321 |
| | | రిటైర్మెంట్ | అంజన కె | 325 |

కథా కౌముది

# తల్లి గులాబి

మేడపాటి శ్రీనివాసరెడ్డి

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**ఇ.ఎస్.ఐ బస్టాప్** వద్ద సికింద్రాబాద్ వెళ్ళే బస్సు కోసం వెయిట్ చేస్తున్నాను. లంచ్ అవర్ వల్ల కాబోలు చాలా సేపటి నుంచి బస్సు లేకపోవడం వల్ల బస్టాప్ నిండా జనం ఉన్నారు. ఇంతలో ఎవరో అకస్మాత్తుగా నా భుజం మీద చెయ్యివేసేసరికి ఉలిక్కిపడ్డాను. "ఏరా గుర్తుపట్టావా?" ఎర్రగా పొడుగ్గా ఉన్న ఆ వ్యక్తి ప్రశ్నించాడు. మొఖం మాత్రం బాగా తెలిసినట్టే ఉంది కానీ ఇంకేం గుర్తురావడంలేదు. బాగా తెలిసినవాడై ఉంటాడు. లేకపోతే భుజం మీద చెయ్యివేసి ఏరా అని ఎలా సంబోధించగలడని అనుకుని 'మీరు...?' అంటూ గొణిగాను.

"సరిగ్గా చూడు" అన్నాడు నవ్వుతూ.

"సారీ గుర్తు రావడంలేదు"

"నేనురా సుబ్బారావుని" అయినా పోల్చుకోలేక ఎగాదిగా చూస్తున్నాను అతని వంక.

"ఇంటర్మీడియట్ క్లాస్‌మేట్‌ని"

"ఓరి నువ్వా" అతని వీపుమీద చెయ్యివేయబోయి ఆగిపోయాను.

చదువుకునే రోజుల్లో వాడి ఒంటి నిండా బొల్లి ఉండేది. క్లాసులో చాలామంది వాడికి దూరంగా ఉండేవారు. ఫ్రెండ్‌షిప్ చేసేవారు కాదు కూడా. అలాంటిది ఇప్పుడు వాడి వంటి మీద ఎక్కడా బొల్లి మచ్చ లేదు. చాలా స్లిమ్‌గా ఉన్నాడు. నేను ఆశ్చర్యంగా చూడడాన్ని గమనించి "బొల్లి గురించేనా?" అన్నాడు.

"యునాని మందులు వాడా్రనా. పూర్తిగా తగ్గిపోయింది. ఇంకా కొన్నాళ్ళుపాటు వాడాలి. ఇక్కడే గవర్నమెంట్ యునాని ఆసుపత్రి ఉంది. మందుకోసమే వచ్చాను. అది తీసుకు వెడుతుంటే నువ్వు కనిపించావ్" అన్నాడు.

"యునాని మందులకు బొల్లి పూర్తిగా తగ్గిపోతుందా?" అడిగాను.

"కొన్ని రకాల బొల్లి గ్యారంటీగా తగ్గిపోతుంది. దానికి నేనే నిదర్శనం" ధీమాగా అన్నాడు.

"సరే అలా వెళ్ళి టీ తాగుతూ మాట్లాడుకుందాం" అన్నాను.

ఇద్దరం దగ్గర్లో ఉన్న ఓ ఇరానీ హోటల్‌కి వెళ్ళి వన్ బై టూ టీ సిప్ చేస్తూ కబుర్లు చెప్పుకున్నాం.

సుబ్బారావు ఏ.పీ.పీ ఎస్సీ గ్రూప్ - 2బి టెస్ట్ పాసై సెక్రటేరియట్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్నాడట. ఇద్దరి పిల్లల తండ్రట కూడా. అమీర్ పేటలో ఉంటున్నాడట. మాతో చదివినవాళ్ళు ఎవరెవరు ఏం చేస్తున్నదీ వాడికి తెలిసినవి వాడు, నాకు తెలిసినవి నేనూ చెప్పాను. బాతాఖానీ పూర్తయ్యాక బొల్లి మందు గురించి మరిన్ని వివరాలడిగాను. నీకు తెలిసిన వాళ్ళకి ఎవరికైనా బొల్లుంటే ఈ యునాని మందు గురించి చెప్పమన్నాడు. హైదరాబాద్ రావడానికే ఖర్చుగాని మందు ఉచితంగా ఇస్తారని, గ్యారంటీగా తగ్గుతుందని చెప్పాడు. హోటల్ నుంచి బస్టాప్ వచ్చేసరికి నేను ఎక్కవలసిన సిటీ బస్ రెడీగా ఉంది. వాడికి బై చెప్పేసి బస్సెక్కాను.

బస్సెక్కానుగానీ నా ఆలోచనలన్నీ బొల్లి మందు గురించే. మా ఊర్లో మా ఇంటి పక్కవాళ్ళ అమ్మాయికి బొల్లి ఉంది. వాళ్ళు కూడా చాలా వైద్యం చేయించారు. తగ్గలేదు. వాళ్ళకి ఈ మందు విషయం చెబితే బాగుంటుందనిపించింది. ఆ అమ్మాయి పేరు శారద. నన్ను అన్నయ్యా అనిపిలుస్తుంది. కులం వేరైనా వాళ్ళూ మేమూ బంధువుల్లానే ఉంటాం. మేమే కాదు, పల్లెటూళ్ళలోనే అంత. కులాలు వేరైనా అందరూ వరసలు పెట్టి పిలుచుకుంటారు. పిలుచుకోవడమే కాదు, అంతా కలిసిమెలిసి ఉంటారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా అందరూ ఆదుకుంటారు. ప్రేమా, ఆప్యాయత, అనురాగం పల్లెటూళ్ళలోనే కనీసంగానైనా మిగిలాయి.

శారద నాకు చిన్నప్పటి నుంచీ తెలుసు. చాలా మంచి పిల్ల. సృష్టికర్త అంతా బాగా చేసి ఆ రోగం ఎందుకు పెట్టాడో అనిపిస్తుండేది. చిన్నప్పుడు తోటివాళ్ళు ఆడుకున్నప్పుడు ఆమెను చేరనిచ్చేవాళ్ళుకాదు. అప్పుడు దూరంగా ఒక చోట కూర్చుని ఏడుస్తూ ఆ చిన్నారి పడిన వేదన నా మదిలో ఎప్పుడూ మెదుల్తూనే ఉంటుంది. శారద అమ్మా నాన్నలు ఆ అమ్మాయిని బాగానే చూసుకునేవారు. అయితే ఒక్కోసారి వాళ్ళ ప్రవర్తన చూసి నాకు కోపం వచ్చేది. కానీ నేనేం చేయగల్ను. వాళ్ళమ్మాయి వాళ్ళ ఇష్టం. వాళ్ళ అక్క పెళ్ళి చూపుల రోజు నాకింకా బాగా గుర్తుంది. ఆ రోజు మగపెళ్ళివారు శారదవాళ్ళక్కను చూసుకోవడానికి వస్తారని శారదను మా ఇంట్లో ఉంచారు. పెళ్ళికూతురు చెల్లెలికి బొల్లి ఉందంటే సంబంధం చెడిపోతుందని చెప్పి శారదని వాళ్ళకు కనపడనివ్వకుండా ఉంచారు. ఉంచారు అనేకంటే దాచారు అంటే సరిపోతుంది. నేనూ బావని చూస్తానని శారద గోలపెట్టగా వాళ్ళనాన్న రెండు తగిలించాడు. తను ఆ రోజంతా మా ఇంట్లో గడిపిన ప్రతి క్షణం నాకు గుర్తుంది. అలాగే వాళ్ళక్క పెళ్ళిరోజు, వాళ్ళన్నయ్య పెళ్ళిరోజు కూడా శారదకు మా ఇంట్లో గృహనిర్బంధం. వాళ్ళ బంధువుల ఇంటికి ఫంక్షన్స్‌కి వెళ్ళినప్పుడు కూడా తనని మా ఇంట్లోనే వదిలి వెళ్ళేవారు. పుట్టిన దగ్గర నుంచి ఇంత క్షోభను అనుభవించిన శారదకి కూడా యునానీ మందుతో బొల్లిపోతుందన్న తలంపే నాకెంతో ఆనందంగా ఉంది. శారద కూడా అందరిలాగే అవుతుందంటేనే సంతోషంగా ఉంది. ఎప్పుడు మా ఊరెళ్ళి ఈ విషయం చెబుదామా. ఎపుడు శారద చేత ఈ మందులు వాడిద్దామా అని ఆరాటంగా ఉంది. కండక్టర్ టికెట్ సాబ్ అనేసరికి ఈ లోకంలోకి వచ్చాను.

తెలతెలవారుతోంది. హైదరాబాద్ - నరసాపురం బస్సు మా ఊరు దగ్గర నన్ను దించి నా మీద దుమ్ముకొట్టి మరీ వెళ్ళిపోయింది. రోడ్డు మీద బస్సు దిగి ఓ మైలు దూరం కంకర రోడ్డుపై వెడితే మా ఊరు వస్తుంది. ఊళ్ళోకి వెళ్ళడానికి ఆటోలు, రిక్షాలు ఉండవు. చేతిలోకి సూట్‌కేస్ తీసుకుని, భుజానికి ఎయిర్‌బ్యాగ్ తగిలించుకుని నెమ్మదిగా నడక మొదలు పెట్టాను. మా ఊరు వచ్చి రెండునెలలయ్యింది. సాధారణంగా ఐదారు నెలలకు కానీ మా ఊరు వెళ్ళను. హైదరాబాద్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తున్న నాకు అస్తమానూ లీవు దొరకడం కష్టం. శారద మందు విషయం గురించే ఆతృతతో మా ఊరు పయనమయ్యాను. పొలాలకు కావళ్ళతో వెడుతున్న రైతులు ఎదురుపడి పలకరించారు. పావుగంట నడక తర్వాత ఇంటికి చేరాను. అకస్మాత్తుగా నన్ను చూసిన మా అమ్మా నాన్నల ఆనందం వారి కళ్ళల్లో కనపడుతోంది. "ఫోన్ చేస్తే పెదరోడ్డు దగ్గరికి సైకిలేసుకుని వచ్చేవాడ్ని కదరా!" అన్నాడు నాన్న. ఒంటికి పట్టిన చెమటను చూసి. మా అమ్మయితే నన్ను కౌగిలించుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"వేడి నీళ్ళు పొయ్యిమీదున్నాయి, స్నానం చెయ్యి కొంచెం బడలిక తగ్గుతుంది" అంది అమ్మ.

"నేను అర్జెంటుగా శారద ఇంటికి వెళ్ళాలి"

"అదేంట్రా ఊరునుంచి వచ్చావో లేదో అపుడే వాళ్ళింటికెందుకురా, స్నానం చేసి టీ తాగి వెళుదువుగాని" అంటున్న అమ్మ మాట పూర్తవకుండానే శారద వాళ్ళింటికి దౌడు తీసాను.

నేనీ వార్త చెప్పగానే వారి మొఖాల్లో కనిపించే ఆనందాన్ని ఊహించుకుంటుండగా ఇంటి ముందు వరండాలో టీ తాగుతున్న శారద నాన్న నన్ను చూసి "ఏరా ఎప్పుడొచ్చావ్?" అంటూ పలకరించాడు.

"చిన్నాన్నా! శారదేది? మీకో శుభవార్త! " అంటూ హడావిడి చేశాను.

"ఏంట్రా నీకేమైనా ఆఫీసర్ ఉద్యోగం వచ్చిందా? " అంటూ వంటింట్లోంచి పిన్ని బయటికి వచ్చింది.

"పిన్నీ! మన శారదకు బొల్లి ఉందని ఎప్పుడూ బాధపడేదానివి కదా! ఇపుడు ఆ విషయం గురించి బెంగపెట్టుకోనక్కర్లేదు. హైదరాబాద్‌లో యునానీ మందు వాడితే పూర్తిగా తగ్గిపోతుంది. మామూలుగా అయితే నమ్మేవాడిని కాదుగానీ నా ఫ్రెండొకడు ఈ మందు వాడితే పూర్తిగా నయమైపోయింది తెలుసా?" అన్నాను.

ఎందుకో నేను అనుకున్నంత ప్రతిస్పందన రాలేదనిపించింది.

"ఏంటి పిన్నీ అలా ఉండిపోయావ్ శారదను తీసుకుని వెళ్దామా!?" అన్నాను.

"ఎందుకలే బాబూ అలాగే ఉండనీ" అంది ఉదాశీనంగా.

నేను ఆశ్చర్యంగా చూస్తూ "అది కాదు" అని ఏదో చెప్పబోతుండగా చిన్నాన్న అన్నాడు

"ఒరేయ్ నీకు తెలుసుగా మన సుజాతకి రెండెకరాలు ఇచ్చి పెళ్ళి చేశాను. మనకున్నదా నాలుగెకరాలు. ఈ బొల్లి నయం చేయించి దీనికి కూడా పెళ్ళి చేస్తే ఇక బతికేది ఎలా? ఇప్పటికే పెద్దమ్మాయి పెళ్ళికి చేసిన అప్పులు కుంగదీస్తున్నాయి. ముందు ముందు పురుడు అనీ అదనీ ఇదనీ ఖర్చులు మామూలే. అది పుట్టినప్పుడు బొల్లి ఎందుకిచ్చావు దేవుడా అని బాధపడేవాళ్ళం. కానీ ఇప్పుడనిపిస్తోంది బొల్లి ఇచ్చి మాకు మంచే చేశాడని. కనీసం పెళ్ళి చేయలేదన్న అపవాదునుంచైనా రక్షించాడు" అన్నాడు.

నాకు ఇదంతా విని గొంతు పెగల్లేదు.

చిన్నానను చూస్తే రక్తం పంచి ఇచ్చిన తండ్రిలా కాక రోగం పంచి ఇచ్చిన పగవాడిలా కనిపించాడు. పిన్నిలో పేగుతాడు ద్వారా తొమ్మిది నెలలు జీవసారాన్నిచ్చిన మాతృమూర్తి కాక కన్నబిడ్డ జీవితంలో ఆనందాన్ని కాజేస్తున్న శత్రువు కనిపించింది. శారద బతుకునూ, భవిష్యత్తునూ తలుచుకుని గుండె బరువెక్కింది. పిన్నీ చిన్నాన్నలను మనసులోనే అసహ్యించుకుంటూ వచ్చేశాను.

***

తర్వాత నాలుగైదేళ్ళకు ఊళ్ళో మాకున్న కొద్దిపాటి పొలమూ, ఇల్లూ అమ్మేసి అమ్మానాన్నలను హైదరాబాద్ తీసుకు వచ్చేశాను. ఆ పనుల నిమిత్తం వెళ్ళినప్పుడు కూడా చిన్నాన్న వాళ్ళ ఇంటివైపు తొంగి కూడా చూడలేదు. శారదను చూడాలనిపించినా ఆమెతో పాటు హృదయం లేని కన్నవారిని చూడాల్సి వస్తుందన్న అయిష్టానిదే పైచేయి అయింది. పదేళ్ళ తర్వాత మా బావ కూతురి పెళ్ళికి మా ఊరెళ్ళాను. పెళ్ళిపీటల మీద మేనకోడలిని చూసినప్పుడు ఎందుకో శారద గుర్తొచ్చింది. అన్నట్టు పిన్నీ, చిన్నాన్న పెళ్ళిలో కనిపించలేదు. బహుశా వాళ్ళని పిలవలేదేమో. పిన్నీ, చిన్నాన్నా గుర్తొచ్చినా ఆ తలపు మునుపటిలా నాలో తీవ్ర విముఖతను కలిగించలేదు. బహుశా – ఆ బడుగు తల్లిదండ్రుల కన్నా అసహ్యించుకోదగ్గ మనుషులెందరినో ఈ పదేళ్ళలో చూడడమే అందుకు కారణం కావచ్చు. మర్నాటి ఉదయమే చిన్నాన్న ఇంటికి వెళ్ళాను. ఇల్లు అక్కడక్కడా పెంకులు జారి, తడికె బయటపడి శిధిలావస్థలో ఉంది. ఆ ఇంటికి ఇలాగే

నడుం వంగిన వ్యక్తి అరుగు మీద స్థంభానికి ఆనుకుని చుట్ట కాలుస్తున్నాడు. దగ్గరకెళ్ళి చూస్తే చిన్నాన్నే. దృఢంగా ఉండి ఒక్క చేత్తో నలుగురి పని చేసేవాడు ఎలా అయిపోయాడు. మనసు చివుక్కుమనిపించింది.

"చిన్నాన్నా! ఎలా ఉన్నావ్?" ప్రశ్నించాను.

కళ్ళు చికిలించి కాసేపు చూశాక గుర్తుపట్టాడు. "నువ్వా శీనూ..!? ఎన్నాళ్ళైంది నిన్ను చూసి. అమ్మానాన్నా, పిల్లలూ, మీ ఆవిడా అంతా బాగున్నారా?" అడిగాడు.

"అంతా బాగానే ఉన్నారు. శారదా, పిన్నీ ఎలా ఉన్నారు?"

"ఇంకెక్కడి పిన్నిరా. నాలుగేళ్ళయింది అదిపోయి. పక్షవాతంతో రెండేళ్ళు మంచం మీదుండి నరకయాతన పడింది. శారదే తల్లికి అన్నీ చేసింది." చిన్నాన్న నిర్వేదంగా చెప్పింది విని 'అయ్యో' అనుకున్నాను.

"ఊరుకో చిన్నాన్నా!" అంటూ భుజం మీద చెయ్యేశాను ఓదార్పుగా. ఇంతలో శారద వచ్చింది లోపల నుంచి. ఇప్పుడామె వంటి మీద బొల్లి ఉన్న చోటు కన్నా లేనిదే తక్కువగా ఉంది. కళ్ళు లోతుకు పోయి, శరీరం చిక్కిపోయి ముప్పయ్యో పడిలోనే అంతకు రెట్టింపు వయసున్న దానిలా ఉంది. చిన్నాన్న పక్కన కూతురిలా కాక తోడబుట్టిన దానిలా కనిపిస్తోంది. నా హృదయం బరువెక్కింది.

"శీనన్నయ్యా! బాగున్నావా? రా ఇలా వచ్చి ఈ కుర్చీలో కూర్చో. వదినా పిల్లల్ని తీసుకు వచ్చావా?" అంటూ అరుగు మీద ఓ పక్కకున్న కుర్చీని ముందుకు లాగింది.

"బాగానే ఉన్నానమ్మా! పిల్లలకు పరీక్షలని నువ్వేమిటి ఇలాగైపోయావు? ఎవరైనా నాకు అక్కంటే నమ్ముతారు"

చాలా తేలిగ్గా నవ్వుతూ "ఎల్లకాలమూ ఒక్కలాగే ఉంటామేంటి అన్నయ్యా. పోనీలే నన్ను అక్క అనే పిలువు" అంది. "కాఫీ తెస్తానుండు. నాన్నా నీక్కూడా.. బీ.పీ మాత్ర వేసుకుందువు గాని" లోపలికెళ్ళింది. నేను పుట్టెడు బాధతో అన్న మాటలు ఆమెను నిజంగానే పూచిక పుల్ల పాటినొప్పించినట్టు లేవు.

శారద లోపలికి వెళ్ళేవరకూ రెప్పవెయ్యకుండా అటే చూసిన చిన్నాన్న తర్వాత తలతిప్పి నావైపు చూశాడు. చిన్నాన్న కళ్ళు కురవడానికి సిద్ధంగా ఉన్న మబ్బుల్లా ఉన్నాయి. ఒక్క క్షణం ఆగి వడిలిపోయిన కంఠం కొలిమి తిత్తిలా ఉబ్బుతూ, ముడుచుకు పోతూ ఉండగా వెక్కెక్కి ఏడ్చాడు. అంతలోనే తమాయించుకుని పూడుకుపోయినట్టున్న జీర గొంతుతో చెప్పాడు.

"పెళ్ళి చేసి పురుళ్ళు పోసి, సారె పెట్టి పంపాల్సిన వాళ్ళం అదంతా ఎగ్గొట్టాం. అయినా దానికి తల్లి యోగం ఉందిరా. మా ఇద్దర్నే బిడ్డలుగా చూసుకుందిరా. కన్నతల్లి కన్నా ఎక్కువ సేవలు చేసిందిరా. పిన్ని మంచం పట్టినప్పుడు అది చూసుకున్నట్టు లోకంలో ఏ తల్లీ ఏ బిడ్డనూ చూసుకుని ఉండదురా. ఇదిగో ఇప్పుడు నాకు" మళ్ళీ వెక్కెక్కి పడ్డాడు. మండుతున్న గాడిపొయ్యిలా పడ్డ ఉల్లిగడ్డలా చిన్నాన్న మనసు పశ్చాత్తాపంతో దహించుకుపోతున్నట్టుంది. శారదకు వైద్యం చేయించి, బాగు చేయించాలన్న నా తపనను తోచిపుచ్చిన ఆ మనిషే ఇప్పుడు ఆ తప్పును ఒప్పుకుంటూ నా ముందు కరిగి నీరైపోతున్నాడు. పదేళ్ళ క్రితం తీవ్రంగా అసహ్యించుకున్న ఈ మనిషి పైనే నాకు జాలి కలిగింది.

"అదంతా ఇప్పుడెందుకులే చిన్నాన్నా! ఊరుకో" అన్నాను అనునయిస్తూ. మళ్ళీ తేరుకున్న చిన్నాన్న ఇంకా ఒప్పుకోవలసిన తప్పు ఉన్నట్టు కొనసాగించాడు.

"శీనూ! దానికున్న రోగం వల్ల పెళ్ళి చేసి పంపితే అత్తింట్లో ఏం బాధలు పడాల్సి వస్తుందో, ఎన్ని అవమానాలు ఎదురవుతాయోనన్న జంకుతో కాదుగా ఆనాడు నీ మాటను కాదన్నది.

బతుకు తెరువుకు రెండెకరాల భూమి మిగుల్చుకోవాలనుకున్నామే గానీ ఆ భూమాతనే మిగుల్చుకుంటున్నామనుకోలేదురా. దానికి మేమన్యాయం చేసినా ఆ భూమాతను మించిన ఓరిమితో మాకు దిక్కుగా నిలిచిందిరా"

భుజం మీది కండువా తీసి ముఖం కప్పుకుని చిన్నపిల్లాడిలా విలపించాడు. చిన్నాన్న దుఃఖాన్ని నేను తీర్చగలనా? ఇంతలో కాఫీ గ్లాసులు పట్టుకుని లోపల నుంచి వచ్చింది శారద. వ్యాధి శరీరమంతా వ్యాపించిన ఆమెను చూస్తుంటే ఇప్పుడు నడిచి వస్తున్న నిలువెత్తు తెల్లగులాబీలా కాదు - తల్లి గులాబీలా కనిపించింది. ఈ గులాబీ వెదజల్లే అమ్మ ప్రేమకు తప్పక చిన్నాన్నను ఓదార్చే శక్తి ఉంటుంది.




# బాడీ సర్వీసింగ్

జి. వారిజ

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**టెన్షన్. ఆఫీస్ టైం అయిపోయింది.** పెట్రోల్ పోయించాలి బండిలో.

"గుడ్ మార్నింగ్.. మేడమ్."

"గుడ్ మార్నింగ్.. చిరంజీవీ!"

క్యూ కదిలింది. చిరంజీవి ముందుకు బండి పోనిచ్చి పెట్రోల్ బాక్స్ ఓపెన్ చేసాను.

పెట్రోల్ బంక్ అబ్బాయి డబ్బుతీసుకుంటూ "బండికి రోజూ దిష్టి తీయండి మేడమ్, నా దిష్టే తగిలేటట్లు ఉంది" అన్నాడు చిరంజీవి.

మురిపెంగా బండి చూసుకుంటూ, చిన్నప్పుడు చదువుకున్న పుత్రోత్సాహం పద్యం గుర్తుకు వచ్చి నవ్వుకుంటూ బంకులోనుంచి బయటకు వచ్చాను. రేర్ పింక్ కలర్ నా బండి అడ్వర్‌టైజ్ మెంట్‌లో తప్ప షాప్‌లో కనిపించని కలర్. నేను బండి కొనాలని వెళ్ళినరోజు నా ముందు స్టాక్ దిగడం అందులో ఒకే ఒక బండి కలర్ డిఫరెన్స్ అని షాపువాడు చూపించటం ఇంకేమి చూడకుండా వెంటనే డబ్బిచ్చి బండి స్వంతం చేసుకున్నా. ఎందుకో దాన్ని చాలా మురిపెంగా చూసుకుంటాను.

మా అమ్మాయి నీల తన ఫ్రెండ్స్‌తో జోకులేస్తుంటుంది. "మా అమ్మ డ్రైవింగ్ చాలా స్మూత్. వెనక మా కోసం కాదు. బండికి ఎక్కడ నొప్పు తగులుతుందో అన్నట్లు డ్రైవింగ్ చేస్తుంది" అని. ఎవరెన్ని చెప్పినా నా సెంటిమెంట్స్, ఫీలింగ్స్ నావే. సాయంత్రం ఇంటికి వస్తున్నా.

"ఏయ్.. ఏయ్" అరుస్తూనే ఉన్నా, స్కూల్ పిల్లాడు సైకిల్ పైన బండికి అడ్డం వచ్చాడు రోడ్‌క్రాస్ చేస్తూ, బండి సైకిల్‌కు తగలడం.. ఆ అబ్బాయిని చూస్తూ నేను బ్యాలెన్స్ వదిలేయటం అటు సైకిల్ అబ్బాయి, ఇటు నేను, నా బండి పడిపోవటం క్షణాల్లో జరిగిపోయింది. చుట్టూ జనాలు చేరడం ఇద్దర్ని లేపారు. నేను ముందు బండిని ఎత్తి చూసుకున్నాను. ఓ మైగాడ్, అద్దం విరిగింది. రెండు చోట్ల బాగా గీతలు పడింది. చేత్తో గీతలు పడ్డ చోట నిమిరాను బాధగా. అబ్బాయికి ఏమీ తగల్లేదు. అక్కడ అందరూ అబ్బాయికి జాగ్రత్తలు చెబుతున్నారు. నేను ఎవిరి మాటలు వినే స్థితిలోలేను. బాధగా బండిని స్టార్ట్ చేసుకుని ఇంటికి వచ్చేసాను. దిష్టి అంటే ఇదేనేమో అనుకున్నాను.

వంట చేస్తు న్నాను మౌనంగా, ''అమ్మమ్మ.. ఫోన్ '' నీల నా సెల్‌ఫోన్ తెచ్చిచ్చింది.

''చెప్పు..'' అన్నా పొడిగా.

''సుజీ ఏం చేస్తున్నావ్, పడ్డావంటకదా... నీల చెప్పింది. ఏమయినా తగిలిందా?''

''ఏదోలే''

''అరె, చెప్పు. చెప్పితే కదా తెలిసేది''

''అరవకు, ఫోన్ పెట్టేస్తా''

''దెయ్యమా, నీతో వేగలేనే. పడి లేవగానే కాళ్ళూ, చేతులన్నా విదిలిచ్చావా, లోపల ఏదయినా పట్టేస్తుంటాయి.''

''ఆ రెండు అంతస్తులు నుండి పడ్డాను. స్కూటర్ పై నుంచే'' స్కూటర్ అన్న మాటతో నా కళ్ళలో నీళ్ళు చిమ్మాయి. అమ్మ కదా. అటువైపు తెలిసి పోయినట్లుంది.

''స్కూటర్‌కు దెబ్బలా, ముందు నీకేమి తగిలిందో చెప్పు. హరి వచ్చాడా ఆఫీసునుండి? హాస్పిటల్‌కు ఏమయినా పోవాలా?''

''అమ్మా ఆపవే. నాకేమీ కాలేదు. మోకాలు గీసుకుంది అంతే. బండికి అద్దం విరిగింది ముందు రెండు చోట్ల బాగా గీతలు పడింది.''

''బండన్నాక అవన్నీ మామూలే. నువ్వు జాగ్రత్త. మోకాలు కడికి కాస్త సిల్వర్ ఎక్స్ పెట్టు'' అమ్మ చెప్పే వరకు ఏమీ తోచలేదు. ఆయింట్‌మెంట్ కూడా పెట్టలేదు. మనస్సు బాధ ముందు మోకాలు పైన గీసుకున్న మంట పెద్దగా తెలియలేదు. స్పర్శ లేదు.

ఉదయం లేవగానే బండిని తుడవటం దినచర్య మొదలవుతుంది. హైస్కూల్ డేస్ నుంచే బండిపైన సెల్ఫ్ డ్రైవింగ్ ఒక డ్రీమ్. మధ్య తరగతి కుటుంబంలో అది అనవసరమైన ఖర్చు కింది కొట్టేసారు అమ్మానాన్న. నాన్న అయితే కొనను అనడు, కొనివ్వడు. చివరికి పెళ్ళయి, ఉద్యోగం చేసి నా జీతంతో కొనుక్కున్నా. అలా మాదే బావుంది.

''టీ ఏమయినా ఉందా?'' ముఖం తుడుచుకుంటూ హరి.

నాకన్నా బండిపైనే ప్రేమ అంటుంటాడు ఎగతాళిగా హరి. ''ఆ..వస్తున్నా'' వంటింట్లోకి వెళ్ళిపోయాను. హడావిడి - ఇక రోజంతా.. గజిబిజి ఎవరో తరిమినట్లు. లేవగానే బండి తుడిచే పదినిమిషాలే హాయిగా నెమ్మదిగా ఉంటుంది రోజులో. బహుశా ఇష్టమైన పని కావచ్చు. హరికి నిన్న జరిగి విషయం చెప్పలేదు. క్లాసులు భరించలేము. ముందే మూడ్ బావోలేదు.

ఇంకా నెమ్మదిగా డ్రైవ్ చేసానేమో, మనసు బాగోలేక ఇంట్లో కూడా పనులు త్వరగా ముగియలేదు, ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళి మేనేజర్ దగ్గర రెండు అనిపించుకున్నాను. టీ బ్రేక్‌లో ఫ్రెండ్స్‌తో మాట్లాడాక, కాస్త మనస్సు నెమ్మదయ్యింది. వాళ్ళంతా పదినిమిషాలు నవ్వుతూ కబుర్లు చెపితే హాయిగా ఉందనిపించింది.

యాంత్రికంగా పనులన్నీ ముగించుకుని పడుకున్నాక రాత్రంతా కలత నిద్రే బండి ఎవరో ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తున్నట్లు యాక్సిడెంట్ - బాగా డామేజ్ - ఏడుస్తూ నేను. గబగబా నిద్ర లేచి ఇంటి తలుపులు తీసి షెల్టర్‌లోని బండిని ఒకసారి చూసుకుని 'హమ్మయ్య' అనుకున్నా. కలే.. కానీ చెడ్డకల. టైం ఒకటిన్నర. అయ్యో భయం లేకుండా ఇంటి బయటకు వచ్చానే. నాకు అర్థం అయ్యిందేంటంటే భయం బయటకు వచ్చి రాలేదు. ''టైం'' చూసాక వచ్చింది. ఇంటి తలుపులు వేసి సోఫాలో కూర్చుని టీవి ఆన్ చేసాను. ఉదయం ప్రోగ్రామ్స్ రిపీట్ అవుతున్నాయి. ఏదో వాస్తుగోల. కాసేపు విన్నాను. ఈ ఇంటికి వచ్చినప్పటి నుంచీ ఏదో ఒక అనారోగ్యం. నిన్న బండికి లా. ఇది కూడా వాస్తేనా? ఈ ఇంటికి రాగానే కళ్ళకు అద్దాలు వచ్చాయి. కొద్దిగా సైట్ ఉందని. అమ్మ గోల చేస్తే పది రోజులు క్యారెట్ తిన్నాను. మళ్ళీ టైం లేదు. సోఫాలోనే ఉదయానికి మెలుకువ వచ్చింది.

''నీలా.. కొబ్బరి నూనె తీసుకునిరా'' వంట చేస్తూ అరిచాను.

"ఏమ్మా, కొత్త వంటా, కేరళా వంటా? కొబ్బరి నూనెతో చేస్తావా?" అంటూ వచ్చింది నీల.

"నీ మొఖం, అసలు వంటకే టైం లేకుంటే, కేరళా వంట ఒకటి. అరికాళ్ళు, అరిచేతులూ మంటలే రెండు మూడు రోజులుగా"

"నీళ్ళు తాగడం లేదా?"

"తాగుతా తినేటప్పుడు, మళ్ళీ గుర్తుకురావు"

"వేడయ్యిందేమో, మజ్జిగ తాగి చూడు ఈ రోజంతా"

ట్రాఫిక్ జామయ్యిది. యాక్సిడెంట్. పోలీసులు వచ్చి రోడ్ క్లియర్ చేస్తున్నారు. దట్టమైన పొగ. పొగ మధ్య బండి పైన ముక్కుకు చున్నీ మూసుకుని కూర్చున్నా. చున్నీ మూసుకుంటే మాత్రం గాలి పీల్చుకోవాలికదా. ఒక్కరూ బండి ఆఫ్ చెయ్యరు. ఆటోలో స్కూల్ పిల్లలు నోటికి చెయ్యి అడ్డం పెట్టి దగ్గుతున్నారు. "పాపం పదహారు కూడా ఉండదు వయస్సు. బండిని ఎత్తి పెట్టే శక్తి కూడా లేదు. ఇంట్లో వాళ్ళకు బుద్ధి ఉంటే కదా, పాపం ఎంత జీవితం – పోయాడు" పక్కన బండిపైన వచ్చి కూర్చుంటూ ఒక పెద్దాయన ముందు కూర్చున్న అతనితో చెబుతున్నాడు.

"అయ్యో!" అని ముందుకు చూసాను.

108 కదిలిపోయింది మౌనంగా, ఇక అత్యవసరంగా వెళ్ళే పనిలేనట్లు. మనస్సు బాధగా మూలిగింది. గ్రీన్ లైట్ వెలిగింది.

బహుశా నాన్న అందుకేనేమో ఎన్ని సార్లు గొడవపెట్టినా బండి కొనివ్వలేదు. బండి నడిపే వయస్సు కాదని, ఎంత ఆలోచించారు. పిల్లలు అడిగిందల్లా కొనిచ్చేస్తారు ఇప్పటి జనరేషన్ తల్లితండ్రులు.

కొలీగ్ సుజనతో పావుగంటగా వేడి చర్చ, లంచ్ బ్రేక్‌లో.

"నిజమే పదహారేళ్ళ కుర్రాడికి బండి ఇచ్చేముందు ఆలోచించి ఉంటే ఈ రోజు ఒక ప్రాణం మిగిలేది. వాళ్ళు అడిగిందల్లా కొనిచ్చేస్తే తల్లి తండ్రులు చాలాగొప్పగా పిల్లల్ని పెంచినట్లు ఫీలింగ్" అన్నాను సుజనతో.

"పాపం పసి పిల్లలు, వాళ్ళకు జీవితం ఏమి తెలుస్తుంది. పిల్లలకు ఇచ్చే వస్తువా, ఇవ్వకూడని వస్తువా ఒక్క నిమిషం ఆలోచించరా, దాని వలన వాళ్ళకు మేలు కలుగుతుందా, హానికలుగుతుందా అని ఆలోచించరా"

"ఆలోచిస్తే, మంచి తల్లితండ్రులు ఎలా అవుతారు" అన్నాను వెటకారంగా.

"లేదు సుజీ, రాత్రి కూడా ఇంట్లో గొడవే నాకు, శ్రీకు. బాబుకు బేకరీ ఫుడ్ తేవద్దంటాను. రోజూ కేకులు, ఐస్‌క్రీమ్స్, చిప్స్ ఆయిల్ ఫుడ్స్ తెచ్చిస్తాడు. రాత్రి భోజనం తొమ్మిదిన్నరకు, భోంచెయగానే వాటిని ఫ్రెష్‌గా తిని పడుకుంటాడు. ఎలా జీర్ణం అవుతుంది? వయస్సుకు మించి బరువు పెరుగుతున్నాడు. వాడి వయస్సుకు వాడి పొట్ట చూస్తే దిగులు నాకు. పిల్లలు ఇష్టంగా తినేవి తెచ్చివ్వాలి లేదా పళ్ళు అంటాను నేను. వాడికేమయినా రోగమా పళ్ళు తెచ్చి ఇచ్చేందుకు. ఈ వయస్సులోనే తింటారు. తిననీ సంతోషంగా. తల్లి దిష్టి పెట్టొద్దు అంటాడు శ్రీ"

"నిజమే, మనం చెబితే అలానే అంటారు. వాళ్ళకు తోచింది వాళ్ళు చేస్తారు. ఇగో ప్రోబ్లం. నువ్వు చెప్పేదాంట్లో సత్యం ఏముందో ఆలోచించరు. నువ్వు చెప్పేది ఏమి వినాలి, అనే ఇగో అంతే. ప్రతి ఇంట్లోనూ ఒకే ఎల్.జి స్టవ్వే."

"వాడికి నచ్చింది పెట్టాలంటాడు, నిజమే దానికి పద్ధతి లేదా? అడిగితే మా నాన్న ఇలానే సాకాడు. నేనూ అంతే అంటాడు తిక్కగా"

ఉదయం నిద్రలేచి వేడి కాఫీ తాగి బండి తుడిచి మొక్కల దగ్గర కూర్చున్నా. కళ్ళు తిరిగినట్లు తెలుసు. లేచినప్పటి నుంచే కాళ్ళు మంటలు. మెలుకవ వచ్చి చూస్తే ఆటోలో వెళుతున్న హరి నన్ను పడిపోకుండా పట్టుకున్నాడు.

క్రింద సెల్‌లో అమ్మమ్మతో గాబరాగా మాట్లాడుతూ ఉంది నీల. ఫోన్ కట్ చెయ్యి గాబరా పెట్టకు నాకేమీ కాలేదని అరుస్తున్నా కానీ మాట పైకి రాలేదు. నీరసం. చాలా నీరసంగా ఉంది.

పెద్ద కార్పోరేట్ హాస్పిటల్ హడావిడి టెస్టులు... రిజల్ట్స్.

"నథింగ్ టు వర్రీ షుగర్ అటాక్ అయ్యింది అంతే" అన్నాడు డాక్టర్ సినిమా పక్కీలో అవాక్కయిపోయిన మావారితో "ఇప్పుడు ఇది చాలా జనరల్ ట్రీట్‌మెంట్ రెగ్యులర్‌గా ఉంటే చాలు భయపడేదేమీ లేదు" అన్నాడు నవ్వుతూ డాక్టర్.

"అరె, ఆమె అసలు స్వీట్స్ తినదండి ఎలా వచ్చింది?" అంటున్న మా వారికి చిరునవ్వు సమాధానం ఇచ్చి నర్స్ వైపు తిరిగి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి వెళ్ళిపోయాడు. కాసేపటికి అమ్మా, నాన్నా వచ్చారు.

అమ్మయితే ఏడుపే "ఇదేమి రోగమే. మన ఇంటావంటా లేదు" అంటూ.

నీరసం రెండు రోజులకు తగ్గింది. ఫ్రెండ్స్ వచ్చి పలకరించివెళ్ళారు. సుజన ఫోన్ కూడా చేయలేదు. బిజీగా ఉందేమో. మూడోరోజు హరిని, అమ్మను బలవంతంగా ఒప్పించి ఆఫీసుకు వెళ్ళాను. దిన చర్య షరా మాములే. రెండు రోజులు తాకని బండి నెమ్మదిగా తుడుచుకుని బయలుదేరాను. ట్రాఫిక్.. పొగ.. డ్రైవింగ్ కాస్త ఇబ్బందిగా ఉంది. వయసయిపోతుంది అని నవ్వుకున్నాను. కంటికి అద్దాలు, వంటికి షుగర్ వస్తే వయస్సు పెరిగినట్లా! అవేమయినా కొలతలా.. నో అని నవ్వుకున్నా నా ఆలోచనకు.

లంచ్ బ్రేక్‌లో సుజన కలిసింది. నాకంటే నీరసంగా ఉంది. పలకరించేలోపే నన్ను పట్టుకుని ఏడ్చేసింది.

"అరే ఏమయ్యింది చెప్పు. ఏడవకు కంట్రోల్ చేసుకో అందరూ మననే చూస్తున్నారు" అని కాస్త సముదాయించాక పదినిమిషాలు పట్టింది తను తేరుకోడానికి. ముఖం కడుక్కుని వచ్చి కూర్చుంది. రెండురోజులకు పదిరోజులు లంఖణం చేసినట్లు ముఖం పీక్కునిపోయింది. మంచినీళ్ళు ఇచ్చాను చేతికి.

నెమ్మదిగా తాగుతూ చెప్పింది "నేనూ రెండురోజులుగా లీవు. ఈ రోజే వచ్చాను. ఏడుస్తూ ఉంటే ఇంట్లో తిట్టి పంపారు. ఆఫీస్‌కి వెళితే కాస్త మూడ్ మారుతుందని" అంది.

నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను. వాక్యం బయటకు రాకముందే కళ్ళు నిండిపోతున్నాయి కన్నీళ్ళతో.

"బాబుకు షుగర్ అని చెప్పాడు డాక్టర్" అంది.

నాకు కాసేపు అర్థం కాలేదు.

"వాడి వయస్సెంత? కరెక్టుగా తెలుసుకున్నారా! "

"ఫ్యామిలీ డాక్టర్ కాదని, శ్రీకర్ అపోల్లోకి తీసుకెళ్ళాడు. అక్కడా అదే కన్‌ఫర్మ్ అయ్యింది."

దాని కష్టం ముందు నా విషయం ఏమని చెప్పేది.

రోజు రోజుకు సుజన చాలా డిప్రెషన్ అయిపోయింది. మా ఇంట్లో వాతావరణం కాస్త మామూలైంది. నా ఫుడ్ సపరేట్ అంటే రైస్ లేదు. రాగిరొట్టెలు, చపాతీలు, సంకటి, చక్కెర లేని కాఫీ భోజనాల బల్ల దగ్గర నన్ను వెలేసినట్లు ఉంది. మరిచిపోయినా గుర్తు చేసుకుని వేసుకునే డయాబెటీస్ టాబ్లెట్స్. ఇబ్బందిగా ఉంది.

ఒకరోజు శ్రీకర్ ఫోన్ చేసాడు. ఇల్లు నరకప్రాయంగా ఉంది. ఇంట్లో ఉన్నంతసేపు ఏడవటం, లేదా గొడవ పెట్టుకోవడం చేస్తుందట సుజన. ఏడవలేక చెప్పాడు.

అప్పుడు చెప్పాను నా విషయం. మా ఇంట్లోనూ రెండు రోజులు గాబరాగా గొడవ గొడవగానే ఉంది. చిన్నగా అలవాటు పడతారని ఓదార్చాను.

శ్రీకర్ బాధను చూడలేక సుజన ఫ్యామిలీ, మా ఫ్యామిలీ కలిసి డాక్టర్ సుధాకర్ గారి దగ్గరకి కౌన్సిలింగ్‌కి వెళ్ళాము.

విడివిడిగా కాసేపు మాట్లాడి చివరికి అందరినీ కూర్చోపెట్టి మాట్లాడాడు. నా వైపు తిరిగి, ''సుజాతగారు, మీరెప్పుడైన్నా బండిని పెట్రోల్ బంక్‌లో కాకుండా బయట పెట్రోల్ పోయించారా''

''ఎంతత్యవసరమైన స్థితిలో కూడా అలా చేయలేదు.

''బండి పాడైపోదూ'' అన్నాను. ఠకీమని.

''బండినే అంత జాగ్రత్తగా చూసుకున్నప్పుడు మీ బాడీని మీరెందుకు చూసుకోరు'' అన్నారు.

''అలా ఏమీలేదు డాక్టర్. టైముకు భోంచేస్తున్నాము'' అన్నాను.

''అదే 'ఏమి' భోం చేస్తున్నారు?'' అన్నారు.

''ఉదయం ఇడ్లీ దోస టిఫిన్స్, మధ్యాహ్నం టిఫిన్ బాక్స్‌కు ఒక రైస్ అయిటమ్, టైముండి వండితే పప్పు అన్నం పెరుగు లేకుంటే ఉదయం టిఫినే తీసుకెళతాం. రాత్రి బాగా వేడిగా అన్నం, కూరలు, పెరుగు తింటాము. అందరూ కలిసి తింటాం''

''కూరగాయలు ఒకరోజుకు ఎంత వాడతారు?''

''రెండు మూడు కూరలు కేజీ లెక్కన తెచ్చుకుని రోజుకోరకం వాడతాం''

''మీరు భోజనం చేసే టైమింగ్స్?'' అన్నారు.

''ఉదయం 9గంటలకు. మధ్యాహ్నం 2.00గంటలకు, రాత్రి 10-11 మధ్య'' అన్నాను.

''అంటే రాత్రి తినగానే ఏమి చేస్తారు?''

''పడుకుంటాము డాక్టర్ .ఉదయానికి మళ్ళీ పరిగెత్తాలి కదా'' అన్నాను ఆశ్చర్యంగా.

''అదే మనం చేస్తున్న తప్పులు. తప్పులన్నీ మనదగ్గర ఉంచుకుని లేని జబ్బులు వచ్చాయంటే ఎట్లా? ఊరికే వచ్చేసినట్లు. రాత్రి 7-8 మధ్యలో భోంచెయ్యాలి కనీసం భోజనానికి, నిద్రకూ మధ్య మూడుగంటలు గ్యాప్ ఉండాలి''

''అదెలా కుదురుతుంది. ఆరుకు ఇంటికి వచ్చి ఎనిమిది వరకు రిలాక్స్ అయ్యి వండటం అప్పుడు మొదలుపెడతాను. బయట పనులన్నీ ముగించుకుని 9.30 పదికి వస్తాడు హరి. అప్పుడు వేడిగా భోంచేస్తాం. తింటే నిద్ర వస్తుందని పాపకూడా అప్పటిదాకా చదువుకుని మాతోనే తింటుంది'' అన్నాను.

''మీ ప్రోగ్రామ్స్ వచ్చే జబ్బులకు తెలీవుకదా, మీరింతే, అది అంతే. ''

''ఓ.కె ఆరునుంచి ఎనిమిది వరకు ఎలా రిలాక్స్ అవుతారు.''

''పాప చదువుకుంటూ ఉంటుంది. హరి బయటకు వెళుతూ ఉంటారు. నేనొక్కదాన్ని ఏమి చేస్తాను. టీ.వీ చూస్తాను, ఫోన్‌లో మాట్లాడతాను'' అన్నాను.

''చూసారా, మీరు చెప్పేదాన్ని రిలాక్స్ అని ఎలా అంటారు. శారీరకంగానూ కాదు, మానసికంగాను కాదు. ఉదయం నుంచి ఒత్తిడికి గురయ్యి మళ్ళీ టీ.వి ముందు సీరియస్‌గా చూస్తూ మనస్సుకు ఇంకా ఘర్షణ. ఉదయం నుంచీ ఆఫీసులో కూర్చుని తిరిగి కదలకుండా సోఫాలో కూర్చుని శరీరానికి రిలాక్స్ లేదు. రిలాక్స్ అంటే శరీరాన్ని, మనస్సును రీచార్జ్ చెయ్యడం. శరీరాన్ని కదిలించాలి. వాకింగ్, వ్యాయామాలు, యోగా చేయాలి. మంచి సంగీతం వినడం, మంచి పుస్తకాలు చదవటం చెయ్యాలి. తినే ఆహారంలో మార్పురావాలి. యాంత్రికంగా లేచామా, వెళ్ళామా, తిన్నామా, పడుకున్నామా అంటే, ఖచ్చితంగా జబ్బులన్నీ మన ఇంట్లోనే ఉంటాయి.

అంతేకాదు మనం చేసే ఇంకో పెద్ద తప్పు. మన అలవాట్లు పిల్లలకు నేర్పిస్తున్నాము. మంచి బట్టలు కొనిచ్చి, బయట చిరుతిళ్ళు, జంక్ ఫుడ్స్, బేకరీ వస్తువులు రోజూ తెచ్చివ్వడం, మంచి స్కూల్‌కు పంపడం. ఇంతేనా పిల్లల్ని పెంచడం అంటే. వాళ్ళు ఏం తింటున్నారు? వాళ్ళ జీర్ణశక్తి ఎలా ఉంది? రోజూ టాయిలెట్‌కు వెళుతున్నారా? కడుపు శుభ్రంగా ఉందా చెడిపోయిందా? కూరగాయలు తింటున్నారా? పళ్ళు తింటున్నారా? తినకపోతే ఏం చేస్తున్నారు? కూరగాయలను సూప్స్‌గా, పళ్ళను సలాడ్స్‌గా మార్చి తినిపిస్తున్నారా? తినడు అని వదిలేస్తున్నారా?

నానమ్మలు, అమ్మమ్మలు పంచామృతం పెట్టేవాళ్ళు గుర్తుందా? పిల్లలకు రోజూ సాయంత్రం స్నాక్స్ బదులు పెట్టొచ్చుకదా. బజ్జీలు, మ్యాగీలు, చిప్స్, మసాలా పూరి వీటితో వాడికి బలం వస్తుందా, కడుపు చెడిపోవటం తప్ప. బెల్లం లడ్లు గుర్తున్నాయా. ఎదిగే పిల్లలకు, మెనోఫాజ్‌కు దగ్గర పడ్డ స్త్రీలకు ఎంత మంచి ఐరన్ పెంచుతుందో తెలుసా? ఉడికించిన శెనగలు, ఉలవలు సాయంత్రం టిఫిన్స్‌గా ఎందుకు మార్చరు. వేయించిన నూనెలోనే వేయించి అల్యూమినియం పేపర్‌లో ప్యాక్ చేస్తే మంచిదవుతుందా. ప్రతిరోజూ వాటిని తింటే ఒక రోజుకు ఆగిపోతుంది జీర్ణ వ్యవస్థ తరువాత టెస్ట్‌లు, డాక్టర్స్, టాబ్లెట్స్ ఇంతే జీవితం.

ఏమి తింటున్నాము అనే స్పృహ వస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటాము. మన జీవితాల్లో అదృశ్యమైపోయిన ముడి బియ్యం మరపట్టిన గోధుమలు, రాగులు, సజ్జలు, జొన్నలు, శెనగల్, ముడి పెసలు, ఉలవలు, మెంతులు, ఇంగువ, అటుకులు, మొక్క జొన్నలు తిరిగి రావాలి. మన ఆరోగ్యం మన సంతోషం తిరిగి వస్తుంది" అన్నారు, డాక్టరు నవ్వుతూ మాకిచ్చిన టైం గంట పూర్తయినట్లు గడియారం వైపు చూస్తూ.

ఉదయమైంది హాలులో ఫోన్ రింగవుతుంది. నీల ఫోన్ తీసి "అమ్మమ్మా చెప్పవే" అంది.

"అమ్మ లేచిందా?"

"అమ్మ ఐదుగంటలకు యోగా సెంటర్‌కు వెళ్ళింది"

"ఏమయినా తాగిందా?"

రెండు లీటర్ల మంచినీళ్ళు" అంది నీల నవ్వుతూ.

"నాన్న పేపర్ చదువుతున్నారా!"

"లేదు అమ్మమ్మ, శ్రీకర్ అంకుల్‌తో కలిసి జాగింగ్‌కి వెళ్ళారు."

"నువ్వు చదువుకుంటున్నావా"

"వాకింగ్‌కి వెళ్ళి ఇప్పుడే వచ్చాను. స్నానం చేసి రెడీ అయ్యి నెమ్మదిగా చదువుకుంటాను టైం అయిపోయిందనే టెన్షన్ ఉండదు" అంది.

వీళ్ళ సంభాషణ వింటూ ముందు రూములో షూ విప్పి నవ్వుకుంటూ లోపలికి వచ్చాను.

"అమ్మా బావున్నావా?" అన్నా.

"ఉన్నానే. నువ్వెట్లా ఉన్నావు" అంది. "నాకేం బావున్నాను."

"టిఫిన్ ఏమి చేస్తున్నావ్, దోసెలు, ఆలు నీకు ఇష్టం కదా నాన్నతో పంపేదా?"

"వద్దమ్మా టిఫిన్ రెడీగా ఉంది."

"యోగాకి వెళ్ళానన్నావ్ అప్పుడే వండేసావా?"

"ఆ.. మొలకలు, పెసలు, సజ్జలు, బొప్పాయి, జామకాయలు రెడీగా ఉన్నాయి" అన్నాను నవ్వుతూ.

గ్రీన్ టీ తాగి బండి తుడిచాను. అరగంటలో పుల్కాలు, కూరగాయల కర్రీ రెడీ చేసి అరగంట ముందే ఆఫీసుకు బయలుదేరాను. పెట్రోల్ బంక్ కాస్త రద్దీగా ఉంది. నెమ్మదిగా వెయిట్ చేసాను. ఆఫీసుకు టైం అయిపోలేదు మరి. టైం నా చేతుల్లో ఉంది. నేను కూడా నా చేతుల్లో ఉన్నా.




# సీత రాసిన కథ

- బాలి



**కాలేజీలో డిగ్రీ ఫైనలియర్** చదువుతోన్న సీతకి నాలుగురోజుల్నుండీ గుండె పిండి అయిపోతోంది. ''ఏదో రాయాలి. ఏదో చెయ్యాలి.'' ఏదో రాయాలీ అంటే, ఏం రాయాలి. దేని గురించి రాయాలి. ఏదో చెయ్యడం అంటే రాయడమే చెయ్యడం. టైం చూస్తే ఎంతోలేదు. తల్లి సుమిత్ర కూతుర్ని గమనిస్తూనే ఉంది. హాల్లో గోడకి చేరబడి చిక్కుడు కాయలు వలుస్తున్న సుమిత్ర చిన్నగా నవ్వి కూతురు వేపు చూసి ''రెండు రోజుల్నుండీ గమనిస్తున్నాను.. ఏమిటే ఇదయిపోతున్నావూ?'' అంది.

సీత నవ్వుకుంది. చేతిలోకి తీసుకున్న కాగితాలను బల్లమీదే పడేసి, ఈ రెండు రోజుల్నుండీ తాను ఇదయిపోవడం తల్లి గమనిస్తుందన్నమాట. సుమిత్ర దగ్గర కెళ్ళి ముఖం మీద ముఖం పెట్టి ''ఏదన్నా కథ రాయాలమ్మా! మా కాలేజ్ మాగజైన్‌కి. ఇక రెండు రోజులే ఉన్నాయి'' – అంది.

''ఇంకేం! మరి రాయి'' అంది సుమిత్ర గడుసుగా –

''ఏ కథ రాయాలో తట్టడం లేదని చెప్తున్నానా! ప్రింట్‌లో మూడు పేజీలు మించకూడదట.''

చిక్కుడు కాయలు వలుస్తున్న సుమిత్ర కూడా ఆలోచనలో పడింది. ఓ ఐదు నిముషాలు గడిచాయో లేదో తన అనుభవాల పొరల్లో మెరిసిన ఓ ఆలోచన దగ్గర ఆగిపోయింది.

''సీతా, ఈ విషయాన్నే కథగా రాయకూడదటే!'' అంది.

తన గదిలోకి వెళ్ళబోతున్న సీత ఆగిపోయి వెనకకు వచ్చింది.

''ఈ మన సీతమ్మ ధార కాలనీలో, మనకు రెండేళ్ళవతల జరిగిన సంఘటనను కథారూపంలో ఎందుకు రాయకూడదట! ఒక ఆడదాని చేతిలో మరొక ఆడది అన్యాయం, అయిపోయిందే –''

''నేను రాయగలనంటావా?''

''ప్రయత్నించు – ప్రేమకథల్లో ఏముంది? జీవితకోణాల్లోంచి, అనుభవాల్లోంచి వచ్చిందే ఉత్తమ కథ''

సీత తన గదిలోకి పరుగెత్తి టేబుల్ ముందు కలం కాయితాలు వేసుకుని కూచుంది.

లలితాబాయి సన్నగా, ఛామన ఛాయగా ఉంటుంది. ఆమె భర్త ఏం చేసేవాడో తెలియదు. ఒక్కడే కొడుకు. అతడూ తల్లిలాగే అదే ఛాయలో ఉంటాడు – చాలా సరదా అయిన కుర్రవాడు. తన శక్తి మేర అతడ్ని బాగానే చదివించినట్టుంది. కాల్‌టెక్స్ ఆయిల్ కంపెనీలో అతడికి ఉద్యోగం. ఉదయం పూట సెంటర్‌కి వచ్చే, ఆ కంపెనీ బస్‌లో అతను వెళ్ళడం అందరూ చూసే దృశ్యమే. ఆ వీధిలో గల రెండు మూడు కుటుంబాలకు లలితాబాయి బాగా పరిచయస్తురాలే అని తెలుస్తోంది. ఆమె వారింటికి ఎక్కువ రాకపోకలు చేస్తుంది. వారితోనే కాదు, ఎవరు పలకరించినా చక్కగా మాటాడ్డం చేదోడు, వాదోడుగా ఉండటం ఆమె నైజం –

చక్కగా ప్రశాంతంగా, హేమంత ఋతువులా సాగిపోతున్న ఆ ఇంట్లో వేడిగాలులు వీచడం మొదలెట్టాయి. కొడుకు శ్రీహరి పెళ్ళిచేసిన తరువాత.

మురళీనగర్‌లో ఉండే వియ్యపురాలు, ఆవిడ కొంపలో కన్నా అల్లుడింట్లోనే మకాం పెట్టడం ఎక్కువయ్యింది. లలితాబాయి అమాయకత్వమూ, మంచితనమూ వియ్యపురాలి దృష్టిలో చేతగాని తనంగా మారడం మొదలెట్టాయి.

''అబ్బే అలాక్కాదు – ఇలా చెయ్యాలి. మీకేం చేతగాదు. మీ అబ్బాయిని ఎలా పెంచారోగానీ''తో మొదలయ్యి ''నువ్వే ఇల్లంతా చక్కదిద్దుకోవే! – మీ అత్తగారో వెర్రిముండ'' వరకూ వెళ్ళింది.

సంవత్సరం గడిచే సరికి లలితాబాయి తనింట్లో తాను మసలడానికే భయపడే అవస్థ వచ్చింది. ఓ ముద్ద ఎక్కువ తిన్నా తప్పయిపోయింది. ''గొడవలెందుకులేవే అమ్మా! అది చెప్పినట్టు చెయ్యవే'' అనే శ్రీహరి మాటలు ముదిరిపోయి ''నువ్వు నా ప్రాణానికి సంకటంలా మారేవు'' అన్నంత వరకూ వెళ్ళాయి -

కోడలు రత్నం ఇల్లంతా తానే చక్కబెట్టుకుంటూ, శ్రీహరి ఇంటికొచ్చేసరికి లలితాబాయి మీద ఏ నింద మోపాలో చక్కగా గుర్తుపెట్టుకుంటుంది. వంటింట్లో ఏదన్నా సాయం చేయబోతే చేయనక్కర్లేదనడం - పోనీ ఆ అమ్మాయే అన్నీ చేసుకుంటోందే అంటే లలితాబాయి తీరిగ్గా కూచుంటుందనీ అందరూ వినేట్లు అరవడం.

మానసికంగా కుంగిపోతున్న లలితాబాయికి ఆ ఇంట్లో మనవడిగా ఓ నలుసు పుట్టేసరికి, కోడలు రత్నం స్థానం స్థిరమయిపోగా, తన స్థానం ఇంకా దిగజారిపోయింది. ఆ మనవడ్ని ముట్టుకోనివ్వదు. ముద్దాడనివ్వదు. కాలుజారి కింద పడి వాడు ఘొల్లుమన్నా వాడివేపు చూడనివ్వదు.

లలితాబాయి తన పరిస్థితిని తనకు ఆప్తులయిన ఆ వీధిలోని వారితో చెప్పుకొనేసరికి అది మరింత రణరంగంగా మారిపోయింది. ఇంటిపరువు రచ్చ కెక్కిస్తున్నదన్న గొడవ బయలుదేరింది - శ్రీహరి పూర్తిగా చేతగానివాడయాడు.

దుఃఖంలో లలితాబాయి కళ్ళు ప్రతి క్షణం తడిసిపోతున్నాయి.

ఒక మధ్యాహ్నం ఓ ముద్ద తిని తనగదిలో పడుకున్న లలితాబాయి కొడుకు గదిలోంచి మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి,

''తిని పడుకోవడమేగా.. మీ అమ్మగారి పరిస్థితి'' రత్నం గొంతు.

''అదేమిటి? మా అమ్మకు వంట్లో బాగోలేదుగా?'' శ్రీహరి ఎదురు ప్రశ్న

''అదంతా దొంగ రోగం - కొంపలో ఏ పనీ చెయ్యదు - ఓ పాటూ చెయ్యదు - ఈ చంటి వెధవ మురికిగుడ్డలన్నా ఉతకదు - మీరిలా, అమ్మ కూచిలా అమ్మ పక్షాన మాటాడితే గృహహింస నేరాన్ని మోపి జైలుకి పంపుతాను'' రత్నం హూంకరింపు.

లలితాబాయి దుఃఖంతో పక్కకు తిరిగి పడుకుని కళ్ళుమూసుకుంది. అప్పటికి కళ్ళుమూసుకోవడమే కాదు. శాశ్వతంగా ఆ కళ్ళు అలాగే మూతలు పడాలని నిర్ణయించుకుంది.

ఆ మరుసటి రోజు మామూలుగానే తెల్లవారింది.

కానీ లలితాబాయి బతుకు పూర్తిగా తెల్లారిపోయింది. ఈ సీతమ్మ ధారలో 'ఈనాడు' పత్రికాఫీస్‌కు ఎడమ వేపు కూతవేటు దూరంలో ఉన్న మర్రిచెట్టుకింద (ప్రస్తుతమక్కడ చాలా అపార్ట్‌మెంట్‌లు లేచాయి) బయటకు శబ్దం రాకుండా నోటిలో గుడ్డముక్కలు కుక్కుకుని, దానిపై చీర చెంగుముడి వేసి కాళ్ళకు చేతులకు అదే చీర చెంగును బిగించి వంటి నిండా కిరసనాయిలిన్ని చిమ్ముకుని, అగ్గిపుల్ల గీసి తనను తాను కాల్చుకుంది. మంటలకు తాళలేక ఒక దశలో అటూ ఇటూ పొర్లింది - అంటే ఆమె బతుకు అలా తెల్లారిపోయిందన్నమాట.

సుమిత్ర పేజీలు వరుసగా పెడుతూ ''కథ బాగానే రాసావే! - జరిగిన విషయాన్ని సింపుల్‌గా చెప్పావ్. టైటిల్ కూడా బాగుంది ''ఆమె బతుకు..'' వరుసపెట్టిన పేజీలు బల్లమీద ఉంచింది.

సీత ఆ కథను కాలేజీ మాగజైన్ వారికి ఇవ్వడం, అది ప్రచురణ కావడం జరిగిపోయాయి.

మరో మూడేళ్ళకు సీత పెళ్ళికూడా జరిగిపోయింది. ఆమె ఆడబిడ్డ మృదుల కాకినాడ నుండి వచ్చింది. హాల్లో అందరూ సరదాగా కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ''సీతా! నువ్వు కథలు కూడా రాస్తావటగా - మీ అమ్మగారు నిన్న మాటల్లో చెప్పారు'' అంది.

సీత ఫకాలున నవ్వుతూ "ఏదో రాస్తాను" అంది. సుమిత్ర ఆ మాటలు విని "ఏదో ఏమిటి. బాగానే రాస్తుంది" అంటూ కింద సొరుగులో దాచిన కాలేజీ మాగజైన్‌ని తీసి ఇచ్చింది.

మరో అరగంటలో ఆ పుస్తకాన్ని తిరగేసి ఆ కథను చదివిన మృదుల మేగజైన్‌ను తిరిగి సీతకు ఇచ్చేస్తూ అంది - "ఈ కథకు - టైటిల్ బాగుంది. సంవత్సరాలు - స్థలాలు సైతం రాశావు - నీకు వీళ్ళు తెలుసా" అంది.

సీత తల ఊపింది. "ఈ ఊళ్ళో, సీతమ్మ ధారలో టి.పి.టి కాలనీ మేమున్న మూడో ఇంటిలో జరిగిన విషయమే ఈ కథ - నిజంగా జరిగినదే -"

"వీళ్ళు నీకు తెలుసా?" రెట్టించింది.

"పెద్దగా పరిచయం లేదు - వారిని వీధిలో చూసేదాన్ని" సీత కళ్ళు ఎగరేసింది ఆశ్చర్యంగా.

"నాకు తెలుసు"

"తెలుసా?" సీతకు ఇంకా ఆశ్చర్యం

"అవును - రత్నం అమ్మగారి తరపు బంధుత్వం కూడా ఉంది. ప్రస్తుతం రత్నం పక్షవాతంతో బాధపడుతోంది. వాళ్ళమ్మగారు కాన్సర్‌తో చనిపోయింది. ఇప్పటికే రత్నం నోటంట "మా అత్తగారు లలితాబాయి ఉత్తమురాలు - నేరం తనదే అంటుంది, పడిపోయిన చేతినో, కాలునీ చూసుకుంటూ -"

సీతకు ఏం చెప్పాలో తోచక నేల చూపులు చూసింది.

కథా కౌముది

# ఎవరికి ఎవరు?

మన్నెం శారద

**కారు విజయవాడవైపు దూసుకెళ్తోంది.**

రాజశేఖర్ కారు నడుపుతున్నాడు, అతని భార్య సుస్మిత అతని పక్కనే కూర్చింది.

వెనుక సీట్లో అతని తల్లి శాంతమ్మ, అతని మూడేళ్ళ కొడుకు కార్తీక్ కూర్చున్నారు.

కారు నడుపుతూనే రాజశేఖర్ వ్యూ మిర్రర్‌లో నుండి తల్లిని గమనిస్తున్నాడు. ఆమె కొంగు కప్పుకుని నిశ్శబ్దంగా కారు అద్దాల్లోంచి బయటకి చూస్తోంది.

అతనికి గిల్టీగా ఉంది. దాన్ని కప్పిపుచ్చుకుంటూ అసహనంగా భార్యవేపు చూశాడు.

ఆమె 'ఏం మాట్లాడద్దు' అన్నట్లుగా నోటి మీద వేలు పెట్టుకుని అతనికి సైగ చేసింది.

ఇంతలో కార్తిక్ ఆ నిశ్శబ్దాన్ని ఛేధిస్తూ శాంతమ్మ ఒడిలో ఒరిగి "ఏ నానమ్మా టెల్ మీ ఏ స్టోరీ" అంటూ ఆమె గడ్డం పట్టుకుని ఆమె మొహాన్ని తనవైపు తిప్పుకున్నాడు.

కిటికీ నుండి శూన్యంలోకి చూస్తున్న శాంతమ్మ మనవడి వైపు చూసింది. ఆమె కళ్ళ నుండి అంతసేపు అదిమి పట్టిన దుఃఖం కన్నీటి రూపంలో వాడి మీద జలజలా రాలిపడింది. వాడు ఆశ్చర్యంగా ఆమె వైపు చూశాడు.

"వైయార్ యూ క్రయింగ్? యూ వాంట్ చాక్లెట్?" అంటూ వాడు ఆమె చేతిలో చాక్లెట్ పెట్టాడు. వెంటనే ఆమె తన దుఃఖాన్ని కనబడకుండా చేయడానికి ప్రయత్నిస్తూ వాడి తల నిమిరి ముద్దు పెట్టుకుంది.

కార్తీక్ మాటలు వాళ్ళిద్దరి చెవినపడ్డాయి. సుస్మిత, రాజశేఖర్ మొహాలు చూసుకున్నారు. వెంటనే రాజశేఖర్ కోపంగా "డోంట్ క్రియేట్ సీన్. ఏముందిందులో ఒంటరిగా ఆ లంకంత ఇంట్లో ఉండే బదులు నల్లూరిలోకి వెళ్తున్నావు. అక్కడ ఏం జరిగినా ఎవరికీ తెలియదు. ఇక్కడ నీలాంటి వాళ్ళు చాలామంది పని పనీ పాటా చెయ్యక్కర్లేదు. టైముకి టిఫిన్, కాఫీ - అన్నీ సిద్ధం. రెగ్యులర్‌గా డాక్టర్ వచ్చి చెక్ చేస్తాడు. నేను నెలనెలా డబ్బు పంపుతాను. నీకేం కావాలన్నా తెప్పించుకో. ఆ వార్డెన్ నేను ఎన్నారై అని తెలిసి ప్రత్యేక గౌరవం చూపిస్తోంది. నిన్ను బాగా చూసుకుంటుందిలే!" అన్నాడు.

"ఎంతయినా మామయ్యగారు కట్టిన ఇల్లు కదా! పైగా ఆవిడ పెంచిన చెట్లు బాధగానే ఉంటుంది" అంది సుస్మిత జాలి చూపిస్తూ.

"ఆ! చెట్లు... మనుషులకే దిక్కు లేదీ కాలంలో. నాన్నగారు పోయి పదేళ్ళు దాటింది. అక్కడేవన్నా గుడి కట్టుక్కూర్చున్నారా? మమ్మీ, నీకేం బాధలేదు. అక్కడ కూడా తోట ఉందిలే హాయిగా తిరుగు. నీకు పుస్తకాలంటే పిచ్చి కదా! హాయిగా కొనుక్కో. వారం వారం నేను ఫోన్ చేస్తానుగా" అన్నాడు శేఖర్ కొంత శాంతంగా.

"అదేం లేదురా! ఎంతయినా నాన్నగారు కట్టిన ఇల్లు, ఇద్దరం కలిసి ఆ ఇంటిని ఎన్ని దఫాలుగా ఎన్నిపాట్లుపడి కట్టామో! ఇప్పటిలా లోన్సు, బిల్డర్స్ లేరుగా ప్రతి ఇటుకలోనూ మా ప్రాణం ఉంది. అందులోనే నా ప్రాణం కూడా పోవాలనుకున్నాను. కానీ అది గట్టిగా ఉండగానే కూలుస్తున్నారంటే.." మరింక మాట్లాడలేక వెక్కెక్కి ఏడ్చింది శాంతమ్మ.

రాజశేఖర్ కోపంగా ఏదో అనాలనుకున్నాడు గాని సుస్మిత కళ్ళతో అతన్ని వారించింది.

కారు మెల్లిగా ముందుకి సాగిపోయింది.

చలికాలం, చీకటి నాలుగువైపులా ఆక్రమించుకుంటోంది. విజయవాడకి నాలుగయిదు కిలోమీటర్ల ఇవతలగానే కారు ఒక గేటు ముందాగింది. శాంతమ్మకి గుండె పట్టేసినట్లయింది. నిర్మానుష్యంగా ఏదో పోగొట్టుకున్నట్లుంది ఆ వాతావరణం.

శేఖర్ ముందు కారు దిగాడు.

సుస్మిత వెనుక డోర్ తీసి కొడుకునెత్తుకుంది. శేఖర్ తల్లి వైపు డోర్ తెరిచి తల్లికి చెయ్యందించాడు. కొడుకు చేతిని పట్టుకుని బేలగా చూస్తూ క్రిందకి దిగింది. ఆమె చెయ్యి వణకడం అతను గమనించినా తెలియనట్లు నటించాడు. కానీ మనసులో ఎక్కడో, ఎవరో నిలేస్తున్నట్లు అపరాధిలా తల తిప్పుకున్నాడు.

సుస్మిత ఆమె లగేజ్‌ని, కొడుకుని తీసుకుని వాళ్ళ వెంట నడిచింది.

చీకట్లో అంతగా ఏవీ కనిపించడంలేదు. చుట్టూ అర్ధ చంద్రాకారంలో కట్టిన స్తంభాల దీపాలు మిణుకు మిణుకు మంటూ మిణుగురు పురుగుల్లా మెరుస్తున్నాయి. ఒక కుర్రాడు గబగబా వచ్చి లగేజ్ అందుకుని వాళ్ళని వార్డెన్ రూములోకి తీసుకెళ్ళాడు. వాళ్ళంతా కుర్చీల్లో కూర్చున్న పదినిమిషాలకి వార్డెన్ నీలవేణి వచ్చింది.

"ఏంటింత లేటుగా తీసుకొచ్చారు? మీరు డ్రాపయ్యారేమో అనుకున్నా. రూములసలు ఖాళీలేదు. ఇద్దరు ముగ్గురు వెయిటింగులో ఉన్నారు" అంది తన మెడలో వ్రేలాడుతున్న లక్ష్మీ డాలరు సవరించుకుంటూ.

శాంతమ్మ ఆమె వైపు బలిపశువులా చూసింది.

"మీ అమ్మగారు దిగులు పడుతున్నట్లున్నారు. ఏం భయంలేదండి ఇక్కడ మీలాంటివాళ్ళు చాలామందున్నారు" అంది నీలవేణి నవ్వుతూ.

శేఖర్ ఏం వినిపించుకోనట్లుగా ఫారాలు నింపి "ఎడ్వాన్సు ఎంత?" అన్నాడు పర్సుతీస్తూ.

"ముందు పదివేలు కట్టండి, నెల నెలా ఏడువేలు, మందులు, పళ్ళు, ఏం కావాలన్నా ఎవరికి వాళ్ళే కొనుక్కోవాలి. ఇప్పుడంతా లక్షలకి లక్షలు వసూలు చేస్తున్నారు. మేం పూర్వాళ్ళని దృష్టిలో పెట్టుకుని నడుపుతున్నాం" అంది నీలవేణి నవ్వుతూ.

శేఖర్ పర్సులోంచి డబ్బునివ్వబోతుంటే శాంతమ్మ వారించి "నా దగ్గరున్నాయిరా, పెన్షన్ వస్తుంది కదా!" అంటూ తనే కట్టేసింది.

రాజశేఖర్ అహం దెబ్బ తిన్నట్లయింది.

"పదండి, రూం చూపిస్తాను" అంటూ ముందుకి దారి తీసింది నీలవేణి. అందరితో పాటు శాంతమ్మ కూడా నడిచింది విధిలేనట్లు బరువుగా.

"వాట్ నానమ్మా? నువ్వు స్కూల్లో జాయినవుతున్నావా?" అనడిగిన కార్తీక్ వైపు కన్నీళ్ళతో చూసింది.

సుస్మిత వాణ్ణి 'ష్' అంది మాట్లాడద్దన్నట్లుగా.

అందరూ గదిలో కెళ్ళారు. ఆ గదిలో రెండు స్టీలు మంచాలున్నాయి. వాళ్ళ సామాన్లు పెట్టుకోడానికి ఒక స్టీల్ అల్మరా ఉంది. ఒక్ ఏటాచ్డ్ టాయిలెట్టుంది. ఏదో సహించలేని వాసనొస్తోందా గది.

''మా అమ్మగారికి ప్రత్యేక గది ఇవ్వకూడదూ? ఎంతవుతుందో చెబితే నేను పే చేస్తాను'' అన్నాడు శేఖర్ ఆ పరిసరాల్ని అయిష్టంగా చూస్తూ.

''చెప్పానుగా. ఇది రిచ్ పీపుల్ ఉండే ఆశ్రమం కాదని. మీ వాళ్ళెవరో వచ్చి చూశారుగా'' అంది నీలవేణి కాస్త నిష్ఠూరంగా.

''ఇట్స్ ఓ.కె. ఆయన అన్నిటికి స్టేట్స్‌లో ఉన్నట్లుగానే మాట్లాడతారు. మా అత్తగారిక్కడ బాగానే ఎడ్జస్టవుతారు. ఒక్కరే ఉండేకన్నా ఇది మేలేగా'' అంది సుస్మిత.

సుస్మిత తండ్రే ఆ ఆశ్రమం చూసి చెప్పింది. ఆయన రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తుంటాడు. పెళ్ళినాటి నుండే శేఖర్ ఇంటి మీద ఆయన కన్ను కనపడింది. ఇప్పుడాయనే అక్కడ ఎపార్టుమెంట్స్ కట్టబోతున్నది. ఈ సంగతులేం శాంతమ్మకి తెలియదు పాపం.

''సరేనమ్మా మేం వస్తాం, ఈ సెల్ ఫోనుంచు. నేనప్పుడప్పుడూ కాల్ చేస్తుంటాను. ఛార్జింగ్ పెట్టుకుంటుండు. ఒక రెండురోజులు లోన్లీగా ఉంటుంది. తర్వాత అంతా ఓ.కె'' అంటూ కదలబోయాడు శేఖర్.

''జస్టే మినిట్ అత్తయ్యగారూ! ఆ నగలు తీసిచ్చేయండి ఇక్కడంతా సేఫ్ కాదేమో'' అంది సుస్మిత స్వరం తగ్గించి మెల్లిగా.

శాంతమ్మ కోడలి వైపదోలా చూసింది.

ఆ వెంటనే చెవులకున్న రవ్వల కమ్మలు తీసి కోడలి చేతిలో పెట్టింది.

''మరి.. ఆ గొలుసు, గాజులు?'' అంటూ నసిగింది సుస్మిత. ఈ కమ్మలు తరతరాలు అత్తగారి నుండి కోడలికి సంప్రాప్తిస్తున్నాయి. ఈ గాజులు, గొలుసు మా నాన్నగారిచ్చినవి. నాతోనే మట్టిలో కలిసిపోనీ'' అంది శాంతమ స్థిరంగా.

''రా!రా! మనకింకా షాపింగుంది. అమ్మ.. జాగ్రత్త. '' అని తల్లి భుజం తట్టి ఆమె మొహంలోకి చూసే ధైర్యం లేక ముందుకి నడిచాడు శేఖర్.

శాంతమ్మ వస్తున్న దుఃఖాన్ని ఆపుకుని మనవణ్ణి ముద్దాడింది. వాడు తల్లి చెయ్యిపట్టుకుని 'బై' చెబుతూ వెళ్తుంటే తను కూడా చెయ్యి ఊపింది భారంగా.

కారు కదిలి వెళ్ళేవరకు కొడుకు వైపే చూస్తూ ఇక ఏడుపు ఆపుకోలేక వెక్కెక్కి ఏడ్చింది శాంతమ్మ. నీలవేణి ఆమె భుజం తట్టి ''ఊరు కోండమ్మా ఈ ఎన్నారయిలంతే. వాళ్ళ సంసారాలూ, వాళ్ళ సంపాదనలే వాళ్ళకి ముఖ్యం. డాలర్ల చుట్టే వాళ్ళ ఆలోచనలూ. మీలాంటి వాళ్ళు చాలామందే ఉన్నారిక్కడ. అంతా బానే ఉంటుంది. భోజనం పంపిస్తాను. రా రా! హుస్సేన్'' అంటూ రొటీన్ మాటలు చెప్పి చకచకా వెళ్ళిపోయింది.

హుస్సేన్ పది నిమిషాల్లో భోజనం ప్లేటు మంచి నీళ్ళు తీసుకొచ్చాడు ''తినండమ్మా'' అని కాళ్ళ దగ్గర కూర్చున్నాడు.

''వద్దు బాబూ అక్కర్లేదు'' అంది శాంతమ్మ.

''అదెందుకు తింటుంది.. నేనింకా బతికున్నానని దాని ఏడుపు'' ఎదురుగా మంచమ్మీద ఉన్న ముసలమ్మ గట్టిగా అరిచింది కోపంగా.

శాంతమ్మ ఉలిక్కిపడింది.

హుస్సేన్ గట్టిగా నవ్వుతూ ''మామ్మా, ఈవిడెవరనుకుంటున్నావు? నీ కోడలు కాదు చెల్లెలు. నిన్నుచూడ్డానికొచ్చింది. తిడతావేంటి?'' అన్నాడు.

ముసలమ్మ శాంతమ్మని గుచ్చి గుచ్చి చూసి "చెల్లెలా? అది బతికే ఉందా? చచ్చిపోలేదూ!" అంటూ మెల్లిగా శాంతమ్మ పక్కక్కొచ్చి కూర్చుంది.

"చూశావా, చెల్లీ.. అది నా ఆస్తంతా లాక్కుని నన్ను బయటకి నెట్టేసింది. ఆ చవట కూడా దానికి వంతపాడాడు" అంటూ ఏడ్చింది.

శాంతమ్మ బెదిరిపోతూ చూసింది.

"భయపడకండి పెద్దమ్మా ఆవిడకి కాస్త మెంటల్ కోడలు మోసం చేసింది. అప్పట్నుంచి అందర్ని కోడలనుకుని తిడుతుంది" అని చెప్పాడు హుస్సేన్.

శాంతమ్మకి ఆ రాత్రి నిద్రపట్టలేదు.

తన ఇల్లు, తోట, కొడుకు, మనవడు మాటిమాటికి గుర్తొచ్చారు.

తన భర్త, తను ఆ ఇంటి కోసం పడిన శ్రమ గుర్తొచ్చింది. గట్టిగా, దిట్టంగా ఉన్న తన ఇంటిని పలుగుల్తో పగలగొడ్తున్నట్లు అనిపించి ఆ రాత్రంతా ఏడుస్తూనే ఉంది.

నెలరోజులు దాటింది.

క్రమంగా ఆ వాతావరణానికి, మనుష్యులకి అలవాటుపడిందామె. గత్యంతరం లేదు.

ఒకటి రెండుసార్లు ఫోను చేసి అంటీ ముట్టనట్లుగా మాట్లాడాడు శేఖర్.

ఆ తర్వాత ఆమె సెల్ ఎక్కువగా మోగలేదు.

హుస్సేన్ ఆమెకు బాగా చేరికయ్యాడు. ఆమెనెందుకోగాని ఆప్యాయంగా చూసేవాడు. వాడికి పదహారేళ్ళుంటాయి. శాంతమ్మకి మందులు, పుస్తకాలు, పళ్ళు తెచ్చేవాడు. ఖాళీ ఉన్నప్పుడల్లా శాంతమ్మతో కూర్చుని కబుర్లు చెప్పేవాడు.

"నువ్వక్కడకెలా వచ్చావురా? నీకు అమ్మా నాన్నా ఉన్నారా?" అనడిగింది శాంతమ్మ ఒక రోజు.

"ఆళ్ళెవరో నాకు తెలియదు పెద్దమ్మా. మంగళగిరి పానకాల స్వామి గుడి దగ్గర అడుక్కుంటుంటే ఈ నీలవేణమ్మ తల్లి సావిత్రమ్మ గుడికొచ్చి నన్ను చూసింది. నాతో వస్తావురా అనడిగింది. తలూపాను. తీసుకొచ్చి ఈ ముసలోళ్ళ మధ్య పడేసింది. ఈళ్ళ మధ్య వుండి నేను కూడా ముసలోణ్ణయిపోయాను" అన్నాడు హుస్సేన్ నవ్వుతూ.

"నువ్వు తెలుగు బాగానే మాట్లాడుతున్నావ్" అంది మెచ్చుకోలుగా.

"నాకసలు నా భాష వస్తేగా" అంటూ పరిగెత్తాడు వాడు నీలవేణి పిలిస్తే.

ఎక్కడో సెల్‌ఫోన్ రింగవుతోంది.

శాంతమ్మ నిస్పృహగా తన సెల్‌వైపు చూసింది.

నెలలో ఒక్కరోజన్నా ఫోను చెయ్యడానికి కుదరదు కాబోలు. ఆమె కళ్ళు చెమర్చాయి బాధతో.

చివరికదే అలవాటయింది.

సెల్ అల్మరాలో పడేసింది.

ఒకసారి హుస్సేన్‌కి ఏక్సిడెంటయింది. చెయ్యి విరిగింది. తన చెయ్యి విరిగినట్లే బాధపడింది శాంతమ్మ. నీలవేణికి చెప్పి తనే వాడి డాక్టరు ఖర్చులు భరించింది. వాడికి బాగయ్యాక మంచి తిండి తినమని నీలవేణికి తెలియకుండా డబ్బులిచ్చేది. ఇప్పుడామెకు హుస్సేన్

క్షణం కనిపించక పోతే చిరాగ్గా ఉంటుంది. వాడొక సెలయేరులా గలగలలాడతాడు, నవ్విస్తాడు, కబుర్లు చెబుతాడు. అన్నిటికన్నా విసుక్కోకుండా ప్రేమగా పనులు చేస్తాడు. అందరిలోనూ శాంతమ్మంటే వాడికి చెప్పలేని అభిమానం ఏర్పడింది.

"ఈళ్ళకి కాస్త తిండి తగ్గించండమ్మా! ఊరికే బరువయిపోతున్నారు. ఈళ్ళు పడిపోతే ఎత్తలేక చస్తన్నా" అనేవాడు నీలవేణితో నవ్వుతూ వాడి మాటలకి అందరూ నవ్వేవారు.

రోజులు భారంగా జరుగుతున్నాయి.

అప్పుడప్పుడు కొడుకు - కోడలి నిర్దయని తలచుకుని బాధపడేది.

మనవణ్ణి చూడాలనిపించేది. ఆ బాధని మరపిస్తూ హుస్సేన్ సుడిగాలిలా వచ్చేవాడు.

"పెద్దమ్మా, డబ్బులియ్యి కేకు తెస్తా" అన్నాడొక రోజు హడావిడిగా వచ్చి.

"ఎందుకురా?" అంది ఆశ్చర్యంగా శాంతమ్మ.

"ఈ రోజు నీ మనవడి పుట్టిన రోజు కదా! నువ్వే చెప్పి నువ్వే మర్చిపోతే ఎలా?" అన్నాడు హుస్సేన్.

శాంతమ్మ నవ్వుతూ డబ్బులిచ్చి "ఎంత బాగా గుర్తుపెట్టుకున్నావురా" అంది మెచ్చుకోలుగా.

శాంతమ్మని అందరూ అభినందించారు.

శాంతమ్మ మాత్రం ఆ రాత్రి నిద్రపోలేదు. అందరూ తననెంతగా మర్చిపోయారు. ముఖ్యంగా కొడుకు. ఎంత గారంగా, ప్రేమగా పెంచింది తనని వదిలే వాడేకాదు. ఎందుకంత కఠినంగా తనని వదిలేసాడు. చిన్నతనంలో తన చేతిని పట్టుకుని నడిచిన వాడికప్పుడు వృద్ధాప్యంలో ఉన్న తన చేతిని పట్టుకుని నడిపించాలనిపించలేదా?

శాంతమ్మ కళ్ళు అవిశ్రాంతంగా వర్షించాయి.

బాత్రూంకి వెళ్ళాలని లేచి పట్టు తప్పి జారిపడిపోయింది. మరింక లేవలేకపోయింది.

హిప్ బోన్ ఫ్యాక్చరయ్యిందన్నారు డాక్టర్లు. అన్నీ మంచంలోనే జరుగుతున్నాయి. హుస్సేన్ ఆమెకి చాలా సేవ చేస్తున్నాడు.

నీలవేణి ఆ సంగతి చంద్రశేఖర్‌కి తెలియచేసింది.

"నాకు రావడానికి కుదరదు" అంటూ డబ్బు పంపిచాడు శేఖర్.

ఆ సంగతి విని శాంతమ్మ కృంగిపోయింది.

అన్ని సేవలూ అసహ్యించు కోకుండా చేస్తున్న హుస్సేన్ పట్ల ఆమె హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది.

రోజు రోజుకీ ఆమె ఆరోగ్యం క్షీణించి పోసాగింది. డాక్టర్లు కూడా జీవితం రోజుల్లో కొచ్చిందని చెప్పేసారు.

ఆ రోజు హుస్సేన్‌ని దగ్గరకి పిలిచింది శాంతమ్మ నీలవేణి చూస్తుండగానే తన చేతి గాజులు, గొలుసు తీసి హుస్సేన్ చేతిలో బలవంతంగా పెట్టి "నా కర్మ చేస్తావా?" అని హీన స్వరంతో అడిగింది కన్నీళ్ళతో.

ఆ మాట విని హుస్సేన్ దుఃఖం ఆపుకోలేకపోయాడు.

పరిస్థితి గమనించి నీలవేణి చంద్రశేఖర్‌కి తనే ఫోను చేసి "వెంటనే బయలుదేరండి, మీ అమ్మగారి పరిస్థితి బాగా లేదు" అని తెలియచేసింది.

శాంతమ్మ చనిపోయి పది గంటలు దాటింది.

''శవాన్నెత్తండి చీకటి పడిపోతోంది'' అన్నారు ఆశ్రమంలో వాళ్ళు.

''వాళ్ళబ్బాయొస్తున్నాడా?'' ఎవరో అడిగారు.

''తెలియదు'' అంది నీలవేణి.

''అతనేం రాడుగానీ - కార్యక్రమం కానివ్వండి ఎవరూ పొద్దున్నుంచీ అన్నాలు తినలేదు'' అన్నారు మరొకళ్ళు.

నీలవేణి ఒక మూల కూర్చుని ఏడుస్తున్న హుస్సేన్‌ని పిలిచింది.

ఎప్పటిలానే ఆశ్రమం నుండీ అనాధ శవాల్ని తీసుకెళ్ళే బొగ్గుల రిక్షా వచ్చింది.

హుస్సేన్ ఆమెకి స్నానం చేయించి పాడెకట్టి, అక్కడ తోటలోని బంతి పూలు గుచ్చి దండ వేసాడు.

ఆమె శవం ఇల్లుకాని ఇంటి నుండి, పాడెకాని పాడె మీద కదిలింది.

ఆశ్రమం వెనకాల ఖాళీస్థలంలో స్మశానం కానీ స్మశానంలో ఆమె శవం కొడుకు కాని కొడుకు హుస్సేన్ చేతుల మీదుగా కాలి బూడిదయ్యింది.

ఆ మర్నాడు శేఖర్, సుస్మిత ఆమె తండ్రి వచ్చారు. జరిగిందంతా చెప్పింది నీలవేణి.

''ఆఖరి చూపు కోసం ఆమె చాలా ఆరాటపడింది'' అంది నీలవేణి.

శేఖర్ తలదించుకున్నాడు. హుస్సేన్ చేతులు పట్టుకున్నాడు కన్నీళ్ళతో.

ఆ వాతావరణం సుస్మితకి ఇబ్బందిగా ఉంది.

''ఇక వెళ్దాం అల్లుడుగారూ. పెద్దావిడయి పోయారు'' అన్నాడు సుస్మిత తండ్రి శేఖర్ భుజాలు పట్టుకుని ఓదార్పు నటిస్తూ.

అందరూ బయలుదేరుతుండగా ''మా అత్తగారి వంటి మీద నగలు'' అంటూ అడిగింది సుస్మిత.

హుస్సేన్ జేబులోంచి నగలు తీసి సుస్మిత చేతిలో పెట్టాడు.

''అదేంటి, అవి ఆవిడ నీకు కావాలనే ఇచ్చారు కదా'' అంది నీలవేణి అసహనంగా ''లేదమ్మా, ఇక్కడున్నన్నాళ్ళూ ఆవిడ నన్ను కన్నబిడ్డలా చూశారు. తల్లి ఎవరో తెలీని నేను ఆమె నుండి తల్లి ప్రేమని పొందాను. తల్లికి తల కొరివి పెట్టి ప్రతి ఫలం ఆశించే నీచుణ్ణి కాదమ్మా నేను'' వాడు ఏడుస్తూ అంటుంటే శేఖర్ తల నేలకి ఒరిగిపోయింది సిగ్గుతో.

సుస్మిత మాత్రం ఆ నగలు లెక్క చూసుకుని పర్సులో వేసుకుని ముందుకి సాగింది..!.




# పరివర్తన

పి.బి.రాజు

వేసవి కాలం ... సాయంత్రం సుమారు ఏడు గంటలు.

వెన్నెల విరగ్గాస్తోంది. గాలి చల్లగా వీస్తోంది. పక్షులు ఇంటి ముఖం పడ్తున్నాయి.

టెర్రేస్ పైన పిల్లలకు అన్నం తినిపిస్తున్నారు –మా అపార్ట్ మెంట్ లోని చుట్టుపక్కల ఫ్లాట్ లలో ఉంటున్నతల్లులు. కొంతమంది పనిమనుషులు ఉదయం ఆరేసిన బట్టలు తీస్తున్నారు.

వాలు కుర్చీలో కూర్చొని ఆ రోజు పేపర్ తిరగేస్తున్నాడు రాజారావు.

"త్వర త్వరగా తినండి! ఎవర్ది ముందవుద్దో వారికి బహుమానం ఉంటుంది." ఊరిస్తోంది మాపక్కింటి అమ్మాయి పల్లవి – కొడుకు అవినాష్ ను.

"ఏం బహుమానం?" పిల్లలు రెట్టించారు.

"ముందు తినండి. తర్వాత చెబుతా!"

"ఉహు! ఇప్పుడే చెప్పాలి!" పిల్లల మారాం.

"ఆ ... పెట్టించుకో! తినేస్తే ....ఇదిగో! నువ్వు కూడా అనిల్!" అంది కొడుకును ఊరిస్తూ ఎదిరింటి ఉష .

"చెప్పుఆంటీ! ఏం బహుమతి?" అవినాష్ బతిమాలుకుంటున్నాడు.

"అమ్మ దగ్గర ఒక ముద్ద పెట్టించుకురా!"

వాడు పరుగెత్తుకెళ్ళి ముద్ద పెట్టించుకొని మళ్ళీ వచ్చాడు.

"తొందరగా తినేస్తే తాత ఒక మంచి కథ చెబ్తారు." అంది రాజారావు వైపు చూపిస్తూ ఉష .

"అవునా?"

"అవును.ఇంకా కావాలంటే తాతనే అడగండి"

'అవునా తాతా!" తాత దగ్గరికి పరుగెత్తుకొచ్చారు పిల్లలు.

"అవును. త్వరగా తినేసి రండి." అన్నాడు రాజారావు.

"అలాగే! మమ్మీ నాకు పెట్టు ... మమ్మీ నాకు పెట్టు "అంటూ పరుగెత్తారు హుషారుగా పిల్లలు తల్లుల దగ్గరికి. .

పోటీ పడి త్వరగా తినేసి తాత చుట్టు చేరారు పిల్లలందరూ దాదాపు ఆరు మంది.

"వీళ్ళకు తినిపించడానికి తాతలు దిగిరావాలి." అని పల్లవి అంటుంటే ; ఉష "థాంక్స్ బాబాయి! ఈరోజు మీ పుణ్యమాని మా పని త్వరగా తెమిలింది. లేదంటే ఏ పదో; పదిన్నరో అయ్యేది." అంటూ వారూ పిల్లల పక్కనే చాపల పైన కూర్చున్నారు.

మరో ప్రక్క పిల్లలు గోల చేస్తున్నారు కథ చెప్పమని.

"మీకే కథ కావాలి?" తాత అడిగాడు పిల్లల్ని.

"తాతా! ఇంతకు ముందు వచ్చినపుడు చెప్పిన కాకి కథ చెప్పు" అన్నాడు – అవినాష్.

"అందరూ నిశ్శబ్దంగా వినాలి. ఒక ఊర్లో ఒక కాకి ఉండేది. "

"ఉహూ! అది వద్దు. వేరే కథ చెప్పు తాతా!" అనిల్ రిక్వెస్ట్.

ఓ కే ... ఓ కే! అనగనగా ఒక ఊరు. ఆ ఊర్లో చింటు; బంటు అనే ఇద్దరు పిల్లలు .... మీలాగే ఉండేవారు. ఇద్దరూ మంచి స్నేహితులు. ఒకే క్లాస్ చదువుతుండేవాళ్ళు. ఇళ్ళు కూడా పక్క పక్కనే ఉండేది కాబట్టి బడి కెళ్ళడం; రావడం – కలిసి చదువుకోవడం; కలిసి ఆడుకోవడం చేసేవాళ్ళు. అయితే ఇందులో – చింటు మంచి అబ్బాయి. చెప్పిన మాట వినేవాడు. బుద్ధిగా చదువుకొనేవాడు. వాళ్ళమ్మను ఏడిపించకుండా అన్నం తినేవాడు..."

"అంటే ...నా లాగా!" అన్నాడు అనిల్ వెన్ను తట్టుకుంటూ

"కరెక్ట్ కదూ! వెరీ గుడ్ బాయ్ ! పిల్లలూ ఈ ఒక్కరోజే కాదు. రోజు ఇలాగే అన్నం తినాలి. అప్పుడే మీరంతా గుడ్ బాయ్స్."

"అలాగే తాతగారూ! రోజూ ఇలాగే అమ్మల్ని ఏడిపించకుండా తినేస్తాం" అన్నారు కోరస్ గా పిల్లలంతా.

"ఎంత బుద్ధిమంతులయిపోయారు. రేపు చూడాలి" అంటూన్న వాళ్ళ అమ్మలకు "చూడండి" అని భరోసా ఇచ్చేశారు.

"తర్వాత కథ చెప్పండి తాతగారూ!" – పిల్లల్లో ఆదుర్దా .

"ఇలాగే ఆ చింటూ కూడా అందరి దగ్గరా "గుడ్ బాయ్" అనిపించుకొనేవాడు. అబద్దాలు చెప్పేవాడు కాదు. వీధిలో అందరూ మెచ్చుకొనేవారు. కానీ బంటు అంత మంచివాడు కాదు. అబద్దాలు చెప్పేవాడు. అన్నం తినడానికి ఏడ్చేవాడు. చదుకోవడానికి ఏడ్చేవాడు. అందుకే వాడంటే ఎవరికి నచ్చదు. అందుకే వాళ్ళ నాన్న ఒకరోజు చంటిని పిల్చి, "బాబూ! మా వాడిని కూడా నీ జతలో చేర్చుకుని నీలాగా మంచోడ్ని చెయి" అని బతిమిలాడాడు. అప్పట్నుంచి చంటి; బంటి కలసి చదువుకొనే వాళ్ళు. కలిసే బడికి వెళ్ళే వాళ్ళు. కలిసే ఆడుకునేవాళ్ళు.

ఒక రోజు చంటి తాతయ్య వూర్నుంచి వచ్చాడు. చంటి గుడ్ బాయ్ కదా... అందుకే వాళ్ళ తాతయ్య వస్తూ వస్తూ ఒక రైలు బొమ్మను తీసుకొచ్చాడు. చంటి కి ఆ బొమ్మ భళే భళే నచ్చింది. ఆ బొమ్మ చాలా ఖరీదయింది. బ్యాటరీతో నడిచేది. "కీ" ఇస్తే "చిక్ బుక్... చిక్ బుక్" అంటూ ట్రాక్ మీద రౌండ్ వేసుకొచ్చేది. తాతయ్య దాంతో ఎలా ఆడుకోవాలో చూపించి "ఇంకా బాగా చదువుకొంటే మరిన్నీ కొనిస్తా"నన్నాడు. తాతయ్యకు ముద్దిచ్చేసి చంటి ఆ బొమ్మతో బయటికెళ్ళి, తన ఫ్రెండ్స్ కందరికీ చూపించి కాలరెగరేశాడు. అప్పట్నించి వాడు రైల్తోనే ఆడుకునేవాడు. ఖుషీ ఖుషీగా ఉండేవాడు. బంటి కూడా ఆడుకొనే వాడే కానీ ... వాడికి ఎక్కువసార్లు ఇచ్చేవాడు కాదు. ఇచ్చినట్లే ఇచ్చి పాడయిపోతుందని వెంటనే లాక్కునేవాడు. వాడికి కూడా రైలు బొమ్మ బాగా నచ్చింది. బంటి క్కూడా అలాంటిది ఒకటి కొనుక్కొంటే బాగుంటుందనిపించింది. వాళ్ళ నాన్నను అడిగితే, "చంటి లాగా చదువు. అప్పుడు కొనిస్తాను" అన్నాడు. "వాడిలాగా నేను చదవలేను. నాన్న నాకా బొమ్మ కొనివ్వడు." అనుకున్నాడు బంటి.

చంటి ఆడుకుంటుంటే, కేరింతలు కొడుతుంటే బంటి ఇదివరకట్లా ఆడుకోలేకపోతున్నాడు. వాడితో కలవలేక పోతున్నాడు. ఆటను ఇదివరకట్లా ఎంజాయ్ చేయలేకపోతున్నాడు. మెల్లమెల్లగా చంటి అంటే అసూయ పెరిగిపోయింది వాడికి.

“తర్వాత ఏమైంది తాతయ్యా!" పిల్లల మొహాల్లో టెన్షన్.

ఒకరోజు ఉన్నట్టుండి – చంటికి రైలు బొమ్మ కనబడ్లేదు. మామూలుగా బొమ్మ పెట్టే చోట వెతికాడు. కనబళ్ళేదు. ఇల్లంతా వెతికాడు. కనబళ్ళేదు. వెతుకుతూనే ఉన్నాడు. అయినా కనబళ్ళేదు. ఏడుపొచ్చింది. ఏడుస్తూనే అమ్మనడిగాడు.

"ఎక్కడ పడేశావ్? అయినా నీలాంటివాడికి అలాంటి కాస్ట్ లీ బొమ్మలొద్దన్నాను. జాగ్రత్తగా పెట్టుకోలేడంటే విన్నాడా మీ తాత? " తిడుతూ ఇల్లంతా వెతికింది అమ్మ. అయినా కనబళ్ళేదు.

"సరే! సాయంత్రానికి వెతికి పెడతా. నువ్వు బడికెళ్ళి రా" అంది.

"బొమ్మ కావాలి నాకు"

"ఇపుడు బడికెళ్ళు. చూసి పెడతా!" అని ఉరిమింది.

చేసేదేమి లేక ఏడూస్తూనే బడికెళ్ళాడు చంటి.

బడికెల్లాడని మాటేగానీ వాడి ధ్యాసంతా బొమ్మ పైన్నే. కనిపించిందా? లేదా? అని ఒకటే టెన్షన్. రాత్రి ఆడుకుని అక్కడే పెట్టాడు. తెల్లరే సరికి కనిపించలేదంటే ఏమైపోయింది. ఒక్కో రోజు బెడ్ పైన పక్కనే పెట్టుకుని నిద్రపోయేవాడు. ఒకవేళ బెడ్ పైన దిండ్ల కింద ఏమైనా పడిపోయిందా? ఉదయం సరిగ్గా చూడలేదు. అమ్మ చూసిందా? వెతుకుతోందా? లేదా? ...ఏవేవో ఆలోచనలతో సాయంత్రం దాకా గడిపేశాడు.

స్కూల్ బస్ దిగీ దిగ్గానే " అమ్మా! బొమ్మ కనిపించిందా?" అని పరుగెత్తుకొచ్చాడు.

"కనిపించలేదు. ఎక్కడ పారేశావో ...ఏంటో " ఆమె మళ్ళీ తిట్ల దండకం మొదలెట్టింది.

వాడు బెడ్ రూం లో మళ్ళీ వెతికాడు. కానీ లేదు. మళ్ళీ అంతా వెతికాడు.

"పాలుతాగి వెతుక్కో" అని వాళ్ళమ్మ విసుక్కుంటున్నా వాడి ఆతృత వాడిది. వెతికి ...వెతికి... ఏడుస్తూనే అలానే నిద్రపోయాడు. వాళ్ళమ్మ లేపి నాలుగు ముద్దలు తినిపించి పడుకోబెట్టింది.

ఉదయం లేస్తూనే – మళ్ళీ వేట మొదలెట్టాడు. మళ్ళీ సాయంత్రం వెతికాడు. లాభం లేదు.

వాడి తాపత్రయం; ఆరాటం చూసి తల్లికి జాలేసింది.

"పోతేపోనీ లేరా? మళ్ళీ కొనుక్కుందాం" అని దగ్గరికి తీసుకుని ఓదార్చింది.

అయినా చంటి మనసు కుదుట పడలేదు.

“తాతా! ఇంతకీ బొమ్మను ఎవరు తీశారు?" పిల్లల ఆతృత.

"చెప్పుకోండి. చూద్దాం!"

"వాళ్ళమ్మే దాచేసింది. చదువు అశ్రద్ధ చేస్తున్నాడని" అవినాష్ అంతరంగం.

"కాదు. బంటి తీశాడు కదా తాతయ్యా!" అనిల్ చెప్పాడు.

"అవును కదా!" వాడి మొహంలో కొంత టెన్షన్.

"కరెక్ట్ నాన్నా!''

అనిల్ కాలరెగరేస్తూ "నేనే కరెక్ట్...నేనే కరెక్ట్" ఎగిరి గంతేశాడు.

"తర్వాత ఏమైందీ ...తాతయ్యా! చెప్పు ...చెప్పు" పిల్లల్లో ఆతృత.

"అదే చెబుతున్నా. ఆ రోజు – చింటు ఏడుస్తూ బంటు దగ్గరికొచ్చాడు.

'ఏంటి చింటూ! ఏడుస్తున్నావు?"

"బంటూ! నా బొమ్మ కనిపించడం లేదు రా!" వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పాడు.

"ఎక్కడ పోయిందిరా!"

"ఇంట్లో కనిపించడం లేదురా!"

"బాగ వెతకలేకపోయావా?"

"అంతా వెతికాను రా! ఎవడో కొట్టేసినట్లున్నాడు"

"మరి మీ నాన్నకు చెప్పావా?"

"చెప్పాను. కనిపించకపోతే రెండ్రోజులు ఆగి పోలీస్ కంప్లైంట్ ఇస్తానన్నారు"

"పోలీస్ కంప్లైంటా..?" బంటు గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

వాడు బొమ్మనైతే కొట్టేశాడు కానీ వాడి కళ్ళల్లో ఆనందం లేదు. మునుపటి ఉత్సాహమూ లేదు. ఎందుకంటే వాడికి బొమ్మతో ఆడుకోవాలని ఉన్నా తృప్తిగా ఆడుకోలేకపోతున్నాడు. నా బొమ్మా అని ఫ్రెండ్స్ కు చెప్పుకోలేకపోతున్నాడు. అందరితో కలిసి ఆడుకోలేకపోతున్నాడు. కనీసం ఇంట్లోనైనా ఆడుకోలేకపోతున్నాడు. బొమ్మకు "కీ" ఇస్తే అ శబ్దానికి ఎక్కడ చంటి వచ్చేస్తాడో? తను కొట్టేసిన సంగతి ఎక్కడ కనిపెట్టేస్తాడో ? అనే భయం పట్టుకుంది. పైగా – రెండు రోజుల్లో పోలీస్ కంప్లైంట్ ఇస్తానన్నారు.

'అమ్మో! పోలీస్ లొస్తే ఇంకేమైనా ఉందా? జైల్లో పెట్టారేమో? చంపేస్తారేమో?" "ఏం చెయ్యాలి? ఇప్పుడేం చెయ్యాలి?"

రాను రాను వాడికి భయం ఎక్కువ కాసాగింది. ఆడుకోవడం అటుంచి...ఏదో పెద్ద ఊబిలో కూరుకుపోయినట్లుంది.

రోజులు గడిచేకొద్దీ – బంటులో పశ్చాతాపం మొదలయింది. తప్పును సరిదిద్దుకోవాలనుకున్నాడు. 'ఎలా...ఎలా" ఆలోచించసాగాడు. చివరికి పరివర్తన చెంది తప్పు దిద్దుకున్నాడు.

“భలే ...భలే ! అయితే ఎలా దిద్దుకున్నాడు తాతయ్యా?" పిల్లలు ఉత్సాహంగా అత్రుతగా ఎదురుచూస్తున్నారు.

మరుసటి రోజు – చింటు బంటు ఇంటికెళ్ళాడు బొమ్మతో పాటు ఉత్సాహంగా.

"ఒరేయ్... ఒరేయ్! బంటూ! నా బొమ్మ దొరికింది రా! ఆడుకుందాం రా!" ఆనందంతో బంటు చేతులూపేశాడు. వాడి ఆనందం బంటు ఎదురుచూసిందే అయినా వాడి కళ్ళల్లో కూడా ఆనందం.

"ఎక్కడ దొరికింది రా?"

"మా ఇంట్లోనే పుస్తకాల సందుల్లో దొరికింది. ఇప్పుడే చూశాను. వెంటనే నీతో ఆడుకోవడానికి పరుగెత్తుకొచ్చాను." అనందంతో చెప్పుకుపోతున్నాడు.

బంటు కళ్ళల్లో నీరు ఉబికి వస్తున్నాయి. అవి కన్నీళ్ళు కావు పరివర్తనతో పునీతమైన ఆనంద బాష్పాలు.

అప్పట్నుంచి వాళ్ళిద్దరూ మంచి మిత్రులయిపోయారు. కలిసే ఆడుకొనేవారు.

భలే మంచి కథ చెప్పావు తాతయ్యా!" పిల్లలు అనందంతో కేరింతలు కొట్టారు.

"పిల్లలూ! ఎలా ఉంది కథ. కథలో బంటు లాగా మీరు కూడా ఎప్పుడూ తప్పు చేయకూడదు. ఒకవేళ తెలిసో తెలియకో తప్పు జరిగితే వెంటనే సరిదిద్దుకోవాలి. "

"అలాగే తాతయ్యా!"

" అలాగే! ఇక వెళ్ళండి. హాయిగా నిద్రపోండి! గుడ్ నైట్ "

★ ★ ★

మూడో రోజు ఉదయం రాజారావు పేపర్ తిరగేస్తుంటే "పోయిందనుకున్న నా బుట్ట కమ్మలు దొరికాయండీ! ఇవిగో నా డ్రెస్సింగ్ టేబుల్ పైన్నే వున్నాయి." అంటున్న వాళ్ళావిడ మొహంలో ఆనందం వెల్లివెరిసింది. సాదరంగా తల పంకించి మళ్ళీ పేపర్లో మునిగిపోయాడు రాజారావు.

*

కథా కౌముది

# 'ఆత్మ'సందేశం

## భవానీఫణి

చల్లటి గాలి ముఖాన్ని రివ్వున తాకుతోంది . పక్కనించి ఒకటీ అరా లారీలు వేగంగా దూసుకు పోతున్నాయి. ఆకాశమంతా మేఘాల్తో నిండిపోవడం వల్ల హెడ్ లైట్స్ వెలుగులో రోడ్డు నల్ల త్రాచులా కనిపిస్తోంది . కార్తీక్ బైక్ హుషారుగా పోనిస్తున్నాడు . "మేఘాలలో తేలి పొమ్మన్నది .. తూఫానులా రేగి పొమ్మన్నది .. అమ్మాయితో సాగుతూ చిలిపి మదీ ..." చెవుల్లో గుచ్చుకున్న హెడ్ ఫోన్స్ లోంచి పాట గట్టిగా వినిపిస్తోంది. ఇప్పుడు తన వెనుక కూడా తనని గట్టిగా హత్తుకుని ఎవరైనా అమ్మాయి కూర్చుని ఉంటే ఎంత బాగుండేది! తన ఆలోచనకి తనే నవ్వుకుంటూ పాట తెచ్చిన ఊపుతో మరింత వేగంగా బండి నడపసాగాడు. ఇంతలో అతని ప్రమేయం లేకుండానే అతని పాదం బ్రేక్ ని గట్టిగా ప్రెస్ చేసింది.

బైక్ ఆపినతనికి సుమారుగా ఓ ముప్పై ఏళ్ళుండచ్చు. చేతిలో ఏదో బాగ్ ఉంది.

"తమ్ముడూ .. కొంచెం లిఫ్ట్ ఇస్తావా?"

కార్తీక్ కి తిక్క రేగింది " ఏంటన్నాయ్ ఇది .. కొంచెం ఉంటే బైక్ కింద పడేవాడివి. ఇలా రోడ్డుకడ్డంగా నిలబడి లిఫ్ట్ అడుగుతారా ఎవరైనా?"

"సారీ తమ్ముడూ, బాగా లేటయి పోయింది. బస్సులు కూడా రావడం లేదు. ఎక్కువ దూరం కాదు. కొంచెం ముందు దిగిపోతాను. ప్లీజ్ "

"సరేలే ఎక్కు"

దేవుడా! అమ్మాయిని ఇవ్వమంటే అన్నయ్యని పంపావా అని ఓ సినిమా డైలాగ్ తో మనసులోనే సెటైర్ వేసుకుంటూ కార్తీక్ బైక్ స్టార్ట్ చేసాడు. అతనితో పెద్దగా మాట్లాడే ఉద్దేశ్యం ఏమీ పెట్టుకోకుండా మళ్ళీ చెవుల్లో హెడ్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటూ ముందుకు సాగిపోయాడు .

'**ప్రమాదకరమైన మలుపు. నెమ్మదిగా వెళ్ళండి** ' చీకట్లో రోడ్డు పక్కనున్న బోర్డు మీది అక్షరాలు మెరుస్తూ కనిపిస్తున్నాయి. కార్తీక్ నవ్వుకున్నాడు. ఇటువంటి మలుపులో ఫాస్ట్ గా వెళ్తే వచ్చే మజా వీళ్ళకేం తెలుసు అనుకుంటూ ఏ మాత్రం స్పీడ్ తగ్గించకుండా మలుపు తిప్పాడు. వెనక కూర్చున్నతను ఏదో అంటున్నాడు. పాపం తన జోరుకి భయపడినట్టున్నాడు అనుకుంటూ కార్తీక్ హెడ్ ఫోన్స్ చెవిలో నుంచి తీసాడు "ఏంటన్నయ్యా " అంటూ.

"బండి నడిపితే ఇలా నడపాలి తమ్ముడూ, శెభాష్ "

"థాంక్స్ అన్నా, మా అన్నయ్య కూడా నీలా ఆలోచిస్తే ఎంత బాగుండేది!" .

ఇంటి దగ్గర, 'పొద్దున్నే బయలుదేరచ్చు కదరా' అంటున్న నాన్న, దిగులు గా మొహం పెట్టుకుని 'వెళ్ళగానే ఫోన్ చెయ్యి బాబూ' అన్న అమ్మ, 'ఒరేయ్ హెల్మెట్ మర్చిపోయావ్' అంటూ అంటగట్టిన అన్నయ్య గుర్తొచ్చారు కార్తీక్ కి. 'ఇదో అడ్డం తనకి' ముందు పెట్టిన హెల్మెట్ వంక విసుగ్గా చూస్తూ అనుకున్నాడు. అది పెట్టుకుని బండి నడపాలంటే అతనికి చాలా చిరాకు.

"పెద్దవాళ్ళు అంతే తమ్ముడూ, మా నాన్న కూడా అంతే .. నెమ్మది నెమ్మదని బ్రతికున్నన్నాళ్ళూ నా ప్రాణం తీసేవాడు "

"అయ్యో,ఎలా పోయారాయన ?" అడగకపోతే బాగోదేమోనని అడిగాడు కార్తీక్ .

"ఆయనెక్కడికి పోయాడు! నిక్షేపంగా ఉన్నాడు మా ఊళ్ళో "

"మరి?" అయోమయంగా అడిగేసాక వచ్చింది ఆ ఆలోచన కార్తీక్ కి. ఊర్లో తన నేస్తం చిట్టిగాడు చెప్పిన విషయం కూడా గుర్తొచ్చింది.

"హైవే మీద ఒక దయ్యం తిరుగుతుందంట రా, సింగిల్ గా వెళ్ళే వాళ్ళ బండి మీదికి ఎగిరి దూకుతుందంట.. స్పీడుగా పోనిమ్మని ప్రాణం తీస్తుందంట " ఆవేళ వాడి మాటలకి పగలబడి నవ్వాడు తను. వాడెప్పుడు అంతే. ఒట్టి పిరిగ్గొడ్డు .

కానీ ఇప్పుడు కార్తీక్ కూడా కొంచెం భయం వేస్తోంది. సహజంగా ధైర్య వంతుడే అయినా ఆ చీకటి, నిర్మానుష్యం గా ఉన్న వాతావరణం, వెనక కూర్చున్న అతని మాటలు కొంచెం జడుపు కల్గిస్తున్నాయి.

అతను మళ్ళీ అన్నాడు " అయినా నేనెప్పుడూ మా నాన్న మాటలు లెక్క చెయ్యలేదు. ప్రాణం కోసం థ్రిల్ ఎవరైనా వదులుకుంటారా?"

కార్తీక్ ఏమీ సమాధానం చెప్పలేదు. అతని అనుమానం నిమిష నిమిషానికీ బలపడుతోంది. అసలు ఇలా లిఫ్ట్ ఇవ్వకుండా ఉండాల్సింది.

అతను మాట్లాడుతూనే ఉన్నాడు " అయినా ఈ మనుషులకి ప్రాణమంటే ఎందుకంత ప్రీతి. వీళ్ళంతా అలా భయపడుతూ బతికిన వాళ్ళే కదా. ఇప్పుడెక్కడ పడుకున్నారో చూడు. అయ్యో .. బండాపు తమ్ముడూ. మాటల్లో పడి మర్చిపోయాను.. మా ఇల్లొచ్చేసింది. "

అప్పటికే భయం వల్ల అనుకోకుండానే బండి స్పీడ్ తగ్గించిన కార్తీక్ వెంటనే బండి ఆపి చుట్టూ చూసాడు. అతను ఎవరి గురించి మాట్లాడుతున్నాడా అనుకుంటూ. ఒక్కసారిగా అతని గుండె ఆగినంత పనైంది. అది స్మశానం .

"థాంక్స్ తమ్ముడూ " అన్నాడు అతను బండి దిగి. కార్తీక్ కి అంత చలిలోనూ ఒళ్లంతా చెమటలు పట్టాయి కొంచెం భయం గానే అతని వైపు చూసాడు. దూరంగా ఎక్కడో కాలుతున్న చితి మంటలు ఆ వ్యక్తి కనుపాపల్లో రిఫ్లెక్ట్ అవుతున్నాయి. అతని పెదాలు కదిలీ కదలకుండా కదులుతున్నాయి. కొంచెం లోపలి పోయి ఉన్న దవడలు అదో రకమైన జలదరింపుని కలిగిస్తున్నాయి.

"ఇలాగే నడుపు తమ్ముడూ బైక్.. మనిషిలో హుషారుండాలి. ఈ హెల్మెట్లు గట్రా పెట్టుకోకు. పెద్దోళ్ళు అలాగే చెప్తారు. ఇంకా కుదిరితే ఓ చుక్కేసుకుని నడిపావంటే మరింత మజా వస్తుంది. తొందర లోనే మళ్ళీ కలుద్దాం. ఆల్ ద బెస్ట్. " అనేసి స్మశానం వైపు నడుచుకుంటూ వెళ్ళిపోయాడతను .

ఆ తర్వాత కార్తీక్ బైక్ ఎలా స్టార్ట్ చేసాడో, ఎలా నడిపాడో, ఎలా రూమ్ కొచ్చి పడ్డాడో అతనికే తెలీదు.

" ఏంటిరా ఊరొదిలి రాలేకపోయావా ? ఇంత లేట్" అని రూమ్మేట్ పవన్ వేళాకోళం చేసినా పట్టించుకోకుండా వెళ్లి మంచం మీద వాలిపోయాడు.

వారం రోజుల పాటు పగలు రాత్రి కార్తీక్ కి ఎక్కడ చూసినా ఆ మనిషే కనిపించాడు. రోడ్డు మీద పడి, తన తల పగిలి పోయినట్టు, ఆ వ్యక్తి వచ్చి భుజం మీద చేతులేసి తనని స్మశానంలోకి తీసుకెళ్తున్నట్టు ఏవేవో పిచ్చి పిచ్చి కలలు. కొన్ని రోజులకి ఆ భయం లోంచి బయట పడినా చీకటి పడ్డాక ఊరికి బయలుదేరి వెళ్లక పోవడం, బండి కొంచెం నెమ్మదిగా పోనివ్వడం లాంటి అలవాట్లు మాత్రం చేసుకున్నాడు.

రెండు నెలల తర్వాత మళ్ళీ అతన్ని ఆ డిపార్ట్ మెంటల్ స్టోర్ లో చూస్తే గానీ ఆ రాత్రి జరిగిన విషయం కార్తీక్ కి గుర్తు రాలేదు అతన్ని ఎలా గుర్తు పట్టకుండా ఉండగలడు! చూసింది రెండు నిమిషాలే అయినా, మాట్లాడింది నాలుగు మాటలే అయినా రోజుల తరబడి కలల్లో వచ్చి ఎంతగా భయపెట్టాడు. బండి స్పీడ్ గా నడపాలంటే కూడా భయపడేలా చేసాడు. మళ్ళీ కలుద్దాం అన్న అతని మాటలో తన చావు ఎంతో స్పష్టం గా కనిపించింది తనకి చాలా రోజులు .

కార్తీక్ కి గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఆ చప్పుడు అతనికెక్కడ వినిపిస్తుందో అన్నంత భయం వేసింది .

ఒక్క నిమిషం .... అతను మామూలు మనిషి లాగే ప్రవర్తిస్తున్నాడే! కార్తీక్ ఆలోచనలో పడ్డాడు. ఆ రోజు అసాధారణమైన విషయాలేమైనా జరిగాయా? అతను గాల్లో ఏమైనా ఎగిరాడా? లేదే .. కాళ్ళు వెనక్కి తిరిగి ఉన్నాయా? ఏమో తను చూడలేదు. పోనీ హఠాత్తుగా మాయమై పోయాడా? అదీ లేదు.

అంటే అతను తనని ఆట పట్టించాడన్నమాట. కోపంగా కార్తీక్ దగ్గరికి వెళ్ళే లోపే అతను షాపింగ్ పూర్తి చేసుకుని బండి స్టార్ట్ చేసి వెళ్ళిపోతున్నాడు. కార్తీక్ ఆవేశం గా అతన్ని ఫాలో చెయ్యసాగాడు. ఎలాగైనా అతన్ని పట్టుకుని తగిన బుద్ధి చెప్పాలి. ఇక్కడ ఆపి అడిగినా తనకేమీ తెలీదని బుకాయించచ్చు. ఎక్కడికి వెళ్తున్నాడో చూద్దాం అనుకుంటూ అతని వెనకే బైక్ పోనివ్వసాగాడు.

ఆ వ్యక్తి సిటీ దాటి, హైవే లో కొంత దూరం వెళ్ళాక, తనని భయపెట్టిన స్మశానం కూడా దాటాక, హైవే ని ఆనుకుని ఉన్న చిన్న ఊరి లోకి మలుపు తిరిగాడు. నాలుగైదు సందులు తిరిగాక ఒక పెంకుటింటి ముందు ఆగి బండి స్టాండ్ వేసి బేగ్ లు తీసుకుని ఇంట్లోకి వెళ్ళాడు. అతను లోపలికి వెళ్ళే వరకు కొంచెం దూరంగా నిలబడి వెయిట్ చేసిన కార్తీక్, తన బండి కూడా స్టాండ్ చేసి ఆ ఇంటి దగ్గరికి వెళ్లి కిటికీ లోంచి లోపలి తొంగి చూసాడు.

అక్కడ మంచం మీద ఇద్దరు ముసలి దంపతులు కూర్చుని ఉన్నారు. ఆవిడ జుట్టు విరబోసుకుని, చీర అస్తవ్యస్తంగా కట్టుకుని ఉంది. ఆవిడ చూపులు ఎటో శూన్యం లోకి చూస్తున్నట్టుగా ఉన్నాయి . ఆ ముసలాయన పక్కన కూర్చుని ఆవిడకి అన్నం తినిపిస్తున్నాడు.

"ఏంటి బాబూ ఇంత లేటు, ఇప్పుడే ఇంక ఫోన్ చేద్దాం అనుకుంటున్నాను" అన్నాడాయన కార్తీక్ ఫాలో అయిన వ్యక్తిని చూస్తూ.

"ఆఫీస్ నించి వస్తూ సరుకులు తీసుకొచ్చాను నాన్నా ,అందుకే లేటయింది " అంటూ ఆ వ్యక్తి చేతిలోని సంచీలు కింద పెట్టి చటుక్కున కిటికీ వైపు చూసాడు.

కార్తీక్ వెంటనే పక్కకి తప్పుకున్నా అప్పటికే ఆ వ్యక్తి తనని చూసేసాడని అతనికి అర్థం అయింది. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తుండగానే ఆ వ్యక్తి బయటకి వచ్చాడు.

"ఎవరు నువ్వు? మా ఇంట్లోకి ఎందుకు తొంగి చూస్తున్నావ్?" అనుమానంగా అడిగాడతను .

"ముందు నువ్వెందుకు దయ్యంలా నాటకమాడి దారిన పోయే వాళ్ళని భయపెడుతున్నావో చెప్పు" పదునుగా అన్నాడు కార్తీక్ .

అతను ఒక్క నిమిషం కార్తీక్ ని తేరి పార చూసాడు. తర్వాత గట్టిగా నవ్వేసాడు.

"నువ్వెవరో నాకు గుర్తు రావడం లేదు. బట్, నాకెప్పుడో లిఫ్ట్ ఇచ్చి ఉంటావు. అవునా "

"అవును, నువ్వు బాధించిన వాళ్ళలో నేనూ ఒకడిని "

అతను మరోసారి నవ్వి " పద, అలా వెళ్తూ మాట్లాడుకుందాం " అంటూ ముందుకు దారి తీసాడు .

" లోపల నువ్వు చూసినామె మా అమ్మ , చాలా తెలివిగలది. నాన్న ఉద్యోగ రీత్యా దూర దూరాల్లో ఉన్నా ఒక్కర్తే ఒంటి చేత్తో ఊళ్ళో మా వ్యవసాయం అంతా చక్కబెట్టేది..... ఆ మర్నాడు నా పందొమ్మిదో పుట్టిన రోజనగా నా కోసం గిఫ్ట్ కొందామని సిటీకి వెళ్ళింది. ఓ అందమైన వాచీ కూడా కొంది. తిరిగొస్తూ ఇదిగో ఇక్కడే బస్సు దిగింది." తాము ఆ ఊరి చిన్నపాటి బస్సు షెల్టర్ దగ్గర ఉన్నామని అప్పుడు గమనించాడు కార్తీక్.

చీకటి పడిపోయిందని, నేను కాలేజ్ నించి వచ్చేసి ఉంటానని తొందరలో రోడ్డు దాట బోతుండగా వేగంగా బండి మీద వచ్చి గుద్దేసాడు ఓ కుర్రాడు. ఆ కంగారులో సడెన్ బ్రేక్ వేసి, అంత విపరీతమైన వేగం మీద బండి కంట్రోల్ చెయ్యలేక అతను కూడా పడిపోయాడు . అమ్మకి బలమైన గాయాలు తగిలాయి. ఆ కుర్రాడు అయితే తల పక్కనున్న రాయికి గుద్దుకుని స్పాట్ డెడ్ .. చాలా చిన్న అబ్బాయి పాపం .. అతని తల్లితండ్రుల బాధ వర్ణనాతీతం. అమ్మకి కూడా తలకి చాలా తీవ్రమైన గాయం అయింది .... పదేళ్లుగా అలాగే ఉంది. ఇదిగో ఈ వాచీ చూసావా... ఆ రోజు అమ్మ కొనుక్కొచ్చిన వాచ్. అమ్మ రక్తంతో తడిసి అప్పుడే పని చెయ్యడం మానేసింది. కానీ నేను ఇది ఎప్పుడు పెట్టుకునే ఉంటాను. ఎందుకో తెలుసా.. అమ్మకి నేను గుర్తున్నప్పుడు నా కోసం కొన్న చివరి వస్తువు ఇది. ఇప్పుడు అమ్మకి నేనెవరో తెలీదు. అసలు తనెవరో కూడా తనకి తెలీదు." దుఃఖంతో గొంతు పూడుకు పోవడంతో అతను చెప్పడం ఆపాడు. అతని కళ్ళ వెంబడి ధారాపాతంగా నీళ్ళు కారిపోతున్నాయి.

"యాక్సిడెంట్ అయిన టైంలో ఆ కుర్రాడు విపరీతమైన వేగంతో బండి నడుపుతున్నాడని అక్కడున్న వాళ్ళంతా చెప్పారు . అతను ఏ మాత్రం బండి నెమ్మదిగా నడుపుతూ ఉండి ఉన్నా ఆ తల్లి తండ్రులకి కడుపు కోత, మా కుటుంబానికి ఈ నరకం తప్పి ఉండేవి .... ప్రాణాలు పోతాయన్న భయం లేకపోయినా, ప్రాణాలు పోయాక తిరిగే ప్రేతాత్మలంటే అందరికీ భయమేగా... అందుకే నాకు తోచినట్టుగా కుదిరినప్పుడల్లా ఇలా నాటకం ఆడి కొందరినైనా మార్చే ప్రయత్నం చేస్తున్నాను . "

కార్తీక్ సానుభూతిగా అతని భుజం మీద చెయ్యి వేసాడు. ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో అర్ధం కాలేదు.అతను చెప్పిన విషయాల్లో నిజం ఉన్నా అతను చేస్తున్న పని ఎంత వరకు సమంజసమా అని ఆలోచిస్తూ ఉండిపోయాడు!!




## నాలుగు మెతుకులు

ఎనుగంటి వేణుగోపాల్

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**ఒక్క నీటి చుక్క -**

మేఘపుటంచు నుండి జారి నేల తల్లి ఒడిని చేరి, కోటానుకోట్ల మట్టి కణాలతో మమేకమై, మొక్కలకు స్తన్యమై, పచ్చదనానికి ప్రాణ సమమై, ప్రకృతి ఉనికికి తోడవుతోంది. అలాంటి ఎన్నో జల బిందువులు కణం కణం కలిసి అణువణువూ కలిసి చెరువుల్లో చేరుతూ సెలఏరులై పారుతూ ప్రతిచోటా పరవళ్ళు తొక్కుతున్నాయి..

ఎన్ని వేనవేల చేతులు వర్షపు చినుకు కోసం, తడి బాట కోసం వరుణ దేవుడిని ఎంతలా ప్రార్థించాయో తన గత వైభవ జాడల్ని స్పృశిస్తూ, పుడమి ఒడలు స్పర్శిస్తూ వర్షామృత ధారలు కురుస్తూనే ఉన్నాయి.

కానీ,

అదే నీటి చుక్క -

రైతు గుండె గుడిసెలో సుడులు తిరిగి మనో క్షేత్రంలో అశృకణమై మొలచి కనుపాపల నడుమ తడిగా నిలిచి ఎదగట్టు తెగి అలవికాని శోక సంద్రమై ఆవిష్కృతమవుతోంది.

బక్కయ్యలాంటి ఎందరో రైతుల విషయంలో.

గుడిపేట -

ముత్యాల మండలంలో ఓ కుగ్రామమది.

వర్షాలు లేని రోజున పొలాలు ఎండి, క్షేత్రాలన్నీ బీడు పడిన క్షణాన వ్యవసాయాన్ని వదిలి గ్రామం వీడి పరాయి ప్రదేశాలకు కూలీలుగా వలస వెళ్ళిన వారున్నారు.

కలో గంజో ఎండిన కడుపో, నిండని కడుపో అనుకుని పల్లె తల్లిని నమ్ముకుని గ్రామం వదిలి పెట్టని వారున్నారు.

అలాంటి వారిలో బక్కయ్య ఒకడు.

అతడికి భార్యా ఇద్దరు పిల్లలు. ఉన్న మూడెకరాలు పొలాన్ని సాగు చేసి చేసి అలసిన తండ్రి మొండయ్య, వార్ధక్యత బడలికతో ఇంటిపట్టునే ఉంటున్నాడు.

వైద్యానికి సరిపడా డబ్బుల్లేక అనారోగ్యంతో తల్లెపుడో కాలం చేసింది.

రైతులకి ఆపద్బంధువైన అప్పుని ఆసరాగా చేసుకున్నాడు బక్కయ్య. చేయక తప్పని అప్పుకి వడ్డీ పెరిగి అప్పు కుప్పవుతున్నా ధైర్యాన్ని మాత్రం కోల్పోలేదు.

'అధైర్యపడడం అసలైన రైతు లక్షణం కాదని' కొడుక్కి హితబోధ చేస్తుండేవాడు మొండయ్య. తండ్రి మాటల ఉత్ప్రేరకంతో కష్టాలెన్నో ఎదురైనా మనో నిబ్బరంతో ఎదురీదుతున్నాడు బక్కయ్య.

బక్కయ్య స్వభావం తెలిసి అప్పిచ్చిన వారెవరూ ఒత్తిడి చేయలేదు.

పత్తివేసి సరైన సమయానికి చేతికందక బుగ్గి పాలవడంతో అప్పుల పాలయిన రైతు గంగయ్య. చేసిన అప్పు తీర్చలేక సతమతమవుతూ మరో దారిలేక పురుగులు మందు తాగితే అది గుణపాఠం అయ్యింది బక్కయ్యకి.

'చచ్చి సాధించేదేమీ లేదు. బతుకున్నాక పోరాటం తప్పదు. అందునా రైతుకి త్యాగం తప్పదు. పోరాడి గెలిచి బతుకు సాగించాలన్నది' బక్కయ్య అభిమతం. తన రైతు సంఘ మంత్రుల దగ్గర కూడా పదే పదే ఇదే విషయం ప్రస్తావిస్తూ వాళ్ళలో ఆశలు చివురింప చేసాడు.

మునుపెన్నడూ కానరాని వర్షాలు.. ఇపుడేమో వ్యవసాయ బావుల కడుపుల్ని నింపాయి. వరి చేను ఒంటినిండా విత్తుల గుత్తుల్ని అలంకరించాయి. రైతు కనుదోయిని అలరించాయి.

మొత్తానికి పంటలన్నీ ఆశాజనకంగానే ఉన్నాయి. చివరకు పొలాలు కోతకు వచ్చాయి. రైతులు కోతల పని మొదలు పెట్టారు.

కోతకు ఆధునిక యంత్రాలు ప్రవేశించడంతో, ఎకరాలకు ఎకరాల పొలాల్ని ఒక్క పూటలో కోసి వడ్లని ట్రాక్టర్లకి, దిగుమతి చేస్తున్నాయి. బక్కయ్య మూడెకరాల వరిచేను కోయడానికి మూడున్నర గంటలు పట్టింది.

బక్కయ్య కల్లం లేవనే లేదు. ఎదురు చూస్తున్న అప్పులవాళ్ళు ఏకంగా పొలం వద్దకు వచ్చారు.

ఊహించని బక్కయ్యకు దిక్కుతోచలేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. భార్య సూరమ్మ బిక్కుబిక్కుమంటూ భర్తవంక చూస్తోంది. ఇలాంటి పరిస్థితి ఎదురుపడడం అతడికిది తొలిసారి.

"గింజలమ్మి ఎవరియ్యి వాళ్ళకి పైసలిత్త" అన్నాడు ఏం పాలుపోక.

"నీకా శ్రమక్కర్లేదు. ఈ ఏడు నీ వడ్ల ధర మార్కెట్లో రెండువేల మూడొందలు పలుకుతోంది క్వింటాలుకు, ఎవరికెంత డబ్బివ్వాలో లెక్కచూసుకుని వడ్లే కొలిచివ్వు. ఏ టైం ఎట్లుంటదో?" ఒకతనన్నాడు.

మిగతా వాళ్ళు తలలూపారు. 'అందరూ కూడబలుక్కుని వచ్చారని అర్థమవుతోంది. ఎవరైనా ఎంతకాలం ఓపిక పడతారు. కరువు ఉన్నన్ని రోజులు మాత్రం పాపం అప్పు ఊసే ఎత్తలేదు' అనుకున్నాడు.

"నువ్వెన్ని యూరియా బస్తాలడిగినా ఇచ్చిన, మందు డబ్బాలడిగినా ఇచ్చిన, ఈ మూడేండ్లు నీ జోలికి వచ్చిన్నా? పైసలడిగినానోయ్ బక్కయ్యా?" కాశయ్య సేటన్నడు.

లేదన్నట్టు తలూపాడు బక్కయ్య.

అక్కడున్న వాళ్ళవంక కృతజ్ఞతగా చూస్తూ "అందరాగిండ్రు బాంచను. మంచోళ్ళయే పట్టికే పైసలిమ్మని నా ఎన్క పల్లేదెప్పుడు" చేతులెత్తి దండం పెట్టాడు.

వచ్చిన వాళ్ళు తమకి రావల్సిన బాకీ డబ్బుకి సరిపోయే దినుసెంతో చెప్పారు. భార్యాభర్తలిద్దరు మాన్క (అయిదుకిలోల ధాన్యం పట్టే పాతకాలపు పాత్ర)తో ధాన్యాన్ని ఓపిగ్గా కొలిచిచ్చారు. ఒకట్రెండు రోజుల్నుడి చిన్న చిన్న పనులకు సాయం చేస్తున్న కూలీలకున్నాడా కూలి బదులు ధాన్యాన్ని కొలిచిచ్చారు.

ధాన్యం చేతికందాక అందరూ వెళ్ళిపోవడంతో భార్యా భర్తలే మిగిలారక్కడ.

అప్పు ఒక అగాధం. దేన్నయినా ఇట్టే మింగేస్తుంది. అలాంటిది బడుకు రైతు బతుకు  అందుకు మినహాయింపేం కాదు.

నిస్సహాయంగా కూర్చున్నారిద్దరు. సూరమ్మకైతే మతిపోతోంది. చేతికి వచ్చినట్టే వచ్చిన తిండిగింజలు చేజారి పోయాయి. ఇంత చేసి మిగిలిందేమీ లేదు. పంట కాలమంతా పడిన శ్రమంతా వృధా అయ్యింది. పంట అప్పులవాళ్ళ పాలయ్యింది.

తిండికి ఒక్క గింజ మిగల్లేదు. చిల్లర మల్లర అప్పులింకా మిగిలి ఉన్నాయి.

బక్కయ్య తలెత్తి పరిసరాల వంక నిర్వికారంగా చూసాడు. ఊరి పొలాల కోతలయ్యాయి. నిజం చెప్పాలంటే ఆలస్యంగా పంటవేసిదతడే అందుకే అందరి కంటే చివర్న కోత కోయాల్సి వచ్చింది.

పంటపొలాల్లో మిగిలిన ఎండు గడ్డిని మేస్తున్నాయి పశువులు. తల తిప్పి మరో దిక్కు దృష్టి సారించాడు. వాలి ఉన్న పక్షులు రాలిన వడ్ల గింజల్ని ఏరుకుని తింటున్నాయి.

ఆ దృశ్యాన్ని రెప్పార్పకుండా చూస్తున్న బక్కయ్య పెదవులపై చిరుదరహాసం మొలిచింది. వర్షాల పుణ్యాలతో పశువులకి మేత దొరికింది. పక్షులకు నాలుగు గింజలు దొరుకుతున్నాయి.

ఎటొచ్చి మనిషి. ఊహూ! రైతు డొక్కకు ఎసరు పడుతోంది.

"ఎంత సేపని దీనంగా గీడనే కూసుంటం. పదయ్యా! గుడిసెకెడదాం" భర్త జబ్బ పట్టి కుదుపుతూ ప్రాధేయపడింది సూరమ్మ.

ఏమనుకున్నాడో ఏమో, భుజం మీ్మది కండువా ఓసారి దులుపుకుని లేచి నిలబడ్డాడు.

సూరమ్మ కూడా లేచి, కొడవళ్ళు వగైరా సర్ది గంపనెత్తుకుని భర్తవెంట కదిలింది.

కోడలు రాకతో అలికిడవడంతో దిగ్గున లేచి కూచున్నాడు.

"ఎన్ని పల్లాలిచ్చినయిరా?" ఆశగా అడిగాడు కొడుకుని.

పచ్చని వరిపంట గురించి తండ్రికి తరచూ చెప్పేవాడు బక్కయ్య.

పంట బాగా పండితే కొడుకు కష్టం తీరతుందని, మనసుకింత తృప్తి అవుతుదని ఆ ముసలి తండ్రి ఆవేదన.

తండ్రి పలకరింపుతో గుమ్మం దగ్గరే ఆగిపోయాడు బక్కయ్య.

వడివడిగ ఇంట్లోకి వెళ్ళివచ్చిన సూరమ్మ, మంచినీళ్ళ చెంబు భర్తకిస్తూ "ముందుగాల బువ్వయితే వండుత. పిలగాండ్లు కూడ బడినుంచి ఒత్తరు." అంది.

చెంబు పైకెత్తి గడగడా తాగేసి భార్యకిస్తూ "కడుపుకింక ఆకలైతున్నాదే?" సన్నని గొంతుతో అన్నాడు.

"రేపు కోతెట్లయితదో.. గుబులయితందనే బెంగతో రాత్రి కూడా బువ్వముట్టలేదు. "

"ఏం మిగులుందే తినడానికి?"

'పెనిమిటి తీరే అంత. మనసుకి కట్టం కలిగినప్పుడల్లా అర్ధం పర్ధం లేకుండా గుండెలో బాధ తీరేదాకా ఏదేదో అనేస్తడు' అని గమ్మున కూచుండిపోయింది.

"గప్పట్ల కరువచ్చినందుకె గాదె గొడ్డు గోడ నమ్మేసుకుంటిమి, పశువులుంటె వాటి ఆకలేడ తీరుత్తుంటిమి"

ఇంక అక్కడే ఉంటే ఆ మనిషి బాధను ఆపతరం కాదని లోపలికెళ్ళింది.

కొడుకు వేదన అర్థమైన తండ్రి మళ్ళీ అడిగాడు "ఎన్ని పల్లాలిచ్చినయిన అయ్యా?" అని.

తండ్రి పక్కన మంచం మీద కూర్చుంటూ "ఎన్నొత్తె ఏముందే బాపు? ఉన్నదంత అప్పులోల్లొచ్చి పట్టుకు పోయినంక" అన్నాడు జీరపోయిన గొంతుకతో.

సంభాషణ ఇంకా పొడిగించి కొడుకు వ్యధను మరింత కెలకాలనిపించలేదు మొండయ్యకు.

'నా బతుకే గట్ల గడిసిందనుకుంటె గీడి బతుగ్గూడ గట్లనె గావట్టె' లోలోని బాధను లోనికే నెట్టేసుకుంటు, తిరిగి కుక్కి మంచం మీద నడుం వాల్చాడు.

మనసు నిండా ఆలోచనల్తో అలాగే కూర్చుండి పోయాడు బక్కయ్య.

సూరమ్మ వంట ముగించుకుని వచ్చింది.

"ఉన్న సోడున్నర బియ్యం ఈ పూటకు ఉడికించిన ఎట్టైన వడ్లత్తయి గదా అని సెప్పలేదు. పొద్దాకి షావుకారు దగ్గర బియ్యం తేవాలె" చెప్పింది భర్తకు.

సేటు మాటు చెవిన పడగానే చెమట్లు పట్టినయ్ బక్కయ్యకు.

'ఉప్పు, పప్పు, బియ్య ఆ షావుకారు దగ్గరే తెచ్చాడు. ఏం మొహం పెట్టుకుని మల్ల దుకాణం కాడికి పోవుడు?' మనసులో గింజుకున్నాడు.

'ముందుగాల సెప్పలేదంటవని సెప్పినయ్య, నువ్వయితే కాళ్ళూ సేతులు కడుక్కో. అదిగో పిల్లలు గూడ అత్తున్నరు. అందరం గూడి తింటె పనై పోతుంది" చెప్పి కంచాలు సర్దడానికి లోపలికి పోయింది.

తండ్రిని పలకరించి, లోపల అరుగు మీద కూర్చున్నారు పిల్లలు.

ఒక కంచంలో అన్నం, మామిడికాయ తొక్కు వేసుకుని మామ చేతికందించింది సూరమ్మ. ముసలాయనకు మంచం మీదే తినడం అలవాటు.

ఇంకా లేవని భర్తతో "రా అయ్య! ఇంతెంగిలి పడుదువుగాని.." అంటూ పిలిచింది.

కదల్లేదతను.

"తినర బిడ్డ. నువ్వు కడుపు ఎండబెట్టుకుంటె నేను తింటానార అయ్య" చేతిలోని పళ్ళాన్ని పక్కన పెట్టాడు మొండయ్య.

తండ్రి నిజంగానే మొండోడు. ఆ విషయం తెలుసు బక్కయ్యకు. ముసలి ప్రాణాన్నెందుకు కష్టపెట్టాలనుకున్నాడు.

"నా కంచం గూడ ఈడికే తీసుకురా ఇయ్యాల అయ్యతో గూసొని తింట" భార్యకి చెప్పాడు.

తండ్రి తృప్తి కోసం ముచ్చట్లాడుతూ కలిసి తినడం బక్కయ్యకు అలవాటే.

తలూపుకుంటూ, అన్నం పెట్టిన పళ్ళెంతో వచ్చి మంచం దగ్గరే నిలబడింది.

అప్పటికే బక్కయ్య బావి దగ్గరకు పోయాడు కాళ్ళూ చేతులు కడుక్కోవడానికి. కొడుకు అక్కడినుండి కదిలే సరికి. ఎలాగూ తింటాడని. ఆకలి నకనక లాడుతుండడంతో కంచాన్ని చేతులోకి తీసుకుని అన్నాన్ని కలపసాగాడు మొండయ్య.

దూరం నుండి అస్పష్టంగా ఏదో కేకలు వినిపించాయి.

ఇంతలో "అవ్వా! కారమైతుంది నూనెయ్యవే" అంటూ గుడిసెలోంచి పిల్లాడు.

నిలుచున్న చోటునుండే "ఆగు బిడ్డా" అంటూ సముదాయించింది.

విన్లేదు వాడు. మళ్ళీ అరిచాడు. పిలిచిన వెంటనే రాకపోతే ఓ పట్టాన వదలడు వాడు.

విసుక్కుంటూ "ఆగుఒత్తున్నా" తన చేతిలోని కంచాన్ని మామ పక్కన మంచం మీద పెట్టి ఒక్క అంగలో లోపలికెళ్ళింది.

బావి దగ్గర పని ముగించుకున్న బక్కయ్య చేతి కండువాతో ముఖం తుడుచుకుంటూ వెనుతిరుగుతుండగా జరిగిందది అనూహ్యంగా.

'హి..హి..' అని వెకిలి వెకిలిగా నవ్వుతూ, ఎక్కడినుండో హఠాత్తుగా దూసుకు వచ్చాడో పిచ్చివాడు.

మాసిపోయిన అస్తవ్యస్తమైన దుస్తులతో చెదిరిన చింపిరి తలతో చొంగ కారుస్తూ తలను అదేపనిగా అటూ ఇటూ కీ బొమ్మలా తిప్పుతూ 'హి..హి' అంటూనే ఉన్నాడు.

అక్కడికి వచ్చీ రావడంతోనే ఆ పిచ్చివాడి దృష్టి మంచం మీదున్న కంచం మీద పడింది. 'హి...హి' అంటూ ఒక్కదుటున ఉరికాడా వైపు.

అతడి వాలకాన్ని పసిగట్టిన మొండయ్య ఏం చేస్తాడోననే భయంతో తన మంచం కిందున్న చేతి కర్రనందుకుని పిచ్చోడిని బెదిరించాలని ప్రయత్నించబోయాడు.

ఒక చేతిలో పళ్ళెం ఉండడంతో ఆ కర్ర చేతికి అందలేదు .

ఆ దృశ్యం కంటపడగానే బక్కయ్య నడక వేగం హెచ్చించాడు.

ఆ పిచ్చివాడు చప్పున మంచం మీదున్న కంచాన్ని అందుకుని అన్నం కలుపుకోకుండానే అరచేత్తో ఆబగా నోట్లో కుక్కుకుంటున్నాడు.

కూచున్న చోటునుండే మొండయ్య వాడిని అదిలిస్తున్నాడు. అదేమీ పట్టించుకోలేదా పిచ్చోడు. బెదురు లేకుండా తన తిండి ధ్యాసలో తానున్నాడు.

మామ అరుపుకి ఎంగిలి చేత్తో సూరమ్మ బయటకు వచ్చింది.

"నీ మొల్తాడు దెంప.. నీకిదేం పోయేకాలం రా. మా కొంప మీద పడ్డావ్" కోపంతో ఊగిపోతూ మంచం కిందున్న కంక కట్టెను వంగితీసి ఒక్కటంటించబోయిందామె.

అప్పటికే మంచం చెంతకు చేరుకున్న బక్కయ్య అడ్డుపడి వారించాడు.

భార్య విస్తుపోయింది. మొండయ్య నిశ్చేష్టుడయ్యాడు.

ఆ పిచ్చోడు ఎవర్నీ గమనించే స్థితిలో లేడు. ఓ వైపు నోటి నుండి సొల్లుకారుతూనే ఉంది. మరో వైపు చేతిలో కంచాన్ని ఎవరు లాక్కుంటారోనన్న అభద్రతా భావంతో గబగబా మెతుకుల్ని నోట్లో కుక్కుకుంటూనే ఉన్నాడు.

మానసికంగా అతడు పిచ్చోడే అయినా ఆకలికి తెలుసు అన్నం రుచెరగక రెండురోజులైందని.

"దొంగ లం..కొడకా! ఇక్కడున్నావా?" అంటూ పరుగెత్తుకొచ్చాడు చాయ్ హోటల్ కిష్టయ్య.

పిచ్చివాడిని వెంబడిస్తూ పరుగెత్తిన అలసటతో క్షణం సేదతీరి చేతిలోని కట్టెతో ఆ పిచ్చివాడిని బలంగా అందుకోబోయాడు.

అతడి ప్రయత్నాన్ని అడ్డుకున్నాడు బక్కయ్య.

"ఓ బక్కన్నా ఈడి సంగతి తెలుసా? డబల్ రొట్టి అందుకుని ఉరికొచ్చిండు. మొన్నేమో చాయ్ గ్లాసులు పగుల గొట్టిండు. నా కొడుకు ఏడినుండొచ్చిండోగాని గిట్ల తిండి దొంగతనాలు జేయవట్టె. కంచం తీసుకుని తింటున్నా మౌనంగున్నవేంది బక్కన్నా?" కిష్టయ్య విషయమంతా ఏకరువు పెడుతూ ప్రశ్నించిండు.

"ఏ బియ్యపు గింజ మీదైనా తినేటోడి పేరు రాసిపెట్టి ఉంటుందంటరు. రైతు పండించే పంటే రైతు ఆకలి తీరుత్తలేదు. మన సేతుల ఏముందని.. ఆడు సేసిన దొంగతనానికి నీకెంత నట్టమైందో నా కాతా కింద జమచేసుకో కిష్టన్నా" ముందటి కోపాన్ని ఉపశమింప చేసే ప్రయత్నం చేసాడు బక్కయ్య.

"నా కిస్తవు సరే. ఊర్లో అందరికిస్తవా? ఈడ్ని నాలుగు తన్ని తరిమేయక. ఊరికంటిన శని వదిలిపోతుంది" అంటూ కోపంతోనే వెళ్ళిపోయాడు హోటల్ కిష్టయ్య.

"రొండురోజులయితందంట ఈ పిచ్చోడు ఊరికొచ్చి. మన సాకలి లచ్చిమి చెప్పిందని" భర్తతో చెప్పింది సూరమ్మ.

"అవునవును ఎరికయ్యింది. ఈడిది మ్యాడంపెల్లి అట, పోయినేడు కరువు కాటుకి తెగ అప్పులు సేసిన రైతన్నలెందరో సనిపోయిరి. సూసినవా రైతు గోస.

ఎవలకు పట్టింది?

వీడూ అదే బాపతి. నాలాగ రైతు. కర్మకాలి పిచ్చెక్కింది. ఊర్లు పట్టుకు తిరుగుతున్నడు.

పేరుకే రైతు 'బిడ్డ' ఆదరించే 'తండ్రి'లేడు. "

బక్కయ్య ఆవేదనలో ఆవేశం ధ్వనించింది.

ఆ పిచ్చోడు రైతు అని తెలిసి విస్మయానికి లోనయ్యారు మామా, కోడళ్ళు.

"నాలుగు మెతుకులు కోసమే మనిషి ఆరాట పడుతున్నడు. పోరాటం సేత్తున్నడు. ఆ నాలుగు మెతుకుల కోసమే ఒకనాడు రైతు అయిన ఈ పిచ్చోడు అలమటిస్తున్నడు సూసినవా? నాలుగు మెతుకులు దొరికిన మరో మనిషేమో - కీర్తి, కాంత, ధనం, అధికారం కోసం తాపత్రయపడుతున్నడు."

పెనిమిటి తెలివికి అబ్బుర పడింది సూరమ్మ. పెగా బక్కయ్య రైతు సంఘం మెంబరు. జమాన్ల ఆరోతరగతి చదివాడు. తెలివైనవాడు.

"బంగారం సంపాదిస్తున్నోళ్ళెవలూ బంగారాన్ని కొరుక్కు తినరు. నోట్లకు నోట్లు నాలుగు మెతుకులు రైతు సెమట బిందువులకు ప్రతి రూపాలా గింజలు" ఆగాడు.

"పోన్లే అయ్య. గింత ముద్దపెట్టే భాగ్యం దక్కింది మనకు. గా రైతుకు గీ రైతు గొంత సాయం జేసిండనుకొ" భర్త మనసెరిగి బక్కయ్యను వెనకేసుకొచ్చింది సూరమ్మ.

మామిడి తొక్కుతో సహా తినేసి, కంచాన్ని ఆబగా నాకేస్తున్న పిచ్చోడి వంక జాలిగా చూస్తూ "ఇంకొంచెం అన్నముంటె ఎయ్యరాదమ్మ" చెప్పాడు బక్కయ్య.

"లేదయ్య ఉన్న కాడికి పిల్లలు తినేసిండ్రు" నొచ్చుకుందా ఇల్లాలు.

కంచాన్ని నాకి నాకి దాన్ని కసిగా నేలకేసి కొట్టాడా పిచ్చోడు. అతడి ఆకలింకా తీరినట్టు లేదు. చేతికంటిన నాలుగు మెతుకుల్ని నాలిక బయట పెట్టి నాకాడు.

మంచం మీద తండ్రి పక్కనున్న నీళ్ళ చెంబు అందుకున్న బక్కయ్య ఆ పిచ్చివాడికి సైగ చేసాడు

'హి...హి..' అంటూ దగ్గరకొచ్చి వంగి దోసిలి పట్టాడు తాగడానికి.

చెంబు వంచాడు బక్కయ్య. ఏకబిగిన నీళ్ళన్నీ తాగేసి ఎంగిలి చేతిని చిరిగిన అంగీకి రుద్దుకుంటూ పరుగెత్తి పోయాడక్కడి నుండి.

బావి దగ్గరకు పోయి అప్పుడు ఎంగిలి చేయి కడుక్కుంది సూరమ్మ.

అదిగో అప్పుడయ్యింది బక్కయ్యకు నిజమైన ఆకలి.

కానీ సాటి రైతుకి ఈ రకంగానైనా సాయం చేయగలిగానన్న తృప్తి. ఓ రైతన్నకు ఓ పూటైనా తిండి అర్థాకలైనా తీర్చగలిగానన్న సంతృప్తి బక్కయ్య ఆకలిని మరిపించింది.

పిల్లలు పిలుస్తుంటే లోపలికి కదిలింది సూరమ్మ.

కొడుకు మంచితనం తెలిసినా ప్రత్యక్షంగా అతడి మానవత్వం చూస్తున్న మొండయ్య కంటి తడి అయ్యింది.

పసిపిల్లాడిలా తన పక్కన కూర్చున్న బక్కయ్య వంక ప్రేమగా చూసాడు సగంలో తినడం ఆపిన అన్నాన్ని కలిపి అనురాగంతో ఓ ముద్ద బిడ్డ నోటి కందించాడు.

ఒక మనిషి తన పేగు బంధానికి కరిగిపోవడం ఏమంత గొప్పకాదు. మానవ సంబంధానికి గుండె కదిలి పోవడం అందరికీ సాధ్యం కాదు.

తండ్రి వాత్సల్యానికి కరిగిపోతూ –

నోటితో ఆ బుక్కనందుకున్నాడు.

మొండయ్య తిరిగి మరో ముద్ద కలపసాగాడు.

రైతు సంఘానికి ఆ పిచ్చి రైతు విషయం చేరవేసాడు బక్కయ్య.

సమావేశం ఏర్పాటు చేయించాడు. అందరితో చర్చించాడు. సంఘం తరపున అతడిని ఎర్రగడ్డ హాస్పటల్‌కి అప్పచెప్పాలని తీర్మానించారు.

అలాగే, ఆసరా కోల్పోయిన పిచ్చివాడి కుటుంబానికి ఓ ఆధారం చూపే ప్రయత్నానికి కూడా నడుం బిగించింది రైతు సంఘం.



# కథా కౌముది

## వినాశాయచ దుష్కృతాం — కల్లూరి శ్యామల

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

రాత్రి తొమ్మిదవస్తున్నది. మాలతి ఇంకా ఇంటికి రాలేదు. రోజూ ఏడూ ఏడున్నరకల్లా వచ్చేస్తుంది. ఈ రోజు ఒక స్నేహితురాలి పుట్టినరోజని లేటవుతుందని చెప్పింది. మధ్యాహ్నం శలవు పెట్టి ఇంకో అయిదారుగురు స్నేహితులతో కలిసి సినిమా చూసి, డిన్నర్ చేసి ఇంటికొచ్చేసరికి లేటవుతుందని ఫోన్ చేసి తల్లికి చెప్పింది. అయినా రజనికి కాళ్ళూచేతులూ ఆడటంలేదు. 'ఏమిటో ఈ పార్టీలు, డిన్నర్లు, ఎవరింట్లోనన్నాకలుసుకుని పార్టీలు చేసుకోవచ్చును కదా! పార్టీలుండాలి, సినిమాలుండాలి, డిన్నర్లు కావాలి– మళ్ళీ మళ్ళీ శలవులుపెట్టడం కుదరదుకనుక అన్నీ సరదాలు ఒకరోజులోనే తీరాలి. అందరూ అమ్మాయిలేనా అబ్బాయిలు కూడా వున్నారా? అబ్బాయిలుంటే కనీసం లేటయితే ఇంటిదగ్గర దింపుతారు' ఇంట్లోకీ బయటకీ తిరుగుతూ రకరకాలుగా ఆలోచిస్తోంది. వెధవది, లేటయితే ఈ వూళ్ళో ఏడు దాటితే ఆడపురుగులుండరు బస్సుల్లోను, రోడ్లమీద కూడా! ఆఫీసంటే వేరు లేటయిన రోజుల్లో ఆఫీసు కార్లు వస్తాయి, గుమ్మంలో దింపుతాయి. భయముండదు అసలు. ఇప్పుడు ఇంటికొచ్చేదాకా శాంతి వుండదు. భర్త ఇంట్లో కూడా లేడు వుంటే వేరు. కాస్త బస్స్టాపు దాకా వెళ్ళి చూసి వస్తాడు. ఖాళీ వుంటే ఎక్కడికెళ్ళిందో అక్కడికెళ్ళి కూడా ఇంటికి తీసుకొచ్చేస్తాడు. అసలు లేటు నైటు పార్టీలకెళ్ళద్దని ఆంక్షలు విధిస్తాడుకూడా! ఛాంధసభావాలని కాదు; ఎప్పుడూ మనజాగ్రత్తలో మనంవుంటే మహానగరాలలో తర్వాత విచారించాల్సిన అవసరముండదని చెప్తూ వుంటాడు. లేట్ నైట్ అంటే మరీ ఒంటిగంట రెండవుతే వద్దని చెప్పచ్చును. తొమ్మిదికల్లా వచ్చేస్తానంటే వద్దనటం అర్థం లేని పని. మరీ 18వ శతాబ్దంలో లేముకదా! ఇరవై ఒకటవ శతాబ్దంలో కొచ్చి అన్నిటా ముందంజ వేస్తూ చదువులో వుద్యోగంలో పేరు తెచ్చుకుంటున్న కూతురికి ఆమాత్రం స్వతంత్రం ఇవ్వలేకపోవడం అన్యాయమేకాదు, అత్యాచారం అనుకుంటూవుంటుంది రజని. ఆమె కూడా ఈ శతాబ్దానికి చెందిన మహిళ మరి! అల్లా అని భయపడకుండా వుండనూ లేదు. రకరకాల ఆలోచనలతో ఇంట్లోనుంచి బయటికి బయటనుంచి లోపలికి పచార్లు చేయటం మొదలెట్టింది. చేస్తూనే వుంది గంటా గంటన్నరదాకా, సందు చివర మలుపుమీద దృష్టి నిలిపిచూస్తూనే వుంది!

★★★

రఘు జైపూర్ సవాయ్ మాన్సింగ్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి బయటికి వచ్చాడు. ఏడాదికొకసారి అయిదు నక్షత్రాల హోటెల్ లో జరిగే ఈ సమావేశాలలో మిగతా లాభాలమాటెల్లా వున్నా తమ సబ్జక్ట్ కి చెందిన ఎంతోమంది నిపుణుల్నికలవటానికీ వాళ్ళవీ తనవీ

జరుగుతున్న, జరగబోయే పరిశోధనల గురించి చర్చించుకోవడానికి అవకాశాలు లభిస్తాయి. ఈ అవకాశాలు సాధారణంగా మీటింగుల్లో కన్నా తర్వాత జరిగే సోషల్ మీటింగుల్లో ఎక్కువ దొరుకుతాయి. వీటి వల్ల చాలా వుపయోగాలు లాభాలు వుంటాయి. పగలంతా నిటారుగా కూర్చుని వరుసగా పేపర్లు వినడమనే నరక బాధకీ మీటింగులకోసం ఎదురుచూడటం ఒక ఆశాకిరణం లాంటిది. ఈ సమావేశాల్లో అనుకోని స్నేహాలు ఏర్పడతాయి. అప్పటిదాకా పేర్లు మాత్రమేవిన్న వైజానికులు మనుష్యులలాగా కన్పడతారు.మర్నాడు సెషన్స్ ఒకపూటే వున్నాయి. ఆర్గనైజర్లు మధ్యాహ్నం వైల్డ్ లైఫ్ సాంక్చ్యురీ కి బస్ సమకూర్చారు అందరూ ఆటవిడుపు లాగా వెళ్దామని నిశ్చయించుకున్నారు. కుటుంబాలతో వచ్చినవాళ్ళు భార్యా, పిల్లలతో రావటానికి ఉత్సాహంగా ప్రణాళికలేసుకుంటున్నారు. అన్ని నిర్ణయాలు ప్రణాళికలు అయ్యాక రఘు గుడ్ నైట్ చెప్పి రూమ్ కెళ్ళిపడుకున్నాడు. అతనికి చాలాకాలంగా తెలిసిన మిత్రులు ముగ్గురు కాన్ఫరెన్స్ కి వచ్చారు.

మర్నాడు వాళ్ళ బస్సు వైల్డ్ లైఫ్ సాంక్చ్యురీ చేరగానే అప్పటినుంచి నాలుగైదుగంటల పాటు చదువులనీ, పేపర్లనీ, రిసెర్చినీ, విద్యార్థులనీ, వారివారి సంస్థాగత రాజకీయాలని మర్చిపోయి హాయిగా చిన్నపిల్లల్లా ఆ సాంక్చ్యురీ చూస్తూ ఆనందించారు. అక్కడ చూడటానికి వచ్చిన జనభాలోగూడా పిల్లల సంఖ్య ఎక్కువ కావటంతో ఆ ప్రాంతమంతా వాళ్ళ కేరింతల, కేకల ధ్వని, ప్రతిధ్వనులతో నిండిపోయింది. ఆ ఆనంద సంరంభాలకి తోడయి పెద్దలజోకులు మరింత కోలాహలాన్ని సృష్టించాయి. ఇలాంటి మార్పులు మానవజీవితానికి అప్పుడప్పుడవసరమని అందరికీ అర్థమయిపోయింది. అందరూ నవ్వుకుంటూ జోకులేసుకుంటూ సాంక్చ్యురీ బయటవున్న టీస్టాల్ కేసి నడిచారు. టూరిస్టులందరూ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోతుంటే వీళ్ళు మాత్రం బస్సు డ్రైవర్ రావటానికి ఇంకా టైముండటంతో టీ తాగటానికి ఇక్కడికి చేరారు. తెలియని వూరు.. చీకటి పడకుండా వెళ్ళడం మంచిదనుకున్నారు. మరి ఈ డ్రైవరు ఎప్పటికి వస్తాడో అనుకుంటూ అందరూ కబుర్లలో పడ్డారు. టీకి ఆర్డరిచ్చి హుషారుగా వాళ్ళుతీసిన ఫొటోలు ఒకరికొకరికి చూపించుకుంటూ ఇంటిదగ్గరి పిల్లలకి చూపిస్తే తమని తీసుకెళ్ళలేదని వాళ్ళేలా ఫీలవుతారో వాళ్ళకెలా నచ్చచెప్పాలో అని ఆలోచనలు చేసుకుంటూ కబుర్లలో పడ్డారు. టీ కోసం ఎదురుచూపుల మధ్య వాళ్ళ కబుర్లు కొనసాగుతున్నాయి. పిల్లల్ని తీసుకుని మళ్ళీ ఇక్కడికి రావాలని రాఘవ లాంటి వాళ్ళు నిశ్చయించేసుకున్నారు. ఆప్పుడు ఉన్నట్టుండి ఒక చిన్నకేక! ఎవరిదో గొంతు నొక్కేస్తుంటే పూర్తిగా బయటికి రాలేకపోతున్న ఒక పొలికేక అది! విన్నామా లేదా అన్న మీమాంసలో పడ్డట్టు అందరూ ఒక్క నిమిషం నిశ్శబ్దమయి పోయారు. మళ్ళీ అదే కేక! ఇంకొంచెం పెద్దగా అదేకేక! చుట్టూ చూసారంతా కొంచెంభయం కొంచెం కుతూహలంనిండిన మనస్సులతో.

అర్థమయింది ఆకేక ఆ టీస్టాలు లోపలనుంచే వస్తోంది.వాళ్ళంతా బయట అమర్చిన కుర్చీలలో కూర్చుని వున్నారు. రాఘవ లోపలిదాకా వెళ్ళి తొంగి చూసి చటుక్కున వెనక్కి వచ్చేసాడు."ఏమిటి? ఏమిటి?" అందరూ అడుగుతూ అతని చుట్టూ చేరారు.

"ఎవరో అమ్మయిని... నలుగురు వెధవలు..."

"పదండి చూద్దాం" ప్రసన్న వెంటనే లేచాడు.

రాఘవ ఆపేశాడు, "వద్దు, వద్దు, వాళ్ళ చేతుల్లో ఇనపకమ్మీలున్నాయి. చుట్టూరా స్టోర్ లాగుంది అనేక రకాల కర్రలున్నాయి. మనం వెళ్ళలేం. వెళ్ళినాక్షేమంగా వెనక్కి రాలేం"

"అల్లా అని ఆడపిల్లని వదిలేస్తామా ఆమృగాలకి. ఏమవుతుంది. ఇంతమందిమున్నాముకదా! పదండి" ప్రసన్న తొందరపెట్టాడు.

"వద్దు ప్రసన్నా మనకి తెలిసిన వూరూకాదు. కావాలంటే పోలీసులకి ఫోన్ చేద్దాం.వాళ్ళే వచ్చి చూస్తారు. పదండి పోదాం" బస్సుకేసి నడిచారు కొందరు. రాఘవ, మరికొందరు అనుసరించారు . టీ గురించి అందరూ మర్చిపోయారు ఆ ఖంగారులో.

"మీరెళ్ళండి. మీ వెనకాలే వస్తాను" అన్నాడు ప్రసన్న.

"వద్దు. అందరం కలిసే వెళ్దాం" రాజారాం అనే మరో అతను.

ఈ లోపున స్పృహతప్పి రక్తం ఓడుతున్న ఒక పది హేను పదహారేళ్ళ ఆడపిల్ల శరీరాన్నిబయటకి మోసుకొచ్చి ఇంతమందిని చూసి అక్కడే పడేసి వెనక్కి తిరిగిచూడకుండా పారిపోయారా గూండా వెధవలు. రక్తసిక్తమయిన ఆశరీరాన్ని చూస్తే అందరికీ కడుపుల్లో దేవినట్టయింది. ఆమెని రక్షించటానికి వెళ్ళాలా వద్దా అనే మీమాంసలో సమయం వృధా చెయ్యకుండా వుంటే బహుశ ఆమె పరిస్థితి ఇంత అధ్వాన్నంగా వుండివుండేది కాదేమో! అందరికీ మనస్సుల్లో ఒక అపరాధ భావన శంక. ప్రసన్న అయితే అందరికేసీ చాలా కోపంగా చూస్తున్నాడు, మీరే భాధ్యులన్నట్టు. చలనంలేని ఆ బాలిక శరీరాన్ని బస్సులో ఎక్కించి హాస్పిటల్ కి పోనియ్యమని డ్రైవర్ని కోరారు. ఆఘ మేఘాలమీద బస్సు హాస్పిటల్ చేరింది. ఆ బాలికని చేర్పించాలని దిగారందరూ! అయితే అది ఒక ప్రైవేట్ హాస్పిటల్ అనీ మెడికో లీగల్ కేసులు పోలీసు రిపోర్ట్ లేకుండా చేర్చుకోవటం సాధ్యమవదని అధికారులు చెప్పారు. రిపోర్ట్ చేస్తామని మొదటగా ఆ అమ్మాయిని చూడవలసిందిగా కోరారు. అడిగే వాళ్ళందరూ ప్రొఫెసర్లవటంతో చేర్చుకోమనటానికి హాస్పిటల్ అధికార్లకి ధైర్యం చాలలేదేమో, చేర్చుకున్నారు. అయితే అయిదు నిమిషాలలో డెడ్ ఆన్ అరైవల్ స్టాంప్ ఆ శరీరంమీద పడిపోయింది. నిట్టూర్పులతో వెనక్కి వెళ్తూ వాళ్ళ కాంటాక్ట్ అడ్రస్సూ ఫోన్ నంబర్లు ఇచ్చి పోలీస్ స్టేషన్లో రిపోర్టిచ్చి హోటెల్ కొచ్చి పడ్డారు. ఎలా మొదలయిన రోజు ఎలా అంతమయింది! అనుకుంటూ పడుకున్నారందరూ ఆరాత్రి.

మర్నాడు పేపర్లని బట్టి అర్ధమయింది ఆ అమ్మాయి ఆ టీస్టాల్ ఓనరు కూతురు, అప్పుడప్పుడు షాపులో కూచుంటుంది. ఆరోజు వాళ్ళ నాన్న సరుకులు తేవటానికి సిటీకెళ్తే ఒక గంట షాపులో కూర్చోబెట్టి వెళ్ళాడు. అతను బస్సెక్కడం చూశారా దుండగులు. అప్పటికి దాదాపు రెణ్ణెల్లనుంచీ ఆ అమ్మాయిని వెంటబడి వేధిస్తున్నారని ఏడుస్తూ తండ్రి మొరపెట్టుకున్నాడట పోలీసులతో. ముందురోజు ప్రొద్దున్నకూడా దగ్గరికి రావడానికి ప్రయత్నించి తండ్రి చేత తిట్లుతిని వెళ్ళారట! అంతు చూస్తామని గొణుక్కోవడం వాళ్ళ దుకాణంలో పనిచేసే ఒక కుర్రాడు విన్నాడట గూడా. ఆ గూండాలందరూ అక్కడికి  రెండు కిలోమీటర్ల దూరంలోనున్న ఒక భవననిర్మాణానికి వచ్చిన కూలీలు. తండ్రి లేడని అదునుచూసుకుని వెళ్ళారు. అయితే వాళ్ళు లోపల దూరాకా వచ్చిన ప్రొఫెసర్ల గుంపుని వాళ్ళు చూడలేదు. అందుకే ఆపిల్ల శరీరాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. లోపల అరుస్తున్న పిల్ల కరుస్తుందని అనుకోలేదు ఆనలుగురు. వెనకనుంచి పట్టుకుని ఆక్రమించుకోటానికి ప్రయత్నంచేసి ఆ పిల్ల ఎదురుతిరగటంతో ఆమెని వళ్ళుతెలియని కోరికతోను కోపంతోను తీవ్రంగా గాయపరిచారు. ఖంగారు.. పట్టుబట్తామన్నభయం కూడా తోడవటంతో నిర్దాక్షిణ్యంగా ఆ పిల్ల ప్రాణాలు తీశారు.

మర్నాడు ఇల్లుచేరిన రాఘవ ఈ విషయం మర్చిపోలేకపోయాడు. ఇంట్లో ఆడపిల్ల వుండీ తనెలా ఒక చిన్నపిల్లని దాని ఖర్మకి దాన్ని వదిలెయ్యగలిగాడు? అక్కడ అన్ని కర్రలున్నాయని భయపడ్డాడుకాని అవి తమకి వుపయోగించేవి కదా వాళ్ళని చావబాది తరిమికొట్టటానికి. ఈ విషయం అప్పుడెందుకు తట్టలేదు. ప్రసన్న చెపుతూనేవున్నాడు ఇంతమందిముండి తామె నిష్కారణంగా నిర్దాక్షిణ్యంగా ఆ పిల్లనలా వదిలేసాము. అతని మనస్సు పడే మధన కంతులేకుండాపోయింది.

★★★

భర్త అదోలా వున్నాడని కూడా రజని గమనించలేదు. నిశ్శబ్దంగా పనులు చేసుకుంటూ యాంత్రికంగా అందరికీ అన్నీ అమర్చుతూ తన ధ్యాసలో తనుంది. సాయంత్రానికిగాని రఘుకి ఆమె అదోలా వుందని తట్టలేదు. మర్నాడుగాని కాలేజీకి వెళ్ళక్కలేదు. అయిదున్నరకి భార్య ఇచ్చిన టీ తాగుతూ నిన్నటి టీ స్టాలు సంఘటన గుర్తుకొచ్చి ఆమెతో చెపితే కాస్త మనసు తెరిపిన పడుతుందనుకుంటూ "రజనీ, ఒక ఘోరమైన తప్పు జరిగిందోయ్!" అంటూ మొదలెట్టి కథంతా చెప్పుకొచ్చేడు. చెప్పడంతో తన బాధ తీరిందనుకున్నాడు. "ఏమనుకుంటున్నావు? నీభర్త ఒక పిరికిపంద అనుకుంటున్నావా? అసలు అప్పుడు బుర్రలు పనిచెయ్యక ఆలోచనలు

స్థంభించిపోయాయనుకో! టైముకి రియాక్ట్ అయ్యుంటే ఆపిల్ల బతికి బట్టకట్టి వుండేది కదూ!" అంటూ ఆమెకేసి చూసి స్థభించి పోయాడు. చీరకొంగులో ముఖందాచుకుని వెక్కెక్కి ఏడుస్తున్న రజనిని చూసి అవాక్కైపోయాడు. గబుక్కున ఆమెని దగ్గరికి తీసుకుని "ఏయ్ రజనీ ఏమిటిది చిన్నపిల్లలా! నాకు బాధగావున్నమాట నిజమేగాని నిజంగా ఆలోచిస్తే మనం చెయ్యగలిగింది ఏముంది చెప్పు! నువ్విలా అప్సెట్ అవుతావనే ప్రొద్దుటినుంచీ నీకేమీ చెప్పలేదు."

"కాదు, అదికాదు! నేనే మీకొక విషయం చెప్పలేదు" రఘు ఒక్కనిమిషం తెల్లబోయినట్టు చూసాడు. 'ఏదో ఉంది. దానికీ నేనిప్పుడు చెప్పినదానికీ సంబంధం లేదు. రజని బాధిస్తున్న విషయం నేనిప్పుడు చెప్పినది కాదు.'

"రజనీ, రజనీ! అబ్బ! ఉండు ఒక్క నిమిషం ఈ ఏడుపు ఆపి విషయమేమిటో చెపుతావా? నన్ను ఖంగారు పెట్టేస్తున్నావు సుమా, నీఏడుపుతో!" రఘు నవ్వుతూ అనడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు.

రజని అయిదునిమిషాలదాకా తనని తను కంట్రోలు చేసుకోలేకపోయింది. అప్పటిదాకా దిక్కుతోచనట్టు ఆమెనే చూస్తూ వుండీపోయాడు. చటుక్కున గుర్తొచ్చినట్టులేచి ఆమెకి ఫ్రిజ్ లోనుంచి చల్లటి మంచినీళ్ళందించాడు. అవి తాగి కాస్త దుఃఖాన్ని తిప్పుకుని అతనికేసి చూసి ఏడ్పూ నవ్వూకాని కాని ఒక చిన్న నవ్వు నవ్వింది. ఏడ్పే ఎక్కువ ఆనవ్వులో!

"ఏమయింది రజనీ! అందరూ కులాసాయేనా? మీ ఇంటినుంచెమైనా కబురొచ్చిందా, నేను లేనప్పుడు?

'ఎవరికైనా ప్రమాదం జరిగిందా, ఎవరైనా దగ్గర వాళ్ళు పోయారా, ప్రొద్దున్నుంచి ఎందుకు చెప్పలేదు. అసలు తను పట్టించుకోలేదు తనగొడవలో తనుండి. రజని ప్రొద్దున్నుంచి ఒక్క మాట మాట్లాడలేదు.' రఘు మనస్సు పరిపరివిధాలుగా ఆలోచిస్తోంది.

"నిన్న మాలతి ఆఫీసునుంచి ఫ్రెండ్ పుట్టినరోజని లేటుగా వస్తానని చెప్పి వెళ్ళింది. దాని ఆఫీసులో పనిచేసే అమ్మాయే! పేరు పద్మజ. అందరూ కలిసి ఒక అయిదుగురు వున్నారట. ఆఫీసునుంచి హోటేల్ కి వెళ్ళి అక్కడినుంచి సినిమాకి వెళ్ళారట. సినిమానుంచి బయలుదేరేసరికి తొమ్మిదిన్నర అయిందట. కారులో సర్దుకుని అందరూ ఇంటికి బయలుదేరదామనుకుని కారు వుందికదా డిన్నర్ కూడా చేసి వెళ్దామనుకుంటూ ఒక రెస్టారెంట్ లో దూరారుట. వాళ్ళ దారిన వాళ్ళు హేపీ బర్త్ డే లు పాటలు పాడుకుంటూ ఆర్డర్ కోసం వేచి వున్నారట. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్కరకంగా ఆర్డర్ ఇవ్వడంతో రావడం లేటయింది. అక్కడే పదిన్నరయింది. నేను ఖంగారుపడ్తానని నాకు ఫోన్ చేసి చెప్పింది హోటేల్ నుంచి వచ్చే సరికి ఇంకా లేటవుతుందని. అప్పటికే నేనింకా రాలేదేమిటా అని ఖంగారు పడ్తూనే వున్నాను. అయితే కారు వుందని, ఫ్రెండ్స్ ఇంటిదగ్గర దింపుతారనీ ఖంగారు పడద్దనీ మరీమరీ చెప్పింది"

"అసలు లేటు నైట్ పార్టీ లేమిటి వీళ్ళకి? నువ్వు ముందే వద్దనాల్సింది. ఎన్నింటికి వచ్చింది ఇంటికి? రాగానే గట్టిగా చెప్పవా? ఇంకనుంచి ఇల్లాంటివి వద్దు. తెల్లరిలేచాక లక్ష చూస్తున్నాము. అన్నీ మనకే జరుగుతాయని కాకపోయినా మన జాగత్తలో మనంవుంటేప్పేమీలేదు కదా! అసలు రోజులు బాగాలేవు. వూరనిండా పనీ పాటా లేని చిల్లర వెధవలు తెగతిరుగుతుంటారు"

"మీరల్లా అంటారని తెలుసు. అందుకే మీకెల్లా చెప్పాలా అని భయపడి చస్తున్నాను. నా కథ ఇంకా అవలేదు"

"అంటే? ఏమయింది? త్వరగా చెప్పు. ప్లీజ్ నాన్చద్దు. విషయమేమిటో చెప్పు." రఘు లో ఖంగారు పెరిగిపోతోంది.

"ఏమీ లేదు మనపరంగా కథ సుఖాంతమే! మీరు కోపంతెచ్చుకోననీ అతిగా రియాక్ట్ అవనని ఒట్టెయ్యండి ముందు. నాకసలే మీ కోపమన్నా ప్రతిక్రియలన్నా చాలాభయం. వళ్ళు తెలియని ఖంగారులో మీరు ఆవేశపడిపోతే నాకష్టాలు తీరవు సరికదా రెట్టింపవుతాయి."

"సరే, సరే, ఖంగారు పడనులే! ఏమయిందో చెప్పు. ఇప్పుడింక నాకు నిజంగా కోపమొస్తోంది."

"వాళ్ళు తింటున్నప్పుడే చూశారుట ఒక మగపిల్లల గుంపు హడావుడి చెయ్యటం. వాళ్ళ ప్రక్క టేబిల్ ఆక్రమించుకున్నారు. ఇంక కేకలేమిటి, ఒకళ్ళమాట ఒకళ్ళకి వినిపించకుండా అరుపులు, డ్రింకులకార్డరిచ్చి అవి వచ్చేదాకా నానా హడావుడి చేసేస్తూ పెద్ద గలటా

సృష్టించేసారట. వీళ్ళల్లో ఒక అబ్బాయి బాత్రూమ్ కెల్దామని లేస్తే వాళ్ళలో ఒకడు ఆపి 'గురూ మీరు మీఫ్రెండ్స్ కూడా మాతో కలవచ్చు మస్తీ మరింత పెంచుకుందాం. మా గ్రూపులో అమ్మాయిలు లేని లోటు బాగా అనుభవిస్తున్నాం' అన్నాడట. బాగా తాగి వున్న అతన్ని తప్పించుకుని మళ్ళీ తన ఫ్రెండ్స్ తో కలవటానికి వచ్చేశాడట. అందరికీ ఈ విషయం చెప్పి 'కొంచెం ప్రోబ్లమ్ గా వుండేటట్టే వుంది త్వరగా తినేసి పోదాం' అని చెప్పాడట. ఇంతలో వాళ్ళందరూ వచ్చేసి 'ఏం బ్రదర్ మాఫ్రెండ్ పిలిస్తే రావచ్చుకదా! రండి సరదాగా గడపటానికే. మరే దురుద్దేశ్యం లేదు.' వాళ్ళలా అంటున్నా ఏమిటో వాళ్ళ ప్రవర్తనలో ఏదో ఒక అసభ్యత కనిపించి ఆర్డర్ రాకుండానే కాన్సిల్ చేసేసుకుని వెనక్కి బయలు దేరిపోయారట గూడా. దార్లో కార్లో వస్తూ అయిస్ క్రీమ్ బండి కనిపిస్తే డిన్నరెల్లాగో తినలేదుకదా అయిస్ క్రీమ్ తిందాం అని దిగారట. సరదాగా వాళ్ళ హోటెల్ ఫ్రెండ్స్ ని గురించి చర్చిస్తూ ఇద్దరు ముగ్గురు మరో అయిస్ క్రీమ్ కొనుక్కున్నారట. ఇంతలో తుఫాన్లా వచ్చిపడ్డారట వాళ్ళూ హోటేల్ లో వదిలి వచ్చిన గుంపు. ఇంక వేరే మాటకాస్కారమివ్వకుండా ఒకడు పద్మజని ఈడ్చుకుపోవడం మొదలెట్టాడట. ఇద్దరబ్బాయిలు ఆపబోతే వాళ్ళకి బాగా తన్నులు తగిలాయిట. మిగతా వాళ్ళలో మాలతితో సహా ఇద్దరమ్మాయిలు చేతులు పట్టుకుని పారిపోవటం మొదలెట్టారట."

"రజనీ, ఆగు! మాలతి ఏది ఎక్కడుంది?ఇల్లా పిలువు దాన్ని. త్వరగా రమ్మను"

"పిలుస్తాను. ఒక్క నిమిషం. నేను చెప్పేది పూర్తిగా వినండి."

"చెబ్దువుగాని, ముందు దాన్ని పిలు. నేను ఒకసారి చూడాలి దాన్ని."

"అది బాగా అప్సెట్ అయింది. దాన్ని కోప్పడరు కదా! భయపడి పోయింది పిల్ల. ఒట్టేయ్యండి దాన్నేమీ అననని." చెయ్యి చాపింది

"అనననని చెప్పానుగా! పిలువు"

" అదీ... అది ఇంట్లో లేదు హాస్పిటల్ కెళ్ళింది. "

"హాస్పిటల్ కా? రజనీ! నాకెక్కడ్లేని కోపం తెప్పిస్తున్నావు. సంగతేమిటో త్వరగా నాన్చకుండా చెప్తావా? మాలతికేమయింది? బాగానే వుందా లేదా? ఆ వెధవలేమైనా..."

"అయ్యొయ్యో! అల్లా అనకండి. మాలతికేమీ అవలేదు దాని అదృష్టం, మన లేచిన వేళా బాగున్నాయి నిన్న. దాని ఫ్రెండ్ హాస్పిటల్లో చావుబ్రతుకుల్లో వుంది. అక్కడికే వెళ్ళింది.

"పద! మనం కూడా హాస్పిటల్ కి వెళ్ళి దాన్ని దాని ఫ్రెండ్ ని చూసి వద్దాము"

"నేం చెప్పేది పూర్తిగా వినండి."

"వచ్చాక వింటాను. పద ముందు." త్వరగా రడీ అయి ఇద్దరూ హాస్పిటల్కి వెళ్ళారు. వీళ్ళని చూడగానే మాలతి పరుగున వచ్చి తండ్రిని వాటేసుకుపోయి ఒక పట్టాన ఒదలలేదు. రఘు కర్థమయిపోయింది. మామూలుగా ధైర్యస్థురాలయి అన్నిటికీ అడ్డంగా వాదించే తనకూతురు జీవితంలో మొదటిసారి ప్రమాదమేమిటో అర్థంచేసుకుందని, ఇప్పుడు గట్టిగా కోప్పడటం అర్థం లేదనీ అనుకున్నాడు. మాలతి భుజం తట్టి, "భయంలేదురా! డాడీ వచ్చేసారు చూడు. నీకేమీకాలేదు కదూ! పద ఇంటికెల్దాం."

"డాడీ, పద్మజ ఇంకా కోలుకోవాలంటే పదిహేనురోజులయినా పడ్తుందని చెప్పారు డాక్టరుగారు. కొంచెం ఇక్కడే వుండి వాళ్ళకి సాయంగా వుంటాను."

“అల్లాగే వుందువుగాని నాన్నా, ముందు ఇంటికి రా! నీతో కాస్త మాట్లాడాలి. నువ్వు బాగానే వున్నావని గ్యారంటీగా పక్కాగా నిర్ధారణగా తెలుసుకోవాలి. నాతల్లివి కదూ మళ్ళీ వద్దువుగాని."

"సరే, లోపల ఒకసారి చూసేసి వాళ్ళమ్మగారికి నేను వెళ్తున్నానని చెప్పాలి. ఇంకెవరైనా ఇక్కడికి వచ్చేకానే నేను ఇంటికి రాగలను. మీరెళ్ళండి. ఒక అరగంటలో వస్తాను"

"సరే, త్వరగా వస్తావుగా?"

బయటికి వెళ్తూ డాక్టర్ కాబిన్లోకి నడిచి తనని తాను పరిచయం చేసుకున్నాడు. ఆయన వివరంగా పద్మజ కండిషన్ గురించి చెప్తూ పోలిసులు క్లూస్ కోసం చూస్తున్నారని చెప్తూ "మీకు తెలిసిన విషయాలు చెప్పండి. ఇల్లాంటి సంఘటనలు మళ్ళీ మనవూళ్ళో జరుగకూడదు."

"తప్పకుండా! నేను వూళ్ళో లేను. ఈ రోజు ప్రొద్దున్నే వచ్చాను. అయినా మా అమ్మయి ఆ గ్రూపులో ఒక వ్యక్తిగా చెయ్యాల్సిన వన్నీ భయంలేకుండా చెయ్యటానికి నేను సహాయపడ్డాను. ఆ విషయం ఖచ్చితంగా చెప్పగలను."

పోలీసు కంట్రోల్ రూమ్ కెళ్దామనుకుని విషయం అంతా తెలుసుకుని అప్పుడు వద్దామనుకుని వెనక్కితిరిగాడు.

ఇంటికొచ్చాక రజని కథని పూర్తి చెయ్యమని అడిగాడు.

"మాలతి ఒక ఫ్రెండ్ చెయ్యి పట్టుకుని కొంత దూరం పరిగెట్టి అంతా నిశ్శబ్దం అయిపోవడంతో ఆగి ఆగి వెనక్కి తిరిగి చూసారిద్దరూ. రోడ్లన్నీ నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా వున్నాయి. భయపడుతూనే వెనక్కితిరిగారు ఫ్రెండ్స్ ని వెతుక్కోవాలనే వుద్దేశ్యంతో. అక్కడ రోడ్డుమీద పద్మజ అడ్డంగా పడేసి వుంది. ఇద్దరూ అక్కడికి పరిగెట్టారు. రోడ్డు ప్రక్కన వున్న తమ కారు స్టార్ట్ చేసి, కష్టపడి తీసుకొచ్చి ఆస్పత్రికి చేర్చారు. మెడికో లీగల్ కేసు అని ఆస్పత్రి అధికారులే పోలీసులకి కబురెట్టారు. వాళ్ళు ఆక్సిడెంట్ స్పాట్ కెళ్ళి కొంచెం దూరంలో గాయాలతో నడవలేక రోడ్డు ప్రక్కన కూలబడిన ఇద్దరబ్బాయిలని తీసుకొచ్చి ఆస్పత్రిలో చేర్చారు. వాళ్ళు కొంచెంకోలుకుంటే స్టేట్మెంట్ తీసుకోడానికి వేచివున్నారు. అప్పటికే అక్కడికి చేరిన మాలతి వాళ్ళ సాయంతోను ఆస్పత్రి అధికారుల సహాయంతోను పూర్తి నేర చరిత్ర పోలీసులకర్థమయింది. నేరస్థుల స్కెచెస్ రడీ అయ్యాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కథనం ప్రకారం ఈ లీగల్ ఫార్మాలిటీస్ పూర్తి అయి కేసు కోర్ట్ లోకి రావటానికి ఆర్నెల్లయినాపడుతుంది." రజని తన కథ ముగించింది

ఇప్పుడు కోలుకుంటుంది ఇదిగో అదిగో అంటూండగానే నాలుగునెలలు గడిచిపోయాయి. ఖాళీ వుంటే చాలు మాలతి హాస్పిటల్ కెళ్ళి పద్మజ దగ్గర కూర్చుంటోంది. కేసులో ఇంకా చార్జిషీట్ కూడా ఫైల్ అవ్వలేదు. ఏ రాజకీయనాయకులు తెలియకపోవడంతో పట్టించుకునే నాధుడే లేడు. ఒకసారి వాళ్ళని బాధపెట్టి వాళ్ళ జీవితాలని అస్తవ్యస్తం చేసిన వాళ్ళలో ఒకడు ఆస్పత్రికి వచ్చి కేసులు వుపసంహరించుకోమని సలహా ఇచ్చి వెళ్ళాడు. వాళ్ళని ఎవరూ ఇంతకుముందు చూడకపోవడంతో వాళ్ళ రక్షణకోసం వుంచిన పోలీసు కూడా ఎవరో ఆఫీస్ ఫ్రెండ్ అనుకుని లోపలికి వదిలి వేశాడట. మొదటి పదిరోజులు ఎంతో శ్రద్ధగా కాపలా వున్న పోలీసులు కూడా రోజులు గడుస్తున్న కొద్దీ నిర్లక్ష్యం చెయ్యటం మొదలెట్టారు, రోజూ చచ్చేవాడికోసం ఏడ్చే వాళ్ళెవరుంటారు. !!

ఆ వ్యక్తిని లోపల చూడగానే మాలతికీ పద్మజకీ కూడా గుండెలు జారిపోయాయి. నిశ్శబ్దంగా వాడు చెప్పింది విని వెళ్ళనిచ్చి వెంటనే మాలతి పోలీసు కోసం బయటికి పరిగెట్టింది. ఆతను టీ తాగటానికి వెళ్ళాడేమో ఎక్కడా అతాపతా లేదు. బిక్కుబిక్కు మంటూ కూర్చున్నారు ఆ పోలీసు వచ్చేదాకా. తండ్రికి ఫోన్ చేసింది. రఘు పరిగెట్టుకుంటూ వచ్చాడు. వచ్చీరాగానే ఆ పోలీసుని పట్టుకుని బాగాతిట్టాడు.

ఆ పోలీసు విసుగ్గా "చెప్పుకోండి సార్! ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి. ప్రతిరోజూ పనీ పాటా లేకుండా ఇక్కడ కూర్చుంటున్నాను. ఈ ఒక్కరోజు కొంచెం చేంజి కోసం టీ తాగుదామని వెళ్ళనోలేదో ఎవడో వచ్చాడని మా టాపు లేపేస్తున్నారు. వాడెవడో మాకు ముందెలా తెలుస్తుంది?"

"తెలీదు! నేనొప్పుకుంటాను కానీ కనుక్కోవల్సిన బాధ్యతమీకుంది. లేకపోతే ఇక్కడెందుకుండటం మీమీ ఇళ్ళల్లో మీరుండండి. ప్రభుత్వధనాన్ని వృధా చెయ్యకుండా ఆదా చేసినవాళ్ళవుతారు." విసుగ్గా అని "మీ ఎసి పి తో మాట్లాడతానులెండి." అని కదిలాడు.

ఇంటి కెళ్ళగానే ఈ విషయం చెప్తే "పోలీసులతో గొడవ పెట్టుకుంటే నష్టపోయేది మనమే! జాగ్రత్తగా వుండండి. రేపొద్దున్న కేసు నడిపేది వాళ్ళే" రజని హెచ్చరించింది. అదీ నిజమే అనుకున్నాడు ప్రొఫెసరు గారు. తన కళ్ళముందు కదులుతూ కాన్ఫరన్స్ కెళ్ళినప్పుడు చూసిన ఆడపిల్ల శవం వెంటాడకపోతే అంతగా తన కూతురి స్నేహితురాలి గురించి పట్టించుకునేవాడు కాదేమో! ఇప్పుడు సాయంచెయ్యగలిగిన వాళ్ళు మనకెందుకొచ్చిన గొడవలే అని తప్పించుకోవాలని చూడకపోతే ఆడపిల్లలమీద ఇన్ని అత్యాచారాలు జరగవనే సత్యం అర్థమయ్యి ఎల్లాగైనా దీని అంతు చూడాలనుకున్నాడు. ఆరోజు పద్మజ స్థానంలో తనకూతురు వుండి వుండేది. అదృష్టం బాగుండి తప్పించుకుంది.

తర్వాత జరిగిన రోజులు వాళ్ళ కుటూంబానికి ఒక పీడకల అని చెప్పాల్సిందే! ఆరోజు తమపిల్లల్ని అటాక్ చేసిన గుంపులో ఒకడికి ఎక్కడో రాజకీయ నాయకులతో సంబంధం వుండటంతో వాడు మాటి మాటికి వచ్చి సలహాలివ్వటం క్రమక్రమంగా బెదిరింపులలోకి దిగటంతో రఘు పోలీసు కమిషనర్ దగ్గరికి వెళ్ళాల్సివచ్చింది. అతను మాట్లాడటం మర్యాదగా మాట్లాడినా కార్యాచరణలోకి వస్తే తక్కిన పోలీసు కానిస్టేబిల్స్ కంటే కనాకష్టం అని అర్థమయిపోయింది రెండోసారి వెళ్ళగానే! ఇంక కోర్టులే గతి! ఎప్పుడు కేసు కోర్టులోకొస్తే అప్పుడే ఈ సమస్యలు ఒక కొలిక్కి వస్తూ దర్శనమిస్తాయని ఎదురుచూడసాగారు కుటుంబమంతా!

అనుకున్నరోజు వచ్చింది. ముందురోజు రాత్రి ఖంగారధికమయిందో ఏమో ఆ కుర్రాడు ఆస్పత్రికి మళ్ళీ వెళ్ళాడు. ఈసారి తల్లి వుండటంతో విజృభించి కత్తి చూపించి బెదిరించి మరీ వెళ్ళాడు. అది చూసిన పద్మజ మరీ గాభరా పడిపోయింది. తెల్లారేసరికి పరిస్థితి విషమించింది.

కోర్ట్ లో హియరింగ్ మొదలయిన రోజు ప్రాసిక్యూషన్ లాయర్ సహాయంతో రఘు, పద్మజ తండ్రి ఈ విషయం న్యాయాధీశుడి నోటీసులోకి తీసుకెళ్ళారు. కోర్ట్ ఈ అమ్మయిలిద్దరికీ రక్షణ కల్పించవలసినదిగా ఆదేశిస్తూ పోలీసు అక్కడ కాపలా వుండగా ఆ కుర్రాడు లోపలికి ఎల్లా వెళ్ళగలిగాడని ప్రశ్నించారు.

విచారణ మొదలయిన మూడోరోజు ఆస్పత్రిలో పద్మజ అనుకోకుండా కన్నుమూసింది. ఆ అమ్మాయి కుటుంబం సరేసరి రఘు కుటుంబంకూడా పూర్తిగా చితికిపోయినట్టయ్యారు. అప్పుడు అనుకోకుండా నగరం అంతా నిద్రలేచింది. టివిలలోను పేపర్లలోను ఈ వార్త సంచలనాన్ని సృష్టించింది. అందరూ మళ్ళీ సంఘటన అప్పుడే జరిగినట్టు స్పందించారు. కోర్టుకూడా ఆరోజునుంచి రోజు రోజూ హియరింగులతో త్వరగా కేసు ముగించాలని చూశారు. పట్టుకున్న కుర్రాళ్ళ సహాయంతోను ఆ రోజు వీళ్ళతో పార్టీకి వెళ్ళిన సహాయంతోను మాలతి సాక్ష్యంతోను చివరికి ముద్దాయిలకి పడవల్సిన శిక్ష పడింది. చివరికి పద్మ మృత్యువు సంఘటన జరిగిన దాదాపు నాలుగు నెలల తర్వాత షాక్ కారణంగా జరగటంతో ఎవరికీ మరణశిక్ష పడలేదు. తర్వాత కూడా బెదిరించిన వాడికి ఆమరణ జైలు మిగతా ఇద్దరికీ ఏడేళ్ళ శిక్ష విధించారు.

ఆ రోజు ఒక పత్రికా విలేఖరి అడిగిన ప్రశ్న మీరీ శిక్ష సరిపోతుందని అనుకుంటున్నారా అని అడిగితే మాలతి ఒకటే విషయం చెప్పింది. "అందరూ నేరం జరిగిన తర్వాత ఏమి శిక్ష పడాలా అని మాత్రం ఆలోచిస్తారు. ఇల్లాంటివి మళ్ళీ జరుగకూడదనుకుంటే ముందుచూపుతో ఆలోచించటం ముఖ్యం. ఒకనేరం జరగటం ఎంత గర్హనీయమో నేరం జరుగుతుంటే మనకెందుకని వెళ్ళిపోవటం అంతకుమించిన నేరం. చుట్టూ వున్నవాళ్ళు నలుగురైనా వాళ్ళనెదుర్కొంటే ఇంత తీవ్ర స్థాయిలో నేరాలు జరుగవు. ఇంతకూ ఆ బెదిరించిన

వాడి బాక్ గ్రౌండ్ ఏమిటీ అని ప్రశ్నించు కుంటే ఈ నేరం అంత అకస్మాత్తుగా జరిగిందికాదని ఆలోచించి ప్లాన్ చేసి చేసినదని అర్థమవుతుంది. వాడు మూణ్ణెల్లనుంచీ పద్మని విసిగిస్తున్నాడని నేను కోర్టులో సాక్షం ఇచ్చేదాకా ఆమె తల్లిదండ్రులికి గూడా తెలియదు. ఆమె వ్యతిరేకించిందనే ఆమెని గాయపర్చాడని ఋజువయ్యింది. అందుకే వాడికి ఆమరణ జైలు శిక్ష పడింది. వాడిపరంగా ఆలోచిస్తే తనకి కావాల్సిన అమ్మాయిని ఎంచుకునే అధికారం స్వతంత్రం వున్నాయనుకున్నాడ. పదవిలోవున్న రాజకీయనాయకుడి కొడుకు. తండ్రి ఏనాడు కావాలని అడిగినదేది కాదనలేదు. అందుకే ఆలోచనలేకుండా అహంకారంతో వ్యవహరించి పద్మకీ ఆమె కుటుంబానికే కాక తనకి తనకుటుంబానికి కూడా తీరని నష్టం కలిగించాడు. కావల్సినవాళ్ళని ఎన్నుకోవటానికి తనకి అధికారం తనకి వున్నట్టే అమ్మాయిలకి కూడా వుంటుందన్న కనీస జ్ఞానంలేకపోవడంవల్ల ఈ నష్టం జరిగింది." అని ముగించింది.

రఘు తర్వాత అనుకున్నాడు ఎంత కరెక్టుగా చెపింది తనకూతురు. తన కళ్ళముందు తాము వెంటనే ముందుకు వెళ్ళకపోవడంవల్ల ప్రాణాలుకోల్పోయిన అమ్మాయి కదిలినన్నాళ్ళు నా అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా మరే నేరం జరగవు అనుకున్నాడు కూడా!

.



కథా కౌముది

# కాకి రామం

కొట్టం రామకృష్ణా రెడ్డి

అడవిలో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. కలకలం రేపిన కలవరమా!

కల – వరమా !!

మెదడు ఘనీభవించినట్లైంది. ఆ వార్త కాసేపట్లో దావానలమే అయ్యింది.

చిగురించే చివురునడిగినా, పూసే పువ్వు నడిగినా, కాసే కాయనడిగినా ... ఎవరి నోటైనా అదే మాట.

తలచుకుంటేనే ఒళ్ళు పులకరిస్తోంది. ఎంతో అదృష్టం చేసుకుంటేనేగాని లభించని గొప్ప అవకాశం. చెట్టునూ, పుట్టనూ, పిట్టనూ ... చివరికి ఏ మెట్టనడిగినా అదే వూసు.

సెలయేరు ఆనందం పట్టలేక గంగ వెర్రులెత్తింది. కబురు తెచ్చిన పావురాయిని వెయ్యినోళ్ళ పోగిడారందరూ.

రాముడొస్తున్నాడు !

సీతారాముడొస్తున్నాడు !!

కలలోనైనా అనుకోలేదు రాముడ్ని చూస్తామని. రాముడినే కాదు ... సీతమ్మ తల్లినీ, లక్ష్మణుల వారిని చూడబోతున్నామన్న ఊహే పులకింతలు రేపుతోంది.

మాత కైకేయి కోరిక అయోధ్యావాసుల పాలిట దు:ఖహేతువైనది. అదే మా పాలిట వరమైనది .

ఈ శుభవార్త విన్నవెంటనే నాకైతే రెక్కలాడలేదు. గాల్లోకి ఎగరాలనిపించట్లేదు... ఏ కొమ్మపైనా వాలాలనిపించట్లేదు.

ఎప్పుడెప్పుడు రాముడ్ని చూస్తానా అనే ధ్యాసలో ఆకలిదప్పులు మరచిపోయాను. ఒక దగ్గర కూర్చోలేకపోతున్నాను. ఎవరితో పంచుకోను ఈ ఆనందాన్ని ... ఎవరికి చేబుదామన్నా, అందరికీ తెలిసిన విషయమే నాయె .

ఈ రోజు తెల్లవారుజామునే రావిచెట్టు పై కూర్చొని ఊబుసుపోక అరిచాను. అందరికీ నిద్రాభంగమై నా వంక చిరాగ్గా చూసారు. ఆ విషయం గుర్తొచ్చి ఇప్పుడందరూ నా వంక మెచ్చుకోలుగా చూస్తున్నారు, నిజంగా నా అరుపు మంచి శకునమే అన్నట్టు.

పశు, పక్ష్యాదులన్నీ తారతమ్యాలు మరచి గుంపుగా చేరి ఆనందాన్ని పంచుకుంటున్నాయి .

అందరూ తమతమ శాయశక్తులా ఆ రఘురాముడి స్వాగతపు ఏర్పాట్లు చేయసాగారు. ఉడతలన్నీ ఉరకలేస్తున్నాయి. లేళ్ళన్నీ గంతులేస్తున్నాయి. కోయిలలన్నీ కంఠాల్ని సవరించుకుని తమ బృందగానంతో రాముడికి స్వాగతం చెప్పడానికి సమాయత్తమవుతున్నాయి. తమ తమ నృత్యాలతో సీతమ్మని అలరించడానికి నెమళ్ళన్నీ సాధన మొదలెట్టాయి.

చిలకలన్నీ అప్పటికప్పుడు ఒక చెట్టుపై అత్యవసర సమావేశమేర్పరచుకొని, తమ పేర్ల ముందు ' రామ' శబ్దాన్ని చేర్చి 'రామచిలక'లనిపించుకోవాలని తీర్మనించేసాయి .

క్రూర జంతువులైతే లక్ష్మణుడి శరాఘాతాలు తలచుకుని, రాముడిని చూడాలన్న కోరికని బలవంతంగా అణచుకొని సుదూరతీరాలకి వలసెల్తున్నాయి.

రాణి ఈగ తన సేవకులకి ప్రత్యేక ఆజ్ఞలను జారి చేసినట్లుంది, తెనేటిగలన్నీ ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ... తమ పనివేళలని ఇంకాస్త పెంచుకుని తేనే పట్టులను కూర్చే పనిలో పడ్డాయి. కాకపోతే చిటారు కొమ్మన కట్టాల్సిన గూళ్ళని చేతికందేంత ఎత్తులోనే కట్టసాగాయి.

ఆ సీతారాములకి సేవ చేసుకునే భాగ్యాన్ని ఎవరు మాత్రం వదులుకుంటారు?

మధుర ఫలాలనిచ్చే చెట్లన్నీ తమ వేర్లని భూమిలోకి మరింత లోతులకి చొప్పించి, మరిన్ని తీయని పండ్లని కాసే పనిలో నిమగ్నమయ్యాయి .

పండగ వాతావరణం నలువైపులా విస్తరించింది.

త్రయంబకంలో పుట్టిన గోదారికెలా తెలిసిందో రాముడు సతీసమేతంగా వస్తున్న విషయం ... హొయలుబోతూ ప్రవాహాన్ని అడవిలోని సువాసనలు వెదజల్లే చెట్ల వేర్లని తాకుతూ పంచవటి వైపు పరుగులు పెట్టసాగింది.

వసంతపు గాలి చల్లగా, తిన్నగా వీయక, అడివంతా కలియదిరిగి...సువాసనలిచ్చే సుమధుర పుష్పాల మీదుగా పయనిస్తూ ... ఇంకా రాముడి దర్శన భాగ్యపు విరహాన్ని తట్టుకోలేక, తనే అతడి దారికి ఎదురెళ్ళింది.

ఆ కౌసల్యా తనయుడిని నేనెలా స్వాగతించగలను!? రఘుకుల తిలకుడి సేవలో నేనే విధంగా పాల్గొని తరించగలను.

మామూలు కాకినైపోతిని గదా !!

మధుర ఫలాలనందించాలనే ఉంది, కానీ ... 'కాకెంగిలి' అంటారే? ఎలా? ఆ సీతాపతిని నేనెలా సేవించుకోను?

ఒక్క కొమ్మపై కుదురుగా కూర్చోలేక పోతున్నాను. పదే పదే చూపులన్నీ ఉత్తరదిక్కుకు మరలుతున్నాయి.

ఎలా ఉంటాడు నా రాముడు? ఎలా ఊహించుకోను?

అందరూ రాముడు నల్లనివాడంటారు, అంటే... నా రంగుంటాడా? నా రంగుని చూసి అందరూ ఈసడించుకుంటారే ..

మరి నా రంగున్న రాముడు అందరికీ ఆరాధ్యుడు ఎలా అయ్యాడు? నా రంగుకే నేను ఉపమానమై కాకి నలుపంటారే మరి నా రంగున్న రాముడు నలుగురికీ ఆత్మీయుడు ఎట్లా అయ్యాడు?

ఆలోచనలన్నీ వదిలి నా సీత రాములు సేదతీరడం కోసం సరైన స్థలాన్ని వెదకాలని గాల్లోకెగిరాను.

అడవంతా గాలించసాగాను, గోదారి ఒడ్డునైతే నీటికి వసతిగా ఉంటుందని ఒడ్డుపోడవునా మంచి నివాసం కోసం వెదకసాగాను.

వాయసాన్నైనా, ఆయాసాన్ని వదిలి సునాయాసంగా మంచి ఆవాసం కోసం నలుదిక్కులా చెట్టునూ, పుట్టనూ, అన్వేషించసాగాను.

పోద్దుగుంకే వేళ లభించింది అద్భుతమైన ప్రదేశం. గోదావరి ఒడ్డున సమతులంగా ఉన్న ప్రదేశంలో చిక్కటి నీడనిచ్చే కానుగ వృక్షపు జాడ దొరికింది.

కొద్దిగా శ్రమిస్తే ఈ చోటు పొదరిల్లవుతుంది. వేసవిలో కూడా కానుగ నీడ చల్లదనాన్ని పంచుతుంది. ఇదే వారు నివసించడానికి అనువైన ప్రదేశమని నిర్దారించుకున్నాను.

★ ★ ★ ★ ★

సూర్యుడు కూడా ఆ రఘుకుల సోముడ్ని దర్శించుకోవడానికా అన్నట్లు ఇవ్వాళ తొందరగానే ఉదయించాడు.

పశుపక్ష్యాదులన్నీ పెందరాళే లేవడానికి అసలు నిద్రపోతే కదా!! కనులు తెరిచే కలలు గన్నారందరూ.

చిత్రకూటం వదిలి చాలా రోజులయ్యాయి. దక్షిణపు దిక్కుగా బయలుదేరిన రాముడి కోసం ఉత్తరపు దిక్కుగా చూపులు నిలిపి, అడవిలోని అణువణువూ వేచి చూడసాగారు.

బారెడు పొద్దెక్కినా ఆకలి దప్పులు మరచి ఆ సీతారామలక్ష్మణులను దర్శించి తరించాలని తారతమ్యాలు మరచి ఎదురు చూడసాగారందరూ.

అంతలో ...

అడవిలో...

దూరంగా కోలాహలం వినిపించింది.

కొద్దిసేపటి తరువాత...

ముందుగా...

రాముడు.

వెనకగా సీతమ్మ తల్లి.

వారిని అనుసరిస్తూ లక్ష్మణుడు.

ఒక్క క్షణం అడవంతా చిత్తరువే అయ్యింది.

ఆజానుబాహుడు .

కండలు తిరిగిన శరీరం. విల్లంబులతో నడిచి వస్తూంటే ...

రామా...

రెండుకనులూ చాలట్లేదు. కనులనిండుగా చూసుకుని మురిసిపోయాను.

ఆ దివ్యమంగళ స్వరూపుడిని చూసి అత్యంత వైభవంగా స్వాగత సత్కార ఏర్పాట్లు చేసిన వారందరూ తమ తమ ఏర్పాట్లన్నిటినీ మరచి తన్మయత్వంలో మునిగిపోయారు.

సీతమ్మ వారిని చూసి కంట తడిపెట్టని తనువూ లేదు, తరువూ లేదు ఆ కోనలో.

అన్నా వదినల రక్షణ, సేవయే తన ధ్యేయంగా వెన్నంటి వస్తున్న లక్ష్మణులవారి దీక్షను చూసి అందరూ అచ్చెరువొందారు .

నేనైతే వేపచెట్టు కొమ్మ పైనుండి రాముడి ముఖ తేజస్సుని చూస్తూ అలా వుండిపోయాను.

శ్రీరామచంద్రుడి శరీర వర్ణం చూడగానే నాకు సిగ్గేసింది. ఆ జానకీ వల్లభుడికీ నాకూ పోలికా!!!

శ్రీ రామా...

నా రంగు నలుపుకే నిర్వచనమైన కాకి నలుపు.

అతడు.

ఆ రఘునందనుడి వర్ణము నీలిమేఘము. ఆ నీలిమేఘపు ముఖ వర్చస్సులో అతడి కళ్ళని చూస్తే, నాకైతే ... ఆకాశంలో ఎగిరే జంట వాయసాలే గుర్తొచ్చాయి.

ఈ జన్మకిది చాలు. ఎంత పుణ్యం చేసుకుంటే వీరి దర్శనం లభిస్తుంది !!! కొన్ని రోజులపాటు వీరిని చూస్తూ గడిపేసి తరువాత తనవు చాలించ వచ్చనిపించింది.

ఇంతలో కర్తవ్యం గుర్తొచ్చింది.

నేను చూసి వుంచిన జాడ వీరు దాటి వెళ్లక మునుపే ... దానిని చూపించాలనుకుని, రాముల వారు వచ్చే దారిలోనే మేడి కొమ్మపై వాలి ...

"కావ్... కావ్"

అని అరిచాను. ఎవరూ పట్టించుకోలేదు. నాపై దృష్టి నిలపక దాటిపోయారు. వారికన్నా ముందే వారిని దాటి జమ్మికొమ్మపై వాలి గోల చేసాను. లక్ష్మణుల వారు నా వైపు దృష్టి సారిస్తూ ముందుకు నడిచాడు.

ఏటి ఒడ్డున ఉన్న కానుగ వృక్షాన్ని సమీపిస్తున్నంతలోకి నేను ఆగలేకపోయాను.

రివ్వున ఎగిరి కానుగ కొమ్మపై వాలి అరచి గోల గోల చేయసాగాను. వారి దృష్టిని ఆకర్షించడానికి .

కనుల కొనలలోంచి చూసాడు రాముడు. లక్ష్మణుడు చిరాగ్గా చూసాడు .

నన్ను దాటబోయేంతలోకి నేను తట్టుకోలేకపోయాను. ఈ కొమ్మమీంచి ఆ కొమ్మపై దూకుతూ, అరుస్తూ నానా రభస చేయసాగాను

నా తల్లి సీత కన్నులు నా మీద పడ్డాయి. ఒక్క క్షణం ఆగింది తను. లక్ష్మణుడు కూడా ఆగి చుట్టూ పరిశీలించ సాగాడు.

నా కాకి గోల కొనసాగుతూనే వుంది.

అన్నదమ్ములిద్దరూ కళ్ళతో మాట్లాడుకున్నారు. రాముడితో సీత ఏదో మాట్లాడింది ఆ ప్రదేశాన్ని చూపించి. అన్నదమ్ములు ఒక నిర్ణయానికొచ్చినట్టు అనిపించింది.

ఆనందం పట్టలేకపోయాను.

నిజమే ! నా రాముడు, నాతో పాటు ఈ అడవిలో ఇక్కడే ఉండబోతున్నాడు.

కాదు... కాదు.

నేనే రాముడితో పాటు ఇక్కడే ఈ అడవిలో ఉండబోతున్నాను. ఇంతకన్నా ఇంకేం కావాలి ఈ జన్మకి.

రెండ్రోజుల్లోనే ఓ పొదరిల్లు ఏర్పాటయిపోయింది. సీతమ్మ కూడా పరిసరాలకి అలవాటు పడుతూ వుంది.

ప్రకృతి ప్రశాంతంగా వుంది

రాముడు ఆధ్వర్యంలో అది అయోధ్య అయినా, అడవైనా ప్రశాంతంగానే ఉంటుంది.

రోజులు తేలిగ్గా గడిపోతున్నాయి. రాముడ్ని చూస్తూ ఒక్కోసారి అన్నీ మరచిపోతున్నాను. నెలలు, సంవత్సరాలు గడిచిన విషయం కూడా !!!

ప్రతి క్షణం రాముడే! వేరే ధ్యాస లేదు. ధ్యానం లేదు.

రాముడు.

నా రాముడు.

నా సీతారామ చంద్రుడు.

★★★★★

ఎందోకో ఈ రోజు తెల్లగా తెల్లవారలేదు, మబ్బు ముసుగేసింది.

ఇవ్వాళ పొద్దున్నుంచి ఎడమ కన్ను ఒకటే అదురుతున్నది. ఏదో తెలియని అనిశ్చితి. గుండెల్లో అలజడి. స్థిమితంగా ఒక్క కొమ్మపై కూర్చోలేకపోతున్నాను.

జంతుజాలమంతా తమతమ రోజు వారి కార్యక్రమాలలో మునిగి వున్నారు.

పొద్దున్నే లేవగానే కడుపులో ఆకలి కేకలు వేసేది. ఈ రోజెందుకో తిండి కోసం కూడా వెళ్ళాలనిపించటం లేదు.

సీత రాములు చెట్టు క్రింద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. లక్ష్మణుడు కొద్ది దూరంలోని మేడి చెట్టు దగ్గర పండ్లు కోసే పనిలో ఉన్నాడు .

ఎలా? ఈ గుండెల్లోని భయం తొలగేదేట్లా అని సాలోచనగా చూట్టూ చూడసాగాను .

కొద్ది దూరంలో, గోదావరి ఒడ్డున ఒక కొత్త మనిషి కనిపించాడు. వెంటనే, నేను అరిచేంతలోపే ... కన్ను మూసి తెరిచేంతలోపే అక్కడ ఒక లేడి పిల్ల కనిపించిది. వెండి చుక్కలున్న బంగారు లేడి . ఆకర్షణీయంగా వుంది .

నాకు ముందు భ్రమేమో అనిపించింది. అయితే ఇక్కడ ఈ లేడి పిల్ల కొత్తగా కనిపించింది.

ఈ అడవిలో ప్రతి ప్రాణినీ, జీవినీ నేనెరుగుదును కదా ! మరి నాకు తెలియని ఈ లేడి పిల్లెవరు అనే సందేహం మొలకెత్తింది.

భయం, బెరుకూ లేకుండా ఆ లేడి తిన్నగా, తనకు తెలిసిన దారే అన్నట్టు పొదరింటివైపు రాసాగింది.

పర్ణశాల దగ్గరగా రాగానే అది మామూలు లేడి పిల్లలా చెంగు చెంగున దూకుతూ, సీత దృష్టి నాకర్షించడానికి ప్రయత్నిస్తూ ముందుకు సాగింది.

“కావ్... కావ్.”

అప్రయత్నంగా నా నోటివెంట అరుపు వెలువడింది .

సీత రాముల చూపూ, లక్ష్మణుడి చూపు ఒకేసారి ఆ బంగారు లేడి పై పడింది .

సీత, రాముడితో ఏదో చెప్తూ బంగారు లేడిని చూపించింది. దూరంగా ఉన్నా లక్ష్మణుడప్రమత్తమయ్యాడు. ఈ లోపు తన విల్లంబులందుకుని రాముడు ఆ లేడి వెనక పరిగెత్తాడు

సీతకు రక్షణగా లక్ష్మణుడు వచ్చేశాడు.

ఇంతలో అడవిలోంచి రాముడి అరుపులు వినిపించాయి.

లక్ష్మణుడు పర్ణశాల ముందు తన శరంతో రేఖ గీసి అరుపు వినిపించిన దిశగా పరుగెత్తాడు.

నాకు కాళ్లూ, రెక్కలూ ఆడటంలేదు. చేష్టలుడిగి ఓ కొమ్మపై అలాగే కూలబడిపోయాను.

అకస్మాత్తుగా ఆ పచ్చని పొదరింటి ముందు ప్రత్యక్షమయ్యాడు ఓ బిక్షగాడు .

నా మనసు కీడు శంకించింది. జరగరానిదేదో జరుగుతూంది. కానుగ కొమ్మ మీద చిందులేస్తూ గట్టిగా అరవసాగాను.

భిక్ష వెయ్యడానికి రేఖ దాటినా సీతమ్మ తల్లిని తీసుకుని ఆ భిక్షగాడు రివ్వున గాల్లోకెగిరాడు.

నేను  నిర్ఘాంతబోయాను. వెంటనే తేరుకుని ఆ భిక్షగాడ్ని అనుసరించాను .

ఎలా ఎదిరించాలి వీడిని? ఎలా రక్షించగలను సీతమ్మ తల్లిని?

ఎక్కడ్నించి వచ్చిందో ఒక పెద్ద గ్రద్ద, రాగానే ఆ భిక్షగాడ్ని భీకరంగా ఎదిరించింది. కాని, ఎక్కువ సేపు వాడి బలం ముందు నిలవలేక రెక్కలు తెగి కింద పడిపోయింది.

ఒక గద్ద వాడ్ని ఎదిరించలేకపోయింది ఇక నేనెంత? పిల్ల కాకిని.

కళ్ళు మూసి తెరిచేంతలో ఆ బిక్షగాడు సీతమ్మ వారితో సహా మాయమయ్యాడు .

నేను వెంటనే వెనక్కి వచ్చేశాను .

అక్కడ రామలక్ష్మణులు సీతమ్మ జాడ కోసం పర్ణశాల అణువణువూ వెదక సాగారు. సీత జాడ దొరకకపోయేసరికి రాముడు కుప్పకూలిపోయాడు. నాకు ఊపిరి ఆడలేదు.

రామా! అన్ని వేళలా మా ఆపదలు కాచేవాడివి కదా! అట్లాంటి ఆపద్బాంధవుడికే ఆపదలు వస్తే, నీవు తట్టుకోగలవు గానీ, నా వల్ల కావట్లేదు రామా!!

నేను పెద్దగా అరుస్తూ, సీతని ఎత్తుకుపోయిన మార్గం మీదుగా ఎగురుతూ, ఆ ఇద్దరికీ విషయం అర్థమయ్యేట్టు చెప్పడానికి ప్రయత్నించసాగాను.

నేను చూపించిన వైపుగా రామలక్ష్మణులు ముందుకు అడుగులేసారు వడివడిగా.

వారికన్నా ముందుగా సీతమ్మ వారి జాడ తెలుసుకోవాలని ఎగురుతూ ముందుకు సాగాను.

★★★★★★

ఆ రోజునుంచి సీతమ్మవారి జాడ కోసం జనావాసాల మధ్యే తిరుగుతూ, అడవి మాట మరచిపోయి ఆ తల్లి కోసం అన్వేషిస్తూనే ఉన్నాను.

.

కథా కౌముది

# అదీ సంగతి! పోడూరి కృష్ణకుమారి

తెలతెలవారుతుండగానే పక్కింటి గేటుముందు ఫర్ ఫర్ మంటూ వచ్చే చీపురు సంగీతంతో మేలుకుంటుంది గీత. చేతకాని వాడు వయొలిన్ వాయించి నట్టు చీపురుతో మహా కళాత్మకంగా శబ్దాలు సృష్టిస్తుంది పక్కింటి పనిమనిషి గంగానమ్మ. తరవాత కుళాయి తిప్పి పగిలిపోయిన జల(ఘోర)తరంగిణి, ఆ తరవాత ఉక్కు, స్టీలు, ప్లాస్టిక్కూ ఇంకా ఇతర లోహ, అలోహ, మిశ్రమలోహ ఘటాలతో ఘంటానాదాలు, గార్దభ నాదాలు రకరకాల స్థాయిలతో వాద్య ఘోష్టి కార్యక్రమం వినిపిస్తుంది. ఆ 'లయలేని విన్యాసం' అలా కొంత సేపు కొనసాగనిచ్చి, ఆ శబ్ద హింసను భరిస్తూ, హింసకు తగ్గట్టుగా మూలుగు ఎఫెక్టులనిస్తూ, బద్ధకంగా అటుదొర్లీ ఇటు దొర్లీ కాలక్షేపంచేసి, తోచినప్పుడు పక్క దిగడం అలవాటు గీతకి. లేచాక, "పక్కింటి పని మనిషి ఐదింటికే ఎందుకొస్తుంది? మా డిటో తొమ్మిదింటికెందుకొస్తుంది? వాళ్ళ పనిమనిషికే ఎందుకు బద్ధకం లేదు? మా మనిషికే బద్ధకం ఎందుకు? ఎందుకోసం? ఎందుకోసం?" అని ఈర్ష్యా, అసూయ, ద్వేషాలతో ఆక్రోశించుకుంటూ మహా బద్ధకంగా పనులు చేసుకోడంతో గీత రోజువారీ రొటీన్ ఆరంభమవుతుంది.

అయితే ఇవాళ 'చీపురు సంగీతం ఇంకా మొదలవలేదేంటి చెప్మా!' అన్న బెంగ, ఆత్రుత, ఆదుర్దా, ఆర్తి, గాభరా – మొత్తంగా ఓ మాటలో చెప్పాలంటే – టెన్షన్ – తో మెలుకువ వచ్చింది గీతకి.'గంగానమ్మ ఇంకా పని మొదలెట్టలేదంటే ఇంకా అయిదవలేదా ఏంటి? మరి నాకెందుకు అప్పుడే మెలుకువొచ్చిం దీ?' అని తనలో తనే మధనపడి, లేవాలా వద్దా తేల్చుకోలేక, పక్కమీద తన పక్కనే రాత్రంతా గడిపి ప్రస్తుతం నడుంకింద గుచ్చుకుంటున్న సెల్ ఫోను దొరకబుచ్చుకుని ఓ నొక్కు నొక్కింది. అది ఆరున్న రైంది అని ఖచ్చితంగా తారీకుతో సహా చెప్పింది.

"సరే గంగానమ్మ చప్పుళ్ళ రాక్–టాప్ – యాక్ – డోక్ సంగీతం లేని ఈ ప్రశాంత నీరవ నిశీధిలో మరి కాస్సేపు నిదురిస్తా జహాపనా" అని నిద్రమత్తు బొంగురు గొంతుతో తనకి తనే జోలపాడేసుకుని తనని తనే మరికాస్సేపు బజ్జోబెట్టేసుకుంది.

అలా పడుకున్న మనిషి పూర్తిగా ఏడున్నరైతే గాని పూర్తిగా మెలుకువ వచ్చి పూర్తిగా మనిషి కాలేకపోయింది. ఇంక లేచాక ఇల్లాలన్నాక ఉరుకులూ పరుగులూ తప్పవుకదా. ఉరుక్కుంటూ మొహాలకడిగింపులు కానిచ్చి, పరిగెట్టి వంటిల్లు చేరి గంగానమ్మ శిష్యురాల్లా రకరకాల వాద్యసంగీతం మోగించి 'కాఫీలు తయారుచేసుడు' కార్యక్రమం ఎంతోకొంత విజయవంతంగా నిర్వహించి ఆట్టే తళతళలాడని స్టీలు గ్లాసుల్లో బాగా ఘుమఘుమ లాడుతున్న కాఫీని నింపి, ట్రేలో సర్ది, చేతబట్టి హాలనిపిలవబడే ముందుగదిలోకొచ్చింది.

ఇరవై ఏళ్ళ క్రితం రిటైరయిన గీత మామగారు ఉత్తరాభి ముఖంగాను, ఈ మధ్యనే రెండుమూడేళ్ళక్రితం రిటైరైన గీతాపతి దక్షిణ ముఖం గాను కూచుని తమతమ వ్యక్తిగత పెర్సనల్ టీవీల ముందు మహాపరమధ్యానంలో ఉన్నారు. గీతత్తగారు హాలు పక్క బెడ్రూమ్ లో, తన పెళ్ళినాడు పసుపు కుంఖా లకింద పుట్టింటారిచ్చిన పొలంమీదొచ్చిన శిస్తు డబ్బులతో కొనుక్కున్న తన ఓన్ సొంత టీవీ ముందు కూచుని, "హేవిఁటో! కలికాలం ముదిరి పోయింది. కోడళ్ళు సూర్యుడు నడినెత్తెక్కితే గానీ లేవరు. వాళ్లు లేస్తేగానీ ముసిలాళ్ళ మొహాన కాఫీ నీళ్ళకి దిక్కుండదు" అని చిన్నపాటి అష్టోత్తరం గొణుక్కుంటూ, గోడమీది గోడంత టీవీ స్క్రీనుకి కళ్లంకితం చేసి మనసంతా కాఫీ కంకితం చేసి ధ్యానంలో మునిగిపోయుంది.

ఒకే ఇంట్లో రెండు రిటైర్డ్ జంటలకు మూడు టీవీలుండడం గురించి తెలియాలంటే కొంత మెరుపు వెనక్కి – అదేనండి flashback – కి వెళ్ళాలి.

మొదటసలు ఇంటిల్లిపాదికీ కలిపి ఏకమొత్తంగా ఏకైక టీవీ ఉండేది. రెండో తరం కూడా రిటైరై ఇల్లు చేరేసరికి టీవీ ప్రోగ్రాములు చూసే విషయంలో తల్లీ,తండ్రీ,కొడుకుల మధ్య రిమోట్ సమరాలు, వాగ్యుద్ధాలు తరచుగా జరుగుతుండడంతో అత్తా కోడలు కలిసి, "మరో టీవీ కొనకపోతే మేం సన్యాసం పుచ్చుకుని టీవీ సౌకర్యం ఉన్న మఠంలో జాయినైపోతాం" అని బెదిరించారు. సరే. రెండోది వొచ్చింది. మొదటితరం పడగ్గదిలో రెండోది సెటిలైంది.

అయితే ప్రకృతిసహజంగా రెండోదానితో మొదటావిడ కి వైరం వచ్చిపడింది. సరిగ్గా అదే సమయానికి మొదటావిడ అనుంగు తమ్ముడు అక్కగారి వాటాకి రావలసిన శిస్తుడబ్బులు పట్టుకొచ్చాడు. అక్కా తమ్ముడూ గుసగుసలాడుకుని, ఆ డబ్బులట్టుకు పోయి మూడో దాన్ని ముడెట్టుకొచ్చారు.

"వెధవ డబ్బు శాశ్వతమా ఏమన్నానా! మనం ఉన్నన్నాళ్ళూ టీవీ ఉంటుంది గానీ! అక్క ముచ్చటపడింది. కాదనకు బావా" అని గీతత్త తమ్ముడు బావగారిని బతిమాలేసాడు. అలా మూడోది గృహప్రవేశం చేసాక రెండోదాన్ని మొదటావిడ ముందుగదిలోకి బహిష్కరించింది. అప్పుడు గీత, "గదికొక టీవీ" పథకం తండ్రీ కొడుకులముందు పెట్టింది.

"మీరిద్దరూ ఎలాగూ ఒకే కాలువ (ఛానెల్) చూడరు, కాబట్టి మనకి ఎప్పుడూ రాని అతిధులకోసం అట్టేబెట్టిన గెస్టు పడగ్గదిలో మామగారి టీవీ పెడదాం ఆయనక్కడ చూసుకుంటారు" అంది. అంతే! అత్తగారు కెవ్వున కేకపెట్టి, "నాతల్లోయ్! ఆ పని మాత్రం చెయ్యకు. ఆయనకి చెవుడు బాగా కలిసొచ్చింది. 'నాకు వినబడదే అందుకని పెద్దపెద్ద అక్షరాలొచ్చే ఛానెల్లో స్క్రోల్లో న్యూసు చదువుకుంటానూ' అంటూ మ్యూటో ముదనష్టమో అదేదో నొక్కి, చండాలంగా ఉండే రికార్డింగుడాన్సులెట్టుక్కూచుని గుడ్లప్పగించేస్తారు. కింద స్క్రోలు మాట దేవుడెరుగు! ఖర్మ! రాకరాక అప్పుడే పనివాళ్ళూ పాలవాళ్ళూ నువ్వుచెప్పిన ఎప్పుడూరాని అతిధులూ అప్పుడే దిగడ్డారంటే హవ్వ! పరువెక్కడ కలవాలి? అందుకని ఆ రెండోదాన్నక్కడే హాల్లోనే పడుండనీ. పిల్లలు మీరు అటూ ఇటూ అక్కడే తిరుగుతుంటారు కాబట్టి ఈ ముసలాయన కాస్త అదుపులో ఉంటారు. బాబ్బాబు. రెండూ ఇక్కడే పడుండనీ" అని బతిమాలేసింది. అందువల్ల అలా తండ్రీకొడుకుల ఎడమొహంపెడమొహం టీవీలు ఆ హాల్లో వెలిసాయి. ఈ టీవీ లొల్లి భరించలేక గీత"పుస్తకపఠనం" అనే అతి ప్రాచీన కళని సాధన చేసుకుంటూ పనీపాటా చూసుకుంటూ పడుంటుంది. అదండీ వాళ్ళ వెనగ్గా మెరిసే గతం.

అందరికీ కాఫీలందించి తన గ్లాసుకూడా పట్టుకుని మూలగా ఖాళీగా పడున్న కుర్చీలో కూలబడి "ఏంటో మరి! ఇవాళ గంగానమ్మ పర్ పర్ చీపురు చప్పుళ్ళు వినబడ్లా. దాంతో లేవడం ఆలస్యం అయింది" అంది జనాంతికంగా సంజాయిషీ ఇచ్చుకుంటూ.

"నీకో సంగజ్జెప్పనా, ఆ గంగానమ్మ అలా ఫర్రూఫర్రూమని చప్పుళ్ళు సృష్టిస్తుంది గానీ నిజంగా మనసుపెట్టి ఊడవదు. ఆ గోల తగ్గాక నేను వాకింగుకెళ్ళినప్పుడు చూస్తానుగా ఎక్కడి చెత్త అక్కడే!" అన్నాడు గీతాపతి "అతిఘోరంవార్తలు" కార్యక్రమం నడిపించే ఏంకర్ లాగా ముఖం పెట్టి.

"మీకో సృష్టి రహస్యం చెప్పనా? గంగానమ్మే కాదు అసలెవరూ మనసు పెట్టి ఊడవరు. చీపురుపెట్టి ఊడుస్తారు" అనేసి అక్కడనించి లేచ్చక్కా పోబోయింది గీత.

వీళ్ళిద్దరి సంభాషణలో ఒక్కక్షరం కూడా వినబడలేదు మామగారికి. కానీ వీరి కదలికలమీద ఓ కన్నేసుండడం మూలాన గీత లేవగానే, "అమ్మాయ్! ఎక్కడికి బయల్దేరావ్? ఒక్షణం కూచో. ఇప్పుడు ఈ ఏడ్ అయిపోగానే ఈ 'విముక్తీ విరక్తీ' ఛానెల్లో 'అర్థాలూ అనుమానాలూ' అనే ఫోనిన్ను కార్యక్రమం వస్తుంది. అందులో నేనో ప్రశ్నడగాలి. జవాబు నాకు వినబడదు కాబట్టి నువ్వు ప్రతీ అక్షరం రాసి నాకు చూపించాలి. నంబరు కలవగానే ఫోను నాకియ్యి. 'బ్రహ్మచెముడు అనేమాట ఎలా వచ్చింది? బ్రహ్మ దేవుడికి కూడా చెముడు ఉండెడిదా?' అని అడుగుతాను సాములార్ని" అన్నారు మామగారు. ఆ ఛానెల్ కేసి చూసింది గీత. ఆ ఏడ్ లో పొట్ట తగ్గించేసుకుని ఒంటిమీదకి బికినీ ఎలా ఎక్కించేసుకోవచ్చో సజీవ దృశ్యమాధ్యమం తో వివరిస్తోంది ఓ సౌందర్యనిపుణురాలు.

'భూమాతా! చీలిపో! వీళ్లని నీ పొట్టన పెట్టేసుకో!' అని ఆక్రోశించింది గీత మనసు. వెంటనే స్క్రీను మీద తాటికాయంత అక్షరాలతో "విరుగుతున్నవార్త (బ్రేకింగు న్యూసు): ఇప్పుడు రావలసిన అనుమానాల కార్యక్రమం ఫోన్నంబరు మనుగడలో ఉంది కానీ ఆ ఫోనిన్ను నడిపే సాములారు నిన్నరాత్రినుంచీ మనుగడలో లేరు. మరోసాములారు దొరికేదాకా దానిబదులు డాన్సులు చూపబడును" అని వచ్చింది. బతుకుజీవుడాంటూ గీత తక్షణం అక్కడ నుంచి నిష్క్రమించింది. పెద్దాయన యధావిధిగా తన సౌండ్ లెస్ దునియాలో రికార్డింగు డాన్సులకి నిశ్చింతగా పునరంకితమయ్యాడు.

వంటింట్లో కెళ్ళబోయేముందు పక్కింటికీ తమకీ మధ్య ఉన్న గోడదగ్గరికెళ్ళి మునివేళ్ళ మీద నిలబడి పక్కింట్లోకి తొంగి చూసింది గీత. ఇంటి సింహద్వారం తాళం పెట్టుంది. 'అదీ సంగతి. వాళ్ళూరెళ్ళారు. అందుకే చీపురు సంగీతం వినబడలా' అనుకుని వంటింట అడుగుపెట్టి ఆ పూటకి నాలుగు ప్రాణాలూ నిలిచేపాటి వంటొండి పడేసి మళ్ళీ హాల్లోకొచ్చి ఉసూరుమంటూ కూలబడింది యధాప్రకారం మూలనున్న కుర్చీలో. పక్కన సోఫా మీద పడి దొల్లుతున్న వార్తా పత్రిక విడివిడి కాగితాలు సంఖ్యల ప్రకారం సద్దుకుని చదవడం మొదలెట్టిందోలేదో పక్కింటి గేటు కిర్రూకిర్రూమంటూ ఎవరో తెరుస్తున్న చప్పుడు విన బడింది గీతకి. 'పక్క వాళ్ళిల్లు తాళంపెట్టుంది కదా ఇందాక చూస్తే? అప్పుడే వచ్చేసారా?' అనుకుంటూ భయంకర రాజకీయ పరిణామాలను నాటకీయంగా వ్రాసిపారేసిన వార్తల సొగసును ఆస్వాదిస్తూ కూచుంది.

ఉన్నట్టుండి కీచుగొంతుమాటలు, ఘొల్లుఘొల్లున ఏడుపూ, కలగాపులగంగా వెక్కిళ్ళసమ్మిళితమైన మాటలు వినబడ్డాయి. ఏం జరిగిందో ఎవరికొంప మునిగిందో అని కంగారుపడుతూ లేచి గోడమీంచి చూసింది. పక్కింటితోసహా కొంపలన్నీ క్షేమంగానే ఉన్నాయి. పక్కింట్లో పనిచేసే గంగానమ్మ తాళంపెట్టబడ్డ గుమ్మంముందు నుంచుని సెల్లులో ఘొల్లుమంటోంది. 'ఓహో! ఈవిడగారా కిర్రుమంటూ గేటుతీసి లోపలికొచ్చింది? ఎందుకేడుస్తున్నట్టూ? తను పనిచేసే ఇంటివాళ్ళు తాళంపెట్టుకుని ఊరెడితే సెలవదొరికిందని పండగచేసుకోక ఇంతలా గొంతెత్తి ముంతల్తో కన్నీళ్లు కార్చేసే సేవకమ్మన్యులుంటారా? కలియుగం సడెన్గా అంతమైపోయి అదేదో వెర్రి బాగుల యుగం ప్రవేశించెయ్య లేదు కదా!' అని నివ్వెరపోయింది గీత.

తనలాగే తీరిగ్గానిలబడి గంగానమ్మ మోగిస్తున్న 'భేరీ'వింటున్న 'నారీ'మణులు ఎదురువరసలో గుమ్మాల దగ్గర, గేట్లదగ్గర ఇంకా కొందరు కనిపించారు గీతకి. మరీ అంత తీరికలేని మహిళారత్నాలు కిటికీలదగ్గర చంకలో చంటివాళ్ళతోనో, చేతిలో గరిటల్తోనో నిలబడి చోద్యం చూస్తున్నారు. కొన్ని గుమ్మాల దగ్గర పురుషలక్షణాలను విడిచిన – అంటే – యునో – ఉద్యోగం పురుషలక్షణం కదా? అది విడిచిన అంటే – ఉద్యోగ విరమణ చేసిన పురుషులు – అని కవి సమయం – అటువంటి తీరిగ్గా ఉన్న పురుషులు కూడా గుమ్మాల్దగ్గర ఆడియెన్స్ లో చేరారు. ఇంత మంది ప్రేక్షకులు తననే గమనిస్తున్నారని గమనించిన గంగానమ్మలో ఉత్సాహంపురివిప్పింది. కంఠం పెంచుకుంది. ఘొల్లులుమాని, సెల్లులో, "ఆర్నెల్లుగా మీ ఇంట పనిచేస్తున్నా ఇన్నాళ్లల్లో ఏనాడైనా ఏదైనా దొంగతనం చేసానా ?" వీలయినంత దీనరసం ఒలికిస్తూ, కంచుగొంతు పెంచి అడిగింది గంగానమ్మ.

బిగబట్టిన ఊపిరి సుదీర్ఘంగా వదిలారు ప్రేక్షకులు.

'అదర్రా సంగతి!గంగానమ్మ మీద దొంగతనం నేరం మోప బడింది!'.

ఊపిరొదిలిన శ్రోత కమ్ ప్రేక్షకులు చెవులురిక్కించారు.

"ఇన్నాళ్ళబట్టీ చేస్తన్నా గదమ్మా నాసంగతి తవఁకి తెలవదా మ్మా?" సెల్లుని మళ్ళీమళ్ళీ ప్రశ్నించింది గంగానమ్మ. అవతల సెల్లు కత్తిరించబడి మూగబోయిందల్లే ఉంది. తలెత్తి గుమ్మాలప్రేక్షకులం దరినీ మెడతిప్పుతూ ఓ స్కానింగు చేసింది. ప్రేక్షకులంతా అస్సలు గంగానమ్మెవరో తెలీనివాళ్లల్లా శూన్యంలోకి చూస్తూ, అర్జెంటుపనున్నవాళ్ళల్లా తలుపులు చేరేసి లోపలికి తప్పుకున్నారు మన కెందుకొచ్చిన గొడవని. ఇప్పుడు వాళ్ళు కేవలం శ్రోతలే. వాళ్ళకి గంగానమ్మ కనిపించట్లేదు. వీరికి వారూ డిటో.

గంగానమ్మని పనిలో పెట్టుకున్న ఇంటాయన "అదోరకం" టైపు. చిట్లు నడుపుతాడు, స్థలాలమ్మే వారికి దళారీ పనులు చేస్తాడు, చిన్నచిన్న దందాలేవో నడుపుతుంటాడు. టోటల్ గా రొటేషన్ చక్రవర్తుల కింద సామంతుడు. చాలా మందికి చిట్టీల్లో ఇవ్వాల్సినవి ఎగేయడం, వాళ్ళు ఇంటిమీదికి యుద్ధానికి రావడం, మూడుపోట్లాటలూ ఆరుపోలీసులూ, గందరగోళంగా మహాసందడిగా దినదినగండంగా ఉంటుందా ఇల్లు. అంతటివాడింట్లో పనిపేరున చేరి, ఇంకేదో చేసిందంటే ఈవిడెంతటిదో! అక్కడే నిలబడి చోద్యం చూస్తే ఏం ముంచుకొస్తుందో! అన్నభయంతో ఎవరిళ్ళల్లో వాళ్ళు సేఫ్ గా దూరి, తలుపులేసేసుకున్నారు. వీధి ప్రేక్షకుల్లేకపోయేసరికి భాగోతం ఆపి వెళ్ళిపోయింది గంగానమ్మ. తరవాత వారంరోజులపాటు గీత, అత్తగారు ఇరుగూపొరుగూలతో చర్చలతో చాలా ఏక్టివ్ గా గడిపారు.

అత్తగారు, "మీరా మూడో దాన్నే చూసుకోండి" అని మామగారిని తమ బెడ్రూములోకి, "నువ్వీరెండోదాన్ని గెస్టురూములో ఉంచుకోరా" అని కొడుకునీ హాల్లోంచి వెళ్ళగొట్టి, "గదికో టీవీ పథకం"అమలుచేసి, ఇరుగు పొరుగు ఇల్లాళ్ళని చర్చలకాహ్వా నించింది.

"గంగానమ్మ దొంగతనం చేసిందా లేదా?" అని చాయ్ కప్పు చర్చలు, టిఫినలతో డిబేట్లు జరిగాయి. ఔత్సాహికులైన ఇల్లాళ్ళు"కాయ్ రాణీ కాయ్ " అంటూ బెట్టింగులు కూడా జరిపారు.

"ఆ ఇంటాయన సంగతి మనకి తెలుసుగా? చూస్తుంటాంగా? ఆయన వల్ల మోసపోయిన వాళ్ళందరూ ఆయన మీదకి దండయాత్రకొస్తుంటారు. ఏదో తస్సావేసి బయటపడుతుంటాడు. ఈసారి ఏదో పెద్దగొడవో పోలీసుకేసో అయ్యుంటుంది. అందుకే పత్తాలేకుండా పోయారెక్కడికో ఇంట్లో అందరూ కట్టకట్టుకుని " అంది ఆవీధి వ్యవహారాల్లో అనుభవం చాలాఉన్న పెద్దముత్తైదువొకావిడ.

కొంతమంది అవునని అన్నారు కొందరు కాదింకేదో ఉందన్నారు. "అసలా గంగానమ్మ చేసే చప్పుళ్ళు భరించలేక దాన్ని వొదుల్చుకోడానికే వాళ్లు శంకరగిరిమన్యాలు పట్టి పోయరనిపిస్తోంది నాకు" అంది గీత తెల్లారుజాము హింసను తలుచుకుంటూ.

"శంకరగిరి మన్యాలా అవెక్కడుంటాయి ఆంటీ?"అడిగింది ఆవీధిలో కొత్తగా కాపురంపెట్టిన కోమలాంగి.

"ఇండియాలో బెస్టు టూరిస్టు స్పాటు అని గూగుల్లో కొట్టి చూడమ్మా.. కనిపిస్తుంది" అని సలహా ఇచ్చింది గీత. పక్కింటి వాళ్ళు గంగానమ్మని తప్పించుకోడానికా లేక గొడవలు తప్పించుకోడానికా ఊరెళ్ళారు అనే విషయంమీద మళ్ళీ చర్చలూ, బెట్టింగులూ జరిగాయి. గీతత్తగారు, దశాబ్దాల తరబడి సంసారం చేసి గడించిన అనుభవం రంగరించి "పనివాళ్ళు, వాళ్ళల్లో బలాలు, బలహీనతలు" ఎట్సెట్రా విషయాల మీద ప్రవచనాలు వల్లించింది. ఎంత చర్చించినా, గంగానమ్మ దొంగేనా కాదా మాత్రం తేల్లేదు. అలా సప్తాహం పాటు చర్చలు జరిగాయి. అష్టమో రోజు పక్కింటివాళ్ళు తిరిగొచ్చారు. నో గంగానమ్మ. వీధిలో అంతా సస్పెన్స్ తో సతమతమయ్యారు. గంగానమ్మ దొంగా? కాదా? పనిలోకి వస్తుందా రాదా ఇంక? నవమోరోజు గీతా వాళ్ళ పనిమనిషి గంటలమ్మ అంట్లు తోముతూ, "పక్కింటోళ్లు ఆళ్ళింట్లో కూడా నన్నే పన్చెయ్యమన్నారమ్మా" అని ప్రకటించింది. కొంచెం బిత్తరపోయినా, తత్తరపాటు దాచుకుంటూ "మరి గంగానమ్మని దొంగతనం అంటగట్టి పంపించేసారు కదా? నీకూ అలాగే అంటగట్టి పంపేస్తారేమో!" అడిగింది గీత.

"నానొహటి సెబుతా ఇనుకోండమ్మా. ఆ గంగానమ్మొట్టి ఎర్రిబాగుల్దండి. దానికి ఉతకడానికేసిన పంట్లాం జేబులో నాలుగుయేల రూపాయలుండి పోనాయంట. ఉతికేటపుడు దీని కళ్ళబడ్డాయి. మరి దీనికి దొంగ బుద్ది నేకపోతే ఆటిని ఎంటనే తీసి ఇంట్లో వోళ్ళకిచ్చెయ్యాలి కదండీ? అబ్బే అలగిచ్చేత్తే కదింతదాకా ఎందు కొస్తదీ? ఇయ్యలేదండి. నాలుగుయేలూ సల్లగాలాగేసిందీ మహాతల్లీ అంటాడండా అయ్యగోరు. ఈ మాలోకం ఆ అయ్యగోరు గదమాయించినప్పుడేవోఁ, ఆ డబ్బు నేన్తియ్యలేదంటే తియ్యలేదని ఏడ్చిందండి. ఆయన పోలీసులూగట్రాంటూ ధూంధాం ఎగిరాడండోరోజు. ఇదేమో దడిసిపోయి 'సెమించండి బాబయ్యా బుద్ది గడ్డి తిని దీసానూ ఇంకెప్పుడిల్లాంటి పని సెయ్యనూ' అన్చెప్పేసేసి ఆల్ల కాల్ల మీదడిపోయి ఏడ్సి, 'సెమించండయ్యా కొంతకర్చయిపోనాది', అన్చెప్పి ఓ వెయ్యితెచ్చిచ్చిందండి. మిగతాది వాయిదాలుగా జీతంలోకట్టుకోండంటాబతిమాల్తాందండి ఎర్రి పీనుగు! ఎర్రి పీనుగాని ! దొంగతనం సేస్తే గుట్టు సప్పుడు గాకుండా గమ్ము నుండాల. లేదా మొదటే ఆళ్ళడబ్బాళ్లకి పువ్వుల్లో పెట్టిచ్చి బగుమానం దండుకోవాల అంతేగానీ..."

"పోనీ ఆమాత్రం ఒప్పుకుంది పైగా కొంత తిరిగిచ్చింది కదా....." ఏదో అనబోయింది గీత.

"తవఁరు గంగాన మ్మకంటే....." ఇంకా ఏదో అనబోయి మాటలు మింగేసి సద్దుకుంది గంటలమ్మ.

"అదికాదండమ్మగోరూ, మొదట డబ్బుతియ్యనేదంది కదండీ, ఆమాటమీదే సివరాకరుదాకా నిలబడొద్దాండీ? గట్టిగా అదిలించేతలికి కొంత తిరిగిచ్చిందండి. అంటే ఏటర్దం? తను దొంగతనం సేసినట్టొప్పుకున్నట్టే గదండిమరి? ఆల్లింట్లో దొంగతనం సేసీసినట్టు ఒప్పీసుకున్నాక పనిమానిపించకుండా నెత్తినెట్టుకుంటారేటండి? ఓపాలి ఈ పిల్ల దొంగతనాలు సేస్తదీ అని ముద్దరడిపోనాక మరి దానికీ సుట్టుపక్కలెక్కడా పని దొరకదుకదండీ? ఎంత ఎర్రి పీను గ్గాకపోతే... అసలా పదేనొందలూ ఇయ్యకుండా, ఉత్తపున్నేనికి నన్ను పన్లోంచి తీసేసారని మనకాలనీలోనే ఏఅమ్మదగ్గరైనా ఏడిస్తే పనిదొరికేది కదండీ? మరిప్పుడు పనెతుక్కుంటూ దూరానికి ఇంకో కాలనీకి పోవాలగదండీ. ఎంత పిచ్చిపీనుగ్గాబోతే, సుకానున్న పానానికి లేనిపోని పితలాటకం తెచ్చుకుంది గదండమ్మా నెత్తిమీదికి" గంగానమ్మ తెలివితక్కువతనానికి నవ్వుకుంటూ పరపరా అంట్లు తోమేస్తున్న గంటలమ్మని చూస్తూ ఆవిడ వివరిస్తున్న తర్కం వింటూ ముక్కున వేలేసుకుని "ఔరా! ఏమి తర్కం!"అని స్టన్నై నివ్వెర పోయింది గీత.

గీత కిప్పుడు గంటలమ్మ గంటలమ్మలాకాక గంటకో ఘడియకో పేలే టైమ్ బాంబ్ లా పవర్ఫుల్లు గా కనిపిస్తోంది.

"విన్నారా అత్తయ్యగారూ!" అంటూ అత్త పక్కన చేరి గంటలమ్మ ఎంత తర్కం లాగిందో వివరించింది.

అత్తగారు ఆలోచించింది. చించి, "నా కళ్ళు తెరుచుకున్నాయే కోడలు పిల్లా!" అంది.

కోపంగా "ఏమయిందత్తగారూ?" అడిగింది అరవై ఏళ్ళ పిల్లకోడలు అత్త కళ్ళకేసి అనుమానం గా చూస్తూ.

"చూసావూ, మీ మావగారేమో తనకి చెవులస్సలు వినబడవూ, స్క్రోలింగుల్లో న్యూసే చదువుకుంటానూ అన్చెప్పి అడ్డవైన తైతక్కలూ పెట్టుకుని గుడ్లప్పగిస్తారూ కదా, కేవలం చదువుకోడానికే అయితే ఇంటికి ఇన్ని రకాల న్యూసు పేపర్లొస్తాయి అవేవో చదువుకోవచ్చుకదా? టీవీ పెట్టుకునే అలా మూడువరసల్లో పరిగెట్టుకుంటూ పోయే ఆ అక్షరాలెందుకు? చక్కగా కుదురుగా కూచుని కదలకుండా న్యూసుల్చెప్పే పేపర్లో అక్షరాలే చదువుకోవచ్చుకదా? దొంగతనం చెయ్యలేదన్న గంగానమ్మ మళ్ళీ కొంత డబ్బివ్వడమెందుకు? చెవులు పనిచెయ్యవన్న మీమావగారు టీవీన్నమ్మడవెందుకూ? కళ్ళనే నమ్ముకుని పేపరే చదవచ్చుగా? ఆ దిక్కుమాలిన పరిగెత్తే అక్షరాలు నేన్చదవలేనుకదా అని, ఏఛండాలం చూస్తున్నారో! గంటలమ్మ తర్కం నా కళ్లు తెరిపించిందే. తేల్చేస్తానుండు మీ మామగారి సంగతి" అంటూ క్రుధ్ధురాలై న వృధ్ధురాలు ఎంత ఉధృతంగా నడవగలదో అంత ఉధృతంగానూ నడుస్తూ మూడోదాని గదిలోకి ముట ముటలాడుతూ పోయింది అత్తగారు.

ఈ సారి అత్తగారి తర్కానికి అదిరి అవాక్కయిపోయింది గీత. గంటలమ్మ తర్కం అత్తగారి కళ్ళను విప్పదీసి విచ్చుకునేలా చేసింది. మామగారి పీకలమీదకొచ్చింది. వొస్తే వొచ్చింది కానీ అత్తగారి తర్కంవల్ల కోడలి అంతరాంతరాంతరాళాల్లో పెద్దపెద్ద జ్ఞాననేత్రాలు విశాలంగా విప్పారాయి. గీతకి కొన్ని శాశ్వత సత్యాలు తేటతెల్ల మయ్యాయి.

"బోడిగుండుకీ మోకాలికీ లింకుండి తీరుతుంది ఈ భూప్రపంచంలో. తుంటికొడితే పళ్ళు రాలడం ప్రకృతిలో సహజాతి సహజం. చింతకాయలను పటపటా రాల్చేసే మంత్రాలు తప్పకుండా ఉంటాయి ఈ మహా విశాలవిశ్వంలో! మహాప్రభో! తర్కానికందని మహాతర్కాలు రోజూ మనముందే విశ్వమంతటా విలయ తాండవం చేస్తుంటాయి " అని బాగా అర్థమయింది.

అలా తేటగాతెల్లారిన జ్ఞానంతోబాటు, "జ్ఞానానికి భయాన్ని పోగొట్టే శక్తిలేదు " అని మరో శాస్త్రీయ విజ్ఞానం కూడా ఉదయించింది.

మరంచేత ఆ మూడోదాని గదిలోంచి ఏ క్షణాన ఏ అణుబాంబులు విస్ఫోటిస్తాయో అని భయంతో గజగజలాడి పోయి బెంగపెట్టుకుని బిగుసుకుపోయి బిక్కచచ్చిపోయి బెదురుచూపులతో ఎదురుచూస్తూ కూచుంది గీత.

.



కథా కౌముది

# శివ శివ కరుణాబ్ధే ఆర్. శర్మ దంతుర్తి

నందీశ్వరుడు విచారంగా ఉండడం చూసి పార్వతి అడిగింది, "ఏమి నందీశ్వరా మనసు బాగోలేనట్టుందే?"

"అమ్మా, తుంబురుడి వాద్యం లేక కైలాసం చిన్నబోయినట్టుంది తల్లీ."

"అవును కదా, కానీ దూర్వాసుడంతటి బ్రహ్మర్షుల కోపానికి గురి అయి ఇప్పుడు తుంబురుడు దక్షిణ దేశంలో చిరుతొండడిగా మానవ జన్మ ఎత్తి బతుకుతున్నాడు. అదృష్టం కొద్దీ మానవజన్మ ఎత్తే ముందు శివభక్తి ఉండాలని కోరుకున్నాడు కనక ఇప్పటికీ మనల్ని మర్చిపోలేదు."

" అయితే మనం ఓ సారి వెళ్ళి చూసిరావచ్చా అమ్మా?"

" నా చేతిలో ఏముంది నాయనా, ఆయన్నే అడుగు," చిరునవ్వుతో శివుడికేసి చూసింది పార్వతి.

పరమేశ్వరుడు సాలోచనగా పార్వతికేసీ, నందీశ్వరుడికేసీ చూసి అన్నాడు, "నిజం, చిరుతోండడి భక్తి పరీక్షచేసే సమయం వచ్చింది. అదే అదనుగా కాశీలో భారతం రాసిన వ్యాసుణ్ణీ, ఇంకో ఇద్దరు భక్తుల్నీ చూసి చిరుతొండడి దగ్గిరకి వెళ్దాం. ఎవరెంత భక్తులో మీకే తెలుస్తుంది. మొదటి మజిలీ కాశీ.“

★ ★ ★ ★ ★ ★ ★

విశ్వేశ్వరుడు వెలిసిన కాశీ. వ్యాసుడూ, ఆయన శిష్యులూ ఎక్కని గుమ్మం దిగని గుమ్మం లేదు. ఎండ మండుతూంటే కడుపులో ఆకలి నకనకలాడుతోంది. పొద్దుటి నుంచి దాదాపు సాయంత్రం వ్యాసుడూ ఆయన శిష్యులూ ఊరంతా తిరిగి మఠానికి చేరుకునేసరికి ఎవరికీ ఒక్క మెతుకు దొరకలేదని వాళ్ళ మొహాలే చెప్తున్నాయి. వ్యాసుడికి కోపం వస్తూ ఉంది. ఇది కాశీ క్షేత్రం. అన్నపూర్ణా దేవి ఇక్కడ ఎవరికీ ఆకలి లేకుండా చూస్తుందని విన్నాడే? కానీ ఇప్పుడు కట్టెదుట కనబడే నిజం అది కాదు.

వృషభ వాహనం మీద ఆది దంపతులు కాశీ సమీపిస్తూంటే, పెట్టే పరీక్షకి వ్యాసుడు తట్టుకోగలడని పార్వతి అనడం విని శివుడు చిరు నవ్వు నవ్వి ఊరుకున్నాడు. నందీశ్వరుడికి కుతూహలం ఎక్కువౌతోంది.

ఆకలి మూలంగా తాము సరిగా ఆలోచించలేకపోతున్నామేమో. లేకపోతే కాశీలో భోజనపు అలవాట్లు వేరేగా ఉండి ఉండవచ్చు. అందరూ ఉపవాసం ఉండడానికిది ఏకాదశి కూడా కాదే? మళ్ళీ మరో సారి తలో దిక్కుకీ బయల్దేరేరు. దాదాపు సూర్యాస్తమయం అవుతూంటే అవే ఖాళీ కడుపులు. ఈ సారి వ్యాసుడి కోపం రెట్టింపైంది. గంగలో స్నానం చేసి ఆ నీళ్ళు నోట్లో పోసుకున్నా ఈ జఠరాగ్ని బాధ తప్పేటట్టు లేదు. తానెలాగో ఓర్చుకుంటాడు కానీ కూడా ఉన్న ఈ శిష్యులో? క్షణ క్షణానికీ కోపం రాజుకుంటోంది. ఆఖరికి ఇంక ఆగలేక కమండలం అందుకున్నాడు. పంచమవేదం అయిన భారతం రాసి, అష్టాదశ పురాణాలూ ఆపోసన పట్టిన వ్యాసుడితోనా కాశీ అన్నపూర్ణ నాటకాలు?

అదృశ్యంగా చూస్తోన్న శివుడి కళ్ళు కోపంతో ఎఱ్ఱబడడం పార్వతి గమనించింది. నందీశ్వరుడికి ఇదంతా అర్థం అయ్యీ కానట్టుంది.. రుషిపుంగవులు కమండలంలో నీళ్ళు చేతిలోకి తీసుకుంటున్నారంటే ఎవర్నో శపించడానికి ఆయత్తం అవుతున్నారన్నమాటేగా? ఎవర్ని శపిద్దామని ఈయన అనుకుంటున్నారో?

శిష్యులతో అన్నాడు వ్యాసుడు, "కాశీ అంటే సాక్షాత్తూ అన్నపూర్ణా దేవి అవతారం అంటారు కదా. అటువంటి అన్నపూర్ణ మనకి గుప్పెడు మెతుకులు పెట్టలేకపోయింది. ఇటువంటి నగరం ఉన్నా మాడి మసి అయినా ఒక్కటే. ఇక్కడున్న జనానికి బుద్ధి రావాలంటే ఎవరో ఒకరు శపించవల్సిందే. ఇప్పుడు కాశీని నేను శపించబోతున్నాను చూసుకోండి."

శివుడి మొహంలో కోపం ఈ సారి స్పష్టంగా కనిపించింది.

వ్యాసుడు చేతిలోకి నీళ్ళు తీసుకుని చేయెత్తాడు శపించడానికి, "నాకూ, మా శిష్యులకీ గుప్పెడు మెతుకులు పెట్టలేనీ ఈ కాశీ...." ఆ తర్వాత వ్యాసుడి చేయి కదల్లేదు, నోటమ్మట మాట లేదు.

ఒక్కసారి మెరుపులు మెరిసినట్టైంది. ఎదురుగా వాహనం మీద అమ్మవారితో పరమేశ్వరుడు! "భారతం రాసిన శుంఠా! ఒక్కరోజు నీకు భోజనం దొరకలేదని నాకు పార్వతితో సమానమైన కాశీనే శపించడానికి పూనుకున్నావే? ఏం అహంకారం? ఏమనుకుంటున్నావు నీగురించి? అన్నపూర్ణకి నివాసమైన కాశీనే శపించగలవే అనుకుంటున్నావా?" మూడో కన్ను తెరవలేదు కానీ శివుడి మొహంలో అంతటి కోపం కనిపిస్తోంది.

స్థాణువులా మిగిలిన వ్యాసుడిలోనూ, ఆయన శిష్యుల మొహంలోనూ కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. త్రినేత్రుడి ఇంతటి కోపాన్ని తగ్గించగలిగేది అమ్మవారొక్కరే. వెంఠనే స్తోత్రం చేయడం మొదలుపెట్టారు.

నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్య రత్నాకరీ
నిర్ధూతాఖిల ఘోర పావనకరీ ప్రత్యక్ష మాహేశ్వరీ
ప్రాలేయాచల వంశపావనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాందేహీ కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ.

అమ్మవారు ప్రసన్నమై చిరునవ్వుతో అంది, "గంగలో స్నానం చేసి రండి, మీకందరికీ భోజనం ఇక్కడే దొరుకుతుంది."

అప్పటికి తేరుకున్న వ్యాసుడూ, ఆయన శిష్యులూ గడగడలాడిపోతూ స్నానంచేసి వెనక్కొచ్చారు. విస్తళ్ల ముందు కూర్చుని ఆపోసన పట్టగానే అన్నపూర్ణే వడ్డించాక అందరికీ కడుపులు నిండాయి. వ్యాసుడు శివుడి దగ్గిరకెళ్ళి చేతులు జోడించేడు.

వార్ధక్యే చేంద్రియాణాం విగతగతిమతిశ్చాధిదైవాదితాపైః
పాపై రోగైర్వియోగైస్త్వనవసితవపుః ప్రౌఢహీనం చ దీనమ్
మిథ్యామోహాభిలాషైర్భ్రమతి మమ మనో ధూర్జటేర్ధ్యానశూన్యం
క్షంతవ్యో మేఽపరాధః శివ శివ శంభో శ్రీ మహాదేవ శంభో

మహేశ్వరుడి కోపం ఇంకా తగ్గినట్టు లేదు. తీక్షణంగా ఓ సారి చూసి చెప్పేడు " కాశీ అంతటి పవిత్ర క్షేత్రం మీలాంటివాళ్ళకి కాదు. వెంతనే వెళ్ళండి ఇక్కడ్నుండి."

★ ★ ★ ★ ★ ★ ★

వ్యాసుణ్ణి కాశీ నుంచి వెళ్లనిచ్చి శివుడన్నాడు, "చూసారుకదా ఈ వ్యాసుడి సంగతి? ఇక్కడే దగ్గిర్లో మరో భక్తురాలు ఉంది. ఆవిణ్ణి కూడా చూసి పోదాం. ఆవిడ నన్నేమైనా అన్నా కోపం తెచ్చుకోకండేం? ఆవిడ గొప్ప శివభక్తురాలు."

"భక్తురాలైతే? వ్యాసుడంతంటి తపస్సు చేసిందా?" పార్వతి అడిగింది.

"పార్వతీ నాకు తపస్సు కంటే భక్తే ఎక్కువని నీకు తెలియదా?"

శివుడి ఆకారం వెంతనే మారింది. ముని రూపంలో విబూది రేఖల్తో వెళ్ళి భక్తురాలి ఇంటి తలుపు తట్టేడు. పార్వతీ నందీ గమనిస్తూనే ఉన్నారు అదృశ్యంగా.

తలుపుతీసినావిడ వచ్చిన ఆగంతకుడికేసి చూసి " సమయానికొచ్చావు నాయనా. ఇప్పుడే పూజ చేసి నైవేద్యం పెట్టాను. నీ మొహం మీద విబూది రేఖలు చూస్తుంటే నువ్వు శివభక్తుడిలాగే ఉన్నావు. వచ్చి భోజనం చేయి."

"అలాగే, కానీ నాకు నచ్చినవి పెట్టాలి మరి."

"శివుడికి పెట్టిన నైవేద్యమే శివభక్తులకీను," వడ్డించడం ఆరంభమైంది. తినడానికి కూర్చోగానే చెప్పింది ఇంటావిడ, "ఇవన్నీ శివుడికి పెట్టిన నైవేద్యాలు. నేను బాగా వండుతానని చెప్తూ ఉంటారు. మరో విషయం ఏమిటంటే నేను వండినదాన్ని విశ్వేశ్వరుడు అనుగ్రహించి దాన్ని ఇంకా రుచిగా మారుస్తాడు. అదంతా ఆయన విలాసం. ఇప్పటిదాకా నా ఇంటికొచ్చిన ఏ శివభక్తుడూ ఒక్క మెతుకు కూడా పారేయకుండా తిన్నారు. నేనిక్కడే ఉండి వడ్డిస్తూ ఉంటాను. ఏదైనా వృధాగా పారేయడం కుదరదు. సరేనా?"

"తినడానికి బాగుంటే తింటాను. అంతే కానీ నీ ఇష్టప్రకారం తినడం కుదరదు."

"సాక్షాత్తూ పరమేశ్వరుడికి పెట్టిన ప్రసాదం, విశ్వేశ్వరుడి అనుగ్రహం అనీ చెప్తున్నాను కదా? పారేస్తే భగవంతుడికీ, నాకూ కూడా కోపం వస్తుంది."

"చూద్దాం. పారేస్తే ఏం చేస్తారేం?"

"మాటల్లో కాదు, చేతల్లో చూపిస్తాను. చూద్దువుగాని." ఈ సారి భక్తురాలి మొహంలో కాసింత అసహనం.

వడ్డన ప్రారంభమైంది. ఐదు నిముషాల్లో శివుడు తినడం ముగించేడు. అన్నం కెలికేసినట్టుంది. కూరలు అవీ ఏదో రుచిచూడ్డం కోసమా అన్నట్టు తిన్నాడు తప్ప విస్తర్లో పదార్థాలు వేసినవి వేసినట్టే ఉన్నాయి. లేచిపోబోతూంటే ఇంటావిడ కోపంగా అంది,

"ముందే చెప్పానుగా ఇవన్నీ పా రేయకూడదనీ? విభూది రేఖలు పెట్టుకుని వస్తే శివభక్తుడవనుకున్నాను కానీ నీకు శివుడంటే ఏమీ భయం భక్తీ ఉన్నట్టు లేదు. తినకుండా లేవకు."

"నువ్వు వండినవేవీ రుచిగాలేవు. నేను తినను. నాకు డొకొచ్చేలా ఉన్నాయి ఈ పదార్థాలన్నీ."

"మాట్లాడకుండా కూర్చుని తింటావా లేదా?"

"కూర్చోమంటే విస్తరి కెలుకుతూ కూర్చుంటాను కానీ నేను తినను."

"ఆఖరిసారి అడుగుతున్నాను తింటావా లేదా?"

"ఇవేమీ రుచిగా లేవని చెప్పానుగా, నేను తినను."

వెంఠనే ఇంటావిడ రోకలి తెచ్చి శివుడి నెత్తిమీద బాదింది. పార్వతికి కోపంతో ముక్కుపుటాలు అదురుతూంటే నందీశ్వరుడు గుర్తు చేసాడు అమ్మవారికి, "ఇక్కడకొచ్చే ముందు అయ్యవారు చెప్పారు కదా కోపం తెచ్చుకోవద్దనీ..."

మరుక్షణంలో విస్తరి దగ్గిర కూర్చున్నాయన అసలు రూపంతో కనిపించేడు. మొహంలో "నేను పెట్టిన పరీక్షలో నెగ్గావు సుమా" అనే తుంటరి నవ్వు. భక్తురాలు సాష్టాంగపడి క్షమాపణ అడగడం విని పార్వతి కోపం దూదిపింజలా ఎగిరిపోయింది.

కరచరణ కృతంవా కర్మ వాక్కాయజం వా శ్రవణ నయనజం వా మానసంవాపరాధం !

విహిత మవిహితం వా సర్వమే తత్ క్షమస్వ శివ శివ కరుణాబ్ధే శ్రీ మహదేవ శంభో !!

★ ★ ★ ★ ★ ★ ★

వాహనం ముందుకి కదుల్తోంటే చెప్పేడు శివుడు, "మనం ఇప్పుడు చూడబోయేది ఇంకా కఠినమైన పరీక్ష. భక్తుడు గెలుస్తాడో లేదో నాకూ తెలియదు. మీరే చూద్దురు గాని."

కీకారణ్యంలో వనమృగాలు సంచరించే చోట ఓ శివాలయం. నందివాహనం మీద పార్వతీ పరమేశ్వరులు వచ్చేసరికి భక్తుడు ఆలయాన్ని శుభ్రం చేస్తున్నాడు. మధ్య మధ్యలో ఆగి గొణుగుతూ శివలింగం కేసి తిరిగి ఏదో మాట్లాడుతున్నాడు. పార్వతి చెవులు రిక్కించింది వినడానికి.

"... అభిషేకప్రియుడివైన నీమీద ఉమ్ముతుంటే చూస్తూ ఊరుకుంటున్నావయ్యా? శివ శివా, శివ శివా ఎంత అపచారం? ఇవి పోనీయనుకుంటే నీకు ఇక్కడ ఈ మాంసం పెట్టిన వాడెవరో? నీకు మాంసం తినాలనుంటే ఈ ఎంగిలి మెతుకులే కావాలా? ఈ కొరికి పారేసిన ముక్కలా? ఎంత అపరాధం! ...."

పార్వతి సాలోచనగా శివుడికేసి చూసింది. అయ్యవారు విలాసంగా నవ్వుతూనే ఉన్నాడు.

భక్తుడు స్నానం చేసి వచ్చి మహాన్యాసక పూర్వకంగా అభిషేకం పూజా అయ్యేక అక్కడే కూర్చుని అన్నాడు, "పరమేశ్వరా ఇప్పుడు చెప్పు, నీ వాకిలి ఇక్కడ శుభ్రం చేయడానికి నేనుండగా ఎవరు ఇలా చేస్తున్నారో, నువ్వెందుకలా చేయనిస్తున్నావో. నువ్వు మాట్లాడకపోతే ....."

ఇంతలో ఎవరో వస్తున్నట్టూ అలికిడైంది. జరగబోయేది చూడడానికా అన్నట్టు భక్తుడు గుడిలోపల చీకట్లోకి తప్పుకున్నాడు.

వచ్చిన ఆగంతకుడి నోరు ఉబ్బి ఉంది. తలమీద ఏవో అడవిపూలు. ధనస్సూ బాణాలు భుజాలమీద నుంచి వేలాడుతున్నాయి. చేతిలో అప్పుడే కాల్చిన పంది మాంసం. దానిమీద అడవి తేనె పూసి ఉంటే చుట్టూ ఈగలు ఎగురుతున్నాయ్. చేతులు రెండూ ఖాళీలేకపోవడం వల్ల మొదటగా అభిషేకానికి శివలింగాన్ని సిద్ధంచేయడానికి కాలితో శివలింగం మీద పూవులూ అన్నీ పక్కకి తోసేడు.

అది చాలదన్నట్టూ నోటితో తెచ్చిన నీటిని శివలింగం మీద ఉమ్మి అభిషేకం! తన తలమీద తెచ్చిన పూలతో పూజ చేసి పంది మాంసం పెట్టి, "ఇదిగో చూడూ, ఇది బాగా ఊరబలిసిన పంది. నేను అటవికుణ్ణి కనక ఏ జంతువెలా ఉంటుందో బాగా తెలుసు. దాన్ని చంపి కాల్చాక రుచి చూసి మరీ తెచ్చాను సుమా. రుచుల సంగతి నాకేం తెలుస్తుందనుకుంటున్నావేమో, తేనె పూసిన పంది మాంసం నువ్వు ఓ సారి తింటే మళ్ళీ వదలవు మరి..."

"ఇంతదూరం తీసుకొచ్చింది ఇది చూపించడానికా? ఈ మాంసం నిజంగా ఈయన తినేయడు కదా," అనుకుంటూ అమ్మవారు శివుడికేసి చూసింది. పక్కనే చీకట్లో దాక్కొని చూస్తోన్న శైవభక్తుడికి కంపరం ఎత్తుతోంది. కాలితో శివలింగాన్ని తన్నేంత ధైర్యమా వీడికి?

"రోజూ పెట్టిన ప్రసాదం వెంతనే తినే శివుడికి ఈవేళ ఏమైందబ్బా? మాంసం రుచిగా లేదా? పువ్వులు వాడిపోయాయా" అనుకుంటూ ఆగంతకుడు శివలింగంకేసి చూసేసరికి, శివుడికున్న ఓ కంట్లోంచి రక్తం కారడం కనిపించింది

"ఇదన్నమాట సంగతి. పాపం, కంట్లోంచి రక్తం కారుతూంటే ఇంక తిండి ఎలా తినగలడు? శివయ్యా ఇప్పుడే వస్తా," అంటూ బయటకెళ్ళి వెళ్ళినంత వేగంగా వెనక్కొచ్చేడు. చేతిలో ఏవో ఆకులు.

"మా గూడెంలో ఇలాంటి జబ్బులొస్తే మేం ఈ పసరు రాసుకుంటాం. ఇదిగో ఇది పెట్టగానే తగ్గుతుంది. కాస్త ఓర్చుకో, మొదట్లో నెప్పి ఉన్నా వెంతనే తగ్గుతుంది..." మాట్లాడుతూ కంట్లో పసరు పెట్టేడు. రక్తం ఇంకా అలా కారుతూనే ఉంది. చాలాసేపు అన్నిరకాల వైద్యాలు చేసాక ఏదో ఒక్కసారి గుర్తొచ్చినట్టూ ఆగంతకుడు "కంటికి కన్నే మందు కదా?" సరే ఈ బాణంతో నా కన్ను తీసిస్తా సరేనా?" అంటూ బాణం తీసి దాని కొనతో తన కన్ను తీసేసి శివలింగానికి అమర్చాడు. అప్పటిదాకా ఆగంతకుణ్ణి అసహ్యించుకున్న అదృశ్య ప్రేక్షకులందరికీ కనుబొమలు అప్రయత్నంగా పైకిలేచాయి.

మొదటి కన్ను కారడం నయమైనా వెంతనే శివలింగం మీద రెండో కంట్లోంచి రక్తం కారడం మొదలైంది. ఆగంతకుడు తన ఆలోచనలు పైకే అన్నాడు, "ఈ జబ్బుకి పసరు పనిచేయదని తేలిపోయింది కనక రెండో కన్ను ఇవ్వడమే మంచిది.. మరి తన కున్న రెండో కన్నుకూడా తీసేస్తే శివలింగం మీద కన్ను ఎక్కడ అమర్చాలో కనపడదు కదా? ఎలా?" వెంతనే స్ఫురించింది – అదేమంత కష్టం కాదు. కాలి వేలు శివలింగం కంటిమీద పెడితే అదే గుర్తుగా తెలియదూ? బాణం మళ్ళీ బయటకి తీసి కాలు శివలింగం కంటి మీద పెట్టి మిగిలిన ఒక్క కన్ను తీయబోయేడు.

ఇప్పటికి అర్థమైంది ప్రేక్షకులకి కిరాతకుడు చేయబోయేదేమిటో. నందీశ్వరుడి నోట్లోంచి అప్రయత్నంగా వచ్చింది, "హర హర మహదేవా..." బాణం ఇలా కంటికి ఆనించగానే ముందుకొచ్చి ఓ చేత్తో కిరాతకుడిని ఆపుతూ పార్వతితో అన్నాడు ముక్కంటి, ""చూసావు కదా ఈ కిరాతకుడి భక్తి? ఇప్పుడు చెప్పు ఇలాంటి భక్తుడు ఏది పెట్టినా తినకుండా ఉండగలనా?"

★ ★ ★ ★ ★ ★ ★

నంది వాహనం ముందుకి సాగిపోతూంటే పార్వతి అంది, "ఆఖరుగా చూడబోయేది కిరాతకుడి భక్తి కన్నా ఎక్కువా? పరీక్ష ఇంతకన్నా దారుణంగా ఉండబోతోందా?"

"తుంబురుడే కదా ఇక్కడున్నది. అతని భక్తి చూడ్డానికే కదా మనం బయల్దేరేం? ఈ సారి నువ్వుకూడా రా మారువేషంలో. జరిగేది చూడవచ్చు," చెప్పేడు చంద్రమౌళి.

దక్షిణ దేశంలో ఏదో పల్లెటూరు. ఊరి చివర సత్రంలో కాటికి కాళ్ళు చాపుకుని ఉన్న ఇద్దరు ముసలివాళ్ళు. ఆకాశంలోంచి ఏనుగు తొండాలంతటి ధారల్తో వర్షం. సత్రంలో మిణుకు మనే చిన్న దీపం. ఎవరో వస్తున్న అలికిడైతే ఇద్దరూ అటువేపు చూసేరు.

వచ్చినాయన ఈ దంపతులిద్దర్నీ పరీక్షగా చూసి అడిగేడు, "అయ్యా మీరిద్దరూ చూడబోతే శివభక్తుల్లా ఉన్నారు. నా పేరు చిరుతొండ నంబి. శివభక్తులకి భోజనం పెట్టకుండా మేము తినము ఏ రోజూను. చాలా రోజులనుంచిఎవరూ ఎంత గాలించినా దొరకట్లేదు. మీరు భోక్తలుగా వస్తారా?"

"మేమూ శివభక్తులమే. భోజనానికి పిలిస్తే అంతకన్నా కావాల్సిందేముంది? కానీ మేము నడవలేము. ఎలాగో ఒకలాగ వచ్చినా మేము నరమాంసం తప్ప ఏదీ తినము."

".. మిమ్మల్ని నేను మోసుకుని తీసుకెళ్ళగలను."

"మాంసం ఎక్కడ్నుంచో తెచ్చి కుదరదు. మా ఎదురుగా చంపి వండాలి."

"అది ఎలాగో ఒకలా తర్వాత చూద్దాం. ముందు మీరు బయల్దేరండి. నేను గత పదిరోజులగా శివభక్తుల కోసం చూస్తున్నాను. ఈ వర్షం ఎన్నిరోజుల్నుంచో అనేది కూడా గుర్తులేకుండా పోయింది. మీ వస్తాననడమే చాలు..."

"మరో విషయం. మాకు వడ్డించినవాళ్ళు కూడా మాతో పాటు కూర్చుని తినాలి."

"సరే"

ఇంటికి తీసుకొచ్చిన ముసలివాళ్లని లోపలకి ఆహ్వానించింది నంబి భార్య. ఇంట్లో వేరే ఎవరూ ఉన్నట్టు అలికిడి లేదు.. నంబికున్న ఒక్క పిల్లవాడూ ఎక్కడో ఆడుకుంటున్నాడేమో?

వచ్చిన ముసలాయనకి అప్పుడే కోపం వచ్చినట్టుంది; అరుస్తున్నాడు, "నరమాంసం వండాలని చెప్పాను కదా? ఎవర్ని వండుతావ్?"

ఎవర్నీ ఎలాగా అడగడం కుదరదు. తానూ తన భార్యా బలి అవడం కుదరదు ఎందుకంటే తమతో కూడా కూర్చుని తినాలని చెప్పాడు కదా ముసలాయన? ఇంక మిగిలింది పిల్లవాడే. సరే వాణ్ణే పిలిచి అడుగుదాం.

"చీలాలా," పిల్చేడు నంబి. పరుగెట్టుకుంటూ వచ్చిన కుర్రవాణ్ణి అడిగేడు "ఈ శైవ దంపతులకి ఆహారం అవుతావా?"

"తప్పకుండా అవుతా,"

నంబీ, అతని భార్యా కుర్రాణ్ణి అక్కడికక్కడే బలిచ్చి నిజంగానే వండడం చూసేసరికి పార్వతి నిజరూపంలో కనపడడానికి సిద్ధమైంది కానీ, త్రినేత్రుడు వారించేడు. పరీక్ష ఇంకా పూర్తవలేదే?

వంట అయ్యేదాకా ముసలాయన గునుస్తూనే ఉన్నాడు, ఆకలి ఆకలి అంటూ.

విస్తట్లో వడ్డించడం మొదలౌతూనే ముసలాయన చెప్పేడు, "చెప్పేను కదా మీరు కూడా తినాలనీ?" మారుమాట్లాడకుండా నంబి తినడానికి కూర్చున్నాడు, తాను తినబోయేదేమిటో తెల్సినా. ఇంతట్లో ముసలావిడ అడిగింది, "మీ పిల్లాడేడీ? మీకు పిల్లలు లేరా?"

నంబి నోట్లోంచి మాట రాలేదు. వాళ్ళావిడ నోట్లో గుడ్డలు కుక్కుకోవడం చూసి ముసలావిడే అంది మళ్ళీ, "పిల్లలు లేని గొడ్రాలు వండితే మేము తినం. పిల్లలున్నారా లేదా? ఉంటే మాకు చూపించండి. పిలవండిలా.."

"వాళ్ళు తర్వాత ...."

"కాదు ఇప్పుడే చూడాలి పిలవండి."

నంబి అంతటి దుఃఖంలోనూ నోరెత్తి పిల్చేడు, " చీలాలా....."

బయట తలుపుదగ్గిర్నుంచీ ఎవరో పరుగెత్తుకు రావడం చూసి కళ్ళీళ్ళు తుడుచుకుంటూ తలపైకెత్తేడు నంబి. ఎదురుగా తాను బలిచేసిన కొడుకు సజీవంగా, ముగ్ధమనోహరంగా నవ్వుతూ!! ఏమి జరుగుతోందో అర్థం కాక పక్కనే ఉన్న ముసలి దంపతులకేసి చూసేడు. ఇప్పుడు తన పక్కనున్నది ముసలి వాళ్ళు కాదు, అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడూ, ఆర్తత్రాయ పరాయణుడూ అయిన శ్రీకంఠుడు! ఆయన పక్కనే ధగద్ధగాయమైన ప్రభలతో ___.గౌరీం త్రిపురాం పరాత్పరకళాం శ్రీచక్ర సంచారిణి!

★ ★ ★ ★ ★ ★ ★

కైలాసం:

___. ఓం నమస్సోమాయచ రుద్రాయచ నమస్తామ్రాయచారుణాయచ నమః శంఖాయచ పశుపతయేచ నమ ఉగ్రాయచ భీమాయచ నమో అగ్రేవధాయచ దూరేవధాయచ నమో హంత్రేచ హనీయసేచ నమో వృక్షేభ్యో హరికేశేభ్యో నమస్తారాయ నమశ్శంభవేచ మయోభవేచ నమశ్శంకరాయచ నమశ్శివాయచ శివతరాయచ...

మంద్ర స్థాయిలో స్తోత్రం వినిపిస్తూంటే గంగాధరుడు ధ్యాన సమాధిలోంచి బయటకొచ్చి పార్వతినీ నందీశ్వరుణ్ణీ చూస్తూ అడిగేడు, "చూసారు కదా నా భక్తుల్ని. వీళ్లలో మీకెవరు నచ్చారు?"

పార్వతి ఏమీ చెప్పకపోవడం చూసి నంది చెప్పేడు, "ఈ భక్తులు మనిషికి ఉండే కాళ్ళూ, చేతుల్లాంటి అవయవాలవంటివారు. ఏ అవయవం మంచిదంటే ఏం చెప్పగలం? మనుగడకి అన్నీ అత్యంత అవసరమే కదా?"

తుంబురుడు వాద్యం మీటడానికి సరిచేస్తోంటే నందీశ్వరుడడిగేడు, "తుంబురా, మిమ్మల్ని అసలు దూర్వాసుడెందుకు శపించాడు?"

"ఆయన కుటీరం బయట. జింక తో ఆడుకుంటున్నారు ఒక సాయింత్రం పూట. నేను అటువైపు వెళ్తూ సరదాకి ఆ జింక కేసి తిరిగి చిటికెలు వేసాను. అంతే, కోపం వచ్చి మానవ జన్మ ఎత్తు అన్నారు," చిన్నబోయిన మొహంతో చెప్పేడు తుంబురుడు.

"ఇంత చిన్న పనికి అంత పెద్ద శిక్షా?"

తుంబురుడు ఏదో చెప్పబోయేంతలో పినాకి చెప్పేడు, "నీలో ఏదైనా కాస్త విషయవాంఛలు మిగిలి ఉంటే మనసు ఆ ప్రకారంగా నడుస్తూ బుద్ధిని ఏమి చేయాలో ప్రేరేపిస్తూ ఉంటుంది. బుద్ధిః కర్మానుసారిణీ. ఆ వాంఛలు పోవడానికి బ్రహ్మర్షి శాపం సహకరించింది. ఇప్పుడా కోరికలన్నీ పోయినందుకు మహర్షి కి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఆయన నీకు చేసినది మేలే కానీ మరేమీ లేదు."

తుంబురుడి వాద్యంలో ప్రమథ గణాలు అందుకున్నారు.

నమశ్శివాభ్యాం సరసోత్సవాభ్యాం నమస్కృతాభీష్టవరప్రదాభ్యాం |
నారాయణేనార్చితపాదుకాభ్యాం నమో నమశ్శంకరపార్వతీభ్యాం ||

.




# సాయంసంధ్య

స్వాతీ శ్రీపాద

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

సాయంసంధ్య. మసక చీకట్లు ముసురుకుంటున్నాయి. వెనక్కు సాగి లైట్ ఆన్ చేసితలపైకెత్తి చూసింది వైశాఖి.

అప్పటి వరకు పుస్తకాలు, లాప్ టాప్ మధ్య తనదైన ప్రపంచం లో మునిగిపోయిన వైశాఖి ఒక్కసారి కాళ్ళు సవర దీసుకుని, రెండు చేతుల వేళ్ళతో సుతారంగా కళ్ళు మెత్తగా నిమురుకుంది. లేచి టేబుల్ మీది ఖాళీ టీ కప్పు అందుకుని సింక్ వైపు నడిచింది.

అప్పటి వరకు ఉనికి తెలియకుండా ఒదిగిపోయిన మనసు మళ్ళీ ఊపిరిపోసుకుని కళ్ళు విప్పింది. ఎప్పుడో వెళ్లి పోయిన అమ్మ గుర్తుకు వచ్చింది. నిశ్శబ్దంగా తృణీకరించిన నీరజ్ గుర్తుకు వచ్చాడు. అర్ధంతరంగా జీవితం ముగిసిన మిత్రుడు శార్వరి గుర్తుకు వచ్చాడు. చివరి వరకూ తోడనుకున్న సంహిత్ అర్ధంతరంగా వదిలెయ్యడం గుర్తుకు వచ్చింది.

ఎక్కడ లేని నీరసం ఆవహించినట్టని పించింది.

ఎడారులు ఎండమావుల వెంట పరుగులు పెట్టి అలసిపోయిన భావన.

“ నాకేనా , ప్రతి వాళ్ళు ఇలాగే అనుకుంటారా?” సందేహ పడిందో క్షణం.

చిన్నప్పుడు ఎప్పుడో , అమ్మ చెప్పగా వింది. చెల్లాయి పుట్టే సరికి బహుశా రెండున్నర మూడేళ్ళ వయసు కావచ్చు , అక్కల సాయంతో నాన్నే మరొకరి ఆడదిక్కు లేకున్నా నెట్టుకొస్తున్నాడు. ఉదయమే పిల్లలకు పాలు కాఫీ లు హడావిడిలో తను మారాం మొదలెట్టిందట. పాలు వద్దు కాఫీ కావాలని. సరేనని చిన్నగ్లాస్ లో కాఫీ పోసినా , కాదు మొత్తం కాఫీ నాకే కావాలని. కాస్సేపు చెప్పి చూసి వినకపోయే సరికి గట్టిగా తిట్టి విసుక్కున్నాక నెలల పాటు ఆయన వైపే చూడలేదని.

ఇది చాలా చిన్నఘటనే కావచ్చు కాని ఇప్పుడు తలచుకుంటే తన జీవితం మొత్తం ఆ ఒక్క ఘటన వివరిస్తుందని. అవును చిన్నప్పటినుండీ అదే మనస్తత్వం. అమ్మ ప్రేమంతా కావాలి . నేనే నా అనుకునే వారికి సర్వస్వము కావాలి.

సాధ్యమా?

అందుకేగా ఈ అశాంతి.

తలవిదిల్చి మొహం, కాళ్ళు, చేతులు కడుక్కుని సంధ్య దీపం వెలిగించింది. ఎంత నిరాపేక్షగా దీపం వెలిగిస్తుందో తనకే తెలుసు .

" ఏం మిగిలింది ఏదైనా ఆశించటానికి ?" ఏమూలో నిర్లిప్తత.

లేచి వచ్చి కాస్సేపు టీవీ చూద్దామనుకుంది.

ఎన్ని ఛానెల్స్ మార్చినా అవే కథలు, లేదా సినిమాలు, వార్తలు. టీవీ ఆఫ్ చేసి లేచి వెళ్ళి బాల్కనీలో డిం లైట్ కూడా ఆఫ్ చేసి వాలు కుర్చీ లో వాలింది. సన్నగా వ్యాపించిన చవితి వెన్నెల మసకలో మనసు కూడా మసకబారినట్టనిపించింది.

ఎప్పటి మాట , యాభై ఏళ్ల క్రితం సంగతి. పదహారు పదిహేడేళ్ళ వయసు. పక్కింటి అనసూయమ్మ గారి అక్క కొడుకుగా పట్నం నుండి వచ్చాడతను. మగ వాళ్ళలో కాస్త తెలుపనే చెప్పుకునే రంగు, చాకులా చురుకుగా కనిపించే పొడవాటి రూపం, ఎబ్బెట్టుగా కాక అందంగా అమరిన కళ్ళజోడు. సుందర సాయి. నిజమే ఇన్ని సంవత్సరాల్లో అతని పేరేప్పుడైనా ఆదమరచైనా మరచిపోతే కదా..

చూడగానే జన్మ జన్మలుగా ఎదురుచూస్తున్నా మనిషిని చూసిన సంతృప్తి. ఇతనికోసమే పుట్టానేమో నన్న భావన.

అయినా ఎంత పరిచయం పెంచుకోవాలని ప్రయత్నించినా , పెద్ద అంటీ ముట్టనట్టు అయిష్టంగానే మాట్లాడాడు.తెల్లారితే వెళ్ళిపోతాడని తెలుసు అందుకే ధైర్యం చేసి మనసులో ఉద్దేశ్యాన్ని మాటల్లోకి మార్చి మరీ అతనికందించింది.

స్పష్టంగానే రాసింది. మిమ్మల్ని చూడగానే ఇలా అనిపించింది.నన్ను పెళ్లి చేసుకుందుకు అభ్యంతరమా? అని

జవాబు రాలేదు సరికదా, తెల్లవారి ఉదయమే నిద్రలేచి పక్కింటికి పనిగట్టుకు వెళ్ళింది.

గడప దాట బోతూ ఒక్క క్షణం ఆగి –" జవాబు మీ ఫ్రెండ్ , అదే సావేరికి చెప్పాను" అంటూ సాగిపోయాడు.

సావేరి అనసూయమ్మగారి కూతురు. తన క్లాస్ మేట్.

గిరుక్కున వెనక్కు తిరిగి ఇంటికి వచ్చేసింది. మనసు గాయ పడింది. తమ ఇద్దరి మధ్య విషయం దానికెందుకు చెప్పాలి? ఏం చెప్పాడని దాన్నెప్పుడు అడగలేదు. అదీ ఎప్పుడూ ఇలాగన్నాడని చెప్పలేదు. ఎన్ని సంవత్సరాలు ఆ గాయాన్ని తలుచుకుంటూ ఓడిపోయిన భావనలో గడిపేసిందో.. !

ఎప్పుడయినా అతనెక్కడయినా కనబడాలని ఎంత ఆకాంక్షించిందో ... ఉహు ప్రపంచం ఎంతో చిన్నది .ప్రతివాళ్ళూ అక్కడో ఇక్కడో మళ్ళీ మళ్ళీతారసపడతారని అంటారు . కాని అది తన విషయంలో మాత్రం శీతకన్నేసింది. ఇన్నేళ్ళలో రాష్ట్రాలు , దేశాలూ తిరిగినా అతనెక్కడా తారసపడ లేదు. అతని వివరాలేలా తెలుసుకోవాలో తెలియదు . పేరు తప్ప మరే వివరాలూ తెలియవాయే.

అయినా అప్పుడు తెలియలేదు కాని జీవితంలో అడుగడుగునా అతను గుర్తుకొచ్చేవాడు. ఆ వెలితి మరెవరూ పూడ్చలేనిది.అలాగే ఆ బాధకూడా మరొకరితో పంచుకోలేనిది. వ్యసనాలకు అలవాటు పడి మర్చి పోయేందుకు ఆడజన్మ అయిపోయింది. తినడానికి తప్ప మరి దేనికి స్వేచ్ఛ వుంది!?.

కాని ఆరోజు తరువాత తనమీద తనకి శ్రద్ధ తగ్గటం, తినేందుకు బ్రతుకుతున్నట్టు , మరేమీ అవసరం లేదన్నట్టుగా --- ఎవరికోసమో ఎన్నేళ్ళు...యాభై సంవత్సరాలు.!! గట్టిగా లెక్కేస్తే ఒక జీవితకాలం. అయినా మనసుకు మరుపు రాదేం? కాదని తృణీకరించినా అతని తలపులేనా?

అసలు ఇప్పుడిప్పుడు ఈ మధ్య అనిపిస్తోంది. తృణీకరించాడా? ఏమో! ఏం చెప్పాడని ఒక్కసారి సావేరిని అడిగితే ఎంత బాగుండేది? ఇప్పుడు సావేరి ఎక్కడుందో తెలియదు.

" ఇష్టమే పెద్దవాళ్ళ ను మాట్లాడమను అన్నాడేమో ..ఏమో–పోనీ అదైనా చెప్పొచ్చుగా? మర్చిపోయిందేమో.."

ఇప్పుడిక ఏమనుకుని ఏం లాభం ? అర్థం లేని అహంకారంతో అతన్ని , జీవితాన్ని పోగొట్టుకుందా?

ఇప్పుడిక అతనున్నాడో లేదో తెలియదు. ఎదురుపడ్డా ఒకరినొకరు గుర్తు పడతారన్న ఆశ అసలే లేదు. అయినా అతను మరుపు రాడెందుకు?

జవాబు దొరకదు. లేచి లోపల హాల్లోకి వచ్చి లైట్ ఆన్ చేసింది. ఇంట్లోకీ మనసులోకీ వెలుగు వచ్చినట్టనిపించింది.

టివీ ఆన్ చేసింది. పెద్ద రోజూ చూడకపోయినా అప్పుడోఇప్పుడో ఇలా దిగులనిపించినప్పుడు మనసు డైవర్ట్ చేసుకుందుకు గంటల తరబడి టివీ చేసిన రోజులున్నాయి.

కాని అదేం దిక్కుమాలిన సీరియలో.. ఇద్దరు పిల్లలను సమానంగా చూడవలసిన తల్లి ఒకరిపట్ల వివక్ష చూపడం ..అమ్మలాగే..

అమ్మంటే ఎంత ప్రేమ ఉన్నా తనను కాదని మిగతా పిల్లలను మరింత ప్రేమగా చూడటం తట్టుకోలేక పోయేది వైశాఖి. అందుకే అమ్మతో మనస్పూర్తిగా మాట్లాడలేకపోయేది.

అయినా చివరి రోజుల్లో ఆరేడు నెలలు దగ్గరే ఉంచుకున్నా అమ్మకి మాత్రం 'ఆ కూతురు సుఖపడటం లేదు. దీని పిల్లలు సవ్యంగా లేరు' అంటూమిగతా వారి గురించే వాపోయేది.

చిరాకు పది అమ్మతో ముభావంగా ఉందటం ..

అలాటి రోజుల్లోనే అమ్మ ఇక్కడి నుండి వెళ్ళిపోయింది. మళ్ళీ తిరిగి ఆవిడను చూడటం శవంగానే. ఇప్పుడనిపిస్తుంది అమ్మకు అమ్మలా ఎందుకు కాలేకపోయానని.

టక్కున టివీ ఆపేసిలేచి బెడ్ రూమ్ లోకి వెళ్లి నిర్లిప్తంగా పక్కపై వాలింది వైశాఖి.

##########

కిటికీ రెక్కలమీద చినుకుల టపటప శబ్దానికి మెళుకువ వచ్చింది వైశాఖికి. బెడ్ లైట్ మసక వెలుగుకి తోడు కిటికీ అద్దాల్లోంచి తొంగి చూస్తున్న ఉషోదయం. లేచి వెళ్లి కిటికీ వద్ద నించుని కర్టెన్ పక్కకు తప్పించి బయటకు చూసింది. పెద్ద వానేం కాదు, ఓ చిన్న జల్లు అంతే.

ఒక ఓదార్పులా, ఒక వసంతపు జల్లులా –అవును అచ్చంగా శార్వరి స్నేహంలా. ఎంత అనునయంగా నచ్చ చెప్పేవాడు. ఏ విషయమైనా దాపరికంలేకుండా అడ, మగ అనే వివక్ష లేకుండా చర్చించలిగేది. అలాంటిది నలభై దాటకుండానే నూరేళ్ళు నిండి పోవాలా? ఇప్పటికీ మనసు చాలా బాధపడ్డ రోజున అతను కలలోకి వచ్చినప్పుడు ఎంత సాంత్వన దొరుకుతుందో.!

పొద్దున్న పొద్దునే శార్వరి గుర్తుకు రాడం ఆనందంగానూ ఉంది, అతని లేమి పెద్ద వెలితి గానూ ఉంది.

ఎప్పుడూ లేని ప్రశ్న ఒకటి ఆమె మనసు ఆమెనడిగింది.

“ నువ్వెప్పుడైనా శార్వారిలా ఎవరికైనా నిరాపేక్షగా ప్రేమను పంచావా?” అంటూ.

జవాబు కోసం తత్తరపడింది వైశాఖి. నిజమే ఎంత సేపు ' ఇది చేసాను అది చేసాను లోకం నాకు ప్రతిగా ఏమిచ్చిందా'ని వాపోడం తప్ప...

చివరకు , చివరకు కన్నపిల్లల విషయంలోనూ అంతేగా, తండ్రి లేకున్నా తల్లి తండ్రీ తానై పెంచినా కృతజ్ఞత లేదనీ , మర్యాద ఇవ్వరనీ , ఎన్ని అభియోగాలు మనసు అరలనిండా పేర్చు కుంది.

తెల్లారి లేచి అదే చెబ్దామనుకుంది కూడా.

నా దారిన నాబ్రతుకు నన్ను బతకనివ్వండి అని.

నిజమే.. వాళ్ళ జీవితాలు వాళ్ళవి వాళ్ళ సమస్యలు వాళ్ళవి తనూ మరో సమస్యలా మారాలా వాళ్లకి ?

తేలిక పడ్డ మనసుతో ఇంటి ముందు లాన్ లో నడక మొదలు పెట్టింది.

చెప్పులు లేని కాళ్ళకి పట్టుకుచ్చులా తగులుతున్న మెత్తని గడ్డి స్పర్శ , చల్లదనం గుండె వరకూ పాకుతున్నట్టుగా వుంది.

ఓ మూల కొత్తగా కొని తెచ్చిన పసుపు పచ్చని గులాబీ తొలి పువ్వు విరిసినట్టుంది. సంబరంగా వెళ్లి దాన్ని తనివితీరా నిమురుతుంటే కంటి కొసలనుండి లీలగా కనిపించింది పనిమనిషి ఆదమ్మ కూతురు ఆరేళ్ళ జానకి, సర్వెంట్ పోర్షన్ ముందు నుంచుని ఆశా నిరాశల చూపులను సారించటం.

మొదటి సారి ఆ పిల్లకు పువ్వు కావాలా అన్నట్టు సైగ చేసింది. దాని మొహం పొద్దు తిరుగుడు పువ్వులా విచ్చుకుంది.

రమ్మన్నట్టు సైగ చేసి , ఆ పిల్ల పరుగెత్తుకు వచ్చేలోగా వంగి ఆ పువ్వు తుంచి ఇంకా సరిగ్గా లేవనైనా లేదు. పక్కకు వచ్చిన ఆపిల్ల చటుక్కున వైశాఖి బుగ్గపై పెదవులాంచి తన సంతోషాన్ని వ్యక్త పరచింది.

మరుక్షణం వైశాఖి ఇస్తున్న పువ్వు తీసుకోకుండానే తూనీగలా పరుగెత్తి వెళ్ళిపోయింది.

చెంప పెట్టులా తోచింది వైశాఖికి.

ఉత్తుంగ హిమాలయం లాంటి పసిపాపముందు తన జీవన విధానం ఆలోచన ఒక ఉబిలా తోచాయి.

తెల్లవారి కొడుకులిద్దరూ భయపడుతూ ఎదురుచూస్తుంటే మృదువుగా చెప్పింది వైశాఖి.

" ఇంతవరకూ నాకోసం నా వాళ్ళ కోసమే బ్రతికానురా ఇక మిగిలిన అతి కొద్ది జీవితం ఎవరికైనా ఏదైనా చేద్దామన్న ఆలోచన. అలాగని మీ వద్దకు అసలు రానన‌టం లేదు. ఏడాదికోసారి మీరొస్తే మరోసారి నేనొస్తాను. ఇది నా అభిప్రాయం .చివరినిర్ణయం మీదే, కాని నాకూ ఏదైనా చెయ్యాలని ఉంది మరి"

####



# కథా కౌముది

# నిజం ముంగిట్లో ఓ అబద్ధం

## డా.నారాయణ గరిమెళ్ళ

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

ఈ సమయంలో నేను ఇలా రగిలిపోతున్నానంటే నాకే నమ్మశక్యంగా లేదు.

ఎనభైమూడు సంవత్సరాల వయసులో ఒక వైపు వృద్ధాప్యం నన్ను కమ్ముకొస్తోంది. అందుకు తోడు, నేను ఎప్పటినుండో గుప్పు గుప్పుమంటూ తాగి పారేసిన సిగరెట్ల పొగ వలన గొంతు క్యాన్సర్ మహమ్మారి మరోవైపు నన్ను కబళిస్తోంది. క్యాన్సర్ వచ్చిన సంగతి ఆరు నెలల క్రితమే తెలిసింది. ఆదరబాదరాగా కిమోథెరపి చేసి గొంతులోని క్యాన్సర్ ని కొంత కరిగించి నాకు భూమి మీద మరికొంతకాలం పాటూ నూకలు మిగిల్చారు డాక్టర్లు. గొంతు కింద, వేలితో నొక్కి మాట్లాడే ఒక పరికరాన్ని
అమర్చారు.

జీవితాంతం తనని పనులతో, బాధ్యతలతో కష్ట పెట్టినా చలించక, ఇప్పుడీ చివరి రోజులలో కూడా ఎంతో సహనంతో నాకు సపర్యలు చేసుకుంటూ పోతోంది నా అర్ధాంగి. బాగున్నంత కాలం ఆమెను ప్రేమగా చూసుకోలేక పోయానని పిచ్చి బాధగా ఉంది. నా ఒక్కగానొక్క కొడుకూ, కోడలూ నన్ను ఎప్పటి నుండో భారంగా భావిస్తున్నారు. స్నేహితులు, బంధువులూ ఎవరి మట్టుకి వారు వచ్చి చూసి సానుభూతి వచనాలు వల్లించి వెళ్ళిపోతున్నారు. నన్ను వచ్చి పరామర్శించి పోతున్న అందరి ముఖాలలోని దైన్యం అస్సలు నచ్చట్లేదు. చాలా యావగింపుగా ఉంది. ఒకప్పుడు నచ్చిన ఈ మనుషులంతా ఇప్పుడు పరమ రోతగా, అసహ్యంగా అనిపిస్తున్నారు. ఎవరైనా వాళ్ళని రావద్దని చెబితే బాగుండుననిపిస్తోంది.

నా ముప్పై రోజుల ముగింపులో పదిహేను రోజులైపోయాక చివరిలో వచ్చాడు సత్యం, నన్ను పరామర్శించడానికి. రావడం రావడమే ఎప్పుడూ వెలిగే అదే నవ్వు మొహంతోనే నన్ను పలకరించాడు. లేశ మాత్రమైనా దైన్యం, బాధ, సానుభూతి కనిపించని అతని భావాలు చూసి

స్థాణువై పోయాను. గొప్ప సంతోషంగా కూడా అనిపించింది. ఇప్పుడతనికి ముప్పైయేళ్ళు వయసు ఉంటుంది. నా కొడుకు కన్నా ఐదారేళ్ళు తక్కువ. ఒకప్పుడు మా ఇంట్లోనే ఉండి చదువుకున్నాడు. మాతో తనూ కలిసిపోయి ఉండే వాడు. నాలుగేళ్ళ పాటూ చేదోడు వాదోడుగా ఉంటూనే డిగ్రీ పూర్తి చేసుకుని, ఉద్యోగం తెచ్చుకుని మా ఇంటి నుండి వెళ్ళిపోయాడు. అతను మా ఇంట్లో ఉన్నప్పుడు నేను అతని కోసం ప్రత్యేకంగా చేసినది ఏమీ లేదు. పైగా నేను గర్వంగా పౌరుషంగా బతుకుతున్నానన్న భావనలో, మా మీద ఆధారపడి చదువుకుంటున్న అతని మీద చులకన భావం కూడా ఉండేది.

వచ్చినప్పటి నుండి కేవలం పరామర్శించి వదిలెయ్యకుండా నాకు కావలసిన మందులు అందివ్వడం, కాళ్ళు పట్టడం, అవసరాలు గుర్తించి తీర్చడం లాంటి సపర్యలు చేస్తున్నాడు. అంటు రోగం కాక పోయినా, రోగిష్టి మనిషినని నన్ను దూరంగా పెట్టి చూస్తున్న వారి మధ్య ఇతని ప్రవర్తన మాత్రం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కేవలం నా ఒక్కడితోనే కాదు, అందరితో అతనిది అదే తీరు. ఇంటిముందు సైకిల్ నడిపించుకుంటూ వెళుతున్న ఎవరో చిన్న పిల్లడి అవసరం గుర్తించి, సైకిల్ కి ఊడిపోయిన చైను పెట్టి ఆ పిల్లడు తొక్కుకుంటూ వెళ్ళడానికి సహకరించాడు. నా భార్య వీధి కుళాయినుండి అవస్థలు పడి బిందెలతో నీరు తెస్తూంటే, మధ్యలోనే అందుకుని తెచ్చి ఇంట్లో పెడుతున్నాడు. పక్కింటి పెద్దాయనకు ఎక్కడో మారు మూలల్లో, విదేశాలలో ఉంటున్న ఆయన బంధువుల ఈమైల్ వివరాలు, ఫోను నంబర్లు సేకరించి వారితో ఆయన మాట్లాడుకుని మురిసిపోయే అవకాశం కల్గిస్తున్నాడు. ఎదురింటి ముసలివాళ్ళకి పువ్వులు కోసి తెచ్చిచ్చి వాళ్ళు చేసుకునే పూజలకి సహకరిస్తున్నాడు. ఇంకా ఇలాంటి చిన్న చిన్న పనులు ఎన్నెన్నో... అదేదో మెచ్చుకోలు కోసమో, గొప్ప కోసమో చేస్తున్నట్టుగా అనిపించట్లేదు. రెండే రెండు రోజులు ఉన్నాడు. ఉన్నంతలోనే వైవిధ్యాన్ని ఆవిష్కరించాడు. మా ఇంట్లో ఉన్నప్పుడు కూడా ఇలాగే ఉండేవాడు. ఇప్పుడు సమయం దొరికి నాకు గమనించే వీలు కలిగింది. అప్పుడు ఆ పనులను పట్టించుకోలేదు.

వెళ్ళే ముందు అన్నాను "నువ్వు మళ్ళీ వచ్చేసరికి నేను ఉండను. ఈ వెయ్యి రూపాయలూ ఉంచుకో. నాకింక డబ్బుతో పని లేదు" అని.

"మనం మళ్ళీ కలుస్తాము. మీకేమీ కాదు. డబ్బుకన్నా ఎక్కువ విలువైన నా డిగ్రీ చదువుకి మీరు ఎప్పుడో సాయం చేశారు." అని నా డబ్బులని అక్కడే తలగడా కింద పెట్టేశాడు.

నన్ను పరామర్శించి వెళ్ళిపోతున్న అనేక మంది ఇవే నా చివరి రోజులని గుర్తు చేసి మరీ వెళ్తున్నారు. ఇతను మాత్రం ఎంతో సాధారణంగా, కంట తడైనా లేకుండా వెళ్ళిపోతున్నాడు. పైగా మళ్ళీ కలుస్తామని గొప్ప అబద్ధం ఆడేసి వెళ్ళిపోతున్నాడు. అతని ప్రవర్తన ఎంత మాత్రం నాకు నా చివరి రోజులని స్ఫురింప చేసేట్టు లేదు. ఎందుకో అతని మీద, అతను బతుకుతున్న విధానం మీద నాకు చెప్పలేని అసూయగా ఉంది. ఈ చివరి రోజులలో నాలో నేనే రగిలిపోతున్నాను. అతనిలా ఒక్క రోజైనా నాకు బతకాలని ఉంది. ఔను, నాకు ఇంకా బతకాలని ఉంది.

కథా కౌముది

# ఆనందమానంద మాయెనే..

శ్రీకళ అబ్బరాజు

**ఒక శనివారం ఉదయాన** నెల్లూరులోని బాలాజీనగర్‌లోని ఓ ఇంటిముందు, అరవై యేళ్ళు దాటి డెబ్భైకి దగ్గరవుతున్న శ్రీమతమ్మగారు అల్పాహారం సేవించి, వరండాలోని మంచం మీద కూర్చుని తీరిగ్గా విసనకర్రతో ఈగలు తోలుకుంటూ కూర్చుంది. ఆవిడకి పైన ఫ్యాను తిరుగుతున్నా చేతిలో విసనకర్ర ఆడాలి. అలవాటు మరి.

వసంత, వాణీ తాపీగా కాఫీగ్లాసులు పట్టుకుని, తులసికోట దగ్గర కూర్చుని వార్తాపత్రిక తిరగేస్తున్నారు.

బెంగుళూరు – నెల్లూరు బస్సు దిగిన సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి ఆనందు అప్పుడే గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టాడు. ఎదురుగా కనిపించిన దృశ్యం చూస్తూనే ఒళ్ళుమండిపోయింది ఆనందుకు. "ఆహా! ఎంత తీరుబడిగా కూర్చున్నారో! " విసుక్కున్నాడు మనసులో.

"ఏంటే! ఇలా ఖాళీగా కూర్చోకపోతే చదువుకోవడమో, ఏ కంప్యూటర్ అప్లికేషన్‌కి ప్రోగ్రాం రాసుకోవడమో చెయ్యొచ్చుగా! వస్తూనే బ్యాగ్ విసిరేస్తూ మందలించాడు చెల్లెళ్ళని.

"అది కాట్ కోచింగ్‌కి, బాట్ కోచింగ్‌కి, మాట్ కోచింగ్‌కి వెళుతుంది. నేను టిట్స్, బిట్స్, గిట్స్... అన్ని ఎంట్రన్స్‌లకీ ప్రిపేరవుతున్నాను. ఇంకేం చేయాలి?" అంతకన్నా విసుగ్గా జవాబిచ్చింది చిన్న చెల్లెలు వసు.

"ఏం చేయాలా? రోజుకి మినిమమ్ పదిహేడూ గంటలన్నా ప్రిపేరవ్వాలి. ఇలా తీరిగ్గా పేపర్ చదువుతూ టైం వేస్ట్ చేయకూడదు. బస్సులోనో, ఆటోలోనో వెళుతున్నప్పుడు ఆన్‌లైన్‌లో రెండు నిముషాల్లో హెడ్‌లైన్స్ చదివెయ్యాలి. ఖాళీగా ఉన్నప్పుడు ఫేస్‌ప్యాక్‌లు, నెయిల్ పాలిష్‌లు కాదు.. ఫ్యూచర్ ప్లాన్లు వేసుకోవాలి. అసలు మీకు జీవితం అంటే తెలిసేడిస్తేగా!..." బోరుగా చదివాడు ఆనందు.

కొడుకు గొంతు విని ఆనందంగా చేతిలో పనొదిలేసి పరిగెత్తుకుంటూ వచ్చిన రుక్మిణి ఈ తతంగం అంతా వింటూ నిల్చుంది. "ఏమిటే! రాగానే వాడితో వాదన?" కూతుళ్ళని మందలించి ఆప్యాయంగా కొడుకు తలనిమిరింది.

"మేమేం అనలేదు. వాడే ఖాళీగా ఉన్నావని నిన్ను టీవీలో వంటల ప్రోగ్రాంకి, బామ్మని భక్తి ఛానెల్‌లో ఉపన్యాసాలివ్వడానికి వెళ్ళొచ్చు కదా! అంటున్నాడు" అని కిసుక్కున నవ్వి అక్కణ్ణించి వెళ్ళిపోయింది వాణి.

"నాన్నేరీ?" పక్కనే ఉన్న కుర్చీలో కూలబడుతూ అడిగాడు ఆనందు. మీ నాన్న ఇంకెక్కడికెళతారురా? రిటైరయినప్పటి నుంచి లైబ్రరీ, గుడి, ఇల్లు అంతే! జవాబిచ్చింది రుక్మిణి.

"నందూ! మొన్న ఎదురింటి సుందరరాజారావు గారింటికి వాళ్ళు తమ్ముడి మరదలి కూతురు వచ్చింది. పిల్ల ఎంత బావుందనుకున్నావు? చక్కగా ముగ్గులు పెడుతుంది. పాటలు పాడుతుంది. గుత్తివంకాయకూర బ్రహ్మాండంగా చేస్తుందట్రా. వాళ్ళు నిన్ను సంబంధానికి అడుగుతున్నారు." కాఫీ కప్పు అందిస్తూ సంతోషంగా చెప్పింది.

''ఇంతకీ, ఉద్యోగం చేస్తుందా?'' అడిగాడు ఆనందు.

''మొన్ననే చదువయ్యింది. ఎం.సి.ఏ చేసింది. ఉద్యోగప్రయత్నాలు చేస్తూ ఉందట. రేపోమాపో తీపికబురు వచ్చేయదూ'' సాగదీస్తూ చెప్పింది రుక్మిణి.

''చెప్పాలంటే ఎన్నైనా చెప్పుకోవచ్చమ్మా! నేనూ ఐ.ఏ.ఎస్ కి ప్రిపేరవుతున్నానని చెప్తాను. కలెక్టరు ఉద్యోగం వచ్చేస్తుందా? వంట బాగా చేస్తే పెళ్ళి చేసుకుంటారా? ఏం మాట్లాడతారమ్మా? మీకు అసలు జీవితం అంటే తెలుసా? అంత తేలిగ్గా నిర్ణయాలు ఎలా తీసుకుంటారు?'' ఉపన్యాస ధోరణిలో అన్నాడు.

''అయ్యోరాత! మళ్ళీ మొదలెట్టాడూ'' అరచేత్తో నుదురు కొట్టుకుంటూ వంటింట్లోకి జారుకుంది రుక్మిణి.

''ఇంతకీ నీకెలాంటి పిల్ల కావాలో చెప్పరా!'' అంటూ, వీళ్ళ సంవాదం అంతా వింటున్న శ్రీమతమ్మగారు విసినకర్ర అవతల పారేసి మరీ వచ్చింది.

''అమ్మాయి అచ్చంగా బాపూగారి బొమ్మలా ఉండాలి. నెల తిరిగేసరికి గలగలమంటూ బోలెడన్ని పిచ్చి రూపాయలు సంపాదించి దోసిట్లో పోయాలి. పాదసేవలు చేయనక్కరలేదు కానీ ప్రేమరాణిలా ఉండాలి. ముఖ్యంగా జీవితం అంటే ఏమిటో తెలుసుకుని ఉండాలి'' కళ్ళు తెరుచుకునే స్వప్నలోకాల్లోకి వెళ్ళిపోయాడు.

''ఎలాంటి సంబంధం కావాలంటే అలా గుడ్లు మిటకరించుకుని చూస్తావేం?'' శ్రీమతమ్మ గద్దింపుతో ఈలోకంలోకి వచ్చాడు.

''ఊఁ.. ఎలాంటి అమ్మాయంటే చక్కగా ఉండాలి. ఖచ్చితంగా మీలా చచ్చుగా మాత్రం ఉండకూడదు. జీవితాన్ని బాగా అర్థం చేసుకున్న అమ్మాయై ఉండాలి'' తేల్చి చెప్పేశాడు.

నాలుగు నెలలకి ఆనందు తల్లితండ్రులు, రామారావూ, రుక్మిణి ఎన్నో సంబంధాలు గాలించి, వడబోసి చివరికి ఒక్క సంబంధం ఎన్నిక చేశారు.

అమ్మాయి అందంగా ఆనందు కోరినట్టే బాపూ బొమ్మలానే ఉంది. కాకపోతే, ''బాపూ బొమ్మ జుట్టు కత్తిరించుకుని, లంఖణాలు చేసినట్టుగా ఉంది అంతే'' అనుకుని అందరూ ఏకగ్రీవంగా ఓటేశారు. ''ఆనందు - ఆరతి'' పేర్లు కూడా చక్కగా కుదిరాయని తెగ మురిసిపోయింది రుక్మిణి.

మరుసటి రోజు పెళ్ళిమాటలు మాట్లాడుకోవడానికి అమ్మాయి తరఫువారందరినీ తమ ఇంటికి ఆహ్వానించారు రామారావు దంపతులు.

''ఇదుగో తీరా వాళ్ళొచ్చాక స్వీటు పట్రా, హాటు పట్రా అని అందరి ముందూ నన్ను పురమాయిస్తే బావుండదు. ఏమైనా కావాలంటే ముందే చెప్పండి. బజారెళ్ళి తెస్తా!'' అని ఆనందు అరిచి చెప్తుండగానే ఆరతీవాళ్ళు వచ్చేశారు.

క్రింద హాల్లో పెద్దవాళ్ళు మాట్లాడుకుంటున్నారు. ఆనందు, ఆరతి మేడమీద గదిలో కూర్చున్నారు.

తెల్ల చుడీదార్‌లో మిలమిలా మెరిసిపోతూ ఉంది ఆరతి. అందులోనూ ఏకాంతం. ఆనంద్ మనస్సు ఉక్కిరి బిక్కిరి అయ్యింది. ఏం మాట్లాడుదామా? అని అతను బుర్రబద్దలు కొట్టుకునేలోపే ఆరతి ఆరంభించింది.

''చూడండీ ఆనంద్ గారూ! నేను కొంచెం స్ట్రెయిట్‌గా మాట్లాడతాను అది నా అలవాటు.''

ఆనంద్ వినడానికి సిద్ధంగా సర్దుకుని కూర్చున్నాడు. ఆరతి గొంతు సవరించుకుని మళ్ళీ మొదలుపెట్టింది.

''నేను చాలా ప్రాక్టికల్ మనిషిని. లైఫ్ అంటే ఈజీగా తీసుకోవడం నాకస్సలు నచ్చదు. టైంని, మనీని కరెక్టుగా మానేజ్ చేయాలనుకుంటాను.''

ఈ డైలాగ్‌లు ఆనందుకి బాగా నచ్చాయి. ఆరతి ఆపలేదు.

"పెళ్ళయిన వెంటనే హనీమూన్‌లు, యాత్రలు అంటే నాకు చికాకు. అసలు కుదరదు కూడా. మీకేమైనా అలాంటి సరదాలుంటే ప్లేజ్ హాలిడేస్‌లో పెట్టుకోండి. పోతే నేను రెండు ప్లాట్స్‌కి EMI కడుతున్నాను. రెండు రకాల ఇన్సూరెన్స్ పాలసీలు, నాలుగు దేశాల స్టాక్ మార్కెట్లో పెట్టుబడి ఉంది. రాబోయే ముప్పై సంవత్సరాలకి నా ఇన్వెస్ట్‌మెంట్స్ అన్నీ ప్లాన్ అయిపోయివున్నాయి.

ఇక, ఫామిలీ సంగతికి వస్తే అన్నీ అనుకున్నట్టుగా జరిగితే సరిగ్గా పదిహేను సంవత్సరాల తరువాతే మనం పిల్లల్ని ప్లాన్ చేయాలి. ఈలోపుగా నేనో పెద్ద కంపెనీకి C.E.Oగా కావాలన్నదే నా ఆశయం. నేనెప్పుడూ స్పీడుగా ఆలోచిస్తాను. నెమ్మదిగా నింపాదిగా ఉండే వాళ్ళంటే నాకు చిరాకు" గడగడా చెప్పేసింది.

ఆనందు ఆరతి నుంచి పూర్తిగా వేరే విధమైన మాటలు, చూపులు ఊహించాడు. ఆశాభంగం కలగడంతో పాటూ ఇవన్నీ వింటుంటే ఊపిరి కూడా బిగదీసినట్టయ్యిందతనికి.

"మీ గురించి చెప్పండి" ఆమె అడిగింది.

"నేనూ మీలాగే ఆలోచిస్తాను. కాకపోతే మీ అంత స్పీడు కాదు." నసుగుతూ అన్నాడు.

"అలాగా! అయ్యో పాపం. మీరేం దిగులుపడకండి. మీకు సంబంధించినంతవన్నీ కూడా ఇకమీదట నేనే ప్లాన్ చేస్తాను" భరోసా ఇచ్చింది.

ఆ మాటలకి ఆనందుకు తల పాతాళంలో పెట్టుకోవాలనిపించింది. ఇంకేం మాట్లాడటానికి లేనట్టుగా దిక్కులు చూస్తూ ఉండిపోయాడు.

"ఇఫ్ యూ డోంట్ మైండ్" నా రెస్యూమ్ మోడిఫై చేసుకోవాలి అంటూ ఐపాడ్ తీసుకుని వర్క్ చేసుకుంటూ కూర్చుంది.

ఆనందు చేసేదిలేక జేబులోంచి ఐఫోన్ తీసి చూస్తూ కూర్చున్నాడు.

ఇలా కొని నిమిషాలు గంటలుగా గడిచాక...

"ఆరూ! " క్రిందినుంచీ వాళ్ళమ్మ పిలుపు వినబడ్డంతో 'వస్తాను..బై' అంటూ వెళ్ళిపోయింది.

నీరసం మొహం వేసుకుని మేడమెట్లు దిగివచ్చిన ఆనందుకి ఇంట్లోని వారందరూ సంతోషంగా నవ్వుతూ కనిపించారు.

"ఎంత మంచి సంబంధం. ఇలాంటి వియ్యంకులు వెయ్యి జన్మలకి కూడా దొరకరనుకో" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తూ ఆనందు బుగ్గలు పుణికింది శ్రీమతమం.

"అవును నందు! మీ అత్తగారికి చాలా ముందు చూపు. అన్ని విషయాలు ఇప్పుడే మాట్లాడేసుకున్నాం.

రేపు మీకు పిల్లలు పుట్టాక చూసుకోవడానికి, పదేళ్ళముందే పనిమనిషి కాంట్రాక్టు రాయించేసిందట మీ అత్తగారు.

ఇంకా ఏమని చెప్పిందో తెలుసా! మా అందరికీ కాళ్ళనొప్పులు, కీళ్ళనొప్పులు ముదరక ముందే ఓ ఇటర్నేషనల్ తీర్థయాత్ర చేసేసొద్దాం అని కూడా అంది. ఎంతైనా నీ పెళ్ళి పుణ్యమా అని మాకు ఈ టౌన్లో మంచి తోడు దొరికిందనుకో" వివరించింది రుక్మిణి.

"తెలిసినవాళ్ళకి పురమాయించి నాకూ పాస్‌పోర్టు తొందరలోనే వచ్చేట్టు చేస్తానన్నారు మీ మావగారు. ఏదోలా శ్రీలంకలో శాంకరీదేవిని, టిబెట్‌లో బుద్ధభగవానుడిని చూసి వస్తాను." శ్రీమతమ్మ అంది సంతోషంగా.

"ఇవేనా? మీరు మాట్లాడుకున్న విషయాలు? పెళ్ళంటే అంపకాల బట్టలు, మధుపర్కాలు, పానకం బిందెలు ఇలాంటివేమీ మాట్లాడుకోలేదా?" బాధగా అడిగాడు ఆనందు.

"నీ చాదస్తం దొంగలు దోలా! ఇంకా ఈ రోజుల్లో కూడా ఇవన్నీనా?" శ్రీమతమ్మ తేలిగ్గా కొట్టిపారేయడంతో కొయ్యబారిపోవడం ఆనందు వంతయ్యింది.

ఆ తర్వాత ఆనందుకి ఆరతి గురించి చాలా విషయాలు తెలిశాయి. ఆరతి ఎమర్జెన్సీ అయితే తప్ప ఫోనులో మాట్లాడదు. ఆనందుతో అయినా సరే! ఖాళీ టైం దొరికితే ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసుకోవడమో, రెస్యూమ్ అప్‌డేట్ చేసుకోవడమో చేస్తుంది. న్యూస్, స్టాక్స్ ఛానెల్స్ తప్పిస్తే సినిమాలు చూడదు. జాగింగ్‌కి కాక, సరదాగా కబుర్లు చెప్పుకోవడానికి పార్కుకి వెళ్ళదు.

పెళ్ళి కూడా చాలా సింపుల్‌గా. తక్కువ ఖర్చుతో జరిగిపోవాలని చెప్పింది. ఈ మాట ఆనందుకి బాగా నచ్చింది. కాకపోతే దాని వెనుకగల కారణం విన్నాక గతుక్కుమన్నాడు.

''ఒకవేళ ఫ్యూచర్ లో మనిద్దరికీ సరిపడకపోతే విడిపోవాల్సి వస్తే వర్క్‌అవుట్ కాని పెళ్ళికి ఇంత డబ్బు దండగ పెట్టామని మనం బాధపడకూడదు కదా!'' అని ఆమె చెప్పిన రోజు ఆనంద్‌కి నిద్రపట్టలేదు.

ఆరతి నవ్వితే అందంగా ఉంటుంది. కానీ, ''జన్మకి ఒకే శివరాత్రి'' అన్నట్టు ఎప్పుడోగానీ నవ్వదు. మేనేజరుగా ప్రమోషన్ వచ్చినప్పటినుంచి అలా అయిపోయి ఉంటుందిలే అని ఆనందే సరిపెట్టుకున్నాడు.

అన్నింటికీ సర్దిచెప్పుకున్నా కొన్ని విషయాల్లో క్లారిటీ కావాలంటూ ఆరతి దగ్గర్నుంచి అప్పుడప్పుడు వచ్చే ఎస్సెమ్మెస్‌లు అతనికి జోతిష్యం నేర్చుకోవాలనిపించేలా చేస్తుంటాయి.

''ఒకవేళ నేను H1 వీసా మీద అమెరికా వెళితే మీరు H4 వీసాతో హౌస్ హస్బెండ్‌గా ఉంటారా? లేక ఇండియాలోనే ఉండి జాబ్ చేసుకుంటారా?''

''కొద్దిరోజులు జాబ్ చేశాక నేను ఏ లండన్ యూనివర్సిటీలోనో M.B.A చేయడానికి వెళితే, అప్పుడు మీరేం చేస్తారు?''

ఇలా రకరకాలుగా జరుగుతాయో, జరగవో కూడా తెలియని వాటి గురించి ముందే ఆలోచించి జుట్టు పీక్కుని ఆనందుకి ఫ్యూచర్ గురించి ఆలోచించాలంటేనే విసుగెత్తి పోయింది.

ఆనందు ఆఫీసు నుంచి ఇంటికి తిరిగి వస్తున్నాడు. దారిలో ఎన్నో జంటలు సరదాగా నవ్వుతూ, తుళ్ళుతూ కనిపించారు. కొన్ని ఇళ్ళలో నుంచి కమ్మటి సంగీతం వినిపిస్తూ ఉంది. కొంతమంది వసారాల్లో, బాల్కనీలో కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు.

ఆనందు ఇంటిదాకా వచ్చేసరికి తమ ఇంటిస్థానంలో పెద్ద గోడగడియారం కనిపించింది. దాని తలుపు తీసుకుని లోపలికి వెళ్ళాడు. ఆరతి సోఫాలో కూర్చుని లాప్‌టాప్ చూస్తూ ఉంది.

''ఆరతీ...ఆరతీ'' గట్టిగా పిలిచాడు.

ఆమె వినిపించుకోలేదు.

డ్రస్ మార్చుకోడానికి బెడ్ రూములోకి వెళ్ళాడు. అక్కడ, ఒక చిన్న రోబో రైటింగ్ టేబుల్ దగ్గర కూర్చుని ఉంది. ఆనంద్ వస్తూనే ''డాడీ, నీకు ప్లానింగ్ తెలీదుగా అందుకే నీకోసం ఇది తయారు చేశాను'' అంటూ ఓ చార్టు చేతిలో పెట్టాడు. అందులో ప్రాకృతమో, పైశాచో.. ఏదో అర్థంకాని భాషలో అక్షరాలు కనిపించాయి.

ఆనందుకి భవిష్యత్తంటే భయం వేసింది. ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి. చేతిలోని పేపరు ఒక టన్ను బరువెక్కినట్టు మోయలేక చేతి ఎముకలు విరిగినట్టు అనిపించింది.

''నో'' ఇది నాకు వద్దు అని పెద్దగా గావుకేక పెట్టాడు.

''ఏంరా! నందూ ఏమైందీ?'' అంటూ పరుగున ఇంట్లోని వాళ్ళందరూ ఆనందు గదిలోకి వచ్చారు.

"హమ్మయ్యా! ఇదంతా పీడకలా" అని నిట్టూర్చి గబగబా చెంబుడు నీళ్ళు తాగేశాడు.

"అమ్మా, నాన్నా, బామ్మా అందరూ వినండి మీరేమనుకున్నా సరే నేనీ పెళ్ళి చేసుకోను" గట్టిగా అరిచి చెప్పాడు.

అందరూ ఒక్క క్షణం నిశ్శబ్దంగా అయిపోయారు.

ఆ తర్వాత ఒకటే పగలబడి నవ్వటం.

ఆనందుకి అంతా అయోమయంగా తోచింది.

"నువ్వీమాట అంటావని మేమెప్పుడో ఊహించాం. ఆరతి పాపం అన్నయ్యని బాగా భయపెట్టింది" వాణి అంది.

ఇంకా, అందరూ పకపకా నవ్వుతూనే ఉన్నారు.

"విషయమేమిటంటే, ఆరతి మీ ఆఫీసులో, మీ ఫ్లోర్‌లోనే పనిచేస్తుంది. నువ్వంటే తనకి చాలా ఇష్టం కూడా, నువ్వు మాత్రం ఎప్పుడూ తనవైపు చూడకపోవడమే కాదు... కనీసం పక్కవారితో మాట్లాడినట్టు, నవ్వినట్టు కూడా చూడలేదట. దాంతో, ఆ అమ్మాయికి నీమీద అనుమానం వచ్చింది. నీ ఆరోగ్యం బాగానే ఉందా? లేకపోతే నువ్వేమైనా లవ్ ఫెయిల్యూర్ కేసా? అని" మళ్ళా ఆపుకోలేక నవ్వేసింది వాణి.

"అందుకే నేరుగా నీతో మాట్లాడకుండా మనింటికే వచ్చింది. మేం నీ 'జీవిత సిద్ధాంతాన్ని, సమయపాలన సూత్రాల్ని' బాగా వివరించాం. ఆ తర్వాత ఈ కథంతా నడిచింది. నీకు అనుమానం రాకుండా 'వర్క్ ఫ్రం హోం' అని నెలరోజుల్నించి ఆఫీసుకి కూడా వెళ్ళడంలేదు" పూర్తిగా వివరించింది వసు.

"ఒరేయ్ మనసులు కలిస్తే జీవితంలో సర్దుబాట్లు, నిర్ణయాలూ వాటంతట అవే వస్తాయి. దేని గురించైనా ఒక పరిధి దాటి అతిగా ఆలోచించనక్కర్లేదు" మెత్తగా మందలించాడు రామారావు.

ఇదంతా విన్న ఆనంద్ మనసు తేలికబడింది.

"ఆరతి చక్కగా పట్టుచీర కట్టుకుని, మల్లెపూలు పెట్టుకుని తనతో సరదాగా కబుర్లు చెబుతూ ఉన్నట్టు 'ఇదుగోనండీ మన బాబు' అని ఓ పండంటి బిడ్డని చేతికందిస్తూ ఉన్నట్టు" మళ్ళా కలల్లో తేలిపోయాడు.

"ఏంటోనమ్మా ఈ పెళ్ళి అనుకున్నప్పట్నుంచీ పిల్లడికేం బావుండడంలా.. ఉన్నట్టుండి బిర్రబిగుసుకుపోతున్నాడు. రేపు దర్గాకి తీసుకెళ్ళి తాయెత్తు కట్టించాలి" అంటూ శ్రీమతమ్మ నెత్తిన ఒక్కటి మొట్టేసరికి మళ్ళా మామూలుగా అయిపోయాడూ.

"అయితే బామ్మా! పానకం బిందెలూ.. కాళ్ళుకడుగు పళ్ళెం లేకుండానే నా పెళ్ళి చేయిస్తావా?" గోముగా అడిగాడు.

"నీ కాళ్ళూ కడిగిస్తాను.. నా మునిమనవడి చేత నా కాళ్ళూ కడిగించుకుంటాను. ఇంకా వెధవ అనుమానాలూ.. నువ్వూనూ..." ముద్దుగా విసుక్కుంది శ్రీమతమ్మ.

అమ్మా! మరి మాకు అవసరం పడితే సాయానికి రాకుండా నువ్వు తీర్థయాత్రలంటూ దేశాలు పట్టుకు తిరుగుతుంటావా?" అనుమానంగా తల్లివైపు చూస్తూ ప్రశ్నించాడు.

పిల్లలు ఇబ్బంది పడుతుంటే, ఎక్కడ తిరిగితే ఏం మనశ్శాంతిగా ఉంటుందిరా? నువ్వు మరీ విపరీతంగా అడుగుతావు సాగదీసింది రుక్మిణి.

"ఇదిగో అన్నయ్య మళ్ళీ ఫ్యూచర్ గురించి ఆలోచిస్తున్నాడు" వాణీ అరవగానే అందరూ ఘొల్లున నవ్వారు.

ఆనందమానంద మాయెనే...




# నిర్ణయం

సి. హెచ్. కళ్యాణ చక్రవర్తి

**"గొంతు పిసికి చంపేస్తే?"** ఈ ఆలోచన అద్భుతంగా ఉంది, అవును అట్లా చేస్తే పీడా విరగడవుతుంది. ఒక నిర్ణయానికి వచ్చినట్టు వచ్చాడు. 'సోమి'గాడనే శ్రీయుత 'సోమశేఖర శర్మ'. మూడో సంతానం తను. మొగపిల్లాడి కోసం ప్రయత్నించి... ప్రయత్నించి లేక లేక పుట్టిన మొగపిల్లాడేమి కాదు. ఏదో కుటుంబ నియంత్రణ పద్దతులు తెలియక వరుసాగ్గా ఇద్దరు ఆడపిల్లలు పుట్టి తరువాత తను పుట్టాడని అక్కడితో వ్యవహారమేమి ఆగలేదు ఇతని తర్వాత కూడా ఇంకా ఇద్దరు పుట్టారు. సద్యంశ సంజాతుడు, మధ్యముడు కాకుంటే పాండవ మధ్యమునిలా గొప్ప గురికాడు, విలుకాడు మాత్రం కాదు. పదవ తరగతి పరీక్షని గురిచూసి కొట్టలేక చేతులెత్తేశాడు. బొత్తిగా లౌక్యం తెలీదు. పైగా సరైన దారి చూపే శ్రీకృష్ణుడిలాంటి బావలేడు.

అనుకూలాంశం ఏమిటంటే కష్టాలు పెట్టే దాయాదులూ లేరు. మనిషి తీర్చుకోవాల్సిన మూడు ఋణాలతో ఋషి ఋణం ప్రముఖంగా అతని మనస్సులో హత్తుకొని పైగా ప్రభుత్వం నడిపే ఒక అద్భుతమైన పాఠశాలలో చదవటం వల్ల చక్కటి సాంగత్యం దొరికినందువల్ల ధూమపానం, మధ్యపానంలాంటి అద్భుత కళను చాలా చిన్నవయస్సులోనే అభ్యసించి ఏకాగ్రతతో సాధన చేయవల్సిన అవసరం గుర్తించి నిరంతర అభ్యాసానికి అలవాటు పడ్డాడు.

కానీ వెధవ ప్రపంచం ఈ కళాపోషణకు డబ్బు అవసరం అని అతనికి నొక్కి చెప్పింది. పైగా ఇరవై ఏళ్ళు నిండిన తరుణాన తండ్రిపై ఆధారపడక తాను స్వయంగా సంపాదించాల్సిన అవసరం ఏర్పడింది. దీనికి తోడు అగ్రకుల సంజాతార్హత వల్ల నిమ్నవర్గాలు అభ్యసించే బీడీ, చుట్ట, కల్లులాంటి గ్రామ్యవిద్యలను అభ్యసించాల్సి వచ్చిన తరుణంలో తాను అగ్రకులాన్ని, ఆ నేతి వాసనని చూడాల్సివచ్చింది. తండ్రి కూడా దగ్గరకు పిలిచి నానా ఉపచారాలు జరిపించి ఈ లౌకిక శరీరాన్ని పోషించుకోవటానికి తగిన లౌకిక విషయాలపై దృష్టి పెట్టవలసిందని, లేకుంటే (ఈ పదాలు సంస్కృత మూలంగా ఉండటం చేత మీలాంటి సామాన్యులు అర్థం చేసుకుంటారో లేదో అన్న మీమాంసతో వదిలివేశాము - రచయిత). అంటూ జ్ఞానబోధ జరిపిన తదుపరి తండ్రిమాటను ఆలకించిన వాడై ఈ ఉద్యోగంలో చేరవలసి వచ్చింది.

కళాపోషణ అలౌకిక ఆత్మానందమునకే అని తెలుసుకుని ఇక తృప్తిపడ్డాడు. తను ఉద్యోగంలో చేరింది ఒక "లౌక్యుని" వద్ద. ఆ గురువుగారు ఈతని దేహ, మానసిక పరిస్థితులను ఆకళింపు చేసుకుని తన సహాయకుని పదవిని కట్టబెట్టారు. అద్భుతమైన వ్యాపారం. అపరకర్మ లిమిటెడ్ పూర్తి 'మానవతా'ధార పరిశ్రమ.. సంపూర్తిగా... వ్యవస్తీకృతమైన కొన్ని పరిశ్రమలలో ఇది ఒకటి. ఇందులో ఆత్మను పరలోకానికి పంపే కార్యక్రమంలో ప్రతి అంకం కీలకమే. అంతరిక్షంలోనికి పంపే రాకెట్ ప్రయోగం లాగానన్నమాట.

అయితే సరి అయిన మంత్రం, తంత్రం, కార్యక్రమం, దానం, అన్నీ జరగాలి. ప్రధాన నైపుణ్య సలహాదారు చక్కటి గొంతు చక్కటి ఆచార వ్యవహారాలు కలిగి ఉంటే అతని కార్మిక శ్రేణి దేహదారుఢ్యం కలిగి ఆలోచనా హీనంగా ఉండాలి. అప్పుడే కార్యక్రమం రాణిస్తుంది. ఇలాంటి అన్ని అర్హతలు కలిగిన మన కథానాయకుడు గురువుగారి దగ్గర - సహాయక పదవిలో చేర్పించబడ్డాడు. అలా ఎన్ని సంవత్సరాలు గడిచాయో ఏమో మనకేం తెలుసు?

అదిగో సోమశేఖరుడు "గొంతు పిసికి పిసికి చంపెయ్యాలి."

మళ్ళా అనుకున్నాడు. సోమశేఖరుడు.

"అవును అట్లా చేస్తేనే పీడా విరగడవుతుంది" ఇంతలా ఆలోచించడం ఇది మొదటి సారేంకాదు. జరిగిందంతా ఆలోచిస్తే ఉక్రోషం ఉబికి వస్తోంది. దారే దొరకటంలేదు. తనో మొగధీరుడు కాబట్టే ఇదే ఆలోచన. ఆగకుండా పదే పదే మనస్సుకి తడ్తోంది. ఇంకో దారేదీ కనిపించటంలేదు. వేరయింది.

రోజూలాగానే ఈరోజూ ప్రొద్దున్నే లేచాడు. ఎప్పటి పాపాన్ని అప్పుడు లెక్కన, పొద్దున్నే కడిగేశాడు. నాలుగు అయిదు చెంచానీళ్ళతో అన్ని కులవృత్తులకు లాగానే తన కులవృత్తిలో చేయవలసిన, వేయవలసిన అన్ని పనులు అన్ని అలంకరణలు చేసుకుని గురువుగారింటికి బయలుదేరాడు.

ఈరోజు కార్యక్రమాలకి ఏం కావాలో ముందు రాత్రే సర్ది ఉంచుతారు. గురుపత్ని గురువుగారు సరి చూసుకుంటారు కూడా. సరైన నాయకత్వం గలవాడు కనుక సోమశేఖరునికి బెంగలేదు. తను కేవలం పక్కన నించోవటం అడిగినవి అందించటం, కార్యక్రమం అయిపోగానే అన్నీ సర్దుకుని తేవటం. ఇంటినుండి బయలుదేరి కిళ్ళీకొట్టు మీదుగా గురువుగారింటికి చేరుకున్నాడు. ఆయన తయారుగా ఉన్నారు. శిష్యుడు రాగానే అంతఃపురానికి ప్రకటన ఇచ్చాడు.

"ఇదిగో సోముడు వచ్చాడు. రాత్రి 'సంచయనం' కోసం సర్దిన సంచి ఇవ్వు. " వెళ్ళమన్నట్టు సైగచేశాడు.

"సోమూ గుర్తుంచుకో! మనం ధర్మోదకాలకీ తిలోదకాలకీ కావలిసిన వస్తువుల లిస్ట్ ఇవ్వాలి. అట్లాగే పదిగంటలకల్లా వచ్చెయ్యమని వాళ్ళకి గుర్తు చెయ్యాలి" అంటూ కార్యక్రమం వివరించాడు.

ఇది రోజూ జరిగేదే ఆయన అలవాటు అట్లా సహాయకునికి గుర్తు చెయ్యటం. అలాగని 'సోమి'గాడి మీద ఆధారపడడు. ఆయనే 'కర్త'కు చెప్పేస్తాడు. అది ఆయన అలవాటు.

"ఆ బల్ల పక్క తెల్ల సంచి" లోపలనుంచి ఆవిడ గొంతు.

మనవాడు సంచి పట్టుకుని వచ్చాడు. స్కూటర్ బయటకు తీస్తూ "తలుపేసుకో" హెచ్చరిస్తూ రోడ్డు మీదకు వచ్చేశాడు. గురువుగారి వెంటే శిష్యుడు ఎక్కి కూర్చున్నాడు. అప్పుడే ఏడైనట్టు ఉంది. నగరం నిద్రలేచీ లేవనట్టు ఉంది. ఇరవై నిమిషాలు ప్రయాణం. మధ్య మధ్యలో ఫోన్లు గురువుగారికి ఇంకో మూడో నాలుగో బేరాలు కుదిరాయి. కట్టెల వాళ్ళకి కబుర్లు వెళ్ళాయి. పురమాయింపులు జరిగాయి. ఇరవై ముప్పైమంది గురువుగారినే నమ్ముకుని బ్రతుకుతున్నారు. వెళ్ళగలిగిన చోటకి ,వెళ్ళాల్సిన చోటకు గురువుగారు వెళ్తారు. లేకపోతే తన ముఠాలోంచి పురమాయింపులు జరుగుతాయి. శ్మశానం చేరేసరికి తొమ్మిది అయిండొచ్చు. 'కర్త'కు ఫోన్ చేశారు పదిగంటలకు చేరేలా రమ్మని.

స్కూటర్ లోపల పెడ్తూంటే "నమస్తే పంతులుగారు" శ్మశానం కమిటీ మెంబర్. హుందాగా పలకరించాడు.

ఖద్దరు చొక్కా ఎర్రటి బొట్టు గురువుగారు ఆశ్చర్యంగా చూశాడు "ఏమిటీ ఇంత ప్రొద్దున్నే?"

"కట్టెల లోడ్ వస్తోంది ఈనాకొ.... రోజూ చిలక్కొట్టుడు కొడుతున్నారు.. చూద్దాం అని"

ఒక మేస్త్రి ఇంకొక మేస్త్రికి చెప్పాడు. సహాయకుల గురించి మేస్త్రిలకి అపనమ్మకం.

గురువుగారు సోముడితో "మూడు రాళ్ళు చూసి రెడీచెయ్యి. బియ్యం వండు పదిగంటలకల్లా రెడీ కావాలి"

మేస్త్రీల మధ్య సంభాషణలో సహాయకులు ఎందుకన్న భావం ధ్వనించింది.

"పదవ నంబరు గుర్తుందిగా" హెచ్చరించారు గురువుగారు.

"ఆఁ...ఆఁ..." అంటూ పనిలో పడ్డారు సోముడు గారు. శవదహనం జరిగిన పదవ నంబర్ మండపం దగ్గరకు వెళ్ళాడు. మూడు పెద్దరాళ్ళు అక్కడే రెడీగా పెట్టి ఉన్నాయి. చితుకులు పేర్చాడు. పెద్ద క(ర్రముక్కలు. చిన్న పేళ్ళు అన్నీ సర్దాడు. పిడకని ముక్కలు చేసి సర్దాడు. కుండలో బియ్యం పోసి నీళ్ళు పోశాడు. అత్తెసరుకంటే ఎక్కువ మెత్తగా ఉడకాలి. కర్పూరం కోసం చూశాడు. చిన్న ముక్క పెట్టింది గురుపత్ని. దాంతో ఏం వెలుగుతుంది? మంట అంటుకోవద్దు? అటూ ఇటూ చూశాడు. దూరంగా లారీలోంచి కట్టెల లోడు దిగింది. తిట్లు తిన్న వీరిగాడు అనబడే వీరయ్య కట్టెలు మోసుకొస్తున్నాడు.

తోటి కార్మికుడిపై అభిమానం స్వరంలో వినిపించేటట్టు "కొంచెం కిరోసిన్ కావాలి విడిగా" అడిగాడు.

అ(గవర్ణపు అహంకారం ఎన్ని యుగాల (కిందటిదో. నాలిక చివర ఉందిగా

"అదిగో ఆగట్టు మీద కాన్ ఉంది పంతులూ! తీసుకో"

గబగబా వెళ్ళాడు కిరోసిన్‌తో పిడకలని కట్టెలని బాగా తడిపాడు. గణగణ మంట లేచింది. చితుకులు కాలాయి, పిడకలు ఎప్పుడో కాలాయి. కుండలో అన్నంకూడా ఉడికింది. కర్త వచ్చేశాడు. నిన్న ఉన్న ఏడుపులు ఈరోజు లేదు. ఈ రోజు పోతే రేపటికి రెండు. కర్త, గురువుగారు కార్య(క్రమం చేస్తున్నారు. తల దగ్గరనుంచీ కాళ్ళదాకా మిగిలిన ఎముకలని ఏరి కుండలోకి చేర్చారు. దేహ ఉపశమనార్థం అన్నం పెట్టారు. అసలు దేహమెక్కడిదని? కుండని గుడ్డలో కట్టారు. 'లాకర్'లో పెట్టించడానికి గురువుగారు కర్త వెళ్ళారు. తనూ కర్తగారి సహాయంగా వచ్చిన ఓ నడివయస్సు వ్యక్తితో వేదాంతచర్చ (ప్రారంభిద్దాం అనుకునేలోపే కసిగా వచ్చాడు వీరిగాడు – "నీ యమ్మా పంతులూ కిరోసిన్ కాన్ తీసుకున్నావు. తీసిన చోట పెట్టేది లేదా? ఎవలయినా అసిస్టెంట్ వస్తాడా లేకుంటే నీ తాత వస్తాడా. ఫో..ఫో తీసిన చోట పెట్టిరా ఫో"

తరతరాలుగా ఈ అ(గవర్ణాలు ముఖ్యంగా బామ్మలు చేసిన అన్యాయం ఇక్కడే తేలాలి అన్న కచ్చ కంటే, ఈ రోజు కట్టెల లోడులు నాలుగు కట్టెలు ఇంటికి పంపించలేక పోయిన అశక్తత, ఇంట్లో వంటకి క(రలు లేవన్న నిజమూ మేస్త్రీమీద కోపం అన్నీ (ప్రస్ఫుటంగా వినిపించాయి. "ఏంటి వీరయ్యా ఆ అరుపులు?" అ(ట్రాసిటీస్ యాక్ట్ వల్ల వచ్చిన భయం కాదుగాని ఏదో అభ్యర్ధన.

నీ కష్టాలు నా వల్ల ఏర్పడలేదు అన్న అభ్యర్ధన "నీ... కిరోసిన్ కాన్ తీసిన చోట పెట్టు ఫో"

దళిత సంఘాల నిరసన (ప్రదర్శనలు, ఐక్యతా (ప్రదర్శనల వల్ల వచ్చిన ధైర్యంకాదు. ఈరోజు ఇంట్లో ఎట్లా అన్న ఆదుర్దాతో ఏర్పడిన అసహనం. సోముడు లేచి కిరోసిన్ కాన్ తీశాడు. తీసుకొచ్చిన చోట పెట్టాడు. వీరయ్య వైపు చూశాడు 'గోవా' చేతిలో పోసుకుని నోట్లో వేసుకోబోతున్నాడు. గరళం మింగబోయే శివుడు మా(త్రం కాదు అనుకుంటూ సామాన్లు సర్దాడు.

"సోమూ నేను బ్యాంక్‌కి వెళ్ళి వస్తాను. నువ్వు ఆటో చేసుకుని వెళ్ళిపో" కర్తను పంపించేసి వస్తూ చెప్పారు. గురువుగారు స్కూటర్ తీస్తూ "డబ్బులున్నాయిగా?" అడిగారు.

"ఆఁ" తలూపాడు సోముడు.

స్కూటర్ స్టార్ట్ చేసుకుని ఆయన వెళ్ళిపోయాడు.

"ఏం పంతులూ! బాపనాయన అని మర్యాదలేదే ఆ యదవకి" సానుభూతిగా పలకరించింది కమలమ్మ.

పార్కింగ్ డబ్బులు వసూలు చేస్తూ ఉంటుంది.

"ఆఁ పోన్లే తాగున్నాడుగా!" తేల్చేశాడు.

"అవున్లే అట్లా అనుకోకపోతే ఎట్లా? మీ పప్పు తినే బాపనోళ్ళకి ఆడిని అనే దమ్ముందా? " అన్నాడు నరసయ్య.

కమలమ్మ తల అటువైపు తిప్పేసుకుంది. వెనుక భాగం ఆమె నవ్వుని స్పష్టంగా చూపించింది.

సోముడికి కాలం ఆగిపోయింది. ఆవేశం కట్టలు తెంచుకుంది. "ఆటో.. వస్తావా చిక్కడపల్లి?"

ఎక్కి కూర్చున్నాడు. చేతిలో గుడ్డ సంచి ఆవేశానికి చుట్టలు చుట్టేసుకుంటోంది. "గొంతు పిసికి చంపేస్తే" అదిగో అప్పుడే మొదటిసారి అనుకున్నాడు "గొంతు పిసికి చంపేస్తే.." ఎవర్ని?

కథా కౌముది

# కామనార్థం  తాడికొండ కె. శివకుమార శర్మ

"నాకు రంభ కావాలి!"

ఈ కోర్కెను వెలిబుచ్చిన ఏ వ్యక్తి అయినా సరే నవ్వులపాలుగావడం తప్పనిసరి.

"స్వర్గానికి నిచ్చెన వెయ్యి" అని అతను మెలగడానికి ప్రయత్నించే గుంపులోవాళ్ళు అపహాస్యం చేస్తూ అయినా కొన్నాళ్లు సహించే వుంటారు. వాళ్ళల్లోనే కొందరు "మోక్షం లభిస్తేనేగానీ ఆ కోరిక నెరవేర"దని చెప్పడానికి చాలాసార్లు ప్రయత్నించే వుంటారు. కానీ, "మీకన్నా ముందే నేను రంభతో ఆడుకుంటాను" అని రంభని కావాలన్న వ్యక్తి అదేపనిగా ఆ కోరికను పట్టుకుని వేళ్ళాడుతుంటే ఎప్పుడో ఒకప్పుడు అందరికీ చికాకు పుట్టక తప్పదు. అప్పుడు వాళ్ళు, "మా తరువాతే నీతో ఆడుకునేది," అని వాణ్ణి ఏడిపించకుండా వుంటారా?

"కాదు. నాతోనే ముందు" అని వాడన్నప్పుడు, "ఏం, నీకేమైనా కొమ్ములు మొలిచాయా?" అని వాళ్ళు గద్దించడమూ సామాన్యమే.

అలాంటప్పుడు, అతను పక్కనే పడివున్న రెండు పుల్లల్ని ఏరి తలకాయమీద కొమ్ముల్లాగా అమర్చుకొని వాళ్ళని ఎద్దేవా చేస్తే వాళ్ళు అతనికి ప్రత్యేక నామకరణం చెయ్యడంలో ఆశ్చర్యమేముంది? వాళ్ళు వాడికి ఇచ్చిన బిరుదు – శృంగి. ఆ పేరు నలుగురి నోళ్ళల్లో వినపడ్డంవల్ల కావచ్చు ఒకనాడు ఇంటికి వచ్చిన అతని తండ్రికూడా "శృంగుడేడీ?" అనడిగాడు. అప్పట్నించీ వాడి పేరు శృంగుడిగానే స్థిరపడింది.

రంభ కావాలనడం వాడికి దాదాపు అయిదో ఏట మొదలయింది. ఎవరైనాసరే, "నీకేం కావాల్రా?" అనడిగితే, ఎంచక్కా " లంబ కావా" లని జవాబిచ్చేవాడు.

వాడికి రంభగూర్చి ఎలా తెలిసిందీ అని పెద్దలకి సరిగ్గా గుర్తులేదుగానీ, వాళ్ళ మాటల్లో మాత్రం ఆ పేరు అప్పుడప్పుడూ దొర్లుతూనే వుండేది. ఉదాహరణకి, వాళ్ళల్లో మగవాళ్ళు ఆ రోజుకి తపస్సుని ముగించి దండకమండలాలని సర్దుకుని, మౌంజీకృష్ణాజినాలని చంకన పెట్టుకుని సూర్యాస్తమయం అయే సమయానికి వాళ్ళ పర్ణశాలల దగ్గర వున్న ఒక చెరువులో అర్ఘ్యం ఇవ్వడం కోసం ఇళ్ళకు బయలుదేరిన తరువాత, పాయలన్నీ కలిసి నదులైనట్లుగా దారిలో మిగతా ఋషులతో కలిసి గుంపులు గుంపులుగా నడుస్తున్నప్పుడు వాళ్ళ సంభాషణల్లో ఆ రోజు విశేషాలు దొర్లక తప్పదు.

తనమీద రెట్టవేసిన పక్షివైపు తీక్షణంగా చూడకుండానే అది మాడి క్రిందకు రాలిన విషయాన్ని చెప్పేవాళ్ళు ఒకరు. తనని కాటేసిన పాము తనపక్కనే చచ్చిపడి వుండడంగూర్చి చెప్పేవారింకొకరు. ఒక వేటగాడు తనమీదకు వదిలిన బాణం తనని తాకకుండా వెనుదిరిగి వెళ్ళి అదే వేటగాడికి గుచ్చుకోగా వాడు లబోదిబో మంటూ క్షమాపణని అడగడానికి వచ్చి తపోభంగం చేసినందుకు శాపానికి గురయిన వైనాన్ని

చెప్పేవాళ్ళు వేరొకరు. తలమీద రాలిన కాయనో పండునో భగవత్ప్రసాదంగా భావించి తినడంవల్ల కలిగిన దురదల బాధని గూర్చి చెప్పేవాళ్ళు మరొకరు.

వీరందరి నివాసం – జంబూ ద్వీపే, భరతవర్షే, భరతఖండే, నైమిశారణ్య మధ్యే. అడవి మధ్యలో వున్నాగానీ తమ పర్ణశాలల వద్ద అయితే పత్నులవల్లా, సంతానంవల్లా తపోభంగం కలుగుతుందని ఆ జనసంచార ప్రదేశానికి దూరంగా వెళ్ళి తపస్సు చేస్తూంటారు.

తపస్సు ముగించి సాయంత్రాలు ఇళ్ళకు వచ్చే సమయాల్లో వాళ్ళ మాటల్లో అప్పుడప్పుడూ, ఆనాడు రంభ ఫలానా ఋషికి ఎలా తపోభంగం చెయ్యబోయిందీ, ఆ కార్యక్రమంలో ఎంత కృతకృత్యురాలైందీ అన్న విషయం వస్తూండేది. "ఆ దేవేంద్రుడి దుర్మార్గం మరీ మితిమీరిపోతోం"దని కొందరంటే, "రంభకు పనిచెప్పేటంత తీవ్రంగా తపస్సు చెయ్యడం తమకెప్పుడు సాధ్యమవుతుందోనని లోపల్లోపలే వాపోయేవాళ్ళు కొందరు. వాళ్ళ కబుర్లల్లో రంభ విషయం దొర్లినప్పుడు అది వాళ్ళ పత్నులవద్దకు చేరేదాకా ఆగేది కాదు. మర్నాడు ఆ ఋషిపత్నులంతా భర్తలు తపస్సుకు వెళ్ళిన తరువాత దానితో బంతాట ఆడుకోవడమూ మానేవాళ్ళు కాదు. వాళ్ళకు ఆ బంతులాటకు దాదాపు రోజంతా తీరికుండేది. భర్తలు ఇంట్లోలేని సమయంలో అగ్నిదేవుడు చుట్టుపక్కల తారట్లాడి ఋషిపత్నుల మనస్సులని ఏమైనా రగిలిస్తాడేమోనని ఆ పర్ణశాలల్లో వంటని నిషేధించేవాళ్ళు. అందుకే వాళ్ళ ఆహారం కందమూలాదులకు పరిమితమయింది. వంటే లేనప్పుడు అంట్లు తోముకొనే అవసరమేమీ వుండదు కదా! నార చీరెలవడంవల్ల బట్టలుతికే బాధ అసలే లేదు. అందుకని వాళ్ళకి పగలంతా కబుర్లతోనే కాలక్షేపం. మరి తల్లుల చుట్టూ తిరిగే పిల్లల చెవుల్లో ఆ కబుర్లెలా పడకుండా వుంటాయి?

అవి విని, అయిదేళ్ళ వయసులో శృంగి, "నాకు లంబ కావాలి" అంటే, ఋషిపత్నులంతా ముచ్చటగా వున్నదని అనేవాళ్ళుగానీ, వాడికి ఎనిమిదేళ్ళు వచ్చిన తరువాత, పైగా ఉపనయనం కూడా అయిన తరువాత, ఆ భగవద్భక్తి సోపానంలో మొదటి మెట్టును చూపిన తరువాత కూడా వాడు "నాకు రంభ కావాలి" అంటుంటే వాడి తల్లికి అది సమస్యై కూర్చుంది. "వీడికి త్వరగా పెళ్ళి చెయ్యాలి" అన్నదావిడ భర్తతో.

"అష్ట వర్షాత్ భవేత్ కన్యా" అన్నారు. ఆ వయసు కన్యతో వీడికి పెళ్ళి చేద్దామన్నా, వీడికి పదమూడేళ్ళయినా వచ్చి, తపశ్శక్తితో కంటి చూపుతోనే ఒక కాయనో పక్షినో రాల్చగల సమర్థతని పెళ్ళి చూపుల్లో ప్రదర్శించగలిగితేగానీ వీడికి పిల్లనెవరూ ఇవ్వరు. అంటే కనీసం అయిదేళ్ళన్నా ఆగాలి." అని నిట్టూర్చాడాయన.

"మనకి తెలిసినవాళ్లల్లో ఎవరికీ వీడికన్నా చిన్న వయసున్న ఆడపిల్లలేగాక మగపిల్లలు కూడా లేరు. మీరు రేపటినించీ తపస్సు కెళ్లినప్పుడు పక్క వూళ్ల ఋషులెవరికైనా మూడునించీ అయిదేళ్ల వయసున్న ఆడపిల్లలున్నారేమో కనుక్కోండి," అన్నదావిడ.

"నేను రోజూ తపస్సు చేసే చుట్టుపక్కల వుండేవాళ్లంతా మన ఊరివాళ్లే. కొత్తవాళ్లెవరూ కనపడరు" అన్నాడాయన.

"అయితే, మీరు వేరేచోటుని వెదుక్కోండి తపస్సు చేసుకోవడానికి" అని ఆవిడ ఆజ్ఞని జారీచేసింది.

"కొత్తచోటంటే – అడవిమధ్యలో ఎవరూలేని చోటుగుండా నడుచుకుంటూ వెళ్లాలి. మళ్లీ జనసంచారం వున్న ప్రదేశాన్ని చేరేదాకా క్రూరజంతువుల బారినపడే అవకాశం చాలా ఎక్కువ. తపస్సు మధ్యలో వున్నప్పుడు అవి మీదికొస్తే వాటిని అంతుచూడగల శక్తి వుందిగానీ మామూలుగా నడుస్తున్నప్పుడు అవి కనపడితే మాత్రం వెన్నులో వణుకుపుట్టడం మొదలయి శాపం ఇవ్వచ్చన్న ఆలోచనే రాదు. పైగా, కొత్త చోటికి వెళ్లడానికి ప్రతీరోజూ నడకకే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తే ఇంక తపస్సు చేసుకోవడానికి మిగిలే సమయమెంత?" అని ఆయన సర్దిచెప్పబోయాడు.

"నాకు తెలియదు మీరేంచేస్తారో. వాణ్ణి మీతో తీసుకుపొమ్మంటే ఇంకా చిన్నవాడని తీసుకుపోరు. వీడు రోజూ మీరు వెళ్లిన తరువాత మధ్యాహ్న సంధ్యావందనం చేసేటప్పుడు తప్ప మీరు తిరిగివచ్చేదాకా మౌనంగా కూర్చుంటాడు. 'ఏమిట్రా?' అనడిగితే 'రంభ కావాలం'టాడు," అని తన బాధని వెళ్లబోసుకున్నదావిడ.

"చుట్టుపక్కల వున్న పిల్లలందరిలోనూ వీడే చిన్నవాడు. పైగా, మిగిలిన మగపిల్లలందరూ వీడికంటే కనీసం అయిదేళ్ళు పెద్దవాళ్ళవడంవల్ల వాళ్ళు తండ్రులతోబాటుగా వస్తున్నారు. అయినా, ఆ పిల్లలు తండ్రులతో రానప్పుడుకూడా వీడితో ఆడుకునేవాళ్ళుకాదు. రెండుమూడేళ్ళ క్రితంకూడా అసలు వీణ్ణి దగ్గరకు రానిచ్చేవాళ్ళు కాదని నువ్వే చెప్పావు. మన చుట్టుపక్కల వుండే ఆడపిల్లలేమో పెళ్ళై వెళ్ళిపోయారు." అని నిట్టూర్చాడు శృంగి తండ్రి.

మరునాడు ఆయన తపస్సుకెళ్లేటప్పుడు దారిలో శృంగినిగూర్చిన తన మనస్తాపాన్ని తనకు ఆప్తుడయిన ఒక ఋషితో పంచుకున్నాడు. ఆ మిత్రుడు కొంచెమాలోచించి, "తపస్సు చెయ్యడం మొదలుపెట్టమని చెప్పు. తీవ్రంగా తపస్సుచేస్తే దాన్ని భంగం చెయ్యడానికి దేవేంద్రుడు రంభని పంపిస్తాడనీ అప్పుడు తన కోర్కె నెరవేరుతుందనీ చెప్పు. అప్పుడు తపస్సు చెయ్యడం అలవాటవుతుంది. ఒకవేళ తీవ్రంగా తపస్సుచేసినా రంభ ప్రత్యక్షమవడానికి ఓ ఇరవయ్యేళ్ళు పడుతుంది. అంతకన్నా ఎక్కువ సమయమే పట్టినా పట్టొచ్చు. నీకే ఇప్పటిదాకా ఆమె ప్రత్యక్షమవలేదుగదా!" అన్నాడు.

"అంటే, నా తపస్సులో తీవ్రత లోపించినదనా నీ ఉద్దేశం? మహా నీకేదో ఆవిడ దర్శనం దొరికినట్లు!" ఉక్రోషం పెల్లుబికింది శృంగి తండ్రి గొంతులో.

"అంత కోపం వద్దు మిత్రమా! నాకే ఆమె ప్రత్యక్షమయుంటే నీకా వార్త చెవిని వెయ్యకుండా వుంటానా?" అన్నాడాయన.

ఆ రోజంతా తపస్సు చెయ్యనప్పుడూ చేస్తున్నప్పుడూ కూడా ఆ విషయమే ఆలోచించాడు శృంగి తండ్రి. సాయంత్రం పర్ణశాలకు చేరి సంధ్యా కార్యక్రమాలను పూర్తిచేసి, భార్య పెరట్లోంచి కోసుకొచ్చిన నాలుగాకులనీ, పెరుక్కొచ్చిన నాలుగు దుంపలనీ భుజించిన తరువాత శృంగిని అడిగాడు.

"అమ్మ నువ్వు రంభ కావాలంటున్నావని చెప్పింది. నిజమేనా?" అడిగాడు.

"అవును తండ్రీ," శృంగి తలవంచుకుని జవాబిచ్చాడు.

"మోక్షసాధనవల్లే అది సాధ్యమవుతుంది."

"ఎలా తండ్రిగారూ?"

"మోక్షసిద్ధి గల్గినవాళ్ళు ఇంద్రలోకాన్ని చేరి, అక్కడ ఇంద్రుని సమక్షంలో రంభాదులు నాట్యం చేస్తూ వుండగా చూసే భాగ్యాన్ని పొందుతారు."

"నాకు రంభ ఇక్కడే కావాలి తండ్రిగారూ" అన్నాడు శృంగి.

"ఎందుకూ?" భృకుటి ముడివేస్తూ అడిగాడు శృంగి తండ్రి.

"అక్కడయితే అందరిలోనూ నేనొకణ్ణవుతాను. ఇక్కడయితే నాకా భయముండదు."

"హరి పిడుగా! నీకున్న తెలివితేటలు నాకు లేవురా. మోక్షసిద్ధి పొందేకన్నా ఇహలోకంలోనే తపస్సు భంగంచెయ్యడానికి రంభని రప్పించుకోవడమే మేలన్న సంగతి నాకిప్పటిదాకా తట్టలేదెందుకూ?" అని ఆశ్చర్యపోయాడాయన. దాన్నుంచి తేరుకుని, "అందరికంటే

ముందరే నువ్వు బాల్యావస్థని దాటి కౌమారంలోకి అడుగుపెట్టినట్లున్నావ్. అలా అయితే నాతోపాటు రోజూ తపస్సుచెయ్యడానికి రా. నీ తపస్సు ఎంత తీవ్రంగా వుంటే అంత త్వరగా నీకావిడ దర్శనమిచ్చే అవకాశం వుంది," అన్నాడు.

మరునాటినించీ శృంగి తండ్రితోబాటుగా తపస్సు చెయ్యడానికి వెళ్ళడం మొదలుపెట్టాడు. ఆ చిన్న వయసులోనే అతడు తపస్సు చెయ్యడం మొదలుపెడుతున్నాడనేసరికి శృంగి తండ్రితోటి ఋషులంతా ఆనందించారు. తాను కూర్చునే చుట్టుపక్కల చెట్లన్నీ వేర్వేరు ఋషులకు తపోస్థానాలవడంవల్ల చాలా దూరంగా ఒక చెట్టును ఆయన శృంగికి చూపవలసివచ్చింది. శృంగి అక్కడే కూర్చుని తండ్రి చెప్పినట్లుగా "ఓం నమశ్శివాయ" అంటూ దీక్షతో తపస్సు చెయ్యడం మొదలుపెట్టి, ఇంటికి వెళ్ళే సమయం ఆసన్నమయిందని తండ్రి తట్టి పిలిచేదాకా కళ్ళు తెరవలేదు. "కొత్తొక వింత" అని నవ్వుకున్నాడు శృంగి తండ్రి.

ఆ కార్యక్రమం అలా దాదాపు రెణ్ణెల్లు గడిచింది. అయితే, తపస్సును శృంగి తండ్రి – మిగతా ఋషులకు మల్లేనే – తను కూర్చున్న చెట్టుక్కట్టేసేవాడు గానీ, శృంగి తనతోబాటే ఇంటికి తెచ్చుకునేవాడు. భోజనం చేస్తున్నా, నిద్రపోతున్నాగూడా అతని మనసులో ఆ శివుని నామమే నిండివుండేది. అతని తపస్సు తీవ్రత దేవేంద్రునికి కొంచెం కలవరాన్ని పుట్టించినా చేస్తోంది బాలుడు గనుక తన పదవికేమీ భయంలేదని అతణ్ణి పట్టించుకోలేదు.

ఒకరోజున శృంగికి శివుడు ప్రత్యక్షమయ్యాడు. "ఏకాగ్రతతో చేసిన నీ తపస్సుకు మెచ్చాను. బాలుడవైనాగానీ నీ నిశ్చలత్వమే నన్ను నీదరికి రప్పించింది. నిన్ననుగ్రహిస్తాను. ఏంకావాలో కోరుకో." అన్నాడు.

"రంభ కావాలి స్వామీ" అన్నాడు శృంగి తడుముకోకుండా.

ఉలిక్కిపడ్డాడు శివుడు బాలునినోట ఆ మాటను విని. సర్దుకుని, "ఇంకొకళ్ళని నీకు ప్రసాదించే హక్కు నాకులేదు బాలకా! నీకు రంభ ఎందుకు? కావాలంటే అంతులేని ధనధాన్యాలనడుగు. లేకపోతే, పాశుపతాస్త్రాన్ని అడుగు. ప్రసాదిస్తాను," అన్నాడు.

"నాక్కావాల్సింది రంభ" అన్నాడు శృంగి.

"అయితే, బ్రహ్మదేవుణ్ణి గూర్చి తపస్సుచెయ్యి. ఆయనేమైనా నీ రాతని మార్చగలడేమో" అనిచెప్పి అంతర్ధానమయ్యాడు.

ఆరోజు సాయంత్రం శృంగి తండ్రినడిగాడు – బ్రహ్మదేవుడిగూర్చి తపస్సు చెయ్య డానికి మంత్రం కావాలని.

"ఏం? శివుడు ప్రత్యక్షం కాడని నమ్మకం కలిగిందా?"

"కాదు. ఆయనే చెప్పాడు. బ్రహ్మదేవునికి నా కోరికని తీర్చడం సాధ్యమవుతుందేమో కనుక్కోమని" అన్నాడు శృంగి.

"వీడికి పిచ్చి ముదిరినట్లుంది. రోకలిని తలకు చుట్టమంటున్నాడు. లేకపోతే, ఎంతో గొప్ప ఋషులక్కూడా ఎన్నో ఏళ్లకుగానీ సాధ్యమవని ఈశ్వరదర్శనం వీడికి రెణ్ణెల్లల్లో అయిందట!" అని నిట్టూర్చి, ఆ మంత్రాన్ని ఉపదేశించాడు.

బ్రహ్మదేవుడిగూర్చి తపస్సుచెయ్యడం మొదలుపెట్టిన దాదాపు రెణ్ణెల్ల తరువాత ఆయన ప్రత్యక్షమయ్యాడు "ఏం కావాలో కోరుకో"మ్మంటూ. శృంగి కోరిక విని ఆయన నాలుగుముఖాలతో ఆశ్చర్యపోయాడు. ఆ ఆశ్చర్యాన్ని ఒకే గొంతుతో మింగబోవడంవల్ల కొంచెం దగ్గురాగా నాలుగు నోళ్లతోనూ దగ్గి, మోక్షాన్నిచ్చి రంభముందతన్ని కూర్చోబెట్టగలనన్నాడుగానీ రంభని అతని ముందుంచడం తనకు సాధ్యంకాదన్నాడు.

"నీవల్లా కాక, ఆ శివునివల్లా కాక మరెవరివల్ల ఈ కోర్కె ఈడేరుతుంది?" అని చిరాకుపడ్డాడు శృంగి.

"రంభనే తిన్నగా ప్రసన్నం చేసుకో!" అని సలహా నిచ్చి తన పనైందని ఆయన వెళ్ళిపోయాడు.

ఆ రోజు సాయంత్రం శృంగుడు తండ్రిని అడిగాడు రంభనే తిన్నగా మెప్పించే పద్ధతి చెప్పమని.

"నాకు తెలిస్తే నేనే ఆపని చెయ్యనా?" అని అనుకుని, హేళనని గొంతులోనే నొక్కేస్తూ, "ఓం రంభాయై నమః" అని ఉచ్చరిస్తూ తపస్సు చెయ్యమని చెప్పాడు. అయితే, అతడలా చేస్తుంటే మిగతా ఋషులు విని గేలిచేస్తారని భయపడి, అది మనస్సులోనే ఉచ్చరించమని చెప్పాడు. పైగా, ఒకవేళ తపోతీవ్రతలో పెద్దగా ఉచ్చరించడం మొదలుపెడతాడేమో, ఎందుకైనా మంచిదని తాము కూర్చునే ప్రదేశానికి బాగా దూరంగా వుండే ఒక చెట్టుకింద కూర్చోబెట్టాడు.

అలా నెలరోజులు శృంగి తపస్సుచేసేసరికి మూసివున్న అతని కళ్ళముందు దేవేంద్రుడు కనిపించాడు వజ్రాయుధాన్నెత్తిపట్టుకుని. "ఆగు!" గద్దించాడు శృంగి. అతని గొంతులో వున్న శక్తికి బద్ధుడై దేవేంద్రుడు శిలలాగా నిలిచిపోయాడు.

"బాలుణ్ణి, బ్రాహ్మణ్ణి హత్యచేస్తే నీకు చుట్టుకునే హత్యాపాతకం గూర్చి తెలుసా?" శృంగి ప్రశ్నించాడు.

"మరి నాకే దిక్కూ లేకుండా చేశావ్. రంభ నీ దగ్గరకు వస్తే అక్కడ నా కొలువేం కావాలి? స్వర్గానికి వచ్చినవాళ్లందరూ రంభ నాట్యాన్ని చూడడం తాము ఎంతో కష్టపడి సంపాదించిన హక్కని, దాన్ని వాళ్ళకు లేకుండా చేసినందుకు నన్ను శపిస్తే నా గతేంకాను?"

"నువ్వేమవుతావో నాకనవసరం. ముందా కత్తిని దించి వెనక్కు తిరిగివెళ్ళు" అని శృంగి ఆజ్ఞాపించాడు. ఆ ఆజ్ఞని పాటించడం తప్ప వేరే మార్గం కనిపించలేదు దేవేంద్రుడికి.

ఆరోజు దేవేంద్రుడు కనిపించిన సంగతి నతడు తండ్రికి చెప్పలేదు – తనని ఆయన నమ్మట్లేదన్న విషయం క్రమంగా గత ఆర్నెల్లలోనూ అర్థమయింది గనుక.

ఇంకొక నెలగడిచేసరికి దేవలోకంలోవున్న రంభ ఇలకు దిగివచ్చి శృంగికి కనబడడానికి సిద్ధమయింది.

"ఆమెను వెళ్లరాదని శాసించ"మన్నారు అతని కొలువులో కమండలాన్ని పక్కన పెట్టుకుని, దండాన్ని ఒకచేతికింద పెట్టుకుని ఆ చేత్తో తావళాన్ని తిప్పుతూ నోటితో నారాయణ మంత్రాన్ని జపిస్తూ కళ్లప్పగించి రంభ పొంగుల్నీ, ఆ పొంగులు చేసే నాట్యాన్నీ చూడడానికి అలవాటుపడ్డ యోగులంతా. అప్పటిదాకా ఏ ఋషి తపస్సునో భంగం చెయ్యడానికి ఆమెను పంపిస్తే ఆ పనయిపోగానే ఆమె తిరిగివస్తుందని వాళ్లకు తెలుసు. అయితే, ఆమె యిప్పుడు తనంతట తానే వెడతాననడంతో వాళ్లకు దిగులుపట్టుకుంది.

"ఆమెను శాసించలేను. కోరగలను మాత్రమే" అన్నాడు ఇంద్రుడు.

"ఇప్పటిదాకా నేను మానవలోకానికి వెళ్లింది నువ్వు నీ సింహాసనానికి అతుక్కుని వుండడంకోసం మాత్రమే. నాకోసమంటూ తపస్సుచేస్తున్న మొదటి వ్యక్తి శృంగి. అతని కోర్కెని తీర్చడం నాకు ఆనందదాయకమైన విషయం" అని చెప్పి, దేవలోకాన్ని వదిలివచ్చి ఒక మిట్టమధ్యాహ్నపుపూట శృంగి ముందు నిలబడ్డది.

తపోనిష్ఠాగరిష్ఠుల్ని చిత్తుచెయ్యడం అలవాటయిన భంగిమలో, ఎదను ముందుకు వంచి, పిరుదులని వెనక్కు పంపి, రెండు చేతులనీ పైకెత్తి, తలవెనుక అరచేతుల నానించి, కుడిమోకాల్ని ముందుకు వంచి, ఎడమకాలును వెనక్కు చాచి, తలను పైకెత్తి కైమోడ్పు కళ్ళతో "నేను రంభను వచ్చాను శృంగిఋషీ" అన్నది.

శృంగి కళ్లు తెరిచి ఆమెను ఎగాదిగా చూసి, "నువ్వు రంభవి కాదు" అన్నాడు. అది ఆమెకు కొరడా దెబ్బలా వినిపించింది. తనని రప్పించినది బాలుడని గ్రహించి ఒక్కక్షణం నోట మాట రాక, నిటారుగా నిలబడి, "నేను రంభని కానని నీకెలా తెలుసు?" అనడిగింది.

"మా తండ్రిగారు ఇంట్లో వున్నప్పుడు ఆయన చుట్టూ పరుగెత్తుతూ ఆయనతో ఆడుకోవాలని నేను ప్రయత్నించినప్పుడు, 'ఒరేయ్! నాకు తపోభంగం కలిగిస్తున్నావురా!' అనేవారు. ఆయన స్నేహితులకి కూడా రంభ తపోభంగం కలిగిస్తూంటుందట. అంటే ఆమె నాలాంటిదవ్వాలిగదా!" అన్నాడు.

★ ★ ★

సాయంత్రం శృంగికోసం వచ్చిన అతని తండ్రికి అతడు కనిపించకపోయేసరికి గాభరా పుట్టింది – ఏ క్రూరమృగమైనా అతణ్ణి పొట్టన పెట్టుకుందేమోనని. అయితే, చుట్టుపక్కల ఏ మృగపు అడుగుజాడలూ కనపడలేదు. ఆయన పరుగెత్తుకు వెళ్లి ఇళ్లకు వెళ్లడానికి సమాయత్తమయిన మిగతా ఋషులని పిలిచాడు (వాళ్లా రోజుకి తపస్సు కట్టేశారు గనుక తపోభంగమైందని శపిస్తారని భయమేమీలేదు.) వాళ్లు కొద్ది క్షణాలపాటు చుట్టుపక్కల వెదికి, సంధ్యాసమయ మాసన్నమైనదని పరుగెత్తుకుని వెళ్లిపోయారు. చీకటి పడుతోంది గనుక, ఆయన కూడా చేసేదేమీ లేక ఇంటికి వెళ్లి భార్యకు ఆ విషయాన్ని చెప్పాడు. ఆరోజు రాత్రి వాళ్లిద్దరికీ నిద్రలేదు. "కాగడా ఇవ్వు, వెతుకుదాం" అన్న తరువాతగానీ ఆయనకు గుర్తురాలేదు – వాళ్లదగ్గర అగ్గి వుండదనీ, యజ్ఞాలూ, హోమాలూ చేసేటప్పుడు మాత్రం సూర్యరశ్మిని ఉపయోగించి కట్టెల్ని వెలిగిస్తారనీను. (పైగా అప్పుడు ఋషులంతా చుట్టుపక్కల వుంటారుగనుక అగ్నిదేవుడు ఋషిపత్నులను తాకడన్న ధైర్యం వుంటుంది.)

సూర్యోదయం కాకముందే చిరుచీకట్లలో సూర్యునికి అర్ఘ్యాన్ని ఇవ్వడానికి దగ్గరలోవున్న చెరువును చేరే అలవాటు ఆయనకు వున్నది. పైగా రాత్రంతా నిద్రలేదు. అందుకని, మరునాడు మామూలుకన్నా ముందరే బయలుదేరి అలవాటయిన దారిలో నడుస్తూ చెరువు దగ్గరకు చేరేసరికి అక్కడ కనబడ్డ దృశ్యం ఆయన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది.

ఆ కొలను చుట్టూవున్న ప్రదేశం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. దాని చుట్టూ ఇద్దరు పిల్లలు పరుగెత్తుతున్నారు. చెట్లెక్కుతున్నారు. వాటి కొమ్మల మీదనుంచీ కిందకు దూకుతున్నారు. ఆటలో భాగంగా ఒకళ్ళ చెయ్యిని ఒకళ్ళు వెనక్కు మెలిపెట్టి వదులుతున్నారు. ఇద్దరి వంటిమీదా చీనిచీనాంబరాలున్నాయి. దరిదాపుల్లోవుండే రాజుల కొలువులకు అప్పుడప్పుడూ వెళ్ళి వస్తూంటాడు గనుక ఆ దుస్తుల్నీ, ఆ ఆభరణాలనీ ఆయన గుర్తుపట్టగలిగాడు.

వాళ్ళలా కాసేపు పరుగులెత్తిన తరువాత ఆ పిల్లాడు, "ఈత కొడదామా?" అనడిగాడు. గొంతునుబట్టీ ఆ పిల్లాణ్ణి శృంగి అని ఆయన గుర్తించాడు.

దాదాపు ఎనిమిదేళ్లుండీ, పరికిణీ, రవికా వేసుకుని మెరిసిపోతున్న ఆ పిల్లనే ఎక్కడా చూసినట్లు ఆయనకు జ్ఞాపకంలేదు.




# స్వప్నసుందరి స్వప్నం

సుపర్ణ

గోడమీద LG LED 40" టీవీ..!!

అహా !!

అందులో సీరియల్స్ చూస్తుంటే 70mm సినిమా థియేటర్ లో సినిమా చూస్తున్నట్టు ఉంది . హిందీ సీరియల్ లో అత్తగారు నుదురు మీద ఓ పది బొట్లు నిలువునా పెట్టుకుని గట్టిగా డైలాగ్స్ కొడుతోంది . ఇంట్లో అత్త పెత్తనమే. కోడళ్ళు నెత్తిమీద నుండి కొంగులు వేసుకునే ఉండాలి . ఎలా ఉంటారో ? చికాకు అనిపించదా ? ఛానల్ మార్చింది. రవితేజ , బ్రహ్మానందం కామెడీ. హాల్లో కింద పడుకున్నా కాని ఏదో రాజమందిరం లో హంసతూలికా తల్పం మీద పడుకుని టీవీ చూస్తున్నట్టు ఉంది . నిద్ర వస్తోంది. రిమోట్ తోనే టీవీ ఆఫ్ చేసి నిద్ర పోయింది

★★★★★★

పొద్దున్నే లేస్తూనే ముందు క్యాలెండరు వంక చూసింది స్వప్నసుందరి. 30 వ తారీకు.

"హమ్మయ్య ఇవ్వాళ పెన్షన్ పడ్తుంది ఆయనకు ఎకౌంటు లో." సంతోషంతో నిట్టూర్చింది.

గబ గబా లేచి ఫ్రిజ్ తెరిచి చూసి కూరగాయలు ఉన్నాయో లేవో చూసింది. ఫ్రిజ్ ఖాళీ. ఇవ్వాళా ఏం వంట చెయ్యాలి.

సగటు ఇల్లాలు స్వప్న. 50 నిండ వస్తున్నా అంత వయసు ఉన్నట్టు కన్పించదు. చక్కని శరీర సౌష్టవం. 40 ఏళ్ళ వయసు దానిలా కనపడుతుంది. కాటన్ సారీ నలిగినా అందమే అన్నట్టుగా ఉంది. వెంట్రుకలు నేరుస్తున్నా హెన్నా వల్ల ముదురు రంగులో మెరుస్తున్నా అందమే అన్నట్టు ఉంది. ఐదడుగుల నాలుగు అంగుళాల పొడవు. చామనఛాయ అయినా కళ గల మొహం. నుదుటన చిన్న మెరూన్ బొట్టు బిళ్ళ.

భర్త ఎక్కడికి వెళ్ళాడా అని వెదికింది. కిందికి వెళ్లి ఉంటాడు. అపార్ట్ మెంట్ మూడో అంతస్తులో ఉంది. లిఫ్ట్ చప్పుడయ్యింది. రమణ మెయిన్ డోర్ తీసిపట్టుకుని చెప్పులు బయట విప్పి లోపలికి వచ్చాడు. గుప్పుమని వాసన వచ్చింది. రాత్రి వాసన మనిషి వంటిని అంటిపెట్టుకునే ఉంది.

"కూరగాయలు లేవండి " అని మెల్లిగా "మీ దగ్గర బాగా వాసన వస్తోంది" గొంతు నొక్కిపట్టి కోపాన్ని అణుచుకుంటూ అంది

"సర్లే ఏదో చేస్తాలెండి."

జేబులో డబ్బులు ఎన్ని ఉన్నాయో చూసాడు రమణ .

"సరే ఉండు తెస్తా, ఏం తేవాలి ?"అడిగాడు .

"చికెన్ తేనా? " అన్నాడు మళ్ళీ తనే .

"వద్దు డబ్బులు లేవుగా " అంది స్వప్న .

"సాయంత్రం పెన్షన్ పడుతుందిలే ."అంటూ బయటికి వెళ్ళాడు .

★★★★★★★

టైం చూసింది. 7 అవుతోంది.

గబగబా ఒక స్టవ్ మీద స్నానికి నీళ్ళు పెట్టుకుని, పక్కనే ఇంకో దాని మీద టీ గిన్నె పెట్టి సగం కప్పు నీళ్ళు సగం కప్పు పాలు కొలిచి పోసింది. టీ పొడి, చక్కర వేసి స్టవ్ సిమ్ లో పెట్టింది. బ్రష్ చేసుకుని వచ్చి టీ ఫిల్టర్ చేసుకుని న్యూస్పేపర్ , పెన్ను తీసుకుని బాల్కనీ నుండి ఉదయం ఎండ పడే చోట కింద కూర్చుంది. టీ తాగుతూ మెయిన్ headings చూసింది.

కప్పు ఖాళీ కాగానే పక్కన పెట్టి పిల్లల పేజీలో పజిల్స్ సాల్వ్ చేస్తూ కూర్చుంది .చుక్కలని కలుపుతూ బొమ్మని వేసింది. తరువాత దారి కనుక్కోండి. తరువాత రెండు బొమ్మల్లో తేడాలు టిక్కు పెట్టింది. మిస్సింగ్ నంబర్స్ పజిల్ సాల్వ్ చెయ్యడానికి కాసేపు ట్రై చేసింది. కాని అదే పేజిలో ఉన్న ఆన్సర్ ఏంటో చూసేదాకా మనసు ఊరుకోలేదు.

ఇంకా పజిల్స్ ఉన్నాయి. వాటిని తనకి రోజంతా కాలక్షేపం కొరకు అట్టి పెట్టింది. పేపర్ నీట్ గా మడతపెట్టి టేబుల్ మీద పెట్టి ఖాళీ టీ కప్పు తీసుకుని లేచింది.

పొద్దున్నే టీ తాగుతూ పేపర్ చదివాక పజిల్స్ సాల్వ్ చెయ్యడం తనకి ఇష్టమైన పనుల్లో ఇది ఒకటి స్వప్నకి.

★★★★★

గబగబా స్నానం చేసి గుడికి వెళ్ళింది. రోజూ పొద్దున్నే ఇంట్లో దీపం వెలిగించి దగ్గరలో ఉన్న గుడికి వెళ్ళడం అలవాటు చేసుకుంది స్వప్న. మొదట వినాయకుడికి పదకొండు ప్రదక్షణలు చేసింది. హుండిలో రెండు రూపాయల బిళ్ళ వేసింది. పక్కనే ఉన్న సాయిబాబా దగ్గర ఉన్న విభూది నుదుటన పెట్టుకుంది. సాయిబాబా పాదాల కు మోకాళ్ళ మీద కూర్చుని వంగి నుదురు ఆన్చి మొక్కింది.

'అందరి దేవుళ్ళ విగ్రహాలు లోపలి మూసేసినట్టు ఉంటాయి. ఒక్క సాయిబాబాది మాత్రం కన్నుల పండుగగా ఉంటుంది విగ్రహం నిండుగా . అన్ని దేవుళ్ళవి కూడా ఇలానే ఉంటే ఎంత బాగుండు. తిరుపతిలో అంత క్యూ లు. అదే షిరిడి లో అయితే ఎంత దూరంలో అయినా ఏ కోణంలో అయినా చూసిన తృప్తి ఉంటుంది .

ఛీ !! ఏం ఆలోచిస్తున్నాను. అలానే ఉండాలేమో గుడులు !!'

★★★★★

"స్వప్నా ! మంచినీళ్ళు వచ్చాయి, చెత్త బయట పెట్టాను " చెప్పాడు రమణ స్వప్న ఇంట్లో కి రాగానే .

"ఫిల్టర్ లో పోసారా ?" అడిగింది.

"పోయ్యలేదు"

"సరే ఇంకా వస్తున్నట్టున్నాయి నేను పోసుకుంటాలే "

"వద్దులే వస్తున్నా . మళ్ళీ back pain అంటావు. filter మూత తీసిపెట్టు ." ఒక can లో ఉన్న నీళ్ళు filter పోసి ఆ can కూడా నింపి షెల్ఫ్ లో పెట్టాడు .

భర్త దగ్గర ఇలాంటి కొన్ని గుణాలు బాగుంటాయి. కాని ఆ త్రాగుడు అలవాటే !

చికెన్ వండి పప్పు చారు చేసింది .

★★★★★★

రాజేష్ 12 గంటలకి నిద్ర లేచాడు. లేచీలేవడమే కంప్యూటర్ ముందు కూర్చున్నాడు.

"వాడు తిన్నాడా ?'

కొడుకు గురించి వాకబు చేసాడు రామణ హాల్లో టీవీ చూస్తూ .

" ఇంకా లేదు "

పేపర్లో మిగిలిన పజిల్స్ చేస్తూ మధ్య మధ్యలో ఇంటరెస్టింగ్ ఆర్టికల్స్ చదువుతూంది స్వప్న. హాలు బాల్కనీ లో పొద్దుటి ఎండ వెళ్ళిపోయి చలికాలం నీరెండ హాయిగా ఉంది. అక్కడే ఉన్న ప్లాస్టిక్ చైర్ లో కూర్చుని పేపర్ చదవడం తనకి ఇష్టమైన పనుల్లో ఒకటి స్వప్నకి.

రాజేష్ లేచి తన రూం డోర్ దగ్గరికి వేసుకుని స్నానం చేసి వచ్చి అన్నం తిన్నాడు. అప్పుడు టైం రెండు దాటింది.

" నాన్న నాకు మూడు వందలు కావాలి " తండ్రిని అడిగాడు.

రమణ మాట్లాడకుండా జేబులోంచి మూడు వంద నోట్లు తీసి ఇచ్చాడు.

★★★★★

రమణకి రాత్రి తొందరగా నిద్రపోవడం అలవాటు.

రాత్రి 2 గంటలకి వచ్చాడు రాజేష్ . తలుపు తీసింది స్వప్న.

వాసన వచ్చింది.

తల తిప్పుకుని లోపలకి వెళ్తూ " ఫ్రెండ్ birthday. లేట్ అయ్యింది ." అన్నాడు .

"ఇంత రాత్రి దాక ఏం తిరుగుళ్ళు . ఏదన్నా జాబు ట్రై చెయ్యొచ్చుకదా?" అక్కడే ఉన్న టీవీ రిమోట్ తీసుకుని నేలకేసి కొట్టాడు. రిమోట్ ముక్కలు చెల్లాచెదురుగా పడ్డాయి.

రాజేష్ తన రూం లోకి వెళ్లి డోర్ దడేల్ మని వేసుకున్నాడు. హాల్లో టేబుల్ మీద ఉన్న పాత టీవీ స్వప్న కళ్ళకి పెద్ద దయ్యంలా కనపడింది . కొని 20 యేళ్ళయ్యింది. 20 kg ల బరువు ఉంటుంది కావచ్చు. కలర్ టీవీ లు వచ్చిన కొత్తలో కొన్నది, రంగు వెలిసి పోయి పాతగా కనిపిస్తోంది.

ఆ టీవీని చూస్తూ హాల్లో చాప మీద పడుకుంది స్వప్న మళ్ళి LED టీవీ తన కలలో ఊహించుకుంటూ.



కథా కౌముది

# అద్దం

నాదెళ్ళ అనూరాధ

సూర్యుడు లోకబాంధవుడు కదూ చుట్టూ ఉన్న లోకంతో తన బాంధవ్యాన్ని మరింత స్పష్టంగా ప్రదర్శిస్తున్నాడు. వేసవి ఎండ చురచుర లాడుతోంది.

ఆధార్ కార్డ్ కోసం నిలుచున్న సావిత్రికి అసహనంగా ఉంది. చుట్టూ రణగొణ ధ్వనులతో నిరంతరాయంగా కదులుతున్న ట్రాఫిక్. క్యూలో నిలబడిన వాళ్లందరూ ఏవేవో మాటల మధ్య ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వెనక నిలుచున్నవాళ్ల మాటలు వద్దన్నాచెవిన పడుతున్నాయి.

'వదినా,విన్నావా? సుందరమ్మ కీ , కూతురికీ చెడింది.ఇక పుట్టింటికీ,తనకీ రుణం తీరిపోయిందని వెళ్లిపోయిందిట ఆ పిల్ల.'

' ఏమొచ్చిందిటా? ' విసుక్కుందా వదినగారు.

'పెద్దవాళ్లం అయిపోయేం,మేం ఎట్లా బతుకుతున్నామో పట్టించుకున్నవాళ్లెవ్వరూ లేరు. పండక్కీ, పబ్బాలకి వచ్చి, ఇచ్చింది పట్టుకెళ్లటమే కాని, నాలుగు రోజులు అమ్మానాన్నలకి వండి పెడదామని కూడా లేదు అని విసుక్కుందిట సుందరమ్మ. కూతురు వచ్చినప్పుడల్లా ఇది కావాలి,అది కావాలి అంటూ కోరుకోవటమే కాని తల్లి చేతిలో ఒక పండైనా పెట్టదుట. కూతురు, అల్లుడు ఎటైనా ఊరు వెళ్లాలంటే పిల్లల్ని ఇక్కడ తల్లి దగ్గర వదిలి వెళ్ళిపోతుందిట. సుందరమ్మ చేసిచేసి విసిగి పోయింది. కూతుర్ని ముఖానే అడిగేసిందట.'

'అవున్లే, తల్లీపిల్లల బంధానికి కూడా చెడ్డ రోజులు వచ్చి పడ్డాయి. పెద్దలంటే ఒక గౌరవమా? ఒక ప్రేమా? కన్నందుకు జీవితాంతం తమ కోసం ఏదో ఒకటి చెయ్యాలనే పిల్లలూ ఆశిస్తున్నారు. మీరు మాత్రం మాకేం ఒరగబెడుతున్నారని పెద్దలూ నిలేస్తున్నారు.'

సావిత్రి నిర్లిప్తంగా వింటోంది ఈ కబుర్లు. ఎందుకు వీళ్లకి ఈ కంఠశోష, ఈ కాలానికి ఎవరికి ఎవరులే అనుకుంది.

' అవున్లే, పిల్లలు పెద్దై మనకి ఆధారం అవుతారనుకుంటాం. అంతా ఒట్టిదే.ఎవరిగోడు వాళ్లదే. ప్చ్!.. ఈ ఆధార్ కార్డ్ ఏం ఒరగబెడుతుందో మనకి? మనుషుల మధ్య బంధాలు నిలబడటంలేదు, ఇక ఈ కార్డ్ ముక్కల్ని నమ్ముకోవాలి కాబోలు!' నిష్టూరంగా అంది మరో వయసు మళ్లిన ఆవిడ.

సావిత్రి ఆమె వంతు వచ్చి ఫోటో హడావుడి అయ్యేవరకు అలా నిలుచునే ఉంది. ఫోటోలు, వేలిముద్రలు ఒక పట్టాన స్పష్టంగా రావట్లేదు. మళ్లీమళ్లీ తుడిచిన అద్దాన్నే తుడుస్తున్నాడా కుర్రాడు. ఆ చేతిగుడ్డ మురికి పట్టిపోయింది. తనలోపలికి చాలా ముద్రల్నే ఇముడ్చుకున్నట్లుంది. తుడిచిన ప్రతిసారీ మరింత అస్పష్టమైపోతున్నాయి ముద్రలు.

అద్దం చూసినప్పుడల్లా పుట్టింట్లో తండ్రి తనమీద కోపగించిన ఒకే ఒక సందర్భం జ్ఞాపకం వస్తూ ఉంటుంది సావిత్రికి. అద్దం అంటే సావిత్రి కి చాలా ప్రేమ. చిన్నప్పుడు అద్దంలో తనని తాను చూసుకుని మురిసిపోతూ ఉండేది. అద్దం ఎప్పుడూ తళతళ లాడుతూ ఉండాలని, దానిలో తన ప్రతిబింబం మరింత మెరిసిపోతూ ఉండాలని అనుకునేది.

ఒంటిగంట అయిపోయింది సావిత్రి పనై బయటపడేసరికి. ప్రక్కవీధిలో ఉన్నచెల్లెలు వసంతని ఒకమాటు కలవాలనుకుంది. వేసవి శెలవులు ఇచ్చే వుంటారు ఈపాటికి. పిల్లలతో పాటు వసంత కూడా ఇంట్లోనే ఉంటుంది అనుకుంటూ ఆమె ఇంటికేసి నడిచింది. చెల్లెలు కూతురు సుజని తలుపు తీసింది.

'లోపలికి రా దొడ్డమ్మా' అంటూ ఆహ్వానించింది. కూర్చుని చుట్టూ కలయ జూసింది సావిత్రి. సుజని తమ్ముడితో చదరంగం ఆడుతున్నట్లుంది.

' అమ్మేం చేస్తోంది?'

' అమ్మ లేదు, అర్జంటు పని ఉందని వెళ్లింది.' మంచినీళ్లు ఇస్తూ చెప్పింది.

' మీ అమ్మకి శెలవులు ఇవ్వలేదూ ఇంకా?'

'ఎమ్సెట్ అయ్యేవరకూ అమ్మకు శెలవుల్లేవు'

' సరే, నేనొచ్చినట్లు చెప్పు' అంటూ లేచింది. చాన్రోజులైందనే కాదు ఇంకో విషయం అడగాలనే వచ్చింది. కుదరనేలేదు.

మూడవుతూంటే ఇల్లు చేరిన వసంతకి ఎదురెళ్లి సావిత్రి రాక గురించి చెప్పింది సుజని. భోజనం అయిందనిపించి, కాస్సపు అలసటగా మంచం మీద ఒరిగింది. అక్క వచ్చివెళ్లిందని తెలిసి ఆమె ఆలోచనలు గతంలోకి వెళ్ళేయి.

తల్లి లేని పిల్లలని తన తండ్రి కూతుళ్లిద్దర్నీ గారంగా పెంచుకున్నాడు. సావిత్రికి చదువుమీద శ్రద్ధలేదు . ఇంటర్ మీడియట్ లో చేరేక ఒక సంవత్సరం చదివి తన వల్ల కాదని మానేసి ఇంట్లో కూర్చుంది. చదువు మానేసిన పెద్ద కూతుర్ని నచ్చచెప్పి మళ్లీ చదువులో పెట్టే ప్రయత్నం చేసేదాయన. కాని సావిత్రి ససేమిరా అనేసింది. రోజంతా ఊర్కే కబుర్లతో కాలక్షేపం చేస్తున్న కూతుర్ని చూసి చదువు కాకపోయినా మరేదైనా నేర్చుకోమని చెప్పిచెప్పి, ఫలితం లేకపోవటంతో ఇంక పెళ్లి చేసెయ్యటం ఒక్కటే దారి అని ఆలోచించేదాయన.

చలాకీగా ఉండే సావిత్రి చుట్టుప్రక్కల అందర్నీ అయస్కాంతంలా ఆకర్షిస్తూ ఉండేది. మిగిలిన పనులు చెల్లెలికి అప్పగించి అద్దాన్ని,డ్రెస్సింగ్ టేబిల్ ని మాత్రం తాను శుభ్రంగా పెట్టుకునేది సావిత్రి. ఆ వస్తువు కేవలం తనది, దాని బాధ్యత తనది మాత్రమే అన్నట్లు చూసుకునేది.

తండ్రి తెచ్చిన పెళ్లి సంబంధం నచ్చలేదని తిరగకొట్టింది సావిత్రి. చెప్పాచెయ్యకుండా ఒకరోజు ట్రాన్స్ పోర్ట్ బిజినెస్ చేస్తున్న నారాయణరావుని పెళ్లి చేసుకొచ్చిన కూతుర్ని చూసి నిశ్చేష్టుడయ్యేడాయన. మనసుకు పెద్ద గాయమే అయింది.ఆ సంఘటన నుండి తేరుకోలేక పోయేడు బ్రతికినన్నాళ్లు. సావిత్రి కూడా ఆయన ముందుకు వచ్చేందుకు మళ్లీ ప్రయత్నించలేదు.వసంత మాత్రం తండ్రిని కంటికిరెప్పలా చూసుకుంటూ, పట్టుదలగా చదువుకుని ఉద్యోగస్థురాలైంది.

ఉద్యోగరీత్యా సావిత్రి ఉంటున్న ఊరికి రావటంతో దూరమైన బంధాలు ముడిపడతాయని ఆశపడింది వసంత. తండ్రి కాలంతో పాటు వెళ్లిపోయేడు.రక్త సంబంధం అనుకుందుకు అక్క ఉంది. కాని సావిత్రి వైఖరి వసంతని దూరంగా నిలబెడుతూ ఉంది.

నారాయణరావు కొంతకాలం వ్యాపారాన్ని సీరియస్ గానే చేసేడు. రానురాను కొంత అలసత్వం,కొన్ని వ్యసనాలు అతని జీవితాన్ని గాడిలోంచి బయటకు తోసేశాయి. వ్యాపారం మెల్లిగా వెనకపడింది. చేతికందివస్తాడనుకున్న కొడుకు చదువు మధ్యలో చతికిలబడిపోయింది. దానికి కారణాలేమిటో, తన కొడుకు పాత్ర ఎంతవరకో మాత్రం అతను పట్టించుకోలేదు.

వసంత ఆలోచనలు చాలా సేపు సావిత్రి చుట్టూ తిరుగుతూనే ఉన్నాయి.... ఆ రోజు తన భర్తకి ఆఫీసు నుండి వస్తూండగా దారిలో చిన్న ఏక్సిడెంట్ అవటం,అతన్ని దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లటం, తమని రోడ్ మీద చూసి వెనుకే వెంకటేష్ ఆసుపత్రి కి రావటం.........ఆ క్షణాన తనకు చేతనైన సాయం తాను చేసేడు.

తన తప్పు లేకుండానే ర్యాగింగ్ కేసులో కాలేజ్ నుండి సస్పెండ్ అయి ఉండటం వెంకటేష్ ని ఎంతగా కృంగతీసిందో అర్థమైంది. సావిత్రి నోటికి భయపడే వసంత, ప్రభాకర్ ప్రేక్షకులుగా ఉండిపోయేరు ఇన్నాళ్లు.

ఆరోజు కాలేజ్ ప్రస్తావన ఎత్తితే తండ్రి, 'చదివింది చాల్లే' అని తేలిగ్గా అంటున్నాడని చిన్నబుచ్చుకున్న ముఖంతో చెబుతున్న వెంకటేష్ భుజం తట్టేరు వసంత, ఆమె భర్త. ఇంకా తమకేమీ పట్టనట్లు ఉండలేకపోయేరా దంపతులు. దాని పర్యవసానం వసంతకి తెలుసు ,అయినా సిద్ధపడింది.

దాదాపు ఐదారేళ్ల క్రితం స్కూల్లో క్రికెట్ ఆడుతూ వెంకటేష్ చెయ్యి విరక్కొట్టుకున్నప్పుడూ సావిత్రి భర్త కొడుకుని ఆస్పత్రికి తీసుకెళ్లవలసినందిపోయి ,కోపంతో నాలుగు కేకలు వేసి వెళ్లిపోయేడు. సావిత్రి హైరానా పడుతుంటే వసంత, ఆమె భర్త వెంటనే ఆసుపత్రి కి పరుగెత్తేరు పిల్లవాడిని తీసుకుని. ఆ తర్వాత సావిత్రి, ఆమె భర్త కృతజ్ఞత సంగతేమో కాని వసంత కుటుంబాన్ని మరింత దూరం పెట్టేరు . తాము చేసిన అపరాధం ఏమిటో ఈనాటికీ అర్థం కాలేదు వసంతకు.

ఒక్కసారి అక్క ఇంటికెళ్లి తీరిగ్గా మనసు విప్పి మాట్లాడాలి అనుకుంది. ఎప్పటినుండో వాయిదా వేస్తూ వస్తోంది.ఇక ఆలస్యం చెయ్యకూడదనుకుంది.

★★★★★★

కాలనీకి ఒకప్రక్కగా ఉన్న ఇల్లు కావటంతో చుట్టుప్రక్కల ఎవరూ లేరు. నిర్మాణం లో ఉన్న ఇళ్లు అక్కడొకటి , అక్కడొకటి ఉండటంతో అంతా నిశ్శబ్దంగా ఉంది . స్తబ్ధుగా ఉన్న పరిసరాల్లో చిరుచీకట్లు చిక్కనవుతున్న ఆ సమయంలో సావిత్రి ఇంటి ముందుకొచ్చి తలుపు కొట్టాలా వద్దా అన్నట్లుండిపోయింది వసంత. లోపల నుండి పెద్దగా మాటలు వినిపిస్తున్నాయి.

సావిత్రితో పాటు, ఆమె కూతురు సునీత గొంతు కూడా వినిపిస్తోంది.

'పరీక్షలయ్యాక నేను చంద్ర ఆంటి దగ్గర చీరల మీద అద్దకం,పెయింటింగ్ క్లాసులకి వెళ్తాను . నేను స్వంతంగా వ్యాపారం పెట్టాలి .'

' చదువుకుంటే డిగ్రీ చదివిస్తాం. లేకపోతె పెళ్లి చేసేస్తాం . అంతే , ఇంకా ఆ పెయింటింగ్లూ,వ్యాపారాలు వగైరాలన్నీ పెళ్లి అయ్యాక నేర్చుకో , ఏమన్నా చేసుకో .' సావిత్రి గొంతు ఖంగు మంటోంది.

సంశయంగానే తలుపు కొట్టింది వసంత .

తలుపు తీసిన సునీత ' పిన్నీ ! ' అంటూ ఆనందంతో కేరింత కొట్టి,

'లోపలికి రా పిన్నీ, ఎన్నాళ్లైందో నువ్వొచ్చి !' అంటూ ఆహ్వానించింది. చెల్లెల్ని చూస్తూనే సావిత్రి ముఖం చిట్లించింది .

'ఏమిటో విశేషం!' అక్క గొంతులో భావం అర్థం అయినా ఏమీ పట్టించుకోకుండా ,

'ఊర్కేనే అక్కా, చాలా రోజులైంది కదా అని ' కూర్చుంటూ చెప్పింది.

'పిన్నీ నువ్వు చెప్పు , ఈ సంవత్సరం పరీక్షలైపోయేక, చదువులో బ్రేక్ తీసుకుని ఫ్యాబ్రిక్ పెయింటింగ్ నేర్చుకుని నాకాళ్ల మీద నేను నిలబడాలని అనుకుంటున్నాను. ఇప్పుడు ఆదివారాలు , శెలవురోజులు నేర్చుకుందుకు వెళ్తున్నాను . నాకు భలేగా నచ్చింది ఆ పని. ఆ తర్వాత నెమ్మదిగా పై చదువులు చదువుతాను . ఇలా చెబితే అమ్మ కాదంటోంది . నువ్వు చెప్పు పిన్నీ'' అంటూనే నాలుక కరుచుకుంది.

ఆమెకు తెలుసు తల్లి పిన్నిని ఎప్పుడూ విమర్శిస్తూనే ఉంటుంది . పిన్ని మాటలు కొట్టిపడేస్తుంది . తనేమో ఇప్పుడు పిన్నిని అనవసరంగా ఇందులో ఇరికించింది. ప్రక్క కి వెళ్లి కూర్చుని పిన్ని చేతిని తన చేతిలోకి తీసుకుంది మన్నించమన్నట్లు.

'నీ క్కూడా ఆవిడ సలహానే కావలసి వచ్చిందా? ' సావిత్రి మాటల్లో నిరశన.

సావిత్రి భర్త తీరుతోనే సమాధాన పడలేక సతమతమవుతూంటే కొడుకు సమస్య ఎదురొచ్చింది. ఏదో ఒక అసంతృప్తి అనుభవిస్తూ ఉండేది చెల్లెలి జీవితాన్ని చూసినప్పుడల్లా. ఎవరి విషయాల పట్లా ఆసక్తి లేనట్లుండే సావిత్రి చెల్లెలి విషయం దగ్గర అసూయని అదుపుచేసుకోలేకపోయేది. తన సంసారం ఇలా తయారైందే అన్నఅసహనం ఆమెని నిలవనిచ్చేదికాదు .ఇప్పుడిక కూతురి మాటలకి మరింత విసుక్కుంది.

'అక్కా, కాలేజీలో కాస్త పని వత్తిడి ఉండి నిన్ను కలవాలనుకుంటూనే రెండు రోజులు ఆలస్యమైంది . వెంకటేష్ అనుకోకుండా ఆరోజు కనిపించేడు . ..........' ఆమె మాటలు పూర్తి కాకుండానే సావిత్రి అందుకుంది.............

' నాలుగు నెలలుగా వాడు కాలేజీ ముఖం చూడక ఇంట్లో పడి ఉన్నాడు. విషయం ఏమిటో కనుక్కుని వాడిని కాలేజీకి పంపమంటే మీబావ వినలేదు ఇన్నాళ్లబట్టి. నాల్రోజులుగా ప్రొద్దున్న వెళ్లి సాయంత్రం వస్తూంటే విషయం తెలుసుకోలేకపోయేను.ఏమిటని నిలదీస్తే చెప్పేడు. నువ్వూ, ప్రభాకరం వెళ్లి కాలేజీలో మాట్లాడి వచ్చేరటకదా ! నాకు మాట మాత్రంగా చెప్పాలని నీకు తోచలేదు.నా సంసారం విషయంలో కలుగచేసుకోవటం మాత్రం తెలుసు', కాస్త గట్టిగానే అడిగింది.

తల్లి మాటలు నచ్చక ,టీ పెట్టే నెపంతో వంటింటిలోకి వెళ్లింది సునీత.

చెల్లెలు ఏం చెబుతుందో కూడా తనకు అవసరం లేదన్నట్లు సావిత్రి తన ధోరణిలో కొనసాగించింది.

' నువ్వు తెలివైనదానివి మరి. నాన్న నిన్ను చదివించేరు చక్కగా. పొరుగిళ్లలో వ్యవహారాలు చక్కబెట్టేంత దానివయ్యావు. నీకంటే పెద్దదాన్నన్న గౌరవం ఏమైనా ఉందా?'

కొడుకు చదువు మళ్లీ గాడిలో పడిందని ఒక ప్రక్క సావిత్రి మనసులో తృప్తిగానే ఉంది . కాని చెల్లెలి జోక్యం ఆమెకు నచ్చలేదు . చెల్లెలు తన జీవితం చూసి జాలి పడే స్థితిలో తను, తన సంసారం ఉన్నాయన్న భావం ఆమెలో న్యూనతను కలుగ చేస్తోంది.

' అక్కా! .......... ' ఏదో చెబుదామనుకున్నావసంత ఏమీ మాట్లాడలేకపోయింది అక్క చేస్తున్న అభియోగాలకి. తను ఎంత దగ్గరగా రావాలని ప్రయత్నం చేస్తున్నా సాధ్యమవటం లేదు.

'పిన్నీ,టీ తీసుకో, అమ్మా నువ్వు కూడా తీసుకో. చేసిన మంచి పనికి కూడా నువ్వు ఇలా సాధించటం బావులేదమ్మా.అన్నయ్య కాలేజీకి వెళితే పిన్నికి వచ్చే లాభం ఏమీలేదు కదా ' కూతురి మాటలకి,చురుక్కున చూసింది సావిత్రి,

'చాల్లే, నువ్వా నేర్చేవ్ , నాకు చెప్పేంత దానివి అయ్యేవ్'

మెల్లిగా తనను తాను కూడ తీసుకుంది వసంత. టీ త్రాగుతూ సునీత తో మాటల్లో పడింది.

'పిన్నీ, మీ స్టూడెంట్ ఆదర్శ్ మీద ఏదో బెట్టింగ్ గురించి గొడవ వచ్చిందిట కదా. మురళి వాళ్లంతా అరెస్ట్ అయ్యేరని చెప్పుకున్నారు. నువ్వు వెళ్లి మాట్లాడి, ఆ గొడవనుంచి ఆదర్శ్ ని విడిపించేవని మాక్లాసులో అందరూ చెప్పుకున్నారు. '

' ఆ గొడవతో ఆదర్శ్ కి ఏమీ సంబంధం లేదు. రోజూ సాయంత్రాలు కబుర్లు చెప్పుకుందుకు ఆదర్శ్ వాళ్ల తాతయ్య మురళీ వాళ్ల తాతయ్య కోసం వాళ్ల ఇంటికి వెళ్తాడుట. ఆయన తిరిగి రావటం ఆలస్యం అయిందని పిలుచుకు వెళ్లేందుకు ఆదర్శ్ అక్కడికి వెళ్లేడుట. ఆ సమయంలో మురళి, వాడి స్నేహితులు టి.వి. లో క్రికెట్ చూస్తూ మొబైల్ ఫోన్లలో ఏవో సందేశాలు పంపుకుంటుంటే అర్థం కాక చూస్తూ కూర్చున్నాడుట. ఆ విషయం ఏమిటని వాళ్ల తాతయ్యని అడిగేడుట కూడా ఆరాత్రి. వాళ్లతో పాటు కాస్సేపు అక్కడ ఉన్నాడు కనుక ఆదర్శ్ ని కూడా అరెస్ట్ చేస్తారని ప్రచారం చేసేరు. మురళీ వాళ్లంతా అప్పుడే బెయిల్ మీద బయటకు వచ్చేరులే.'

పక్కనే కూర్చుని వాళ్ల మాటలు వింటోంది సావిత్రి . ఆమెకు ఆశ్చర్యంవేసింది, తనకి ఇంటి విషయాలు తప్పించి చుట్టుప్రక్కల ఉన్న వాళ్ల గురించి పట్టనే పట్టదు అనుకునేది ఇన్నాళ్లూ. కాని కొడుకు ఏదో సమస్యలో ఇరుక్కున్నాడని తెల్సినప్పుడు భర్త పట్టించుకోలేదనే గొడవ పెట్టుకుంది కానీ తనంత తానుగా ఏదైనా చేద్దామని , తానైనా పూనుకుని సమస్యని పరిష్కరించుకోవాలని అనుకోలేదు. ఇంట్లో కంటికెదురుగా కనిపిస్తున్న కొడుకుని చూస్తూ భర్త బాధ్యతా రాహిత్యాన్ని గురించి మాత్రమే తాను ఆలోచించింది.

ఇప్పుడు కూతురు ఏమంది?! పిన్ని మంచిపని చేస్తే అభినందించవేం అని అడుగుతోంది కదూ. చిన్న పిల్ల , అది గ్రహించుకున్న విషయం తాను గ్రహించుకోలేకపోయిందా?

బయట వెలుతురు బాగా తగ్గి, చీకటి పడుతూండటంతో సునీత లేచి లైటు వేసింది.

సావిత్రి చెల్లెలి వైపు సాలోచనగా చూసింది . అప్పుడే కాలేజీ నుండి వచ్చిందేమో వసంత ముఖం అలసటగా ఉంది. ప్రొద్దున్నెప్పుడో ఇంటిని,పిల్లల్ని సర్దుకుని ఉద్యోగానికి పరుగెత్తుతుంది !

చాలా ఏళ్ల తర్వాత చిన్ననాటి చెల్లెలు మెదిలింది మనసులో. తనతో పాటు ఒకే ఇంట్లో పుట్టి పెరిగిన చెల్లెలు! తల్లి పోయేనాటికి తనకైనా కాస్త ఊహ తెల్సునేమో కానీ వసంత చాలా చిన్న పిల్ల అప్పుడు. తల్లి కోసం బెంగ పడి జ్వరం తెచ్చుకుంటే తండ్రితో పాటు తానూ రాత్రుళ్లు మేలుకుని చెల్లెల్ని కనిపెట్టుకుని ఉండేది. ఆ రోజులేమైపోయేయి? సావిత్రి మనసు ఆర్ద్రమైంది.

తనని చిన్నబుచ్చేందుకే చెల్లెలు తన విషయాల్లో కలుగ చేసుకుంటోందని అనుకునేది, కానీ ............తోటి మనిషికోసం తాపత్రయ పడుతోంది!ఈ తాపత్రయాలు ఎవరికీ లేని నాడు ఏమవుతుందీ సమాజం?!

సావిత్రికి రెండు రోజుల క్రితం ఆధార్ కార్డ్ కోసం తాను క్యూలో నిలబడినప్పుడు విన్న మాటలు స్ఫురణకు వచ్చేయి. మనుషుల మధ్య సంబంధాలు మృగ్యమైపోతున్నాయని కదూ వాళ్లు చెప్పుకుంటున్నది! అంతేనా? లోకంలో తనలాటి వాళ్లే ఎక్కువవుతున్నట్లున్నారు.

ఆ ఫోటోలు తీసే కుర్రాడు అద్దాన్ని మళ్లీ మళ్లీ ఆ మురికి గుడ్డతో తుడవటం కూడా ఆమె కంటి ముందు కదిలింది. అలాటి అద్దంలో స్పష్టమైన బొమ్మలు రమ్మంటే ఎలా వస్తాయి?

సావిత్రికి చిత్రంగా తోచింది, రోజూ తనకి తాను సంతృప్తికరంగా కనిపించేవరకూ ఇంట్లో అద్దాన్ని తుడుస్తూనే ఉంటుంది మరి! తన మనసనే అద్దాన్ని ఎప్పుడూ శుభ్రం చేసుకోవాలన్నఆలోచన రానేలేదు.



# కథా కౌముది

## కల చెప్పిన కథ

కళాప్రపూర్ణ డా. వింజమూరి అనసూయదేవి

**అది అర్ధరాత్రి.** నా చిన్నకూతురు సీతారత్నాకర్ ఇంట్లో ఎయిర్ కండిషన్ రూంలో, ఏళ్ళ తరబడినుంచి ఎరగని ప్రశాంతమైన వాతావరణంలో, చీకూచింతా లేకుండా హాయిగా నిద్రపోతున్న నా చెవి దగ్గర, శృతి పక్వమైన తంబూర నాదం వంటి నాదం వినపడింది. కల అయింటుందనుకుని పక్కకు ఒత్తిగిలి పడుకున్నాను నాదం వాల్యూమ్ పెరగడమే కాకుండా, మధ్య మధ్య "లే! లే!" అంటున్నట్టనిపించింది. ఆశ్చర్యం! నాలో నేనే "కలయో వైష్ణవమాయయో" పద్యం చదువుకున్నాను. ఇది కల కానేకాదు. కల్ల! పక్కమీదే లేచి కూర్చుని చుట్టుపక్కలంతా చూశాను. నా చెవిపక్కనే గెంతుతూ, పాడుతూ తారాడుతున్న దోమ కనిపించింది. నా చెలికత్తె చేత రాత్రి దోమల మందు కొట్టించాక కూడా, ఇంత ధైర్యంగా ఈ దోమ నా రూంకి రాగలిగిందంటే, పైగా పాడుతోందంటే, ఇదేదో స్పెషల్ జాతి దోమైనా అయుండాలి. లేదా, 80 ఏళ్ళ క్రితం మా కాకినాడ ఇంట్లో, నే పడుకున్న దోమతెరలో దూరి, ఎక్కడో నక్కి, నాతో దోబూచులాడి, సంగీత మధురధోరణిలో నన్ను మెప్పించిన నా పెంపుడు దోమ, మనుమరాలో, మునిమనుమరాలో (కాదుగదా)! అయినా అయుండాలి అనుకుంటూ, దోమని చంపకుండా, పక్కన పడున్న న్యూస్ పేపర్‌తో తరిమేయడానికి ప్రయత్నిస్తుంటే,

దోమ: – చంపకు! చంపకు. నీ దగ్గరకు ఓ గొప్ప కార్యార్థినై వచ్చాను.

నేను – ఇన్నికోట్ల జనాభాలో నేనే దొరికానా తల్లీ! ఓహో! తెలిసింది. ఇటీవల సంచలనం కలిగించిన చలనచిత్రం "ఈగ" ప్రభావం నీమీద కూడ పడిందన్నమాట! అలాంటిదేదో ఉండకపోతే నా దగ్గరకెందుకొస్తావు?

దోమ : – అలాగ ఎందుకనుకుంటున్నావు? 2002లోనే నువ్వు రాసిన "గతానికిస్వాగతం" అనే పుస్తకంలో మా దోమల మీద మంచి వ్యాసం రాశావుగా?

నేను – అయితే నన్ను గురించి పూర్తి వివరాలు సేకరించుకునే వచ్చావన్నమాట!

దోమ – జగమెరిగిన దానవు. నిన్ను గురించి ఎవరికి తెలియదు? చెట్లూ పుట్టలూ, అడవులూ, కొండలూ, నదులూ, సముద్రాలూ దాటి నిన్నే వెతుక్కుంటూ ఎందుకొచ్చాననుకుంటున్నావు?

నేను – పొగడ్తలనవసరం. విషయం చెప్పు.

దోమ – దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించడానికి దేముడు ఎన్నో అవతారాలు దాల్చి, ఏదో రూపంలో నన్నాదుకుంటూనే ఉన్నాడు.

నేను - పోనీకదా అని జాలిపడి వింటూంటే, అర్ధరాత్రివేళ ఇలాగ వేదాంతంతో వేధించడం ఏమైనా బాగుందా? ఇంక చాలించు. నిన్ను చంపకుండా వదిలేస్తున్నాను. పో!

దోమ - దయచేసి నేను చెప్పేది విను. మనదేశం హీనస్థితికి దిగజారింది. ఎక్కడ చూచినా దొంగతనాలూ దోపిళ్ళూ, కొట్లాటలూ, కక్షలూ, బలత్కారాలూ హత్యలూ.

నేను - ఇవి చెప్పడానికా ఇంత దూరం కష్టపడొచ్చావు? రోజూ పేపర్లో నే చదువుతున్న విశేషాలేగా?

దోమ - విను. మనుష్యుల్లో ప్రేమ పెరిగితే ఐకమత్యం వచ్చి తీరుతుంది. ఐకమత్యం బలాన్నిస్తుంది. అప్పుడు ఏ కార్యాన్నైనా తేలిగ్గా సాధించగలుగుతాం. హింసాకాండ తగ్గుతుంది. మనలో మనకి ప్రేమ ఉన్నప్పుడు ఒకర్నొకరు చంపుకోంకదా? జీవితం స్వర్గం చేసుకోడానికి భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికి ఓ రాగం కనిపెట్టాను.

నేను - నీకంత సంగీత జ్ఞానముందా?

దోమ - నా రాగానికి సంగీత జ్ఞానం అవసరంలేదు. 72 మేళకర్తరాగాలూ, జనకరాగాలూ వేటిలోనూ ఈ రాగం దొరకదు. నా రాగానికి వయస్సుతో నిమిత్తంలేదు, టైంతో పనిలేదు..(ఎల్లవేళలలోనూ ఉపయోగించవచ్చు) ప్రస్తుత పరిస్థితులలో మనదేశాన్ని రక్షించగలిగింది కొంతవరకైనా కాపాడకలిగింది నేను కనిపెట్టిన రాగమొకటే.


నేను - ఏమిటా రాగం?

దోమ - అనురాగం!

ఇంత విలువైన విషయాన్ని ఒక్క మాటలో వివరించిన దోమ మాటలు, ఆ క్షణానికి ప్రవక్త బోధనలాగ, గురూపదేశంలాగ అనిపించాయి... ఇది దోమోపదేశం.!! ఒక దివ్యానుభూతి. కలకాదు, కలచెప్పిన కథ.

డా.వింజమూరి అనసూయదేవిగారి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. గత 85 సంవత్సరాలుగా గాయనిగా, సంగీత దర్శకురాలిగా, రచయిత్రిగా అందరికీ తెలిసిన విదుషీమణి ఆమె. అనసూయాదేవిగారు మరో నెలరోజుల్లో 95 సంవత్సరాలు పూర్తిచేసుకుని 96వ సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నారు. ఈ వయసులో క్రిందటి నెలలో ఆమె కౌముదికోసం ప్రత్యేకంగా ఈ గల్పిక వ్రాసి ఇచ్చారు. ఇది తీసుకోడానికి వ్యక్తిగతంగా వారిని కలిసినప్పుడు " ఇప్పుడు నా భావాలు పరిణితి చెందినట్లు అనిపిస్తోంది బాబూ.. పదాలు కూడా చక్కగా కుదురుతున్నాయి" అన్నారు. 95 సంవత్సరాల వయసులో అనసూయాదేవిగారు చెప్పిన ఈ వాక్యాల్లో ఈ తరానికి ఎంతో సందేశం ఉంది..! ఇప్పటికీ అనసూయదేవిగారి చేతివ్రాత ఎంత కుదురుగా ఉందో చూడండి..!








# కథ రాయాలి

భవానీ ఫణి

## శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
## వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
## 20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
## ఉత్తమ కథానిక విభాగం విజేత

నుంచున్నా కూర్చున్నా ఒకటే ఆలోచన .

కథ రాయాలి .

ఒక గొప్ప కథ రాయాలి .

ఇప్పటిదాకా నా కథల్ని తిరగ్గొట్టిన ఎడిటర్లకి దిమ్మ తిరిగిపోవాలి .

నేను రాసే కథల్లో జీవం లేదన్న వాళ్ళందరి కళ్ళూ ఒక్కసారిగా తెరుచుకోవాలి .

ఇంతకీ నాకు కావాల్సింది కథా , లేక దాని వల్ల వచ్చే గుర్తింపా?

అదేం కాదు, గుర్తింపే కావాలంటే కథల వల్ల ఎంతొస్తుంది? ఇష్టం కాబట్టే రాయాలని ఇంత తాపత్రయం .

ఎవరింటికైనా వెళ్ళినప్పుడు పది నిముషాలు కూర్చుని లేస్తూ, "వస్తానండీ కథ రాయాలి" అంటే ఎందుకంత ఆశ్చర్య పోతారో ! అది మాత్రం పని కాదా ఏంటి?.

"ఏదైనా మంచి పాయింట్ చెబ్దూ, కథ రాసుకోవాలి" అనగానే మాట్లాడే మాట్లాడే వాళ్ళు ఫోనెందుకు పెట్టేస్తారో! కాలక్షేపం కబుర్లు ఎన్ని గంటలైనా చెప్తారుగా.

పక్కన పెన్ను పేపరు పెట్టుకుని పడుకుంటే ఏంటి తప్పు? కథేమైనా కలలా వస్తే ?

ఇంతకీ గొప్ప కథ ఎలా రాయాలి ? ఏంటో, జీవితాలు ప్రతిబింబించాలట. కథేమన్నా కొలనులో కలువ పువ్వా, అద్దంలో ఆనవాలా ప్రతిబింబించడానికి! సహజత్వం వెల్లి విరియాలట. అసలు సహజం, అసహజం అని విడగొట్టే నిర్వచనాలు ఎవరు చెప్పారు? ఒకరికి సహజం అనిపించేట్టు

నేను రాస్తే నాకు అసహజం అయిపోదూ! ఇదేదో ఆకాశంలో గీతలు తీసి వాటి మధ్యలోంచి ఎగరమన్నట్టుంది. రాయడానికి, రాయాలన్న ఇంత తీవ్రమైన కోరిక సరిపోదా? సరిపోదట. మరింకేదో ఉండాలట పూలల్లో పరిమళంలా. అదేమో కంటికి కనిపించదు. కనిపిస్తున్న దారాన్ని చూడచ్చుగా. అయినా కళ్ళు మూసుకుని ఆస్వాదించడానికి కథేమైనా శాస్త్రీయ సంగీతమా !!

మరేం చెయ్యాలి? గొప్ప కథ ఎలా రాయాలి? గొప్పవని పేరు తెచ్చుకున్న కథలన్నిటినీ ఎన్ని రకాలుగా చదివి చూసినా ఏమీ అర్థం కావడం లేదు. ఏముంది వాటిలో? ఓ కష్టమో , ప్రేమో , స్వార్థమో, ఆత్మాభిమానమో ...అంతేగా. నేను రాస్తున్నవీ అవేగా. ఏదో కాస్త ఉప్పో కారమో ఎక్కువో తక్కువో అవదా? అయినా ఎక్కువ తక్కువలు రిలెటివ్ కదా పాప పుణ్యాల్లాగే.

పెద్ద పెద్ద పదాలు వాడాలి. తర్కాలు మాట్లాడాలి. తెలిసిన విజ్ఞానమంతా గుమ్మరించాలి. రకరకాల యాసలూ,భాషలూ ఉపయోగించాలి... పైగా కథల్లో సమస్యలకి పరిష్కారాలు చెప్పకూడదట. సమస్యున్న చోట పరిష్కారం లేకుండా ఎలా ఉంటుంది? మనసుంటే మార్గముంటుందని పెద్దలు అనుభవంతో కాదూ చెప్పింది. ఏమిటో స్వేచ్ఛగా విహరించమంటూనే ఎవరి పంజరాల్లోంచి వాళ్ళు విశ్లేషిస్తారు.

అదలా ఉంచితే ఎంత గొప్ప (అని పేరు పడిన) కథనైనా విమర్శించే వాళ్ళు కూడా ఉండనే ఉన్నారుగా. అందరికీ నచ్చేలా రాయడం అసాధ్యమా? పోనీ కొంత మందికైనా నచ్చితే చాలు. అయినా ఎవరికో నచ్చేలా నేనెందుకు రాయాలి అని పౌరుషం తెచ్చుకుందామంటే చదవడానికి నేను మాత్రమే మిగులుతాను మరి. లేదు లేదు ... నలుగురూ మెచ్చని కళా ఓ కళేనా!

మరెలా? పోనీ వాళ్ళు చెప్పినట్టు జీవితాల్లోకి వెళ్ళి చూద్దామంటే నేననే ఈ శరీరం ఒకటి, నన్నెక్కడికీ వెళ్ళనివ్వకుండా. ఎప్పుడు చూసినా ఈ నాలో నేనే ఎందుకుంటానో! నాలోకి వేరే వాళ్ళు కూడా వస్తూ పోతూ ఉంటే, లేకపోతే నేను వేరే వాళ్ళలోకి వెళ్తొస్తూ ఉంటే ఎన్ని జీవితాలు చూద్దునో, ఎన్ని కథలు రాసేద్దునో!

సరేలే నిద్రపోతే సరి. ఈ రాత్రి ఎలాగైనా ఓ గొప్ప కథ పట్టుకోవాలి కలలో. అస్సలు మర్చిపోకూడదు ఈ సారి.

ఏమిటంతా మసక మసకగా! కల కదా అలాగే ఉంటుందిలే. ఇదేమైనా జీవితమా అర్థమవడానికి ?

ఏవేవో వింత శబ్దాలు . ఒక్క మాటా స్పష్టంగా వినబడదే! పోనీ మనుషులైనా సరిగా కనబడకుండా ఏమిటీ తెరలు? ఆరాలు అంటారు కదా వీటిని. ఎక్కడో చదివినట్టు గుర్తు. మనుషుల చుట్టూ ఉంటాయట వాళ్ళ మనస్తత్వాలని రంగు రంగులుగా చూపిస్తూ. అవి చదవడం నేర్చుకోవాలి ఈసారి. అయినా పగలేమో శరీరాలు. కలల్లోవాటి ఆరాలు...మనసులకి అడ్డుగా. నన్ను కథ రాసుకోనివ్వకుండా. అవునూ, అదేదో ఆస్ట్రల్ ట్రావెలింగ్ అని ఉంటుందటగా. మనలోంచి మనం బయటకి వచ్చేసి చక్కగా ఎక్కడికైనా వెళ్ళచ్చు ఈ శరీరంతో పని లేకుండా . హ్మ్! టిబెట్లో పుట్టి ఉన్నా బాగుండేది.

ఇంతకీ ఈయనెవరు? అంత స్పష్టంగా కనిపిస్తున్నాడు. దేవుడిలా అంత నిర్మలంగా నవ్వుతున్నాడు. కొంప తీసి దేవుడేనేమో. కథ వెతుక్కోవాలి తప్పుకోమంటే తప్పుకోడేం? పైగా వరం అడగాలా? దేవుడు కనిపించినా వరాలు కోరుకోని నా నిస్వార్థతకి బహుమానమా! ఇదీ బానే ఉంది . అడిగేస్తే పోలా.

అరె! గొప్ప కథ రాసే శక్తినివ్వమంటే అలా దిక్కులు చూస్తాడేంటి? అయ్యయ్యో, అదెలా ఇవ్వాలో తెలీడం లేదా? ఇంకో వరం కోరుకోవాలా!

సరిపోయింది. నాక్కావాల్సింది ఇవ్వడం మానేసి తన దగ్గర ఉన్నది అడగమంటాడే!

సరే, కథంటే జీవితమేగా . జీవితమంటే మనుషులు. నేనే రకరకాల మనుషులుగా మారిపోతే నాలోపల అన్నీ కథలే. అన్ని రకాల కథలు.

ఇలా అడిగినా అయోమయంగానే చూస్తున్నాడు. ఈ వరం కూడా ఎలా ఇవ్వాలో తెలీదో ఏమో! హమ్మయ్య, తథాస్తు అన్నాడు. ఇక నేను వెతుక్కోవక్కర్లేదు కథల్ని . అవే నన్ను వెతుక్కుంటూ వస్తాయి. ఇక నిద్రలోంచి లేవడమే తరువాయి .

లేచి చూసేసరికి నేను మల్లిని.హా హా.. ఓ కథ వచ్చేసింది నాలోకి. ఎప్పటిలాగే చీర పైకి దోపి అదేదో కూని రాగం తీసుకుంటూ ఇల్లు తుడుస్తుంటే వచ్చింది మల్లి .

నన్ను చూడగానే పరిగెత్తుకెళ్ళి గోడకి కరుచుకుపోయింది. పిచ్చి మాలోకం, నేను నువ్వే. గుర్తు పట్టలేదా ? అదేమిటి అలా బల్లిలా గోడనంటుకు నడుస్తోంది! అలా పారిపోతుందేంటి! పోతే పోనీలే. నేనున్నానుగా. అమ్మగారికి ఇబ్బంది లేకుండా అంత పనీ చేసెయ్యడానికి .

ఒళ్ళు వంచి పని చేస్తే ఎంత హాయిగా ఉందో, వళ్ళు నెప్పులు వస్తే వచ్చాయి గానీ .

ఇంతకీ కథేదీ .. అయినా నేను కథ రాయడం ఏంటి ? ఇప్పుడు నేను మల్లిని కదా. కథలూ కాకరకాయలూ రాసుకునేది అమ్మగారు.

సాయంత్రమైపోయింది. హమ్మో, ఇంటికెళ్తే తాగుబోతు మొగుడు తన్నడూ ? ఎన్ని సార్లు నేను అమ్మగారిగా ఉన్నప్పుడు ఆవిడకి చెప్పుకుని ఏడవలేదు? ఈ రోజుకి ఇక్కడే ఉండిపోతే సరి .

అదిగో, అయ్యగారొచ్చినట్టున్నారు. అయ్యో రామా, ఎంత చెప్పినా నేను మల్లినంటే నమ్మరే? అమ్మగారు ఎక్కడికెళ్ళారో నాకేం తెల్సు . ముట్టుకోవద్దంటే అర్థం కాదా! ఇంకెంత ముడుచుకోను ఇలా నేల మీద, ఆయన అలా ఏడుపు మొహం పెట్టుకుని నన్నే చూస్తూ కూర్చుంటే!

తెల్లారిపోయిందా ? అలాగే నిద్రపోయానా! రాత్రి కల్లో మల్లి వాళ్ళ ఊరు, చుట్టాలు అన్నీ అందరూ కథలు కథలుగా కనిపించారు. ఎంత బాగుందో! కానీ అదేమిటో మల్లి తన గుడిసెలో కూర్చుని కంప్యూటర్లో కథ టైప్ చేస్తోంది. తన కథ. ఎంతో ఆత్రంగా చదువుదామని తొంగి చూసానా, అది నాకు తెల్సిన భాష కాదు. అది రోజు వాకిట్లో పెట్టే ముగ్గులతో కట్టిన భాష. నాకెలా అర్థమవుతుంది అని అడిగితే నవ్వింది అప్పుడే విరిసిన బొండు మల్లిలా.

ఇంతకీ ఈ రోజు నేనెవరో! ఎవరైతే బాగుంటుంది? ఆ .... ఈ రోజు నేను బిచ్చమెత్తుకునే ఆ ముసలమ్మని. అమ్మో! అడుక్కోవడానికి బయలుదేరాలి. ఆలస్యమైపోయింది. ఈ ఇంటితోనే మొదలెడితే సరి.

ఏంటీ ఇంటాయన! గదిలో పెట్టి తాళం పెట్టాడు కాస్త అన్నం పెట్టమంటే. అతని పెళ్ళాం వచ్చి ఉన్నా బాగుండేది. ఎన్ని సార్లు పెట్టలేదు అన్నం కూరలు నేను ఆవిడలా ఉన్నప్పుడు.

ఏమిటో ఈ వరం వల్ల ఏమీ ఉపయోగం లేకుండా పోయింది. ఎంత మందిలానో మారుతున్నా ఈ గదిలోనే ఉండాల్సి వస్తోంది. ఆయనెవరో మధ్య మధ్య డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తున్నాడు. ఎవరెవరో ఇంటికి వచ్చి ఏవేవో వరసలతో పిల్చి, ఏమిటేమిటో చెప్పి వెళ్తున్నారు. కొంతమంది తిడుతున్నారు. కొంతమంది ఏడుస్తున్నారు. వాళ్ళనుకున్న మనిషిని నేను కాదని చెబితే వినరే!

లాయర్నై ఉండీ నా వాదనల్ని నాలుగు గోడలకే వినిపించాల్సి వస్తోంది. మాతగా మారినప్పుడు నా ప్రవచనాలన్నీ కిటికీలోంచి కనిపించే పశు పక్ష్యాదులకే పరిమితం అవుతున్నాయి. ఓ రైతుబిడ్డగా చెమటోడ్చి పండించిన పసిపాపల్లాంటి నా పంట చేలని కళ్ళ నిండుగా చూసుకోలేకపోతున్నాను. నేల తల్లి ఒడిలో ఆటలాడుతూ పెరిగిన నాకు ఇక్కడ ఊపిరి అందడం లేదు. పోస్ట్ మాన్(వుమన్?) గా ఉన్నప్పుడు గదంతా రెక్కలు తెగిన పక్షుల్లా పడి ఉన్న ఉత్తరాల్ని చూసుకుంటూ నిట్టూర్పులు విడుస్తున్నాను. ... ఇంకా ఎన్నెన్ని రూపాల్లో ఎన్నెన్ని కష్టాలు అనుభవిస్తున్నానో, వరాన్నిచ్చి దాన్ని శాపంగా మార్చిన ఆ భగవంతుడికే తెలియాలి.

ఎందుకు బంధించారు అనేకంగా మారిన నన్నిలా. ఏవేవో పరీక్షలు చేయిస్తున్నారు. 'నేను ఆరోగ్యంగానే ఉన్నాను, ఇది దేవుడి వరం' అని చెప్తే ఎవరికీ అర్థం కావట్లేదు. అర్థమైనా అవనట్టు నటిస్తున్నారు. అవును మరి, వాళ్ళెప్పుడూ ఒక్కలాగే ఉంటారు. నేను ఇంతమందిలా మారుతున్నానని కుళ్ళు వాళ్ళకి. గుడ్డిలో మెల్లగా పుస్తకాలు అడిగితే మాత్రం తెచ్చిస్తున్నారు. ఏ రంగమైనా సరే, అప్ టు డేట్ గా లేకపోతే వెనుకబడిపోమూ!

ఇన్ని రోజులకి ఈ డాక్టర్ ఎవరో గానీ శ్రద్ధగానే వింటున్నాడు చెప్పేది. నేనూ డాక్టర్నేనని చెబితే సంతోషించినట్టు కనిపించాడు. నేను వాడే పెద్ద పెద్ద పదాల్నీ , సర్జరీల్లో వాడుతున్న కొత్త టెక్నాలజీకి సంబంధించిన విషయాల్నీ ఎంతో ఆశ్చర్యంతో వింటున్నాడు. నా పరిజ్ఞానానికి

అబ్బురపోతున్నాడు. మధ్య మధ్యలో తలూపుతున్నాడు. నవ్వుతున్నాడు కూడా. నేను చెబుతున్నవన్నీ నమ్మినట్టే ఉన్నాడు. నిజం చెబితే నమ్మకేం చేస్తారు ఎవరైనా. కొంచెం ఆలస్యమవుతుంది అంతే.

అతని చుట్టూ కనిపిస్తున్న ఆ ప్రైమరీ బ్లూ , ఆక్వా బ్లూ గా మారాలంటే ఏం చెయ్యాలో చెప్పినప్పుడు మాత్రం తెల్ల మొహం వేసాడు. మెటాఫిజిసిస్ట్ గా ఉన్నప్పుడు తెల్సుకున్న విషయాలు కొన్ని మెమొరీలో ఉండిపోయాయని చెప్పినా అర్థం చేసుకోలేక అయోమయంగానే చూసాడు.

ఇంకా టెంపోరల్ పారడాక్స్ ల గురించీ, వాం హోల్స్ గురించీ, మెషీన్ గన్ల గురించీ, పోలిటిక్స్ గురించీ చాలానే మాట్లాడాను.

నాకున్న నాలెడ్జ్ చాలా గొప్పదనీ, వారానికి రెండు సార్లైనా వచ్చి తనకి కొత్త విషయాలు నేర్పమని ప్రాధేయపడ్డాడు. అది కుదరదనీ కొన్ని రోజులు మాత్రమే నేను డాక్టర్ననీ, తర్వాత మళ్ళీ ఇంకో రూపం తీసుకోవలసి వస్తుందనీ చెబితే చాలా నిరాశ పడిపోయాడు. అప్పుడే నా వరం గురించి చెప్పాల్సి వచ్చింది.

ఎవరికీ అర్థం కాని విషయం ఇతనికి అర్థమయినట్టే ఉంది కానీ అటువంటి వరం ఎందుకు కోరుకున్నారు అని అడుగుతాడేంటి!. వరాలు ఎవరైనా ఎందుకు కోరుకుంటారు... నిజమే ఎందుకు కోరుకున్నాను ఈ వరం? ఆ .. గుర్తొచ్చింది.. కథ రాయడం కోసం కదూ. వైద్యం చేసినప్పుడు కలిగే తృప్తి కథ రాస్తే వస్తుందా? అయినా ఏదైతే ఏంటి? వేరు వేరు షేడ్ లలో ఉన్నా ఆక్వా బ్లూ అయినా పౌడర్ బ్లూ అయినా బ్లూనే కదా. వైద్యుడికీ, కళాకారుడికీ, రచయితకీ దగ్గర సంబంధం ఉండబట్టేగా వాళ్ళందరి 'ఆరా'లూ నీలంగానే ఉంటాయి. ఆ విషయమే డాక్టర్ కి చెప్పాను. అతను ఒప్పుకోలేదు. రచయితలు, వైద్యుల కన్నా గొప్పవారనీ, నేర్చుకుంటే ఎవరైనా వైద్యం చెయ్యవచ్చు కానీ రచనలు చెయ్యలేరనీ అన్నాడు. అదీ నిజమే. సరే కథలే రాయచ్చు అయితే.

ఏమంటున్నాడు? కథ రాయాలంటే నేను నేనుగా మారాలా.. అవునవును. డాక్టర్ లా ఉంటే కథలెలా రాస్తాను. మళ్ళీ ఇక నేను నేనుగా మారిపోయి కథలు రాసేస్తాను. ఇప్పటివరకు నేను ఎవరెవరిగా మారానో వాళ్ళందరి కథలూ రాసేస్తాను. గొప్పగా జీవితాల్ని రాసేస్తాను. గొప్ప గొప్ప కథలు రాసేస్తాను. రాత్రి కలలో దేవుడొచ్చినప్పుడు నాకిచ్చిన ఈ వరం ఇక చాలని చెప్పేస్తాను. లేకపోతే ఈ కథలన్నీ రాయకుండానే మర్చిపోతానేమో? అంతా బాగానే ఉంది గానీ ఇంతకీ నేనెవర్ని???

ఏమో మరి. నేనెవర్నో ఎవరిగా మారాలో ఈ డాక్టర్నే అడిగితే సరి. **!!**



# కథా కౌముది

## తిరుగులేని ప్రయాణం  వేమూరి వేంకటేశ్వరరావు

### శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
### వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
### 20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
### ఉత్తమ కథానిక విభాగం విజేత

అతను కళ్లు తెరచేడు. చుట్టూ కలయజూసేడు.

అదొక చిన్న గదిలా ఉంది. అంతా ఆధునాతనంగా ఉంది. కాని, ఎక్కడా తలుపులు, కిటికీలు కనిపించలేదు.

అతను ఒక శయ్య మీద పరుండి ఉన్నాడు. నడుం చుట్టూ పటకా కట్టి ఉంది.

పటకా విప్పి, లేచి కూర్చున్నాడు. చుట్టూ చూసేడు. ఆ చిన్న గది రెండు మీటర్లు పొడుగుంటుందేమో!

"ఆకలేస్తోందా రాస్కర్? రోజనం కావాలా? శాకాహారమా? మాంసాహారమా?" గోడకి ఎగువ ఉన్న చిల్లుల పళ్లెం నుండి శబ్దం వినిపించింది.

అతను శయ్య దిగి చిరాకుగా గోడ మీద పిడికిలితో గట్టిగా గుద్దేడు. అక్కడ మీట ఉందో ఏమో, గభాలున ఒక సొరుగు లాంటిది తెరుచుకుంది. అందులో చిన్న నీటి కుళాయి, దాని కింద గమేళా, ఎదురుగా గోడ మీద అద్దం ప్రత్యక్షమయాయి. కుళాయి విప్పి ముఖం కడుక్కున్నాడు.

"నీళ్లని వృధా చెయ్యవద్దు. ఇక్కడ నీళ్లు అపురూపం" అదే వాక్కు హెచ్చరించింది.

"ఇప్పుడు వేళ ఎంతయి ఉంటుంది?" అంటూ అతను ఒక కేకేసేడు.

"అంతరాళంలో వేళకి అర్థం లేదు." సమాధానం వినిపించింది.

"బయలుదేరిన చోట ఇప్పుడు వేళ ఎంతయి ఉంటుంది?"

"తెల్లారి ఎనిమిది అవుతోంది."

– o –

ఈ సందర్భంలో వేళ గురించి భాస్కర్ అడిగిన ప్రశ్నకి అర్థం లేదు. కాలాన్ని గంటలలోను, నిమిషాలలోను కొలిచి ప్రయోజనం లేదు. రోజులు, వారాలతో కూడ ప్రయోజనం ఉండదు. ఈ కథనం మొదట్లో మొదలు పెట్టి చెబితే కాని అసలు భాస్కర్ ఆవేదన అర్థం కాదు. ఈ కథ ఎలా మొదలయిందో, ఎలా పరిణమించిందో తెలుసుకుంటే వేళ ఎంతయిందో తెలుసుకుని ప్రయోజనం లేదని అర్థం అవుతుంది.

2

స్థానికంగా అది సాయం సమయం. ఆంబూరు కాద కాలవ గట్టున కానా మీద కూర్చున్న అప్పన్న ఆకాశం వైపు చూస్తున్నాడు. తెల్లటి మేఘపు తునకలు ఇటూ అటూ పరిగెడుతూ ఒక సారి ఏనుగు ఆకారంలో, మరొక క్షణంలో హంస లాగ, ఇలా రకరకాలుగా ఆకారాలు మారుతూ ఉంటే ఆసక్తిగా కళ్లప్పగించి చూస్తున్నాడు. చూస్తూండగా హంస వెనక నుండి మరొక శాల్తీ గుండ్రంగా, పళ్లెంలా కనిపించింది. దాని మీద సూర్య రస్మి పడే సరికి మిలమిలా మెరుస్తూ వెండి పళ్లెంలా అనిపించింది. అది మేఘం కాదని అప్పన్నకి ఎవ్వరూ చెప్పకనే తెలిసిపోయింది. విమానమేమో అనుకున్నాడు. వైజాగులో, గోపాలపట్నం కాడ విమానాలు లేవడం, దిగడం చూసేడు. అది విమానం కూడ కాదు. చూస్తూండగానే అది విష్ణుచక్రంలా గిర్రున తిరుగుతూ ముందుకి చర్రున దూసుకు పోయింది. అదేమిటో అప్పన్నకి అర్థం కాలేదు.

– o –

స్థానికంగా ఉదయం 10 గంటలు. దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాలో శాన్ లుయీస్ అనే చిన్న ఊరి పొలిమేరల్లో వెండి పళ్లేల ఆకారంలో ఉన్న అయిదు నభోనావల్లో ఎవ్వరో ఆగంతకులు దిగి వచ్చేరన్న వార్త రేడియోలో వస్తోంది. స్పేనిష్ లోంచి ఇంగ్లీషులోకీ, ఇంగ్లీషు నుండి తెలుగులోకి మారుతూ వచ్చేసరికి వార్తలో స్పష్టత లోపించింది

– o –

స్థానికంగా ఉదయం 8 గంటలు. న్యూయార్క్ నగరం వీధులు అప్పటికే ప్రజల కోలాహలంతో నిండుగా ఉన్నాయి. సి. ఎన్. ఎన్. వారి వార్తలు టెలివిషన్ మీద వస్తున్నాయి: “ఇరాక్‌లో యుద్ధం. ఆఫ్ఘనిస్థాన్ లో యుద్ధం. పాలస్తీనా మీద ఇజ్రయెల్ బాంబులు. సహారాకి దక్షిణాన ఉన్న దేశాలలో ఆకలి చావులు ఒక పక్క, అంటురోగాలు మరొక పక్క. అణు విద్యుత్ ఉత్పాదక కేంద్రాల నిర్మాణం విషయంలో అమెరికాకి, ఇండియాకి మధ్య ఏకీభావం కుదరకపోవడం వల్ల .....” ఈ వార్తలు చెప్పుకుపోతూ ఉండగా అకస్మాత్తుగా తెర మీద "ప్రత్యేక ప్రకటన" అంటూ నడుస్తూన్న వార్తలని ఆపు చేసేరు.

“ఎగువ న్యూయార్క్ లో బింఘంటన్ ఊరు బయట ..... విశ్వాంతరాళపు లోతుల్లోంచి ఒక నభోనౌకల బృందం దిగివచ్చి అక్కడ పొలాల్లో వాలిందిట. విచిత్రమైన రూపురేఖలతో ఉన్న ఆ ఆగంతకులు ఆ పల్లెపట్టున ఉన్న వ్యక్తులతో ఇంగ్లీషులో మాట్లాడుతున్నారుట. చాల స్నేహశీలులా ప్రవర్తిస్తూన్న వారు నిజంగా దివి నుండి భువికి దిగి వచ్చిన సందర్శకులా? లేక, హాలీవుడ్ వారు “ఔట్‌డోర్ షూటింగ్” కి ఇక్కడకి వచ్చి, ప్రచారం కోసం హడావుడి చేస్తున్నారా అన్న విషయం ఇంకా తేలలేదు” అంటూ ఒక విలేకరి అనుమానం వెలిబుచ్చింది. తాజా వార్తలకి ఎదురు చూస్తూ ఉండండి... అంటూ ఉండగా....

ఇంతలో న్యూయార్క్ నగరం నడిబొడ్డులో ఉన్న ఐక్యరాజ్య సమితిలో పెద్ద కోలాహలం చెలరేగడంతో టెలివిషన్ కేంద్రం వారు బొమ్మ మార్చి ఐరాస భవనం చూపిస్తున్నారు.

“మరో లోకం నుండి లాతివారో, జ్ఞాతులో – మిత్రులో, శత్రువులో తెలియదు కాని – భూమి మీద పెక్కు చోట్ల వాలేరుట. ఈ పరిణామం మన మంచికే వచ్చిందో, ముప్పుకే వచ్చిందో తెలియదుట. అందుకని అన్ని దేశాలు అప్రమత్తతతో ఉండాలనిన్నీ, సభ్య దేశాలలో పరస్పర సంప్రదింపులు కీలకం అనిన్నీ భద్రతా సంఘం ఒక సిఫార్సు జారీ చేసింది. ఈ ఆగంతకుల ప్రతినిధి ఒకరు ఐక్యరాజ్య సమితికి వస్తున్నారుట. ప్రపంచం లోని అన్ని దేశాల ప్రతినిధులూ ఉన్న “సర్వసభ్య సమితి” లో ప్రసంగించడానికి అనుమతి కోరుతూ వర్తమానం వచ్చిందిట.”

– o –

ఈ కోలాహలం ఇలా సాగుతూనే ఉంది. ఇంతలో ఆగంతకుడు రానే వచ్చేడు. మూడు మీటర్లు పొడుగు. బరువు సుమారు 100 కిలోలు. మన లాగే కాళ్లూ, చేతులూ, మెడ మీద తలకాయ, వగైరా ఉన్నాయి. బుర్ర ఆకారం విచిత్రంగా ఉంది. మెడ నుండి బుర్ర కోలగా పైకి లేచి, అక్కడ బోర్లించిన ఆనపకాయ గుండులా పెద్ద పరిమాణంలో ఉందా బుర్రకాయ. అతని వెంట పరివారం లేదు, చేత ఆయుధం లేదు; ఒక పుస్తకం లాంటి వస్తువు ఏదో ఉంది.

అతని రాకని గమనించి రక్షక భటులు, పోలీసులు ఎందుకైనా మంచిదని తుపాకులు పైకెత్తి అప్రమత్తతతో సిద్ధంగా నిలబడి ఉన్నారు.

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ముందుకి వచ్చి ఆగంతకుడిని వేదిక వరకు నడిపించుకుని వెళ్లి, సభాముఖంగా అతని రాకకి కారణం ఏమిటో చెప్పని అడిగేడు.

అతను నేరుగా వేదిక ఎక్కేడు. చేతిలో ఉన్న పుస్తకం తెరచి మాట్లాడడం మొదలు పెట్టేడు.

"నేను మరో లోకం వ్యక్తిని. మరో కాలపు వ్యక్తిని. చాల దూరం నుండి వస్తున్నాను. నా వద్ద ఏ విధమైన ఆయుధాలూ లేవు. నా వల్ల మీరు భయపడవలసిన పని లేదు. శాంతి కాముకుడిని. మీ స్నేహం కోసమే వస్తున్నాను."

అతని మాట వినిపిస్తోంది కాని అతని పెదవులు కదలడం లేదు. కంఠంలోని కండరాలలో కూడ కదలిక లేదు. ముఖం, ఏ కళవళికలూ లేకుండా, బెల్లం కొట్టిన రాయిలా ఉంది.

"అరే! ఇతను మన భాష మాట్లాడుతున్నాడే!" కొందరు లోపల అనుకుంటూ ఉంటే కొందరు బయటికే అనేసేరు.

ఆగంతకుడు ప్రసంగం కొనసాగిస్తున్నాడు.

"మాది సాంకేతికంగా బాగా అభివృద్ధి చెందిన సమాజం. ఎవ్వరితోనైనా మేము భాషతో ప్రమేయం లేకుండా మానసికంగా మాట్లాడగలం. మా మనోభావాలు మా మెదడులో జరిపిన ప్రేరేపణల కారణంగా మా మెదడు ఒక విధమైన మేధోతరంగాలని పుట్టిస్తుంది. అవి మీ మెదడులో చేరి అదే రకమైన ప్రేరేపణలు కలుగజేస్తాయి. ఆ ప్రేరేపణలని మీ మెదడు మీ భాషలోకి మారుస్తుంది. కనుక నేను మాట్లాడేది మీమీ మాతృ భాషలలో మీకు వినిపిస్తోంది. మీరందరు ఎంతో ఆత్రుతతో ఉన్నారని నాకు తెలుసు. కనుక మీ ప్రశ్నలకి ముందు సమాధానాలు చెబుతాను."

సభలో ప్రజలు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. ఇంతలో ఐరాస అధ్యక్షులవారు, లాంఛనప్రాయంగా మొదటి ప్రశ్న అడిగేరు.

"ఈ విశ్వంలో బిలియన్ల పైబడి నక్షత్రాలు, వాటిలో కొన్నింటికైనా గ్రహ కుటుంబాలు ఉన్నాయి కదా, మీరు మా భూమినే ఎంచుకుని సందర్శించడానికి కారణం?"

"మేము మాకు అందుబాటులో ఇరుగు పొరుగున ఉన్న గ్రహజాలాన్ని సదా పరిశీలిస్తూనే ఉంటాం. ఎక్కడ మేము కలుగజేసుకోవడం అవసరమని మాకు తోస్తే అక్కడకి వెళ్లి మా సహాయ సహకారాలు అందిస్తాం. అందరికి నైసర్గికము, సహజము అయిన కొన్ని ఈతి బాధలు ఉంటాయి. అవి చాలనట్లు మీ భూగ్రహంలో మీరు కొన్ని కొని తెచ్చిపెట్టుకున్న తలపోట్లు కూడ ఉన్నాయి. వీటిని చూసిన తరువాత మా సహాయం మీకు అవసరం అనిపించి ఇక్కడకి వచ్చేం."

"మీరు ఏ రకం సహాయం చెయ్యగలరు? సహాయం చెయ్యడానికని వచ్చి మా కొంపలు ముంచరని మాకు ఏమి హామీ ఇవ్వగలరు?" రష్యా ప్రతినిధి ప్రశ్నించేరు.

"మీ అవసరం గుర్తించి మేము వచ్చేం. సహాయం అందిస్తామని చెయ్యి జాపుతున్నాం. ఇక్కడ నిర్బంధం ఏదీ లేదు. మీకు నమ్మకం ఉంటేనే మేము అందించే సహాయం అందుకొండి. మా సహాయం ఉభయతారకంగా లేదనిపిస్తే ఈ గ్రహం వదలి మరొక గ్రహానికి మా సహాయం అందిస్తాం."

"స్వలాభాపేక్ష లేకుండా మీరు అంత దూరం నుండి ఇక్కడకి వచ్చేరంటే నమ్మడం కష్టంగా ఉంది. మా నుంచి ఏమి ఆశించి వచ్చేరు?" భారతీయ ప్రతినిధి ఆరాటపడ్డారు.

"సాంకేతికంగా మీ కంటె మేము బాగా ఎదిగిన వాళ్లం కాబట్టి మాకు తోచిన విధంగా సహాయం చేద్దామని వచ్చేం."

"నేను నమ్మను. సొంత లాభం లేకుండా ఎవ్వరూ ఎవ్వరికీ సహాయం చెయ్యరు. ఇది సృష్టి నైజం." అన్నాడు భారతీయ బృందంలో మరొకడు.

"వచ్చిన వాడిని చెప్పదలుచుకున్నదేదో చెప్పనివ్వండి." పాలస్తీనా ప్రతినిధి అసహనంగా అన్నాడు.

"మేము మీ పరిచయం కోసం వచ్చేం. ఎన్ని సంవత్సరాల బట్టో మీతో సంభాషణలు కొనసాగించాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. మీ లోకంలో ఉన్న ఆరు బిలియను వ్యక్తులలో ఒకే ఒక వ్యక్తికి గతంలో మేము పంపిన వాకేతాలు అందేయి. ఆ వ్యక్తి మా వాకేతాలని అందుకోగలిగేడు కాని వాటిని పరిపూర్ణంగా అర్థం చేసుకోలేకపోయాడు. ఒక సారి అతనిని ఏకాంతంగా సందర్శించి మా లోకానికి అతిథిగా తీసుకువెళదామని కూడ ప్రయత్నించేం. ఆ ప్రయత్నం సఫలం కాలేదు. అదే రకం ప్రయత్నాన్ని ఈ సభ ద్వారా మరొక సారి చేస్తున్నాం. మీ లోకం ఎదుర్కొంటూన్న సమస్యలకి పరిష్కార మార్గాలు మా దగ్గర ఉన్నాయి," అంటూ చేతిలో ఉన్న పుస్తకాన్ని ఆడించేడు. ఆ పరిష్కార మార్గాలు ఆ పుస్తకంలో ఉన్నట్లు అతను సూచిస్తున్నాడా లేక మాట్లాడేటప్పుడు చేతులు అలా ఊపడం అతని అలవాటా అన్నది స్పష్టం కాలేదు.

ఆగంతకుడు ప్రసంగం కొనసాగిస్తూ, "బలవంతం చేసి మీ చేత ఏ పనీ చేయించం. మా దగ్గర ఉన్న ప్రత్యేక శక్తులని మీకు చూపిస్తాం. మీకు కావలసినవాటినే ఎన్నుకోండి. ఉదాహరణకి అతి చవకగా, సురక్షితమైన పద్ధతులలో శక్తిని ఉత్పత్తి చేసే పద్ధతులు మాకు తెలుసు. అవి మీకు నేర్పుతాం. ఇటుపైన మీరు శిలాజ ఇంధనాల మీద ఆధారపడవలసిన పని లేదు."

భారత బృందం కళ్లు మెరిసేయి. ఆసక్తితో వింటున్నారు.

"మా దగ్గర అతి చవకగా రసాయన ఎరువులు తయారు చేసే పద్ధతులు ఉన్నాయి. మీ సముద్రాలలో నీటిని తాగునీటిగా చెయ్యగలం. నీటి పారుదల సౌకర్యాలు ఉండి, ఎరువులు మంచివి దొరుకుతూ ఉంటే, పంటలకి ఏమి కొదువ? బంజరు భూములని, ఎడారులని కూడ సస్యశ్యామలం చెయ్యగలిగే ప్రతిభ మా దగ్గర ఉంది."

ఇజ్రయెల్ ప్రతినిధి ఆసక్తితో వింటున్నాడు కాని అమెరికాలో ఉండే వ్యవసాయ పరిశ్రమల వారి గుండెల్లో రాయి పడింది.

"అంతే కాదు. మీరు మీమీ రాజ్యాలని శత్రువుల బారి నుండి రక్షించుకుందికి అనేక రకాల ఆయుధాలు, ఆయుధ విద్యలు మా దగ్గర ఉన్నాయి. అవి మీ అందరికీ – ఏ ఆంక్షలు లేకుండా – ఉమ్మడిగా నేర్పుతాము. ఇటుపైన ఒక రాజ్యం మీద మరొక రాజ్యం బలం ఉపయోగించి అజమాయిషీ చెయ్యడానికి వీలు ఉండదు. అందరూ సమానులే!"

భద్రతా సంఘంలో శాశ్వత సభ్యులైన అయిదు దేశాల రాయబారులూ ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు.

"మరోలోకం అంటున్నారే. ఆ లోకం ఎక్కడ?" క్యూబా ప్రతినిధి అడిగేరు.

"ఇంతకీ మిమ్మల్ని ఏమని పిలవమంటారు? సరి అయిన ఉచ్చారణతో సహా చెప్పండి" ఫ్రాంసు ప్రతినిధి అడిగేరు.

"ఇక్కడకి 12 జ్యోతిర్వర్షాల దూరంలో ఉన్న ఒక నక్షత్ర కుటుంబం మాది. మీ పరిభాషలో మా తార పేరు "టౌ సేటీ." భూమి నుండి ఆకాశంలోకి చూస్తే మా తార మీకు "సీటస్" రాసిలో, రాసిచక్రానికి దగ్గరగా కనిపిస్తుంది. ఆ నక్షత్ర రాసిలో మా పితృ నక్షత్రం చుట్టూ అయిదు గ్రహాలు తిరుగుతున్నాయి. మాది మూడో గ్రహం. "సీటస్" అంటే తిమింగిలం కనుక మీరు మమ్మల్ని 'తిమింగిలాలు' అని పిలవండి."

"మీరు మమ్మల్ని ఏమని పిలుస్తారు?" మరొకరు ప్రశ్నించేరు.

"మా గ్రహం నుండి చూస్తే మీ సూర్యుడు భూతేశ రాసిలో కనిపిస్తాడు. భూతేశ రాసిలో ఉండే భూతలం మీద నివసించే మిమ్మల్ని మేము "భూతాలు" అని పిలుస్తాం." అతను లోలోపల కొంటెగా నవ్వుకున్నాడేమో కాని బయటకి మాత్రం ముఖకళవళికలలో మార్పు కనిపించలేదు.

## 3

కాలం గడుస్తోంది. తిమింగిలాల పరపతి పెరుగుతోంది. మీ రక్షణే మా లక్ష్యం అంటూ ప్రపంచం నాలుగు మూలలా తిమింగిలాలు తిరగడం రివాజు అయిపోయింది. ప్రపంచంలోని ముఖ్య దేశాలలో తిమింగిలాల రాయబార కార్యాలయాలు వెలిసేయి. వారి సాంకేతిక నిపుణుల సహాయంతో ఎందుకూ పనికిరాని గొడ్డు భూములు కూడ పంటలతో పచ్చగా కలకల్లాడుతున్నాయి. బదుగు దేశాలలోను, వర్ధమాన దేశాలలోను తిండి గింజలకి,

కట్టుబట్టకి, తాగునీటికి, విద్యుత్తుకి కొరత లేదు. చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా, అన్ని దేశాలవారికీ, రక్షణకి సరిపోయే విధంగా, అదృశ్యమైన బలక్షేత్రంతో ఒక రక్షరేకు నిర్మించుకోవడం నేర్పేరు. ఎటువంటి దాడి నుండి అయినా ఈ రక్షరేకు రక్షిస్తుంది. కాని, మరొక దేశాన్ని భక్షించడానికి ఆ ఆయుధాలు పని చెయ్యవు.

ఈ పరిణామం అందరికీ నచ్చ లేదు. అగ్రదేశాల స్థానంలో ఉన్న వారికి అస్సలు నచ్చలేదు. అమెరికా వారి ప్రభావం, ప్రభ తగ్గిపోయాయి. అమెరికాలోని ఎన్. ఎస్. ఎ. లోనూ సి. ఐ. ఎ. లోను గుసగుసలు మొదలయేయి.

ఆగంతకుడు ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించినప్పుడు అతని చేతిలో ఉన్న పుస్తకం బల్ల మీద పెట్టిన కొద్ది క్షణాలలోనూ ఎన్. ఎస్. ఎ. వారు దానిని అతి లాఘవంగా తస్కరించి, ఒక నకలు తీసేరు. ప్రసంగం అంతా టేపు మీద నమోదు చేసేరు. ఆ ప్రసంగంలో కాని, పుస్తకంలో కాని ఏదైనా గూఢార్థం ఉందేమోనని భాషాశాస్త్రవేత్తలు తరచి, తరచి విశ్లేషించడం మొదలు పెట్టేరు.

ఆ పుస్తకంలో ఉన్న రాత ముందుగా పరిశీలనకి గురి అయింది. చూడడానికి, కొరియా భాష రూపంలో ఉన్నప్పటికీ, త్వరలోనే అది ప్రస్తుతం భూమి మీద చలామణీలో ఉన్న ఏ భాషనీ పోలి లేదని తేలిపోయింది. పుస్తకంలో ఉన్నది సహజ భాష కాకపోతే కృత్రిమ భాష అయి ఉండవచ్చు. కంప్యూటర్ రంగంలో కృత్రిమ భాషలలో ప్రావీణ్యం ఉన్న పెద్దలని పిలిపించేరు. రహశ్య లిపులని ఛేదించడంలో అగ్రగణ్యులు వచ్చేరు. ఈజిప్టులోని పిరమిడ్‌లలో ఉన్న చిత్రలిపులని ఛేదించిన విధానాలు తిరిగి మననం చేసుకున్నారు. ప్రధాన సంఖ్యల మీద పరిశోధనలు చేసే గణిత శాస్త్రవేత్తలని పిలిపించేరు. ఫలితం శూన్యం.

ఈ తిమింగిలాల సర్వాధిపత్యానికి అడ్డు కట్ట వెయ్యకపోతే తమ అగ్రస్థానానికే ముప్పు అని అమెరికావారు భయపడ్డారు. తిమింగిలాల ఆయువుపట్టు తెలుసుకుని వాళ్లని ఒక దెబ్బ కొట్టకపోతే అమెరికా గతి ఏమి కాను?

భారతదేశంలో "రా" లో పని చేసే "రాకుమారులు" కూడా తిమింగిలాల "రాత"లో కీలకం కోసం పరిశోధన మొదలు పెట్టేరు. అమెరికావారు "హై టెక్" మార్గం తీసుకుంటే భారతీయులు "లో టెక్" మార్గం అవలంబించేరు.

ఆగంతకులు ఇంతకు పూర్వం భూలోకంలో ఎవ్వరితోనో సంభాషించినట్లు చెప్పుకున్నారు. ఆ వ్యక్తి ఎవరై ఉంటారో? ఈ ప్రశ్నకి సమాధానం అంతగా కష్టపడకుండానే దొరికింది. భారతదేశంలో అగ్రగణ్యుడైన భౌతికశాస్త్రవేత్త, రక్షక మంత్రివర్గానికి మాజీ సలహాదారుడు, అయిన ఆచార్య మిడతంభొట్లు ఉద్యోగ విరమణ చేసి వైజాగు దగ్గర ఉన్న ఒక ఆశ్రమంలో రామా కృష్ణా అనుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఆయనకి ఇతర గ్రహాలలో ఉన్న జీవులతో నిజంగా పరిచయం ఉందో, లేదో నికరంగా ఎవ్వరికీ తెలియదు కాని, ఆయనకి నోబెల్ బహుమానం వచ్చి ఉండకపోతే ఆ వైజాగులోనే పిచ్చాసుపత్రిలో పడేసి ఉండేవారు. ఈ సందర్భంలో ఆయనతో ఒకసారి మాట్లాడి చూడ్డం మంచిదని 'రా' వారు వారి భాషాశాస్త్రవేత్త భాస్కర్‌ని వైజాగు పంపించేరు.

అప్పటికే తిమింగిలాలు ఏర్పాటు చేసిన భుక్తి సదుపాయాలవల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకి తిమింగిలాలు అంటే భయం పోయి, భక్తి భావం పెరిగింది. తిమింగిలాలు నిజంగా నిస్స్వార్థ బుద్ధితో మానవ రక్షణకే భూలోకానికి వచ్చేయని ప్రజలు నమ్మేరు.

ఈ అదును చూసుకుని ఉత్సాహం ఉన్న "భూతాలకి" తమ నభోనౌకలలో అంతర్ నక్షత్ర యానం చెయ్యడానికి అవకాశం కల్పిస్తామంటూ తిమింగిలాలు ప్రచారం చెయ్యడం మొదలు పెట్టేయి. తమ లోకం తీసుకెళ్లి, అక్కడ వింతలు, విశేషాలు ఉచితంగా చూపిస్తామంటూ తిమింగిలాలు అందరినీ ఊరించడం మొదలు పెట్టేయి.

దేశాన్ని ఏదో ఒక విధంగా వదలిపెట్టి అమెరికా వెళ్లే అవకాశం కోసం భారతీయులు ఎలా ఎదురు చూస్తున్నారో అదే మూసలో, వేలం వెర్రిగా ప్రజలు భూలోకాన్ని వదలి తిమింగిలాల లోకానికి ఎగబడి వెళ్లడానికి ఉద్యుక్తులవడం మొదలు పెట్టేరు. అందులోనూ డబ్బు ఖర్చు లేకుండా విశ్వవిహారం!

తండోపతండాలుగా ప్రజలు నభోనౌకాశ్రయాలకి చేరుకుంటున్నారు. ఒకొక్క దాంట్లో వేల మంది పట్టే సామర్థ్యం గల బృహత్ నౌకలు ప్రతి ఖండంలోనూ వేచి ఉన్నాయి. ప్రయాణం కోసం ఎగబడుతున్న ప్రజా వాహినిని ఎంతో సామర్థ్యంతో తిమింగిలాలు అదుపులో పెట్టి, నౌకలలోకి ఎక్కించి సహాయపడుతున్నారు.

–o–

ఈ లోగా అమెరికా నుండి వార్త వచ్చింది. ఎన్. ఎస్. ఎ. లో ఉన్న భాషాశాస్త్రవేత్తలు, పుస్తకంలో ఉన్న భాషని ఛేదించి అర్థం చేసుకోలేకపోయినా అట్ట మీద ఉన్న పేరుని "యాంత్రిక అధ్యయన పద్ధతులు" ఉపయోగించి, మహా శక్తిసంపన్నమైన కలనయంత్రాల సహాయంతో పలికించగలిగేరుట. పుస్తకం అట్ట మీద పేరుని కలనయంత్రం "మానవ రక్షణార్థం" అని ఉచ్చరించిదిట. ఇంతకు తప్పించి లోపల ఉన్న పాఠ్యభాగం ఇంకా కొరుకు పడలేదుట. అట్ట మీద బొమ్మ చూస్తే చాలదూ? పుస్తకం అంతా చదవాలా?

ఈ వార్త వినేసరికి మిడతంభొట్లుని కలుసుకోడానికి బయలుదేరిన భాస్కర్ మనస్సు మరో మార్గంలో ఆలోచన మొదలు పెట్టింది. "ఎన్నాళ్లు ఎదుగూ బొదుగూ లేని ఈ ప్రభుత్వోద్యోగంలో బతకడం? ఇటువంటి అవకాశం అడిగినప్పుడల్లా రాదు" అనుకుంటూ ఉద్యోగానికి రాజీనామా చేసేసి ఆ దఫాలో భూమిని వదలి వెళ్లబోతున్న ఆఖరి నభోనౌకని అందుకునే ప్రయత్నంలో వరసలో నిలబడ్డాడు. నౌక నిండి పోతోంది. తనవరకు రాకుండా తలుపులు మూసెస్తారేమో అన్న బెంగ అతనిలో గాఢంగా ఉంది.

మిడతంభొట్లుది చాల నిదానమైన తత్త్వం. భాస్కర్ తనతో స్వయంగా సంప్రదింపులకి వస్తున్నాడని "రా" వారు పంపిన వర్తమానాన్ని విన్నారు. విని, అతి నెమ్మదిగా తన అభిప్రాయం వెలిబుచ్చేరు.

"వాళ్లా! తిరిగి వచ్చేరా? గతంలో నాతో ఒకటికి రెండు సార్లు మాట్లాడేరు వాళ్లు. ఒక సారైతే ఎదురుగా నిలబడి గంటకి పైగానే మాట్లేడేరు. నేను ఆ విషయం చెబితే ఎవ్వరూ నమ్మలేదు, సరికదా నన్ను ఒక పిచ్చివాడిగా జమకట్టేరు. మన బెంగాలీ వాళ్లు "వ" కి బదులు "బ" వాడినట్లే ఈ తిమింగిలాలు అంటున్నారే – వీళ్లే వాళ్లయితే – "భ" కి బదులు "ర" పలుకుతారు. వీరి వ్యాకరణంలో "రభయోనభేదః!" తిమింగిలాల వద్దనుండి తస్కరించిన పుస్తకం పేరు "మానవ రక్షణార్థం కాదు....అది మానవ......"

అప్పటికే భాస్కర్ వైజాగు పొలిమేరల్లో వాలిన నభోనౌకని ఎక్కడానికి సిద్ధంగా ఉన్న వరసలో నిలబడి ఉన్నాడు. నౌక నిండిపోతోంది. తనకి అవకాశం రాదేమోనన్న భయంతో తన వద్ద ఉన్న "వి. ఐ. పి" రాజముద్రని చూపించి ఏదో ముఖ్యమైన ప్రభుత్వాధికారిలా వరస ముందుకు చేరుకున్నాడు. అక్కడ నౌకని ఎక్కడానికి సహాయపడే తిమింగిలాల సిబ్బందిలో ఒకడు అతనికి చేతిని అందించి నౌకలోకి ఎక్కించడానికి సహాయం చేస్తున్నాడు.

ఇంతలో మిడతంభొట్లు పంపిన వ్యక్తి పరుగు పరుగున వస్తూ, తలుపులు మూయడానికి తయారుగా ఉన్న నౌక మెట్లు ఎక్కుతూన్న భాస్కర్‌ని ఉద్దేసించి, 'రభయోనభేదః' ట. వాళ్లు వచ్చినది రక్షించడానికి కాదుట. నౌక ఎక్కొద్దు," అని పెద్ద పొలికేక పెట్టేడు.

భాస్కర్‌కి ఆ మాటలలోని అంతరార్థం అర్థం అయిందో లేదో కాని నౌకని ఎక్కద్దు అన్న తాత్పర్యం అర్థం అయినట్లే ఉంది. వెనక్కి తిరిగి, మెట్లు దిగడానికి ప్రయత్నం చేస్తూ ఉంటే అక్కడ ఉన్న పరిచారకుడు భాస్కర్‌ని లోపలికి ఒక్క తోపు తోసి, "బయలుదేరే వేళ అయింది" అంటూ తలుపులు మూసేసేడు.

## 4

భాస్కర్‌కి కోపం, చిరాకు పెల్లుబికి వస్తున్నాయి. కోపంతో గోడ మీద కాలితో తన్నేడు. గోడలో చిన్న కిటికీ తెరుచుకుంది.

అవతల నుండి ఎవ్వరో ఫలహారం ఉన్న ఒక పళ్లేన్ని ఆ కిటికీ లోంచి లోపలికి తోసేరు.

"ఆకలి వేస్తూ ఉండాలి. ఇది తిను." ఆకాశవాణి మళ్లా వినిపించింది.

తన అసహాయతకి భాస్కర్‌లో ఉక్రోషం, ఉడుకుబోత్తనం వెల్లువలా పొంగుకొచ్చేయి.

విసురుగా ఆ ఫలహారపు పళ్లేన్ని నేల మీదకి గిరాటు కొట్టేడు.

వెంటనే ఒక తలుపు తెరుచుకుంది. ఒక పరిచారకుడు నేల మీద పడున్న పదార్థపు పొట్లాలని సేకరించి, పళ్లెంలో పెట్టి, అతని ముందుకి తోసి, "తిను. గమ్యం చేరుకునే వేళకి నువ్వు చిక్కిపోతే ఎలా?" అంటూ నర్మగర్భంగా ఒక వెకిలి నవ్వు నవ్వి బయటకి వెళ్లిపోయేడు.



# కథా కౌముది

## మగబిడ్డ మాత్రమే ఆర్. శర్మ దంతుర్తి

శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం – ప్రశంసా పత్రం

రంగరాయా మెడికల్ కాలేజ్ గేటు లోపలకి నడుస్తూ కాంపస్ లోకి బెదురు చూపుల్తో అడుగుపెట్టేడు కామేశ్వర్రావు. పది అడుగులు నడిచాడో లేదో నవ్వుతూ పలకరించిందో చిన్న బృందం, "ఏ వూరు మనది తమ్ముడూ?"

"గోకవరం అండి."

"ఇదేనా మొదటిసారి పట్నం రావడం?"

"లేదండి, ఇంతకు ముందు ఎంట్రన్సు రాయడనికొచ్చాను కదా? ఇది రెండో సారి." అడిగిన ప్రశ్నలో వెక్కిరింపు అర్ధం కానట్టు చెప్పేడు కామేశం అమాయకంగా. నవ్వులు.

"ఆ మాత్రం తెలుస్తోందిలే. ఈ చొక్కా గోకవరంలో కుట్టించిందేనా?"

"అవునండి. మా సూర్రావు కుట్టిందే." ఈ సారి మళ్ళీ నవ్వులు.

"ఒరేయ్ మంచి రంగు వస్తోంది వీణ్ణి వదిలేయండిరా," అన్నాడో సీనియర్. "అబ్బే కలర్ దేముంది కాసేపొయాక వెళ్ళొచ్చు కానీ ఇలాంటి బైతు మళ్ళీ దొరకొద్దూ?" అంటూ రెండో అతను కామేశ్వర్రావు తో అన్నాడు, "ఎంట్రన్సులో రేంక్ ఎంతొచ్చిందోయ్ మనకి?"

"నూట యాభై ఆరు"

"అమ్మో, పెద్ద న్యూరాలజిస్ట్ ఐపోదావనే? పదహారు పద్దెనిమిదులెంత?"

"రెండొందల ఎనభై ఎనిమిదే కదండి."

"ఇప్పుడెక్కడ తమరుండేది?"

"రూము తీసుకున్నానండి భానుగుడి దగ్గిర్లో ఇంకో ముగ్గురు కుర్రాళ్ళతో కల్సి"

"అంటే ఇంటిదగ్గిరునుంచి ఆవకాయ, మాగాయ ఊరగాయలు అవీ తెచ్చేసుకున్నట్టేనా?"

తల ఊపేడు కామేశం అవునన్నట్టూ.

"అయితే సాయంకాలం అన్నం వేడి వేడిగా వండించి అవన్నీ కలిపి కారేజీలో పెట్టుకుని హాస్టల్ లో రూం నెంబర్ 122 రా. లేకపోతే రేపు ఈపాటికి మళ్ళీ గోకవరమే." బృందం ముందుకి కదిలిపోయింది. కొంచెం భయంగా తల ఊపి క్లాసులకేసి నడిచేడు కామేశం.

రాత్రి కేరేజీ పట్టుకెళ్ళాక కుర్రాణ్ణి బట్టలూడదీసి ఏడిపించి వదిలేరు సీనియర్లు.

★ ★ ★ ★ ★ ★ ★

ఆరునెలలకి మెడికో గాడిలో పడుతూండగా ఒక్కసారి జీవితం తాచుపాము రూపంలో కామేశాన్ని కాటేసింది. ఓ రోజు రాత్రి రికార్డ్ లో బొమ్మలేసి పడుకోబోతూ ఉంటే ఎవరో తలుపు తట్టేరు. చూస్తే ఎదురుగా గోకవరం నుంచి వచ్చిన తన మావయ్య. మొహం చూస్తే అప్పుడే శ్మశానంలో ఎవర్నో దహనం చేసి వచ్చిన వాడిలా ఉన్నాడు.

వస్తూనే చెప్పేడు, "బయల్దేరు, కారు సిద్ధంగా ఉంది."

కామేశం ఏదో అనబోయేడు కానీ మావయ్య వాలకం చూసి తొందరగా బేగ్ లో బట్టలు సర్దుకుని పడుకున్న ఓ రూమ్మేట్ ని లేపి చెప్పేడు వెళ్తున్నట్టూ. కారు కాకినాడ దాటి గోకవరం రోడ్డుమీదకెక్కగానే మావయ్య సన్నగా వెక్కుతూ ఏడవడం వినిపించింది.

"ఏమైంది మామయ్యా? అందరూ కులాశాయేనా?"

"కామేశ్వరి చచ్చిపోయిందిరా," వెక్కుతూనే చెప్పేడు.

మీద పిడుగు పడ్డట్టైంది కామేశానికి. అక్క కామేశ్వరికి నెలలు నిండి పాపో బాబో పుట్టబోతున్నట్టు తనకి తెలుసు. పోవడమేమిటి? "అదెలా?" నోరు పెగుల్చుకుని అడిగేడు.

కాసేపు ఊరుకుని దుఃఖం తగ్గేక చెప్పేడు మావయ్య, "దానికి కడుపు పండినప్పట్నుంచీ వాడు మొగపిల్లాడు పుట్టకపోతే దాన్నీ పిల్లనీ చంపేస్తానని అంటూనే ఉన్నాడు. మొన్న సాయంకాలం కానుపులో ఆడపిల్ల పుట్టింది. వాడు ఊర్లో లేడు; ఏదో పనిమీద విజయవాడ వెళ్ళేడు. ఆడపిల్ల అని తెలియగానే కామేశ్వరి నిద్రమాత్రలు మింగేసింది. మాకు తెలిసేలోపుల దాని ప్రాణం పోయింది."

"మరి పుట్టిన పాపో?"

"అది బాగానే ఉంది. దాన్ని ఎవరికీ తెలియకుండా దాచి ఉంచాము. లేకపోతే బావొచ్చి దాన్ని చంపేస్తాడేమో అని భయం."

కామేశం కంట్లోంచి చటుక్కున కన్నీళ్ళు రాలేయి చెంపలమీదకి. తాను ఎంట్రన్స్ కి చదువుకుంటూంటే కడుపుతో ఉన్నా సరే ఎంత సేవ చేసింది తనకి కామేశ్వరి? ఈ బావ మనిషా నరరూపరాక్షసుడా? పుట్టిన పిల్ల ఆడ పిల్లైతే ఏమిటి తప్పు? అసలు మొగపిల్లాడు మాత్రమే కావాలనుకుంటే కుదురుతుందా? అలా చేయడానికి మందులేమైనా ఉంటాయా? అసలు ఉన్నాయనుకున్నా అందరికీ మొగపిల్లలు మాత్రమే కావాలనుకోవడం ఏమిటి? తప్పు ఎక్కడుంది? ఆలోచనల్లోనా, వ్యవస్థలోనా? ఎంతకీ తెగని ఆలోచనలు...

"బావ వెనక్కి వచ్చాక ఏం చేస్తారు?" మావయ్యని అడిగేడు.

"టెలెగ్రాం ఇచ్చారు పోయినట్టు. మనం వెళ్ళేసరికి వచ్చి ఉండవచ్చు. పిల్ల గురించి వచ్చాక ఏం చెప్పాలో తెలీకుండా ఉంది. చూద్దాం ఏం జరుగుతుందో. మీ అమ్మో, ఎవరో ఒకరు చూసుకుంటారు. అదేం పెద్ద సమస్య కాదు."

కారు గోకవరం చేరేసరికి తెల్లవారుతూ ఉంది. ఇంటినిండా జనం. బయటే వీధిలో ఉంచారు కామేశ్వరి శవాన్ని. తొమ్మిదౌతూ ఉంటే కామేశ్వరి మొగుడు వచ్చేడు. కామేశం తల్లి అరవడం మొదలెట్టింది అల్లుడి మీద – కూతుర్ని చంపేసినందుకు. తండ్రి మతిపోయినవాడిలా దిక్కులు చూస్తున్నాడు. అందరూ కల్సి తతంగం అంతా కానిచ్చేక మర్నాడు బావ ఏదో మాట్లాడదామని నోరు విప్పేడు.

కామేశ్వరం తల్లి చెప్పింది, "నాకూతురుకి లక్ష్మీ దేవే పాపలా పుట్టింది. నీలాంటి దరిద్రుడి మొహం చూడడానికి కాదు. ఆ పాపని నేనే పెంచుతాను. ఈ రోజునుంచి మళ్ళీ ఈ ఇంటి ఛాయలకి వచ్చావంటే ఈ కూరలు తరిగే కత్తిపీటతో ప్రాణం తీస్తాను." ఈ అరుపులకి కామేశం బావ భయపడిపోయేడు. పదిరోజుల తర్వాత పెద్ద కర్మ అయ్యేవరకూ గోకవరంలో ఉండి మర్నాడు ఊర్లోంచి మాయమయ్యేడు. అదే ఆఖరుసారి కామేశ్వర్రావు బావ గురించి వినడం, కనడం.

★ ★ ★ ★ ★ ★ ★

నాలుగేళ్ళు గడిచేయి. కామేశం మేనకోడలు – కమల గోకవరంలో పెరుగుతోంది. అల్లుడి ముందు సింహంలాగా అరిచిన అమ్మ ఇప్పుడు కమలని పదివేల కళ్ళతో కాపాడుతోంది, ఏ రోజు అల్లుడొచ్చి మనవరాల్ని చంపేస్తాడేమో అని ఆవిడ అనుమానం. మెడికో కామేశం ఆఖరి సంవత్సరంలో బిజీగా ఉంటూ కాకినాడ హాస్పిటల్లో హౌస్ సర్జన్సీతో కుస్తీ పడుతూంటే ఓ రోజు కార్డియాలజీ ప్రొఫెసర్ పిల్చేడు మాట్లాడ్డానికి. తుదీ మొదలూ లేకుండా సూటిగా చెప్పేడు, "కామేశ్వర్రావ్, నాకున్న ఒక్క కొడుకూ కువైట్ వెళ్ళిపోయేడు ఇక్కడ నా ప్రాక్టీస్ అందిపుచ్చుకోకుండా. నువ్వు చూడబోతే అద్భుతమైన తెలివితేటలు గలవాడివి. నీకు కార్డియాలజీలో సీటు రావడం అంత కష్టం కాదు. నా ప్రాక్టీస్ అంది పుచ్చుకోవచ్చు ఉత్తరోత్తరా, ఏమంటావ్?"

"లేదండి నేను పేడియాట్రిక్స్, గైనకాలజీలు రెండింటిలోనూ స్పెషలైజ్ చేద్దామనుకుంటున్నాను," చల్లగా చెప్పేడు కామేశం.

"ఏమిటీ? నువ్వు పురుళ్ళు పోస్తావా? గోకవరంలోనా? డబ్బులొస్తాయనే?" నమ్మలేనట్టు అన్నాడు ప్రొఫెసర్.

"ఏడో నెల వచ్చేదాకా మందులకీ దానికీ వస్తారు. పురిటిదాకా నా దగ్గిరకి రారండి అక్కడ జనం; మంత్రసాని దగ్గిరకో ఇంకోచోటో చూస్తారు. అదీకాక నేనో హాస్పిటల్ కట్టించి అందులో పురుళ్ళకి ఓ సెక్షన్ పెడదామని ఆలోచన. ఆ ఊర్లో మంత్రసానులకీ నర్సులకీ ఉద్యోగాలివ్వొచ్చు కూడా. బాబో పాపో పుట్టాక పిల్లల వైద్యానికొస్తారు కదా? అందుకే రెండూ కలిపి స్పెషలైజ్ చేద్దామనీ..."

ప్రొఫెసర్ నమ్మలేనట్టు చూసాడు, "ఎందుకిలా?"

"మా అక్క పోయినప్పటునుంచీ అనుకుంటున్నాను నేను దీని గురించి; అందుకే."

అలా రెండేళ్ళలో ఎం డి సంపాదించి గోకవరంలో బోర్డు పెట్టేడు కామేశ్వర్రావు, పిల్లల వైద్య నిపుణులు గా. కమల పెరుగుతూ స్కూల్లోకి వచ్చింది. ఇన్నేళ్ళూ కనిపించకపోయినా ఏదో రోజు వచ్చి పిల్లని చంపేస్తాడేమో అని కామేశం తల్లి మనవరాల్ని కంటికిరెప్పలా చూసుకుంటూనే ఉంది.

మొదట్లో చిన్న గదిలో ప్రాక్టీసు ప్రారంభించిన కామేశం కమల పదో తరగతిలోకొచ్చేసరికి మూడంతస్తుల మేడ కట్టించేడు. ఊళ్ళోనే కాక చుట్టుపక్కల మారేడుమిల్లి, ఏజెన్సీ ప్రాంతాలన్నింటికీ ఇప్పుడు కామేశమే దిక్కు. ఓ రోజు తన దగ్గిరకొచ్చిన పేషెంట్ మగపిల్లాడు పుట్టడానికి మందు ఇమ్మని అడుగుతూంటే చటుక్కున స్ఫురించింది ఆలోచన. వెంఠనే అమల్లో పెట్టేడు. దీనికంతటికీ ఒక్క చిన్న కరపత్రం సరిపోయింది. ఓ రిక్షాలో కంఠం బాగున్న కుర్రాణ్ణి కూచోపెట్టి ఓ వారం ఊళ్ళన్నీ తిప్పి పత్రాలు పంచిపెట్టాడంతే. ఇదే కామేశం చేసింది. "మీకు మగపిల్లాడు కావాలా? పాప వద్దా? అయితే వెంఠనే సంప్రదించండి."

★ ★ ★ ★ ★ ★ ★

వచ్చినవాళ్ళని క్యూలో నిలబెట్టడానికీ, వాళ్ళ పేర్లు రాసుకుని లోపలకి పిలవడానికీ వీటన్నింటికీ ముగ్గురు నర్సులని తీసుకున్నాడు. అందరికీ కామేశం చెప్పింది ఒకటే, "నేనిచ్చే మందులు క్రమం తప్పకుండా వాడాలి మూడో నెల దగ్గిర్నుంచీ. నెలకో సారి చూపించుకోవడానికి రావాలి. మందులు మానేసినా చూపించుకోవడానికి రాకపోయినా డబ్బులు వాపస్ ఇవ్వరు. మొత్తం ఖర్చు పదివేలు మాత్రమే. ఇవి మందులకి. డాక్టర్ గారి ఫీజు వేరే. మొగపిల్లాడు పుట్టే ఛాన్సు 60 శాతం. ఆడపిల్ల పుడితే మీరు ఉంచుకోవచ్చు లేకపోతే మేము తీసుకుంటాం. తర్వాత మీరు మనసు మార్చుకుంటే ఎప్పుడు కావలిస్తే అప్పుడు పిల్లని తీసుకెళ్ళిపోవచ్చు కానీ అప్పటివరకూ మేము పిల్లని చూసినందుకు అయిన ఖర్చు వెనక్కి ఇచ్చేయాలి. ఇష్టమైతే ఇదిగో ఇక్కడ సంతకం పెట్టండి."

బుద్ధిలేని మనుషులకి లోకంలో కొదువా? రోజూ బారులు తీరి నించున్నారు జనం క్యూలో కామేశం ఇంటిముందు. గోకవరం ఊర్లోంచే కాక మొత్తం తూర్పుగోదావరి అంతటినుండీ జనం రావడం మొదలైంది. మొదటి విడతలో ముప్ఫై, తర్వాత డబ్బై మందీ ఇలా వచ్చి సంతకాలు పెట్టుకుంటూ పోయేరు. అందరికీ మందులివ్వడానికో చిన్న డిస్పెన్సరీ అవీ ఏర్పాటు చేసేడు కామేశ్వర్రావు. తొమ్మిది నెలలు గడిచేసరికి మొదటి విడతలో ఇరవై ఆరుగురికి మొగపిల్లలూ నలుగురికి ఆడపిల్లలూ పుట్టేరు. దాదాపు తొంభై శాతం! అంతే, కామేశం పేరు ఆంధ్రా అంతా మార్మోగి పోయింది. ఇద్దరు ఆడపిల్లలు పుట్టినవాళ్ళు కాస్త గొణుక్కునో, దెబ్బలాడుకునో, మొగుడిచేత దెబ్బలుతినో పసికందుల్ని కామేశానికిచ్చేసి వెళ్ళిపోయేరు. మిగతా ఇద్దరూ మమకారం చంపుకోలేక ఆడపిల్లైతేనేం అనుకుని కూడా తీసుకెళ్ళేరు.

ఈ వదిలేసిన పసికందుల్ని చూడ్డానికి కామేశం నర్సుల్ని ఏర్పాటు చేసి జాగ్రత్తగా చూడ్డం మొదలుపెట్టేడు. రెండో విడతలో డబ్భైశాతం మొగపిల్లలు. కామేశం అనాధాశ్రమానికో నలుగురు ఆడపిల్లలు వచ్చేరు. ఇది చూసి కామేశ్వర్రావు గురించి ఊర్లో జనం చెవులు కొరుక్కోవడం మొదలైంది. ఎలా వస్తున్నాయి ఈ మందులు డాక్టర్ గారికి? అందులో ఏవిటి ఉన్నది? పోనీ ఎక్కడో సంపాదించాడనుకో మందులు, మగపిల్లలు నిజంగా ఎలా పుడుతున్నారు?

గుసగుసలు మొదలైన నాలుగు నెలలకి ఈ విషయం ఎమ్మెల్యే దగ్గిరకీ, అక్కడ్నుంచీ ఇంకా పై మంత్రిగారికీ జేరింది. మరి ఇన్ని డబ్బులు తేరగా పోతూంటే ఈ రాజకీయనాయకులందరూ కాళ్ళు ముడుచుకుని కూర్చోలేరు కదా? ఎమ్మెల్యే, మంత్రిగారూ కామేశం దగ్గిరకొచ్చి దగ్గిర బంధువుల్లా పళ్ళికిలించి పలకిరించేరు, "ఇదిగో ఇలా జనం అనుకుంటున్నారు నీ గురించి. మరి వాళ్లకేం చెప్తావ్?" అంటూ.

"చెప్పడానికేవుంది? నేను డాక్టర్ని. మందులు పనిచేస్తున్నాయి. పిల్లలు బాగున్నారు. కానుపులలో ఎక్కడా తేడా రావట్లేదు. ఎక్కడో ఒకావిడ కాలుజారి కింద పడడమో మరోటో అయి ఒకటీ, అరా తప్పితే ఎక్కడా గర్భం పోయిన దాఖలాల్లేవు. ఏమిటి నేను చెప్పాలి ఇంకా?"

"అదే మీ మందుల్లో ఏవుంది? మంత్రాలకి చింతకాయలు రాలవు కదా?"

“నా మందుల్లో ఎక్కడా తేడా లేదే? మంత్రాలున్నాయని ఎవరు చెప్పారు? నేనిచ్చేవి మంచి మందులు. పేర్లతో పనిలేదు. ఎవరూ ఎక్కడా కంప్లైంట్ చేయలేదు. పిల్లలు పుట్టడానికి అవి బాగానే పనిచేస్తున్నాయి. మందులవల్ల ఏదో నేరం జరిగినట్టు ఎవరూ అనలేదు. ఇంతకీ ఏమిటండీ గొడవంతా?"

"గొడవేం లేదు, మీరు కోట్లకి పడగలెత్తారనీ, టేక్స్ లు కట్టకుండా డబ్బులన్నీఇలా ఓ అనాధాశ్రమంలో పెడుతున్నారనీ తెలిసింది. ఈ అనాధల్ని మీరు కావాలని బలవంతంగా చేర్చుకుంటున్నారనీ అంటున్నారు. ఈ విషయాలు మరీ పైకి వెళ్తే మీకే ప్రమాదం. అంతవరకూ రాకుండా ఉండాలంటే మనలో మనకి కొంత సర్దుబాటు బావుంటుంది." పక్కనున్న ఎమ్మెల్యే చెప్పేడు తామొచ్చిన అసలు విషయం.

"ఏమి సర్దుబాటు?"

"అదేం పెద్ద పనికాదు, పార్టీ ఫండుకో డొనేషన్ ఇస్తే చాలు" మంత్రి నవ్వుతూ చెప్పేడు.

కామేశ్వర్రావ్ మొహం ఎర్రబడింది, కానీ తమాయించుకుని చెప్పేడు, " ఇప్పుడు కాస్త బిజీగా ఉన్నాను. వచ్చే వారంలో వీలు చూసుకుని కబురు చేస్తాను."

మంత్రీ, ఎమ్మెల్యే బయటకొచ్చేరు. వెళ్లబోతూ చెప్పేడు ఎమ్మెల్యే, "మనలో మన మాట, పార్టీలో చేరితే ఫండ్ మూలంగా మీకో చిన్న పదవి వచ్చేలా చూస్తాం." కామేశ్వర్రావ్ తల అవునూ కాదూ అన్నట్టు ఆడించేడు.

★ ★ ★ ★ ★ ★ ★

ఆ రోజు రాత్రి చాలాసేపు ఆలోచించేడు కామేశ్వర్రావు. చివర్లో ఏదో నిర్ణయానికొచ్చినట్టూ ముసుగు తన్ని నిద్రపోయేడు. నాలుగు నెలలు గడిచేక ఓ రోజు మంత్రి గారు ఎమ్మెల్యే ని పిల్చి అడిగేడు, "డాక్టర్ ఏవేనా ఇచ్చేడా డబ్బులు?"

"పైసా విదల్చలేదు."

"ఏం? మంత్రి అంటే అంత చులకనా? ఓ టేక్స్ రైడ్ జరిగితే గానీ బుద్ధి రాదా ఆయనకి?"

"టేక్స్ రైడ్ కి ఎవర్ని పంపిస్తారు?"

"ఏం? అలా కొత్తగా అడుగుతున్నావ్?"

"ఇక్కడున్న టేక్స్ జనంలో ఉన్నవాళ్ల హితుడో, స్నేహితుడో, ఫేమిలీయో ఎవరో ఒకరు ఆ డాక్టర్ వల్ల పిల్లలు పుట్టినవాళ్ళే. వాళ్ళేం చేయరు."

"పోలీసుల్ని పంపించి అరెస్ట్ చేయిస్తే?"

"చెప్పాను కదండీ, ఐ. జి దగ్గిర్నుంచి అట్టడుగున కానిస్టేబుల్ దకా అందరూ ఏదో విధంగా డాక్టర్ వల్ల లబ్ది పొందినవారే. ఎవరూ ఏం చేయరు. డాక్టర్ మీద చెవులు కొరుక్కునే జనం మన పార్టీలో పనికిరాని వాళ్ళే. జనాల్ని పురికొల్పుతున్నారు తప్ప నిజంగా జనం డాక్టర్ మీద ఈగ వాలనివ్వరు. టేక్స్ రికార్డులన్నీ లక్షణంగా ఉన్నాయి. నేను రంగరాయా మెడికల్ కాలేజీలో కూడా కనుక్కున్నాను. అక్కడ ప్రొఫేసర్లు చెప్పడం ప్రకారం ఈ డాక్టర్ చేసేదాంట్లో తప్పేమీ లేదు. మీరే చెప్పండి ఏం చేద్దాం?"

"అనాథాశ్రమంలో ఉన్న పిల్లల సంగతో?"

"ఓ అందులో ఉన్నవాళ్ళంతా అమ్మాయిలే. పదేళ్ళలోపు. వాళ్ళని డాక్టర్ గారు అద్భుతంగా పెంచుతున్నాడు. వాళ్ళ మేనకోడలు కూడా ఉండేది ఆ ఆశ్రమంలోనే. చిన్నప్పుడు తల్లిపోయిందిట ఆవిడకి. అలాగ మిగతా ఆడపిల్లలకి అవకూడదని ఈయనే ఉంచుకుంటున్నాడు వదిలేసిన ఆడపిల్లల్ని. నేను విన్నదాని ప్రకారం పిల్లని వదిలేసిన తల్లీ తండ్రీ ఎప్పుడు కావలిస్తే అప్పుడు వెనక్కి తీసుకెళ్ళవచ్చు."

"మరి మందుల్లో ఏముంది?"

"అదో చిదంబర రహస్యం. ఎవరికీ చెప్పడు. ఆఖరికి ఇచ్చే నర్సులకి కూడా ఆ గొట్టాల్లో ఏవుందో తెలియదంటున్నారు."

"అదేనోయ్ నే చెప్పేది. అరెస్ట్ చేయలేం. కానీకేసు పెట్టి కోర్టులోకి ఈడవ్వొచ్చు."

ఎమ్మెల్యే మొహం వెలిగిందో సారి, "మరో సారి పార్టీ కి డబ్బులు గురించి అడుగుతాను. ఇవ్వకపోతే కేసు వేద్దాం. ఎల్లెల్బి చదివిన చెట్టు కింద ప్లీడర్ ఎవడో దొరక్కపోడు."

"అదీ వృద్ధిలోకి వచ్చేవాడి పద్ధతి," మంత్రి మెచ్చుకున్నాడు ఎమ్మెల్యేని.

★ ★ ★ ★ ★ ★ ★

ఇది జరిగిన మూణ్ణెల్లకి కామేశాన్ని కాకినాడ కోర్టులో బోనులో నించోబెట్టేదు మంత్రి, తాను పక్కనుంచి ఆటలు ఆడిస్తూ. కేసు విచారణకొచ్చినప్పుడు మొదటగా కాలేజీ ప్రొఫెసర్లని పిల్చి విచారణ మొదలెట్టారు. ఎంతమందినడిగినా ఒకటే టైప్ సమాధానాలొచ్చాయి.

"మీకు కామేశ్వర్రావు ఎంతకాలం నుంచి తెలుసు?"

"అయిదేళ్ళు"

"అసలు ఎవరైనా ఇలా మొగపిల్లలు పుట్టడానికి ఏ మందులతోనైనా 60 శాతం గేరంటీ ఇవ్వగలరా?"

"ఇవ్వలేరు"

"ఆయనిచ్చే మందుల్లో ఏముందో మీకు తెలుసా?"

"తెలియదు"

ఆఖరి రోజు కామేశ్వర్రావు బోనులోకొచ్చేడు. మొహంలో ఏమీ భయం ఉన్నట్టు లేదు. లాయర్ కసిగా ప్రశ్నలడగడం మొదలైంది.

"మీ పేరు?"

"కామేశ్వర రావు"

"ఎక్కడ, ఏం చదువుకున్నారు?"

"రంగరాయా మెడికల్ కాలేజీలో ఎం. బి. బి. ఎస్, తర్వాత అక్కడే ఎం. డి"

"స్పెషాలిటీ?"

"పేడియాట్రిక్స్, ఆబ్జిన్"

"అంటే?"

"పీడియాట్రిక్స్ అంటే పిల్ల వైద్యం, అబ్జిన్ అంటే, ఆబ్స్టెట్రిక్స్, గైనకాలజీ, స్త్రీలకి సంబంధించిన పురుళ్ళు అవీ చూసేది."

"మీరు మొగాడై ఉండీ స్త్రీల మీద ఇలా స్పెష లైజ్ చేయడానికేమేనా కారణం ఉందా?"

"మీ ప్రశ్న అసందర్భం. నా ఇష్టం వచ్చిన ఫీల్డ్ లో స్పెషలైజ్ చేయడానికి నాకు అధికారం ఉంది. అయినా మీకు సమాధానం కావాలంటే వినండి. మా అక్కకి ఆడపిల్ల పుడితే మాబావ చంపేస్తానని అనడం వల్ల ఆవిడ పుట్టిన ఆడపిల్లని చూసి ఆత్మహత్య చేసుకుంది. మా అక్కని సరిగ్గా తిండి కూడా తిననివ్వకుండా ఏడిపించాడు మా బావ. ఆ పిల్ల అనాథగా ఉండిపోకుండా మా అమ్మ పెంచింది. కానీ తల్లిలేని పిల్లలాగే బతుకుతోంది. అలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని నేను ఈ ఫీల్డ్ లోకి వచ్చాను."

"మీరు మొగపిల్లలు మాత్రమే పుట్టడానికి అరవై శాతం ఛాన్సు ఉంటుందని ఏవో మందులు ఇస్తున్నారనీ తెల్సింది. వీటికెంత పుచ్చుకుంటారు?"

"మొత్తం ట్రీట్మెంట్ కి పదివేలనుంచి ఇరవైవేలు. మందులు మేమే ఇస్తాం."

"ఏం మందులు?"

"మూడు రకాల గొట్టాలు, ఒక మామూలు మాత్ర"

"మీకు మెడికల్ కాలేజీలో పాఠాలు చెప్పిన ప్రొఫెసర్లు చెప్పడం ప్రకారం అరవై శాతం మొగపిల్లాడు పుట్టడానికి ఛాన్సుకి మందులు లేవు. మీరు ఎలా ఇస్తున్నారివి?"

"నేనవరికీ గేరంటీ ఇవ్వలేదు. ఆడపిల్ల పుడితే వాళ్ళు తీసుకెళ్ళినా ఆనందమే. అక్కర్లేకపోతే నేనే పెంచుతున్నాను. వాళ్ళిష్టం వచ్చినప్పుడు తీసుకెళ్లవచ్చు వెనక్కి, అప్పటిదాకా పోషించిన డబ్బులు వెనక్కి ఇచ్చేస్తే."

"ఇవ్వకపోతే?"

"వాళ్ళ పిల్లని ఎప్పుడు కావలిస్తే అప్పుడు తీసుకోవచ్చు. డబ్బులదేముంది. అవి వస్తాయ్, పోతాయ్. అవి మనిషి ప్రాణం కంటే ఎక్కువ కాదు కదా?"

"మీరిచ్చే మందుల్లో ఏముందో కోర్టుకీ, ప్రజలకీ చెప్పాల్సిన అవసరం లేదా?"

"వాటివల్ల ఏమీ ఇబ్బంది రాలేదే?"

"అంటే ఎవరో ఒకరు చచ్చేదాకా ఇలా కొనసాగించొచ్చా?" లాయర్ కంఠంలో కోపం.

కాదన్నట్టూ బుర్ర అడ్డంగా ఊపి డాక్టర్ కంఠం సవరించుకుని చెప్పడం మొదలుపెట్టేడు, "నీకు ఆడపిల్ల పుడితే చంపుతా అనే పురుషాహంకార వ్యవస్థ లో మనం ఉన్నాం కానీ అసలు పుట్టేది ఆడపిల్లో మగపిల్లవాడో చెప్పడం పరీక్షలు చేయకుండా కష్టం. ఈ బెదిరింపులవల్ల మా అక్కలాంటి వాళ్ళు చావడం రోజూ జరుగుతోంది. పోనీ ఏదో ఒకలాగ ఆవిడ ఈ బెదిరింపులు ఓర్చుకున్నా జీవితాంతం మొగుడు ఆవిడ్ని తిట్టడమో కొట్టడమో చేస్తూనే ఉంటాడు, అక్కడకి ఆడపిల్ల పుట్టడం తల్లి నేరం అయినట్టూ. ఈ గ్రామీణ జనాలకి ఎంత చెప్పినా ఇలాంటివి అర్థం కావు. ఫలానో రోజుల్లో కలిస్తే మీకు మొగపిల్లాడు పుడతాడోహో అని వీళ్ళకి పెద్దల్నుంచో ఎక్కడ్నుంచో అంటుకున్న జబ్బు అది. ఆ కలవడం అయిపోయాక మా పని అయిపోయింది, ఇంక

ఆడపిల్ల పుట్టిందా చూస్కో అని రకరకాలుగా పేల్తూ ఉంటారు. కడుపు పండిన దగ్గిర్నుంచి పిల్లాడు బయటకొచ్చేదాకా స్త్రీకి దినదినగండమే. అసలే కడుపుతో ఉన్న మనిషికి మొగుడు సాయం చేయాల్సింది పోయి బెదిరించడం కనబడుతోంది. ఆడపిల్ల పుడుతుందా, మొగాడు పుడాతాడా అనేది నాణెం పైకెగరేసి బొమ్మా బొరుసో చెప్పడం లాంటిది. మా ఊర్లోనూ, చుట్టుపక్కల ఉన్న ఏజెన్సీలలోనూ కావాల్సింది గర్భిణి స్త్రీకి మంచి మందులూ, ఆహారమూను, బెదిరింపులు కాదు. మామూలు గా చెప్తే ఎవరూ వినరు కనన నేను మందులిస్తాననీ మొగపిల్లాడు పుట్టడానికి అరవై శాతం అనీ కరపత్రాలు పంచిపెట్టేను."

"బొమ్మా బొరుసూ అరవై శాతం ఎలా కుదురుతాయి?"

"నిజమే కుదరవ్. కానీ బొమ్మా బొరుసూ ఆడుతుంటే యాభై శాతానికీ అరవై శాతానికీ పెద్ద తేడా ఉండదు కనక నేను అరవై అని చెప్పి వాళ్లని నా దగ్గిరకి రప్పించానంతే. కానీ పుట్టినది ఆడపిల్లైతే ఆ పాపకి ఏమీ తేడా లేకుండా పెంచాలనీ, అలా కుదరకపోతే నా దగ్గిర ఆశ్రమంలో ఉంచుతాననీ కూడా చెప్పేను కదా? ఈ పిల్లల్ని చూడడానికీ వాళ్ళకి వైద్యం కోసం నేను పీడిట్రిక్స్ లో స్పెషలైజ్ చేసాను కూడా. ఇప్పటికి మీకు అర్థం అయిందనుకుంటా నేను ఎందుకు డబల్ స్పెషలైజేషన్ చేసానో."

"మరి మీరిచ్చే మందుల్లో ఉండేది ఏమిటి?"

కామేశ్వర్రావు చిరునవ్వు నవ్వేడు, "అవి గర్భిణీ స్త్రీకి కావాల్సిన అతి ముఖ్యమైన ఐరన్, ఫోలేట్, విటమిన్ డి గొట్టాలు, రోజూ బలంగా ఉండడానికో టానిక్ లా పనిచేసే మాత్రలూను."

"దానికేమైనా ఆధారం ఉందా లేకపోతే అబద్ధాలు ఆడుతున్నారా?"

"ఎందుకు అబద్ధం? ఇక్కడ కోర్టులో కూర్చున్న మెడికల్ కంపెనీ రిప్రెసెంటేటివ్ నే అడగండి. ఆయనా నేనూ కల్సి ఈ మందులు కంపెనీల దగ్గిర్నుంచి చవకగా కొనడానికి ఏర్పాట్లు చేశాం. మీకు ఇంకా కావలిస్తే ఆ మందులు మా మెడికల్ కాలేజ్ ఫార్మకాలజీ ప్రొఫెసర్లు చూసి చెప్తారు."

విరామం కోసం కాసేపు ఆగి కామేశ్వర్రావు చెప్పడం సాగించేడు, "ప్రపంచంలో పుట్టే ప్రతీ జీవికి పూర్తిగా మామూలుగా పెరగడానికి హక్కుంది. ఆడపిల్ల పుడితే చంపేయడానికీ, పెంటమీద పారేయడానికీ మనమెవరం? అమ్మాయిలు వద్దనుకుంటే రేప్పొద్దున్న మీకు పుట్టే మొగపిల్లాడికి ఎవర్నిచ్చి పెళ్ళిచేస్తారు? మా బావలాంటి నరరూప రాక్షసులు మనమధ్య ఎంతమందున్నారు? వీళ్లని ఎప్పటికి బాగుచేయగలం? ఓ సారి ఆలోచించండి. ఇదంతా చేస్తే నా కేసుల్లో ఎంతమంది మీకు కంప్లైంట్ చేసారు? నా హాస్పిటల్లో పుట్టిన పిల్లలు ఎంతమంది చనిపోయినట్టు గానీ, పెంటమీద విసిరివేయబడినట్టుగానీ మీకు వార్తలందేయి? నామీద కేసు ఎందుకు వేశారు? మీకు తెలియకపోతే నేను చెప్తాను వినండి. నాకొచ్చే పేషంట్ల దగ్గిర్నుంచి డబ్బులు తీసుకుని నేను కుబేరుణ్ణైపోయాననుకుని పార్టీ ఫండ్ కోసం నన్ను అడిగిన ఎమ్మెల్యేగారికి నేను డబ్బులివ్వనని చెప్తే ఇలా లాక్కొచ్చారు తప్పితే నేను చేసేదేమిటో తెల్సుకోడానికి ప్రయత్నం చేసారా? నేను మంత్రాలో మందులో మాకులో వాడుతున్నానని అనుకున్నారు తప్ప, చేసే పనిలో మంచితనం ఎందుకు చూళ్ళేకపోయేరు? ఏ స్కేనింగూ చేయకుండా, పుట్టేది ఆడో మగో చెప్పడం అసాధ్యం. ఆడపిల్లపుడితే చంపుతా అనే బెదిరింపులని తప్పించడానికే నేను ఇలా 50 శాతాన్ని 60 శాతంగా మార్చాను తప్పితే సరిగ్గా పదిసార్లు నాణెం పైకెగరేస్తే ఐదు సార్లు బొమ్మ పడుతుందా? రెండుసార్లు పడొచ్చు, ఎనిమిదిసార్లు పడొచ్చు లేకపోతే పది సార్లూ పడొచ్చు. ఒక్కొక్కప్పుడు పదిసార్లూ పడకపోవచ్చు. అందుకే మందులు జాగ్రత్తగా వాడాలనీ పుట్టినది ఆడపిల్లైతే తీసుకోవచ్చూ లేకపోతే నా దగ్గిర వదిలి ఇష్టం వచ్చినప్పుడు తీసుకెళ్లనూ వచ్చని చెప్పేను. నేను చేసినదాంట్లో మోసం ఎక్కడుంది? నా దగ్గిర పుట్టిన పిల్లల్లో ఎక్కువమంది మొగపిల్లలు పుట్టడం యాధృచ్చికం. నేను జనాల అమాయకత్వాన్ని వాడుకుని ఆరోగ్యమైన పిల్లలు – ఆడ అవనీయండి, మొగ అవనీయండి – పుట్టడానికి మందులిచ్చానంతే."

ఎలాగోలా కామేశ్వర్రావుని జైల్లో పెట్టించాలనే ప్రశ్నలడిగే లాయర్ మొహం పాలిపోయింది. జడ్జ్ నవ్వుతున్నాడు. ఒక్కసారిగా కోర్టులో చప్పట్లు ధ్వనించేయి. తర్వాత గంటకి విజయగర్వంతో కోర్టులోంచి బయటకొచ్చేడు డాక్టర్ కామేశ్వర్రావు ఎం డి.

★ ★ ★ ★ ★ ★ ★

ఆ రోజు రాత్రి ఎమ్మెల్యే మంత్రిగారితో మాట్లాడుతూంటే డాక్టర్ విషయం వచ్చింది. "నేను చెప్పాను కదండీ, ఆయన చాలా మంచివాడూ, తెలివైనవాడూను. అలాంటిచోట మనకి డబ్బులు రావు. చేతనైనంతలో చూసీ చూడనట్టు పోవడమే మంచిది." ఎమ్మెల్యే అన్నాడు మందు కొట్టిన నోట్లో మాట తడబడుతూంటే.

"అలా అయితే మనకెలా కుదురుతుంది? ఆయనమీద ఓ కన్నేసి ఉంచు. ఎప్పుడో ఓ సారి పప్పులో కాలేస్తాడు. అప్పుడు కటకటాల్లోకి తోసేసి పాత ఫైళ్ళు అన్నీ తీసి ఆయన ఆస్తి జప్తు చేసుకోవచ్చు."

ఎమ్మెల్యే విస్తుబోయి చూస్తూంటే మంత్రే మళ్ళీ అన్నాడు, "ఇలాంటి కేసులు సవాలక్ష చూసేన్నేను. లేకపోతే నాలుగో సారి కేబినెట్లో మంత్రి అవగల్నా?"

ఎమ్మెల్యే వినయంగా తల వంచి నమస్కారం పెట్టేడు మంత్రిగారికి.




# అమ్మ కావాలి

శారద కాశీవఝ్ఝుల

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో విశిష్ట బహుమతి పొందిన కథ

**"అమ్మా! చూడు నాకు సింగింగ్ కాంపిటీషన్‌లో** ఫస్ట్ ప్రైజ్ వచ్చింది" స్కూలు బ్యాగ్ సోఫాలో పడేసి పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పింది మా అమ్మాయి వైష్ణవి.

మాతృగర్వంతో నా ఎద పొంగింది. ట్రోఫీకేసి మురిపెంగా చూస్తూ పాప బుగ్గమీద గట్టిగా ముద్దుపెట్టుకున్నాను. పిల్లల చిన్నగెలుపులు కూడా తల్లికి కొండంతలుగా కనపడటం సహజమేలే అని సర్ది చెప్పుకున్నాను. నేను పోటీల్లో గెలిచినప్పుడు మా అమ్మ నలుగురికీ చెప్పుకోలేదూ!? తల్లిదనం వంశపారంపర్యం. అంతే! అంతే!

అంతలోనే కర్తవ్యం గుర్తొచ్చిన దానిలా "ప్రైజ్ వచ్చినందుకు సంతోషమే. కానీ రాకపోయినా నిరుత్సాహపడకూడదు. పాల్గొనే అవకాశం వచ్చినందుకు కూడా తృప్తిపడాలి ఎప్పుడైనా, సరేనా?" అన్నాను అనునయంగా.

"అమ్మా! నాకు ప్రైజు రాలేదు, కానీ పాల్గొని ఎంజాయ్ చేశా" ప్రకటించాడు నా ఆరేళ్ళకొడుకు ప్రబంధ్.

"వెరీగుడ్" వాడికి కూడా ఒక ముద్దు బహుకరించాను.

"నువ్వెప్పుడూ ఇంతే అమ్మా! తమ్ముడంటేనే నీకు ఎక్కువ ఇష్టం" అలుగుతూ పెరట్లోకి వెళ్ళబోయింది వైష్ణవి. విజయగర్వంతో చిలిపిగా నవ్వాడు ప్రబంధ్.

"అదికాదమ్మా, వాడు చిన్నవాడు కదా!?" ఎప్పటిలా బతిమాలుతూ వెంటపడ్డాను నేను, ఎన్నో ఏళ్ళుగా ఇదే ఆరోపణని మా అమ్మమీద ప్రయోగించిన తీరు మననం చేసుకుంటూ.

"వావ్! నాకు తెలుసోయ్, మన చిట్టితల్లి బ్రహ్మాండంగా పాడుతుంది అనీ! ఏమాటకామాట, దానికి మా వేలువిడిచిన రెండో అత్తయ్య పోలికలొచ్చాయి లలితకళల విషయంలో. ఉండు.. వాళ్ళ పిల్లల విజయాల గురించి మనకి చెప్పిన వాళ్ళందరికీ ఫోన్ చేసి ఈ విషయం చెప్పొస్తా" డిన్నర్ టేబుల్ దగ్గర్నుంచి లేచారు మావారు.

నా మొహం నల్లబడింది. సంగీతంలో నాకూ, ఆయనకీ 'ఓ' అంటే 'ఢం' రాదు. పిల్లలకి అన్నీ నేర్పేయాలనే దుగ్ధ ఉన్న తల్లిదండ్రుల్లాగే మేము కూడా వైష్ణవిని సంగీతం, నాట్యం నేర్పే శిక్షణా తరగతులకి పంపుతున్నాం. ప్రబంధ్ గాత్రమహిమ తెలుసుకాబట్టి,

ప్రజా శ్రేయస్సు కోరి సంగీతం వద్దనుకుని గుండ్రంగా ఉండే అన్ని రకాల బంతులాటల్లోనూ ప్రవేశపెట్టాం. మరి సంగీతం, వీణలో ప్రవేశం ఉన్న మా అమ్మదే వైష్ణవికి పోలిక అని ఒక్కమాట అనొచ్చుగా మావారు!? ఎవరో బీరకాయపీచు అత్తయ్యది ఎలా వస్తుంది?

ఏళ్ళతరబడి అత్తమామలకీ, ఆడబడుచు మరుదులకో, మొగుడికో, ముగ్గురు పిల్లలకీ కిమ్మనకుండా సేవచేసి, తన ఇష్టాలేమిటో ఏనాడూ మాట్లాడని అమ్మ గుర్తొచ్చింది. విచిత్రంగా ఆవిడ చనిపోయిన అయిదేళ్ళ తరువాత ఈ మధ్య ఎక్కువగా గుర్తొస్తోంది. నేను ఎక్కువగా ఖాళీగా ఉండడం వల్లో, లేక అమ్మతనంలో ఆవిడ వయసుకి చేరువౌతుండడం వల్లో తెలియదు. ఎదురయ్యే ప్రతిమనిషి మాటల్లోనూ, సంఘటనల్లోనూ ఆవిడ తాలూకు జ్ఞాపకం ఏదో ఒకటి మెదులుతూనే ఉంది. ఎప్పటిలాగే చిన్న చిరునవ్వునీ, బోలెడంత విషాదాన్నీ తెస్తోంది. 'అమ్మ బతికుంటే బావుణ్ణు' యాభైయ్యోసారి అనిపించింది.

"వావ్! వాట్ ఈజ్ దిస్ అమ్మా?" నా కూతురు తోటకూర పులుసుని వికారంగా చూస్తూ అడిగింది. అరుదుగా దొరికే తెల్లతోటకూర దొరికింది అని పులుసు వండాను.

"అది తోటకూర, తినాలి, బోలెడు బలం" అన్నాను నెయ్యివేసి కలిపి ఇస్తూ.

"యక్కీ. ఇదేం బాలేదు అమ్మా. నువ్వు స్కూలు కుక్‌లాగా వండట్లేదు" తీర్పు ఇచ్చేసింది వైష్ణవి.

నా మనసు చివుక్కుమంది. మళ్ళీ మనసు గతంలోకి పరుగుతీసింది. ప్రతిఫలాపేక్ష లేకుండా ఇరవై ఏళ్ళపాటు రకరకాలు వండిపెట్టిన మా అమ్మ గుర్తొచ్చింది. 'ఇదేంటి అమ్మా, కూర సరిగ్గాలేదు' అని వంకలు పెడుతూనే గిన్నెలన్నీ ఖాళీ చెయ్యడం మా హక్కులాగా ఎన్నిసార్లు ప్రవర్తించాం!? వేలిచుట్టుకు తడిబట్ట చుట్టుకుని మూడుపూటలా మా కోసం రోళ్ళూ, రోకళ్ళూ వాడి వంట చేసిపెడితే, ఎన్నిసార్లు మేము ఆవిడకి పస్తులూ, విమర్శలూ మిగిల్చాం!?

మరి ఇన్ని సౌకర్యాలూ, పరికరాలూ ఉండి కూడా పిల్లలకి నచ్చేలా వంట చెయ్యలేదని విమర్శ వస్తే నేను ఎందుకు గింజుకోవడం? క్షమించేసి, 'నా పిల్లలేగా' అనుకోవడమే సమంజసం. నా తర్కం నాకే నచ్చింది.

మాటకు ముందు సామెతలు చెప్పే మా అమ్మని అనుకరిస్తూ "తినగా తినగా గారెలు చేదవుతాయిలే" అన్నాను. అర్థంకాక పిల్లలిద్దరూ అయోమయంగా చూశారు. 'ఇంతమంది బతికుండగా, అమ్మొక్కతే ఎందుకుపోవాలి' అనిపించి, నా ఊహలోని తప్పుకి ఉలిక్కిపడి అమ్మ ఫోటో వైపు చూశాను. చెడు ఆలోచిస్తే కోపంతో ఎర్రగా మెరిసే ఆవిడ ముక్కుపుడక మరోసారి తళుక్కుమంది. "ఇంతమందితో పాటూ మా అమ్మకూడా ఉంటే బావుణ్ణు" సరిదిద్దుకున్నాను.

'మిడ్‌లైఫ్‌క్రైసిస్' గురించి కొద్దిగా చదివాను. ఈ మిడిమిడి జ్ఞానంతో చచ్చే గోలగా ఉంది.

ప్రబంధ్ కుర్చీ దిగి టేబుల్ చుట్టూ నడిచి వచ్చి, తన చిట్టిచేతులతో నా భుజం మీద నొక్కాడు –

"అమ్మమ్మ గుర్తొచ్చిందా, అమ్మా?" అన్నాడు వాడికి చేతనయిన ఆర్ద్రతతో. నాకు మళ్ళీ దుఃఖం వచ్చింది. ఎప్పుడూ డల్‌గా ఉన్నా అదే కారణం అయ్యుంటుందనే ఊహ ఆ చిన్ని మనసుకి తెలిసిపోయింది. 'లేదు' అన్నట్టు తల ఊపి వాడికో ముద్దుపెట్టాను.

"ఈ కొత్త స్పినాచ్ పులుసు చాలా బావుందమ్మా, ప్రామిస్" అన్నాడు నా చెయ్యి పట్టుకుని భరోసాగా.

నేను నవ్వేసి "థాంక్యూ నాన్నా" అన్నాను సంతోషంతో.

మరునాడు పొద్దున్న హడావిడిగా స్కూలుకి బయలుదేరుతున్న పిల్లలకి లంచ్ బ్యాగులు అందిస్తూ ప్రబంధ్‌ని దెప్పడానికి ప్రయత్నించాను – "మళ్ళీ లంచ్ తీసుకుని వెళ్ళడం మర్చిపోతున్నారు ప్రభూ! నేను క్లాసుకి తెచ్చిస్తే మళ్ళీ 'గో అవే మమ్మీ, ఎంబరాసింగ్ బిఫోర్ మై ఫ్రెండ్స్' అంటావు"

"అమ్మమ్మ టూ మైల్స్ నడిచొచ్చి నీ క్లాసుకి లంచ్ తెచ్చిస్తే, నువ్వు కూడా అదే చేశానని చెప్పావుగా?" నా జ్ఞాపకాలు చెప్పుకుని ముందర కాళ్ళకు నేనే బంధం చేసుకున్నట్టున్నాను. పిల్లల్ని స్కూల్లో దింపేసి ఆఫీసుకి బయలుదేరాను. ఒంటరిగా డ్రైవ్ చెయ్యడం అనేది ఈ మధ్యలో ఎక్కువ ఇష్టమౌతోంది. అంతరాయం లేని ఆలోచనలకి కావాల్సిన ఏకాంతం కారులోనే దొరుకుతోంది.

నా తొలికానుపు సహాయానికి వచ్చిన అమ్మా, నాన్నా ఈ కారులో ఇప్పటికీ నాతో కూర్చుని ఉన్నట్లే నా కళ్ళు మధ్య మధ్య కారు మిర్రర్‌లోంచి వెనక్కి చూస్తుంటాయి.

రోడ్డు మీద ఎవరన్నా విదేశీయుడు అలవాటుగా 'హాయ్ మేడమ్, హౌ ఆర్ యూ' అని పలకరిస్తే అమ్మ కంగారు పడిపోయేది. తన వివరాలు చెప్పి, ఆయన కుశలాలు అడిగి, పండో ఫలమో చేతిలో పెట్టి ఆయన మర్యాదకి తను ఎంత సంతోషిస్తోందో చెప్పాలనుకునేది. ఈలోగా పలకరించినవాడు తుర్రుమనేవాడు. 'పాపం మంచివాడు' అని కితాబు ఇచ్చేది. 'ఆయన కళ్ళు చిక్కుడు గింజల్లా మెరుస్తున్నాయి' అనేది.

వర్జీనియా నుంచి న్యూజెర్సీకి అధమం నాలుగు గంటలు డ్రైవ్ పడుతుందమ్మా అని చెప్పినా, దారిలో 'టూ న్యూజెర్సీ' అన్న తొలి పచ్చబోర్డు కనపడినప్పుడల్లా 'వచ్చేశాం' అనేది. వయసు పెరిగిన తల్లిదండ్రుల అమాయకత్వంలోనూ, చాదస్తాల్లోనూ అదోలాంటి పసితనపు అందం ఉంది. 'నా కొడుకు కారు ఎక్కాను, నా కూతురు ఇంటికొచ్చాను' అని చిన్నచిన్న వాటికి సంతృప్తి పడిపోయే వాళ్ళ కబుర్లూ, పాతతరం అనుభవాలూ వినడంలో అదోలాంటి ఆనందం ఉంది.

రోడ్డు మధ్యలో మరోసారి నా కారుకీ, ఆలోచనలకీ బ్రేకు పడింది. ఎవరో స్త్రీ సైడ్ వాక్ మీద నుంచి రోడ్డు మీదకొచ్చేసి గిటార్ వాయిస్తోంది. వాళ్ళ కొడుకనుకుంటా, ఫుట్‌పాత్ మీద కార్డ్‌బోర్డ్ పట్టుకుని నిల్చున్నాడు -" ప్లీజ్ హెల్ప్ ఫర్ మై సన్స్ ఫుడ్," అని.

నా మనసు ద్రవించింది. దేశం ఏదైనా తల్లిప్రేమ ఒకటేగా. ఐదుడాలర్లు తీసిచ్చాను. వైష్ణవి ఉంటే వారించేది, 'డ్రగ్స్ కొనుక్కుంటారమ్మా, ఫుడ్ కొనిద్దాం' అనేది. ఒకవేళ వాళ్ళకి నిజంగా అవసరమేమో అనే చిన్న బెనిఫిట్ ఆఫ్ డౌట్ వల్ల నేను ధైర్యం చేస్తుంటాను. "ట్రూమాన్ షో" అనే ఇంగ్లీష్ సినిమాలోలాగా - ఈ ప్రపంచం, నాకెదురయ్యే పాత్రలూ నా కోసమే చుట్టూ ఉంచబడ్డాయా అనే అనుమానం వస్తుంటుంది నాకు. లేకపోతే 'అమ్మతో ఉండాలి' అనే నా ప్రస్తుత మానసిక పరిస్థితిని బట్టి అన్నీ అమ్మతనం అనే కోణం నుంచే చూస్తున్నానేమో అనే సంశయం మరోవైపు.

ఆఫీసులోకి అడుగుపెటగానే ఐహిక నిబంధనలు గుర్తొచ్చాయి. ఇక్కడ ఒక్కచోట మాత్రం అమ్మ ఉన్నట్టు అనిపించదు. ఈ యాంత్రికత నుంచి ఎప్పుడో పారిపోయి ఉండేది ఆవిడ. అత్తెసరు చదువులతో తాము పడ్డ కష్టాలు పిల్లలు పడకూడదని పగలూ రాత్రీ కష్టం చేసి 'చదువుకోండి, చదువు తప్ప మిగతావి కూడు పెట్టని విద్యలు' అని హెచ్చరించే నాన్ననీ, 'అబ్బ, నీకేం తెలీదు, ఊరుకో అమ్మా' అని అదిలిస్తే ఆత్మనూన్యతా భావంతో కుచించుకుపోతూ, పిల్లలకి పనులు చెపితే చదువు చెడిపోతుందేమోనని బండెడు చాకిరీ తన కర్తవ్యంగా పాటించిన అమ్మని ఏ క్షణమైనా ఎలా మరిచిపోగలను? కృతజ్ఞత తప్ప ఋణం తీర్చుకోలేని నిస్సహాయ భావనని ఎలా తప్పించుకోడం? ముప్ఫై ఏళ్ళు ఆలశ్యంగా వచ్చిన ఈ పశ్చాత్తాపానికి ప్రాయశ్చిత్తం ఏవిటి!? నేను తలవిదిల్చి మొహం మీదకి నవ్వు తెచ్చుకుని మా కొలీగ్స్‌ని పలకరించాను. థామస్ తన కొడుక్కి గొప్ప యూనివర్సిటీలో సీటు వచ్చినందుకు అందరికీ డోనట్స్ తెచ్చాడు. ఈ వీకెండ్ వెళ్ళి అట్లాంటాలో దింపి వస్తానని, నాలుగేళ్ళలో తన కొడుకు మళ్ళీ కాలిఫోర్నియా వచ్చి సెటిల్ అవుతాడనీ గర్వంగా చెప్పుకొచ్చాడు. పోలికలు తెలియని వాళ్ళావిడ మొహం ఊహించడానికి, ఆవిడ మనసు చదవడానికీ ప్రయత్నించాను. దూరపు చదువులకీ, ఉద్యోగానికీ మా తమ్ముడు పొరుగు రాష్ట్రంలో ఆరేళ్ళపాటూ ఉండిపోడానికి బయలుదేరినప్పుడు, మా అమ్మ గొంతు చాటున ఆపుకున్న కన్నీరు గుర్తొచ్చింది. అయినా నా రంధ్రాన్వేషణ తప్పు, తండ్రికి మాత్రం ఆ బాధ ఉండదా? పిల్లలు బాగుపడాలనే ఆశ, బాధ్యత వల్ల నిబ్బరంగ ఉంటారంతే!

ఊపిరి సలపని పని ఒక్కోసారి ఊరటనిస్తుంది. సాయంత్రం ఆరింటిదాకా మరే ఆలోచనకీ తావులేకుండా గడిచిపోయింది. శ్రమించడం తప్ప విశ్రమించడానికి గడువు లేని ఈ దేశంలో తిరిగి ఇంటి బాధ్యతల దిశగా నా కారు తిప్పాను.

రెక్కలొచ్చి ఎగిరిపోయిన పిల్లలకి, తను యాభై ఏళ్ళ వయసులో పెద్ద అవసరం లేదని గ్రహించిన అమ్మ, ఎట్టకేలకు తన ఇష్టాలవైపు దృష్టి సారించింది.

ఆయిల్ పెయింటింగ్ చేస్తే వినాయకుడి తొండం సరిగ్గాలేదని వెక్కిరించినా, కుట్లూ, అల్లికలూ 'ఓల్డ్ ఫాషన్' అని, రేడియో నాటకాలు వేస్తే - గొంతు గట్టిగా లేదని విమర్శించినా.. ఆనాడు 'జస్ట్ జోకే' అనిపించింది. పిల్లలు ఆటపట్టిస్తారని, తెలియనివ్వకుండా మంచం కింద వీణ దాచుకుని రెండేళ్ళు సంగీత సాధన చేసింది. ఆవిడ దేహాన్ని చూడడానికి ఐదొందల మంది తరలి వచ్చేదాకా, పోపుల డబ్బాలోంచి ఇంతమంది బీదవాళ్ళకి సహాయం చేస్తోందని తెలీక మ్రాన్పడిపోయాం. ఆవిడ 'తెలీనితనం' అని కొట్టిపారేసినది ఎంత 'అమానవీయమో' మాలో ఇప్పుడు ఆలోచిస్తే క్షోభగా ఉంది. 'నువ్వంటే ఇష్టం అమ్మా', 'తెలిసి చేసిన అపరాధాలని క్షమించమ్మా' అన్న రెండు మాటలు ఆవిడ బతికుండగా చెప్పనందుకు ఈ వ్యధ సమ్మతమైన పరిహారమే.

దారిలో కారాపి అమ్మకి ఇష్టమైన 'మైకల్స్'లో పూల గుచ్ఛాలు కొన్నాను. రేపటి సాంస్కృతిక కార్యక్రమంలో జరిగే ఆటపాటల్లో అమ్మ తప్పకుండా కనిపిస్తుంది. ఆవిడకి పిల్లలన్నా, పువ్వులన్నా ఎంతో ఇష్టం.

"భగవంతుడా! ఒక్కసారి నా తల్లిని వెనక్కి ఇచ్చెయ్యి. ఇంకెప్పుడూ దూరం చేసుకోను. చుట్టూ ఇందరున్నా, మనసుకి అమ్మకావాలి, అమ్మే కావాలి!" అమ్మని తల్చుకుంటున్న క్షణం, 'అమ్మ'గా గుర్తింపబడుతున్న భావన కన్నా ఎంతో బాగుంది.

'నీ అంత స్థితప్రజ్ఞతతో నడిచే బలం ఇవ్వమ్మా' అనుకుంటూ 'పిల్లలూ!' అంటూ ఇంట్లోకి అడుగు పెట్టాను.




# ప్రేమంటే

అనుపమ గాలి

"అప్పట్లో ఆయనే మీ తాతగారు అని నాకు తెలిసింది కాదు." మామ్మ వడియాల పిండిలో ఉప్పు సరిపోయిందో లేదో చూస్తూ చెబుతోంది. "నాకేమో ఎనిమిది, ఆయనకేమో పధ్నాలుగు. నాకన్నా పెద్ద అన్న ఊహ కూడా ఉండేది కాదు. కాస్త ఆ చీర ఎండలో వేస్తావూ?"

నేను బాగా ఎండగా ఉన్న చోట చీర పరిచి పక్కనే కూర్చున్నాను.

"ఒంటి మీద నూలు చొక్కా, కింద గళ్ళ నిక్కరు వేసుకుని ఉండేవారు ఎప్పుడూ. మేమంతా కలిసే ఆడుకునేవాళ్ళం. ప్రతి ఆటా న్యాయంగా ఆడాలని అనేవారు. నాకేమో కొన్ని ఆటలు సరిగ్గా తెలీవాయే! అప్పుడు ఆయనే నేర్పేవారు. ఇక ఆటకి కావాల్సినవి కూడా మేము సగం-సగం చేసేవాళ్ళం. గళ్ళు నేను వేస్తే చింత పిక్కల సంగతి ఆయన చూస్కునే వారు. మాతో పాటూ ఆడుకునేవాళ్ళలో పక్కింట్లో సుబ్బులు ఉండేది. ఇద్దరికీ క్షణం పడేది కాదు. నా ఈడే కానీ చూడటానికి కాస్త పెద్దగా ఉండేది. కాస్త పొడగరి. అంతేనా? చేప లాంటి పెద్ద, పెద్ద కళ్ళు కూడానూ"

"నేనూ పెట్టనా?" మామ్మ పెట్టే వడియాలని చూస్తూ ఆశగా అడిగాను.

"పెడుదూగాని, ముందు నేను ఎలా పెడుతున్నానో గమనించు. సుబ్బులు సంగతి చెప్తున్నాను కదూ! అది మహా పెంకిది. ఆటలో ఓడిపోతే ఉడికిపోయేది. మీ తాతగారు గెలిస్తే మరీనూ." మామ్మతో పాటూ నేనూ నవ్వుకున్నాను.

"సుబ్బులు ని మీ పెదతాతయ్యకి ఇచ్చి పెళ్లి చేశారు. వాళ్ళ పెళ్ళి జరుగుతున్నప్పుడే మా పెళ్లి మాటలు కూడా అయిపోయాయ్. దాని పెళ్లి కార్తీకంలో అయింది. ఆ తర్వాత మాఘంలో మా పెళ్లి జరిగింది. "

"ఆగాగు.. అంతేనా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అంతేనా? పెళ్లి ఎంత ఘనంగా చేశారు అనుకున్నావు? విందంటే మా పెళ్లి లోదే అని పై ఊర్లో చెప్పుకునేటంత బాగా. "

"మీ అమ్మ,నాన్న బాగా ఉన్నవాళ్ళా?"

" ఆ ఏముండేదనీ? బాగా బతికిన వాళ్ళని జాలి ఉండేది. మనుషులు సౌమ్యం అన్న పేరు ఉండేది. అంతే, అంతకు మించి ఆస్థులు ఏమీ ఉండేవి కావు. అసలు గొప్పతనం అయినా మాది కాదులే, మా అత్తది. నన్ను కోరి కోడల్ని చేసుకుంది. అమ్మ తర్వాత అమ్మలా చూసుకునేది."

"నిజమా?"

"అవును. పిల్లలం అందరం ఆడుకుని,పొలాలు తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకునే వాళ్ళం. జీడిపప్పు నేతిలో వేయించి ఉప్పు,కారం జల్లి గుప్పిట్లో పోసేది." వడియాలు పెట్టటం ఆపి దోసిలి చూపిస్తూ మామ్మ చెప్తోంది. "భోజనాలు అయ్యాక అందరం కలిసే పడుకునే వాళ్ళం. అత్తకి అటు పక్క మీ తాతగారు, ఇటు పక్క నేను."

"ఇబ్బంది కదూ? " నొసలు చిట్లిస్తూ అడిగాను.

మళ్లీ వడియాల పని మొదలుపెట్టి "మరి మేము చిన్న పిల్లలం కదా? అయినా నాకు మా ఇంట్లో ఉన్నట్టే ఉండేది. అసలు ఇబ్బందే ఉండేది కాదు. ఇందులో ఇబ్బంది పడాల్సిన విషయం ఏముందని? కొంత కాలం అయ్యాక మా అత్త మమ్మల్ని వేరేగా పడుకోమనేది. తను నా తోడి కోడలు లలిత దగ్గర పడుకునేది. నాకేమో బెంగగా ఉండేది. నాకు బాగా గుర్తు – ఒకరోజు రాత్రి పక్కన అత్త లేకపోయేసరికి నేను బాగా ఏడ్చాను. అప్పుడు అత్త నన్ను పక్కన కూర్చోబెట్టుకుని చెప్పింది– లలిత నీ కంటే చిన్నది కదా? నేను దానితో ఉంటాను. నిన్ను మా రాముడు బాగా చూసుకుంటాడు, ఏ కష్టం వచ్చినా వాడితో చెప్పుకో అని. అత్తమాటంటే వేదమే కదా, నేను ఒప్పుకోక తప్పలేదు.

కాలం గడిచేకొద్దీ కొత్త జీవితానికి నేను అలవాటు పడ్డాను. ఒక మూడు ఏళ్ళకి అనుకుంటాను పెద్ద వాడు మూర్తి కడుపులో పడ్డాడు. ఇక అప్పటి మొదలు.. ఇక్కడ కూర్చో, అక్కడ కూర్చోకు. ఈ పని చెయ్యకు, ఆ పని చెయ్యి. ఇది తిను, అది ముట్టుకోకు అని చెప్పేవాళ్ళు. నాకు అదేమిటో తెలిసేది కాదు. ఇంట్లో మిగతా కోడళ్ళు, ఆడపడుచులు చెప్పగా తెలిసింది నేను గర్భవతిని అని, తొందరలో నా బొజ్జ పెద్దది అవుతుందని, అందులో ఒక ప్రాణి ఉంటుందని. "

వడియాలు పెట్టేసి పిట్టగోడ వారగా నీడలో కూర్చున్నాము నేను, మామ్మ.

"నా వయసు పధ్నాలుగు అనుకుంటాను. ఆ వయసులో కళ్ళ నిండుగా ఆయన్ని చూడటం అదే ఆఖరిసారి . నేను లేచేసరికే ఆయన పొలం పనులు చూస్కోటానికి వెళ్ళిపోయే వాళ్ళు. అయన వచ్చేసరికి నాకు నిద్ర ముంచుకొచ్చి నేను పడుకునేదాన్ని. తర్వాత పురుడు అని మా అమ్మ దగ్గరికి వెళ్ళిపోయాను. మూర్తి పుట్టాడు. ఆయన వచ్చి బిడ్డను చూస్కున్నారు అని చెప్పారు కాని నాకు కలిసే అవకాశం దొరకలేదు. మూర్తికి సంవత్సరం వచ్చేంత వరకు ఏవో అనారోగ్యాలు– అమ్మోరు అని, కామెర్లు అని. ఇక అమ్మ లేకుండా పెద్దింట్లో కష్టమని అక్కడే ఉండిపోయాను. అడపాదడపా అత్త వచ్చి నన్ను చూసిపోయేది. ఆయన సంగతి అడగాలని ఉన్నా నేను సిగ్గుతో ఎప్పుడూ అడగలేదు. అక్కడి విషయాలు మా అత్త చెప్తే వినటమే! నేను ఏడాది బిడ్డతో తిరిగి వెళ్లేసరికి ఆయన చాలా మారిపోయారు. గుబురు మీసాలు, ఉంగరాల జుట్టునూ. స్వరం కూడా మారిపోయింది. భలే గమ్మత్తుగా." మామ్మ కళ్ళలో ఏదో మెరుపు కనిపించింది నాకు.

"ఇక మూర్తి రావటం వల్ల ఇంటికి ఎంత శుభం జరిగింది అనుకున్నావు? వెంటవెంటనే ఎన్ని కాన్పులో. సుబ్బులు నెల తప్పిన ఏడే లలిత కూడా నెల తప్పింది. చూస్తుండగానే ఇంటి నిండా పిల్లలు. కళకళలాడిపోయేది ఇల్లంతా. పిల్లలు, వాళ్ళ అవసరాలతో ఆడవాళ్ళం మేము మా లోకంలో మేము ఉండేవాళ్ళం. పొలం పనులని, కౌలు డబ్బులని మగవాళ్ళు తలమునకలై ఉండేవాళ్ళు. చిన్నప్పటికి మల్లె అంత సమయం కలిసి ఉండటానికి వీలేది? ఆ, భోజనాల వేళకి తప్పనిసరిగా ఇంటికి వచ్చేవాళ్ళు లే! మీ తాతగారికి ఆనపకాయ పులుసు బాగా నచ్చేది. నాకెలా తెలిసింది అనుకునేవు– ఎప్పుడు చేసినా రెండు సార్లు కలుపుకుని తినేవారు. ఉల్లిపాయ కారం కూడా." మామ్మ చెప్పటం ఆపేసింది. బహుశా ఆ రోజులు గుర్తు వచ్చాయేమో!

25 ఏళ్ళ కిందట మా తాతగారు పోయారు. మామ్మ 25వ ఏట. అప్పటినుండి ఒంటరిగానే ఉండింది మామ్మ. అంత సేపు తాతగారి గూర్చి మాట్లాడినందుకు సిగ్గుపడిందో ఏమో నాకు తెలీదు. హఠాత్తుగా ఈ లోకంలోకి వచ్చినట్టు "అయినా ఎందుకు అడుగుతున్నావు ఇప్పుడు ఇవన్నీ?" అని అడిగింది.

"ఊరకే మీది ప్రేమ పెళ్లి ఏమో తెలుసుకుందామని. ఎంతైనా మీకు మీ పెళ్ళికి ముందే పరిచయం ఉండింది కదా?"

"ప్రేమా? అదేమిటో నాకు తెలియదు. అయినా నాకు సంబంధించినంత వరకు గుడిలో ఉండే దేవుడు ఎలాగో ఈ ప్రేమా అలాగే. దాని ఉనికిని నమ్ముతూ జీవితాన్ని గడిపెయ్యటమే." మామ్మ చేతులు దులుపుకుని ఇక లేద్దాము అన్నట్టు సైగ చేసింది.



కథా కౌముది

# వేపపూతలో తీపి

డేగల అనితాసూరి

రుచిత తెల్లని కనుపాపలు పచ్చదనాన్ని అలుముకుని మిలమిల మెరిసాయి. మనసు ఆనంద పుష్పాభిషేకంతో మునిగితేలుతోంది.

అవునుమరి ఎందుకుండదు? పెళ్ళైన కొత్తలో ఆఫీసుకి దగ్గరలో ఇల్లు వెదికే పనిలో పడినప్పుడు మూడువేలకు సింగిల్ బెడ్రూం ఇల్లు దొరికింది. సర్లే ప్రస్తుతానికి చేరిపోతే ఆనక తీరిగ్గా వేరే మంచి ఇల్లు వెతుక్కోవచ్చన్నట్టు చేరారు రుచిత, సావంత్ లు.

అవడానికి సింగిల్ బెడ్రూం ఇల్లయినా ఇద్దరే కావడంవల్ల బాగానే ఉండేది. ఇరవైనాలుగ్గంటలు నీళ్ళకు ఇబ్బందిలేకుండా, సెక్యూరిటీ కూడా బాగా ఉంది. కానీ, మొక్కలు పెంచుకునే సదుపాయంలేదు. బాల్కనీ చిన్నది కాబట్టి కుండీలు సైతం పెట్టుకోడానికి అనువుగా లేకపోయింది.

ఓనర్తో ఏ ఇబ్బందీ లేనందువల్ల మరో ఇల్లు వెదికే పని వాయిదావేసి ఆఫీసుపనుల్లో పడ్డారు. ఈ లోపు ఆరునెలలు ఆరుగంటల్లా గడిచిపోయాయి. రుచితకు నెలతప్పిందని తెలిసి ఊళ్ళోని అమ్మా నాన్నలు, అత్తమామలు సంబరపడ్డారు. ఇల్లు చిన్నదని అమ్మా నాన్నలు వచ్చినప్పుడు అత్తామామలు వచ్చేవాళ్ళు కాదు. అత్తామామలు వెళ్ళిపోయేదాకా అమ్మానాన్నలు రాకపోవటంతో పెద్దగా ఇబ్బంది అనిపించలేదు. పిల్లలు పుడితే సరిపోదని మరో అద్దె ఇంటికోసం వెదకడానికి సావంత్ తయారయ్యాడు గానీ, కడుపుతో ఉన్నప్పుడు ఇల్లు మార్చే కార్యక్రమాలు చేయకూడదని పెద్దవాళ్ళు వారించడంతో ఊరుకోవలసి వచ్చింది.

డెలివరీ తరువాతేమో పసిబిడ్డను పెట్టుకుని ఇల్లు ఖాళీచేయటమంటే మాటలుకాదు. దుమ్మూ ధూళికి ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదముందని ఇల్లు వెతకలేదు. పాపకు ఎనిమిదో నెలవచ్చింది. మళ్ళీ ఆఫీసుకెళ్ళటం మొదలైంది.

ఎందుకో డౌటొచ్చి డాక్టర్ని కలిస్తే మళ్ళీ కన్సీవైనట్టు నిర్ధారించాదు. "ఏదో ఒకబిడ్డ. ఎలాగూ ఇద్దరు కావాలనుకుంటున్నదే కాబట్టి ఈ సారికి డెలివరీ తరువాత ఆపరేషన్ చేయించుకుంటే సరిపోతుంది. పనిలో పనిగా ఇద్దరూ చేతికి అందివచ్చేస్తారు. గాప్ తీసుకుంటే బాగుండేదే కానీ, అనుకోకుండా వచ్చినా తీయించుకోవటం తప్పని" అమ్మ వాళ్ళు చెప్పటంతో సరే అనవలసి వచ్చింది.

ఇంకేముంది.. షరా మామూలే. మళ్ళీ ఇల్లు మారటం వాయిదా పడింది. పిల్లలిద్దరూ అలాగే నర్సరీలు, కేజీలు దాటి స్కూళ్ళకొచ్చేశారు. ఇల్లు మారటం కాదుకదా కనీసం సున్నాలు కొట్టించాలన్నా డస్ట్ ఎలర్జీ వస్తుందేమోనని భావించటం వల్ల, పిల్లలు చిన్నవాళ్ళవటంవల్ల గోడలు పిచ్చి గీతలు, బొమ్మలతో భయంకరంగా తయారైంది.

చదువుకు ఇబ్బంది. ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దలు వచ్చిపోయేవాళ్ళతో ఇక గడపటం అసాధ్యమని తెలిసిపోయి ఇళ్ళు వెదుకుదామని అనుకునేలోపు ఆఫీసుకు దూరమే అయినా కొత్త క్వార్టర్స్ చాలా విశాలంగా ట్రిబుల్ బెడ్రూంస్తో తయారైందని తెలిసి ఎగిరి గంతేసినంత పనిచేసి అప్ప్లై చేసింది రుచిత. అలాట్ అవటం, మంచిరోజు చూసుకుని చేరిపోవటం అంతా రెండువారాల్లో జరిగిపోయాయి.

గవర్నమెంట్ క్వార్టర్స్ అంటే సొంత ఇంటితో సమానం. ఇంకా చెప్పాలంటే రెటైర్మెంట్ వరకు హాయిగా గడపొచ్చు. ఇక్కడ సెక్యురిటి, వాచ్ మెన్ ఎప్పుడూ ఉండటంవల్ల ఏ భయం లేదు. పిల్లలకు గార్డెన్, కావలసినంతమంది కొత్త స్నేహితులతో మంచి వాతావరణం దొరికింది.

క్వార్టర్స్ అపార్ట్మెంట్ చుట్టూ ఎత్తైన కాంపౌండ్ వాల్, వాటి దగ్గర చుట్టుతా మామిడి, వేప, సపోటా, సీతాఫలం చెట్లతో చల్లగా ఉండి చూడడానికి ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. అదిచూసిన రుచితకు అణగారిన ఆసలు మనసుమూలలో దాగిన మొక్కలమీది ప్రేమను పెల్లుబికేలా చేసింది. వెంటనే విశాలమైన వెనక బాల్కనీలోకి ముందుగా తులసికోట భక్తిగా పెట్టుకున్నాక నాలుగైదు కుండీలలో రోజా, మల్లె, చేమంతి లాంటి పూలమొక్కలు నాటింది.

పిల్లలు కూడా మట్టిలో ఎరువు వేయటం, నీళ్ళు పోయటం చేసి రోజూ ఆసక్తిగా గమనించడం మొదలుపెట్టారు. చిన్న ఆకుల్ని చూసినా, మొగ్గల్ని వేసినా వాళ్ళు ఉబ్బి తబ్బిబ్బవటం చూస్తే రుచితకు సంతోషంగా ఉంటోంది.

మొదటగా దసరా పండుగ వచ్చింది. అపార్ట్మెంట్ లోని ఉద్యోగుల కుటుంబాలంతా కలిసి అమ్మవారిని ఏర్పాటుచేసి నవరాత్రుల్ని బాగా జరుపుకున్నారు. కార్తీక మాసంలో బస్ వేసుకుని అందరూ కలిసి వనభోజనాలకెళ్ళి సరదాగా గడిపారు తలో వంటా చేసి పట్టుకెళ్ళి. దీపావళికి క్రింద ఉన్న విశాలమైన స్థలంలో ఒకవైపున పెద్దపిల్లలు, ఒకవైపున చిన్నపిల్లలు చేరి టపాకాయలు కాల్చుకోవటంవల్ల ఏ ఇబ్బందీ లేకుండా ఆనందించారు. అలాగే డిసెంబరు ముప్పైఒకటి రాత్రి అందరూ కొంత డబ్బులు వేసుకుని స్టేజ్ ఏర్పాటు చేసుకుని ఆట పాటలతో వెజ్ నాన్ వెజ్ విందులు వేర్వేరుగా ప్రిపేర్ చేయించటంవల్ల కోలాహలంగా గడిపారు.

పిల్లల పుట్టినరోజు పండుగలైతే చెప్పనవసరం లేదు. వారానికొకరి పుట్టిన రోజులకు వెళ్ళటం పిల్లలకు చాలా నచ్చేది. బాగా స్థలం ఉన్నందువల్ల ఇద్దరి పుట్టిన రోజులకూ సైకిళ్ళు గిఫ్ట్ గా ఇచ్చేసరికి ప్రాక్టీస్ చేసుకుంటూ ఉంటారు సాయంత్రాలు. పిల్లల ఆనందంలోనే పెద్దల ఆనందం ఉంది. పిల్లల రూం చాలా అందంగా డెకరేట్ చేసుకున్నారు. వాళ్ళను స్వేచ్ఛగా వదిలితే ఎంత సృజనాత్మకత వెలికి వస్తుందో వాళ్ళ రూం ని వాళ్ళే స్వయంగా అలంకరించుకొమ్మని వదిలేయడం వల్ల తెలిసొచ్చింది అనిపించింది రుచితకు.

సంక్రాంతికి మాత్రం క్వార్టర్స్ మొత్తం బోసిపోయిందనే చెప్పుకోవాలి తనలాంటి ఇద్దరికీ లీవు దొరకక వెళ్ళలేని వాళ్ళే తప్ప మిగతా అందరు ఊళ్ళకెళ్ళి పోయారు.

ఇక ఉగాదికి వారం రోజుల ముందు గమనించింది రుచిత. చుట్టూ ఉన్న చెట్లు దట్టమైన ఆకులతో పూతలతో కనువిందుగా తయారైంది. బాల్కనీలోని తమ మొక్కలు సైతం పూలు, మొగ్గలతో పచ్చని ఆకులతో అందంగా కనిపించింది. అచ్చంగా తన పిల్లలను పొదువుకున్నంత ఆప్యాయంగా బుజ్జి గులాబీని, చిట్టిచేమంతిని మునివేళ్ళతో సుతారంగా నిమిరి ముద్దాడి మురిసిపోయింది రుచిత. పిల్లలతో కలిసి చెట్లమధ్యన రకరకాల ఫోటోలు దిగి అమెరికాలోని తమ్ముడికి మెయిల్ చేస్తే వాడుకూడా చాలా బాగుందని మెచ్చుకున్నాడు.

ఉదయం మంచీనీళ్ళకోసం వెళ్ళి బిందె నింపుకున్నా వచ్చేయకుండా చెట్లదగ్గరికెళ్ళి తాదాత్మ్యంగా చూస్తుంటే " పోయినేడు కూడా బాగా పూతపట్టిందమ్మా కానీ గాలికి వానకు చాలానే పోయింది. కాయలు బాగానే వచ్చాయి. మన ప్రెసిడెంట్ సారు మాతోనే కాయలు కోయించి అందరిళ్ళకు పంచారు" అంటూ చెప్పాడు గార్డెన్లోని మొక్కలకు పైపుతోటి నీళ్ళు పడుతూ.

"ఏమండీ.. ఈసారి మన క్వార్టర్స్ లో ఉన్న చెట్లలోని మామిడి కాయలు, ఆకులు, వేపపూతలతోనే ఉగాది పండుగ చేసుకోబోతున్నాం. కాబట్టి మీరు మరిచిపోయి మార్కెట్ నుంచీ పట్టుకొచ్చేయద్దు" మరీ మరీ చెప్పింది రుచిత.

"అలాగే లేవోయ్" అంటూ రుచితను ఆఫీసుదగ్గర దింపి తన ఆఫీసుకు వెళ్ళిపోయాడు సావంత్.

సాయంత్రం భర్త వెనుక కూర్చుని బైకు మీద గేటు లోపలికి వస్తుంటే కనిపించిందా దృశ్యం. కాంపౌండ్ వాల్ మీదికెక్కి మరీ కొంతమంది ఆకతాయిలు ఆకులు, కాయలు, పూత తెంపుతూ కనిపించారు. వాచ్ మెన్ లిఫ్ట్ రిపేరు చేయిస్తుంటే సెక్యూరిటీ వాష్ రూం కెళ్ళిన సందర్భం చూసుకుని అల్లరిమూక మా చెట్లలో చేరి కిష్కింధాకాండ చేస్తున్నారని తెలిసి పట్టరాని కోపం వచ్చింది. మామిడి చెట్లు కాస్త దూరంగా ఉండటం వల్ల అందుకోలేక పోతున్నారుగానీ గోడవారకున్న వేపచెట్ల కొమ్మలైతే అందినకాడికి విరిచేయటం వల్ల కళావిహీనంగా దీనాతిదీనంగా కనిపించాయి. మాతోపాటూ మరికొందరు అప్పుడే ఇళ్ళు చేరుతున్న నలుగురైదుగురు కలిసి వాళ్ళను అరిచి బెదరగొట్టి తరిమేశాం. "ఇంతేనండి ఈ చదువు సంధ్య లేని పోకిరిగాళ్ళు. ఎల్లుండి ఉగాది కదా. ఎక్కడెక్కడో ఇళ్ళల్లో ప్రేమగా పెంచుకున్న మొక్కల్ని ఎవరూ గమనించకుండా చూసి తెంపుకొచ్చేసి అధికధరలకు అమ్మేసి సొమ్ముచేసేసుకుంటారు" అంటూ తలో మాట అన్నారు అంతా.

సాయంత్రం మీరు నేరుగా ఇంటికి వచ్చేయండి. నేను గంట ముందుగా పర్మిషన్ తీసుకుని పండుగకు పళ్ళూ, పూలు, కొబ్బరికాయ, కావలసిన సామాగ్రి కొనుక్కొస్తానని శ్రీవారికి చెప్పేసినందువల్ల ఇంటికి దగ్గర్లోని బస్ స్టాప్ లో బస్ దిగి పుజకోసం పూలు, అరటి, ఆపిల్ పళ్ళు కొని ముందుకొస్తుంటే రోడ్డు ప్రక్కన చిరిగిన చొక్కాతో పన్నెండేళ్ళ పిల్లాడు ప్రక్కన కాళ్ళులేని తల్లిని చక్రాల పీటమీద కూర్చోబెట్టి వేపపూత అమ్మటం కనిపించింది.

వాడ్ని నేను నిన్న మా క్వార్టర్ లోని చెట్లలో అందినంత తెంపుకుని బ్యాగులో వేసుకుంటుంటే తరిమినట్టు స్పష్టంగా గుర్తొచ్చింది.

"మేడం..మేడం..వేప్పూత కట్ట పదిరూపాయలే కొనండి మేడం" అంటూ దీనంగా అడగటంతో ఆగాను. వాడు నన్ను గుర్తుపట్టలేదు.

ఉదయం పేపర్ లోని వార్త జ్ఞాపకం వచ్చింది. “బాగా ఆస్థి పాస్థులు సంపాదించిన తల్లి దండ్రులు కొడుకుల్ని బాగా చదివించి, మంచి మంచి ఉద్యోగస్థులుగా తీర్చిదిద్దితే చనిపోయేదాకా తండ్రి సంపాదన, ఆస్థులన్నీ రాయించుకుని వృద్ధ తల్లిని స్మశానంలో వదిలేయగా దిక్కులేని అనాధలా దీనంగా కనిపించిన ఆ తల్లి ముఖం కళ్ళముందు కదిలింది”.

చదివించలేని అర్భక తల్లి, అశక్తురాలైన తల్లి ఈమె. ఏ ఆస్థి పాస్థులు కూడబెట్టలేదు. అయినా వదిలేయకుండా ఆ కొడుకు ప్రక్కన పెట్టుకుని తనకు తోచిన పని చేస్తూ పోషిస్తున్నాడు. ఉదయపు మంచు అద్దుకున్న లేతాకులా గుండె తడి తడిగా మారింది.

"అదేమిటోయ్..నన్ను కొనొద్దు కొనొద్దు అని చెప్పి బయట కంటే రెండు రూపాయలు ఎక్కువ పెట్టి నువ్వు మాత్రం కొనుక్కురావచ్చా?" అంటూ ఉక్రోషంగా అంటున్న సావంత్ ని పట్టించుకోకుండా దేవునికి నైవేద్యం గా సమర్పించిన ఉగాది పచ్చడిని అతని చేతిలో వడ్డించి కాసింత స్పూన్ తో తీసి తానూ నోట్లో వేసుకుంది రుచిత. బెల్లంకన్నా వేప్పూతే నాలుక్కి తియ్యగా తగిలింది. అయాచితంగా కాకుండా ఒకరికి ఉపయోగపడేలా డబ్బులిచ్చి కొని తెచ్చి వాడుతున్నందుకేమో!




## ప్రేమ చిత్రం

కొల్లూరు లావణ్య

### శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
### వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
### 20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
### 'నా మొట్టమొదటి కథ' విభాగం విజేత

గీత మీద గీత, గీత మీద గీత, గీత పక్కన గీత, చుక్కలు, సగం చుక్కలు, అడ్డుగీతలు, నిలువుగీతలు కోణాలు, వంకలు, వంపులు, సూదిమొనలు అన్నీ ఒకదాని పక్కన ఒకటి, ఒకదానిపైన మరొకటీ, ఒకదాని వెనుక ఒకటి అన్నీ కలగలిపి ఏకంగా చూసేసరికి ఒక పురుషుడు, పక్కన స్త్రీ. కలం పక్కన పెట్టాను. ఇది నా సృష్టి. ఒక మగాడు పక్కనే ఓ ఆడది. ఇద్దరి కళ్ళల్లో సంతృప్తి, మెరుపు. ఒకరికొకరున్నామనే నిండైన ఆనందం. తృప్తిగా అనిపించింది నాకే!. గీసింది ఒక మాములు కాగితం మీదైనా ఆ చిత్రం అందించింది మాత్రం ఎనలేని లోలోని ఆనందం. అవును అది లోలోని ఆనందమే. అందంగా కనిపించేది ముఖం కాదు, ముఖంలోని ఆనందం అన్నార్ట ఎవరో. అదే నిజం అందుకే లోలోని, నాలోని ఆనందం కాగితంపైని చిత్రంగా మారింది. అదేం చిత్రమో, ఎప్పుడు తల్చుకున్నా చిరునవ్వై నా ముఖం మీద కదలాడుతుంది. తియ్యని రాగమై, అనురాగమై మనసుని ఓలలాడిస్తుంది. కాలక్రమంలో ఏదైనా మరుపుకి గురికావాల్సిందే కానీ, ఆ మరుపునే మైమరిపింపచేసి తుత్తునియలు చేసి సజీవ వారాహిగా ప్రవహిస్తూనే ఉంది ఇప్పటికీ, ఎప్పటికీ కూడానేమో. దానిముందు, తరువాత కూడా లెక్కలేనన్ని సంఘటనలు కాలప్రవాహంలో మునిగిపోయి జీర్ణమయిపోయాయి. ఇదొక్కటి మాత్రం, ఇన్నేళ్ళ తర్వాత కూడా ఇంకా తాజాగా, స్వచ్ఛంగా పరిమళిస్తూ, ఎప్పటికప్పుడు చిగురిస్తూ పెద్ద వటవృక్షమై వేన్నూళ్ళుకుపోయింది. అందుకే ఈ డెబ్బై ఏళ్ళ వయసులో ఈ రైల్వే స్టేషనులో ఈ కూర్చోవడం ఏవిటి? ఈ చిత్రం ఏవిటి? నా చేతివేళ్ళు చేసిన ఈ సృష్టి ఏవిటి? అది నా మనసులోని భావాన్ని అచ్చంగా ప్రతిబింబించడం ఏవిటి? చిత్రం చాలా చిత్రవిచిత్రంగా అనిపిస్తుంది. బాధను సగం, ఆనందాన్ని సగం కలబోసుకున్న ప్రేమమయమైన చిత్రంలా ఉంది.

***

'నాన్నా.. ప్లీజ్ నాన్నా. కొట్టొద్దు నాన్నా. ఇకమీద శ్రద్ధగా చదువుకుంటాను నాన్నా. మంచి మార్కులు తెచ్చుకుంటాను నాన్నా.'

'ఒరేయ్. నీ వయసు వాళ్ళంతా తిరుగుతున్నా, క్లాసులు ఎగ్గొడ్తున్నా కనీసం పాసుమార్కులు తెచ్చుకుంటున్నారు, నువ్వు మాత్రం ఎందుకురా ఇలా..? నా ప్రాణం అలసిపోతుందిరా. చేతులెత్తి దణ్ణం పెడతానురా. నువ్వేమీ మంచి మార్కులు తెచ్చుకోక్కర్లేదు, కానీ, కనీసం పాసుమార్కులు తెచ్చుకోరా. నీకు పుణ్యం ఉంటుంది. '

చాలా కోపం వచ్చింది నాకు, నాన్నమీద కాదు, అమ్మ మీద. మరి నాన్న నన్ను కొడ్తూ ఉంటే ఏవీ పట్టనట్టు బియ్యం ఏరుకుంటూ కూర్చుంటుందా?

'అమ్మా! ఎందుకమ్మా! నాన్న నన్ను కొడ్తూంటే అడ్డుకోలేదు?'

'అరె పోరా! నువ్వు, మీ నాన్న ఇద్దరూ నాటకాలాడ్తున్నారా? ఆయనేమీ కొడుకు పాస్ అవ్వట్లేదని తెగ ఫీలవ్వడం, పైగా పనిష్మెంటంటూ నెమలి ఈకతో తెగకొట్టినట్టు నటించెయ్యడం, ఈయనేమో మళ్ళీ అడ్డుకోలేదంటూ నన్ను గదమాయించడం. పోరా.. పో! '

పదోక్లాసులోకి అడుగుపెట్టిన మూణ్ణెల్లకి అయిన క్వార్టర్లీ పరీక్షా ఫలితాలు వచ్చిన రోజు జరిగిన తంతు అది. అమ్మా, నాన్నకి అసలు నామీద కోపం రాదా, చాలా ఆశ్చర్యంగా అనిపించింది. మరి ఆ గోపాల్ గాడి నాన్నేంటి వాడికి మూడో ర్యాంకు వచ్చిందని, మొదటి ర్యాంకు రాలేదని ఎప్పుడూ క్లాసు పీకుతూంటాడట. ఈరోజు, ఎలాగైనా ఈ విషయం తేల్చేయాల్సిందేనని నిశ్చయించుకుని 'అమ్మా, ఎందుకమ్మా?' 'ఏయ్ పోరా!' అంటూ అమ్మ చూసిన చూపు, నవ్విన చిరునవ్వు చాలా అందంగా కనిపించాయి. ఎలాగైనా ఆ దృశ్యాన్ని పొందుపరుచుకోవాలి అనిపించింది. ఆ నవ్వుని ఎప్పటికీ నా దగ్గరే దాచేసుకోవాలనిపించింది. ఏం చెయ్యాలో తెలీలేదు. అక్కడున్న నా పుస్తకం తెరచి పక్కనే ఉన్న పెన్ను తీసుకున్నాను. చకచకా కదలడం ప్రారంభించింది నా చెయ్యి. ఒక పావుగంట అయిన తర్వాత నా కళ్ళల్లో తృప్తి. అలాగే, ఆ పుస్తకాన్ని నా గుండెకి హత్తుకున్నాను. ఇంతలో అమ్మ వచ్చింది. 'ఏవిటిరా అది? ఇలా ఇవ్వు' అంటూ తీసుకుంది. అంతే, అమ్మ కళ్ళల్లో కన్నీళ్ళు. అలా నాన్న వచ్చేవరకూ ఆ తడి ఆరనే లేదు. నాన్న వచ్చిన వెంటనే ఆ పుస్తకం తీసుకుని, చూసి అలా ఉండిపోయారంతే.

'ఏవిటిరా ఇది?' అనగలిగారు అంతే.

'నాన్నా! అది.. అమ్మ ఇందాక నన్ను చూసి నవ్వింది నాన్న. నాకామో ఆ నవ్వుని దాచుకోవాలనిపించింది నాన్నా. అందుకో పెన్ను తీసుకుని, గీసాను నాన్న.' అది చూసి అమ్మ ఇందాకట్నుంచి ఏడుస్తూనే ఉంది నాన్నా!. ఎందుకో అర్థం కావట్లేదు. '

'ఒరేయ్! అది ఏడుపు కాదురా. నీ ప్రావీణ్యం చూసి ముచ్చటపడడంరా. అది ఏడుపు కాదురా. అచ్చంగా అమ్మని, చిరునవ్వుని ఫోటో తీసినట్టు గీసేవురా. అందుకే అమ్మ అంత సంతోషపడుతుందిరా!'

'నిజంగానా నాన్నా?.. అంత బాగుందా.. అయితే జాగ్రత్తగా దాచుకుంటాను! '

ఆ రోజు అమ్మ చిరునవ్వు వేసిన గాఢముద్ర ఒక విత్తనంలా పనిచేసింది. దానికి నీరు పోసిన సంఘటన మాత్రం ఒక సంవత్సరం తర్వాత జరిగింది. నాన్న కోరుకున్నట్టు టెన్త్‌లో అత్తెసరు మార్కులతో ప్యాసయ్యి ఇంటర్‌లో చేరాను. అది కో ఎడ్యుకేషన్ కాలేజీ. అందరు అబ్బాయిలకూ అందరమ్మాయిలూ చాలా అందగత్తెల్లా కనిపించేవారు. కానీ, నాకు మాత్రం ఏవిటో ఎవరూ అందంగా కనిపించేవారు కారు. ఆ రోజు కాలేజీకెళ్ళాలనిపించక, కాలేజీ చుట్టూ చక్కర్లు కొడుతున్న నన్ను అకస్మాత్తుగా ఒక సైకిలు వచ్చి గుద్దేసింది. వెనక్కి తిరిగి చూసాను. రెండు పెద్ద పెద్ద కళ్ళు భయంగా నా వైపే చూస్తున్నాయి.

'సారీ అండీ.. సారీ.. సారీ ఏవీ అనుకోవద్దండి. చూసుకోలేదు' అంటూ ఒక అమ్మాయి పదమూడేళ్ళుంటాయేమో లేచింది, సైకిలును పైకి తీసింది. నేను కూడా దుమ్ముదులుపుకుంటూ పైకి లేచాను. ఆ కళ్ళు.. ఆ కళ్ళని మరిచిపోలేకపోయాను. ఇంటికి వచ్చాను. మళ్ళీ నా చేతివేళ్ళు కాగితం మీద చకచకా కదిలాయి. అటువైపుగా వచ్చిన అమ్మ గమనించినట్టున్నది. ఒక అరగంట తర్వాత

'ఏరా అయిపోయిందా' అంటూ పుస్తకాన్ని తీసుకుని చూసి మళ్ళీ అలా ఉండిపోయింది. మర్నాడు నాన్న ఆరుగంటలకే లేపి ముఖం కడుక్కోమన్నారు. తొందరగా స్నానం చేసి తయారవ్వమని ఒకటే కంగారు. ఎక్కడికని అడిగితే అస్సలు చెప్పలేదు. సరే. నేను రెడీ అయ్యిన తర్వాత స్కూటరెక్కించుకుని పరుశురాం అంకుల్ దగ్గరికి తీసుకెళ్ళారు. ఆయన నాన్నగారికి మంచి స్నేహితుడు. పైగా నేనంటే ఎంతో ప్రేమ. ఆయనకి నా పుస్తకం తెరిచి చూపించారు నాన్న. ఆయన నిశ్చేష్టులయిపోయారు.

' వీడిని ఇలా వదిలెయ్యకూడదురా.. చూస్తాను.. దీనికి ఏం చెయ్యాలో చెప్తాను. ఒక అరగంట ఆగు.'అని లోపలికి వెళ్ళి దాదాపు గంట తర్వాత బయటకు వచ్చారు. 'అంతా ఏర్పాటయిపోతుంది. రేపుదయం ఐదుగంటలకు ట్రైను.' అని అన్నారు.

నాన్న అంకుల్‌కి థాంక్స్ చెప్పి నన్ను బయటకు తీసుకొచ్చారు.

'ఏవిటి నాన్నా? ఏ ఏర్పాట్లు, రేపు బయటి ఊరికి, ఏ ఊరికి బయల్దేరాలి?'

'ఏం లేదురా, ముందు ఇంటికెళ్దాం. అమ్మ ఎదురుచూస్తూంటుంది. పద. ఇంటికెళ్ళి చెప్తాను.'

సరే. ఇంటికొచ్చాం. అన్నం వడ్డిస్తున్న అమ్మతోను, తింటున్న నాతోను

' లక్ష్మీ! రేపు నేను, శేఖర్ ఉదయం మూడు గంటలకు లేవాలి. ఐదుగంటలకు ట్రైను. నా స్నేహితుడు పరశురాం అన్ని ఏర్పాట్లు చేసాడు. మద్రాసులో చిత్రలేఖనం, సంగీతం, సంగీత వాయిద్యాలు.. ఇలా ఈ లలితకళలన్నిటి గురించి ప్రత్యేకంగా కాలేజీ ఒకటుందట. దాంట్లో పరశురాం స్నేహితుడు ఒకరు సంగీతం లెక్చరర్‌గా పనిచేస్తున్నారట. అతనితో మాట్లాడి మన శేఖరానికి సీటు ఏర్పాటు చేసాడు. '

'ఏవిటి నాన్నా! ఏవిటి మీరంటున్నది, నేను మద్రాసు వెళ్ళాలా? చిత్రలేఖనం నేర్చుకోవడమంటే నాకు చాలా ఇష్టంగానే ఉంది. కానీ, మిమ్మల్నందర్నీ వదిలిపెట్టి వెళ్ళడమంటే..'

'లేదురా! నాన్నగారు నీ మంచికోసమే కదరా అలా అంటున్నారు, నువ్వు తప్పుకోకుండా వెళ్ళాలి నాన్నా, మాదేవుందిలే' అని అమ్మ అనేసరికి కాదనలేకపోయాను.

మర్నాడు ఉదయం బయలుదేరబోతున్న సమయంలో అమ్మ కళ్ళని నాన్న తుడవడం చూసాను. నాన్న అమ్మ కళ్ళను తుడుస్తూ భుజం చుట్టూ చేతులేసి ఏదో చెప్పారు. అమ్మ కళ్ళు తుడుచుకుని చిరునవ్వు నవ్వింది. నాన్నకూడా అమ్మను చూసి నవ్వారు. ఆ దృశ్యం, ఆ సంతృప్తి, ఒకరినొకరున్నామనే వాళ్ళ ఉత్సాహం అలా నాలో ఇమిడిపోయింది. ఎప్పటికీ మరిచిపోలేని దృశ్యంగా, చిత్రంగా నా కళ్ళల్లో ఉండిపోయింది.!!

***

ఇన్నాళ్ళకి, ఇన్నేళ్ళకి ఐ ఈ కాగితం మీద చిత్రంగా నా వేళ్ళు మలిచాయి. చాలా ఆశ్చర్యమనిపించింది. డెబ్బైఏళ్ళ వయసులో నాకు దాదాపు ఇరవై ఏళ్ళ కిందటి అమ్మానాన్నల ముఖాలు కాక, ఇంకా ముందెప్పుడో, దాదాపు ఇంకో ముప్పై ఏళ్ళ ముందటి అమ్మానాన్నల రూపు ఇలా ఈ రోజు, ఈ స్టేషనులో ఈ కాగితం మీద ఇలా సాక్షాత్కరించిందేవిటి? అప్పుడు గీయని, ఆ తియ్యని దృశ్యం నన్ను ఉత్సాహపరుస్తూ 'నీ జ్ఞాపకాన్ని తప్పకుండా ఏదో ఒకరోజు నీ చేతివేళ్ళకందిచి నీ ఆనందాన్ని, నీ కన్నీళ్ళని నేనే సొంతం చేసుకుంటానులే' అని ఎప్పుడూ నీతో మాటలాడే ఆ దృశ్యం ఇప్పుడు చిత్రమై నన్ను చూసి చిరునవ్వు చిందిస్తున్నట్లనిపించింది.

ఆ దృశ్యం తర్వాత నన్ను కదిలించే సంఘటనలే లేవా అనుకుంటే అదీ పొరపాటే.

***

అనుకున్నట్టుగానే ఆ రోజు నేను, నాన్న మద్రాసు బయలుదేరాం. మద్రాసుకు చేరడం, కాలేజీలో చేరడం, మళ్ళీ నాన్న ఊరుకు బయల్దేరి వెళ్ళిపోవడం అన్నీ చకచకా జరిగిపోయాయి. చాలా వింతగా అనిపించింది ఆ కాలేజీ వాతావరణం అందరూ ఎంతో ఆనందంగా ఉండేవారు. ఎక్కడా ఒత్తిడి కానీ, ఎవరూ విచారంగా కానీ కనిపించలేదు నాకు. నేను చిత్రలేఖనం కోర్సు తీసుకున్నాను. అదే మొదటిరోజు. క్లాసులోకి ఒక మాష్టారు వచ్చారు. మీకు నచ్చినది కాగితం మీద గియ్యండి అంటూ కాగితాలిచ్చారు. అందరూ గీస్తున్నారు. నేను మాత్రం అస్సలు గియ్యలేకపోయాను. నా వేళ్ళు ఒక చిన్న గీతని కూడా గియ్యలేకపోయాయి. మాష్టారు గారు తిరిగి అందర్నీ కాగితాలిమ్మన్నారు. చాలా సందేహించాను - కాగితం ఇవ్వాలా, వద్దా అని. ఏదైతే అది అవుతుందని కాగితం మీద పేరు రాసి ఇచ్చేసాను. మాష్టారుగారు అన్ని కాగితాలు చూస్తూ, ఆయన అభిప్రాయాలు చెప్తూ నా పేరు చదివి, అన్నిటికన్నా నా చిత్రం బాగుందని అంటూ నా కాగితం అందరికీ చూపించారు. ఆ తెల్లకాగితం చూసి అందరూ నవ్వారు. ఎందుకు నవ్వుతున్నారని మాష్టారు గారడిగితే తెల్లకాగితం మంచి చిత్రం ఎలా అవుతుంది అన్న అందరి ప్రశ్నకు మాష్టారిచ్చిన జవాబు ఇప్పటికీ నా చెవులలో మారుమోగుతూనే ఉంది.

***

'టంగ్'మని చప్పుడు, ట్రైను ఇంకో పావుగంటలో రానున్నదని ఓ ఆడగొంతు టంగ్‌మని చేసిన ప్రకటన నా జ్ఞాపకాలనుంచి నన్ను బయటపడేసింది. లేచి, వెళ్ళి ఒక టీ తాగి మళ్ళీ కూర్చున్నాను.

***

మాష్టారుగారి జవాబు కదూ.. 'గీతలతో నిండిన తెల్లకాగితం మరింకే గీతని ఇముడ్చుకోలేదు, అంతా నిండిపోతుంది, మరి తెల్లని కాగితం మీరేది ఇచ్చినా తీసుకుంటుంది, అంటే మీ సృజనాత్మకతని రెచ్చగొడ్తుంది, "ఇంకేవీలేదా, ఇంతేనా, ఇదేనా నీ ప్రతిభ" అంటూ సవాలు చేస్తుంది. 'నువ్వేవిచ్చినా తీసుకుంటాను, అలా అని పిచ్చిగీతలు ఇస్తే అది నీ కళ్ళకే నచ్చకుండా పోతాను. నీ చేతివేళ్ళ మీద నీకున్న ప్రేమ నీ కళలమీదలేదా, నీ మనస్సు మీద లేదా? నీ కళ్ళల్లో ఆర్తి, నీ మనసులో ఆనందం నీకక్కర్లేదా? నీ కళ్ళల్లో ఆర్తి, నీ మనసులో ఆనందం నీకక్కర్లేదా? ఇవన్నీ నీక్కావాలంటే ఆ ఆర్తిని, ఆ ఆనందాన్ని చేతివేళ్ళ గుండా ప్రసరింపచేయం. నీ ఈ కాగితాన్ని అందంగా తీర్చిదిద్దుకో అని మిమ్మల్ని ప్రశ్నిస్తుంది. ప్రతీ తెల్లకాగితం ఓ చిత్రకారునికి వరం. ఆ తెల్లకాగితమే మీ సంతోషం, స్ఫూర్తి, సంగీతం అన్నీను. ఒక తెల్లకాగితాన్ని చూసినప్పుడల్లా ఓ చిత్రకారుడు మననం చేసుకోవాల్సిన, గుర్తుంచుకోవాల్సిన విషయం, పొందవలసిన స్ఫూర్తి. అది గుర్తున్నంతవరకూ మీలోని చిత్రకారుడు మృత్యుంజయుడు, సృష్టికారుడు' అన్న మా మాష్టారు మాటలు నిజంగా నిజం. అందుకే, ఇప్పటికీ తెల్లకాగితాన్ని చూసినప్పుడల్లా దాని సవాలుకి నేను జవాబులిస్తూనే ఉన్నా.

బి.ఎ. చిత్రలేఖనం పూర్తయ్యింది. అమ్మా, నాన్న చాలా సంతోషించారు. నా కళ్ళల్లోని సరికొత్త రంగులతో ఈ ప్రపంచాన్నంతా నింపెయాలన్న వెయ్యి ఆశలతో కాలేజీనుండి బయట ప్రపంచంలోకి అడుగుపెట్టాను. నా చిత్రలేఖనం, నేను మద్రాస్ వీధుల్లో చాలా పస్తులున్నాం. అలా దాదాపు ఆరేడు నెలలు గడిచాయి. అప్పుడే 'పోథీస్' అనే ఓ పెద్ద షాపింగ్ మాల్ మద్రాసు టి.నగర్‌లో ప్రారంభమయ్యింది. నా బుర్రలో ఓ ఆలోచన తళుక్కుమంది. చాలా కష్టపడి ఆ షాపింగ్ మాల్ మేనేజర్‌ని ఓ ఇరవై నిమిషాలు కూర్చోబెట్టగలిగాను. ఇరవై నిమిషాల తర్వాత నా చేతిలోని కాగితం తీసుకుని నా ముఖం వైపు, ఆ కాగితం వైపు, అందులో ఉన్న అతని బొమ్మ వైపు మార్చి మార్చి చూసాడు. అప్పటికి గానీ, అతని ముఖంలో చిరునవ్వు కనిపించలేదు. అతని కళ్ళు మెరిసాయి. నాతో కరచాలనం చేసి ఆ రోజు సాయంత్రం నుంచి పనిలో చేరమని చెప్పాడు. చాలా రోజులతర్వాత మళ్ళీ నా మనసు వికసించింది. జేబులోనున్న చివరి రెండు పదిరూపాయల్లో ఒకటి తీసి ఆ గుమ్మంలో అడుక్కుంటున్న అవ్వకి వేసినందుకుగాను, ఆ అవ్వకళ్ళలో మెరిసిన సంతోషరేఖ ఇంటికి నేను వెళ్ళిన తర్వాత నా కాగితం మీద రేఖగా మారిపోయింది. ఇంతకీ నా పనేవిటంటే, ఆ షాపింగ్‌మాల్‌కి

వచ్చిన వాళ్ళలో ఎవరు కోరుకుంటే వాళ్ళకి వాళ్ళ చిత్రం గీసి ఇవ్వడం. నెలకు మూడువేల రూపాయల జీతం. చాలా సంతోషమనిపించింది. అమ్మా నాన్నలకి కొత్తబట్టలు పంపించాను.

అలా దాదాపు రెండేళ్ళు గడిచాయి. చాలా సాఫీగా జరిగిపోతున్నాయి రోజులు. ఆ రోజు దాదాపు రాత్రి తొమ్మిదవ్వడానికి ఇంకా పది నిమిషాలున్నాయి, అప్పుడు సుడిగాలిలా రెండు జళ్ళతో చుడీదార్ వేసుకున్న అమ్మాయి నా ఎదుటకి వచ్చి కూర్చుంది తన చిత్రం గియ్యమంటూ. నాకు చాలా చిరాకేసింది. ఇక, ఇంటికెళ్ళి పోవచ్చు అనుకుంటున్న సమయంలో ఈ పిల్ల ఏవిటిబాబూ అనుకుంటూ, కళ్ళు, ముక్కు, నోరు, ముఖం, చెవులు, జుట్టు అంటూ చిత్రం గీసి ఆ అమ్మాయికి ఇచ్చాను. ఆ అమ్మాయి దానివేపు చూస్తూ 'నీ పని చెప్తా' నంటూ కోపంగా వెళ్ళిపోయింది. ఆ కళ్ళల్లో ఎందుకు కోపమో ఆ రాత్రంతా ఆలోచించినా నాకు అర్థం కాలేదు.

మర్నాడు యధావిధిగా షాపుకి వెళ్ళేసరికి చాలా హడావుడిగా ఉంది. ఆ షాపు ప్రొప్రయిటర్ ఆ సాయంత్రం ఇన్‌స్పెక్షనుకి వస్తానని ఆ ఉదయమే చెప్పాట్ట. అందరూ చాలా హడావుడిగా కంగారుకంగారుగ అటూ, ఇటూ తిరుగుతున్నారు. నేను ప్రత్యేకించీ చెయ్యాల్సిన పనులుగానీ, సిద్ధం చెయ్యాల్సిన కాగితాలు గానీ లేనందున, నేను మాత్రం ప్రశాంతంగా, కూర్చున్నాను, ఎవరైనా వస్తే వాళ్ళ బొమ్మ గీయచ్చునని.

మధ్యాహ్నం తర్వాత ఒక నలభై - యాభై ఏళ్ళ వ్యక్తి నా ముందు వచ్చి కూర్చున్నాడు. సూటు వేసుకున్నాడు, టై కట్టుకున్నాడు. పైనున్న కోటు, బిగిసిపోయినట్టున్న ఆ టైని తీసెయ్యమన్నాను. అంతవరకూ నేనెప్పుడూ ఎవరితోనూ అలా చెప్పలేదు. ఆ మాటకొస్తే ఆ విధంగా ఎవరూ బట్టలషాపుకి రారు కూడాను. అతను అభ్యంతరం చెప్పాడు నా మాటలకి. 'ఇంటర్వ్యూకి వెళ్తున్నట్టు అవెందుకు, తీసెయ్యండి' అని మళ్ళీ నేనన్న తర్వాత అతనికి వీటిని తియ్యక తప్పిందికాదు. నేను గియ్యడం ప్రారంభించాను.

ఎందుకో షాపులో ఉన్నట్టుండి కలకలం ఎక్కువయిందనిపించింది నాకు. ఆ ప్రొప్రయిటరు వచ్చినట్టున్నాడని అనుకుంటూ నేను పనిలో నిమగ్నమయ్యాను. పదినిమిషాల తర్వాత అతనికి ఆ కాగితం ఇచ్చాను. అప్పటివరకూ చాలా ప్రశాంతంగా ఉన్న అతని మొఖం, అతని బొమ్మ చూసిన వెంటనే కోపాన్ని సూచిస్తూ, కనుబొమ్మలు ముడుచుకున్నాయి. అప్పుడే ఆ అమ్మాయి, నిన్నటి అమ్మాయి తుఫానులా వచ్చింది. 'చూసావా నాన్నా, నేను చెప్పలేదూ, ఇతను ఇంతపని చేస్తాడని. చూడు, చూడు, నా కళ్ళకిందనున్న కనిపించీ కనిపించని నా నల్లచారల్ని కూడా అలానే, అచ్చంగా ఎలా గీసేసాడో. ఈ షాపు నీది. అయినా నువ్వంటే ఏ మాత్రం భయం లేకుండా, నిన్ను టై, కోటు తీసెయ్యమనడమే కాకుండా చిన్నవేకదా అని క్షమించకుండా నా చారల్ని కూడా గీసేస్తాడా?' అంటూ ఒకటే విసుగులు, చికాకులు, కోపాలు. నాకు ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఏవీ తోచలేదు. కనీసం క్షమించండన్న మాట కూడా నా నోటమ్మట రాలేదు. అలా బిత్తరపోయి నించుండిపోయాను. అతను కూడా కోపంగా చూస్తూ, నా చెయ్యి పట్టుకుని బిరబిరలాక్కుని వెళ్ళిపోయాడు. అక్కడ్నుంచి నన్ను తన ఇంటికి తీసుకెళ్ళాడు. ఏం చేస్తాడో ఏమోనని బిగ్రబిగుసుకుపోయిన నాకు, నన్ను అతని ఇంటికి తీసుకెళ్ళడం చాలా ఆశ్చర్యమనిపించింది. సోఫాలో కూర్చోమని, లోపలికి వెళ్ళి ఓ ఐదు నిమిషాల తర్వాత ఓ చిన్న ఫోటో అని చెప్పాడు. ఆ ఫోటోలో వాళ్ళు తన చిన్నప్పుడే కాలం చేసారని వాళ్ళని ఒక ఆరడుగుల కాన్వాస్ మీద చిత్రీకరించమని ఆదేశించాడు. ఎప్పటికీ పాడవ్వని విధంగా గియ్యమని అర్థించాడు. గీయడానికి తగిన సౌకర్యాలన్నీ కల్పించాడు. దాదాపు ఒక నెల పట్టింది. అది పూర్తిచెయ్యడానికి. చాలా బాగా వచ్చింది. అతను, వాళ్ళ అమ్మాయి అదే మాటన్నారు. అంతే. ఇక చెప్పడానికి, అనుకోడానికి ఏవీలేదు నా జీవితంలో.

***

ఏవిటి మధ్యలో ఆపేస్తున్నాననుకుంటున్నారా. ఏవీలేదు చెప్పడానికి అంటే చెప్పుకోదగ్గ కష్టాలు లేనప్పుడు చెప్పడానికి ఏదీ ఉండదని నా ఉద్దేశ్యం అతను వాళ్ళ అమ్మాయినిచ్చి నాకు పెళ్ళిచేసారు. మావగారు కదా 'చేసాడు' అంటే బాగుండదని ఒకవైపు వ్యాపారం, ఇంకోవైపు నా చిత్రలేఖనం అంతర్లీనంగా పెళ్ళి, భార్య, పిల్లలు, సంసారం– గడిచిపోయింది జీవితం. మనసు

స్పందించినప్పుడల్లా ప్రతిస్పందనగా ఓ చిత్రం, భావం కల్లోలపరిచినప్పుడల్లా ప్రతిభావంగా ఓ చిత్రం, ప్రతీ పరిచయానికి స్వాగతంగా ఓ చిత్రం, ప్రతీ వీడ్కోలుకి ముక్తాయింపుగా ఓ చిత్రం. జీవితమనే ఈ విచిత్ర చిత్రంలో కాలక్రమంలో అమ్మానాన్నల చిత్రం కూడా ముగిసింది నాలోని కన్నీటి చుక్కై. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు, వాళ్ళకి పెళ్ళిళ్ళు, మనుమలు, మనవరాళ్ళు, ఇందరూ, ఏవీ చెయ్యలేక పోయారు నా గీత నా నుండి వేరుపడిపోతుంటే. దాదాపు సంవత్సరం నుండి నా గీత ఆరోగ్యం బాగోలేదు. గీత ఎవరో చెప్పనేలేదు కదూ గీత నా భార్య. నేను, నా చిత్రలేఖనం, నా చిత్రలేఖనం అందులోని గీత ఎంత నిజమో, నేను నా గీతకూడా ఒక్కటే. ఇద్దరం వేరు అన్న భావం ఎప్పుడూ కలగలేదు మా ఇద్దరికీ. అటువంటి గీత సరిగ్గా పన్నెండురోజుల ముందు నన్ను విడిచి వెళ్ళిపోయింది. ఈ పన్నెండురోజులు నేనెలా ఉన్నానో, ఎందుకున్నానో నాకే అర్థంకాలేదు. ఎవరికీ చెప్పకుండా ఈ రోజు ఇలా స్టేషనుకి వచ్చేసాను. వచ్చి నా వేళ్ళు సృష్టించిన ఈ చిత్రం తర్వాత తెలిసింది నాకు.. అమ్మానాన్నల చిత్రం, ఆ రోజు నేను మద్రాసుకు బయలుదేరుతున్నప్పటి ఆ దృశ్యం ఎందుకు ఇప్పుడు నా మనసు గీసిందో ఇప్పటికి అర్థమయ్యింది. ఒకరికొకరున్నామనే ఆ సంతృప్తి, ఇద్దరి కళ్ళలోని ఆ వెలుగు ఇప్పుడు మనసుకి తెలుస్తుంది నా గీత నన్ను విడిచివెళ్ళిన ఈ సందర్భంలో ఆ తోడు, ఆ ప్రేమ నన్ను కుదిపింది. అందుకే ఈ ‘చిత్రం ఆ ప్రేమ గుర్తొచ్చే ఆ తృప్తి చాలు ఈ జీవితానికి. చాలనుకుంటూ కళ్ళు విప్పార్చుకుంటూ చుట్టూ చూసాను. ఎదురుగా, దూరం కాని కాస్త దగ్గర్లో ఒక పన్నెండేళ్ళ కుర్రాడు నా వైపే చూస్తున్నాడు. తలదించుతున్నాడు. మళ్ళీ పైకెత్తుతున్నాడు. అతని కుడిచెయ్యి కదలడం గమనించాను. మాయమైన అతని ముఖం మీద చిరునవ్వు మళ్ళీ ప్రత్యక్షమయ్యింది. అదెప్పటికీ అలానే విరబూస్తునే ఉంటుంది. మృగ్యమవ్వడం. ఎందుకంటే ఇక్కడ అస్తమించిన నేను ఆ పన్నెండేళ్ళ కుర్రాడి కాగితం మీద ఉదయించాను చిత్రమై.

ప్రేమమయమైన చిత్రం, చిత్రమైన ప్రేమ.
స్పందించే హృదయం, సృష్టించే చెయ్యి ఉన్నంతకాలం
ఈ రెండూ అంతులేని విశ్వం, అజరామరం,
ఆనందసాగరం. ప్రేమ, చిత్రం - ప్రేమచిత్రం. !!




# వరదగూడు

బడుగు రవి కుమార్

### శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
### వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
### 20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
### 'నా మొట్టమొదటి కథ' విభాగం విజేత

**నెమ్మదిగా కళ్ళు తెరిచా.** చుట్టూ చీకటి. ఎక్కడున్నానో ఓ క్షణం అర్థంకాలేదు. మంచానికి బదులు చేతికి ఇసుక తగులుతోంది. కాస్త దూరంలో కెరటాల శబ్దం. బీచ్ అనుకుంటా. ఇక్కడికెలా వచ్చాను?

దిగ్గున లేచికూర్చున్నా. ఎక్కడా జనం అలికిడి లేదు. నగ్నంగా నేనొక్కడినే ఇసుకలో. ఎదురుగా మసగ్గా సముద్రం చేతికి అందేంత దూరంలో బట్టలు. నావే అనుకుంటా! తలవెనక్కి తిప్పి చూస్తే చీకటి మరింత చిక్కగా ఉంది. చెట్లు, పొదల ఆకారాలతో అల్లుకుపోయింది. ఎందుకో భయం అనిపించి లేవాలనిపించలేదు. అలాగే పడుకున్నా. మళ్ళీ ప్రశ్న. 'ఎక్కడున్నానబ్బా?'

చల్లటిగాలిని ఆస్వాదిస్తు కాసేపు ప్రశ్నని పక్కనపెట్టా. తెల్లారితే తెలుస్తుందిగా.!

సమయం గడిచేకొద్దీ సముద్రంపై వెలుగు చీకటి తెర లేపుతూ. ఇప్పుడు పరిసరాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. నాకు కుడివైపునే కొంచెం దూరంలో పెద్ద కొండ. వెనుకంతా అడవి. ఎక్కడా మనిషి జాడ మాత్రం లేదు. ఎందుకో బట్టలు వేసుకోవాలనిపించలేదు. ఇంతలో ఎదురుగా దిగంతాలను కలిపేచోట ఇనబింబం. సూర్యుడ్ని తొలిసారి చూసినట్టనిపించింది. ఇసుకని దులుపుకుని లేచి నిలబడ్డా. వావ్.. సన్‌బాత్.!

పరిస్థితి ప్రశాంతంగా ఉన్నా. నాలో ప్రశ్నలు. ఎంత ఆలోచించినా ఇక్కడికెలా వచ్చానన్నది అంతుచిక్కడంలేదు. అసలెక్కడున్నానో కూడా అర్థంకావడం లేదు.

సూర్యరశ్మిలో చాలాసేపు తడిశాక బట్టలు తొడుక్కున్నా. ఇంతలో కొండ దగ్గరగా ఎవరో మనిషి. వేగంగా నడుస్తూ అటెళ్ళా. ఎవరో అమ్మాయి. చేతిలో చిన్నబుట్ట. అప్పుడే తను నన్ను చూసింది వింతమనిషిలా. నా వెనుకకీ, చుట్టుపక్కలకీ అదేపనిగా చూస్తూ ఇంకెవరూ లేరని నిర్ధారించుకున్నట్టుంది. తనూ నా వైపు కొచ్చింది. దగ్గరికెళ్ళి ఇదే ఊరని అడుగుదామనుకున్నా. ఆ పిల్లే మొదలుపెట్టింది. ఎవరు నువ్వు. ఎప్పుడూ చూడలేదే ఏ ఊరు.?

ఏం చెప్పాలో గుర్తురాక అయోమయంగా నిలుచున్నా. 'ఎవరు నేను.?'

నన్ను నేను ప్రశ్నించుకుంటుంటే ఆ పిల్లే మళ్ళీ 'ఓయ్ నిన్నే. ' అంది.

ఇప్పుడు తను నాకు మరింత దగ్గరగా వచ్చింది. ఎక్కడో చూసినట్టుందా అమ్మాయిని.

మాటలు కూడదీసుకుని 'ఏ ఊరిది? ' అనడిగా.

సమాధానం చెప్పకుండానే 'నీదే ఊరో చెప్పు. ' అంటూ కళ్ళెగరేసిందా పిల్ల.

మౌనీ గుర్తొచ్చింది. ఆ కళ్ళు, ముక్కు అన్నీ. తను మౌనీలాగే ఉంది. ఇది మా ఊరేమో అనిపించింది. అయినా మా ఊళ్ళో సముద్రంలేదుగా.

'నిన్నే ఏ ఊరని అడిగితే అలా పిచ్చోడిలా చూస్తావేంటి? '

'.........' ఏదో అడిగా.

'ఓ.. మెయిన్‌రోడ్డు కెళ్ళాలా? '

తల అడ్డంగా ఊపబోయి మళ్ళీ నిలువుగా ఊపా. అవునన్నట్టు.

'ఇందా ఈ బుట్టపట్టుకుని నాతో రా!' తీవిగా నడుచుకుంటూ వెళ్తోంది.

బుట్ట తీసుకుని తనవెంటే వెళ్ళా. ఎండ కొద్దికొద్దిగా పెరుగుతోంది. నేనిందాక పడుకున్న చోటుని దాటి వెళ్ళాం. అక్కడో వాగు ఉంది. అది సముద్రంలో కలిసే చోట భలే ఉంది. బుట్ట భుజానేసుకుని అలాగే చూస్తుంటే. ఎవరో నన్నే చూస్తున్నట్టనిపించింది. తిరిగి చూస్తే నడుంపై రెండు చేతులు పెట్టుకుని ఆ పిల్ల. ఏమిటన్నట్టు చూశా. అదోలా చూస్తూ బుట్ట తీసుకుంది. అందులోంచి దారంలాంటిది తీసుకుంది. వాగు పక్కనే ఉన్న సన్నటి పొడవాటి కర్రకి దారం కట్టింది. అప్పుడర్థమైంది అది గేలం. ఏటి నిండా చేపలే. పైకే కనిపిస్తున్నాయి. గేలానికి ఎరని కట్టి విసిరింది. అప్పుడే నా కడుపులోకి ఆకలి, నోట్లోకి నీళ్ళూ వచ్చాయి. కాసేపటికల్లా ఓ మోస్తరు సైజు చేపలు నాలుగుపడ్డాయి. ఇక చాలన్నట్టు గేలం పక్కనపెట్టి బుట్టలోంచి ఇనుపముళ్ళున్న చెక్కముక్క తీసింది. ఒక్కో చేప పొలుసుల్నీ, ప్రేవుల్నీ తీసి శుభ్రం చేస్తుంటే వాటిని వాగులో శుభ్రంగా కడిగేశా. బుట్టలోంచి కారం, ఉప్పు ఇంకా ఏవేవో చేపలకి కలుపుతూ నా వైపు చూసింది. ఉమెన్ ఆన్ టాప్‌లో పెన్‌లోప్ క్రజ్‌లా. ఓ క్షణం తనని అలాగే చూసి చుట్టుపక్కల చితుకుల్ని ఏరి క్షణాల్లో మంట రెడీ చేశా. మంటకి అటూ ఇటూ రెండు పంగకొయ్యల్ని పాతింది తను. రెండు ఇనుపచువ్వల్ని చేపల్లో కూరి పంగకొయ్యలపై పెట్టింది. కాసేపటికల్లా టిఫిన్ రెడీ. పక్కనున్న పొదలోంచి రెండు పెద్ద పెద్ద ఆకులు తెంచి వాటిలో చేపల్ని సర్ది నాకోటి అందించింది. చేతితో చేపముక్కని తుంచబోతుంటే 'ఇదిగో' అంటూ నల్లతుమ్మ ముల్లుని చేపకి గుచ్చింది. తనూ ఓ ముల్లుతో ముక్కల్ని గుచ్చుకుని తింటూ నావైపు చూసి నవ్వింది. ఆ కళ్ళలో నన్ను నేను చూసుకుంటుంటే నార్సిసస్ గుర్తొచ్చాడు.

'నార్సిసస్.. పెన్‌లోప్‌క్రజ్.. మౌనీ ఎంత గుర్తుతెచ్చుకుందామనుకున్నా ఇంకెవరూ గుర్తురారే..!' రెండే నిమిషాల్లో రెండు చేపలూ తినేశా. ఇంకో రెండురోజులు తిండిలేకున్నా ఫర్వాలేఅనిపించేంత శక్తి వచ్చినట్టుంది. తినడం పూర్తిచేసి ఇందాక చూసిన వాగూ, సముద్రం కలిసే చోటికి బైల్దేరా.

'మెయిన్ రోడ్డుకి దారడిగావుగా? '

తనవైపు ఓ క్షణం చూసి నా మట్టుకి నేను నడుచుకుంటూ వెళ్ళా. సంగమాన్ని చూస్తూ కూర్చుంటే కాసేపటికి తనూ వచ్చి పక్కన కూర్చుంది.

'నీ పేరేంటి? ' కాసేపాగి అడిగా.

'మౌనీ..' అని పిలిచా.

వింతగా తను 'ఊ..' అని పలికింది.

మధ్యాహ్నమైనా మబ్బులు పట్టడంతో ఎండగా లేదు. అక్కడే చాలాసేపు కూర్చున్నాక 'ఓయ్ ఇంక పద' అంటూ మౌనీ లేచింది. తన వెంటే నేను కూడా. కొద్దిసేపు నడిచాక ఇద్దరం కలుసుకున్న చోటికి వచ్చాం.

ఎక్కడికి వెళ్తున్నామో అర్థంకాక అదే విషయం ఆ పిల్లనడిగా. చెయ్యెత్తి అడవి వైపు చూపించింది. ఇంతకుముందు సరిగా చూడలేదు కానీ కొండకి పక్కనే, అడవిలా ఉన్నచోట ఓ గుడిసె కనిపించింది ఇద్దరం అక్కడికి చేరుకున్నాక 'ఇదే మా ఊరు' అంది. గుడిసె వెనుకవైపు కొన్ని ఇళ్ళు, మరికొన్ని మొండిగోడలు కనిపించాయి. అన్నీ అడవిలో కలిసిపోయినట్టున్నాయి.

ఇళ్ళలో ఏ ఒక్కదాంట్లోనూ మనుషులున్నటు అనిపించలేదు.

గుడిసె లోపలికెళ్ళా. ఒక్కటే గది. ఒంటరిగా ఉంటోందని చూస్తేనే తెలుస్తోంది. బైటకొచ్చి అక్కడున్న నులకమంచం వాల్చుకుని కూర్చున్నా. తను లోపల ఏదో పనిచేసుకుంటోంది. దూరంగా సముద్రఘోష ఇక్కడివరకూ వినిపిస్తోంది. పక్కనే ఉన్న కొండ. ఏదో రహస్యాన్ని తనలో దాచుకున్నట్టు నిలుచుని ఉంది.

'ఏం చూస్తున్నావు? ' ఎప్పుడొచ్చిందో గానీ, బైటనేలమీద కూర్చుంటూ అడిగింది. సమాధానం చెప్పకుండా కొండవైపు చూపించా.

'ఏముందక్కడ?' అంటూ నవ్వింది.

'కొండవతల ఏముంది? '

'ప్చ్.. ఏమో, నాకూ తెలియదు. ఎప్పుడూ పోలేదు. ' అని ఆగి బాగా దగ్గరగా వచ్చింది. నేనూ కాస్త ఒంగాను.

'కొండపైకి వెళ్ళకూడదని చిన్నప్పుడు మా అమ్మ చెప్పింది? ' కళ్ళలో కళ్ళు పెట్టి ఏదో రహస్యంలా మాట్లాడింది.

'ఏ...ఎందుకూ?' నేనూ తనని అనుకరిస్తూ అడిగా.

కింది పెదవి మరింత కిందకు సాగదీసి, భుజాలు దగ్గరగా లాగి ఎగరేస్తూ ఏమో అన్నట్టు సైగచేసింది.

మళ్ళీ కొండవైపే పరిశీలనగా చూశా. కొండ దిగువన చుట్టూ ఏదో కంచెలా ఉంది. దానికి అక్కడక్కడా కాషాయం, ఆకుపచ్చ, తెలుపు, ఎరుపు రంగుల్లో విడివిడిగా జెండాలున్నాయి.

మౌనీతో మాట్లాడుతుండగానే బైట క్రమంగా వెలుగు తగ్గింది. చీకటిపడ్డంతో దీపం వెలిగించింది తను. రెండు మూడురకాల గింజలతో ఏదో కూరచేసింది. దాని పేరు అడుగుదామనుకున్నాగానీ ఆకలి హడావుడిలో మర్చిపోయా. తిని నులకమంచంపై పడుకుంటే, చల్లటిగాలికి ఎప్పుడు నిద్రపోయానో కూడా తెలియలేదు.

కాస్త మసకలోనే మెలుకువొచ్చింది. చూస్తే మౌనీ ఇంకా పడుకునే ఉంది గువ్వలా కాళ్ళు ముడుచుకుని. చప్పుడు చేయకుండా లేచి. సముద్రం వైపు నడుచుకుని వెళ్ళా. వెలుగు నిండా పరుచుకునే వరకూ అక్కడక్కడా తిరిగి తిరిగొచ్చా. అప్పటికి తను రెడీగా ఉంది బుట్టతో. 'ఎక్కడికి? ' అని అడగ్గానే, నా చేతికి బుట్టనిచ్చింది. తను నడవబోతుంటే కొండపైకి వెళ్దామన్నాను. 'అమ్మో.. వద్దు' అంది.

'ఏం.. భయమా? ' తనని ఉడికించాను.

'భయమా..? నాకా..? ఇన్నాళ్ళూ ఎందుకులే అని ఊరుకున్నా. నాగ్గానీ తిక్కరేగితే' అంటూ విసురుగా కొండవైపు నడిచింది.

ఇద్దరం పోటీలుపడి కొండెక్కాం. మధ్యలో రకరకాల అడవికాయలు కోసుకుని తిన్నాం. కొండ అంచుకు చేరగానే ఒక్కసారిగా మతిపోయినట్టనిపించింది. అవతలి వైపు దూరంగా ఒక మహాపర్వతం. కొండపైనుంచి దాని శిఖరం చూడడానికే మేం తలలు పూర్తిగా పైకెత్తాల్సి వచ్చింది. అంతపెద్ద పర్వతం పైనుంచి ఓ జలపాతం నేలపైకి దూకుతోంది. మామూలు జలపాతాల్లా సన్నటి పాయలా లేదది. పెద్ద నదిలా పైనుంచి కిందకు పడుతోంది. అది నేలను తాకినచోట చాలా పెద్ద సరస్సు ఉంది. అక్కడి నుంచి ఆ నీళ్ళన్నీ పారుతూ

సముద్రంలో కలుస్తున్నాయి. ఇక అక్కడిచెట్లు మేమెక్కి వచ్చినంత కొండల్లా ఉన్నాయి. వాటి కొమ్మలు నదులపై కట్టే వంతెనల్లా విస్తరించి ఉన్నాయి. ఇదంతా చూస్తూ ఇద్దరం మాటలు మర్చిపోయాం. కిందకు ఎంతవేగంగా దిగామో తెలియలేదు.

నేను నడుస్తుంటే మౌనీ జలపాతం దగ్గరకు పరుగుతీసింది. అక్కడికి చేరగానే ఒంటిపై ఉన్న బట్టల్ని తీసేసి ఒక్కసారిగా సరస్సులోకి దూకింది. నీళ్ళలో దిగాలనిపించింది కానీ. మౌనీని చుస్తూ ఉండిపోయా. సరస్సులో అడుగున రాళ్ళు కూడా కనిపించేంత స్పష్టంగా కనిపించడంలేదు. ఒక్క మౌనీ తప్ప. నన్ను చూసి అక్కడే నిల్చుండిపోయింది. తనని చూస్తుంటే రెండు కళ్ళకి ఒద్దిక చెడింది. నడుము దగ్గరకొచ్చేసరికి మాత్రం రెండూ ఒక్కటయ్యాయి. ఎక్కడని వెతకను నడుముని. నాభిలో అది ఇరుక్కుపోయింది. కృష్ణబిలంలా శరీరం మొత్తాన్ని తనలోకి లాక్కుంటున్నట్టనిపించింది. నన్ను కూడా.! దగ్గరకెళ్ళా. తనలో ఏమాత్రం బెరుకులేదు. నాకళ్ళలో కళ్ళు పెట్టిచూసింది. తనని పట్టుకుబోయేంతలో చిరునవ్వు నవ్వుతూ నన్ను నీళ్ళలోకి నెట్టి అలాగే సముద్రంవైపు ఇసుకలోకి పరిగెత్తింది. కాసేపట్లో స్నానం ముగించి నేనూ అటెళ్ళా. ఇసుకలో కూర్చుని ఉంది మౌనీ. నేనూ వెళ్ళి పక్కన కూర్చున్నా. నా ముఖంలో ముఖం పెట్టి ముద్దిచ్చింది. కాసేపటి తర్వాత ఇసుకపై వింతలిపి రాస్తూ శరీరాలు మాట్లాడుకుంటున్నాయి.

ఇద్దరం అలసిపోయి ఇసుకలో అలాగే పడుకుండిపోయాం. కాసేపటికి మబ్బులు పట్టి సన్నటి జల్లు మొదలైంది. దూరంగా దిగంతాలకు వంతెనలా వరదగూడు కట్టింది. మాటల్లో వర్ణించలేనంత అందం సముద్రంపై పరుచుకుంది. చిరుజల్లుల్లో తడుస్తూ అలాగే పడుకుండిపోయాం. చాలాసేపటి తర్వాత ఇద్దరం లేచి అక్కడ్నించి బైల్దేరాం. ఏడురంగుల్ని చూస్తూ, చేయీ చేయీ కలిపికొండెక్కాం. దారిపొడుగునా వెనక్కి తిరిగి ఆ మహాపర్వతాన్ని, జలపాతాన్ని, సరస్సునీ, ఇంతసేపు మేమున్న చోటునీ చూస్తూ ఉన్నాం.

కొండ దిగుతూ ఉండగా వాన పెరిగింది. ఒక్కసారిగా పెనుగాలి మొదలైంది. ప్రళయం వచ్చినట్టు చెట్లు ఊగిపోతున్నాయి. దూరంగా వరదగూడు కరిగిపోయింది. చూస్తుండగానే గాలివేగం, వర్షం జోరు మహోధ్రుతంగా పెరిగింది. చిన్న చిన్న చెట్లు కూకటివేళ్ళతో సహా ఎగిరిపోతున్నాయి. ఇద్దరం ఎంత జాగ్రత్తగా నడుద్దామన్నా కుదరడంలేదు. ఒకర్నొకరం పట్టుకుని చిన్నగా పాక్కుంటూ కొండ దిగుతున్నాం. ఇంతలో ఓ బలమైన జల్లు ఇద్దర్నీ ఉక్కిరిబిక్కిరి చేసింది. కళ్ళు మూసి తెరిచేంతలో ఇద్దరం విడిపోయాం. ఆ వేగంలో కొండవాలులోకి కొట్టుకుపోయింది మౌనీ. తన చేయి అందుకునేందుకు చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. కళ్ళముందే ఆ చెట్ల మధ్యనుంచి కిందకి జారిపోయింది. మరుక్షణంలోనే మంత్రం వేసినట్టు గాలీ, వాన ఆగిపోయాయి. వేగంగా కొండదిగాను. దారంతా తను కనిపిస్తుందేమో అని చూశా. ఎంత వెదికినా తనజాడకనబడలేదు. కన్నీళ్ళు ఉబికి వస్తుంటే ఏం చేయాలో అర్థంకాక చాలాసేపు నిలుచుండిపోయా. కాసేపటికి కొండచుట్టూ ఉన్న కంచెపై నా దృష్టిపడింది. కోపంతో ఊగిపోతూ కంచెని ధ్వంసం చేశా. రంగురంగుల జెండాలన్నింటినీ పీకి పారేశా. అప్పటికీ బాధ చల్లారడం లేదు. గుడిసె దగ్గరికి వెళ్దామనుకునేంతలో ఎక్కడో ఆనకట్ట తెగినట్టు వరద ముంచుకొచ్చింది. ఈ కొండ అంచునుంచి అటువైపున్న వాగు వరకు ఉంది ప్రవాహం. అక్కడే ఉన్న పెద్ద బండరాయి పైకెక్కి పడుకున్నా. పదే పదే గుర్తొస్తున్న మౌనీని తల్చుకుంటూ అలాగే ఉండిపోయా.

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి ఆకాశాన్ని నరుక్కుంటూ వస్తున్నాడు సూర్యుడు. వరదలేదిప్పుడు. ఊరుకూడా. విషాదం ముగిసిపోయినట్టు. శ్మశానాన్ని నిశ్శబ్దం పరుచుకుంది. ఒక్కడ్నే మిగిలిపోయా. అక్కడ నిలబడలేక సముద్రం దగ్గరకి నడిచా. అలా నీళ్ళలోకి నడుచుకుంటూ వెళ్తుంటే నోరూ, ముక్కూ, కళ్ళూ, చెవులూ అన్నింటిలోకి నీరు దూరుతోంది. ఈత మర్చిపోయి, ఊపిరందక కొట్టుకుంటున్నా.

'మళ్ళీ జన్మిస్తానా.. తనని కలుస్తానా.?'

కలవరిస్తూ కళ్ళు నెమ్మదిగా తెరిచా. కల ధ్వంసమైంది. గదినిండా ఒకటే పొగ. రాత్రి చల్లటిగాలి కోసం తెరిచిన కిటికీలోంచి వస్తున్న పొగ గదినిండా కమ్మేసింది. ఊపిరాడనంత పొగ. లేచి లైట్ వేసి కిటికీ దగ్గరకొచ్చి చూశా. ఎవరో చెత్తకి నిప్పంటించి

వెళ్ళిపోయారు. కిటికీ మూసి ఫ్యాన్ ఆఫ్ చేసి బెడ్‌పై కూర్చున్నా. టేబుల్‌పై రాతి సగం తిని వదిలేసిన మెక్ ఎగ్ కోసం రెండు ఈగలు, కొన్ని దోమలు కొట్టుకుంటున్నాయి.

ఒకటే ఉక్కపోత. జ్ఞాపకాల కలబోతలా!

బాత్రూమ్‌లో కెళ్ళి షార్ట్ తీసేసి షవర్ ఆన్ చేశా. తలపై నుంచి జారుతున్న నీళ్ళలో కంటిధార కలిసిపోయింది. ఏడుపుని షవర్ కింద దాచుకోవడం అలవాటైపోయింది.

బాధ తగ్గిందనిపించాక షవర్ ఆఫ్ చేసి బైటకొచ్చా. గదిలో పొగ పూర్తిగా మాయమైంది. ఫ్యాన్ వేసుకుని అలాగే బెడ్‌పై వాలిపోయా.

నిద్రొస్తుందా?

'ఏమో నాలో సగం లేదు.. మరో సగం జీవచ్ఛవం.'

కళ్ళుమూసుకున్నా. మళ్ళీ కలొస్తే బాగుండు.!




# ఎక్కవలసిన రైలు

బాలమురళికృష్ణ గోపరాజు

శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగం లో
ప్రశంసా పత్రం పొందిన కథ

ఆమెను చూస్తే మీ పక్క వాటా లోనో బస్టాప్ లోనో చూసామనిపిస్తుంది. ఒకసారి చూస్తే మళ్ళీ ఇంకో సారి చూడాలనిపించే లాగా అనిపిస్తుంది. బస్సు వేగానికి పైట ఎగురుతూ విలాసంగా కిటికీ లో నుండి బయటకు చూస్తోంది ఆమె. ఆమె పేరు బహుశా జయశ్రీ కావచ్చునేమో అని నా అనుమానం. కావచ్చు ఏమిటి, ఆమె కచ్చితంగా జయశ్రీనే.

*** ***

అప్పట్లో ఆమెని చూడాలని, పొద్దున్నే లేచి రాత్రి మిగిలిన కాస్త చద్దన్నంలో ఆవకాయ కలుపుకుని నాలుగు ముద్దలు ఆదరా బాదరా మింగేసి, ఆమె ఎప్పుడూ ఎక్కే బెల్లావిస్టా బస్టాప్ కన్నా ఒక ముందు స్టాప్ దగ్గర బస్సు ఎక్కి ఒక మంచి సీట్లో సెటిల్ అయిపోయి నెక్స్ట్ స్టాప్ లో తను తన స్నేహితులతో బస్ ఎక్కి స్నేహితులతో మాట్లాడుతూ ఉన్నప్పుడు, ఇంజనీరింగ్ కాలేజ్ పుస్తకం ఏదో చదువుతున్నట్టు నటిస్తూ ఆమెనే చూస్తూ గడిపేసే వాడిని. అప్పట్లో ఆడ పిల్లలకి బస్సులో మొదటి మూడు వరసలు సీట్లు కేటాయించే వారు. ఆ నాలుగో వరస సీటు కోసం భలే పోటీ పడేవాళ్ళం. తనని నేను గమనిస్తున్నానని తెలిసినా ఒక చూపు ఇలా మధ్య మధ్యలో విసిరేస్తూ మళ్ళీ ఏమీ తెలియనట్లు ఆంధ్ర మహిళా సభ దగ్గర దిగిపోయేది. ఎప్పుడూ నవ్వుతూ ఉండే పెదవులు నన్ను చూసి నవ్వుతోందో మరి ఎవరిని చూసి నవ్వుతోందో తెలిసేది కాదు. అంచాత పలకరించాలంటే మళ్ళీ బెరుకు.

నేను ఇంజనీరింగ్ కాలేజీ మూడో సంవత్సరంలో ఉండగా ఖైరతాబాద్ దగ్గర, ఆనంద నగర్ కాలనీలో ఉండే వాళ్ళం. నిజానికి మా పక్క వాటాలోనే ఉండే వాళ్ళు. అప్పుడప్పుడు ముఖ్యంగా శని ఆది వారాల్లో మా ఇంటికి పొద్దున్నే వొచ్చి అమ్మతో మాట్లాడి పూజకి పారిజాతం

పూలు కోసుకుని వెళ్ళేది. పూలు కోస్తూన్నప్పుడు నేను కిటికీ వారగా నిలబడి చూస్తున్నట్లు తనకి తెలుసో ఏమోనని నా అనుమానం కూడా. మా ఇంట్లో అందరి తోనూ బాగా కలివిడిగా ఉండేది, ఒక్క నాతో తప్ప. అప్పుడప్పుడూ అమ్మా మా ఇంట్లోనే ఉన్న కొబ్బరి చెట్టు బోండాలు దిమ్పించినప్పుడు, జయశ్రీని పిలిచి కొబ్బరి బొండాం ఒకటి, మా నాన్న గారు స్వయంగా వేసి పెంచిన సంపంగి పూలు కొన్ని తన వొళ్ళో పోసి పంపేది. మా అమ్మా వాళ్లకి తనని చూసినప్పుడల్లా ఎదో ఆశ, ఇటువంటి అమ్మాయి మన కోడలవుతే బావుంటుంది కదండీ అని అమ్మ నాన్న గారితో అంటున్నపుడు నేను విన్నట్లు నా అనుమానం కూడా.

జయశ్రీ మా పక్క వాటాలో ఉన్నన్నాళ్ళూ పలకరించాలంటే కొంచెం బెరుకుగా భయంగా ఉండేది. పొద్దున్నే ఉరుకులూ పరుగులతో బస్ స్టాండ్ లో నుంచుని, పక్కనే ఉన్న చిల్లరకొట్టు లైబ్రరీలో ఇంగ్లీషు పుస్తకాలు అద్దెకు తీసుకుని, రెండు రోజులకొకసారి వెనక్కి తెస్తూ ఉండేది. ఏవో పుస్తకాలు, నిక్ **కార్టర్**, అలిస్టేర్ మెక్లీన్, లియాన్ యూరిస్, ఆర్థర్ హేలీ అలాటివి. ఎప్పుడైనా ఆమె, అంటే జయశ్రీ... ఇంగ్లీషు వదిలి పక్కవాళ్ళతో తెలుగులోనే మాట్లాడేది. నేనేమో తనకోసమని ఇంగ్లీష్ పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవటానికి ప్రయత్నించే వాడిని. ఆ విధంగానేనా పుస్తకాలు ఎక్స్చేంజి చేసుకునే ప్రయత్నం చేసుకోవచ్చు కదా, అప్పుడు మాట్లాడే అవకాసం వస్తుందేమోనని ఆశ.

జయశ్రీతో ఎలాగో ఒకలాగా మాట్లాడాలని ఎన్నో బ్రిలియంట్ ఉపాయాలు కూడా ట్రై చేసే వాడిని. ఒక సారి మా నాన్నగారి పాడై పోయిన పాత కీ ఇచ్చే westend చేతి గడియారం (నా స్వంత పాకెట్ మనీతో) బాగు చేయించుకుని, ఆమె బస్టాండ్లో ఒక్కతే ఉన్నప్పుడు, ఆ వాచి చేతిలో పట్టుకుని, అప్పుడే ఆగిపోయినట్లు నటిస్తూ, కీ ఇస్తూ, ఆమెని "నా గడియారం ఆగి పోయిందండీ, మీ వాచీలో టైం ఎంత" అని అడుగుదామని ప్లాన్ కూడా వేసే వాడిని. ధైర్యం చిక్క బట్టుకుని గొంతు దాక వచ్చిన మాట, ఈ లోపున ఎవరో వచ్చేసేసరికి, ఆ ప్లాన్ ఎన్ని సార్లు వాయిదా పడిందో చెప్పలేను.

ఒక రోజు బస్లో ఎక్కువమంది లేరు. ముందు వరసలో జయశ్రీ తన స్నేహితులు మరి ఇద్దరు మాట్లాడుకుంటున్నారు. జయశ్రీ అంటోంది " ఈ రోజు ఎన్టీ ఆర్ సినిమా కాని శోభన్ బాబు సినిమా కాని రిలీజ్ కాలేదు, ఓ పని జేస్తే? సుదర్శన్ లో ఏఎన్నార్ వాణిశ్రీ సినిమా దొరబాబు నడుస్తోంది, మధ్యాహ్నం క్లాసు బంకు కొట్టి వెళ్తే?" అడుగుతోంది, పక్కనే ఉన్న ఆమె స్నేహితురాలు మాధవి అనుకుంటాను, "కాదే, వెంకటేశా లో హీరో కృష్ణ సినిమా ఉంది, వెళ్దాం" అన్నట్టుంది. జయశ్రీ ఆముదం తాగిన ముఖం పెట్టుకుని, "అబ్బా నాకు రెండోసారి చూడాలని లేదే, నిన్ననే ఆదివారమని తమ్ముడినీ చెల్లెలినీ తీసుకెళ్ళాను, నువ్వు రాక పొతే నేను ఒక్క దాన్నే పోలేనా ఏమిటి?" అని

మాట్లాడుతూ మట్లాడుతూ ఓరకంట తిరిగి చూస్తోంది, ఎవరైనా వింటున్నారా అని. ఇది నాకు ఒక రకమైన హింట్ ఏమో నని కూడా నా అనుమానం. అయినా ఆ పని చేస్తే నన్ను రౌడీ పిల్లలల్లో జమ కట్టేస్తుందేమో నని ఆ ప్రయత్నం విరమించుకున్నాను.

ఏదో మాట్లాడిద్దామని రోజూ అనుకుంటాను, కానీ ఇంతలో ఇంజినీరింగ్ కాలేజీ రావడంతో, దిగి పోవాల్సి వచ్చేది. మళ్ళీ సాయంకాలం కలుస్తుందేమోనని ఆశ మనసులో. లాభం లేదు, మధ్యాహ్నమే వెళ్తుందిగా. నీరసంగా క్లాసుకు బయల్దేరాను.

రోజూ లాగే మర్నాడు కూడా కనిపించింది జయశ్రీ. దాదాపు రెండేళ్ళుగా చూస్తున్నాను ఆమెనే. ఈరోజైనా ఎలాగైనా చెప్పాలి నా మనసులో ఆమె అంటే ఉన్న భావం. కనీసం మాట్లాడాలి. ఆ ఆలోచనతోనే ప్రపంచం అంతా ఎంతో అందంగా కనపడేది. రోజూ చూసే మా చిన్నల్బస్తి మురికి కాలవ, ఆ పక్కనే ఉన్న లతీఫ్ బొగ్గుల కొట్టు, కూరగాయల బళ్ళు, ఒకటేమిటి, అన్నీ అందంగా కనపడేవి. అమ్మా వాళ్ళు బజారుకి పోయి ఎప్పుడు ఏమి తీసుకు రమ్మన్నా, ఆమె కనపడుతుందేమో అనే ఆశతో, వెంటనే నడుచుకుంటూ మరీ వెళ్ళే వాడిని (స్కూటర్ మీద వెడితే తనని చూడడం కష్టం కదా). అప్పుడప్పుడూ కనపడేది కూడా, వాళ్ళ తమ్ముడితో ఎదో చెబుతూ, సరిగ్గా నేను ఎదురయ్యే సమయానికి, ఒక సారి అలా చూసేసి, నన్ను చూసి నవ్విందో లేదో అనే సందిగ్దం తేల్చుకునే లోపల మాయమై పోయేది. అది ప్రేమా? కుతూహలమా? ఆమెని చూడందే తెల్లారదు అన్నట్లుగా ఉండేది...

గొంతుక తడి ఆరి పోతున్నట్టుగా, మాట్లాడాలంటే గుండెలో స్కూటర్లు, బస్సులు, రైళ్ళు అన్నీ పరిగెడుతున్నట్టుగా ఉన్నా, ఆపైన ఎలాగో గొంతు పెగుల్చుకుని, పలకరించేలోగా, షరా మామూలుగా ఇంజినీరింగ్ కాలేజీ రావటం... ఏమీ లాభం లేదు.

ఆరోజు మా క్లాస్మేట్ జగన్నాథ్ తో మాటల్లో చెప్పాను, ఇలా మాట్లాడలేకపోతున్నానని. వాడేమో ఎప్పుడూ ఒక తెల్ల పంట్లాం, తెల్ల చొక్కా టక్ చేసుకుని, ఎత్తు మడమల మేజోళ్ళు వేసుకుని తనని తాను ఎన్టీఆర్ అనుకుంటూ ఉంటాడు. అప్పుడప్పుడూ కిళ్లీ కూడా వేసుకునేవాడు. వాడు సిగరెట్టు పొగ రింగులు రింగులుగా వదుల్తూ నవ్వేసాడు. "బ్రదర్, అంత కంగారెందుకురా? హలో అంటే పోతుంది కదా" అన్నాడు, అదేదో చాలా సులభం ఐన పని అన్నట్లు. ఈ అమ్మాయిలు ఎప్పుడూ నా లాంటి మంచి వాళ్ళతో మాట్లాడటానికి ఎందుకు సందేహిస్తారో అర్ధం అయ్యేది కాదు. అమ్మాయిల్తో వాడికెప్పుడూ బెరుకూ మొహమాటం లేవు. ఎవరితోనైనా చులాగ్గా మాటలు కలిపెయగలడు. చూద్దాం, మర్నాడు కలుస్తుంది కదా, అని ఆశతో, వెనక్కి మళ్ళాను, కాలేజీ అయ్యాక.

★★★★.

ఫైనల్ ఇయర్ పూర్తి అయ్యేలోపల ఒక మంచి ఉద్యోగం సంపాదించి జయశ్రీ వాళ్ళ నాన్న గారికి చెప్తే బావుంటుంది అనే ఇంకో బ్రిలియంట్ ఐడియా కూడా వచ్చింది. ఆ వెంటనే కాంపస్ ఇంటర్వ్యూలలో ఒక పదో పదిహేనో ఉద్యోగాలు సంపాదించి, అలా ఉద్యోగం వచ్చిన ప్రతీ సారీ, ఇంట్లో కిటికీ దగ్గరగా నిలబడి అమ్మకి గట్టిగా చెప్పేవాడిని (పక్కింట్లోని జయశ్రీకి, వాళ్ళ నాన్నగారికి వినపడేలా). ఎందుకేనా మంచిదని, జీతం ఎంత వస్తుందో కూడా చెబుతో (అరుస్తూ) ఉండే వాడిని. నేను అలా ఎప్పుడూ కిటికీ దగ్గరే నిలబడి ఎందుకు మాట్లాడుతున్నానో వాళ్లకి అర్ధం కాలేదోమోనని నా అనుమానం.

ఒక మంచి పెళ్లికొడుకుకి కావలసిన (పురుష) లక్షణాలు అన్నీ సంపాదించుకున్నాక

ఆరోజు నీలం రంగు గళ్ళ చొక్కా, నేవీ బ్లూ పాలియెస్టర్ ప్యాంట్స్ వేసుకుని, తలారా స్నానం చేసి, షార్ప్ గా కనిపిస్తున్నానేమో, నాలో నేనే ఎంతో (confident గా) ధైర్యంగా ఫీలౌతూ, హుషారుగా గేటు (తెరుచుకుని) తీసుకుని బయల్దేరాను, జయశ్రీ కెలాగైనా హలో చెప్పాలని!

సందు మలుపు తిరగగానే అల్లంత దూరం లో జయశ్రీ రావడం కనిపించింది. ఈ రోజు నిజంగానే మంచి రోజేమోనని, నా కోరిక ఇన్నాళ్ళకి తీరపోతోందేమోనని నాకు మళ్ళీ అనుమానం కలిగింది. నా గుండె చప్పుడు నాకే వినిపిస్తూంది, కాని జయశ్రీ ఒక్కర్తీ కాదు, ఇంకెవరో ఇద్దరు పెద్దవాళ్ళు కూడా ఉన్నారు, వాళ్ళందరూ దగ్గరలో ఉన్న ఆటోని కేకేసి, అందులో ఎక్కేసి అప్పుడే ఎక్కడికో బయలుదేరి వెడుతున్నారు. ఆటో తన పక్కనే ఆగేసరికి ఆశ్చర్యంగా చూసాను. అందులోంచి జయశ్రీ వాళ్ళ అమ్మ గారు దిగి, నన్ను వాళ్ళ నాన్నగారికి పరిచయం చేసింది. "ఈ అబ్బాయి మన పక్కింట్లోనే ఉంటాడు. చాలా బుద్ధిమంతుడు. ఇంజనీరింగ్ కాలేజిలో ఫస్టున పాసయ్యి బోల్డు ఉద్యోగాలు కూడా తెచ్చుకున్నాడు." ఈ సారి నా అనుమానం నిజమవుతుమ్దేమోనని మళ్ళీ నాకు అనుమానం వచ్చింది. ఇంతలో జయశ్రీ వాళ్ళ నాన్నగారు, మర్నాడు వాళ్ళమ్మాయి పెళ్ళి అని, కార్డు ఇమ్మని చెప్పింది వాళ్ళమ్మాయని, మీ ఇంట్లో వాళ్ళంతా తప్పక రావాలి, ఇంకా కార్డులు చాలా మందికి పంచాలని చెప్పి ఆటోలో వెళ్ళిపోయారు. అప్పుడు జయశ్రీ నన్ను చూసిన చూపుకి అర్ధం ఏమిటా అని నా అనుమానం ఎప్పటికీ తీరదేమో!

★★★★.

బస్సు కుదుపుకు, మళ్ళీ ఈ లోకం లోకి వచ్చాను,  ఆలోచనలు, జ్ఞాపకాలనుండి. మళ్ళీ చాలా సంవత్సరాల తరవాత సెలవు మీద ఇంటికి డీలక్స్ ఏసీ బస్సులో ఒస్తుంటే ఇలా జయశ్రీ కనపడడం చాలా ఆశ్చర్యం గాను, సంతోషం గాను అనిపించింది.

*** ***

ఇన్నాళ్ళ తరువాత ఆమె ఇంకా అలాగే అంతే అందంగా ఉంది, లేదు లేదు ముందుకన్నా కూడా. పక్కనే వాళ్ళమ్మాయేమో, ముద్దు ముద్దు గా కబుర్లు చెబుతోంది తల్లితో..."మీరు జయశ్రీ కదూ" కళ్ళజోడు సవరించుకుంటూ అడిగాను,  ఆమెను.  చక్రాల్లాంటి కళ్లెత్తి అదే నవ్వు మొహంతో  చూసింది,  "లేదు, నేను కళ్యాణి" అనేసి వెళ్లిపోయింది...  కూతుర్ని తీసుకుని..

నేను చూసుకోనేలేదు, అప్పుడే గమనించాడు, దిగాల్సిన స్టాప్ ఎప్పుడో వచ్చేసి వెళ్ళిపోయింది...

*** ***

కథా కౌముది

# సరళరేఖ

చంద్రమౌళి కళ్యాణ చక్రవర్తి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ**

నేను మీమీద **ఉమ్మేయదల్చుకున్నాను** అవును నిజమే. మీరు చదివింది అచ్చంగా అదే. నేను మీ మీద ఉమ్మేయ దల్చుకున్నాను. రాస్తున్న క్షణాలలో ఆలోచనకు అక్షరాలు కలుస్తూ ఉంటాయి. కలుస్తున్న ప్రతి అక్షరమూ మనస్సు మూలల నుంచి ఏదో ఒక అనుభూతిని, అనుభవాన్ని కెలికి తీసుకొస్తుంది. నేనూ రచయితనే. నిజంగా. ఇది నిజం. మీకు అనుమానం కలగొచ్చు. అది మీ తప్పుకాదు. రచయిత అనగానే ఏదొక సన్నివేశాన్నో, సంఘటన్నో, ఒక జీవితాన్నో అన్వయించి ప్రకటించాలి. అదొక అప్రకటిత ఒరవడి.

కానీ దురదృష్టవశాత్తూ నేను ఈ అస్తవ్యస్త విధానంలో తెమిలి తెమిలి వస్తున్న ఈ ఆలోచనాధారని ఉమ్మేయదల్చుకున్నాను. నాలో ఇమడకుండా తన్నుకు వచ్చేస్తోంది. ఆపగలిగే శక్తి నాకు లేదు. ఒక ఆలోచన చేతికదలికల చైతన్యానికి కారణమవుతోంది. ఆవేశం, ఆక్రోశం అప్రయత్నంగా చేతిని వణికిస్తున్నాయి. అక్షర రూపంలో ప్రకటింపబడుతున్నాయి. ఈ ఉమ్మేయటం అనే అపసవ్యపదం ఎందుకు వచ్చిందో? ఇది పూర్తిగా అసంకల్పిత పదం. అసలు పదాల ఎంపిక జరిగేదే మనస్సులోంచి సంస్కారాన్ని బట్టి ఎక్కడ ఏ పదాన్ని ప్రయోగించాలో మెదడు చెప్తుంది. కానీ అసంకల్పిత ప్రతీకార చర్యలకి ఈ పద్ధతి ఉండదు. మనలో అంతర్గతంగా ఉన్న తెలీని ఒక అనుభూతి అసంకల్పితంగా పదాన్ని పారేస్తుంది. రోజూలాగే జరిగుంటే ఈ అసంకల్పిత ప్రతీకారచర్య జరిగేదే కాదు కానీ ఈ రోజు జరిగింది. కళ్ళు మసకబారుతున్నాయి. పల్చటి తెర ఏదో అడ్డం వస్తోంది. చేతులు నిమగ్నమై ఉన్నాయి. నిర్లిప్తత. నిరాసక్తత.

ఎందుకిలా జరిగింది? రోజూలాగానే ఎప్పుడో రాత్రి రెండున్నర మూడు గంటలకు నిద్రపట్టి తెల్లగా తెల్లవారి ఎండబాగా వచ్చేరాకముందే మెలుకువ వచ్చింది. మెలుకువ రాగానే వెంటనే మంచం మీద నుంచి లేచే అలవాటు నాకు లేదు. కాసేపు అటూ ఇటూ దొర్లటం. బయట వినిపించే శబ్దాలను వినటం, గమనించి వినటం నాకు అలవాటు. ఈ అలవాటు నాకు తర్ఫీదుగానే అబ్బింది. పరిణామ క్రమంలో జీవన పోరాటంలో జీవకోటి ఎలా పరిసరాలను ఆకళింపు చేసుకుందో అలాగే నేనూను. అనువైన పరిస్థితులు ఉంటే లేవటం. లేకపోతే అనువైన పరిస్థితులు ఏర్పడేదాకా ఆలోచనా ప్రపంచంలోకి ప్రయాణం చేసిరావటం.. ఈ ఆలోచనా ప్రపంచంలో ఎన్నో మజిలీలు. ప్రతి మజిలీ ఒక అవ్యక్త ఆనందాన్నే ఇచ్చేది. భావప్రాప్తి కలిగించేది. నా నగ్నదేహానికి అదొక్కటే అత్యవసరం ఎందుకంటే ఈ ఆలోచనా ప్రపంచంలో నేనే రాజుని, మహరాజుని, చక్రవర్తిని, సామ్రాట్టుని. నా రాజరికపు ఠీవితో నేను ప్రదర్శించే దర్పం నిత్యనూతనం. నా నిర్ణయాలన్నీ ఆనందకరం. ఆహ్లాదకరం. వందిమాగధులు. దుందుభులు మ్రోగిస్తూ నా వెంట ఆత్రుతగా పరిగెడుతారు. రాచకన్నియలు.

నా ఆనందంకోసం తమ జీవితాన్నే అర్పిస్తారు. నా కనుసన్నలలో నాకోసం తమ సర్వస్వం అర్పిస్తారు. శరీరం అప్రయత్నంగా జలదరిస్తుంది. పులకింతలు అణువణువును తాకుతాయి. అచేతనత్వానికి, చేతనత్వానికి మధ్య తడి. మాములు ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. తడి జిగటగా అంటుకుంటుంది. ప్రదర్శించటానికి కొంత సిగ్గుపడతాను. కొంత భయపడతాను. కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో మళ్ళా సామాజిక ముసుగు లాక్కుంటాను. పూర్తి ప్రయత్నం చేస్తూ మెలుకువ తెచ్చుకుంటాను. కళ్ళు విడిపడుతూ ఇగటారుతాయి. అద్దంలో చూసుకుంటే పొడిబారుతాయి. చేతికి అందే దూరంలోనే తెల్లటి బట్టలేసుకున్న నల్లటి పొగాకు. అసంకల్పితంగా నా నోటికి చేరుతుంది. వద్దు వద్దు అంటూ ఊపిరితిత్తుల ప్రతి అరా అంచెలంచెలుగా అరుస్తాయి. తమ వ్యతిరేకతని తెల్లటి శ్లేష్మం రూపంలో పిచికారి చేస్తాయి. యుద్ధభూమిలో తెల్లటి మాంసం ముద్దలు ద్రవరూపంలో నోట్లోంచి బయటకు వెళ్ళిపోతాయి. ఒక్కోసారి జాలివేస్తుంది. ఓడిపోతామని తెలిసినా ఎందుకిలా యుద్ధం చేస్తాయో. ఒక్క క్షణం ఆగుతాను. వెంటనే నేనే రాజుని, ఇది నా సామ్రాజ్యం అని గుర్తుకు వస్తుంది. యుద్ధం ప్రారంభమైన సూచనగా అగ్గిపుల్ల వెలిగిస్తాను. సుదీర్ఘమైన ఒక్కదమ్ము. అచేతనానికి చేతనానికి మధ్య శరీరాన్ని ఆక్రమించుకొంటూ... పొగ.. మళ్ళా దగ్గు.. శరీరాన్ని కదలిస్తూ నేను పూర్తిగా నిద్రలేచినట్లే..

గతరాత్రి మాలిన్యం ధారా రూప ప్రదర్శనకి సిద్ధమవుతుంది. కుడి చేతివైపు ఒక్క రెండు అడుగులు వేస్తే బాత్‌రూం అందుతుంది. అదొక నరకం. రెండు అడుగులు వేయటం కూడా ఎంతో ప్రయాస. నేనున్న రూమ్. అంత పెద్దది. కాదు. అంత చిన్నది కాదు. కాని నా అవసరాలకి సరిపోతుంది. మంచం ప్రక్కనే నేను బ్రతికున్నానో లేదో చూడటానికి ఒక మానిటర్. బ్రతికించటానికి అవసరమైన మందులు. ఏంటో జనాల పిచ్చి. నాక్కావలసింది ఆత్మీయత నిండిన పలకరింపు అని తెలిస్తే బాగుండు. వీటికి పెట్టిన ఖర్చులో. సర్లెండి అది అప్రస్తుతం. సాపేక్షం...

ప్రపంచంలో ఎన్నో గొప్ప ఆలోచనలు. ఈ బాత్‌రూములోనే పుట్టి బాత్‌రూములోనే చచ్చిపోతాయి అంటారు. కానీ నాకేమొ ఒక్క ఆలోచనా సాగదు. మెదడు ఏపనీ లేకుండా విశ్రాంతిగా ఉంటుందని కాదు. నా ఉద్దేశ్యంలో అద్భుతమైన ఆలోచన లేవిరావు. నా ఉద్దేశ్యంలో అద్భుతమైన ఆలోచనలు మాత్రం గది కిటికీలోంచి కనపడే రోడ్డుని చూస్తుంటేనే వస్తాయి. బయటి ప్రపంచంతో నాకున్న అనుబంధం ఆ కిటికీనే. కిటికీలోంచి చూస్తున్నప్పుడే అనుభూతుల కుంభవృష్టి కురుస్తుంది. మనస్సు, కళ్ళు రెండు తడుస్తాయి.

నేను నిద్రలేచినట్లు ప్రపంచానికి తెలిసిపోయినట్లుంది. నర్స్ యాంత్రికంగా తన పని తాను చేసుకుపోతుంది. నాకేమో.. కిటికీ దగ్గరకు వెళ్ళాలి.. తనకోసం చూస్తూ ఉండాలి.. అదే కోరిక.. ప్రతిరోజూ నిరీక్షణ.. ఆశ.. తెలియక పోతుందా. ఒక్కసారి కనబడి వెళితే బాగుంటుంది కదా. ఆ కళ్ళల్లోకి చూస్తూ ఎంతసేపైనా గడపొచ్చు. నిరీక్షణ.. నిరాశ.. అనాసక్తత.. రోజూ ఇదే తంతు.. ఈ రోజే ప్రత్యేకం!

స్టవ్ వెలిగించిన వెచ్చదనం తెలుస్తోంది. శరీరంలో ప్రతీ అణువూ యుద్ధంలో అలిసిపోయిన సైనికులల్లే విరామం కోరుతోంది. వెచ్చటి కాఫీ.. చుక్కలుచుక్కలుగా.. గొంతులోంచి శరీరాన్ని ఆక్రమిస్తోంది. పూర్తి మెలుకువలో ఉన్నా ఇదో ప్రత్యేకమైన రోజు.. రోజూలాగా కాదు.. ఈ రోజే.. మా అమ్మ నన్ను మొట్టమొదటి సారి చూసింది. శరీరాన్ని చీల్చుకుని వచ్చిన నన్ను ఆనందంగా ఆత్మీయంగా చూసింది. ఆ ఆనందం చూసి తట్టుకోలేక నేను ఏడ్చేశాను. అయినా సరే అపురూపంగానే చూసింది. తప్పొప్పుల ప్రసక్తి లేకుండా నన్ను ప్రేమించింది అమ్మొక్కతే. ఎందుకంటే అమ్మ కాబట్టి.. అమ్మ తరువాత మళ్ళా 'తనే'.. తను మాత్రం ప్రత్యేకం.. తను గుర్తుకు వస్తే కాళ్ళు అసంకల్పితంగా కిటికీ వైపు తీసుకెళ్తాయి. ప్రయాసే.. కాని తప్పదు. మనస్సు క్షణాల్ని యుగాలు చేస్తూ అక్కడినుంచి కదలదు. శరీరాన్ని మనస్సు దగ్గరకు తీసుకెళ్ళాలి. అది అవసరం.

నర్స్ వస్తే టైమ్ తెలుస్తుంది. నర్సే నాకు టైమ్.. దగ్గు బాగా వచ్చినప్పుడు ఆక్సిజన్ పెట్టి మంచానికి కట్టేస్తుంది. కూక్, కూక్.. అంటూ నేను బ్రతికున్నానో లేదో తెలిపే శబ్దమే. ఇక వేరే శబ్దాలు ఉండవు. కుయ్ఁ అని శబ్దం ఎప్పుడు వస్తుందా.. అని చెవులు రిక్కించి వింటారేమో.

అంతా నిశ్శబ్దం. నాదేమో నిరీక్షణ. వాళ్ళని నిరాశపరుస్తూ ఇంకోరోజు గడుస్తుంది. వీళ్ళకేం తెలుసు. నా నిరీక్షణ గురించి? కానీ ఈ రోజు ఉత్సాహంగానే ఉంది. ఈ రోజు 'తను' వస్తుంది. అదే. నా ఆశ ఒక్కసారి కనిపిస్తే ఎంత బాగుండు. మనస్సు కిటికీలోంచి గతంవైపు పరిగెట్టబోయింది. నేను బలవంతంగా ఆపేశాను. గతం కోసం వర్తమానాన్ని వదులుకోవటం నాకు ఇష్టంలేదు. కళ్ళెం పట్టి గట్టిగా ఆపేశాను. ఉక్కిరి బిక్కిరిగా అయిపోయింది. అయినా కళ్ళు తన ప్రయత్నాన్ని ఆపలేదు. హడావిడిగా ఎక్కడికో వెళుతున్న ప్రపంచంలో నాకోసం వెతికే కళ్ళకోసం ఆ కళ్ళను కలుసుకోవాలన్న ఆత్రుత అంతఃచేతనకి తెలుస్తూనే ఉంది. ఈవాళ తను వస్తుంది. కనిపిస్తుంది. ఆఖరి బెల్లు కోసం ఎదురుచూస్తున్న స్కూలు పిల్లాడి ఉత్సుకత నాది. కట్టిపడేసిన తరగతి గదుల్లోంచి ఎప్పుడు పరుగెడదామా అని చూస్తున్నా. అదిగో తను వస్తోంది. అడుగుల సవ్వడి. నా గుండెను లయ తప్పిస్తోంది. జైంట్‌వీల్‌లో పైకి వెళ్ళి క్రిందకు వస్తున్న అనుభూతి.. గుండె గొంతుకలోకి రాబోతున్న తరుణంలో శ్వాసశేషం.. ఊపిరితిత్తుల రూపంలో తెరలు తెరలుగా యుద్ధం ప్రకటించాయి. ఆనందమో, ఆవేశమో.. అర్థం కాదు. ఇది ఏ భావం? – ఈ నర్స్‌ని గొంతు పిసికి చంపెయ్యాలి. కానీ నాకన్నా తనే బలవంతురాలు.

మనస్సు కిటికీనే అంటుకుపోయింది. కూక్... కూక్.. మంటూ మానిటర్ శబ్దం చేస్తోంది. తలుపు తెరుచుకుని 'తను' వచ్చింది. ఆ కళ్ళు సూటిగా నన్నే చూశాయి. నేనూ చూశాను. తనే..! ఇన్ని రోజులకి.. కానీ ఇదేంటి..? గాజుకళ్ళు.. అభావంగా లోపల నుంచి తన్నుకు వస్తున్న సునామి.. సముద్రగర్భంలో భూకంపం.. ఉప్పునీళ్ళను అతి తీవ్రంగా కదిలిస్తోంది. కోపం, అసహ్యం, జాలి ఆనందం, ఆశ్చర్యం ఇన్ని ఉండగా 'నిర్లిప్తత'..! దేవుడా నేను భరించలేను.

శరీరం ఎగిరి ఎగిరి పడుతోంది. కళ్ళు తననే చూస్తున్నాయి. ఏ మూలన్నా ఏక్షణమన్నా భావం మారుతుందా? నేను అనే అస్థిత్వమే లేదు. కారణం తనే. నా ఆలోచనలన్నీ.. తన రూపంలో.. రంగులద్ది కాగితం మీద.. కాన్వాస్ మీద చిత్రీకరించబడేవి. నాకోసమే తను.. శారీరకమే కాదు.. అలౌకికమైన, అవ్యక్తమైన ఆనందం.. భావప్రాప్తి..! శరీరాలు కలుస్తే కొద్దిగా శాంతి దొరికేది. ఆ తమకం తీరక నాకు అసహనం కలిగేది. ఇంకేం కావాలో నాకు తెలిస్తేకదా. 'తను' ఉంటే చాలు అనే కోరిక. అది ఆవేశంగా మారితే నా తప్పెందుకు అవుతుంది? అందుకు సమాధానం 'నిర్లిప్తతా'? ఇది నా ఊహకు అందటం లేదు. తన వెళ్ళిపోతోంది. కాదు డాక్టర్ పంపిచేస్తున్నాడు. ఒరేయ్ నిన్ను... మనస్సు లేచి కూర్చుంది. శరీరానికి అసలు ఓపిక లేదు. కూక్...కూక్....సునామీ. చెలియలి కట్టదాటింది. ఆపగల శక్తి నా మనస్సుకి లేదు. శరీరానికి అసలేలేదు. ఉప్పగా ఉమ్మేస్తున్నాను. తెమిలి.. తెమిలి.. శరీరం కదలి కదలి.. ఉమ్మేస్తున్నాను. కళ్ళతో.. కూఁ... అంటూ మానిటర్ శబ్ధం..!!



# కథా కౌముది

## సంస్మరణ — డా. భైరవభట్ల విజయాదిత్య

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

డా॥సుందరం దగ్గరకు తన తల్లి శకుంతలమ్మను తీసుకు వచ్చాడు అశోక్.

"ఏమిటి ప్రోబ్లెం" అడిగాడు సుందరం.

"ప్రోబ్లెం అంటే... ఏం లేదు... మా అమ్మగారు గత కొన్నాళ్ళుగా ..కొంచం... అప్పుడప్పుడు.. ఏవేవో ఊహించుకుంటున్నారు." మొదటి వాక్యం అతికష్టం మీద అన్నాక భారం తగ్గినట్లు మాట్లాడడం మొదలుపెట్టాడు అశోక్.

"మామూలుగా పెద్ద పట్టించుకోలేదు. ఏదో ఈ చీర ఎవరో పెట్టారని, ఆ గిన్నె ఇంకెవరో ఇచ్చారని అప్పుడప్పుడు అంటుండేది. కొన్ని మామూలుగానే గుర్తుపడుతోంది. కొన్ని మాత్రం ఇలా. పైగా నేనూ వాళ్ళను చూశానంటుంది. నాకూ తెలుసంటుంది. పోనీ వాళ్ళెక్కడున్నారంటే, చచ్చిపోయారంటుంది. ఇదీ వరుస. ఈ మధ్య ఇది కొంచం ఎక్కువైనట్లుంది. నా చిన్నప్పుడే పోయిన వాళ్ళన్నయ్య చనిపోయాడంటూ నాకు ఫోన్ చేసి, నేను ఇంటికి వచ్చేలోపే ఎక్కడికో వెళ్ళిపోయింది. ఫోన్ చేస్తే ముంబాయి లో మా అత్త దగ్గర ఉన్నాను వచ్చేస్తాను అని చెప్పి, మూడు రోజుల తరువాత వచ్చింది. ఎంతో ఖంగారు పడ్డాను. మా అత్త దగ్గరకే వెళ్ళింది కనుక సరిపోయింది. .. అదే ఇంకెక్కడికైనా వెళ్ళిపోతే... వచ్చిన దగ్గరనుండీ, తిండి సరిగా తినక బాధపడుతూ కూర్చుంది. ఇక లాభం లేదని మీ దగ్గరకు తీసుకువచ్చాను."

'స్కిజొఫెర్నియాలో ఇది ఒక రకం.' అనుకున్నాడు సుందరం. 'లేనివి జరిగినట్లు, లేనివాళ్ళు ఉన్నట్లు భావించడం. మందుల ద్వారా కొంత తగ్గించవచ్చు. అంతకన్నా ఎక్కువ కౌన్సిలింగ్ అవసరం. వాళ్ళకి ఇటువంటి మానసికరోగం ఉందని వాళ్ళు అంగీకరించగలగాలి. అది చాలా ముఖ్యం. చాలా సమస్యలను అది పరిష్కరిస్తుంది.' ఆలోచిస్తున్నాడు సుందరం. 'ఈ కేస్ లో కొంత సులువు ఉంది. ఆమె ఊహలు నిజం కావు అని సులభంగా చూపించవచ్చు. అయితే కొందరిదంతా తెలిసే కావాలనే చేస్తుంటారు. ఆ వైపు నుండి కూడా పరిశీలించాలి. ముందుగా కుటుంబవివరాలు తెలుసుకోవాలి' అని భావించి

"మీరేం చేస్తుంటారు?" అడిగాడు సుందరం.

"మాకు కొంత భూమి కొన్ని తోటలు ఉన్నాయి. అవి చూసుకుంటుంటాను."

" ఇంట్లో ఇంకెవరెవరుంటారు?"

" నేను, అమ్మ అంతే. పొద్దున్నించీ రాత్రి వరకూ పనమ్మాయి ఉంటుంది."

" మీ నాన్నగారు... .?"

" నాకు ఊహ తెలిసే నాటికే పోయారండి.. అమ్మే చిన్నప్పటినుండీ నన్ను పెంచి పెద్ద చేసింది."

" బంధువుల రాకపోకలు అవీ ? "

" చాలా తక్కువండి. ఎప్పుడో పెళ్ళిళ్ళల్లో కలుసుకోవడమే కానీ ఇంటికి రావడం పెద్దగా లేదు"

క్లాసిక్ కేస్! అనిపించింది సుందరానికి. శకుంతలమ్మ వైపు చూశాడు. సుందరం. ఆమె ముఖంలో ఒక ఉద్వేగం కనిపిస్తోంది. సహజం. తన నిజం, తన ప్రపంచం కేవలం ఊహ అని అంటే అది జీర్ణించుకోవడం మనసుకు చాలా కష్టం. ఈవిడ ముఖంలో ఆ మానసిక పోరాటం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

" చూడండమ్మా. మీరు ఈ విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఇదేమి పెద్ద సమస్యకాదు. మీరు ఖంగారు పడనక్కరలేదు. ఎక్కువ ఆలోచించి మనసును కష్టపెట్టుకోవద్దు. హాయిగా ఉండండి. కాస్త రెస్టు తీసుకుంటే అంతా సర్దుకుంటుంది. నా మాట విని ముందు అబ్బాయికి పెళ్ళి చేసేసి కోడల్ని ఇంటికి తెచ్చుకుంటే అన్ని సమస్యలూ అవే పోతాయి. ఆ తరువాత మనవలతో ఆడుకుంటూ ఉండొచ్చు." నవ్వుతూ అన్నాడు సుందరం.

శకుంతలమ్మలో చిన్న కదలిక. ఆమె ముఖంలో ఆనందం కనిపించింది. మంచిది. తను సరియైన దారిలోనే వెళ్తున్నాడు అనుకున్నాడు సుందరం. ఇలాంటి వారు అసలు డాక్టర్ దగ్గరకు రావడానికి ఒప్పించడామే ఒక పెద్ద తలనొప్పి.

" మీ పేరేమిటమ్మా?"

" శకుంతలా రామన్"

" మీ ఆయనపేరు రామన్ ..?"

" రమణమూర్తి. అందరూ రామన్ అని పిలుస్తారు.. అయనకి అలానే ఇష్టం. అందుకే నేనూ అలాగే పెట్టుకున్నా. సి. వి . రామన్ గారి చదివిన కాలేజీలోనే ఈయనా చదివారు. చాలా తెలివైన వారు." ఉత్సాహంగా చెప్పింది శకుంతలమ్మ.

" సరే, మీ వారు పోయి సుమారు ఎంతకాలం అయ్యింది?"

" అయిదేళ్ళ క్రితం చనిపోయారు." ఆమె కళ్ళల్లో చిన్న బాధ.

తలగోక్కున్నాడు అశోక్. సుందరం వైపు చూసి పెదవి విరిచాడు.

" అశోక్! ఇంక చాలు. కనీసం మీ నాన్నగారి విషయంలోనైనా నీ ప్రవర్తన మార్చుకో. నిన్నెంత ప్రేమగా చూసేవారు. ఏదడిగితే అది.." శకుంతలమ్మ ఆవేశంగా అంటుంటే..

" అమ్మా! ఎందుకిలా నన్ను బాధ పెడతావు. నాన్నని చూసిన గుర్తు కూడా నాకు లేదు. ఇలా నువ్వు ఊహించుకున్నంత మాత్రాన అది నిజం అయిపోదు."

" ఛీ! నోర్ముయ్! అసలు నువ్వు కొడుకువేనా!" శకుంతలమ్మలో ఆవేశం కట్టాలు తెంచుకుంటోంది.

" అమ్మా ! చాలు. నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడానికి ఇది ఇల్లు కాదు" అశోక్ కూడా సహనాన్ని కోల్పోయాడు.

" ప్లీజ్ ! శాంతించండి. అనవసరంగా కోపం తెచ్చుకుంటే ఎవరికీ మంచిది కాదు." సుందరం ఇద్దరినీ ఆపాడు.

'అనుకున్నంత సులువు కాదు. ఈ వ్యాధి వలన వీళ్ళిద్దరి అనుబంధంలో ఆటుపోటులు మొదలయ్యాయి. అశోక్ ఉండగా ఈమె నిజాన్ని ఒప్పుకొనే అవకాశంలేదు. ఆమె మనసు ఒప్పుకోదు. తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. మనసలాంటిదే. కొన్ని విషయాలు దగ్గరగా ఉన్నవాళ్ళదగ్గర ఒప్పుకోవడానికి అహం అడ్డొస్తుంది. ముఖ్యంగా అప్పటికే ఒక పద్ధతికి, ఒక వాదనకి అలవాటు పడినతరువాత.

" ఆశోక్! మీరు కాస్త బయట కూర్చుంటే నేను మీ అమ్మగారితో మాట్లాడాలి." అన్నాడు సుందరం.

" కానీ ! డాక్టర్!..." సంశయించాడు అశోక్.

" మరేం ఫరవాలేదు. బయట వెయిట్ చెయ్యండి" చెప్పాడు సుందరం.

అయిష్టంగానే బయటకు నడిచాడు అశోక్.

అశోక్ బయటకు వెళ్ళిన వెంటనే శకుంతలమ్మ లో పెద్ద మార్పు వచ్చింది. సుందరం ఇంకా ఏమీ మాట్లాడకుండానే.

" డాక్టర్ గారు. చాలా థాంక్స్. మీతో ఒంటరిగా మాట్లాడాలనే నేను అలా ఆవేశంగా మాట్లాడాను. నాకు ఏ సమస్యాలేదు. మా అబ్బాయి గురించే నా బెంగ. అతనికి పెళ్ళి చెయ్యాలని అనుకుంటున్నాను. అయితే అతనికి ఒక సమస్య ఉంది." ఆపుకోకుండా చెప్పుకుపోతోంది శకుంతలమ్మ.

సుందరం ఆపే ప్రయత్నం చెయ్యలేదు. ఇది అతను ఊహించినదే. తను సరిగానే ఉన్నానని చూపించుకోవడానికి, ఎదుటి వాడు సరిగాలేడు అని చెప్పి నిరూపించే ప్రయత్నం చెయ్యడం మామూలు మనుషులకైనా సహజమే. ఇలాంటి కేసులలో అది విపరీతమై, పొంతనలేని విచిత్ర విషయాలు, అదీ సొంత వారిమీద చెప్పడం జరుగుతుంటుంది.

" మా అబ్బాయిది ఒక వింత మానసిక స్థితి. తన దగ్గరవాళ్ళు, తనకు తెలుసున్నవాళ్ళు ఎవరైనా చనిపోతే, ఆ క్షణం నుండీ వారి తాలూకు గురుతులన్నీ చెరిపేసుకుంటాడు. అసలు వాళ్ళను తానెప్పుడూ కలవలేదని అంటాడు, అనుకుంటాడు. వారితో తనకున్న అనుబంధమంతా కల్పితమంటాడు. దానికోసం ఒకొక్కసారి లేనివి కల్పించుకుంటాడు. బహుశా నా వల్లే వాడిలా తయారయ్యాడు."

శకుంతలమ్మ మాటలకు చిన్నగా నవ్వుకున్నాడు సుందరం. ఈమెకు కొడుకంటే లోపల నిజంగా ప్రేమ ఉంది. అందుకే అతనిని మానసికరోగిగా చిత్రించడానికి ఒప్పుకోని హృదయం, నేరం తనమీదకు తెచ్చుకుంటోంది.

" మా నాన్నగారంటే అశోక్ కి చాలా ఇష్టం. చిన్నప్పుడెప్పుడూ తాత తోనే ఆడుకునేవాడు. అలాంటిది వీడికి పదేళ్ళ వయసులో మా నాన్నగారు పోయారు. తెలిసీ తెలియని వయసు. ఏడుస్తూ కూర్చున్నాడు. తాత లేకుండా భోంచెయ్యనని పేచీ. తాత రావాలని పేచీ. ఎప్పటికప్పుడు వాడిని ఏమార్చి, ఏదో చెబుతుండేదాన్ని. కొంత సర్దుకున్నా తాత గుర్తొస్తే మళ్ళీ మామూలే. అందుకే వాళ్ళతాతగారిచ్చిన బొమ్మలు అవీ ఇంకెవరో ఇచ్చారని అబద్ధం చెప్పేదాన్ని. మానాన్నగారి గుర్తులేవీ లేకుండా చూసుకునేదాన్ని. అలా అలా కొన్నాళ్ళకి తాతగారి గుర్తొచ్చినా, అసలు తాతగారిని నువ్వు చూడేలేదని మభ్యపెట్టే వరకూ వెళ్ళిపోయాను. వాడు బాధ పడడం ఇష్టం లేక అలా చేశాను. ఆ చిన్నిబుర్రకి ఏమర్థమయ్యిందో, ఆ పసిమనసు ఎలా మారిందో తెలియదు. మా అత్తగారు పోయినప్పుడు, బాధపడొద్దు నాన్నమ్మ ఎప్పుడో పోయింది అనుకో. ఏ బాధా ఉండదు అని వాళ్ళ నాన్నని ఓదారిస్తే, అంతబాధలోనూ నవ్వుకు మురిసిపోయాం. ఆ తరువాత ఎవరు పోయినా తనకు వాళ్ళు తెలుసా అని అడిగేవాడు. ఒకొక్కప్పుడు నిజంగా గుర్తులేదేమో అనుకునేదాన్ని. కొన్నిసార్లు కోరుండి అడుగుతున్నాడు అని తెలిసేది. అయినా చిన్నపిల్లవాడుకదా అని తెలియదు అనేసేదాన్ని. అదే నేను చేసిన పొరపాటు. అది వాడి మనసులో స్థిరపడిపోయింది. చనిపోయిన తరువాత ఇంక వాళ్ళు తనకు తెలియదు అనే భావన ధృడమయిపోయింది. ఎదుగుతున్నకొద్దీ అలా బలపడింది. మధ్యలో నేను ఆ ఆలోచన సరికాదని చెప్పే ప్రయత్నం చేశాను. కానీ అప్పటికే చెయ్యి దాటిపోయింది. ఒకటి రెండుసార్లు డాక్టర్ కి చూపిద్దామని మా వారితో అన్నాను కూడా. అయితే పెద్దయ్యాక వాడే మారతాడు అని ఆయన దాటవేసేవారు. నిజానికి దీనివల్ల పెద్ద ఇబ్బంది కూడా మాకు

అనిపించలేదు. రోజూవారి పనులలో ఏ మార్పూలేదు. ఏప్పుడైనా పోయినవాళ్ళ ప్రస్తావన వచ్చి, అదీ వాడితో జరిగిన సంగతులు వస్తే లేదని అనడం తప్ప ఎటువంటి ఇబ్బందీ లేదు.”

ఆశోక్ లోపలికి వచ్చాడు. “ డాక్టర్! నేను ఇక్కడే కూర్చోవచ్చా?...”

“ అశోక్! నా ఉద్దేశ్యం మీ అమ్మగారితో ఒంటరిగా మాట్లాడితేనే మంచిది” చెప్పాడు సుందరం.

“ అంటే! అమ్మ ఎవేవో చెబుతుంది. చాలా కన్వెన్సింగ్ గా చెబుతుంది. ఒకొక్కసారి నేనే మరిచిపోయానేమో అని నాకే అనిపిస్తుంటుంది. నా గురించి, నా చిన్నతనంగురించి ఉన్నవీ లేనివి చెబుతుంది. నేనిక్కడుంటే...”

“చూడండి అశోక్ ! ముప్పైయ్యేళ్ళ అనుభవం ఉన్న డాక్టర్ని నేను. ఏది నిజం ఏది కాదు అని అంచనా వేయగలననే అనుకుంటున్నా. కేవలం ఆమె మాటల తీసుకుని నిజాన్ని నిర్ధారించను కదా! మీతో తరువాత మాట్లాడతా. ముందు బయట వేయిట్ చెయ్యండి.” కొంచెం చిరాకుగా చెప్పాడు సుందరం.

అయిష్టంగా వెళ్ళబోతున్న అశోక్ ఆగి

“ ఒక్కనిముషం. ముంబై లో ఉన్న మా అత్తయ్య కి ఫోన్ చేస్తాను. ఒక్కసారి ఆమె మాటలు వినండి.” అని చెప్పి సుందరం సమాధానం చెప్పేలోపే ఫోన్ తీసి చేశాడు. స్పీకర్ మోడ్ లో పెట్టాడు. “ హలో! అత్తయ్యా నేను అశోక్ ని మాట్లాడుతున్నా. ఏం లేదు అమ్మ గురించే. నువ్వు చెప్పినట్లు ఇక్కడ డాక్టర్ దగ్గరకు తీసుకు వచ్చాను. ఒకసారి డాక్టర్ తో మాట్లాడతావని.”

“ నమస్తే అండీ! అశోక్ అంతా చెప్పాడా? మా శకుంతలతో కూడా మాట్లాడండి. మా అమ్మాయిని అశోక్ కి ఇద్దాం అని .. తీరా ఇప్పుడు ఈ సమస్య బయటపడింది. ఇంతకీ మేనరికాలు చెయ్యకూడదంటారు. మీ అభిప్రాయం ఏంటి?”

“ అత్తా ! ఆ విషయాలు కాదు. మావయ్య చనిపోయిన విషయం చెప్పు.” అసహనంగా అన్నాడు అశోక్.

“ ఆ! అవును. మా ఆయన చాలా ఏళ్ళ క్రితమే పోయారు.” ఫోన్ కట్ చేశాడు అశోక్ .

సుందరం ముఖంలో వచ్చిన మార్పును చూసి అశోక్ నిశ్చింతగా బయటకు వెళ్ళాడు.

శకుంతలమ్మ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుని మామూలుగా చెప్పడం మొదలెట్టింది “ ఈవేవీ ఎవరికీ చెప్పుకోలేను మానలేను.” సుందరం ముఖం చూసి ఆగిపోయింది. “ మీరు నన్ను నమ్ముతున్నట్టు లేదు?”

“ఇందాకా ఆవిడ ఫోన్లో... వాళ్ళాయన..” జాగ్రత్తగా ఒక్కోమాట అన్నాడు సుందరం.

“ ఓహ్! అదా! అలా చెప్పమని నేనే చెప్పాను. ఏం లేదు నా మేనగోడలిని కోడలు చేసుకోవాలని అనుకుంటున్నా. వాడికీ ఇది ఇష్టమే. ఈ రోగం కారణంగా సంబంధాలు బెడిసి కొట్టకుండా కాస్త జాగ్రత్తగా ఉంటే మంచిదని వాడి మాటకు ఔననమన్నాను. తల్లిని నన్ను వదులుకోలేదు కానీ మిగతావాళ్ళను కాదనుకోవడానికి ఎంతసేపుపడుతుంది. గతంలో ఇలాగా వాడి మాట తప్పు అని చూపించే ప్రయత్నం చేసినందుకు వాడి చిన్నాన్న బావమరిదిని మెడపట్టుకుని బయటకు తగిలేశాడు. ఆ తరువాత నుండీ మా ఇంటికి బంధువుల రాకపోకలు చాలా తగ్గిపోయాయి.”

ఏది నిజం అన్నదానికి ఇంకా ఒక నిర్ధారణకు రాలేకపోతున్నాడు సుందరం.

“ మీరు చెబుతున్న దానికి ఏదైనా ఆధారాలు ఉన్నాయా?”

“ముంబాయిలో మా ఆడపడుచు నెంబరు ఇస్తాను. మళ్ళీ ఫోను చేసి మాట్లాడండి.”

" చెయ్యవచ్చు... చూద్దాం... ఇంకా ఏమైనా?" శకుంతలమ్మ మాటలబట్టి ముంబాయి నుండి వచ్చే సమాధానం ఏమిటన్నది తెలుస్తూనే ఉన్నది..అయితే ఎంతవరకూ దానిలోని నిజాన్ని నిశ్చయించడం అన్నది కొంచం కష్టమే. అల్లుడిని మంచి చేసుకోవడానికి అబద్ధం ఆడినప్పుడు... ఈమెను మంచి చేసుకోవడానికి ఆడలేరా' ఈ ఆలోచనతో ముంబాయి ఫోను వాయిదా వేశాడు సుందరం.

"ఇదుగోండి! అయిదేళ్ళ క్రితం.. మా ఆయన పోక ముందు తీసుకున్న ఫ్యామిలీ ఫొటో. ఇంతకన్నా ఏం కావాలి?" కొంచం బాధగానే చూపించింది శకుంతలమ్మ. ఫొటో చూసిన తరువాత సుందరానికి శకుంతలమ్మ మీద నమ్మకం కొంచం పెరిగింది.

" సరే! మీ అబ్బాయికి ట్రీట్మెంట్ మొదలుపెడతాను.. అయితే ముందు మీ అబ్బాయితో ఒంటరిగా నేను మాట్లాడాలి.." సుందరం మాటలకు అయోమయంగా చూసింది శకుంతలమ్మ.

" మీరు ఇంకా నన్ను నమ్మడంలేదా?"

" నో! నో ! అదేం లేదు. ఎప్పుడైనా ఇలాంటి మానసికరోగాలను స్టడీ చేస్తున్నప్పుడు దగ్గరివాళ్ళు, తెలుసున్నవాళ్ళు ఉంటే రోగి ప్రవర్తన వేరేలా ఉంటుంది. మనం మన వ్యక్తిత్వానికి ఎన్నో ముసుగులు వేసుకుని తిరుగుతుంటాం. ఆ ముసుగుల్ని తొలగించుకోవడం అంత సులువు కాదు. ఒక్కోసారి కమిట్ అయిపోయిన వాటినుండి వెనక్కు వెళ్ళడానికి మనసు అంగీకరించదు. మీరు ఉండగా మీ అబ్బాయి తన ముసుగు వదలడు. .." సుందరం మాటలతో శకుంతలమ్మ మళ్ళీ మామూలు అయ్యింది.

" నాకు ఇంటి దగ్గర కొంచం పనుంది. .. మా ఇల్లు ఇక్కడే... రోడ్డుకవతల బస్టాప్ ఉందికదా దానికి రెండు సందుల అవతల సందులో.. నేను ఇంటికి వెళ్తాను.".

"మంచిది! వెళ్ళిరండి. మీ ఫ్యామిలీ ఫొటో ఇక్కడ ఉంచండి. మీ ఇంటి ఫోన్ నెంబర్ ఇచ్చి వెళ్ళండి. మీ అబ్బాయిని లోపలికి పంపండి."

శకుంతలమ్మ నెంబర్ వ్రాసిచ్చి వెళ్ళిపోయింది.

మొత్తానికి భలే కేసు. కొద్ది సేపు తనుకూడా శకుంతలమ్మే రోగి అని అనుకున్నాడు. అశోక్ తో ఎలా డీల్ చెయ్యాలి అని ప్రణాళిక వేస్తున్నంతలో అశోక్ లోనికి వచ్చాడు.

"రండి! కూర్చోండి." కూర్చున్నాడు అశోక్.

" మీ అమ్మగారు చాలా విషయాలు చెప్పారు" అన్నాడు సుందరం.

చిన్నగా నవ్వాడు అశోక్. " చెప్పాను కదా డాక్టర్. ఆవిడ చాలా కథలు చెబుతుంది" అలా అంటున్నప్పుడు మాత్రం ఆశోక్ లో ఒక రకమైన బాధను చూశాడు సుందరం.

" ఈ ఫొటో ఒక్కసారి చూస్తారా?" శకుంతలమ్మ ఇచ్చిన ఫ్యామిలీ ఫొటో అశోక్ ముందుకు జరిపాడు సుందరం.

అశోక్ ముఖాంలో చిరాకు. " మీరు అనుకున్నంత తెలివైన డాక్టర్ కాదు. లేకపోతే ఇంతచెప్పినా, మా అత్తయ్యతో మాట్లాడించినా ఇంకా .." ఒకరకమైన ఈసడింపుతో తన జేబులోంచి ఫొటో తీసి ఇచ్చాడు అశోక్. అందులో అశోక్ నెహ్రూగారు భుజాలమీద చేతులు వేసుకుని ఉన్నారు.

" ఇది నిజం కాదు" అన్నాడు సుందరం.

" అవును... అదీ నిజం కాదు... ఫొటోలు తయారు చెయ్యడం ఏమంత పెద్ద విషయం కాదు. ఏ ఫొటో స్టుడియోవాడైనా చేస్తాడు. ఈ రెండు ఫొటోలూ ఒకే స్టూడియోలో చేయించినవే.."

సుందరానికి కాస్త అసహనంగా ఉంది. రోగానికి తగ్గ చికిత్స సంగతి తరువాత. రోగం ఏమిటన్న సంగతి తరువాత ముందు అసలు ఎవరు రోగి అన్నదగ్గరే ఇంత సమయం అయిపోతోంది. శకుంతలమ్మ ఫోటో నిజమనిపిస్తోంది. ముఖ్యంగా ఆవిడ ఇలా మార్ఫించగలదా?

" డాక్టర్! ఒంటిచేత్తో ఆమె నన్ను చిన్నప్పటి నుండీ పెంచింది. ఎన్నో చూసింది. ఎంతో నేర్చుకుంది. కానీ ఇప్పుడిలా అనవసరమైన వాటికోసం ఉపయోగిస్తోంది. ఈ ఫొటో తెచ్చి చూపిస్తే ఏదో నాన్న జ్ఞాపకార్థం అలా తీయించింది అనుకున్నా. కానీ ఇలా..." అశోక్ మాటలు మధ్యలో ఆగిపోయాయి.

ఫొటోను మళ్ళీ చూశాడు సుందరం. అశోక్ ప్రక్కన శకుంతలమ్మ ఆ ప్రక్కన అశోక్ తండ్రి. పోలికలు చాలానే ఉన్నాయి... తండ్రి మరీ పెద్దవాడిలా అనిపించడం లేదు... జుట్టు నల్లగా... రంగు వేసుకున్నాడా? ఇది నిజమా? కాదా? ఇవి తెలుసుకోవడం పెద్ద విషయం కాదు. అయితే తనకు కొంత టైం వేస్ట్ అవుతుంది. వాళ్ళింటికి వెళితే చాలా విషయాలు తెలిసిపోతాయి.

" అశోక్... ఈ ఫొటో మీ అమ్మగారు ఎప్పుడు తీయించారు." ఫొటో కేసి చూశాడు అశోక్.

" ఈ ఫొటో నేనే తీయించాను. ఎప్పుడన్నది గుర్తులేదు"

" ఇందాకా .. మీ అమ్మగారు తెచ్చి చూపించారన్నార?" అడిగాడు సుందరం.

" లేదే! అమ్మానాన్నల జ్ఞాపకార్థం నేనే తీయించాను"

" కమగైన్! మీ నాన్నగారి ..జ్ఞాపకార్థం..." అయోమయంగా అడిగాడు సుందరం.

" ఒక్క నాన్నే కాదు డాక్టర్.. అమ్మానాన్నల జ్ఞాపకార్థం. నాకు ఊహ తెలిసే నాటికే వారిద్దరూ చనిపోయారు" సుందరం తల గిర్రున తిరిగింది.

" వాట్! మీ అమ్మగారు చనిపోయారా! ఏం మాట్లాడుతున్నారు. ఇప్పుడే కదా ఆవిడ బయటకు వెళ్ళింది." అసహనంగా అడిగాడు సుందరం.

"అదెలా సాధ్యం? మా అమ్మ నేను పుట్టిన వెంటనే .. చనిపోయింది"

సుందరానికి చిన్నగా తలనొప్పి మొదలయ్యింది. తమాయించుకున్నాడు. 'ఓకే! సరే! మొత్తానికి రోగి ఎవరన్నది తెలిసింది. మంచిదే' అనుకున్నాడు సుందరం.

అంతలో ఒక నర్స్ లోనికి వచ్చి " డాక్టర్! వెంటనే రావాలి....అర్జంట్ కేస్ " అని పిలిచింది.

వార్డులో ఏదైనా సమస్య వచ్చిందేమో అని వెంటనే లేచి అశోక్ తో ఇప్పుడే వస్తానని చెప్పి బయటకు నడిచాడు.

"ఏంటి ప్రోబ్లం?" అడిగాడు నర్స్ ని.

"బయట ఒక ఏక్సిడెంట్ జరిగింది. పేషెంట్ ని ఇక్కడకు తెచ్చారు. అప్పటికే ఆవిడ చనిపోయింది. పోలీసులు కూడా వచ్చారు"

అసలే చిరాగ్గా ఉన్న సుందరానికి ఇంకా చిరాకు కలిగింది. "నేను జనరల్ డాక్టర్ ని కాదు. మానసిక వైద్యుణ్ణి. డెడ్ బాడీని ఇక్కడకు ఎందుకు తీసుకు వచ్చారు?"

"చెప్పాం డాక్టర్... కానీ .. అసలు విషయం ఏంటంటే ఆవిడ.. ఓ పదినిమిషాల క్రితం ఇక్కడనుండి వెళ్ళడం ఒకరిద్దరు చూశారట... అందుకే..."

ఒక్కసారిగా సుందరం గుండె జారిపోయింది. అడుగు తడబడింది. తూలి పడిపోయాడు.

"డాక్టర్... ఆర్ యూ ఆల్రైట్?" ఆందోళనగా అడిగింది నర్సు.

"కొంచం మంచినీళ్ళు తీసుకురా" అని పంపించివేశాడు నర్స్ ని. ఆ చనిపోయిన వ్యక్తి ఎవరో సుందరానికి అర్థమైపోయింది. ఆమె శకుంతలమ్మ... అదేమంత విషయం కాదు... సుందరం గుండె దడకు కారణం వేరు... సరిగ్గా ఆమె చనిపోయిన సమయంలో అశోక్ తనతో మాట్లాడుతున్నాడు. అప్పటిదాకా అమ్మగురించి చెప్పినవాడు ఒక్కసారిగా అమ్మ చిన్నప్పుడే చనిపోయిందన్నాడు.. అతడికి తల్లి మరణం ఎలా తెలిసింది? ఈ ఆలోచనతో సుందరానికి చెమట్లు పట్టాయి. 'ఒకవ్యక్తి జ్ఞాపకాలు పూర్తిగా చెరిపేసుకోగలగడం... అసాధారణమైన విషయమైనా.... అసాధ్యమేం కాదు. దానికి సహజమైన విధానాలు ఉన్నాయి... కృత్రిమమైనవి ఉన్నాయి.. అశోక్ అటువంటి అసాధారణ వ్యక్తి అనుకున్నాడు. అయితే ఇప్పుడు జరిగింది అసాధ్యం. అశోక్ కి.. తన తల్లి మరణం.... ఎటువంటి మాధ్యమం లేకుండా ఆ విషయం అతనికి ఎలా తెలిసింది? అతీంద్రియమైన ఈ శక్తి ఏమిటి? ఇది నిజమేనా? ఒక్కసారి డెడ్ బాడీని చూసి అది శకుంతలమ్మే అని కన్‌ఫర్మ్ చేసుకోవాలి.'

నర్స్ తెచ్చిన నీళ్ళు త్రాగి లేచాడు సుందరం. మెల్లగా నర్స్ తో వెళ్ళాడు. ఇద్దరు కానిస్టేబుల్స్ మరో ఇద్దరెవరో ఉన్నారు. తమ హాస్పిటల్ స్టాఫ్ కొంతమంది ఉన్నారు.

"ఈవిడ ఇక్కడ రోడ్డు క్రాస్ చేస్తూ ఉంటే వేన్ గుద్దేసింది. ఆ దెబ్బకి ఎగిరి డివైడర్ మీద పడి తల పగిలిపోయింది. ఈవిడ ఇక్కడనుండి బయటకొచ్చారని ఈ ఇద్దరూ చెప్పారు.. మీరోసారి చూసి... ఆవిడ వివరాలు...ఆ రిపోర్ట్ అదీ ఇచ్చేస్తే... మా పని సులువైపోతుంది." చెప్పాడొక కానిస్టేబుల్.

అప్పటికే నర్సులు తలకి కట్టుకట్టారు. అయినా తెలుస్తోంది. ఆమె శకుంతలమ్మే! ఒక్కసారిగా సుందరానికి ఊపిరి అందలేదు. ఆయసంతో ఎగఊపిరి వచ్చింది. పరిస్థితి గమనించిన నర్స్ వెంటనే మాస్క్ పెట్టి, పాసిఫైర్ ఇంజెక్షన్ ఇచ్చింది. నెమ్మదిగా స్థిమిత పడ్డాడు సుందరం.

"ఈమే ఒక గంట క్రితం వాళ్ళ అబ్బాయిని తీసుకుని వచ్చింది. చికిత్సకోసం. వాళ్ళబ్బాయి నా కేబిన్ లో ఉన్నాడు." చెప్పాడు సుందరం.

కానిస్టేబుల్స్ వెళ్ళారు.

'ఇదెట్లా సాధ్యం. భౌతికంగా కాంతిని మించిన వేగం దేనికీ ఉండదు. ఒకదగ్గర జరిగిన మార్పు వేరొక దగ్గరకు చేర్చే అత్యంత వేగవంతమైన మాధ్యమం కాంతి తరంగం. కానీ కొన్ని ప్రత్యేకమని అణువులు జతలుగా ఏర్పడతాయి. వాటి మధ్య భౌతికంగా మనకు తెలియని విడదీయరాని బంధం ఏదో ఉంటుంది. అటువంటి పదార్థాలు రెండూ ఎంతదూరంలో ఉన్నా ఎటువంటి భౌతికమైన మాధ్యమం లేకపోయినా ఒకదాన్ని మారిస్తే తత్క్షణం తదనుగుణంగా రెండవది మారిపోతుంది. మనిషి మనసుకు సంబంధించి ఇలాంటి వింతలు ఎన్నో! ముఖ్యంగా కవలల విషయంలో ఈ బంధము ఎన్నో ప్రయోగాలలో నిరూపితమయింది. తల్లీ బిడ్డల మధ్య అస్పష్టమైన ఇటువంటి బంధాన్ని కూడా చెబుతుంటారు. కానీ ఇలా ఒక వ్యక్తికి సంబంధించిన జ్ఞాపకాలకు అతని జీవించి ఉండే గుణానికి మధ్య ఇటువంటి కనక్షన్ ఉండడం ఆ వ్యక్తి మరణించిన క్షణం ఇవి చెరిగిపోవడం. చాలా విచిత్రమైన విషయం. ఇది కేవలం దగ్గరవాళ్ళ విషయంలోనే పనిచేస్తుందా? లేక ఎవరితోనైనా ఇదే బంధం కలిగి ఉంటుందా?' సుందరం మెదడులో ఎన్నో ఆలోచనలు. 'ఇది ఒక అద్భుతం. తన జీవితంలో ఇటువంటి వింతను చూడగలనని ఊహించలేదు. దీని మీద పరిశోధన చెయ్యాలి. యస్. తన జీవితాన్ని మలుపు తిప్పే అవకాశం ఇది. అసలు నవీనవిజ్ఞానం పునాదులే బీటలు పడే విషయం' ఆలోచిస్తున్న కొద్దీ సుందరంలో ఉద్వేగం పెరిగిపోతోంది.

"అక్కడ ఎవరూలేరు" అన్న కానిస్టేబుల్ మాటలతో వాస్తవానికివచ్చాడు డా॥సుందరం.

'నో... ఎలాగైనా అశోక్ తో మాట్లాడాలి. యస్... ఫోన్... శకుంతలమ్మ ఇచ్చిన ఇంటి నెంబర్!'

"నర్స్!" అరిచాడు సుందరం. పరుగున వచ్చింది నర్స్. "వెళ్ళి టేబుల్ మీద శకుంతలమ్మ పేరుతో ఫోన్ నెంబర్ ఉంటుంది. తీసుకురా....". క్షణాలలో నర్స్ తెచ్చింది. ఆ క్షణాలే యుగాలుగా ఉంది సుందరానికి. అసలేం జరుగుతోందో, ఎందుకు డాక్టర్ ఇంత అసహనంగా ఉన్నారో అర్థంకాక చూస్తున్నారు అక్కడందరూ.

వణుకుతున్న చేతులతో నెంబర్ డైల్ చేశాడు సుందరం. రింగవుతోంది.... ఎవరూ ఎత్తడం లేదు. డా॥ సుందరం అణువణువూ చైతన్యంతో ఊగిపోతున్నాయి.

అంతలో.. "హలో!"

"అశోక్ ! నేను సుందరం. అర్జంట్ గా మీతో మాట్లాడాలి. వెంటనే క్లినిక్ కి రండి"

"ఎవరు మాట్లాడేది?"

" నేను డాక్టర్ సుందరాన్ని"

"సారీ! మీరెవరో నాకు తెలియదు..."

ఒక్కసారి రక్తం జివ్వుమని నరనరాలలో ఎగసి కుప్పకూలిపోయాడు సుందరం. !!




# దైవం సాక్షిగా

పోలంరాజు శారద

తిరుమల మీద. అర్ధరాత్రి సమయం. గుళ్ళో అర్చకులందరూ స్వామివారికి పవళింపు సేవ పూర్తి చేసి గర్భ గుడిలో నుండి బయటకు వెళ్ళిన తరువాత అమ్మవారికి స్వామి వారి చెంతకు చేరటానికి సమయం దొరికింది.

"అమ్మయ్య మంచి చెడు చెప్పుకోవటానికి ఇప్పుడైనా కాస్త సమయం చిక్కింది. తెల్లవారక ముందు నుండే భక్తులకు అభయ హస్తం ఇస్తూ ఎంత అలసి పోయినారో?" చిరునవ్వుతో స్వామివారి పాదాలు నొక్కుతూ ఉన్న దేవేరి వంక చిరునవ్వుతో చూస్తూ, "దేవీ, ఏదో సమస్య వివరించటానికి వచ్చినట్టు నీ ముఖంలోని ఆందోళనే తెలియ చేస్తున్నది. కానీయి, మళ్ళీ త్వరలో అర్చకులు సుప్రభాతంతో మేలుకొలుపు పాడటానికి వచ్చేస్తారు. నీ బాధ ఏమిటో చెప్పితే చేయగలగినదేమైనా ఉంటే చేద్దాము."

"చాల్లెద్దురూ మరీ చెప్పొచ్చారు. మీకు తెలియని విషయాలు ఏమీ కాదు. ఇన్ని వందల సంవత్సరాల నుండి ఎన్ని వేల పెళ్ళిళ్ళు చూస్తున్నాము కదా, మరీ ఇంత ఘోర కలికాలమేమిటండీ? మళ్ళీ తిరిగి మంచి రోజులు వస్తాయంటారా?"

"పిచ్చి దేవేరీ, మార్పు అన్నది సహజమే కదా! అది మానవులే చెప్పిన మాట. అన్నిటికన్నా త్వరగా మారుతున్నది ఏమిటంటే మార్పే. కనుక ఆ మార్పును పెద్ద మనసు చేసుకొని ఆశీర్వదించటము, మౌనంగా చూస్తూ ఉండటమే మనం చేయవలసిన పని."

"అంతేనంటారా? ఇంక మనం చేయదగ్గది ఏమీ లేదంటారా? ఒకప్పుడు ఎట్లా ఉండే వారు. ఎందుకు ఇట్లా మారిపోయినారు"

దిగులుగా చూస్తున్న దేవి వైపు మందహాసంతో చూస్తూ,

"అంతా గ్లోబలైజేషన్ మహిమ దేవీ"

అమ్మవారు ఆలోచనలో పడ్డది. తన కళ్ళ ఎదురుగా ఎన్ని మార్పులు. ఆలోచనలు వెనక్కి వెళ్ళాయి...........

★★★★★★★★★

1990 వ సంవత్సరం.

శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మంటపం.

సమయం రాత్రి 10 గంటలు.

పచ్చి కొబ్బరి మట్టలతో కట్టిన మండపం. వైశాఖ మాసం. మొత్తం మల్లెల గుబాళింపులతో వధూవరులకు మెళ్ళల్లో వేసిన కర్పూరమాలల నుండి వస్తున్న పరిమళంతో వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. తెల్లవారుఝామున ముహూర్తం అయినందున

పెళ్ళికూతురు వైపు పెళ్ళి కొడుకు వైపు ముఖ్యమైన బంధువులంతా కలిపి వందమంది మాత్రమే ఉన్నారు. సరసాలు సరదాలతో సాగిన పెళ్ళి వేడుకలు కళ్ళారా చూసే అవకాశం కలిగింది. అందరూ కొద్దిగా కోడి కునుకులు తీసి లేచాక మరునాటి ఉదయం మిగతా పెళ్ళి తంతు జరుగుతుండగా బంధు మిత్రులు రావటం అరిటాకులలో భోజనాలు వడ్డించి వధూవరులను ఆటపట్టిస్తూ పాటలు పాడుతూ భోజనాల కార్యక్రమం జరిగింది.

సాయంత్రం ముత్తైదువలు అందరూ కూడి నూతన వధూవరులను కూర్చోబెట్టి మేజువాణి అని సరదాగా ఒకరి చేత ఒకరికి కుంకుమ గంధం పెట్టించి పన్నీరు చల్లించి, పూలబంతితో బంతులాట ఆడించారు. సరదాగా పెళ్ళి పాటలతో వేడుకగా సాగిన ఆ ముచ్చట దూరంగా కూర్చున్న మగవారు కూడా ఆనందంగా తిలకించారు. అందరూ వారివారి పెళ్ళినాటి ముచ్చట్లు నెమరు వేసుకో సాగారు.

అప్పగింతల సమయం ఆసన్నమవుతున్నది. ఆడువారంతా తెల్లటి చీరలు, ముత్యాలనగలు, మగవారంతా తెల్లని పంచలు, పైజామాలాల్చీలతో తయారయి బూజంబంతి వేడుకగా చేసుకున్నారు. భోజనాలు కూడా సాంప్రదాయమైన పద్ధతిలో, వధూవరులకు వెండి కంచాలు పెట్టి చుట్టూ పిండితో ముగ్గులు వేసి, అరటికాయలు కోసి వాటిలో అగరుబత్తులు పెట్టి, తెల్లని పదార్థాలు, పెరుగు వడలు, సగ్గుబియ్యం వడియాలు, కొబ్బరి అన్నం, దద్దోజనంతో వడ్డించి, మళ్ళీ వియ్యాలవారు ఒకరిమీద ఒకరు విసుర్లు విసురుకుంటూ పెళ్ళిపాటలు పాడుతూ ఆనందించారు.

పెళ్ళికూతురికి వడిబియ్యం కట్టి తల్లితండ్రి మధ్యలో కూర్చోబెట్టుకొని పాలల్లో చేతులు ముంచి కన్నీళ్ళతో ఒక్కొక్కరికి అప్పగింతలు పెట్టటం కూడా అయింతరువాత కడసారిగా తల్లి పెరుగన్నం తినిపించటానికి లోపలికి తీసుకెళ్ళింది.

నాయనమ్మ మేనత్త వంటి పెద్దలంతా అమ్మాయికి సుద్దులు చెప్పటం మొదలెట్టారు.

"అమ్మలూ, ఇంక నువ్వు అత్తింటి కోడలివి. అక్కడ అందరితో కలివిడిగా వుండాలి. కొత్తల్లో వాళ్ళ ఆహారపు అలవాట్లు, పద్దతులు కొత్తగా అనిపిస్తాయి. కాని మెల్లిగా అలవాటు చేసుకోవాలి."

"మీ అత్తగారి వెనకనే వుంటూ అన్ని నేర్చుకోవాలి."

"చీటికి మాటికి బెంగగా వున్నదని ఇక్కడికి ఫోన్ చేయకూడదు. మీ అత్త మామల అనుమతి తీసుకొని నీ భర్తతో రావాలి తప్ప నువ్వు ఒక్కతివి రాకూడదు."

"నీ వయసు ఆడబిడ్డలు వున్నారు. వాళ్ళతో స్నేహంగా వుంటూనే మర్యాదగా చూసుకోవాలి."

"వేళా పాళా లేకుండా ఒక్కతివి గదిలో తలుపులేసుకొని పడుకోకూడదు. ఇంటికి వచ్చిన అతిథులను నవ్వుతూ పలకరించాలి."

చివరగా తల్లి దుఃఖాన్ని అదిమి పెట్టి మాట్లాడింది. "విన్నావుగా అమ్మలూ. పుట్టినింటికి మెట్టినింటికి పేరు తేవాలి."

"అట్లాగేనమ్మా. నువ్వు నాన్న అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ వుండండి." తల్లిని వాటేసుకొని భోరుమంది.

★★★★★★★

విడిదింట్లో దృశ్యం.

"మంచి సాంప్రదాయమైన కుటుంబం. మర్యాదలన్ని ఘనంగా చేశారు."

"పాపం . పెళ్ళికూతురు చాల నెమ్మదస్తురాలిలా వుంది."

"వదినా కొత్త కోడలికి నెమ్మదిగా అన్ని పనులు మన పద్ధతులు నేర్పించాలి."

"ఒరేయ్ బాబూ, జాగ్రత్తగా పుట్టింటి మీద బెంగ లేకుండా నువ్వే చూసుకోవాలి. అమ్మ నాన్నలను మరిపించేలాగా వుండాలి."

పెళ్ళి మంటపం లో గోడకు తాపడం చేసివున్న నిలువెత్తు వెంకటేశ్వరస్వామి, అమ్మవారు, చిరునవ్వుతో భర్త చిటికిన వేలు పట్టుకొని నడుస్తున్న వధువును రెండు చేతులెత్తి మనసార ఆశీర్వదించారు.

ఆ దృశ్యం కళ్ళ ముందు కనిపించిన అమ్మవారి పెదవుల మీదకు చిరునవ్వు తళుక్కున మెరిసింది.

★★★★★★★

మరో దృశ్యం.....

2000 సంవత్సరం.

అదే కళ్యాణ మండపం. పేరు మార్పు. వెంకటేశ్వర మ్యారేజి హాల్.

బెంగుళూరు నుండి తెప్పించిన ఆర్నమెంటల్ పూల అలంకరణ. పొద్దున పెళ్ళి సాయంత్రం రిసెప్షన్ అయిన తరువాత వియ్యపురాలు వచ్చి చెప్పింది. "వదినగారూ, అమ్మాయికి మళ్ళీ మధుపర్కాలు కట్టించి వడిబియ్యం కట్టి అప్పగింతలు ముగిస్తే త్వరగా బయల్దేరుతాము. పొద్దున్నే లేచి వ్రతానికి ఏర్పాట్లు చేసుకోవాలి."

"అప్పగింతలు ఏంటి మమ్మీ." రిసెప్షన్ డ్రెస్ లో వున్న పెళ్ళికూతురు అడిగింది.

"అది కూడా పెళ్ళి తంతులో ఒకటి. మీ అమ్మ నాన్న నిన్ను మాకు అప్పగిస్తారన్నమాట" ఆవిడే అందుకొని నవ్వుతూ సమాధానం చెప్పింది.

ఆవిడవైపు కూడా చూడకుండా, "మమ్మీ వాటీస్ దిస్ నాన్సెన్స్! పొద్దున కన్యాదానం అంటే ఏదోలే ఒప్పుకున్నాను. నేనేమయినా ఒక గాజు వస్తువునా, బొమ్మనా ఎవరికో దానమివ్వటానికి అప్పగించటానికి. సారీ ఆంటీ ఈ చాదస్తపు సీన్స్ నాకు ఇష్టం లేదు. ఇంకా ఆ దిక్కుమాలిన చీర మళ్ళీ కట్టుకోను. ఇట్లాగే బయల్దేరుతాను." అంటూ విసవిసా హై హీల్ జోళ్ళు టకటక లాడించుకుంటూ లోపలికి వెళ్ళింది.

"అమ్మడూ అన్ని వేడుకల లాగా అప్పగింతలు కూడా కార్యక్రమంలో ఒక భాగం. అంతే గాని నిన్నెవ్వరికి అప్పగించటం కాదు. దానం ఇవ్వటం కాదు. ఒప్పుకోమ్మా ప్లీజ్." తల్లి తండ్రితో పాటు ఎంతమంది ఎన్ని రకాలుగా నచ్చచెప్పచూసినా ససేమిరా ఒప్పుకోలేదు.

ఇంక తప్పనిసరై అందరూ ఆమెకే తలొగ్గారు. "సరే లోపలికి రా కాస్త పెరుగన్నం తినిపిస్తాను" అన్న తల్లి మాటలకు, "వ్వాట్ ఈ వేళప్పుడు నేనెప్పుడైనా పెరుగన్నం తిన్నానా? కావాలంటే ఒక కప్పు ఐస్ క్రీం ఇవ్వు తింటాను"

"అత్తారింటికి వెళ్ళుతున్నావు. ఇట్లా అక్కడకూడా మంకుతనం చేయకూడదు" అంటూ ఏదో చెప్పబోతున్న నాయనమ్మను ఇతర పెద్దవాళ్ళను ఒక్కసారిగా గదమాయించి "మీ ముసలి సుత్తి నీతులు మొదలెట్టవద్దు. ఎట్లా వుండాలో, ఏం చేయాలో నాకు బాగా తెలుసుకాని మీరందరు నోరు మూసుకొని బయటకు నడవండి."

ఆమె వయసు వాళ్ళే కజిన్స్, ఫ్రెండ్స్ చుట్టూ చేరారు.

"కంగ్రాట్స్, అందరికి భలే జబాబు చెప్పావే. చూసావా మీ అత్త మొహం ఎట్లా మాడి పోయిందో. చదువుకుని వుద్యోగం చేస్తున్నా ఆ శాల్తీ చూడబోతే చాదస్తపు మొగుడులా ఉన్నాడు. నువ్వు గట్టిగా వుండకపోతే అంతే సంగతులు."

"మీ తోడికోడలిని చూస్తున్నాముగా, ప్రతిదానికి అత్తయ్యగారు, మామయ్యగారు అంటూ వాళ్ళ అనుమతి లేకుండా కాలు కూడా కదపనట్టు గా వుంది. అంత పెద్ద వుద్యోగం ఎట్లా వెలగపెడుతున్నదో ఏమో."

"మీ ఆయన కూడా పెద్ద దేభ్యం మొహంలా వున్నాడు, అమ్మా వదినా అనుకుంటూ. అమ్మ కొంగు నుండి బయటకు లాక్కురా. ఇంటి పెత్తనమంతా ఆ ముసలాళ్ళదిలాగా వుంది. మీరిద్దరికి తిండికి ఎంతవుతుందో లెక్క కట్టి మిగతాదంతా దాచేయి. నీ సంపాదన, బాంక్ ఎకౌంట్ నీ మొగుడికి కూడా తెలియనివ్వ వద్దు. అతగాడికి చెల్లెలంటే అతి ప్రేమ వున్నట్టు వున్నది. మెల్లిగా అన్నల దగ్గర గారాలు పోతూ అంతా నొక్కేటట్టున్నది. కాస్త ఆ పిల్లను దూరంగా పెట్టు."

"నీ అలవాట్లు ఏవీ మార్చుకోనక్కర్లేదు. ఇక్కడ ఎట్లా వున్నావొ అక్కడ కూడా అట్లాగే వుండు. అంతే కాని పొద్దున్నే లేచి వంటింట్లోకి వెళ్ళాల్సిన ఖర్మ నీకేమీ లేదు. నీ పుట్టింటికి రావటానికి ఎవరి అనుమతులు అక్కరలేదు. నీకు ఎప్పుడు బుద్ది పుడుతే అప్పుడు రావచ్చు. ఎన్నాళ్ళు వుండాలనిపిస్తే అన్నాళ్ళు వుండవచ్చు."

ఈ విధంగా కుర్రకారు ఇచ్చిన ఇస్తున్న సలహాలు వరదలా పారసాగాయి.

"కమాన్. డోంట్ వరీ యార్. నా గురించి మీరెవ్వరు బెంగ పడవద్దు. ఎంగేజిమెంట్ అయింతర్వాత ఈ ఆరు నెలల్లో నేను అన్ని గమనిస్తూనే వున్నాను. ఏం చేయాలో అంతా ప్లాన్ చేసాను. అత్తలేదు దుత్తలేదు. నామీద ఎవరైనా పెత్తనం చెలాయించబోతే వాళ్ళ పనైపోయినట్టే. ఒక్క నెల రోజుల్లో అతను నా వెనక కుక్కపిల్లలాగా తిరగటం మీరందరూ చూస్తారుగా."

★★★★★★★

విడిదింటి దృశ్యం.

పెళ్ళికొడుకు చుట్టూ ఫ్రెండ్స్. "మన వాళ్ళకు కొందరికి జరిగిన అనుభవం వల్ల ఇన్నాళ్ళు పెళ్ళి వాయిదా వేస్తూ వచ్చావు. అయినా ఈ రొంపి లోకి దిగక తప్పలేదు. ఎట్లా మేనేజి చేస్తావో ఏమో"

"ఆ అమ్మాయి చూస్తే చాల ఫాస్ట్ గా వుంది. మీ జాయింట్ ఫామిలీ లో ఎట్లా వుంటుందో."

"ఫాస్ట్ గానే కాదు ఆ నడక చూపు మాట అన్నిట్లో పొగరే, మన వాడితో సమానంగా సంపాదిస్తున్నదని గర్వం కనిపిస్తున్నది. జాగ్రత్త."

"ఎంగేజిమెంట్ తర్వాత ఇన్నాళ్ళూ తిరిగారు, కాని అసలు రంగు ఇక ముందు బయట పడుతుంది. కాస్త జాగ్రత్తగా మసులుకో. అసలే మీది సాంప్రదాయమైన కుటుంబం." ఫ్రెండ్స్ మాటలతో ఆ పెళ్ళికొడుకు బెదిరిపోతున్నాడు.

గోడమీద వున్న వెంకన్న అమ్మవారివైపు చిద్విలాసంగా చూశాడు. అమ్మవారు మటుకు కళ్ళు విప్పార్చుకొని "అవ్వ" అంటూ నోరు నొక్కుకున్నది.

అమ్మవారు ఒక్కసారి ఉలిక్కి పడింది. అమ్మో!

★★★★★★★★

2015 సంవత్సరం.

అదే కళ్యాణ మంటపం. కాకపోతే పేరు మార్పు. ఎస్.వి ఫంక్షన్ హాల్. అంతా మారి పోయింది. పూర్తిగా ఎయిర్ కండిషన్డ్. పాపం ఎవరి సెంటిమెంటో ఏమో, గోడమీద దేవుళ్ళపటాలు మాత్రం అట్లాగే వున్నాయి.

హాలంతా బెలూన్లతో అలంకరణ. వందమంది దాకా అరకొర పాశ్చాత్య దుస్తులలో యువతీ యువకులు. పెద్దగా వున్న మ్యూజిక్ కు అనుగుణంగా డాన్స్ చేస్తూ వున్నారు.

ఒక్కసారి సంగీతం హోరు ఆగింది. అలంకరణలో ఒక యువతీ యువకుడు అక్కడికి రావటం తోనే అందరూ చప్పట్లతో వాళ్ళను ఆహ్వానించారు.

వారిద్దరూ చేతులు పైకి లేపి "హాయ్" అని అన్నారు. పక్కన ఫుల్ మేకప్ లో ఉన్న యువతి భుజం చుట్టూ చేయి వేసి దగ్గరగా లాక్కొని యువకుడు మాట్లాడటం మొదలెట్టాడు.

"ఫ్రెండ్స్, మీకందరికి తెలిసిన విషయమే అయినా నేను మళ్ళీ ఒకసారి చెప్పుతున్నాను. ఈ రోజు నుండి మేమిద్దరమూ కలిసి జీవించాలి అని నిశ్చయించుకున్నాము. ఆ సందర్భంగా మేమిస్తున్న ఈ పార్టీకి వచ్చినందుకు మీకందరికి థాంక్స్.

మీరందరి సాక్షిగా మేము కొన్ని నిబంధనలతో ఒప్పందం చేసుకో బోతున్నాము. వాటి ప్రకారం,

మా ఇద్దరిలో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అన్న తేడా వుండదు. ఇద్దరమూ సమానులమే.

ఎవరి ఆర్థిక స్వాతంత్రం వారికి వుంటుంది. ఎవరు కూడా రెండవ వ్యక్తి పెట్టుకున్న ఖర్చు గురించి కాని వారు ఎక్కడికి వెళ్ళుతున్నారు, ఎప్పుడొస్తారు అని కాని ఇంకొకరు ప్రశ్నించే అధికారం వుండదు. ఇంటికయ్యే ఖర్చులు సమానంగా పంచుకోవాలి.

పర్సనల్ విషయాలలో తల దూర్చకూడదు.

ఏ ఒక్కరికైనా ఈ బంధం బోరు కొడుతున్నట్టు అనిపిస్తే వెంటనే విడి పోవచ్చు. ఇక్కడ సెంటిమెంటుకు తావు లేదు. విడిపోయే సమయంలో సంతానం కలిగి వుంటే ఆ బాధ్యత చెరి సగం పంచుకోవాలి." చదువుతున్న అతను ఆగాడు.

"మీ మారేజి రిజిస్టర్ చేయటానికి ఆఫీసర్ ఇంకా రాలేదేంటీ." ఎవరో కుతూహలంగా అడిగాడు.

"మాఇద్దరికి కూడా ముందర జరిగిన పెళ్ళిళ్ళ విడాకులు కోర్టు నుండి రావటానికి ఇంకా రెండు నెలలు పట్టవచ్చు. ఆ తర్వాతే మేము రిజిస్టర్ మారేజి చేసుకోవటానికి వీలు పడుతుంది."

ఇద్దరూ ఆ ఒప్పందపు రెండు కాపీల కాయితాలమీద సంతకాలు పెట్టారు. కొందరు మిత్రులు ముందుకు వచ్చి సాక్షి సంతకాలు కూడా చేసారు.

"కమాన్ ఫ్రెండ్స్ ఎంజాయ్. మీకు కావలసిన డ్రింక్స్ ఫుడ్ రెడీగా వుంది. ఎటాక్." అనగానే అక్కడ గుమి కూడిన వారందరూ శుభాకాంక్షలతో, కానుకలతో వారిద్దరిని అభినందించి ఇష్టమొచ్చినట్టు డ్రింక్స్ కొట్టి మళ్ళీ హోరెత్తించే మ్యూజిక్. డాన్సు మొదలయ్యాయి.

మౌనంగా చూస్తున్న కలియుగ దైవం చిలిపిగా అమ్మవారివంక చూశాడు. పట్టరాని కోపంతో ఆవిడ గట్టిగా కళ్ళు మూసుకొని రెండు చేతులతో చెవులు కప్పుకొని అక్కడి నుండి మాయమయ్యింది.

ఆ రోజే జరిగిన పెళ్ళి వేడుకలు అనే ఆ ప్రహసనం గుర్తుకొచ్చిన అమ్మవారు సిగ్గుతో తల దించుకొని కదిలి పోయింది.

"ఎంతలో ఎంత మార్పు? నిజమైన కలికాలం అంటే ఇదేనేమో!"

కథా కౌముది

# పురుషులందు ....! డా. పేరం ఇందిరా దేవి

ఆఫీసు పని ఒత్తిడిలో చిరాగ్గా వున్ననాకు సెల్ లో నాగిరెడ్డి పేరు చూడగానే ఇంకా చిరాకేసింది. వాడికేం స్కూల్లో చెప్పాల్సిన చదువులు చెప్పేసి హాయిగా ఇంటికొచ్చి, స్నానం చేసి తెల్లటి జిబ్బా,పైజామా వేసుకుని ఇంటికి దగ్గరగా వున్న పార్కుకు వ్యాహ్యాళికి వచ్చేస్తాడు. అక్కడికి వచ్చినప్పటి నుండి "ఎప్పుడొస్తావ్?" అని నాకు ఫోన్ చేస్తూనే ఉంటాడు. నేను ఆఫీసు నుండి ఎంత ఆలస్యంగా వచ్చినా, నా కోసం ఎదురు చూస్తూనే ఉంటాడు. నేను వూర్లో లేకపోతే పార్క్ నుండే చెప్పాల్సిన కబుర్లు చెబుతాడు. నిజానికి నాగిరెడ్డితో పార్కులో నడుస్తూ కబుర్లు చెప్పడం, వినడం కంటే ఆనందాన్ని ఇచ్చే విషయమే లేదు నాకు. నా వుద్యోగం జిల్లా పరిషత్లో సీనియర్ అసిస్టెంట్, పని ఒత్తిడి ఎక్కువ, ఇంటికి వచ్చేప్పటికి ఒక్కోసారి ఏడు కూడా దాటుతుంది. పని ముగించుకుని ఇంటికి వస్తూ నాగిరెడ్డికి ఫోన్ చేశా.

"ఏరా బిజీనా.... ? "

"అంతే కదా ... తల వాచిపోతోంది ... నా వుద్యోగం సంగతి తెలుసు కదా! "

"అది కాదురా.. మా తమ్ముని స్నేహితుడు రహీమ్ అని మంచి గాయకుడు, మన స్కూల్లోనే చదివాడు, దుబాయ్ నుండి వచ్చాడు, పాటలు పాడించుకుందామని రమ్మన్నా మన పార్కుకు, సుబ్బన్న కూడా వూర్లో వున్నాడు, వస్తానన్నాడు,నువ్వు వుంటే బావుంటుందని ... "ఆగిపోయాడు నా చిరాకు పసిగట్టి.

నాగిరెడ్డి చాలా సాత్వికుడు,సైన్స్ టీచర్ గా టవున్ కు దగ్గరగా వుండే గార్లేయపురం అనే పల్లెలోని హైస్కూల్లో పని చేస్తాడు. అందరితో కలుపుగోలుగా ఉంటాడు, అందరికి ఏదో చేయాలని ఆరాటపడుతుంటాడు, అతనికి అందరిలోనూ మంచే కనపడుతుంది,ఎవరికీ కష్టం వచ్చినా ముందుగా స్పందిస్తాడు. చేతుల్లో వున్నడబ్బును లేదనకుండా ఖర్చు చేస్తాడు. సహజంగానే కళల పట్ల కొంచం ఆరాధన వుంటుంది అలాంటి వాళ్లకు; ఇంక దుబాయ్ నుండి వచ్చిన ఆ గాయకుడ్నిఎంత ఆకాశానికి ఎత్తేస్తాడో ...! ఎంత ఖరీదైన శాలువ కొనుక్కొచ్చి ఉంటాడో అని నాలో నేను నవ్వుకుని, "సరే వస్తున్నాలే " అన్నా.

ఇంటికి పోకుండా పార్కుకే వెళ్ళా. మా ఇద్దరికీ తెలిసిన వాళ్ళని కొందరిని, మా చిన్ననాటి స్నేహితుల్నిఅక్కడ సమావేశ పరిచాడు నాగిరెడ్డి. రహీమ్ ను చూడగానే చిన్నప్పుడు చూసిన ముఖం గుర్తొచ్చింది, పరిచయాలు,పాతజ్ఞాపకాలు గుర్తు చేసుకోవడం అయాక రహీమ్ పాటల సందడి మొదలయ్యింది. "పూలు గుసగుస లాడేనని, సైగ చేసేనని " పాటతో అక్కడ ఉత్సాహం వెల్లివిరిసింది."ఇదేపాట ప్రతిచోట", "శారదా నను చేరదా," "ఏ దివిలో విరిసిన పారిజాతమో," "శివరంజని నవరాగిణి ," ఇలా పాటలు సాగిపోతున్నాయి. అందరం

మైమర్చిపోతున్నాం, నాగిరెడ్డి మాత్రం ఎవరికో తెగ ఫోన్ చేస్తున్నాడు, కలుస్తున్నట్లు లేదు, ప్రయత్నం చేస్తూనే వున్నాడు. రహీమ్ కాఫీ బ్రేక్ తీసుకున్నప్పుడు అడిగా నాగిరెడ్డిని "ఎవరికీ ఫోన్, పాటలు వినకుండా? "

"సుబ్బన్న వస్తానన్నాడు, రాలేదు, ... నిన్ననే చెప్పా, రహీమ్ వస్తున్నాడు, రమ్మని. ..గుర్తు చేయమన్నాడు, ఫోన్ చేస్తుంటే లిఫ్ట్ చేయలేదు...మధ్యానమే ఏదో సైట్ చూడ్డానికి వెళుతున్నాను, సాయంత్రం తప్పక వస్తానని ఫోన్ కూడా చేశాడు " అని మళ్ళీ ఫోన్ చేయడంలో మునిగిపోయాడు.

గాడిద కేమి తెలుసు గంధపు వాసన అని ఈ తిక్క నాగిరెడ్డి, సుబ్బన్నకు రహీమ్ పాటలు వినిపించాలని ప్రయత్నించడం ఏమిటి? భూమి సూర్యుని చుట్టూ తిరిగినట్లు సుబ్బన్న జీవితం అంతా రియల్ ఎస్టేట్ చుట్టూ తిరుగుతుంది. సుబ్బన్న హైస్కూల్ వరకు మా క్లాస్మేట్ .. పొట్టిగా చిన్నగా పీలగా ఉండేవాడు. గర్భంతో వున్న స్త్రీ తొమ్మిది నెలలు మాత్రమే బిడ్డను మోస్తుంది ,కానీ పొట్ట పెంచుకున్న మగాళ్ళు పాపం దాన్ని జీవితాంతం మోయాల్సిందే. సుబ్బన్న డబ్బుతో పాటు, బానపొట్టను, కబ్జా కింగ్ అనే పేరు కూడా సంపాదించాడు. ఇంటర్ తో చదువాపేసి చిన్నగా వ్యాపారంలో దిగి.. అంచెలంచలుగా ఎదిగాడు. పిల్లనిచ్చిన మామ,బావమరిది కూడా అదే ఫీల్డ్ కాబట్టి రాయలసీమ, సర్కారు, తెలంగాణా కాకుండా రాయచూరు, షోలాపూర్ లో కూడా చాలా వెంచర్స్ వేసి కోట్లు గడించాడు. నా కంటే నాగిరెడ్డికి సుబ్బన్నతో చనువెక్కువ అప్పుడప్పుడు కలుస్తుంటాడు. నాగిరెడ్డి సుబ్బన్నచేసే కబ్జాల గురించి పేపర్లో వచ్చినప్పుడు చాలా విచారించేవాడు. 'వీడికి ఈ భూదాహం ఎప్పుడు తీరుతుందో?' అనేవాడు ... "వాడ్ని భూమిలో పాతి పెట్టినప్పుడు "అనుకునేవాడ్ని. ఇంతకూ ఈ రోజు సుబ్బన్న వచ్చేవరకు రహీమ్ ను ఇంటికి పంపడేమో !

నేను ఆలోచనల్లో ఉండగానే రహీమ్ శ్రోతల అభిరుచి మేరకు ఏయే పాటలు పాడాలో తెలుసుకుంటున్నాడు. "అందానికి అందం ఈ పుత్తడిబొమ్మ అందరికీ అందనిది పూచినకొమ్మ"పాట వింటుంటే రహీమ్ ను బాలసుబ్రమణ్యం ఆవహించినట్లు అనిపించింది. నాగిరెడ్డికి సుబ్బన్న రాలేదన్న దిగులుతో పాటల పై ధ్యాస పెట్టలేదు. రహీమ్ ఏమీ పట్టించుకోకుండా పాటల ప్రపంచంలో వున్నాడు.

"కలిమి నిలవదు, లేమి మిగలదు, కలకాలం ఒక రీతి గడవదు, నవ్విన కళ్ళే చెమ్మగిల్లవా! వాడిన బ్రతుకే పచ్చగిల్లదా! ఇంతేరా ఈ జీవితం, తిరిగే రంగులరాట్నము ,బ్రతుకే రంగుల రాట్నము.

ఏనుగు పై ని నవాబు, పల్లకిలో షరాబు, గుర్రంమీది జనాబు, గాడిద పైని గరీబు. నడిచే దారుల గమ్యమొక్కటే, నడిపేవాడికి అందరొక్కటే !ఇంతేరా ఈ జీవితం, తిరిగే రంగుల రాట్నము.

కోరిక ఒకటి జనించు, తీరక ఎదద దహించు, కోరనిదేదో వచ్చు, శాంతి సుఖాలను తెచ్చు , ఏది శాపమో! ఏది వరమ్మో! తెలిసి తెలియక అలమటించుటే! ఇంతేరా ఈ జీవితం తిరిగే రంగుల రాట్నము.

ఆగదు వలపు, ఆగదు వగపు, ఆగదు జీవనం ఆగదు, ఎవరు కులికినా, ఎవరు కుమిలినా ఆగదు, కాలం ఆగదు, ఇంతేరా ఈ జీవితం తిరిగే రంగులరాట్నము.

ఇరుగింటి లోన ఖేదం, పొరుగింటి లోన ప్రమోదం,రాలిన పూవులు రెండు, పూచే గుత్తులు మూడు,

ఒకరి కనులలో చీకటి రేయి, ఇరువురి మనసుల వెన్నెల హాయి.

ఇంతేరా ఈ జీవితం.. తిరిగే రంగుల రాట్నం... బ్రతుకే రంగుల రాట్నం. "

చివరిగా రంగులరాట్నం అనే పాత సినిమా నుండి జీవిత సారం బోధించే భుజంగరాయ శర్మ రాసిన పాటను రహీమ్ ఎంతో హృద్యంగా పాడాడు.అందరు నిశ్శబ్దంగా వుండి పోయారు. తొమ్మిది అవుతోందగా అందరం సెలవుతీసుకున్నాం. నాగిరెడ్డి ఎవరితోనో మాట్లాడుతుంటే నేను ఇంటికి వచ్చేశాను.

అర్థరాత్రి నాగిరెడ్డి ఫోన్ తో పరుగున గవర్నమెంటు హాస్పిటల్ కు చేరుకున్నా క్యాజువాలిటి లో శవమై పడివున్న సుబ్బన్నదగ్గర కన్నీళ్ళతో నాగిరెడ్డి. ఫార్మ్ హవుస్ లో ఒక్కడే వున్న సుబ్బన్నకు తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. భోజనానికి పిలవడానికి వెళ్ళిన పనివాడు సెల్ లో నాగిరెడ్డి కాల్స్ చూసి నాగిరెడ్డికి ఫోన్ చేశాడట. నాగిరెడ్డికి దు:ఖం ఆగడం లేదు."నిన్న నా మనసు కీడు శంకించింది ...వాడు ఫోన్ ఎత్తకుండా వుండడు, అందుకే నేను మామూలుగా ఉండలేకపోయాను." అన్నాడు. నిజమే నిన్న నాగిరెడ్డి ఆదుర్దా గుర్తొచ్చింది. మూడు రోజుల పాటు శవం మార్చురీలో వుంది. అమర్ నాథ్ యాత్రకు పోయిన భార్య, అమెరికా లో వుండే ఇద్దరు కొడుకులు వచ్చేప్పటికి చాలా ఆలస్యమయింది. సుబ్బన్నఅంత్యక్రియలు తోటలో చేయాలని, సమాధి కట్టాలని బంధువులు, సమాధి చేస్తే దీపం పెట్టె ఓపిక తనకి లేదని భార్య ,ఆమెను సమర్థించిన కొడుకుల వాగ్యుద్దాల మధ్య శవం లేచింది.

అయిదు అడుగులు మాత్రమే వుండే సుబ్బన్నకు ఆరు అడుగుల నేల కూడా అవసరం లేదు, కానీ భూమంతా తనకే కావాలని ఎంత తిరిగాడు, ఎన్ని కబ్జాలు చేశాడు? ఎన్ని మోసాలు చేశాడు! .ఎంతమంది ఆత్మీయుల్ని, స్నేహితుల్నిపోగొట్టుకున్నాడు, చివరికి భార్యా పిల్లలు కూడా అతన్ని పట్టించుకున్నట్లు కనపడలేదు...మనిషికి ఎంత నేల కావాలి ? నాకు ప్రపంచాన్ని జయించిన అలెక్జాండర్ సమాధి పై రాసిన వాక్యాలు గుర్తొచ్చాయి, "సమాధి సరిపోయిన ఇతనికి ప్రపంచమంతా సరిపోలేదు".

నేను నాగిరెడ్డి, భూస్థాపితం అయాక ఇంటి దారి పట్టాము.

" ఏమి సాధించాడు? ఏమి తీసికెళ్ళాడు తనతో ? చివరికి వూరి బయట దిక్కులేని చావు చచ్చాడు...చచ్చేముందు తనవాళ్ళు లేరు, పాపం పుణ్యం లేకుండా సంపాదించింది ఏమి తిన్నాడు? వేల కోట్లు కొడుకులు,భార్య పంచుకుంటారు " అంటున్నాడు బంధువెవరో !

"నిజమే కదా...ఆయన అన్నది " అన్నాడు నాగిరెడ్డి

"నూటికి నూరుపాళ్ళు నిజం... మనిషికి కొంత ఆశ వుండాలి,కానీ అత్యాశ పనికి రాదు ... వేల కోట్లు సంపాదించాడు ... చివరికి మట్టిలోనే కదా చేరిపోయాడు" అన్నాను.

మరుసటి రోజు ఉదయాన్నే నాలుగు పేపర్లను తీసుకుని వచ్చాడు నాగిరెడ్డి. నిద్రమత్తు వదిలింది వాడు చెప్పిన విషయాలు వింటే. పేపర్లన్నీ సుబ్బన్న గురించే రాశాయి. అతని మరణ వార్తను ఓ మూల వేసిన పత్రికలు, ఇప్పుడు మొదటి పేజీల్లో అతని గురించి రాశాయి. జిల్లా ఎడిషన్ మొత్తం సుబ్బన్నగురించే, అతన్ని అభినవ రాబిన్ హుడ్ గా కీర్తించాయి. సుబ్బన్నఆస్తి మొత్తం వేయి కోట్ల విలువుంటుందని అంచనా. అతని లాయరు వెల్లడించిన వివరాల ప్రకారం, భార్యకు కొంత ఆస్తి రాశాడు, కొడుకులకు చిల్లిగవ్వఇవ్వలేదు, మొత్తం అతను రిజిస్టర్ చేసిన చారిటీకి రాశాడు. చారిటీని సంస్థలుగా విభజించాడు, వాటిని ఎలా ఏర్పాటు చేయాల్సింది, ఎవరు వాటిని నడపాల్సింది, చాలా అవగాహన కలిగి వున్నాడు. యాభై ఏళ్ల వయసుకు అతను చాలా సంపాదించాడు. అయితే చాలా గొప్ప పనులకు దాన్ని ధారపోశాడు. తాను ఏ నిముషంలో మరణించినా, జరగాల్సిన మంచి పనులకు చాలా ముందు చూపుతో ప్రణాళిక బద్ధంగా అన్నీ అమర్చి పెట్టాడు, ఆస్తుల వివరాలు,బాంక్ అకౌంట్ల వివరాలు , టాక్సుల చెల్లింపులు,అన్నీ వివరంగా రాసి పెట్టాడు. వూర్లో వున్నగవర్నమెంట్ హాస్పిటల్ ఆధునీకరణకు ఎక్కువ  మొత్తం కేటాయించడమే కాకుండా ఆ భాద్యతను గొప్ప సేవాభావం కలిగిన ఒక డాక్టర్ కు అప్పగించాడు. ఇంకా అతను తన విల్లులో రాసిన సంక్షేమ పతకాలు వాటి ఆచరణ  కు అతను పెట్టిన నిభందనలు, తెలుసుకునే కొద్దీ, ఒక్కసారిగా మాకిద్దరికి ఏమీ అర్థం కాలేదు. అతని ఇంటర్ చదువుకు, అతని వ్యాపార ధోరణికి, ధన దాహానికి, అతని వీలునామాకు సంభంధం లేదు. నాకు తెలిసి ఇంత గొప్ప వీలునామా ఎవరూ రాయలేదు. వీలునామా రాయడమంటే మరణానికి సిద్ధపడడమే. అంటే సుబ్బన్న మరణాన్నిఅంత వేదాంత ధోరణిలో అంగీకరించాడా?

మరణం తర్వాత సుబ్బన్నగురించి ఎంతోమంది విమర్శలు కురిపించారు, స్నేహితులు  గా మేం కూడా రాళ్ళు విసిరాం.మాకు అతని గురించి తెలిసింది చాలా కొంచం. వుద్యోగం చేసుకుంటూ, చెడు అలవాట్లు లేకుండా బుద్ధిగా సంసారం చేసుకుంటున్న మేం ఆదర్శమైన వ్యక్తులమని, మా లాంటి వాళ్ళు సంఘంలో నీతి నియమాల్ని,మంచిని పెంచుతారని, మేం కాలరు ఎగరేశాం, సుబ్బన్నలాంటి వాళ్ళు సంఘానికి చీడపురుగులని తేల్చి పారేశాం. ఏ తప్పూ, పాపం చేయకుండా ఎవరమూ లేము. ఎవరు సమాజానికి ఎక్కువ మేలు చేశారు అన్నది ప్రశ్న. ఎలా సంపాదించాడో ఎందుకు? రాబందుల్ని కొట్టాడు...పిచ్చుకలకు పంచాడు. మరణం తర్వాత కూడా జీవించే పనులు చేశాడు. సుబ్బన్నఆకారానికి చిన్నగా ఉండొచ్చు,కానీ గుణానికి మాత్రం మహోన్నతుడు. మనసులోనే అతనికి జేజేలు పలికి నా హృదయం లోని కల్మషాన్ని తొలగించుకున్నా.



# కథా కౌముది

## హైటెక్ అత్తగారు     సాయిప్రజ్ఞ వడ్లమాని

**శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా**
**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన**
**20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో**
**యువతరం విభాగంలో బహుమతి పొందిన కథానిక**

"హలో ఎవరండీ మాట్లాడేది?" గొంతులో విసుగు వినిపించకుండా అమూల్య ప్రయత్నించింది.

"నేను రేవతిని. అమ్మ ఉందా?" అవతల వైపు నుండి వినిపించింది.

"ఒక్క నిముషం ఆంటి" ఫోన్ లో అని "అమ్మా, అమ్మా ఫోన్ అమ్మా, రేవతి ఆంటి" అని గట్టిగా అరిచింది .

"అబ్బబ్బబ్బా, ఎందుకు అంత గొంతేసుకొని అరుస్తావు? వస్తున్నా..." అనుకుంటూ మానస వంటింట్లో నుండి హాల్ లోకి వచ్చింది.

"ఇదిగో, రెండే రెండు చపాతీలు మిగిలాయి, కాల్చేయవా? ప్లీజ్ సాయం చేయి " మానస అమూల్యని అడిగింది.

"నీ కోసం ఫోన్ కాల్ తీస్కోటమే నేను నీకు చేసిన పెద్ద సహాయం. నాకు పని ఉంది అమ్మా నన్ను వదిలేయి" అమూల్య తిరిగి తన లాప్ టాప్ ముందు కూర్చొని పని చేసుకుంది.

'రాక్షసి' అని మెల్లిగా అని మానస ఫోన్ రిసీవర్ తీసుకొని "హలో, నీకు ఎన్ని సార్లు చెప్పాను నా సెల్ కి చేయొచ్చు కదే?ఒక నిముషం లైన్ లో ఉండు" అని చిరాకుగా అని వంటింట్లోకి పరిగెత్తింది.

తిరిగి వచ్చి "ఇప్పుడు చెప్పు" అని అంటూ మానస సోఫా లో కూర్చుంది.

"హహహ అంతా విన్నానులే. నీ మీద నీ కూతురికి ఎంత ప్రేమో" అని రేవతి వెటకారంగా అంది.

"తెలిసిందే కదా! దానిని పనిలో డిస్టర్బ్ చేస్తే చంపేస్తుంది. సో.. చెప్పు ఏమన్నాడు రోహిత్ ఆ చికాగో సంబంధం గురించి?"

"ఏమంటాడు నా మొహం, ఎప్పటి లాగే వంక పెట్టాడు."

"ఈ సారి ఏమన్నాడేంటి?"

"మాట్రిమోని ప్రొఫైల్ లో ఆరడుగులు పొడవు ఉండాలి అబ్బాయి అని రాసారుట, మా వాడు మరి 5'10" కదా, వాళ్ళకి కావాల్సింది వీడు కాదుట. వీడే డిసైడ్ అయిపోయాడు. ఒరేయ్, రెండు ఇంచులే తేడా, పైగా ఆ అమ్మాయి 5'4" అంటే వినడంలేదు "

"ఈ గోల ఎంటే బాబు! అబ్బాయిలే కాదు, అమ్మాయిలు కూడా ఇలాగే ఉన్నారు ఈ కాలంలో. శ్రీకాంత్ అన్నయ్య కూతురు వైజాగ్ లో ఉంటుంది చూడు, అది కూడా ఇంతే. చిన్న చిన్న వంకలు చెప్పి మంచి సంబంధాలని వెనక్కి పంపేస్తున్నారు. ఇలాగే ఉంటే రేపొద్దున ఎలా కాపురాలు చేస్తారో, ఎలా బ్రతుకుతారో. అమూల్య కొంచం బెటర్ ఈ విషయంలో. ఎక్కువ వంకలు పెట్టదు, మనిషితో మాట్లాడితే తప్ప డిసైడ్ అవ్వదు"

"అదృష్టవంతురాలివి. మీ అమ్మాయిని అమెరికాలో చదివించి ఉండుంటే, ఏవో తంటాలు పడి నేనే కోడలిగా చేసుకునేదానిని" రేవతి నిట్టూర్చింది.

"పోనీలే. మీ వాడికి తగ్గ అమ్మాయి దొరుకుతుందిలే. ఇలా ఫోన్ లోనే నా ఇంక మన మాటలు?" చిరు కోపంతో మానస అడిగింది.

"అది చెప్దామనే కాల్ చేశాను. హైదరాబాద్ లో మా బావగారి కి తెలిసిన వాళ్ళు ఉన్నారు. వాళ్ళ అమ్మాయి మొన్నీ మధ్యే అమెరికా వెళ్ళిందిట ఎమ్.ఎస్ కి. సో.. వచ్చే ఆదివారం మీ ఇంట్లో దిగుతాను , మనం ఇద్దరం ఓ సారి వాళ్ళింటికి వెళ్లి అసలు ఎలా ఉంటారో చూసొద్దాం, ఏమంటావ్?" రేవతి చెప్పింది.

"ఓ భేషుగ్గా వెళ్దాము. కాని నువ్వు శుక్రవారం రా, మా ఇంట్లో వాళ్ళతో కూడా సమయం గడిపినట్లు ఉంటుంది. అసలే చాలా రోజుల తరువాత వస్తున్నావు" మానస సలహా ఇచ్చింది. "అలాగే, ఐడియా బాగుంది. లీవ్ అడగాలి మా మేనేజర్ ని. నేను చూసుకుంటాలే. ఇవాళే టికెట్స్ బుక్ చేస్తాను. స్టేషన్ లో అమూల్య ని పిక్ అప్ చేసుకోమను, ట్రైన్ డీటెయిల్స్ మెసేజ్ చేస్తాను నీకు"

"దానికి వర్క్ ఫ్రొం హొమ్ ఈ వారమంతా. అంత తీరిక ఉండదు. మా వారు, నేను వస్తాములే"

"సరే మరి. ఉంటాను, ఏమైనా తీసుకురావాలా?"

"ఎప్పటి లాగానే, అరటికాయ చిప్స్, ఒక కిలో"

"హహహహ , తెస్తాను.. బాయ్"

మానస, రేవతి ఫేస్ బుక్ ఫ్రెండ్స్. రేవతి చెన్నై లో ఉంటుంది, బ్యాంకు లో పనిచేస్తుంది. భర్త రెండేళ్ళ క్రితం చనిపోయాడు. ఒక్కగానొక్క కొడుకు, రోహిత్ అమెరికా లో ఎం. బీ. ఏ చేసి పెద్ద మార్కెటింగ్ కంపెని లో డైరెక్టర్ గా పని చేస్తున్నాడు. రోహిత్ అందగాడు, తెలివైన వాడు పైగా మంచి వాడు. అతడికి రేవతి పెళ్లి సంబంధాలు చూస్తోంది. పెళ్లి అయ్యాక అమ్మ, భార్యతో అమెరికా లోనే ఉండాలని రోహిత్ కోరిక; అందుకే అమెరికాలోనే ఉంటున్న అమ్మాయి అయితే బెటర్ అని అతడి అభిప్రాయం. రేవతి అదే వేటలో ఉంది. మానస హైదరాబాద్ లో ఉంటుంది . ఆమె గృహిణి. ఆమె భర్త మూర్తి , కూతురు అమూల్య ప్రోత్సాహంతో ఇంటర్నెట్ వాడటం నేర్చుకుంది. రెండు నెలల క్రితమే మానస, రేవతి ఫేస్ బుక్ ద్వారా స్నేహితులయ్యారు.

"బాయ్ రేవతి" అని ఫోన్ పెట్టేసి "మేము మాట్లాడింది విన్నావా?" అని అమూల్య వైపు మానస తిరిగి అడిగింది.

"అబ్బే లేదే, వాడి పెళ్లి కుదిరిందా?" అమూల్య లాప్టాప్ లో చూస్తూనే అడిగింది.

"దెబ్బలు పడతాయి! వాడు, వీడు ఏంటి? సరిగ్గా మాట్లాడు ఆంటీ వచ్చినప్పుడు" అని కూతురిని కసురుకుంది.

"వావ్ ఆంటీ వస్తున్నారా? నైస్. ట్రై చేస్తాను లే అమ్మా , ఆకలేస్తోంది , కాని పని కూడా ఉంది. కొంచం నోట్లో పెడతావా రోటి, కూర ప్లీజ్?" అమూల్య బ్రతిమిలాడింది అమ్మని .

“అలాగలాగే, రేప్పొద్దున మీ ఆయనని ఇలాగే అడుగుతావా ఏంటి? అయినా ఏం మాయదారి ఉద్యోగాలే బాబు? తిండి కూడా సరిగ్గా తినకుండా ఉంటున్నావ్! ప్లేట్ లో పెట్టిస్తాను, నువ్వే తిను. చిన్నాపిల్లవేం కావు, పెళ్లీడు కి వచ్చావ్!” అంటూ ప్లేట్ తెచ్చి ముందు పెట్టింది.

“నువ్వు కాకపోతే నేను పెడతాను” అని భార్యతో చెప్పి “చేతులు కడుక్కొని వస్తాను ఆగమ్మా” అని అమూల్యతో చెప్పాడు అప్పుడే ఆఫీసు నుండి వచ్చిన మూర్తి.

“అదే అదే ఇలాగే గారాబం చెయ్యండి, ఇంక ఇంట్లో పనులన్నీ మర్చిపోతుంది ఈ పిల్ల” మానస అంది.

“ఏయ్ మానసా ఏంటి నీ బాధ? నాకు అన్ని పనులు వచ్చు. సమయానుసారంగా చేస్తాను. నువ్వేమి బెంగ పెట్టుకోకు. అత్తగారింట్లో మంచి పేరు తెచ్చుకుంటాను, నీ పేరు నిలబెడ్తాను” అంటూ అమూల్య డ్రమాటిక్ గా చెప్పింది.

దానితో అందరూ నవ్వేసారు.

అమూల్య ‘డేటా సిస్ ‘ అనే కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తోంది. గొప్ప అందం తన సొంతం కాకపోయినా, మొహంలో కళ కనిపిస్తుంది. మంచితనం తో పాటు తెలివితేటలు కలది. సాధారణంగా కొత్తవాళ్ళతో మొహమాటంగా ఉంటుంది. కాని తనకి నచ్చిన వాళ్ళతో చాలా చనువుగా ఉంటుంది. ఆమెకు పెద్దగా ఆశలు, కోరికలు లేవు. జీవితంలో ఏం ఎదురొచ్చినా సంతోషంగా బ్రతకాలి అని అనుకునే అమ్మాయి.

ఆ రోజు శుక్రవారం. మానస, మూర్తి స్టేషన్ కి వెళ్లారు. సడన్ గా మీటింగ్ కి రావాలి అని ఆఫీసు నుండి కాల్ వస్తే అమూల్య కూడా ఆఫీసుకు బయలుదేరింది. స్టేషన్ నుండి ఇంటికొచ్చాక టిఫిన్ తినేసి, మానస, రేవతి కాబ్ బుక్ చేసుకొని రోహిత్ సంబంధం విషయం మాట్లాడటానికి వెళ్లారు. పెళ్లి కూతురి తల్లి తండ్రులు, వాళ్ళ ఇల్లు రేవతి కి నచ్చాయి. మానస తో తన ఇంటికి తిరిగి వస్తూ రోహిత్ కి కాల్ చేయమని మెసేజ్ పెట్టింది. అర్ధరాత్రి అయినా పెళ్లి విషయం కాబట్టి రోహిత్ కూడా వెంటనే కాల్ చేసాడు.

అమ్మాయి గురించిన వివరాలు తెలుసుకున్నాక “సరే అమ్మా, అన్నీ బాగున్నట్టున్నాయి. ఆ అమ్మాయి పూర్తి పేరు చెప్పు, ఫేస్ బుక్ లో చూస్తాను” అని రోహిత్ అన్నాడు.

పేరు చెప్పిన వెంటనే ఫేస్ బుక్ లో వెతికి, నాలుగు నిముషాలలో ప్రొఫైల్ మొత్తం స్కాన్ చేసేసి “అమ్మా, ఈ అమ్మాయికి క్రికెట్ ఇష్టం లేదు అంట. కష్టం కదమ్మా, పెళ్లి అయ్యాక నేను టోర్నమెంట్ కి వెళ్ళినప్పుడు ఎం చేస్తుంది? అసలు వెళ్లొద్దు అంటుందేమో. బాబోయ్. వద్దు అమ్మా, కాన్సిల్. వాళ్ళకి చెప్పేసేయ్ మా అబ్బాయికి నచ్చలేదు అని” రోహిత్ ఖరాఖండీగా చెప్పాడు.

“నీకసలు బుద్ధి ఉందా? అమ్మాయి బాగుంది కదా? ఫేస్ బుక్ లో ఏముందో దాని బట్టి వద్దంటావేంటి? అదేమయినా కొలమానమా? ఇలాగయితే ఎప్పుడు అవుతుందిరా నీకు పెళ్లి? నన్ను విసిగించకు ప్లీజ్” రేవతి అసహనంగా అంది.

“అమ్మా, నాకు అందమైన పిల్ల అక్కరలేదు. మనిషిని చూడకుండా అర్ధం చేసుకోటానికి ఫేస్ బుక్ పనికొస్తుంది. అమ్మాయి ఏ గ్రూప్స్ లో ఉందీ అన్నది తన హాబీస్, ఇష్టాలు, అయిష్టాలు గురించి చెప్తాయి. నీకు అంతగా విసుగు వస్తే సంబంధాలు వెతకటం మానేయి. బాయ్” అని రోహిత్ కోపంగా కాల్ కట్ చేసాడు.

రేవతి ఫోన్ బాగ్ లో పడేసి, కాబ్ కిటికీ నుండి బయటకి చూస్తూ కూర్చుంది. మానస కి విషయం అర్ధమయింది. రేవతి చేయిని తన చేతిలోకి తీసుకొని, “రేవతి ఈ విషయాలు రెండు రోజులకి వదిలేసేయ్. అన్నీ అవే సర్దుకుంటాయి. ఇంకో పది నిముషాలలో ఇంటికి చేరుకుంటాము. ఇలా డల్ గా ఉండకూడదు సుమా. చీర్ అప్” అని మానస ఆప్యాయంగా అంది.

★★★★★★★★★★★★★

ఇంటికొచ్చి టీ తాగుతున్న సమయంలో "ఎన్నకు ఒరు కాఫీ వేణుం" అని అరుచుకుంటూ అమూల్య ఇంటిలోపలికి ఎగురుకుంటూ వచ్చింది.

లోపల రేవతిని చూసి నాలుక కరుచుకొని, ఇబ్బందిగా "హలో ఆంటి, బాగున్నారా?" అని అంది.

"ఫిల్టర్ కాఫీ కావలా బ్రూ నా?" అని రేవతి నవ్వుతూ అడిగింది.

"సారీ ఆంటీ మీరు వచ్చారని తెలియక...."

"ఎందుకు తెలియదు? మర్చిపోయావ్ అని చెప్పు" అని కాఫీ తెస్తూ మానస అంది.

అలా ముగ్గురూ కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. బట్టలు మార్చుకుని వస్తాను అని అమూల్య తన రూం లోకి వెళ్ళింది.

"మీ అమ్మాయి ఫోటోని నాకెప్పుడూ ఫేస్ బుక్ లో చూపించలేదే?" రేవతి అడిగింది.

"దానికి ఇష్టం ఉండవు అలాగా. అముల్యకి ఫేస్ బుక్, ట్విట్టర్ లాంటివి నచ్చవు. టైం వేస్ట్ అంటుంది. నేను కూడా ఏదైనా ఫామిలీ ఫోటోలు పెడితే తిట్టేస్తుంది. ఎందుకు ఇప్పుడు హటాత్తుగా అడుగుతున్నావు?" మానస కుతూహలంతో అడిగింది.

"అమూల్య కుందనపు బొమ్మలా ఉంటే ఆవరేజ్ గా ఉంటుంది అని ఎందుకు చెప్పావు, సంబంధం అడిగినప్పుడు? మా రోహిత్ నీకు నచ్చలేదా?" రేవతి ప్రశ్నించింది.

"అబ్బే నన్ను అపార్ధం చేసుకోకు. రోహిత్ ఫోటో చూసాను కదా, హీరోలా ఉంటాడు. పైగా అమూల్య ఇండియా లోనే చదువుకుంది, రోహిత్ కి అమెరికాలో అమ్మాయి కావాలి అన్నాడు అని చెప్పావు. మాకు పెద్దగా ఆస్తులు లేవు. అందుకే మేమే మీకు సరిపోము అని మూర్తిగారు అనటంతో నేను ఇంక ఆశ పడలేదు. లేదంటే మేము ఇంత మంచి సంబంధాన్ని వదులుకుంటామా చెప్పు" మానస నిజాయితీగా చెప్పింది.

"వాడు అమెరికా అమెరికా అంటున్నది అమ్మాయికి ఇబ్బంది లేకుండా ఉంటుందని. నాకు తెలిసి అమూల్య అడాప్ట్ అయిపోతుంది అమెరికా లో. నాకు అమూల్య కరెక్ట్ కోడలు. మా వాడికి కరెక్ట్ గా సరిపోతుంది. మూర్తి గారితో నేను మాట్లాడతాను. నువ్వింక ఏమీ మాట్లాడకు" అని రేవతి అంది.

మూర్తి గారు ఆఫీసు నుండి ఇంటికొచ్చిన వెంటనే "నాకు అమూల్య చాలా నచ్చింది. ఇంతకంటే మంచి పిల్ల మా వాడికి దొరకదు. ఇన్ ఫాక్ట్ అమూల్యని చేసుకుంటే మా వాడు అదృష్టవంతుడు. వాళ్లిద్దరిది సరి అయిన జోడి. ఆస్తి విషయంలో మీరు ఆందోళన పడవలసిన పనిలేదు. పెళ్లి అయితే మా ఆస్తి మీ కూతురిదే కదా?" అని చాలా అభిమానంతో రేవతి చెప్పింది.

"మాకేమి అభ్యంతరం లేదండీ. మీది మంచి సంబంధం. అంతే కాదు, మీరంటే మానసకి ఎంతో అభిమానం. అమూల్య కి నచ్చితే మాకు కూడా నచ్చినట్టే!" మూర్తిగారు డైరెక్ట్ గా చెప్పేసారు.

"ఆ విషయం నాకు వదిలేయండి. మీరు అముల్యకి రేపటిదాకా ఏమీ చెప్పకండి" ఏదో ప్లాన్ ఆలోచిస్తూ రేవతి చెప్పింది.

అమూల్య లోపల నుండి వస్తూ "యువరాణి వారు రెడీగా ఉన్నారు. భోజనం చేసేయాలి తొందరగా. మళ్లీ నాకు రాత్రి వర్క్ ఉంది" వాళ్ళ మాటలు ఏమీ విననట్టుగా జాగ్రత్త పడింది.

★★★★★★★★★★★

తెల్లవారింది.

"ఏంటమ్మా శనివారం కూడా పొద్దునే లేపుతున్నావు? అసలే పనిచేసి లేట్ గా పడుకున్నాను" అమూల్య నిద్రలో మాట్లాడింది.

"నేను టిఫిన్ చేస్తున్నాను, ఆంటీ తో కొంచం పార్క్ కి వెళ్ళు, అల వాకింగ్ చేసి రండి కాసేపు" మానస మెత్తగా చెప్పింది.

"పాతికేళ్ళు వచ్చాక కూడా అమ్మ చెప్పిన మాట వినాల్సి వస్తోంది. చిన్నపిల్లని అని కూడా చూడకుండా పొద్దునే నిద్రలేపేసింది, బాల్య కార్మికుల వ్యవస్థ నశించాలి" నిద్రమత్తులోనే అమూల్య అరిచింది.

"రెండూ నువ్వే అంటున్నావు, ఇంతకీ నువ్వు చిన్నపిల్లవా పెద్దదానివా?" రేవతి మధ్యలో వచ్చి అడిగింది.

"ఓహ్ ఆంటీ, నాకు ఐదు నిముషాలు ఇవ్వండి, వచ్చేస్తాను" అని మానస వైపు కోపంగా చూసింది.

★★★★★★★★★

పార్క్ లో వాకింగ్ చేస్తునప్పుడు అమూల్య తో మాటలు ఎలా మొదలుపెట్టాలా అని రేవతి ఆలోచిస్తున్న సమయంలో అముల్యే తన దగ్గరకొచ్చి "ఆంటీ నిన్న మీరు అమ్మావాళ్ళతో మాట్లాడటం నేను విన్నాను" అంది.

"హమ్మయ, ఎలా స్టార్ట్ చేయాలా అని నేను తెగ ఇబ్బంది పడుతున్నాను. వేరి గుడ్. సో నీ అభిప్రాయం ఏంటి?"

"మీరు కట్నం తీసుకోక పోతే ఓకే" అని అమూల్య కన్ను కొట్టింది.

"హ హ హ. ఇంత ఈజీగా ఈ సంగతి తేలిపోతుంది అనుకోలేదు" పెద్ద భారం భుజాల నుండి దిగినంత సంతోషంతో చెప్పింది రేవతి.

"అసలు నాతో ఈ విషయం మీరు నిన్ననే ఎందుకు చెప్పలేదు? మీరు ప్లస్ అమ్మ చెప్పిన దాని ప్రకారం మీ అబ్బాయి నాకు నచ్చుతారు. నేను నో చెప్పటానికి ఏమి కారణం లేదు కదా" అని సిగ్గుపడుతూ అమూల్య నవ్వింది.

"మన ఆనందం కోసం, మనల్ని ప్రేమించే వారి సంతోషం కోసం ఒక మంచి కార్యం చెయ్యాలి అని మనకి తెలిసాక, ఆ కార్యం కోసం మన జీవితంలో నచ్చినా, నచ్చకపోయినా కొన్ని మార్పులు చేసుకోవాలి. ఈ స్టేట్ మెంట్ పైన నీ కామెంట్ ఏంటి?" అమూల్య అడిగిన దానికి జవాబు చెప్పకుండా రేవతి ఎదురు ప్రశ్న వేసింది.

"ఆ కార్యం అంత ముఖ్యమైనది అయితే మార్పులు చేయటంలో తప్పేమీ లేదు అంటాను. అసలు మేటర్ ఏంటి ఆంటీ?" తెలుసుకోవాలనే ఆసక్తితో అమూల్య అడిగింది.

"ఈ పెళ్లి జరగాలంటే మనం ఇద్దరం కలిసి ఒక చిన్న పని చేయాలి" రేవతి సింపుల్ గా చెప్పింది. "ఏంటి అది?" అయోమయంగా అమూల్య అడిగింది.

"నీకొక ఫేస్ బుక్ ప్రొఫైల్ ఓపెన్ చేసి, మా వాడికి నచ్చే గ్రూప్స్ అన్నిట్లో జాయిన్ అవ్వాలి. ఇది నీకు ఇష్టమేనా?"

"నాకు ఫేస్ బుక్ లో ఇంట్రెస్ట్ లేదు ఆంటీ" సూటిగా అమూల్య జవాబు ఇచ్చింది.

"నాకు అది తెలుసు. నిన్ను ఫేస్ బుక్ వాడమని ఒత్తిడి చెయ్యట్లేదు నేను. మా వాడికి కొన్ని పిచ్చి ఐడియాలు ఉన్నాయి. వాడి ఉద్దేశం సరి అయినదే, కాని వాడు కేవలం ప్రొఫైల్ లలో ఉండే అంశాలనే పట్టించుకుంటున్నాడు. అదే ఈ కాలంలో అందరూ చేసే పెద్ద తప్పు. అదొక్కటే కొలమానం కాదు కదా? కాని మా వాడు మొండిగా ఉన్నాడు. ఒకమ్మాయికి క్రికెట్ ఇష్టం లేదు అని పెట్టిందని రిజెక్ట్ చేసాడు. పెళ్ళిళ్ళు చేసుకునే వాళ్ళందరికీ కామన్ ఇంట్రెస్ట్ లు ఉంటేనే చేసుకుంటున్నారా? లేదు కదా? అందుకే వాడికి నచ్చినట్లుగా ప్రొఫైల్ పెడదాము. ఏమంటావ్?"

"కాని అది తప్పు కదా ఆంటీ? అబద్ధం చెప్పినట్టే కదా?"

“తిమ్మనం ఏం కాదు? నాకేమి తప్పు అనిపించట్లేదు. ఇది మీ ఇద్దరి మంచికే. పెళ్లి అయ్యాక ఎలాగో బిజీ అయిపోతారు కాబట్టి నువ్వు ఆ ప్రొఫైల్ వాడే అవసరమే లేదు. ఇంక ఇంట్రెస్ట్ లు అంటావా, టైం తో మారుతూ ఉంటాయి అని ఏదో సర్ది చెప్పొచ్చు మా వాడికి. నేను నీకు సపోర్ట్ ఉంటానుగా ఎలాగో.”

“అది సరే, నేను నచ్చుతానా రోహిత్ కి?”

“తప్పకుండా. వాడి టేస్ట్ లు, ఇష్టాలు నాకు తెలుసుగా”

“ఓకే ఆంటీ. నాకు ఇష్టమే ఈ పెళ్లి అండ్ ఈ ప్రొఫైల్ క్రియేషన్. ఇంటికి వెళ్దామా ఇంక, అమ్మావాళ్ళకి ఇష్టమే అని చెప్పేద్దాం. సంతోషిస్తారు”

“ఈ ప్రొఫైల్ క్రియేషన్ విషయం మీ అమ్మావాళ్ళకి చెప్తే ఖంగారు పడతారు. అందుకే ఇది మన మధ్యనే ఉండాలి. డీల్?”

“డీల్ ఆంటీ”

“ఇకపై అత్తయ్య అనాలి మరి”అని ప్రేమగా అని రేవతి అమూల్య ని హగ్ చేసుకుంది.

★★★★★★★★★

**ఐదు నెలల తరువాత**

“ఇంక మూడు ఏళ్ళు అమ్మా. అప్పుడింక రిజైన్ చేసి వచ్చేయి” రోహిత్ ఫోనులో రేవతితో చెప్తున్నాడు.

“ఔను అత్తయా, వచ్చేయండి త్వరగా” అని పక్కనుండి అమూల్య అరిచింది.

“ఏం చేస్తోందిరా నా కోడలు పిల్లా?” రేవతి అడిగింది.

“ఇంకేం చేస్తుంది? ఫేస్ బుక్. మంచి పెళ్ళాంనే ఇచ్చావు కాని, ఒక ఫేస్ బుక్ అడిక్ట్ ని కట్టబెట్టావ్” అని వేలాకోళంగా అన్నాడు.

“ఆల్ హెయిల్ నా హై–టెక్ అత్తయ్య” అని అమూల్య అరిచింది.

“హ హ హ హ..” అందరూ నవ్వేసారు.

కథా కౌముది

# పునరావృతం

ప్రసూన రవీంద్రన్

**శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా**
**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన**
**20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో**
**యువతరం విభాగంలో బహుమతి పొందిన కథానిక**

"అబ్బా విసిగించకు చిన్నూ. వెళ్ళి ఆడుకో" ఖంగుమంది నా కూతురు ప్రియ కంఠం.

"ఐపాడ్, కిడ్స్ లాప్‌టాప్ , బొమ్మలు , గూగుల్ నెక్సస్ టాబ్లెట్ ఎన్ని ఉన్నాయిరా నీకు ఇంటి నిండా. అయినా నన్నే విసిగిస్తున్నావేంటి? వెళ్ళి నీ ఐపాడ్‌లో ఏమైనా రైమ్స్ చూడు. " లాప్‌టాప్ వదిలి మూడేళ్ళ కొడుకు ఆరవ్ వంక చూస్తూ గట్టిగా చెప్పింది.

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని కూరలు కట్ చేస్తున్న నా మనసు చివుక్కుమని ఆరవ్ వంక చూశాను. తల్లి అలా అరవడంతో బిక్క ముఖం వేసుకుని ప్రియకి దూరంగా జరిగి నిల్చున్నాడు వాడు. వాడి చేతిలో ఏదో బొమ్మ.

పరుగున లేచి వెళ్ళి వాడిని హత్తుకున్నాను. నా స్పర్శ తగిలేసరికి బిక్కముఖం వదిలి బావురుమన్నాడు తల్లి వైపు చూపిస్తూ.

"ప్రియా. ఎందుకలా వాడి మీద గట్టిగా అరుస్తావ్? ఇంత చంటివాడిమీద ఎలా అరవాలనిపిస్తోంది నీకు? " కోపంగానే అడిగాను.

"అమ్మా! చూస్తున్నావ్ కదా. పనిలో ఉంటే ఊరికే విసిగిస్తున్నాడు. " విసురుగా అంది.

"ఏం పని? ఆఫీసులో ఎంతసేపు పనిచేసి వస్తున్నావు? ఇంట్లో ఉన్న కాసేపయినా కొడుకుతో గడపకుండా అలా పనిచేసుకుంటూ ఉంటావు? " రెట్టించి అడిగాను.

"పెర్సనల్ మెయిల్స్ ఆఫీసులో చూసుకోవడానికి ఉండదు. ఇక్కడ చూసుకుంటున్నాను. " లాప్‌టాప్ మరింత దగ్గరగా లాక్కుంటూ చెప్పింది ప్రియ.

నాకాక్షణం ప్రియ మీద చాలా కోపం వచ్చింది. మూడేళ్ళ పసివాడితో ఆడటం కంటే పెర్సనల్ మెయిల్స్ చెక్ చేసుకోవడం ముఖ్యమా? రోజూ ఈ ఇంట్లో ఇటువంటి పరిస్థితి చూసి చూసి విసుగెత్తిపోతున్నాను. ఇవాళ వదలదలుచుకోలేదు.

"ప్రియా. వారం మొత్తం వాడు నిన్ను ఎంతో మిస్ అవుతున్నాడు. అడిగితే ఇద్దరికీ ఉద్యోగాలుండడం ముఖ్యమంటారు. అటువంటప్పుడు ఇంట్లో ఉండే కొద్దిపాటి సమయం వాడితో ఆడుకోవడానికి గడపకూడదా? పాపం వాడి ముఖం చూడు. ఎంత జాలేస్తోందో. పిల్లలకి ఎంత మంది ఉన్నా తల్లితో ఉండే అనుబంధం వేరు. తల్లితో ఆడాలనీ, తల్లే అన్నీ చెయ్యాలనీ ఆశపడతారు. వాళ్ళకి డబ్బు విషయాలేవీ అర్థం కాకపోయినా, వాళ్ళ ఆశలన్నీ కూకటివేళ్ళతో పెకలించేసి ఆఫీసులకి వెళ్ళిపోతున్నారు నీలాంటి అమ్మలు. వాడు ఆ బొమ్మ నీతో కలిసి ఆడుకోవాలని ఆరాటపడుతున్నాడు. ఒక్కసారి వాడి వైపు నుంచి కూడా ఆలోచించు. " గట్టిగా చెబుతున్న నా వంక ప్రియ విసుగ్గా చూసింది.

"అబ్బా అమ్మా. ఇందాక ఆడాను కదా. " స్వరం తగ్గించి నీరసంగా అంటున్న ప్రియ వంక ఆశ్చర్యంగా చూశాను.

"ఎంతసేపు ఆడావు? అయిదు నిమిషాలు. అంతేగా. మరి ఈ లాప్‌టాప్‌తో గంట సేపుగా కూర్చున్నావు. ప్రియా, కాసేపు నేను చెప్పేది అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. "

"ఏం అర్థం చేసుకోవాలి? నేనేమైనా పిల్లాడిని కేర్ సెంటర్లో వదిలేసి ఆఫీసుకి వెళుతున్నానా? వాడి మీద నాకు మాత్రం ప్రేమ లేదా? నువ్వున్నావనే కదా. నేను ధైర్యంగా , మనశ్శాంతిగా వాడిని ఇంట్లో నీ దగ్గర వదిలి ఆఫీసుకి వెళ్ళగలుగుతున్నాను. ఏదో. కాస్త నెట్ బ్రౌజ్ చేసుకునేసరికి క్లాసు పీకేస్తున్నావ్? " నిర్లక్ష్యంగా అనేసి తిరిగి లాప్‌టాప్‌లో దూరిపోయింది ప్రియ.

ఆ మాటలు నాకు ఛెళ్ళున తగిలాయి. ఆవేశం వచ్చినా అసహ్యం కలిగింది ఇక ఆ సంభాషణ పొడిగించడానికి.

ఏడుస్తున్న ఆరవ్‌ని తీసుకుని అపార్ట్మెంటులోనే క్రిందున్న ప్లే ఏరియాకి వెళ్ళాను. రోజూ వాడిని ఇక్కడికి తీసుకొచ్చేది నేనే. ఇవాళ శుక్రవారం కావడంతో పెద్దగా ఆఫీసులో పని లేదంటూ చాలా త్వరగా వచ్చేసింది ప్రియ. తల్లి ఉంటే క్రిందకి ఆమే తీసుకురావాలని గొడవ చేస్తాడు ఆరవ్. పాపం వాడికి తల్లి ఇంట్లో ఉన్నంతసేపూ తనతోనే ఉండాలని అనిపిస్తుంది.

ఆరవ్ జారాబండా ఆడుతుంటే అక్కడే ఉన్న సిమెంటు బెంచీ పైన కూర్చుండిపోయాను.

ప్రియ ఆఖరుగా అన్న మాటలు నాకు ఈటెల్లా తగిలాయ్. నేనున్నాను కాబట్టి మనశ్శాంతిగా ఆఫీసుకి వెళుతోందా? మరి నేనిక్కడ ఎలా ఉంటున్నానో తను తెలుసుకుంటోందా? ఇంకా సర్వీసులో ఉన్న నా భర్తని ఒంటరిగా వదిలేసి, వీడిని చూసుకోవడం కోసం మూడేళ్ళుగా ఇక్కడే ఎక్కువ ఉంటున్నాను. ఎప్పుడైనా సెలవలు కలిసొచ్చి ప్రియ కాస్త కనికరిస్తే ఇంటికి వెళ్ళి నా భర్తకి కూర పొడితో పాటు అన్ని రకాల పొడులూ చేసి పెట్టి, ఇంట్లో ఆడమనిషి లేక , పనివాళ్ళ నిర్లక్ష్యంతో భయంకరంగా ఉన్న ఇల్లూ, పెరడూ శుభ్రం చేయించి అంతలోనే పరిగెత్తుకుని మళ్ళీ ఇక్కడికి వచ్చేస్తున్నాను.

వంట బాగా రాకపోయినా ఉన్న ఒక్క కూతురు, మనవడి కోసం ఏమీ అనలేక నా భర్త తినీ, తినకా తంటాలు పడుతున్నారు. పోనీ మనవడిని అక్కడికే తీసుకువెళ్ళి పెంచుకుంటానంటే ' అమ్మో అలా వాడిని వదిలి ఉండలేం' అన్నారు కూతురూ, అల్లుడూ. ఇంత చిన్నవాడిని కేర్‌సెంటర్లో వదల్లేం వచ్చి చూసుకోమని బ్రతిమాలితే అత్తగారు లేని నా కూతురికోసం భర్తని వదిలి ఇలా వచ్చి ఉంటున్నాను. కానీ, దీని వల్ల ఎవరు ఏం ప్రయోజనం పొందుతున్నారు అని లోతుగా ఆలోచిస్తే శూన్యం. నేను భౌతికంగా ఇక్కడ మనవడి ముచ్చట్లలో ఉన్నా , మనసంతా ఈ వయసులో భర్తని ఆయన కష్టానికి వదిలేసి దూరంగా ఉంటున్నందుకు ఏ మాత్రం తృప్తి లేకుండా ఉన్నాను.

నా మనవడేమో ఇలా నేను సర్దుకుపోవడం వల్ల కేర్ సెంటర్ల బాధ తప్పినా , తల్లి తనతో ఎక్కువసేపు గడపదనే అసంతృప్తితో తరచుగా తిక్క పేచీలు పెడుతూ ఉంటాడు.

ఎటొచ్చీ మనశ్శాంతిగా , తృప్తిగా ఉంటున్నది నా కూతురూ, అల్లుడేనేమో. జీతానికేమీ కొరతలేకుండా బేంక్ ఎకౌంట్లు నిండుతున్నాయ్. కానీ, అతిముఖ్యమైన బాంధవ్యాల్లో పెరుగుతున్న అగాధాల సంగతి? అది వాళ్ళెందుకు తెలుసుకోలేకపోతున్నారో ఎప్పటికి తెలుసుకుంటారో నాకు అర్థం కావడంలేదు.

"ఆంటీ, ఏమైందాంటీ అలా ఉన్నారు? " ఆ మాటతో పాటు నా భుజం కూడా కుదిపినట్టవడంతో ఉలిక్కిపడ్డాను.

ఎప్పుడు వచ్చిందో నా పక్కనే కూర్చుని ఆందోళనగా నా ముఖంలోకి చూస్తోంది వీణ. ఆమెను చూశాక గానీ నాకు తెలీలేదు. నా కళ్ళు వర్షిస్తున్నాయని. గబగబా కన్నీరు తుడుచుకుంటూ నవ్వాను.

"ఏంలేదులేమ్మా... " అన్నాను తడబడుతూ.

వీణా, ప్రియా ఇద్దరూ ఒక ఈడువాళ్ళే. వీణకి నాలుగేళ్ళ కూతురు. పాపని అక్కడే ఆడుకోవడానికి వదిలి నా పక్కనే కూర్చుంది వీణ.

ఒకే వయసువాళ్ళైనా వీణకీ, ప్రియకీ ఎంత తేడానో. పిల్ల పుట్టాక ఉద్యోగం మానేసింది ఈ అమ్మాయి. ఆ పిల్ల ఆలనా పాలనా చక్కగా చూసుకుంటుంది. ఆమె తల్లీ, అత్తగారూ కూడా ఎక్కడో వేరే ఊళ్ళలో ఉంటారు. అప్పుడప్పుడూ వచ్చి పోతూంటారు. వాళ్ళొచ్చినప్పుడైనా పిల్ల పని వాళ్ళ మీద పెట్టదు. ఎప్పుడైనా తనే చేస్తుంది. అన్నీ నేర్పుతుంది. పాపతో అన్ని రకాల ఆటలూ ఆడుతుంది. వీణని చూస్తే నిజంగా నాకు ముచ్చటేస్తుంది.

ఈ రోజుల్లో అలా మనస్ఫూర్తిగా కన్న బిడ్డల ఆలనా పాలనా చూసుకోగలగడం అనేది చాలా గొప్ప విషయం.

ఓ రోజు ఏదో కావలసి వచ్చి క్రింద ఫ్లోర్‌లోనే ఉన్న వీణ ఇంటికి వెళ్ళాను. చిన్న చిన్న కథల పుస్తకాలు చుట్టూ పెట్టుకుని తన కూతురికి అర్థమైనట్టుగానే కథలు చెప్పిస్తోంది వీణ. ఆ పిల్ల ముద్దుగా కథలు చెబుతుంటే ఆ దృశ్యం నాకలాగే మనసులో ముద్రించుకుపోయింది.

ఈ విషయం ప్రస్తావిస్తే ప్రియ నా మీదే అరుస్తుందని తెలుసు కానీ, ఉండబట్టలేకపోయాను. ఆ రోజు రాత్రి భోజనాల దగ్గర విషయం కదిపాను.

"ప్రియా. భోజనాలయ్యాక వెంటనే వాడిని బలవంతంగా నిద్రపుచ్చకమ్మా. బోలెడు కథల పుస్తకాలు కొనేశావు వాడికోసం. ఒక్క పావుగంట పక్కన కూర్చుని వాడికి కథలు చెప్పు. అది మంచి అలవాటు. "

"అన్నం తినగానే నిద్ర వస్తుంది అమ్మా. ఆ పుస్తకాల్లో బొమ్మలు చూస్తూ వాడు వేసే ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పే ఓపిక లేదు. ఇప్పుడే టైము తొమ్మిదిన్నర. ఇంకా కథలు చెప్పుకుంటూ కూర్చుంటే రేపు ఆఫీసులకి వెళ్ళినట్టే." అంటూ తన భర్తతో వేరే విషయం మాట్లాడటం మొదలుపెట్టింది.

అప్రయత్నంగా ఆరవ్ వైపు చూశాను. సోఫాలో కూర్చుని టి.వి లో కార్టూన్ చూస్తున్నాడు వాడు. రోజంతా టీ.వి, ఐ.పాడ్, కంప్యూటర్లతోనే కాలం గడుపుతున్న ఈ చిన్నారుల భవిష్యత్తు ఏమవుతుందో అని ఒక్కోసారి భయం వేస్తూ ఉంటుంది.

అక్కడికీ కాసేపు వాడితో నేనే కూర్చుని బొమ్మలు ఆడుతూంటాను. కానీ, అమ్మా, నాన్నా తమ దగ్గర కూర్చోపెట్టుకుని తరచుగా ఆడటం వల్ల తప్పకుండా ఉపయోగం ఉంటుంది కదూ. అలా పెరిగే తీరులో తప్పకుండా తేడా ఉంటుందనిపిస్తుంది.

"ప్రియా, మీ ఇద్దరికీ ఓ మాట చెబుతాను. తప్పుగా అనుకోకండి. ఇంత చిన్న పిల్లలు అలా ఎప్పుడూ ప్రాణం లేని ఆ ఎలెక్ట్రానిక్ వస్తువులకి అలవాటు పడిపోవడానికీ, ఎక్కువసేపు ఆత్మీయులతో గడిపడానికీ చాలా తేడా ఉందమ్మా. బంధాలూ, బాంధవ్యాల విలువ ఈ వయసులో తెలీకపోతే ఇక ఎప్పటికీ తెలీదు. మన వాళ్ళు అనే భావన, ప్రేమ మనుషులతో గడుపుతూ ఉంటేనే మరింత బలపడతాయ్. కనీసం మీరిద్దరూ ఇంట్లో ఉండే సమయాల్లో అయినా ఆ టీ.వీ , కంప్యూటర్ అలవాట్లు మాన్పించి కాస్త వాడితో గడపండి. ఆడండి. కథలు చెప్పండి. దగ్గరతనాన్ని పెంచుకోండి. "

ఇద్దరి ముఖాలూ మార్చి మార్చి చూస్తూ చెప్పాను.

ప్రియ తినడం ఆపి నా కళ్ళలోకి చూసింది. "ఒక్కరోజు వాడికి టీ.వీ పెట్టడం ఆపి చూడు. వాడు ఎంత గొడవ చేస్తాడో. నీకు తెలీని విషయమేమీ కాదుగా."

"అవును. కానీ, ఆ టీ.వీ కంటే విలువైనది అమ్మ, నాన్నల సాంగత్యం అని వాడికి అర్థమయ్యేలా చెయ్యగలిగింది మీరే. పసిపిల్లలు ఎప్పుడూ అమ్మా, నాన్నలతో ఆడుకోవాలనే ఆరాటపడతారు. మనమే ఆ అవకాశం ఇవ్వకుండా నిష్కల్మషమైన వాళ్ళ మెదడుని ప్రభావితం చేస్తున్నాం. పిల్లలు ఆరాటపడేది వాళ్ళ భవిష్యత్తుకి ఎంత మంచిదో తెలిసి కూడా మనం బలవంతంగా కృత్రిమ సంతోషాల వైపు వాళ్ళ దృష్టిని మరల్చేస్తున్నాం. ఇదంతా చాలా రాక్షసంగా అనిపిస్తోంది ప్రియా. దీని పర్యవసానాలు ఎలా ఉంటాయో తల్చుకుంటే భయం వేస్తోంది. సంపాదనకోసం మనం దేన్ని కోల్పోతున్నామో మనకి అర్థమయ్యే సమయానికి తప్పు దిద్దుకునే అవకాశం కూడా ఉండదమ్మా . "

ఎలా అయినా ప్రియకి కన్న పిల్లలతో గడపడం ఎంత ముఖ్యమో అర్థమవ్వాలని ప్రయత్నిస్తున్నాను.

"అమ్మా. నీకు ఈ కాలం అవసరాలు తెలీదు. అర్థం కాదు. మీ కాలంలోంచి నువ్వు బయటపడవు. అసలు అంత టైం ఎక్కడుంది? రోజూ ఉదయం తొమ్మిదికల్లా వెళిపోతున్నాం. రాత్రులు ఇదిగో వచ్చి తిండి తినడానికే తొమ్మిదిన్నర, పది అవుతుంది. ఇక శని , ఆదివారాల్లో షాపింగులూ, సరుకులూ మినహా వాడితో గడుపుతూనే ఉన్నాంగా. వాడికోసమేగా మాల్స్‌లో ఊరికే తిరుగుతూ ఉంటాము. కార్‌లో తిప్పుతూ ఉంటాము.

ఊరికే ఏదేదో ఆలోచించకు. కాలానికి తగినట్టే మనుషుల జీవన విధానమూ మారుతుంది. ఎప్పుడూ ఒకేలా ఉండాలనికోవడమూ కరెక్ట్ కాదు. "

చేతులు కడిగేసుకుని నిర్లక్ష్యంగా అనేసి వెళ్ళిపోతున్న ప్రియ వంక నిస్సహాయంగా చూస్తూ కూర్చుండిపోయాను.

పిల్లాడి కోసం ఊరికే గంటలు గంటలు మాల్స్‌లో తిరగడం నిజమే. ఊరికే కార్‌లో తిరగడమూ నిజమే. కానీ, దాని వల్ల ఎం పొందుతున్నారు పసివాళ్ళు?

ఆ రాత్రి ఆలోచనలతో తల బరువెక్కిపోయింది నాకు. ఏదో అడ్డు తెర నాకూ ఈ తరానికీ మధ్యన. నేనే అర్థం చేసుకోలేకపోతున్నానా? లేక వాళ్ళు దూరదృష్టితో భవిష్యత్తుని చూడలేకపోతున్నారా? ఏ సంపదలూ పిల్లలకంటే విలువైనవి కావని ఈ తరానికెందుకు అర్థం కావటంలేదు? మన అవసరానికీ, మన స్థాయికీ మించినట్టుగా జీవించాలని అనుకుంటే ఇద్దరూ సంపాదించే తీరాలి. నిజమే. కానీ, ఆ ఆశల జ్వాలల్లో నిశ్శబ్దంగా దగ్ధమైపోతున్న బిడ్డల భవిష్యత్తు ఎందుకు ఎవరి దృష్టికీ చేరడం లేదు? బిడ్డల వ్యక్తిత్వ వికాసం విషయంలో వెనుకటి తరాలకున్న బాధ్యతాయుతమైన దూరదృష్టి ఇప్పటి తరానికెందుకు అవసరం అనిపించటంలేదు?

★★★★★★★★★★

ఆరవ్‌ని స్కూల్లో వేశారు. వాడు యూ.కే.జీ కి వచ్చేసరికి నా భర్త రిటైర్ అయిపోవడంతో మేమూ ప్రియ ఇంటికి దగ్గర్లోనే మరో ఇల్లు చూసుకుని మకాం పెట్టేశాం.

యూ.కే.జీ లో ఉండగానే ఆరవ్ బ్లాక్ బోర్డ్ మీద టీచర్ వ్రాసేవి సరిగ్గా కనిపించడంలేదని చెప్పడంతో డాక్టర్ దగ్గరికి తీసుకువెళితే వాడికి రెండుకళ్ళకీ సైట్ వచ్చిందని ధృవీకరించి కళ్ళజోడు ఇచ్చారు.

"చూడు. అస్తమనూ ఆ వీడియో గేములూ, రైమ్స్ చూసి చూసి ఈ వయసులోనే కళ్ళజోడు తెచ్చుకున్నావు. " కొడుకుని దెప్పుతున్న ప్రియ వంక విచిత్రంగా చూశాను నేను. వాడి ఈ పరిస్థితికి కారణం ఎవరు?

రానురాను ఆరవ్ మొండిగా తయారవుతున్నాడు. అమ్మా, నాన్నల మాట వినడు. కొద్దో గొప్పో నేను చెబితే ఉపయోగం ఉంటోంది కానీ అది కొంతవరకే.

ఆ తరువాత ఎక్కువసేపు టీ.వీ చూస్తుంటే ప్రియ వాడిని కొట్టడం కూడా ప్రారంభించింది. పిల్లల్ని ఎప్పుడూ ఒక్క దెబ్బ అయినా వెయ్యకుండానే పెంచి పెద్ద చేసిన మాకు ఈ విషయం మింగుడుపడేది కాదు.

★★★★★★★★★★★★★

ఓ రోజు నేరుగా ఆఫీసు నుంచి ఇంటికొచ్చింది ప్రియ. ఆ సమయంలో ఆరవ్ మా అపార్ట్మెంటులోనే క్రిందకి ఆడుకోవడానికి వెళ్ళాడు.

"వీణా వాళ్ళ అమ్మాయి చూశావామ్మా. మొన్న లయన్స్ క్లబ్‌లో జరిగిన చాలా పోటీల్లో బహుమతులు తెచ్చుకుంది. "

ఆ మాట వినగానే నా ముఖం వికసించింది. "నిజమా ప్రియా. ఓ రోజు వీణ ఇంటికి వెళ్ళాలి. చాలా రోజులయింది ఆ అమ్మాయిని చూసి. "

నా మాటలకి ప్రియ ముఖంలో లీలగా కదలాడిన అసూయ గమనించగానే అక్కడితో ఆ మాటలు ఆపేశాను.

"ఈ మధ్య ధీరజ్ నన్ను తిడుతున్నాడు. వీణలా పూర్తిగా కాకపోయినా కొంచమయినా కొడుకు మీద శ్రద్ధ పెట్టట్లేదు నువ్వు అంటూ. " ప్రియ చెబుతుంటే ఆమె ముఖంలోకి చూశాను.

"వీణా వాళ్ళ అమ్మాయి ఎంత వినయంగా , ఒద్దిగకా ముచ్చటగా ఉంటుందో చూశావా. చదువుల సరస్వతే కాదు, చిన్నదైనా మంచీ మర్యాదా తెలిసిన పిల్ల. మా అపార్ట్మెంటులో ఆ పిల్లని మెచ్చుకోనివాళ్ళు లేరు. అందులోనూ ఈ మధ్యన తను వ్రాసే కథలు బాలల మాసపత్రికల్లో వస్తున్నాయిట. టీనేజిలోనే రచయిత్రిగా మారిందంటూ అందరూ తెగ పొగిడేస్తున్నారు. అవి కూడా పక్కన పెట్టు. ఆ పిల్లకి తల్లి మాటంటే వేదం. వీణ చాలా అదృష్టవంతురాలు. వీడూ ఉన్నాడు. పొగరుబోతులా తయారయ్యాడు. నోటికెంత వస్తే అంత అనేస్తున్నాడు. చదువులోనూ ఫస్టు మార్కులు లేవు. ఆ కోపమంతా ధీరజ్ నా మీద చూపిస్తున్నాడు. వీడి వల్ల మేమిద్దరం దెబ్బలాడుకుంటున్నాం. " చాలా ఉద్వేగంగా చెబుతోంది ప్రియ.

"తప్పు ప్రియా. వాడి వల్ల మీరు ఇవాళ దెబ్బలాడుకుని ఉండొచ్చు. కానీ, మీ వల్లనే వాడి తీరు ఇలా అయింది. నువ్వు వాడికేం ప్రేమని పంచావని నీ మాటంటే గౌరవం ఇవ్వాలనీ, వినాలనీ వాడి మనసుకి తెలుస్తుంది? "

టీ.వీ చూస్తునే అంటున్న నా భర్త మాటలకి ప్రియ షాకయినట్టుగా చూసింది.

"అదేంటి నాన్నా అలా అంటావు? "

"నిజం ప్రియా. నువ్వు ఏ విత్తనం నాటితే ఆ మొక్కేగా మొలుస్తుంది. నీ బాధ్యతేదో నువ్వు సరిగ్గా నిర్వహించనప్పుడు ఫలితం మాత్రం నీకు అనుకూలంగా ఉండాలని ఎలా అనుకుంటావు? "

"నాన్నా. అంటే మేమిద్దరం వాడిని బాధ్యతగా చూసుకోలేదంటావా? "

"అవును. నువ్వేం ఇచ్చావో అదే నీకు తిరిగొస్తుంది జీవితంలో. నువ్వు వాడికేం ఇచ్చావ్? ప్రేమగా ఎంతసేపు దగ్గరికి తీసుకున్నావ్? ఎంత సేపు వాడితో ఆడావ్? తల్లిగా ఎంత సేపు వాడికి మంచీ, చెడూ చెప్పడానికి సమయాన్ని వెచ్చించావ్? వాడి పసి వయసులో ఎన్ని రోజులు నువ్వే స్వయంగా అన్నం వండి వాడికి తినిపించావ్? "

చాలా గంభీరంగా, సూటిగా కూతురి ముఖంలోకి చూస్తూ అడుగుతున్న నా భర్తని ఆశ్చర్యంగా చూశాను. ప్రియ ముఖం మాత్రం కోపంతో ఎర్రబడింది.

"నాన్నా, అంటే నేనసలు వాడికి ఏదీ చెయ్యలేదా? వాడిని అమ్మ మీ ఊర్లోనే పెంచుతానంటే కూడా వద్దని మా దగ్గరే అమ్మని ఉండమన్నాం. నేనేమైనా దూరం చేశానా వాడిని? వాడిని నేను తల్లిగా ఏదీ చెయ్యలేదా?"

"చెయ్యలేదని నేను అనలేదు. కానీ, నువ్వు చేసింది మీ ఇద్దరి మధ్యనా అనుబంధం పెరగడానికి ఏ మాత్రమూ సరిపోదు. కాబట్టి నీకు ఇంతకన్నా వాడి నుంచి ఎదురుచూసే అర్హత లేదు. " కొట్టకుండానే కొట్టినట్టు చెప్పారు నా భర్త.

ప్రియ ఒక్కసారి ఆవేశంగా నా ముఖంలోకి చూసింది.

"అంటే. నెనవన్నీ చెయ్యలేదు కాబట్టి వీడిలా తయారయ్యాడా? లోకంలో పిల్లలందరూ ఇలాగే ఉంటున్నారా? తల్లీ, పిల్లల మధ్య ఉండేవి కూడా ఇచ్చిపుచ్చుకునే బంధాలేనా? " వెటకారంగా నవ్వుతూ అడుగుతున్న కూతురి వంక చిరునవ్వుతో చూశారాయన.

"బిడ్డలకి తల్లి కడుపులో ఉన్నంత కాలమే కాదు, వాళ్ళకి ఊహ తెలిసే వరకూ కూడా తల్లి యొక్క నిరంతర సామీప్యం చాలా అవసరం. ఊహ తెలిసే వరకూ వాళ్ళకి నా సొంతం అనిపించేది తల్లి ఒక్కతే. అసలు తల్లీ, తనూ వేరు వేరు అని కూడా ఆ పసివాళ్ళకి తెలీదు ఆ వయసులో. అటువంటి అతి ముఖ్యమైన సమయంలో వాళ్ళు పెరిగిన తీరుని బట్టే వాళ్ళ వ్యక్తిత్వం తద్వారా భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుంది. అందుకే ఆ సమయంలో తల్లి వాళ్ళకి మంచీ, చెడూ చెప్పడం, ప్రేమగా లాలించడం వాళ్ళలో సున్నితత్వానికి దోహదపడతాయ్.

తల్లి కడుపులోంచి బిడ్డ బయట పడగానే తల్లితండ్రులయిపోయామని క్షణకాలం సంతోషపడిపోయి , పార్టీలు చేసేసుకుని ఆ తరువాత నుంచే ఆ పసివాళ్ళని ఎలెక్ట్రానిక్ వస్తువుల ఒడిలో వదిలేసి వెళ్ళిపోయేవాళ్ళెవరూ నిజమైన తల్లితండ్రులుగా నాకు కనిపించరు. పిల్లల పట్ల తమ బాధ్యత నిర్వర్తించని పెద్దలకి, అసలు విధేయతంటే ఏమిటో పిల్లలకి తెలియజెప్పడానికి సమయం కూడా చాలని పెద్దలకి, పిల్లలనుంచి విధేయత ఎదురుచూసే హక్కు ఎక్కడి నుంచి వస్తుంది? "

ఆ మాటలకి ప్రియ చురచురా చూసేసి వెంటనే ఇంటికి వెళిపోయింది. ఆ తరువాత చాలా రోజులు ప్రియ మాతో ముభావంగానే గడిపింది.

ఎవరెలా ప్రవర్తించినా కాలచక్రం మాత్రం తనలో తను నవ్వుకుంటూ తన పని తాను చేసుకుంటూ పోతుందిగా.

ఆరవ్ పాతికేళ్ళవాడయ్యాడు. ప్రియకీ, ఆమె భర్తకీ యాభై అయిదేళ్ళు పైబడ్డాయి. ఇక సంపాదించింది చాలనిపించిందో ఏమో ప్రియ రెండేళ్ళ క్రిందటే ఉద్యోగానికి రాజీనామా చేసేసింది.

ఆరవ్‌కి ఒక పెద్ద కంపెనీలో మంచి జీతంతో ఉద్యోగం వచ్చినప్పుడు ఇంట్లో అంతా పండగ చేసుకున్నాం.

ఎందుకో ఆ తరువాత నుంచీ ప్రియలో చాలా మార్పొచ్చింది. స్తబ్దుగా ఉంటోంది. నిరాశగా మాట్లాడుతోంది. మొదట్లో ఉద్యోగం మానెయ్యడం వల్ల వచ్చిన మార్పు అనుకున్నాను కానీ నాకెందుకో అది కారణం అనిపించడం లేదు.

ఆరవ్‌కి నచ్చిన వంటలు చెయ్యాలని ప్రియ ఆశ పడుతోంది. వాడేమో ఆఫీసుకి ఇంటి భోజనం తీసుకువెళ్ళడు. రాత్రి కూడా చాలా వరకూ ఆఫీసులోనో , స్నేహితులతో హోటల్‌లోనో భోజనం చేసి ఇంటికి వస్తాడు. ప్రియ తాపత్రయాన్ని అర్థం చేసుకోడు.

రాత్రి వాడు ఇంటికి వచ్చాక వాడు తనతో కాసేపైనా కబుర్లు చెప్పాలని ఎదురుచూస్తోంది ప్రియ. కానీ, వాడు ఏమీ మాట్లాడడు. టీ.వీలో ఇంగ్లీష్ సినిమా చూస్తూనో, తన పెర్సనల్ కంప్యూటర్‌లో ఏదైనా గేమ్స్ ఆడుతూనో గడిపేస్తాడు.

దగ్గర కూర్చుని ప్రియ ప్రేమగా "ఏమిటి సంగతులు" అంటే కూడా "ఏమున్నాయ్ మమ్మీ. నథింగ్ స్పెషల్ " అంటాడు. పోనీ తనయినా ఏమైనా విషయాలు మాట్లాడితే పెద్దగా శ్రద్ధ పెట్టి వినడు. ఓకే మమ్మీ. అవన్నీ నాకెందుకు అంటాడు. కొడుకుతో కాసేపు మాట్లాడాలని ఆత్రంగా రోజంతా ఎదురుచూస్తున్న ప్రియ ఉసూరుమంటూ తన గదిలోకి వెళుతుంది. భర్త తన లాప్‌టాప్‌లో ఇంటర్నెట్ చూసుకుంటూ ఉంటే చందమామ , నక్షత్రాలూ పక్కనే ఉన్నా, చీకట్లోనే ఉన్న ఆకాశాన్ని కిటికీలోంచి చూస్తూ నిద్ర వచ్చేవరకూ ఒంటరిగానే పచార్లు చేస్తుంది.

ఇవన్నీ ఆమె స్తబ్దతకి కారణమేమిటని నేను గుచ్చి గుచ్చి అడిగితే ప్రియే నాకు చెప్పింది.

"ప్రియకిప్పుడు ఆత్మీయులతో గడపాలనిపిస్తోందేమో. మనుషుల మనస్తత్వాలు మారుతూ ఉంటాయి. ఇన్నేళ్ళూ తన ఉన్నతికి కారణమైన ఆ ఎలక్ట్రానిక్ పరికరాలేవీ ఇప్పుడు తనకి తోడు కాలేకపోతున్నాయ్ చూశావా? " నిట్టూరుస్తూ అన్నారు నా భర్త.

ఇద్దరం మా ఇంటి దగ్గరే ఉన్న ఆంజనేయస్వామి గుడికి వెళ్ళి అక్కడినుంచి అలవాటు ప్రకారం ప్రియతో కాసేపు గడపడానికి వాళ్ళ ఇంటివైపు నడిచాం.

ఆరవ్ తలుపు తీశాడు. ఆ వేళ ఇంటి నుంచే వర్క్ చేస్తున్నాడుట. మేము వెళ్ళేసరికి ప్రియ కళ్ళనీళ్ళతో ఉండటం, వాడి మొహం విసుగ్గా ఉండటం చూసి కంగారు పడుతూ ఆరవ్ ముఖంలోకి చూశాను నేను.

"నువ్వైనా చెప్పు అమ్మమ్మా. మమ్మీ ఎంత విసిగిస్తోందో ఈ మధ్య నన్ను. నాకు వర్క్ ఉంది. ఇంట్లో ఉన్నా కూడా పని చెయ్యాలి. ఊరికే ఏమైనా మాట్లాడరా నాతో అంటే ఏం మాట్లాడతాను? ఏం ఉంటాయ్ అన్ని విషయాలు?

ఇంటి నిండా అన్ని వస్తువులూ ఉన్నాయ్. అంత పెద్ద టీ.వీ, హోమ్ థియేటర్, లాప్ టాప్, సూపర్ పవర్ ఫోన్, తనకంటూ పెద్ద కార్. ఏదో ఒకటి చేసుకోవచ్చు. నెట్‌లో ఏమైనా చదవొచ్చు. సినిమాలు చూడచ్చు. కార్‌లో ఎక్కడికైనా అలా వెళ్ళి రావొచ్చు. ఇవేవీ చెయ్యకుండా కాసేపు నా పక్కన కూర్చోరా, కాసేపు నాతో మాట్లాడరా అంటే నాకు మాత్రం పని లేదా? "  పెద్ద గొంతుతో ఆవేశంగా అరుస్తున్న వాడిని చూస్తే నాకు నోట మాట రాలేదు.

ప్రియ ఆ మాటలకి రెక్క తెగిన పక్షిలా కళ్ళు తుడుచుకుంటూ సోఫాలో కూలబడింది.

"ఒరెయ్ కాసేపు మన మనుషుల సమక్షం ఇచ్చే మనశ్శాంతి నువ్వు చెప్పిన వస్తువులేవీ ఇవ్వలేవురా .. " అని అనాలనుకున్నాను కానీ ఆ మాటలు నా గొంతులోనే ఆగిపోయాయి.

మనవాళ్ళ సమక్షంలో కాసేపు గడపడం ఎంత హాయినిస్తుందో వాడికి అసలు అనుభవమైతే కదా ఆ విలువ తెలిసేది? ఎలక్ట్రానిక్ పరికరాల మధ్యనే ఆడుతూ పెరిగిన వాడికి ఆ విలువ ఎలా తెలుస్తుంది? ఒక రకమైన ఎన్విరాన్మెంటులో వాడు రూపు దిద్దుకున్నాక, చెట్టంత ఎదిగిపోయాక అకస్మాత్తుగా వాడికి మనం పరిచయమే చెయ్యని మరో ఎన్విరాన్మెంటులోకి రమ్మంటే ఎలా రాగలడు?  సమాజం మొత్తం ఇప్పుడు ఈ తీరులో పెరిగిన యువతే కదూ. ఆత్మీయత ఏమిటో పరిచయమే అవని యువత. ఎటు పోతుంది ఇక లోకం?  ఈ విషయంలో తప్పు ఎక్కడ జరిగింది? దీనికి విరుగుడేమిటి?

నిస్సత్తువగా నా భర్త ముఖంలోకి చూస్తూ నిలబడిపోయాను.



కథా కౌముది

# చీకటయిన వెలుగు

జోషిబాబు

శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
20 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
యువతరం విభాగంలో ప్రశంసాపత్రం పొందిన కథానిక

కాలం సమీపిస్తోంది, శరీరం అంతాచెమటలు కక్కుతోంది. భయంకరమైన నిశ్శబ్దం ఆవరించిన ఆ గదిలో గడియారం ముల్లు కూడా కంచుగంటలా వినబడుతోంది. ఈ రోజు తన జీవితానికి చావో రేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి. నేటితో తనకూ ప్రభుత్వ ఉద్యోగానికి అవసరమైన వయస్సు దాటిపోతుంది. కానీ తనకు ఈ ఉద్యోగం ఎంతో అవసరం మాత్రమే కాదు తన జీవితం కూడా ... తను తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడానికి స్టవ్ వెలిగించాడు .......

---------------

కాలేజీ రోజుల్లో అతను ఎంతో ఆనందంగా రెక్కలు వచ్చిన పక్షిలా ఉండేవాడు. అంతే కాకుండా చాలా బాగా చదివి కళాశాల ప్రధముడిగా ఉత్తీర్ణుయ్యాడు. ఎంతో ఆత్మ విశ్వాసంతో భవిష్యత్తు మీద చాలా ఆశలతో, ఆశయాలతో ఉద్యోగాలవేట మొదలుపెట్టాడు.. ఎప్పుడైతే ఉద్యోగాలవేట మొదలయ్యిందో అతనికి ప్రపంచం ఎంత పెద్దదో, విశాలమైనదో తెలిసింది. దరిమిలా అతని జీవితం తలక్కిందుల్లయ్యింది. ఒక ప్రక్క ఉద్యోగం దొరకక, మరో పక్క డబ్బులులేక సతమవుతున్న తనను తను ఘాడంగా ప్రేమించిన ప్రియురాలి వివాహ వార్త హృదయాన్ని కలచివేసింది. దానిని ఆపడానికి ఎన్నోవిధాల ప్రయత్నిచాడు. కానీ ఉద్యోగం లేకపోవటం అనే నిస్సహాయతవల్ల చూస్తూ ఉండిపోయాడు. " ఇంతకాలం నీకోసం ఎదురు చూసాను ఇక నావల్ల కాదు " అని ఆ అమ్మాయి కూడా చివరకు తన తండ్రికే తన వోటు వేసింది. అది విని ఇన్నాళ్ళు వున్న ఒక్క ఆశ కూడ ఆవిరైపోయింది. " ప్రేమకు కూడా ఎక్స్పైరీ డేటు ఉంటుందా!" అని ఆశ్చర్యపోవటం తనవంతయ్యింది. ..

జీవితంలో మొట్టమొదటి సారిగా పురుషజన్మ ఎత్తినందుకు భాద పడ్డాడు..."అదే ఆడదిగా పుట్టుంటే ఈ ఉద్యోగం చేయాల్సిన కష్టం ఉండేది కాదు కదా " అనుకుంటున్న అతనికి తన తల్లి బాల్యంలో తన తాగుబోతు తండ్రి వల్ల పడ్డ కష్టాలు గుర్తుకొచ్చి తన అభిప్రాయాన్ని వెనక్కు తీసుకున్నాడు.

గత వారం రోజులనుంచి పాత స్నేహితులు చాలమందికి, పైగా తనకంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి కూడా ఉద్యోగాలు వచ్చాయన్ని తెలియడంతో తన బాధ రెట్టింపయ్యింది.

ఈ ఆలోచనలతో నిస్సత్తువ ఆవరించి ' టీ ' తాగుదామని, తన బాహ్య ప్రపంచపు దినచర్య మొదలయ్యే కేఫ్ లో మొదటిసారిగా రెండవ 'టీ' తాగడానికి బయలుదేరాడు.. ఆచోటంతా ఒక సంతలా ఉంది. బాగా పరిచయం ఉన్నదైనా .. కొన్నిసార్లు కొన్ని ప్రదేశాలు , కొందరు మనుష్యులు కొత్తగా , కొన్నిసార్లు వింతగా కనిపిస్తారు అనిపిస్తారు. అక్కడ అందరూ ఏదో ఒక పనిచేసేవాళ్ళే, లేదా పనిచేసివచ్చి సేద తీరుతున్న వాళ్ళే. .... సమాజంలో అందరూ ఏదో ఒక పని చేసేవారే ...

సమాజంలో అందరూ ఏదో పనిలో ఉన్నట్టు తనుమాత్రమే ఉద్యోగహీనుడిగా తనకు అనిపించాడు. నెమ్మదిగా వెళ్ళి ఒక బెంచీ మీద కూర్చొని తనకు సుపరిచితుడైన సర్వర్ కోసం వెతికాడు. “ ఏంటి సార్ ఉద్యోగం దొరికిందా ??” అనే ప్రశ్న వచ్చిన వైపు తిరిగాడు. ప్రతీఒక్కరినీ ఏలా వున్నారు?? అని అడగితే తనను మాత్రం ఇలా ప్రశ్నిచడం మొదట్లో బాధ కలిగించినా రాను రానూ అలవాటయ్యింది. కానీ ఎదురుచూసిన ప్రశ్నే అయినా అది అతనిని అతని సామర్ధ్యాన్ని ప్రశ్నించినట్టు , అవమానించినట్టు అనిపించింది. ముభావంగా తల అడ్డంగా ఊపాడు.

“ సరే సార్ “ అని ఏటువంటి భావం లేకుండా “ టీ” తేవడానికి వెళ్ళి పొయాడు.

చుట్టూ కలియచూడగా ఇద్దరు కుర్రాళ్ళు cricket kit తో ఆటకు బయలుదేరుతున్నారు. వేరుశనగలు అమ్మే ముసలివాడు “టీ “ విరామం తీసుకుంటున్నాడు. హోటల్ యజమాని సర్వర్లకు ఆర్డర్లిస్తూ, కస్టమర్స్ ని పలుకరిస్తూ తన ఉనికిని చాటుతున్నాడు. సాఫ్ట్ వేర్ ఉద్యోగులు మెడలో వేలాడుతున్న కార్డులు ఒలింపిక్ పతకాలలా వేసుకుని తిరుగుతున్నారు. అందరూ ఒకరి కష్టాలు ఒకరు పంచుకుంటున్నారు. బహుశా సుఖాలు పంచుకోవడానికి ప్రక్కన డి'వైన్' షాపు ఉండనే ఉంది.ఇలా వచ్చేపోయేవారిని చూస్తూ, తన స్థితికి తానే జాలిపడుతూ సాయంత్రం వరకూ అలానే కేఫ్ లోనే నిరాశ నిస్పృహలతో కాలక్షేపం చేస్తూ గడిపి ఇంటికి బయలుదేరాడు.

అప్పుడు చూసిన ఒక సంఘటన తన చేతినుంచి శాశ్వతంగా చేజారిపోతున్న ఉద్యోగాన్ని చేతికందించేలా అనిపించింది..లేదు లేదు 'కనిపించింది'.....

ఉదయం café కి వచ్చే సమయంలో తను రూపాయి చిల్లర వేసిన కళ్ళు లేని బిచ్చగాడు తన ఎదురుగా టీ తాగడానికి café లోనికి వెళ్ళడం చూసి ఆశ్చర్యపోయాడు. అతను మాత్రం బాగా అలవాటయిన వ్యాపకంలా సంచి భుజాన వేసుకొనివెళ్ళి టీ తాగసాగాడు.. తనలో కొత్తగా ఉదయిస్తున్న ప్రశ్నలకు సమాధానం కోసం వెళ్ళి ఆ వ్యక్తిని “ఎందుకు ఇలా చేస్తున్నావు?" అని అడిగాడు.

దానికి అతను సమాధానంగా ఓ నవ్వు నవ్వి “కాలం మనిషికి అవసరంతో పాటు ఆలోచన కూడా కల్పిస్తుంది....నాకు ఇది...నీకు ఇలాంటిదో లేక మరొకటో “ అని నిస్తేజంగా పలికి తన పనిలో మునిగిపోయాడు.

అతని మాటలు తన బుర్రలో గిర్రున తిరుగుతుండగా ఇంటికివెళ్లాడు. అదే ఆలోచిస్తూ పడుకున్నాడు.నిద్రలోకి జారుకుంటూ వుండగా హఠాత్తుగా మెలకువ వచ్చింది..ఇంతకాలం తనను వేధిస్తున్న ప్రశ్నకు సమాధానం, తనను క్షోభకు గురిచేసిన సమస్యకు పరిష్కారం దొరికినట్టనిపించింది....

కానీ అది ఏవ్యక్తి తనకు వేసుకోని శిక్ష ఏ వ్యక్తి కలలో కూడా కోరుకోని శాపం. కానీ తెల్లవారితే తన వయస్సు పరిమితి దాటిపోతుంది. ఆ రాత్రి అతను ప్రతీక్షణం కళ్ళు తెరచి ఉండటానికే ప్రయత్నించాడు. కానీ ఆలోచనలతో అలసిన మనసు ఆకలితో అలసిన శరీరం తనని అప్రయత్నంగా నిద్రపుచ్చాయి. ఉదయన్నే లేచి ఒకరకమైన ఆనందవిషాదంతో తనకు ఇష్టమైన ప్రదేశాలను చూడటానికి బయలుదేరాడు. తను మొదటి సారి తన ప్రియురాలిని చూసిన ప్రదేశం..తను రోజూ టీ తాగే ప్రదేశం....ఆమెను కలిసే ప్రదేశాన్ని చూశాడు. తన ప్రియురాలిని దూరంగా చూశాడు. ఇలా తన జీవితంలో ఎన్నోమధురానుభూతులను పంచిన ప్రదేశాలను తనివితీరా కంటిలోనింపుకుని, ఆ రాత్రి ఇంటికి వచ్చాడు.

ఆ ఆలోచనలతోనే stove వెలిగించాడు. అతని గుండె రేపేమవుతుందో అనే భయంతో వణుకుతుంటే నీళ్ళు వేడితో మరుగుతున్నాయి.' నిర్ణయం తీసుకోవడం ఎంత కష్టమో ..నిర్ణయాన్ని అమలు చేయడం అంతకు పదింతలు కష్టం' అనుకుంటూ కాలు జారి స్టవ్ మీదపడటం కళ్ళు కాలటం ఒకేసారి జరిగిపోయాయి. అంతే ఊహ వచ్చేసమయానికి హాస్పిటల్ లో ఉన్నాడు. పక్కన తల్లి గుండెలవిసేలా ఏడుస్తోంది. తను కళ్ళు తెరవడానికి చేస్తున్న ప్రయత్నం విఫలమయింది.

కానీ 'ఏంఫర్వాలేదు భయపడకండి  మీ అబ్బాయికి తొందరలోనే చూపు వచ్చేస్తుందీ' అన్న డాక్టర్ మాటలు విని తన ప్లాన్ విజయవంతం కాబోతున్నందుకు తనలో తనే నవ్వుకున్నాడు. కొన్ని రోజులే ఈ నరకం. తరువాత తను ప్రభుత్వ ఉద్యోగి అనే ఊహే అతనిని మహదానందం కలిగించింది. రెండు రోజుల తరువాత పక్కనే ఉన్న స్నేహితునితో తను డాక్టర్తో ఒంటరిగా మాట్లాడాలని చెప్పాడు.

డాక్టర్ తో " సార్ నాకు చేజారిపోయిన గవర్నమెంట్ ఉద్యోగం చేజిక్కించుకునే చివరి అవకాశం మీచేతుల్లో ఉంది ' అన్నాడు.

దానికి డాక్టర్ “నేనేం చేయగలనూ?" అన్నాడు  ఆశ్చర్యం నిండిన కళ్ళతో.

దానికి అతను “ నేను నా కంటి చూపును కొన్ని నెలలు వాయిదా వేయాలని అనుకుంటున్నాను”  అన్నాడు.

డాక్టర్ ముఖం ఎలా మారిఉంటుందా అని ఊహించుకుంటూ !!

" మీరు నాకు చూపు పోయిందని సర్టిఫికేట్ ఇవ్వాలి.. దానికి మీకు ఎంతకావలన్నా ఇవ్వడానికి , చేయడానికి నేను సిద్ధం ...లేకపోతే నాకు మరణమే శరణ్యం” అన్నాడు.

డాక్టరుకి అతను అన్న మాటలలో మొదటిది తన మెదడుకీ, రెండవది మనసుకీ బాగానచ్చాయి. మనిషి తన మనసుకు సమాధానం చెప్పుకోగలిగితే ఏ తప్పు చేయడానికీ వెనుకాడడు.

డాక్టర్ “ నేను కేవలం 5 నేలలు మాత్రమే కాపాడగలనూ “ అని చెప్పి ఆ సమయంలో తను తీసుకోవల్సిన జాగ్రత్తలూ అన్నీ చెప్పాడు.

అనుకున్నవన్నీ సరిగ్గానే జరుగుతున్నాయన్న ఆనందంతో తన తల్లి దారిచూపుతుండగా ఇంటికి బయలు దేరాడు. ఉద్యోగానికి ధరఖాస్తు నింపడం కొత్త కాకపోయినా వేరేవాళ్ళతో నింపించడం చాలాకొత్త కానీ ఎన్నడూ లేని ఆనందంతో ఆ ఫారాన్ని నింపించాడు. వికలాంగులు అనే భాగంలో బ్లైండ్ అని నింపి తన తాత్కాలిక అంగవైకల్యాన్ని తనే బాగా ఎంజాయ్ చేస్తున్నాడు, ప్రతీరోజూ డాక్టర్ చెప్పిన మందులూ జాగ్రత్తగా వేసుకుంటూ ఇంకా జాగ్రత్తగా తన ఆశయాన్ని తన కళ్ళనూ కాపాడుకుంటూ వస్తున్నాడు. ఉదయన్నే లేచి కాలకృత్యాలు తీర్చుకుని, అల్పాహారం చేసి ఇంటి పక్కకుర్రవాడితో పేపర్ చదివించుకోవడం, పాటలు వినటం ఇదే తన దినచర్య. అతను ఎంతో కాలంగా వేచి చూస్తున్న ఆ వార్త మూడునెలల తరువాత రానేవచ్చింది. ఆ రోజు పోస్ట్ మాన్ తెచ్చిన ఉత్తరాన్ని అతనిచేతే చదివించుకుని తన ఆనందాన్ని 100 రూపాయల రూపంలో అతనితో పంచుకున్నాడు. ఇన్నాళ్ళు తనకు అన్నీ సర్వస్వం అయి సేవలుచేస్తూ, ఇంకా తనను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్న తన తల్లికితనకు ఉద్యోగం వచ్చిందని అంతుపట్టలేని ఆనందంతో చెప్పాడు.

ఉద్యోగం రావటం .. జాయిన్ అవ్వడం .. రెండునెలలు జరిగిపోవడం తనకు కలలావుంది. ఆ రోజుతో తన అయిదు నెలల అంధత్వ వనవసం  నుంచి విముక్తి లభించనుంది. ఇక తనది ఒకే ఒక కోరిక, చూపు రాగానే మొదట తన తల్లిని చూడాలని. తన కృతజ్ఞతను కన్నీళ్ళ రూపంలో తల్లికి తెలపాలని అనుకుంటూ  మందు ఆఖరి చుక్కను వేసుకుని ప్రశాంతంగా నిద్రపోయాడు.

మరుసటి రోజు ఉదయం తన తల్లి సహాయంతో ఆసుపత్రికి వెళ్ళాడు ... చిన్నపిల్లల ఇంజెక్షన్ ఏడుపులూ ... చక్రాల కుర్చీ చప్పుడూ ...నర్సుల విసుగు అన్నీ వినిపిస్తున్నాయి...'బాబూ అప్పుడే వెల్లిపోయావా?' అన్న ఒక తల్లి ఆర్తనాదం విని ఒక్క సారిగా ఉలిక్కిపడ్డాడు. గంట నిరీక్షణ తరువాత డాక్టర్ అతనిని పరీక్షల నిమిత్తం లోపలికి తీసుకెళ్ళాడు.

కళ్ళను పరీక్షించి ఒకే ఒక ప్రశ్న వేసాడు "రాత్రి ఏమందు వేసుకున్నావు?" అని. తరువాత డాక్టర్ మాటవిన్న తనకు భూమి నిట్టనిలువుగా చీలి తను అందులో కూరుకుపోతున్న భావన కలిగింది. నమ్మ లేని నిజం, ఊహకు కూడా రాని ఉత్పాతం తన జీవితం.. తన జీవితం తల్ల కిందులయ్యింది!!

ఒక్కసారి ఒకే ఒక్కసారి తనను కంటికి రెప్పలా కాపడిన తన తల్లిని చూడాలనిపించింది. ఆరోజు తన చూపు పోయేముందు తను చూసిన వాటిలో, వారిలో తన తల్లి లేనందుకు అపరాధ భావం, భాదతో కుమిలిపోతున్నాడు. ఎవరో గుండెల్లో కత్తితో నెమ్మదిగా దించిన బాధ ....జీవితంలో కొన్ని విషయాలు కలలైతే బాగుండు అనుకుంటాం. కొన్ని కలలు కాకపోతే బాగుందు అనుకుంటాం.. కానీ రెందు సందర్భాలలోనూ అది నిజం పచ్చి నిజం....

మరుసటి రోజు చేతికర్ర తీసుకుని తడుముకుంటూ, తలవంచుకుని చీకటి ప్రపంచం, రంగులులేని ప్రపంచంలోకి మొదటిసారిగా బయలుదేరాడు.!!




# సుల్తానీ

ఎన్. తారకరామారావు

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ**

''ఆ ఉ''

ఇలా వ్రాయడం ఎందుకు తప్పో చెప్పాలని నిలదీసినవాడు - వాసుదేవరావు.

''ఆవు'' అని ఎందుకు వ్రాయాలో చెప్పలేకపొయ్యాడు - ప్రాధమిక పాఠశాల పంతులు.

అలాంటి వాసుదేవరావు జీవితంలో - అనేక సాహసాలు, చిత్రవిచిత్రాలు చేశాడు.

రిక్షావాడికి రూపాయికి బదులుగా వందరూపాయలు ఇవ్వడం, ఎవరైనా కాలేజీ రోజుల్లో సిగరెట్ అడిగితే 'అడుక్కోవటానికి సిగ్గు లేదూ' అని చీదరించుకోవడం, అడక్కపోయినా దగ్గరున్న స్నేహితులందరికీ విందులివ్వడం - అందులో కొన్ని.

వీటన్నిటికన్నా ముఖ్యమైంది...

ఆ రోజుల్లో డాక్టరు చదవటానికి సీటొచ్చినా కాదనుకుని కలకత్తా వెళ్ళి హోమియోపతి కోర్సులో జేరడం. అది పూర్తిగా చదవకపోగా, ఓ బెంగాలీ ముస్లిమ్ అమ్మాయిని, అదీ పిల్ల తల్లిని పెళ్ళిచేసుకు రావడం..

వాసుదేవరావు భార్య, పర్వీన్ సుల్తానా ఫోన్ చేసి ''ఎంత వీలయితే అంత త్వరగా రండి'' అంది.

వెళ్ళక తప్పులా!

నే వెళ్ళేసరికి వాసుదేవరావు కాలం చేశాడు.

''ఏం జరిగింది?''

''ఆ వివరాలు తర్వాత, ముందు జరగాల్సింది చూడండి. మీ చాదస్తాలు, సంప్రదాయాలు నాకంతగా తెలియవు, పైగా నాకిక్కడ మీరు తప్ప మరొకరు తెలియదు.''

నేనూ, నా భార్యా నడుం బిగించక తప్పలేదు.

వాసుదేవరావుకి బంధుగణం చాలావుంది. అందరూ కూతవేటు దూరంలోనే ఉన్నారు కూడా. ఎవ్వరూ రాలా. వస్తారన్న నమ్మకమూ నాకంతగా లేదు.

ఎందుకంటే -

వాసుదేవరావుకి పిత్రార్జిత సంపద చాలా వచ్చింది. భూములు, ఇళ్ళస్థలాలు, బంగారం, బ్యాంకులో డబ్బు.. పైగా ఒక్కగానొక్కడు. అదీ లేకలేక పుట్టాడు. తండ్రి చిన్ననాడే కాలం చేశాడు. తల్లి లోకంపోకడ తెలియని ఇల్లాలు. కనుక అయినవాళ్ళు కలగచేసుకుని, ఆస్తిమీద, ఆ కుటుంబం మీద అజమాయిషీ చెయ్యాలని ప్రయత్నించినా, వాళ్ళల్లో వాళ్ళకు అభిప్రాయభేదాలు, తగవులూ వచ్చి, కాట్ల కుక్కల్లా పోట్లాడుకుని, దూరంగా ఉండిపొయ్యారు, ఎవ్వరూ ఆ ఇంటివేపు చూసినా, వెళ్ళినా మిగతావాళ్ళు కాకుల్లా నానాయాగి చేసి, గోలచేసేవాళ్ళు.

దానా దీనా, వాసుదేవరావు అదుపాజ్ఞలేకుండా పెరిగాడు. తల్లి బ్రతికుండగా కొంత అదుపు చేసినా ఆమెకూడా కాలం చేశాక, వాసుదేవరావు బరితెగించిన ఆబోతులా తయారయ్యాడు. దాని ఫలితమే ఈ దుస్థితికి కారణం.

కర్మకాండకు అవసరమైన ఏర్పాట్లు చేసా. వంటవాళ్ళను పన్నెండు రోజుల కార్యక్రమానికి కావాల్సిన సరంజామా, సరుకులు - అన్నీ సమకూర్చా.

చివరకు మిగిలిన ప్రశ్న - అంత్యక్రియలు ఎవరు చేయాలనే.

వాసుదేవరావుకు పెళ్ళిచేసింది తల్లి బ్రతికుండగానే. కానీ పర్వీన్ సుల్తానా రాకతో భార్య వెళ్ళిపోయింది అలిగి. తరువాత ఆమె జాడ ఎవ్వరికీ తెలియదు.

పర్వీన్ సుల్తానా కూతురుకు వయసొచ్చాక వాసుదేవరావే పెళ్ళిచేశాడు. ఆ పెళ్ళి చేయించటానికి బ్రాహ్మలు, ముల్లాలు ఎవ్వరూ ముందుకు రాకపోతే ఆర్యసమాజ్‌లో పెళ్ళి చేయించింది అతడే కాని, ఆ పిల్లా భర్తతో వెళ్ళిపోయిది. ఆమె అడ్రసు తెలియదు.

ఇదీ పరిస్థితి.

"మీ ఇష్టం.. ఏం చేసినా సరే. అన్నీ సక్రమంగా, యధావిధిగా జరగాలి" అంది పర్వీన్ సుల్తానా.

ఓ బ్రాహ్మణ బ్రహ్మచారికి బలవంతాన డబ్బు ఆశ చూపి, ఒప్పించి కర్తుత్వం వహించేలా చేసి కర్మకాండ మొదలు పెట్టించా.

పర్వీన్ సుల్తానా గదికే పరిమితమైంది. ప్రతిరోజూ కార్యక్రమం పూర్తయి, బ్రాహ్మలు భోజనం చేశాక ఆమె తినేది. అదే ఆమె ఏకాగ్రత, కార్యదీక్ష, వ్యక్తిత్వం.

పదోరోజుకు కొందరు బంధువులు వచ్చారు. వాళ్ళల్లో వాసుదేవరావు భార్యకూడా ఉంది. ఆమెకో కొడుకూ ఉన్నాడు. తిలోదకాలు, ధర్మోదకాలు పూర్తయినాయి.

వాసుదేవరావు ఆస్తి, వారసత్వం ఏదో ఒకరోజున నలుగురిలో చర్చకు వస్తుందని తెలుసు.

వస్తే ఏం చేయాలి? ఆస్తి, అప్పుల వివరాలు తెలియవు వాడు నాకు ప్రాణస్నేహితుడయినా వాసుదేవరావు అడపా దడపా చెప్పిన కొద్ది సమాచారం తప్ప.

"ఎందుకు ఈ అమ్మాయిని చేరదీశావు?" అని అడిగా ఓసారి పర్వీన్ సుల్తానా ప్రస్తావన వచ్చినప్పుడు.

"ఆ అమ్మాయిని చూశావా?"

తలూపా.

"ఆమె ఎలా ఉంది?"

నిజం చెప్పాలంటే పర్వీన్ సుల్తానా స్ఫటికంలా ఉంటుంది. ఆమె కనుముక్కు తీరు, శరీరాకృతి, వంటిరంగు అన్నీ పరమాద్భుతం. ఆ అమ్మాయి ముస్లిం అనిగాని, పిల్లతల్లని గాని చెప్పినా నమ్మశక్యం కాదు.

"ఆమెను భర్త వదిలేశాడు. ఆమెకు వెనుకా ముందూ ఎవ్వరూ లేరు. బ్రతకాలంటే శరీరం, సౌందర్యం తప్ప మరో ఆధారంలేదు. ఆమె అందం నానాజాతి పురుషుల కౌగిళ్ళలో నలగటం నాకు ఇష్టంలేకపోయింది" అన్నాడు వాసుదేవరావు.

పర్వీన్ సుల్తానా ఆ రోజుల్లో మా ఊళ్ళో మెరుపుతీగ.. ఆమె వీధిలోకొస్తే పురుషులే కాదు, స్త్రీలు కూడా ఓ క్షణం ఆగి ఆమె అందాన్ని తేరిపారచూడటం నేనెరుగుదును.

వాసుదేవరావు శుభాలకు, అశుభాలకు పర్వీన్ సుల్తానాతోనే వెళ్ళేవాడు.

ఆమె ఎవరింటికి వచ్చినా లోపలకు వచ్చేదికాదు. బయటే కూర్చునేది. ఎక్కడ భోజనం పెట్టినా తినేది. తన విస్తరేకాక అక్కడున్న అందరి విస్తళ్ళూ తీసేది. ఇంట్లోకి వెళ్ళకుండా బయట అన్నిపనులూ చేసేది ఎవ్వరూ చెప్పకపోయినా పలకరిస్తే పలికేది. ఎప్పుడూ నవ్వుతూ ఉండేది. ఆమెలో అదో ఆకర్షణ.

మొహాన కుంకుమ బొట్టు. మెళ్ళో మంగళసూత్రం, చేతికి గాజులు నిండుగా సంప్రదాయబద్ధంగా చీరకట్టుకుని, కాళ్ళకు పసుపు రాసుకుని, మెట్టెలు పెట్టుకుని, మంగళప్రదంగా, పెద్దముత్తయిదువులా కనబడేది. ఆమెది అదో అందం.

వాసుదేవరావు ఓ రకంగా అదృష్టవంతుడనే నా భావన. ఏనాడూ ఆమె ప్రవర్తన గురించిగాని, తీరుతెన్నుల గురించి గానీ అసంతృప్తి వ్యక్తీకరించలేదు వాడు బ్రతికుండగా. ఆర్థికవ్యవహారాలన్నీ ఆమే చూసేది, చేసేది.

వాసుదేవరావు క్లబ్బుకు వెళ్ళడం, పేకాడటం, మందు త్రాగడం, సిగరెట్లు కాల్చడం ఏవో వ్యాపారాల్లోనూ, లావాదేవీల్లోనూ డబ్బు నష్టపోవడం ఇదీ వాడి తంతు. వాడికి అదో సరదా.

వాసుదేవరావు భార్య యువకుడయిన తన కొడుకును పరిచయం చేశాక ఇవన్నీ గుర్తుకు వచ్చాయి.

ఇన్నాళ్ళూ వీళ్ళేమయిపోయారో, ఎక్కడున్నారో, అసలు వాసుదేవరావు పోయాడనే విషయం ఎలా తెలిసిందో సమాధానం దొరకని ప్రశ్నలే.

పదోరోజు సాయంత్రం అగ్గిరాజుకుంది.

ఓ పెద్దాయన సభచేసి, వారసత్వం, ఆస్తి, అప్పుల ప్రస్తావన తెచ్చాడు. బంధువులు ఆసక్తిగా కూర్చున్నారు - నక్కల్లా కాకుల్లా!

"నువ్వుండాలి. ఆ సుల్తానాకు నువ్వే ప్రతినిధివి కదా!" అంటూ నన్నూ కూర్చోబెట్టారు సభలో.

చర్చలు, వాదోపవాదాలు, తీర్మానాలు జరిగాయి.

"పర్వీన్ సుల్తానా వాసుదేవరావుతో కలిసివుంది. కష్టాల్లో, సుఖాల్లో తోడుగా ఉంది. ఆమెను కూడా ఓ మాట అడుగుదాం" అన్నా.

"అక్కర్లేదు." అని సభ తీర్మానం చేసింది ఏకగ్రీవంగా.

నేను ఏకాకిని. నిశ్శబ్దంగా ప్రేక్షకుడిలా ఉండిపోయా చాలాసేపు.

చీకటిపడేవేళ మా ఆవిడ రమ్మంటే లోపలకు వెళ్ళా.

"పోయి సుల్తానాను చూడండి" అంది.

"ఏమైంది?"

"వెళ్ళి చూడండి" మా ఆవిడ గొంతులో కొంచెం బాధ కనిపించింది.

లోపల గదిలో సుల్తానా పడుకునుంది - తెల్లటి చీరలో.

నాలుగడుగులు ముందుకు వేశా. నా రాక గమనించి ఆమె లేచింది.

ఆ దృశ్యం నన్ను అవాక్కుని చేసింది. కాళ్ళు చేతులు ఆడలా! ఆమె ముఖాన బొట్టూ కాటుక లేవు. మెడలో సొమ్ములు లేవు. శిరోముండనంతో కొత్తగా ఉంది.

"ఏంటిది?" అన్నా నిగ్రహించుకోలేక.

సుల్తానా లేచి నన్ను చూసి చిన్నగా నవ్వింది. ఆ నవ్వులో అనేక భావాలు, అర్థాలు.

''ఆస్తంతా మొదటి భార్యకే చెందుతుందట'' అన్నా నిస్సహాయంగా, బాధగా.

''మీరెందుకు బాధపడతారు?'' అంది పర్వీన్ సుల్తానా.

''ఇన్నాళ్ళూ వాసుకి తోడుగా నీడగా నువ్వున్నావ్. వాడు నిన్ను ఈ ఇంటి ఇల్లాలుగానే చూశాడు. అలాంటిది వాడు పోగానే నువ్వు పరాయిదానివవుతావా?''

పర్వీన్ సుల్తానా నవ్వింది.

''ఆయన లేడు. ఆయన జ్ఞాపకాలే ఉన్నాయి. నన్ను మనిషిగా ప్రేమించాడు. ఆదరించాడు. అంతకన్నా నాకింకేం కావాలి. ఆస్తులు అనుబంధాన్ని గట్టిపరచలేవు.'' అని.

''ఇవిగో ఆస్తుల దస్తావేజులు, బ్యాంకు ఖాతా పుస్తకాలు. బంగారం, వెండి వస్తువులన్నీ అక్కడ మూటకట్టించా. వాళ్ళకు ఇచ్చేయండి'' అంది పర్వీన్ సుల్తానా. తలమీదనుంచి జారుతున్న తెల్ల చీరను సరిచేసుకుంటూ.

''అన్నీ వాళ్ళకిచ్చేస్తే నువ్వెలా బ్రతుకుతావ్?''

నా ప్రశ్నకు ఓ క్షణం తరువాత సమాధానం చెప్పింది. ''బృందావనంలో అనాధ స్త్రీలున్నారుగా వాళ్ళతో ఉంటా. లేదా కాశీలో గంగానది మెట్లమీద ఉంటా!''

''అంత ఖర్మ నీకెందుకు. ఆస్తిలో వాటా ఎట్లా రాదో చూస్తా. నిశ్చింతగా ఉండు'' అన్నా ఆ మనిషిలోని మానవత్వం నన్ను కదిలించివేస్తోంది. కళ్ళు తడుస్తున్నాయి..

''నా దేవుడే నాకు లేనప్పుడు ఈ పూజా సామాగ్రి అంతా దేనికి?'' గొణుగుతున్నట్లుగా అన్నది.

పన్నెండు రోజుల కర్మకాండ పూర్తయింది. పిండాల కోసం వచ్చిన కాకులు ఎగిరిపొయ్యాయి.

ఆ రాత్రి నిద్రపట్టలేదు. మనస్సంతా పర్వినా సుల్తానా చుట్టూ, ఆమె మాటల చుట్టూనే తిరుగుతోంది.

తెల్లారి లాయర్ని సంప్రదించి ఆమెకు ఆస్తిలో వాటా వచ్చేలా చూడాలని నిర్ణయించుకున్నా.

ఆరాత్రి సుల్తానాకు తోడుగా మా ఆవిడే పడుకుంది.

రాత్రి ఎప్పుడు నిద్రపట్టిందో తెల్లవారినట్లుగా వినబడుతున్న కోడికూతకు, కాకుల అరుపులకు మెళుకువ వచ్చింది.

''ఏమండీ.. సుల్తానా..'' మా ఆవిడ గొంతులో ఆందోళన గుర్తించాను.

పర్వీన్ సుల్తానా...?

కనబడలేదు.

లీలగా గంగాతీరంలో, బృందావనంలో ఎందరో అనాధ స్త్రీల మధ తిరుగుతున్న దృశ్యం నన్ను వివశుడిని చేసింది.

ఏం చెయ్యను - మనస్సులోనే ఆమె వక్తిత్వానికి నమస్కరించడం తప్ప.




# అమ్మ డైరీలో ఆఖరిపేజి

డాక్టర్. ఎమ్. సుగుణరావు

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ**

**ఆ ఊళ్ళో ముగ్గురు అమ్మలున్నారు.** ఒకరు కనకదుర్గమ్మ తల్లి, ఇంకొకరు కృష్ణమ్మ తల్లి, మూడో అమ్మ గుణదల కొండ శిఖరం మీద మేరీమాత. - ఇంతకీ ఆ ఊరిపేరు ఈపాటికి అర్థమై ఉంటుంది. అదే విజయవాడ.

అయితే నాలుగో అమ్మ ఉంది.

సత్యన్నారాయణపురం రైల్వేగేటు దాటి ముందు వీధిలోకి వెళితే ఒక వేపచెట్టు. దానిపక్కనే ఉసిరి చెట్టు. వాటిని ఆనుకుని రంగు వెలిసిన ఒక డాబా ఇల్లు కనిపిస్తాయి. ఆ డాబా, ముందో గేటు. గేటు తలుపు తెరవగానే తులసిచెట్టు దాని పక్కనే వాలు కుర్చీలో కూర్చున్న డెబ్బైయ్యేళ్ళ వృద్ధురాలు అన్నపూర్ణమ్మ. ఆమే నాలుగో అమ్మ.

బాగా పండిన జుట్టు. దబ్బపండు మేని ఛాయ. తను బూతద్దాల కళ్ళజోడులోంచి వచ్చే పోయేవారిని చూస్తోంది. రోడ్డు మీద ఎవరో అమ్మాయి పరికిణీ ఓణీలో జడనిండా పువ్వులు చెవులకు జూకాలు నుదుటిమీద పాపిడి బొట్టు, నడుముకు వడ్డాణం. గెంతుతూ వెళుతోంది.

అన్నపూర్ణమ్మకు ఆ అమ్మాయిని చూడగానే తనకు బాల్యం గుర్తొచ్చింది.

'తనకప్పుడు పదిహేనేళ్ళు. నాన్న స్కూలు టీచరు. ఆ పల్లెటూళ్ళో తమ ఇల్లు. కొబ్బరిచెట్లు, మామిడి చెట్లు ఇంకా పూలమొక్కల మధ్య పర్ణశాలలా ఆ ఇల్లు.

అన్నయ్యలకు పెళ్ళిళ్ళయినా అంతా కలిసే ఉండేవారు. నాన్నలా అన్నయ్యలూ స్కూలు టీచర్లే. తను ముగ్గురు అన్నలకు ముద్దుల చెల్లెలు. అన్నయ్యలు, వదినలు వాళ్ళపిల్లలు, రోజూ పదిహేను విస్తళ్ళు లేచేవి. పండగ వచ్చిందంటే ఇంకా బంధువులతో సందడే సందడి అన్నయ్యల పిల్లలు పెద్దవాళ్ళయి, పై చదువులకు పట్నం వెళ్ళేవరకూ తమ ఉమ్మడి కుటుంబం అవిచ్ఛన్నంగా సాగింది. వాళ్ళంతా వేరుపడినపుడు తను ఎంత ఏడ్చిందో. అయినా అన్నయ్యలు వారానికోసారి వస్తాములే తల్లీ అంటూ బుజ్జగించి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళినా పండగలకు, వేడుకులకు నోములకు అంతా కలిసేవారు. మరి ఇప్పుడో!?

ఇహంలోకి వచ్చిన అన్నపూర్ణమ్మ కళ్ళు తుడుచుకుంది. చుట్టూచూసింది.

ఒకవైపు గాడిపొయ్యిమీద గుండిగలో అన్నం ఉడుకుతోంది. మరో పొయ్యిమీద సాంబారు కాగుతోంది. ఇంకో పొయ్యిమీద నూనెలో బూరెలు దేవుతున్నారు. అరుగు పక్కనే, చాపవేసుకుని ఒక ఆడమనిషి పనసపట్టు తరుగుతోంది.

ఈ సందడికి కారణం అన్నపూర్ణమ్మగారి భర్త సంవత్సరీకం.

ముందు గదిలో కార్యక్రమం జరుపుతున్న పంతులుగారికి మంత్రాలు బిగ్గరగా వినిపిస్తున్నాయి. ఆవిడ ముగ్గురు కొడుకులు తెల్లధోవతీ కట్టుకుని పూజగదిలో కూర్చున్నారు. కాస్త ప్రశాంతంగా ఉన్న అన్నపూర్ణమ్మ మనసులో అలజడి మొదలయ్యింది. అది కొడుకుల గురించి. అది ఈనాటి బెంగకాదు. వారి పెళ్ళిళ్ళయిన రోజు నుంచే మొదలయ్యింది. దానికి కారణం తనే అనుకుంది.

భోజనం వేళ ఇంటికి ఎవరొచ్చినా వారికి తమతో పాటు వడ్డించడం, ఇంట్లో పనిమనిషికి బట్టలుతికే మనిషికీ, కడుపు నిండా భోజనం పెట్టి పంపడం యాచకులు ఎవరొచ్చి బిక్షాందేహి అన్నా వారిని ఒట్టి చేతులతో పంపకపోవడం, ఇవన్నీ పెళ్ళయినప్పటి నుంచీ అన్నపూర్ణమ్మకు అత్తగారి నుంచి వచ్చిన అలవాటు.

'శరీర పోషణకు తగినంత ఆహారం తీసుకుంటే మిగిలింది మరోజీవికి ఉపయోగపడుతుంది. ఆ జీవిలో ఉన్నది మనలో ఉన్నదీ పరమాత్మేకదా! అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం' అనేది అత్తగారు.

ఆ మాటలు ఆమెలో బలంగా నాటుకున్నాయి. అందుకే అందరూ భోజనం చేసిన తరువాత తనుతినేది తింటున్నా ఎప్పుడూ వీధివైపు చూసేది. ఎవరైనా 'అన్నంపెట్టు తల్లీ!' అంటారేమోనని.

అన్నపూర్ణమ్మ కోడళ్ళకు ఇది నచ్చలేదు. 'ఇది ఇల్లా లేక అన్నదానపు సత్రమా?' అంటూ కోడళ్ళు అవన్నీ ఆపేసారు. అన్నపూర్ణమ్మ మనస్సు చివుక్కుమంది. కొడుకులూ, తమ భార్యలకు వత్తాసు పలకడంతో గుండె రాయి చేసుకుని తన అలవాట్లు మార్చుకుని వారితో సమాధానపడింది. 'పోనీలే నాతోనే కదా గొడవ, ముగ్గురు కొడుకులు కలిసికట్టుగా ఉంటే చాలు' అనుకుంది – అయితే రోజులు గడిచే కొద్దీ కొడుకుల మధ్య చిన్న చిన్న స్పర్థలు.

'అందరం ఒకే చూరుకింద ఇరుకు గదుల్లో ఉండలేం, పిల్లలకు బజ్జీలు కాదు పిజ్జాలు కావాలి, ఒక టీవి ఎంతమందిమి చూస్తాం' – ఈ అభిప్రాయభేదాలతో ముగ్గురు కొడుకులు వేరు కాపురం పెట్టారు. కొడుకులంతా కలిసి ఉండాలని భర్త, తను కష్టపడి ఆ ఇల్లు కట్టారు. అందరికీ తలో పోర్షను ఇచ్చారు. భర్త లెక్చరరుగా ఉద్యోగం చేస్తూ ట్యూషన్లు చెప్పేవాడు. తనూ వేడినీళ్ళకు చన్నీళ్ళగా అప్పడాలు, పచ్చళ్ళు చేసి హోటళ్ళకు పంపేది. ఇంత కష్టపడడానికి కారణం కొడుకులంతా ఉమ్మడిగా ఒకే ఇంట్లో ఉండాలని తన చిన్నప్పటి వైభవం తేవాలని ఆశపడింది.

ఆమె ఆశ అడియాస అయింది. కొడుకులు వేరుపడి ఆమెకు అశాంతి మిగిల్చారు.

వేరుపడినా ముగ్గురూ కలిసుంటే చాలనుకున్నారు అన్నపూర్ణమ్మ, ఆమె భర్త పుండరీకాక్షుడు.

వేరు పడిన ముగ్గురు కొడుకులు మరింత దూరంగా అయిపోయారు. ఆ విషయాలలోను వారికి ఆందోళనే మిగిలింది.

ఒకే ఊళ్ళో ఉంటున్నా కొడుకులది ఎడమొఖం, పెడమొఖం. వాళ్ళు కారు కొన్నారనీ, వాళ్ళు ఫ్లాటు కొన్నారనీ వాళ్ళకు అత్తగారి నుంచి ఆస్తి కలిసొచ్చిందనీ, అలా ఒకరంటే ఒకరికి అసూయలు. అవి ముదిరి ముగ్గురు కొడుకులూ మూగనోము పట్టారు.

కొడుకుల వాలకం చూసి, కలత చెందిన పుండరీకాక్షుడు ముగ్గుర్నీ కలుపుదామని ప్రయత్నించి విఫలమై, ఒకరోజు రాత్రి బాధతో నిద్రలోకి జారుకుని, అలా శాశ్వత నిద్రకు లోనయ్యాడు. పెద్దాయన పోయిన తర్వాత నెలనెలా మాసికం రోజున ముగ్గురు కొడుకులు కలిసేవారు 'ఇక ఈరోజు సంవత్సరీకం, ఇక సంవత్సరానికి ఒక్కసారే కలుస్తారేమో.!'

ఆ అంతర్మధనంతో దిగాలుగా కూర్చుని ఉంది అన్నపూర్ణమ్మ.

ఆమెకు పెళ్ళయినప్పటి నుంచీ ఒక అలవాటు ఉండేది. అత్తగారింట్లో అడుగు పెట్టగానే ఒక్కసారిగా ఒంటరితనం ఆవరించింది. తండ్రిగారితో చెప్పుకుని ఏడ్చింది. ఆయన ఆమెకు ఒక డైరీ కొని తీసుకొచ్చి ఇచ్చాడు. 'అమ్మా ఇకనుంచీ నీ అత్తిల్లే నీ పుట్టిల్లు. నీ కష్టమూ, సుఖమూ, అంతా భర్తతోనే... నీ భర్తకు చెప్పుకోవడానికి ఇబ్బంది అనిపిస్తే ఇదిగో ఈ డైరీ నీకు నేస్తం.' అన్నాడు. అలా ఆమెకు డైరీ రాయడం అలవాటయ్యింది. ఏదైనా బాధ ఉంటే డైరీలో రాసేది. భర్త తిట్టినా, అత్తగారు కోప్పడినా, అలా యాభయ్యేళ్ళ క్రితం మొదలైన ఆ అలవాటు ఇంకా కొనసాగిస్తూనే ఉంది.

ఇప్పుడు ఈ వృద్ధాప్యంలో ఆమెకో కొత్త సమస్య. దాంతో పరిపరివిధాల ఆలోచనలు. చెప్పుకుందామనుకుంటే భర్తలేడు. ఇక పిల్లలు.. సమస్యవాళ్ళతోనే, అందుకే డైరీ రాయాలనుకుంది. చేతులు వణుకుతున్నాయి. పెన్ను పట్టుకుందామంటే చేతిలో ఉండటం లేదు. రెండు సార్లు ప్రయత్నించి విఫలమయ్యింది.

ఆలోచనల్లోంచి బైటకొచ్చి చుట్టూ చూసింది.

పూజ పూర్తయ్యింది. పెద్దకొడుకు భోజనం ప్లేటుతో బైటకొచ్చాడు. ప్లేటులో తండ్రిగారికి ఇష్టమైన మనక్కాయల సాంబారు కలిపిన అన్నం, పనసపొట్టు కూర, బూరెలు ఆ భోజనం ప్లేటు ప్రహరీ గోడ మీద ఉంచిన పెద్దకొడుకు ఆకాశం వంక చూసాడు.

ఆకాశం బోసిగా ఉంది. పక్షి సంచారం లేదు. కొడుకులు ముగ్గురూ ముభావంగా నిలబడ్డారు. ఉదయం నుంచీ వారి వాలకం అలాగే ఉంది. వారిని చూస్తున్న అన్నపూర్ణమ్మ మనసులో దిగులు మేఘం.

ఒకవైపు అతిధులకు వడ్డనలు సాగుతున్నాయి. పెద్దకొడుకు తల్లివంక చూసి – "అమ్మా భోజనం చెయ్యరాదూ, వేళదాటింది" అన్నాడు.

"ఆయన తిన్న తరువాత తింటానులే అంది" అన్నపూర్ణమ్మ ఆకాశం వంక చూసి.

"ఇంకెక్కడి నాన్న?! కాకి రూపంలో వచ్చి తింటాడనా? " విస్మయంగా తల్లి వంక చూసారు ముగ్గురు కొడుకులూ. అన్నపూర్ణమ్మ డైరీ తీసింది. చెయ్యి వణికింది. పెన్ను పట్టుకుంది. ముందుకు సాగడం లేదు. అయినా పట్టు వదల్లేదు. అక్షరం, అక్షరం కూడబలుక్కుంటూ రాస్తోంది. 'దేవుడా! ఈ ఇల్లు ఇలాగే కళకళలాడాలి, నా ముగ్గురు కొడుకులు కలిసే ఉండాలి. ఇపుడు సంవత్సరానికోసారి కలుస్తారు. తండ్రిగారి మాసికాలు అయిపోయాయి ఇక నెలనెలా వాళ్ళంతా కలవాలంటే ఏది దారి?'

రాస్తున్న అన్నపూర్ణమ్మ ఆలోచనలో పడింది. ఒక్కసారి బలంగా ఊపిరి పీల్చి వదిలింది. మళ్ళీ తను రాసిన అక్షరాలను ఒకసారి పరీక్షగా చూసింది. మళ్ళీ పెన్ను పట్టుకుంది. మెల్లగా రాయడం మొదలెట్టింది. 'నా కొడుకులు ముగ్గురూ కలవాలంటే నెలనెలా అంతా ఈ ఇంట్లో కొలువు తీరాలంటే నా మాసికం రావాలి. ఔను అదే జరగాలి. అప్పుడైనా కనీసం వచ్చి చేరతారు అందుకు నువ్వే దారిచూపాలి, నన్ను వెంటనే తీసుకు వెళ్ళిపో. '

అన్నపూర్ణమ్మ రాయడం పూర్తిచేసింది. గుండెల్లో ఆయాసం.

కావ్ కావ్ మంటూ వచ్చిన కాకి ప్రహరీ గోడమీది భోజనం ప్లేటు మీద వాలింది. అన్నపూర్ణమ్మ తృప్తిగా చూస్తూ ఉండిపోయింది.

అరగంట తరువాత మనవడు, మనవరాలు ఇద్దరూ వచ్చారు "నానమ్మా.. భోజనానికి పిలుస్తున్నారు" అంటూ గబగబా చెప్పి పరిగెత్తారు. అన్నపూర్ణమ్మ కదల్లేదు. పావుగంట తర్వాత పెద్దకొడుకు వచ్చాడు. "అమ్మా భోజనం వేళదాటింది.. పద.." అన్నాడు. ఆమె సమాధానం చెప్పలేదు. అనుమానం వచ్చిన ఆమె పెద్దకొడుకు తల్లిని తట్టిలేపాడు ఆమెలో చలనం లేదు. ఆమె శరీరం చల్లగా తగిలింది. దేవుడు, ఆమె మొర ఆలకించాడు.!!



కథా కౌముది

# రాగింగ్ ఆర్.శర్మ దంతుర్తి

మేజర్ జనరల్ డాక్టర్ జగదీష్ సింగ్ ఎ.వి.ఎస్.ఎం, పి.వి.ఎస్.ఎం (రిటైర్డ్), అహల్యా బాయ్ హోల్కార్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరో సర్జరీ, ప్రిన్సిపాల్ అండ్ డిపార్ట్ మెంట్ హెడ్, న్యూరాలజీ, మహాత్మా గాంధీ మెడికల్ కాలేజ్, ఇండోర్. బోర్డ్ మీద చాంతాడంత పేరు లోపల కూర్చున్నాయన ఎవరో చెప్పకనే చెప్తోంది. బయటనున్న ప్యూన్ అటెన్షన్ లో తెల్లటి బట్టల్లో ఒద్దికగా నుంచుని ఉన్నాడు. రామ్మోహన్ నడుకుంటూ వెళ్ళి ప్యూన్ ని అడిగేడు, "సార్ ఉన్నారా?" ప్యూన్ తలాడించి చెప్పేడు హిందీలో, "బైఠియే. దస్ మినిట్ మైన్ సాబ్ దేఖేంగే".

చుట్టూరా అదో రకమైన హుందా నిశ్శబ్దం. మళ్ళీ నేం బోర్డ్ కేసి చూశాడు రామ్మోహన్. ఆర్మీలో రిటైరై వచ్చిన బెంగాల్ టైగర్ ఈయన. దేశాధ్యక్షుడి చేతిమీదుగా అతి విషిష్ట సేవా మెడల్, పరమ విషిష్ట సేవా మెడల్ అందుకున్న మేజర్ జనరల్. ఆషామాషీగా ఏదో ప్రమోషన్లు సంపాదించిన వాడుకాదు. యుద్ధం లో క్షతగాత్రులకి ఎక్కడ గాయపడితే అక్కడ టెంట్ వేసి, పక్కనే బాంబులు పడుతూంటే జయప్రదంగా న్యూరో సర్జరీ చేసి తలలో దిగిన గాజు ముక్కల్నీ బాంబులనీ తీసి ఆర్మీ జవాన్లని రక్షించిన జగదీష్ సింగ్.

“తననెందుకు పిలిచారో? ఈ మధ్యన చేసిన ర్యాగింగ్ వల్ల కాదు కదా? ర్యాగింగ్ చెయ్యకూడదనీ చేస్తే చర్య తీసుకోబడుతుందనీ చెప్పేరు నిజమే కానీ అందరూ చేస్తున్నారు కదా? కొంప తీసి తనని న్యూరాలజీ ప్రశ్నలు వేయదు కదా? ఇప్పుదు మూడో సంవత్సరంలో ఉన్న తనకి న్యూరాలజీ లో సమాధానాలు తెలియకపోతే తాట వలుస్తాడా? కాళ్ళు వణుకుతున్నాయ్, గుండె పీచుమంటోంది. ర్యాగింగ్ గురించి అయితే... “ కుదురుగా ఆలోచించలేకపోతున్నాడు రామ్మోహన్.

క్రితం వారం జరిగిన సంగతులు గుర్తొచ్చాయ్ రామ్మోహన్ కి. సైకిల్ మీద వెళ్ళే ఒక మరాఠీ అమ్మాయిని ఆపి ఏడిపించారు తనూ ఇంకో ఇద్దరు క్లాస్ మేట్సూ కల్సి. సరదాగానే అయినా ఆ అమ్మాయి మెడికల్ కాలేజీ స్టూడెంట్ కాదు కనక ఆవిడ రిపోర్ట్ చేసి ఉండక పోవచ్చు. రెండోదే కాస్త అనుమానించాల్సిన విషయం. హాస్టల్లో ఓ జూనియర్ కుర్రాణ్ణి బట్టలూడదీసి పరుగెట్టించారు చెడ్డీతో. ఇండోర్ చలిలో వణికేడు కుర్రాడు. వాడు ఏడుస్తూంటే ఇంకా ఏడిపించారు తాము. రెండ్రోజులు పోయేక వాడు రెండో హాస్టల్ అంతస్తు లోంచి దూకేసాడు కిందికి – ఆత్మహత్య అన్నారు; కాని బతికి బయటపడ్డాడు. అదృష్టం కొద్దీ ఎందుకు ఇలా చేసాడో కాయితం మీద రాయలేదు. అయినా ఇందులో తానొక్కడే కాదే తప్పు పట్టాల్సింది.

ఇక్కడే ఇలా డీలా పడిపోతే ఇంకా లోపల ఏమౌతుందో. తనని ఎవడూ ఏం చేయలేడు. తన మీద ఈగ వాలితే మావయ్యతో చెప్తే ఆయనే చూసుకుంటాడు.

తల విదిల్చి ఒక్కసారి లేచాడు రామ్మోహన్. ప్యూన్ ఓ సారి "ఏమిటి?" అన్నట్టూచూసి మళ్ళీ తన పనిలో పడిపోయేడు. రూములో లోపల ఎవరైనా ఉన్నారేమో. అయినా సౌండ్ ప్రూఫ్ గదిలోంచి ఏమీ తెలియదు బయటకి. మళ్ళీ కూర్చున్నాడు రామ్మోహన్. ఇంకో పావుగంట గడిచేక తలుపు తెరుచుకుంది. సైకాలజీ ప్రొఫెసర్ శ్రీవాత్సవ బయటకొచ్చేడు. రామ్మోహన్ ఆయన్ని విష్ చేసాడు కానీ శ్రీవాస్తవ ఇటువైపు చూసినట్టు లేదు. ఆయన అటు వెళ్ళగానే బయటనున్న లైట్ వెలిగింది. ప్యూన్ లోపలకి వెళ్ళొచ్చి తలపంకించాడు రామ్మోహన్ కేసి తిరిగి – నువ్వు లోపలకి వెళ్ళొచ్చన్నట్టుగా.

చేతిలోచెమట్లు తుడుచుకుని లోపలకెళ్ళేడు రామ్మోహన్. పెద్ద గదిలో ఆ చివర్న కిటికీ దగ్గిర జూలు విదిల్చిన సింహంలా ఉన్నాడు ప్రిన్సిపాల్– నీట్ గా పెద్ద తలపాగా, ఆరడుగుల విగ్రహం, యాభై ఏళ్ళు వచ్చినా ఒంగని నడుమూ, తెల్లటి షర్టూ, టై అదీ మాంఛి హుందాగా ఉన్నాడు జగదీష్ సింగ్.

అడుగుల చప్పుడు విని ఇటు తిరిగేడు ప్రిన్సిపాల్. కొట్టొచ్చినట్టు కనపడే బెంచ్ ప్రెస్ చేసిన చెస్టూ, రోజూ ఆర్మీలో చేయించిన వ్యాయామం వల్ల ముడతలు లేని దేహం, ఏదో బాక్సర్ లా ఉన్నాడు కానీ ఈయన్ని కాలేజ్ బయట చూస్తే న్యూరో సర్జన్ అనుకోవడం కష్టం.

"రండి కూర్చోండి," ఆహ్వానించేడు ప్రిన్సిపాల్.

ఆయన ఎదురుగా కూర్చున్నాక "ఏ వూరు మీది?" అడిగేడు.

"ఖమ్మం దగ్గిర పల్లెటూరు." గొంతు ఇంకా వణుకుతోంది.

"ఆ, హైదరాబాద్ లో పనిచేసినప్పుడు చూసాను." కూర్చుని ఎదురుగా ఉన్న ఫైల్ తెరిచాడు, "ఇందులో మీకొచ్చిన మార్కులూ మీ ప్రోగ్రెస్ కార్డూ ఉన్నాయి. మీతో మాట్లాడవల్సిన పనుండి పిల్చాను. నాకు రోజూ పొద్దున్న హాస్పిటల్లో సర్జరీలు ఉంటాయ్. అంచేత ఇలా మధ్యాహ్నం పిల్చేను. కుదురుగా కూర్చున్నారంటే ఓ గంటలో వెళ్ళిపోదురుగానీ."

"కుదురుగా కూర్చున్నారంటే" అన్నాడా? గుండె గుభేల్ మంది రామ్మోహన్ కి.

"మీ ఎకాడెమిక్ రికార్డ్ మూడో సంవత్సరం దాకా ఏవరేజ్ గా ఉంది. డిగ్రీ వచ్చాక రోడ్డు మీద షాపు తెరిచి వైద్యం చేయడానికి సరిపోతుంది. అలా కన్సల్టేషన్ ఫీజులతో గడుపుతారా లేకపోతే ఎం. ఎస్ చదవాలని ఉందా?"

"ఇంకా ఏమీ అనుకోలేదండి." కంఠంలో వణుకు.

"సరే అసలు ఎం. ఎస్ చదువుతారనుకుందాం ప్రస్తుతానికి. మానవ దేహంలో థర్డ్ వెంట్రికిల్ ఎక్కడుందో చెప్పగలరా?"

రామ్మోహన్ కి వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది. అవతలు కూర్చున్నది చేయి తిరిగిన న్యూరోసర్జన్. సమాధానం సరిగ్గా చెప్పకపోతే ఏం జరుగుతుందో? హార్ట్ లో ఉండేవి లెఫ్ట్ వెంట్రికిల్, రైట్ వెంట్రికిల్ అని గైటన్ పుస్తకంలో చదువుకున్నది తెలుసు. థర్డ్ వెంట్రికిల్? వెంట్రికిల్ అంటే బహుశః హార్ట్ లోనే అయి ఉండొచ్చు. "హార్ట్ లోనండి." చెప్పేడు రామ్మోహన్.

"సరే, మరి పాటేల్లా అంటే?" ఈయన అప్పుడే వదిలేలా లేడురా భగవంతుడా అనుకున్నాడు రామ్మోహన్.

"నోటిలో ఉండే సాఫ్ట్ టిష్యూ"

"మీకు మోకాలికీ బోడిగుండుకీ సంబంధం తెలీనట్టుందే? నేనడిగింది పాటెల్లా, పాలేట్ కాదు."

తలవంచుకున్నాడు రామ్మోహన్.

"సరే, స్టెర్నో క్లియో మాస్టాయిడ్ ఎక్కడుంది?"

హమ్మయ్య ఇది కాస్త సులభంగా ఉంది, స్టెర్నం అంటే కడుపు పైనే కదా?. "కడుపులోనండి," మొహం విప్పారించుకుని చెప్పేడు రామ్మోహన్.

జగదీష్ సింగ్ మొహం ఎర్రబడడం గమనించేడు రామ్మోహన్. ఫైల్ మూసేసి ప్యూన్ ని పిలుస్తున్నట్టూ బెల్లు కొట్టేడు. ప్యూన్ లోపలికొచ్చేక చెప్పేడు, "ఈ ఫైల్ కేబినెట్లో పెట్టి, నాకో కప్పు టీ, ఒక గ్లాసూ, ఈ జార్ నిండా మంచినీళ్ళు తీసుకురండి." ప్యూన్ అయినా సరే "రండి" అనడంలో మేజర్ చూపించిన మర్యాదా అదీ చూసి రామ్మోహన్ తల వంచుకున్నాడు మళ్ళీ.

ప్యూన్ బయటకెళ్ళేదాకా ఆగి తలుపు లాక్ పడ్డాక చెప్పేడు ప్రిన్సిపాల్. "నేను జలంధర్ మెడికల్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఓ సారి సరదాగా కుర్రాళ్ళని ర్యాగింగ్ చేసాం. "అందులో ఓ సారి ఏమైందంటే," చెప్పడం మొదలు పెట్టేడు మేజర్ "శవాల గదిలోకి అర్ధరాత్రి వెళ్ళి ఆఖరి శవం నోట్లో నీళ్ళు పోసి రావాలి. ధైర్యం ఉన్నవాళ్ళు ముందుకి రండోయ్ అని చాటింపు వేశాం. ఎవరూ రాలేదు ఫస్ట్ ఇయర్ కుర్రాళ్ళు కదా ఇంకా శవం అంటే భయమే. సరే ఇది ఫస్ట్ ఇయర్ కుర్రాళ్ల వల్ల అయ్యేది కాదని మాలో మేమే వేసుకున్నాం పందెం. అప్పుడు నేను రెండో సంవత్సరం చదువుతూ ఉండేవాణ్ణి. ఆర్మీలో ఉంటూనే చదువుకోవడం చేత ఈ మెడికల్ కాలేజ్ చదువు ఆర్మీ పెట్టిన భిక్షే. ఓ పక్క ఆర్మీ ఉద్యోగం, ఓ పక్కన మెడికల్ కాలేజ్; రెండూ బిజీ జీవితం అయినా మాంఛి సరదాగా ఉండేది. మూడో సంవత్సరం కుర్రాడొకడొచ్చాడు పందెం కాయడానికి. అప్పట్లో వందరూపాయల పందెం. వంకాయలు కేజి రూపాయకిచ్చే రోజులవి. వందరూపాయలంటే అప్పుడు ఎక్కువే. మార్చురీ ప్యూన్ కీ అక్కడ లేబ్ లో పనిచేసే వాళ్లకీ లంచాలిచ్చి ఓ రాత్రికి తాళాలు సంపాదించి ముగ్గురు బయల్దేరాం ఈ పందెం కోసం. నీళ్ళు పోసేవాణ్ణి లోపలకి పంపించి మిగతా ఇద్దరూ బయట నుంచున్నారు. శవాల గదిలో లోపల మూలనెక్కడో చిన్న బల్బు వెలుగుతోంది. దాదాపు అంతా చీకటి. గదినిండా శవాలు. ఆ హాలులో దాదాపు రెండొందల శవాలదాకా ఉన్నాయ్. చివరి టేబిల్ మీద శవం దగ్గిరకెళ్ళి నోట్లో నీళ్ళు పోసాడు ఇతను. మెల్లిగా కదిలి వస్తూంటే ఎక్కడో చిన్న భయం. దాదాపు తలుపు దగ్గిరకి వచ్చేసరికి తలుపు దగ్గిరే ఉన్న మొదటి టేబిల్ మీద శవం లేచి కూర్చుని "మరి నాకో?" అంది. అంతే! ధన్ మని చప్పుడు. పందెం కాసిన కుర్రాడు స్పృహ తప్పి పడిపోయేడు. మావాడే ఓ కుర్రాడు అలా టేబుల్ మీద పడుకుని సరదాగా ఏడిపించేడు. " చెప్పడం ఆపేడు ప్రిన్సిపాల్.

రామ్మోహన్ కళ్ళు తిరిగేయి. ఈ లోపుల ప్యూన్ వచ్చి టీ, మంచి నీళ్ళు పెట్టేడు టేబిల్ మీద.

"మీరు బయట నుంచుని తలుపు వేయండి. నేను చెప్పేదాకా ఎవర్నీ లోపలకి రానివ్వొద్దు." చెప్పేడు జగదీష్ సింగ్, ప్యూన్ తోటి.

ప్యూన్ నిష్క్రమించేక మళ్ళీచెప్పడం మొదలు పెట్టేడు ప్రిన్సిపాల్, " ... స్పృహ తప్పిపడిపోయిన చప్పుడు విని మిగతావాళ్లు లోపలకి పరుగెట్టుకుంటూ వచ్చారు. ఉపచారాలు చేసాక తేరుకున్నాడు కుర్రాడు. కానీ ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడూ అలా చేయలేదు మేము. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే ర్యాగింగ్ అనేది మరీ దారుణం అయితే ఉత్తరోత్తరా ఎటువంటి సైకాలాజికల్ సమస్యలు వస్తాయో అనేది మనసులో పెట్టుకోవాలి. ఇప్పుడు చెప్పండి మీరూ, మీ గేంగ్ ఆ ఫస్ట్ ఇయర్ కుర్రాణ్ణి ఎందుకలా చలిలో పరుగెట్టించారు?

ఎక్కడో మొదలెట్టి, సడన్ గా మీద పడిన దెబ్బకి ఒక్కసారి కుదేలై నిస్సహాయంగా చూసాడు రామ్మోహన్.

సమాధానం రాకపోవడం చూసి మళ్ళీ అడిగేడు మేజర్ "మరో సారి అడగక్కర్లేదనే అనుకుంటున్నాను, పదిహేడేళ్ళ కుర్రాణ్ణి చలిలో ఎందుకలా పరుగెట్టించారు? ఏమిటా పైశాచికానందం?" ఈ సారి మేజర్ గళం కరుగ్గా ఉంది.

"ఏదో సరదాకి అనుకున్నాం కానీ అతను ఇలా రెండో అంతస్తులోంచి దూకేస్తాడనుకోలేదు. నేనొక్కణ్ణే కాదండి ఇది చేసినది...."

"రామ్మోహన్," అరిచాడు జనరల్, "ఇలా రండి" అంటూ కిటికీ దగ్గిరకి దారితీశాడు. తెర పక్కకి తప్పించి చెప్పేడు, "చూడండి, మీరు అతన్ని ర్యాగింగ్ చేస్తున్నప్పుడు నేను ఇక్కడ్నుంది ప్రత్యక్షంగా చూసాను. ఎవరు ఆ కుర్రాణ్ణి ఏడిపించారో నాకు తెలుసు." కిటికీలోంచి తాము కుర్రాణ్ణి ర్యాగింగ్ చేసిన ప్రదేశం స్పష్టంగా కనిపిస్తోంది.

గొంతు తడి ఆరిపోయింది రామ్మోహన్ కి. మొహం నల్లగా మాడింది. "వెళ్ళి కూర్చోండి," చెప్పేడు ప్రొఫెసర్. కూరున్నాక వెనక గా వచ్చి నుంచుని చెప్పేడు, "మీ గురించి నేను ఆంధ్రాలో వాకబు చేసాను. మీ తమ్ముడు కూడా ఇంజినీరింగ్ లో ఇలాగే ర్యాగింగ్ చేసాడనీ అతనికి సస్పెన్షన్ ఇచ్చారనీ తెల్సింది. ఈ దరిద్రం మీ జీన్స్ లోనే ఉన్నట్టుందే? రెండో అంతస్తులోంచి దూకేసిన కుర్రాడు ఎలా ఉన్నాడో ఇప్పుడు మీకు తెలుసా?"

మౌనం. చేతులూ, వేళ్ళూ వణకడం కనిపిస్తోంది. చేసిన తప్పుకి పశ్చాత్తాపం కన్నా ఇప్పుడు ఈయన ఏం చేస్తాడో అనే భయమే ఎక్కువగా ఉంది.

న్యూరోసర్జన్ ప్రిన్సిపాల్ చెప్పడం కంటిన్యూ చేసాడు, "ఈ రోజు పొద్దున్న నన్ను పిల్చారు హాస్పిటల్లో ఆ కుర్రాణ్ణి చూడమని. తల్లీ తండ్రీ పక్కనే కూర్చుని గుండెలు పిండేసేలా ఏడుస్తున్నారు. తలకి బలమైన దెబ్బ తగిలింది. అదృష్టవసాత్తూ ప్రాణానికి ఏమీ ఢోకా లేదు కానీ ఉత్తరోత్తరా ఎంతటి చిత్రవధ అనుభవించాలో భగవంతుడికెరుక. మీముందు నన్ను కల్సుకున్న ప్రొఫెసర్ శ్రీవాస్తవ గారు చూస్తారు దాని సంగతి. ఇప్పుడు చెప్పండి, ఒక జీవితాన్ని అలా దాదాపు నాశనం చేయబోయిన మీరు బతికి ఉండడం వల్ల ఏం ప్రయోజనం?"

సమాధానం లేదు. చొక్కాలోపల చెమట్లు పట్టడం తెలుస్తోంది రామ్మోహన్ కి.

"అదలా ఉంచితే మీరు ఏడిపించిన అమ్మాయ్ ఎవరో తెలుసా?"

"సారీ సర్"

"సారీ? వాట్ ఎ బుల్! ఆ అమ్మాయి ఆర్థోపేడిక్స్ ప్రొఫెసర్ దేశ్ ముఖ్ గారి చుట్టాలమ్మాయి. ఓ సారి చూసి పోదామని ఇండోర్ వచ్చింది బాంబే నుంచి. ఇదీ మీరు చేసిన నిర్వాకం."

"మళ్ళీ ఎప్పుడు ఇలా జరగదండి. ఐ యాం వెరీ సారీ."

ఆర్మీ జెనరల్ రామ్మోహన్ కూర్చున్న కుర్చీ దగ్గిరకి వెనకనుంచి వచ్చి అతని చెవి వెనకనుంచి మెడమీదకీ, కాలర్ బోన్ మీదుగా అలా ముందుకి హార్ట్ దాకా చూపుడివేలితో రాస్తూ అన్నాడు "స్టెర్నో క్లియో మాస్టాయిడ్. ఇప్పుడర్థం అయిందా అది ఎక్కడుందో?" అలా అంటూ తన బలమైన చేతిని రామ్మోహన్ మెడమీద ఉంచి ఒక్క తిప్పు తిప్పేడు. కలుక్కు మని చప్పుడు. రామ్మోహన్ మెడ ఒక్కసారిగా మొరాయించింది ఏ వేపు తిరగడానికైనా. అక్కడ్నుండి ముందుకొచ్చి మోకాలి చిప్పమీద చేయి వేస్తూ "పాటెల్లా" అన్నాడు. ఏం జరగబోతోందో తెలిసే లోపుల రామ్మోహన్ "అమ్మా" అనడం నించోడానికి ప్రయత్నం చేస్తే మోకాలు వాచి ఉండడం తెలిసింది. జనరల్ మొహం కోపం తో జేవురించి ఉంది. రామ్మోహన్ జుట్టు పట్టుకుని నుంచోపెట్టి ఒక్కసారి గుంజాడు ప్రిన్సిపాల్. ప్రాణం పోయినట్టూ నెప్పి.

ఏమీ జరగనట్టూ ఆర్మీ జనరల్ రామ్మోహన్ ని అలా వదిలేసి అన్నాడు. "మీరెంత అరిచినా ఈ సౌండ్ ప్రూఫ్ గదిలో ఎవరికీ తెలియదు. పెయిన్ ఎలా ఉంటుందో తెల్సిందా? లేకపోతే ఇంకోసారి చూపించమంటారా?"

"...."

“మెడికల్ డిగ్రీ అవగానే తీసుకునే ప్రమాణంలో ‘నేనెప్పుడూ ప్రాణాలు కాపాడతాను’ అని చెప్పాల్సి ఉంటుంది. ఆ కుర్రాడు కనక చనిపోయి ఉంటే రాగింగ్ చేసిన మీ అందర్నీ ఈ కాలేజ్ గేట్ దగ్గిర శిలువ వేసి ఉండేవాణ్ణి నేను. మెడికల్ కాలేజ్ లో చదువుతూ ఇంత

అమానుషంగా ఎలా ప్రవర్తిస్తున్నారు? మీరు మనుషులేనా? ఏళ్ళు రావడం ఒక్కటే కాదు జ్ఞానం కూడా పెరుగుతూ ఉండాలి. శారీరకంగా ఇంకో కుర్రాణ్ణి హింసిస్తే ఏమిటి మీకొచ్చే ఆనందం?"

నెప్పితో వికవికలాడుతున్న రామ్మోహన్ వెనకగా వచ్చి తలమీద చేయి వేసి వెనక నుంచి ముందుకి చూపుడు వేలుతో రాస్తూ చెప్పేడు ప్రిన్సిపాల్, "థర్డ్ వెంట్రికిల్ ఉండేది ఇందులో, ఒక్క చిన్న కరాటే దెబ్బతో ఇది కూడా చూపించగలను. చూసారా ఈ చేతులు? ఈ వేళ్ళతో అతి క్లిష్టమైన న్యూరోసర్జరీలు వందలకొద్దీ చేసాను ఇప్పటిదాకా. ట్యూమర్ల దగ్గిర్నుంచి క్లాట్ లు తీసేసి స్ట్రోక్ పేషంట్స్ ని రక్షించడం దాకా. ట్యూమర్ తీసేటప్పుడు పక్కనే ఉన్న బ్రెయిన్ టిష్యూ పాడవకుండా అతి లాఘవంగా చేయగలను నేను; ఎందుకంటే నేనే కనక సర్జరీలో చిన్న తప్పుచేస్తే పేషేంట్ జీవితాంతం అనుభవించాలి ఏదో సైడ్ ఎఫెక్ట్ తో. నేను ఆర్మీ జవాన్లకి సర్జరీ చేస్తూ ప్రాణాలు కాపాడినవాడిని. ఎవరి ప్రాణం తీసినవాణ్ణి కాదు, మెడికల్ కాలేజ్ లో ఎన్ని శవాలు కోసినా సరే. మిమ్మల్ని కొట్టిన దెబ్బలు ఎలాంటివో నాకు తెల్సు. ఆరు నెలలు కుంటుతారు. మెడ మెల్లిగా రెండు మూడు నెలల్లో సర్దుకుంటుంది. మళ్ళీ ఇంకోసారి ఇలా జరిగితే ఏమౌతుందో చెప్పక్కర్లేదనుకుంటా."

రామ్మోహన్ లేవబోయేడు కుర్చీలోంచి. "సిట్ డౌన్" సింహంలాగా అరిచేడు జనరల్.

"ఇప్పుడు ప్యూన్ వస్తాడు లోపలకి నేను పిలిచేకా. మీ స్నేహితుణ్ణి పిలవమని చెప్తాను మిమ్మల్ని కూడా నడిపించడానికి. ఈ దెబ్బలు ఎందుకు తగిలాయో గుర్తుంచుకోండి. లేకపోతే గుర్తు చేయడానికి ఇక్కడున్నది మేజర్ జనరల్ జగదీష్ సింగ్," చేతుల మడమలు బెల్ట్ మీద రెండు వైపులా పెట్టుకుని చెప్పేడు.

రామ్మోహన్ పరిస్థితి తెలిసిందే, మెడమీద మణుగుల బరువు పెట్టినట్టూ నెప్పి. మోకాలు లాగేస్తోంది. కాలు అధీనంలో లేదు. ఈ నరకం ఆరు నెలలా? మై గాడ్. చలిలో పరుగెట్టిన కుర్రాడు ఇంత చిత్రవధ అనుభవించాడా?

రెండు క్షణాలు రామ్మోహన్ కేసి చూసి అన్నాడు ప్రిన్సిపాల్ మళ్ళీ, "మహాత్మా గాంధీ హాస్పిటల్ కి వెళ్ళండి. నెప్పికి మందులు ఇచ్చి రెండు వారాలు రెస్ట్ కావాలని రాస్తారు,. ఆ రెండు వారాలూ రాగింగ్ చేసినందుకు మీకు సస్పెన్షన్ అని రాస్తాను మీ ఫైల్ లో. దెబ్బలు ఎలా తగిలాయి అని హాస్పిటల్ లో అడిగితే ఏం చెప్పాలో తెలుసా?"

"---"

"వెళ్లండి. కాలేజ్ లోంచి పూర్తిగా బార్ చేసి రోడ్డు మీద నించోపెట్టనందుకు సంతోషించండి." బెల్ నొక్కాడు ప్యూన్ కోసం మేజర్.

ప్యూన్ లోపలకొచ్చాక, "ఈయన వంట్లో బాగోలేదంటున్నారు, బయటకి తీసుకెళ్ళి వాళ్ల స్నేహితుడికి కబురు పంపించండి. ఆ స్నేహితుడు వచ్చేదాకా లాబీలో కూర్చోనివ్వండి. నాతో మాట్లాడే తర్వాత పార్టీను లోపలకి పంపించండి." అని చెప్పి రామ్మోహన్ కేసి తిరిగి అన్నాడు, "ఏమైంది మీకు? ఇప్పటి దాకా బాగానే ఉన్నారుగా?"

ఒక కాలి మీద నుంచుని వణుకుతూ చెప్పేడు రామ్మోహన్, ప్యూన్ కి వినపడేటట్టూ, "పొద్దున్న హాస్టల్ మెట్ల మీదనుండి జారి పడ్డానండి. మెడ మీదా, మోకాలి మీదా దెబ్బలు తగిలాయి. పొద్దున్న బానే ఉంది కానీ ఇప్పుడు వాచినట్టుంది. కొంచెం కళ్ళు తిరుగున్నాయి"

"ఓ అలాగా, సరే హాస్పిటల్ కి వెళ్ళండి. మందో మాకో కావలిస్తే వాళ్ళు చూస్తారు." నవ్వుతూ చెప్పేడు మేజర్ జనరల్ జగదీష్ సింగ్, ఎ. వి. ఎస్. ఎం, పి.వి.ఎస్. ఎం, అహల్య బాయ్ హోల్కార్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరో సర్జరీ.

(ఇది పూర్తిగా కల్పితం. ఎవర్నీ ఉద్దేశించి రాసినది కాదు. రాగింగ్ చేసిన వాళ్ళని శిక్షించడానికి ఏం పద్ధతులు వాడతారో అందరికీ తెల్సిందే. దాన్ని ఇంగ్లీష్ లో "స్లాప్ ఆన్ ద రిస్ట్" అనవచ్చేమో. అందుకే ఆ రాగింగ్ అనేది అప్రతిహతంగా అలా సాగిపోతూనే ఉంది. అయితే మన ఆంధ్రాలో ఉన్నంత "అతి" మిగతా రాష్ట్రాలలో లేదు – నా ప్రత్యక్షానుభవంతో చూసి చెప్తున్నాను. చాలామంది ఈ "అతి" రాగింగ్ వల్ల దాదాపు ఏళ్ళ తరబడి సైకాలాజికల్ నరకం అనుభవిస్తూ ఉంటారు. న్యూస్ లో ఈ ర్యాగింగ్ వల్ల పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడానికి

ప్రయత్నించడం అనేది అతి మామూలుగా రోజూ చూసే విషయం లాగా అయిపోయింది. ఇందులో ఇంకో తిరకాసు ఏమిటంటే రాగింగ్ ఉండాలి అనే పెద్ద మనుషులూ ఉన్నారు. వాళ్ళు అనడం ప్రకారం "రాగింగ్ మేక్స్ మెన్ ఔట్ ఆఫ్ బాయిస్." ఎంత హేయమైన ఆలోచనో. ఇకపోతే రిటైర్ అయిన మేజర్ కనక మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ అయి ఉంటే ఎలా ఉంటుందో ఆర్మీ రూల్ ప్రకారం ఏం చేసి ఉంటాడో అనే ఊహతో ఈ కధ అల్లాను. ఆర్మీలో కానీ బయటకానీ నిజానికి ఇలా ఎవరూ చేయ(లే)రని అనుకుంటున్నాను.)




# న్యాయం

## తిరుమలశ్రీ

ఫ్యామిలీ సమ్మర్ వెకేషన్స్ కు నేటివ్ ప్లేస్ కు వెళ్ళడంతో ఒంటరిగా ఉన్న జగన్ హోటల్లో డిన్నర్ చేసి వచ్చి టీవీ ముందు కూర్చున్నాడు. 'బ్రేకింగ్ న్యూస్ అంశం ఒకటి విశేషంగా ఆకర్షించుకుంది అతన్ని– 'ఓ రేప్ కేస్ లో అరెస్టయి వారం క్రితం బెయిల్లో బైటకు వచ్చిన నిందితుడు భీమారావ్ ఆ రోజు బీచ్ రోడ్ లో ఓ ట్రక్ యాక్సిడెంట్ లో మరణించాడు!...భీమిలి నివాసి ఐన భీమారావ్ ఓ రాజకీయ పార్టీకి చెందిన ఓ ఛోటా లీడర్. నెల క్రితం ఓ రాత్రి వేళ బీచ్ రోడ్ లోని బస్ స్టాప్ లో ఒంటరిగా సిటీ బస్ కోసం వెయిట్ చేస్తున్న ఓ యువతిని బలవంతంగా ఎత్తుకుపోయి రేప్ చేసి చంపేసాడన్నది అతగాడి పైన అభియోగం. తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి బెయిల్ సంపాదించుకున్నాడు. ఆరోజు మధ్యాహ్నం అతను బీచ్ దగ్గర స్పీడింగ్ లారీ గ్రుద్దివేయడంతో చనిపోయాడన్నది పోలీసుల కథనం...'

ఆ సందర్భంగా న్యూస్ రిపోర్టర్ చెబుతున్న విషయాలు అసక్తిగా ఆలకించాడు జగన్.

'...గత ఆరు నెలలలో విశాఖపట్టణంలో ఐదు రేప్ లు జరిగాయి. వాటిలో ముగ్గురు విక్టిమ్స్ చంపబడ్డారు. ఇద్దరు ట్రౌమాతో హాస్పిటల్ పాలయ్యారు. ఆయా కేసులలోని నిందితులందరూ అరెస్టయినా బెయిల్లో బైటకు రావడం జరిగింది. ఐతే బైటకు వచ్చిన కొద్ది రోజులకే వారంతా వివిధ ప్రమాదాలలో మరణించడం విశేషం! ఒకరు సముద్రంలో ఈతకు వెళ్ళి మునిగిపోతే, మరొకరు మూడంతస్థుల భవనం పైనుండి ప్రమాద వశాత్తూ క్రింద పడి చనిపోవడం జరిగింది. ఇంకొకరు ఇంటి పెరట్లో పాము కాటుతో చనిపోతే, మరో నిందితుడు రైలు పట్టాలు దాటుతూ రైలు గ్రుద్దుకుని అసువులుబాసాడు. ఇప్పుడు ఐదో వ్యక్తి రోడ్ ప్రమాదంలో పోయాడు...

'అందరూ రేప్ అండ్ మర్డర్ కేసులో నిందితులే కావడం గమనార్హం. సమాజంలో కొద్దో గొప్పో పలుకుబడి కలవారే. బెయిల్లో బైటపడ్డ కొద్ది రోజులకే ప్రమాదాల పాలౌతున్నారు. ఆ యాదృచ్ఛికత పలు అనుమానాలకు దారితీస్తూ ఉన్నా, వారి మరణాలలో ఫౌల్ ప్లే కి అవకాశం లేదని పోలీసులు తేల్చిచెబుతున్నా రు...'

2

టీవీలో పోలీస్ కమీషనర్ ఇంటర్వ్యూను సాలోచనగా వాచ్ చేస్తున్న జగన్ వద్దకు సుడిగాలిలా దూసుకువచ్చాడు గురు.

"రేపిస్ట్ భీమారావ్ రోడ్ ప్రమాదంలో మరణించాడు తెలుసా?" అనడిగాడు.

జగన్ తలూపి, "ఆశ్చర్యంగానే ఉంది. రేపిస్టులంతా ప్రమాదాలలో మరణించడం...అదీ బెయిల్లో బైటకు రాగానే...ఇదంతా ఏదో మిస్టరీలా లేదూ?" అన్నాడు.

గురు అదోలా నవ్వాడు. "వారందరివీ యాక్సిడెంటల్ డెత్స్ అని నువ్వు నమ్ముతున్నావా?"

“కాదా? పోలీసులూ, పోస్టుమార్టెమ్ రిపోర్టులూ అలాగనే కదా చెబుతూంటా?"

“ఔను. కాని, ఆ ప్రమాదాల నెవరో సృష్టించుతున్నారని నీకు అనుమానం కలగడం లేదూ?" అడిగాడు గురు.

జగన్ చిన్నగా ఉలికిపడి, "ఏమిట్రా నువ్వనేది?" అన్నాడు.

“ఎస్. ప్రమాదాల ముసుగులో రేపిస్టుల భరతం పడుతూన్న దెవరో నాకు తెలుసు".

మరోసారి ఉలికిపడి, "ఎవరూ?" అనడిగాడు జగన్ కంగారుగా. "పోలీసులా?"

తల అడ్డుగా ఊపాడు గురు – “నేనే...!”

ఆషాక్ నుండి జగన్ తేరుకునేసరికి అతను అక్కడ లేడు... అప్రయత్నంగా జగన్ మనసు గతంలోకి జారిపోయింది......

## 3

కొన్ని నెలల క్రితపు మాట అది ..... ఆరాత్రి జగన్, రాయుడు బార్ లో కూర్చుని బీర్ త్రాగుతూంటే, వచ్చి కూర్చున్నాడు గురు.

“రోజూ మాకంటె ముందే వచ్చి మందుతో మాకు స్వాగతం పలికేవాడివి. ఈరోజు నీకేమైందిరా ఆలస్యంగా వచ్చావ్?" అనడిగాడు జగన్ అతన్ని. అప్పటికే ఓరౌండ్ ఐపోయింది అతనికీ, రాయుడికీను.

దానికి జవాబివ్వకుండా, "ఈ వార్త ఆలకించారా మీరు?" అనడిగాడు గురు మిత్రుల్ని.

“ఏ వార్తా?”.

ఆ యువకులు ముగ్గురూ ఇంచుమించు ఒకే వయసువాళ్ళు. పోర్ట్ లో పనిచేస్తున్నారు. గురుకి తప్ప మిగతా ఇద్దరికీ పెళ్ళిళ్ళై పిల్లలున్నారు. ఫ్యామిలీ ఝంఝాటం లేకుండా కేర్ ఫ్రీ లైఫ్ గడపాలనుకునే గురు పెళ్ళి చేసుకోలేదు.

“మొన్న వరంగల్ లో అమ్మాయిల మీద యాసిడ్ పోసిన అబ్బాయిలిద్దర్నీ పోలీసులు ఎన్కౌంటర్లో చంపేసారట!” ఎక్సైటింగ్ గా చెప్పాడు గురు.

“తగిన శాస్తే జరిగింది. ఇంకెప్పుడూ ఎవడూ ప్రేమ దోమ అంటూ ఆడపిల్లల జోలికి పోడు," అన్నాడు రాయుడు నిశ్శబ్దాన్ని చీల్చుతూ.

“ఇంతకుమునుపో సారి మన ఊళ్ళోనే ఓ బ్యాంక్ ఆఫీసర్ని చంపినవాళ్ళను కూడా ఇలాగే ఎన్కౌంటర్లో చంపేసారు," గుర్తుచేసాడు గురు.

రాయుడు తలూపాడు. “నిజమే. పోలీసులది ఎక్సెసే ఐనా ప్రజలు వారి చర్యను హర్షిస్తున్నారంటే...ఆనేరస్థులు సమాజానికి ఎంతటి మెనేస్ గా పరిణమించారో అర్థమౌతోంది”.

“కరెక్ట్. ఇలాగే రేపిస్టుల్నీ, హంతకుల్నీ కోర్ట్ వరకు తీసుకువెళ్ళకుండా కాల్చిపడేస్తే తప్ప నేరస్థుల్లో భయం పుట్టదు," అన్నాడు గురు కసిగా. జగన్ వంక చూసి, "నువ్వేమీ మాట్లాడవేంరా?" అనడిగాడు.

“ఏం మాట్లాడమంటావ్? పోలీసుల చర్యను సమర్థించమంటావా, నీ ఆలోచనలో పొరపాటుందని చెప్పమంటావా?" అన్నాడు జగన్. "లేక, నిజానిజాలు రుజువు కాకుండా నిందితుల్ని బూటకపు ఎన్కౌంటర్లలో కాల్చి చంపడం అన్యాయమని చెప్పమంటావా?"

రాయుడు సాశ్చర్యంగా చూసాడు. “ప్రజలంతా హర్షిస్తూన్నదాన్ని నువ్వు తప్పంటావా?" అన్నాడు కొత్త బీర్ బాటిల్ని ఓపెన్ చేసి ముగ్గురి గ్లాసులలోనూ పోస్తూ.

ఔనన్నట్లు తలూపాడు జగన్. “ప్రజల రియాక్షన్ కి మూలం – జరిగిన ఘాతుకం కారణంగా వారిలో ఏర్పడ్డ ఎమోషన్స్. నిదానంగా ఆలోచిస్తే పోలీసుల చర్యను వారు ఆమోదిస్తారనుకోను," అన్నాడు శాంతంగా. “మనిషి ఏదో ఒక బలహీన క్షణం లో నేరం చేస్తా డు. ఒక్కోసారి అమాయకులు సైతం చేయని నేరానికి నింద పడవలసిరావడం మనకు తెలియంది కాదు. నేరం రుజువై శిక్ష పడేంతవరకు ఎవర్నీ

కండెం చేయడం సమంజసం కాదని నాఅభిప్రాయం...పోలీసుల చట్ట విరుద్ధమైన చర్యను సమర్థిస్తే ముందు ముందు అది ఎంతటి విపరీతపు పరిణామాలకు దారితీస్తుందో...ఊహిస్తేనే భయంగా ఉంది".

"ఐతే సాక్ష్యాధారాలు లేకుండానే టీవీ ఛానెల్స్ నిందితుల్ని ఎక్స్పోజ్ చేస్తున్నాయంటావా ?" ఆశ్చర్యంగా అడిగాడు గురు.

"ప్రైమా ఫేసీ ఎవిడెన్స్ ను ఆధారంగా చేసుకుని టీవీ ఛానెల్స్ నేరస్థుల్ని తూర్పారబడుతూంటాయి. ఐతే ఈమధ్య పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేట్ ఛానెల్స్ ఓ వాణిజ్య మాధ్యమంగా పరిణమించడం మనం మరచిపోకూడదు. పోటీపరమైన అత్యుత్సాహమైతేనేమి, టియార్పీ రేటింగ్స్ పెంచుకోవడం కోసమైతేనేమి ఛానెల్స్ కేసులను సెన్సేషనలైజ్ చేసి...తామే న్యాయస్థానాలుగా భావించుకుంటూ పబ్లిక్ ట్రయల్ కండక్ట్ చేయడంలో ఒకదానితో నొకటి పోటీపడడం దురదృష్టకరం. అందువల్ల అమాయకులు కొందరు బలికావడమే కాదు, న్యాయం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే అప్పుడప్పుడు కోర్టులు మీడియాను హెచ్చరించడం జరుగుతోంది" వివరించాడు జగన్.

కాసేపు వారి నడుమ నిశ్శబ్దం ఆవరించుకుంది. ఆవిషయాలను ఎవరికి వారే మదిలో విశ్లేషించుకుంటూ ఉండడమే అందుక్కారణం.

"నువ్వేమైనా చెప్పు, బ్రదర్! ధన మదంతో, రాజకీయ పలుకుబడితో ఆడవాళ్ళ పైన అఘాయిత్యాలు జరిపే కీచకుల్ని ఎన్కౌంటర్ చేసేయడమే రైటు," అన్నాడు గురు.

"ఔను. సమాజంలో పెద్దమనుషులుగా చెలామణి అయ్యేవారంతా తమ తమ మనీ పవర్నీ, పొలిటికల్ క్లౌట్ నీ ఉపయోగించి తమ రేపిస్టు బంధువులకు క్షణాలలో బెయిల్ పుట్టించి బైటకు తీసుకొచ్చేస్తున్నారు. తరువాత కేసు విచారణకు రావడానికి, నేరస్థుడికి శిక్ష పడడానికీ ఏళ్ళు పడుతుంది. ఆలోపున ఆకేసు సంగతి జనం మరచిపోవడం, పోలీసుల సాయంతో నేరస్థులు దర్జాగా బైట తిరగడమూ జరుగుతాయి. వీలైతే మరికొన్ని రేప్ లు చేయడానికి కూడా వెనుకాడరు. ఎటు వచ్చీ విక్టిం గతే అధ్వాన్నంగా తయారవుతుంది. రేపిస్ట్ ఆమెను చంపకుండా ఉంటే...అవమానంతో ఆమె ఆత్మహత్య చేసుకోవడమో, లేదా తప్పంతా ఆమెదే నన్నట్టు బంధుమిత్రులు కాకుల్లా పొడుస్తూంటే, సమాజం చిన్న చూపు చూస్తూంటే... మానసికంగా, శారీరకంగా క్రుంగి కృశించిపోవడమో జరుగుతుంది," అన్నాడు రాయుడు.

"కావచ్చును. నేరస్థుడైనా, తనవాడనుకున్నవాణ్ణి చూస్తూ చూస్తూ ఎవరూ విడిచిపెట్టుకోలేరు గదా!" అన్నడు జగన్.

"తనవాడైనా పరవాడైనా న్యాయం అందరికీ సమానమే. బంధుమిత్రులు నేరస్థుల్ని సపోర్ట్ చేయడం సహించరాని నేరం! అందుకే రేపిస్ట్ అన్నవాణ్ణి నిర్దాక్షిణ్యంగా కాల్చిపడెయ్యాలి!" దృఢంగా అన్నాడు, అప్పటికే రెండు బాటిల్స్ ఖాళీ చేసిన గురు.

"అందుకు న్యాయం, చట్టం ఉన్నాయి. నిందితుడి గిల్ట్ ను డిసైడ్ చేయడానికీ, శిక్షించడానికీ మనం ఎవరం?" అన్నాడు జగన్.

"నో, ఐ కెన్ డూ దట్. ఇలాంటి ఎడ్వెంచర్స్ చేయగల ధైర్యసాహసాలు, తెగింపూ నా ఒక్కడికే ఉన్నాయి," అన్నాడు గురు. "అన్నవరం సినిమాలో పవన్ కళ్యాణ్ ఏం చేసాడు?...ఏదో ఒక రోజున అలాంటిదేదో చేసి నేనూ ఓవర్నైట్ హీరో నైపోతాను, చూస్తూండండి".

"నో డౌట్, మన గురు అంతటి సమర్థుడే బ్రదర్!" అన్నాడు రాయుడు, చికెన్ లెగ్ ను కరకరా నములుతూ.

"ఎస్. మీరిద్దరూ పిరికివాళ్ళు. పైగా పెళ్ళాం పిల్లలున్న వాళ్ళు. నేను రికామికీ గాణ్ణి. తలచుకుంటే ఏమైనా చేయగలను" సవాలుగా అన్నాడు గురు, చేతిలోని మందు గ్లాసును టేబుల్కేసి కొడుతూ.

"సరే, సరే. నీకు మందెక్కువైంది. నీమాటలు ఎవరయినా ఆలకిస్తే నీతోపాటు మమ్మల్ని కూడా పోలీసులకు అప్పగించగలరు" అన్నాడు జగన్, ఆసంభాషణకు అంతటితో ఫుల్ స్టాప్ పెడుతూ.

4

ఆ సంభాషణ జరిగిన నెల్నాళ్ళకు – భయంకరమైన చేదు అనుభవం ఒకటి ఎదురైంది జగన్ కి. అతని కజిన్ సిస్టర్ కు టెన్త్ క్లాస్ చదివే పదిహేనేళ్ళ కూతురు ఉంది. పేరు నమిత. బంగారుబొమ్మలా ఉంటుంది. ఓసారి ఆమె స్నేహితురాళ్ళతో కలసి గంగవరం బీచ్ కు

వెళ్ళింది. తిరిగివస్తూంటే ఆఏరియా దాదా ఒకడు అంతా చూస్తూండగానే నమితను బలవంతంగా జీపులో ఎక్కించుకుని తీసుకుపోయాడు. దారుణంగా రేప్ చేసి చంపేసాడు. మర్నాడు ఆమె శవం భీమిలి బీచ్ దగ్గర జీడిమామిడి తోపులో కనిపించింది. వారం తరువాత పోలీసులు వాణ్ణి అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. లోకల్ పొలిటీషియన్ ఒకరు వాణ్ణి జామీను మీద బైటకు తీసుకురావడం జరిగింది.

ఆ సంఘటన జగన్ మీద పెద్ద ప్రభావమే చూపింది. 'మావయ్యా' అంటూ ఆప్యాయంగా పిలుస్తూ తనతో చనువుగా తిరిగే నమితే క్షణ క్షణమూ గుర్తుకు రావడంతో చాలా అప్సెట్ అయ్యాడు...ఓ పసి(డి)మొగ్గ అందాలు సంతరించుకుంటూ పూవుగా వికసిస్తూన్న తరుణంలో – ఆ రాక్షసుడు క్రూరంగా నలిపేసి కర్కశంగా కాలరాయాడాన్ని అతను ఓపట్టాన జీర్ణించుకోలేకపోయాడు. ఆ రేపిస్టును ముక్కలు ముక్కలుగా నరికివేయాలన్నంత ఆగ్రహం, ఆవేశం కలిగాయి.

పుట్టుకనుంచీ ఎంతో అల్లారుముద్దుగా చూసుకునే పసిపాపలు వయసు పోసుకునే తరుణంలో దుండగుల బారిన పడి ఘోర పరాభవంతో మృత్యువాత పడడం...తలచుకుని పిచ్చివాడే అయ్యాడు. ముక్కుపచ్చలారని ఆచిన్నారిని అంత కౄరంగా నాశనం చేయడానికి ఆముష్కరుడికి మనసెలా ఒప్పిందో!?

వాణ్ణి ఏదో చేసేయాలన్న తపన, ఆరాటం జగన్ మనసుకు శాంతి లేకుండా చేసాయి. వారం రోజులపాటు పనిలోకి కూడా వెళ్ళకుండా ఒంటరిగా తనలో తానే కుమిలిపోయాడు. గురు, రాయుడు వచ్చి పరామర్శించారు. , 'ఐ విల్ కిల్ ద బాస్టర్డ్!' అని గురు ఆవేశంగా అరిస్తే – గురూయే రైటేమో ననిపించింది అతనికి మొదటిసారిగా.

బెయిల్లో బైటకు వచ్చిన పది రోజులకు నమిత హంతకుడు సముద్రంలో ఈతకు వెళ్ళి మునిగిపోయాడు. రెండో రోజున కానీ వాడి శవం రెండు కిలోమీటర్ల దూరంలో తేలలేదు. దేవుడే వాడికి తగిన శిక్ష విధించాడని చెప్పుకున్నారంతా. ఆవార్త కొంత ఉపశమనం కలిగించినా ఆ ఘాతం నుంచి పూర్తిగా కోలుకోలేకపోయాడు జగన్...

ఇప్పుడు గురు వచ్చి రేపిస్టులందర్నీ తానే చంపుతున్నట్లు డిక్లేర్ చేయడంతో అవాక్కయ్యాడు.

5

ఆమధ్య అఫీషియల్ ట్రెయినింగ్ కోసం నెల రోజుల పాటు హైదరాబాద్ వెళ్ళాడు జగన్. ఆసమయంలో అందిన వార్త గొప్ప షాక్ కు గురిచేసింది అతన్ని.

గురు ఓయువతిని రేప్ చేసాడు! ఓవిదేశీ టూరిస్ట్ గర్ల్ పైన అత్యాచారం జరిపాడు!!

రాయుడు ఫోన్లో చెప్పిన వివరాలివి... ఓమధ్యాహ్నం ఎందుకో భీమిలి వెళ్ళాడు గురు. అక్కడ బీచ్లో ఓ జర్మన్ యువతి ఒంటరిగా కనిపించింది. ఆమె భర్తో, బాయ్ ఫ్రెండో సముద్రంలో ఈత కొడుతున్నాడు.తెల్లగా,అందంగా, అర్ధనగ్నంగా ఉన్న ఇరవయ్యేళ్ళ యువతిని చూస్తే గురు మనసు చలించింది. వివేకం నశించింది. ఆమెతో మాటలు కలిపాడు. ఏదో మిషతో జీడిమామిడి తోపులోకి తీసుకువెళ్ళాడు. ఆమె పైన అత్యాచారం జరిపాడు. ఆమె అరుపులు ఆలకించి దారిన పొయేవాళ్ళొచ్చి అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఆసమయంలో అతను త్రాగియున్నట్లు తెలిసింది.

డిపార్ట్మెంట్ గురును ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసింది. రాయుడు తనకు తెలిసిన రాజకీయ నాయకులను పట్టుకుని వారి పలుకుబడితో గురుకు బెయిల్ ఇప్పించాడు.

జగన్ అయోమయంలో పడిపోయాడు. కారణం – గురు అటువంటి నీచమైన పనికి పూనుకుంటాడంటే నమ్మకం కలుగకపోవడమే. ఎంత త్రాగి ఉన్నా!

ట్రెయినింగ్ పూర్తిచేసుకుని తిరిగి వచ్చిన జగన్, రాయుడితో మాట్లాడాడు. ఆ జర్మన్ పిల్ల అందం తనను పిచ్చివాణ్ణి చేసిందనీ, కొద్దిగా త్రాగి కూడా ఉన్నందున, ఏం చేస్తున్నాడో తెలియకుండానే ఆపని చేసానని... గురు తన దగ్గర ఒప్పుకున్నట్టు చెప్పాడతను. ఎంత చెడ్డా గురు తమ క్లోజ్ ఫ్రెండ్ అనీ, అతన్ని ఎలాగైనా ఆ కేసు నుండి బైటపడవేయవలసిన బాధ్యత తమదేననీ అన్నాడు.

6

బీచ్ రోడ్ లో ఐదంతస్థుల భవనంలో ఓఫ్లాట్ లో ఉంటున్నాడు గురు. జగన్ అతన్ని చూడ్డానికి వెళ్ళాడు. టెర్రేస్ పైన ఆసీనులయ్యారు మిత్రులిద్దరూ.

ఎరుపెక్కిన చెక్కిళ్ళతో సోయగాలు ఒలికిస్తూన్న సాయంసంధ్యను ముద్దిడేందుకని మసక చీకట్లు ఎగబ్రాకుతూంటే...దిగంతాలు సిగ్గుతో నల్లటి ముసుగు కప్పుకున్నాయి.

ఏం మాట్లాడాలో ఇద్దరికీ తెలియనందున మిత్రుల నడుమ నిశ్శబ్దం చోటు చేసుకుంది.

సముద్రుడి హోరు వినవస్తూంటే...సముద్రపు గాలి జోరుగా వీస్తూంటే...గోడ వద్ద కెళ్ళి నిలుచున్నాడు జగన్... బీచ్ లో లైట్లు వెలిగాయి. జనం పెరిగారు. దూరంలో హార్బర్ లైట్లు తోరణాల్లా కనిపిస్తున్నాయి. సముద్రం నడుమ యాంకర్ చేయబడ్డ ఓడల ఉనికిని చాటుతూన్న దీపాలు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. సుదూరంగా ఫిషింగ్ బోట్స్ లోని దీపాలు మిణుకు మిణుకు మంటున్నాయి... ఎగసిపడుతూన్న అలల వంక సాలోచనగా చూస్తూండిపోయాడు.

మిత్రుడికి చేరువగా వచ్చి తల వంచుకుని నిలుచున్నాడు గురు. కాసేపటికి తలెత్తి చూసి హఠాత్తుగా అడిగాడు జగన్ – "ఎందుకు? ఎందుకు చేసావీ నీచమైన పని?" అతని గొంతులో కోపం కంటె బాధే సుళ్ళు తిరిగింది.

స్నేహితుడి చేతులు పట్టుకుని భోరుమన్నాడు గురు. "నన్ను క్షమించరా, జగన్! ఆక్షణంలో నన్నేదో దయ్యం పట్టింది. అప్పుడు నేను త్రాగియుండడం కూడా కారణమై యుండవచ్చును. అదంతా అసంకల్పితంగా జరిగిపోయిందిరా".

జగన్ మాట్లాడలేదు. మసక వెలుతురులో అతని దవడలు బిగుసుకోవడం గురు కు కనిపిస్తూనే ఉంది.

"ఒరేయ్ జగన్! చేసిన తప్పుకు పశ్చాత్తాప పడుతున్నాను. నన్నెలాగైనా కాపాడండిరా," ప్రాధేయపడ్డాడు గురు.

అతని చేతులు విడిపించుకున్నాడు జగన్. "నువ్వు చేసింది చిన్నపాటి అపచారం కాదు. అత్యాచారం! సీరియస్ అఫెన్స్. ఓ ఆడపిల్ల శీలాన్ని బలవంతంగా బలిగొన్నావ్. ఇందుకు నీకు నిష్కృతి ఉండదు..." తీక్ష్ణంగా అన్నాడు.

"అలా అనకురా. నేను నీ స్నేహితుణ్ణిరా," బేలగా అన్నాడు గురు.

"ఇలాంటి విషయాలలో స్వ, పర బేధాలు ఉండరాదని లోగడ నువ్వే అన్నట్టు గుర్తు!" సూటిగా అన్నాడు జగన్. "అసలు నీకు బెయిల్ ఇప్పించిన ఆ రాయుణ్ణి అనాలి!"

"ఒరేయ్, జగన్! ప్లీజ్ రా. అలా అనకురా. ఎంత కాదనుకున్నా మనం బాల్యమిత్రులంరా. ఈ క్లిష్ట సమయంలో మీరు కాకపోతే ఇంకెవరు ఆదుకుంటార్రా నన్ను?" గురు గొంతులో దుఃఖం సుళ్ళు తిరిగింది.

"షటప్! నేరం చేసినవాడు శిక్ష ననుభవించక తప్పదు," అని, హఠాత్తుగా ఏదో గుర్తుకు రావడంతో, "ఆడవారి పైన అత్యాచారం చేసినవారంతా బెయిల్ మీద బైటకు రాగానే నువ్వే చంపుతున్నానన్నావ్?... మరి, అదే నేరం నువ్వూ చేసావంటే...ఆశ్చర్యంగా ఉంది నాకు!"

"సారీరా. గొప్పకోసం అలా చెప్పానంతే. వాళ్ళంతా నిజంగానే ప్రమాదాలలో మరణించారు. వాళ్ళ చావులకు, నాకూ ఏ సంబంధమూ లేదు," కన్ఫెస్ చేసాడు గురు. "రాయుడు, నువ్వూ నన్ను హీరో అనుకోవాలని మీతో అలా అబద్ధం చెప్పాను".

"ఆవిషయం నాకు తెలుసు," తాపీగా అన్నాడు జగన్. "అంతే కాదు, వాళ్ళవి యాక్సిడెంట్ డెత్స్ కావనీ తెలుసు".

గురు తెల్లబోయి, "ఆసంగతి నీకెలా తెలుసు?" అనడిగాడు.

“ఎలా అంటే...ఆ నీచులందర్నీ ప్రమాదాలకు గురి చేసి మట్టుపెట్టింది...నేనే కనుక!”

అదరిపడ్డాడు గురు. “నువ్వు...నువ్వు...జోక్ చేస్తున్నావు కదూ?"

“లేదు. ఓసారి నువ్వే అన్నావ్ గుర్తుందా – ఆడవారి మీద అత్యాచారం జరిపేవారిని నిర్దాక్షిణ్యంగా ఎన్కౌంటర్ చేసేయాలని? అప్పట్లో వ్యతిరేకించినా...నమిత బలైపోయాక...నీ ఆలోచనే సరైందనిపించింది నాకు. అందుకే ఆ చిన్నారి పైన అత్యాచారం జరిపినవాడితో ఆరంభించి, రేప్ కేసుల్లోని నిందితులందరినీ తెలివిగా ప్రమాదాలు సృష్టించి యమపురికి పంపిస్తున్నాను..."

ఆ మసక చీకట్లో కూడా జగన్ వికృత వదనాన్ని చూసి భయపడిపోయాడు గురు.

“స్త్రీల మీద అత్యాచారం చేసింది ఎవరైనా సరే...క్షమార్హులు కారన్నది నా నిశ్చితాభిప్రాయం," జగన్ గొంతుక కర్కశమైంది.

“అంతే... నన్ను...కూడానా...??" గురు గొంతుక పూడ్చుకుపోయింది.

“ఎస్. రేపిస్టులను శిక్షించడంలో సెంటిమెంట్స్ పనికిరావని నువ్వే అన్నావ్ ఓ సారి...న్యాయం ఎవరికైనా ఒకటే!”

భయంతో బిగుసుకుపోయాడు గురు. స్నేహితుడిలో ఓ కొత్త మనిషిని చూస్తున్నాడు ఇప్పుడు. పారిపోదామంటే కాళ్ళు సహకరించలేదు.

“జర్మన్ యువతి రేప్ కేసులోని నిందితుడు గత రాత్రి ప్రమాదవశాత్తూ ఐదంతస్థుల భవనం పైనుంచి పడి చనిపోయాడన్న వార్త రేపు టీవీలో వస్తుంది. కాని దాన్ని వాచ్ చేసేందుకు నువ్వుండవ్!” రాతిలా మారిపోయిన వదనంతో స్నేహితుడి వైపు అడుగులు వేసాడు జగన్ ..!

★★★★

# ఇనుప తెర

మధు పెమ్మరాజు

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

రాత్రి భోరుమని వర్షం కురుస్తోంది, బాగ్లో బట్టలు ఒక్కొక్కటీ సర్దుకుంటూ రాధీకేసి చూస్తున్నాను, నన్ను పట్టించుకోనట్టు నటిస్తూ తన పని చేసుకుంటోంది. నేను సాస్కటూన్ వెళ్ళడం రాధికకి ఇష్టం లేదు, ఆ ఇష్టాన్ని అవుననే వెసులుబాటు నాకు లేదు. ప్రాజెక్ట్ పని మీద ప్రతి వారం సాస్కటూన్ వెళ్ళి రావడం తేలికైన విషయం కాదు, ఎంత లేదన్నా ఫ్లోరిడా నుండి పన్నెండు గంటల ప్రయాణం, పైగా శీతాకాలంలో విమానపు రాకపోకలు అస్తవ్యస్తంగా ఉంటాయని బెంగ పెట్టుకుంది. ప్రయాణం దగ్గరవగానే బెంగ మౌనంగా మారి మా మధ్య మూడో పాత్ర పోషిస్తోంది.

భుజం చుట్టూ చేతులు వేసి “రాధీ! నేను ఇష్టపడి వెళుతున్నానా?” అని జాలి మొహం పెట్టి అడిగాను.

పట్టు సడలించి “మీ సంగతి తెలీదు, చందు మాత్రం నిద్రలోంచి లేవగానే నాన్నా… నాన్నా.. అంటూ పక్క తడుముకుంటాడు. మీ షూస్, లాప్టాప్ వెతుక్కుని… అవును నాన్న మళ్ళీ వెళ్ళిపోయారు అని వాడికి వాడే సమాధానం చెప్పుకుంటాడు, అప్పుడు వాడి మోహం చూస్తే తెలుస్తుంది మీకు” అని జవాబు చెప్పింది రాధిక.

“మీకు దూరంగా ఎందుకుండాలని ప్రశ్నించుకోని రోజు లేదు.. ట్రస్ట్ మి…ఇదే నా ఆఖరి కన్సల్టింగ్ అసైన్మెంట్, ఇది పూర్తవగానే ఎక్కడికీ వెళ్ళను, మనూళ్ళో పర్మనెంట్ ఉద్యోగం వెతుక్కుంటాను… సరేనా?" అన్నాను.

“ఇన్ని రోజులూ అమెరికాలో తిరుతుంటే ఏదో దగ్గరగా ఉన్నారనిపించేది. ఈసారి అక్కడెక్కడికో వెళుతున్నారు, బాగా శ్రమ పడతారేమో ఆలోచించుకోండి”

“ఆలోచనలు అయ్యాయి, అవమానాలు అయ్యాయి….ఇచ్చిన ప్రతి ఇంటర్వ్యూ లో మానేజ్మెంట్ చెయ్యగలనంటే…ఇంతక మునుపు చేసావా? ఎక్కడ చేసావు? రెఫరెన్స్ ఇవ్వగలవా? అని అనుమానించారు తప్ప మాటకి విలువివ్వలేదు. ఈ అవకాశం లేక, లేక వచ్చింది. అందుకే కెనడా అయినా మారు మాట్లాడకుండా ఒప్పుకున్నాను”

"నేను ఉద్యోగం గురించి కాదు, మీ గురించి మాట్లాడుతున్నాను"

“నేను మన గురించి మాట్లాడుతున్నాను. ఇప్పుడున్న స్కిల్స్ తో పర్మనెంట్ ఉద్యోగంలో జేరితే జీతం బొటాబొటిగా సరిపోతుంది, మన అవసరాలు తీరాలంటే కనీసం మానేజ్మెంట్లో చేరాలి, అందుకే ఈ డెస్పరేషన్”

"సర్లెండి...ప్రతి మాటకి ఏదో ఒక లింకు పెడతారు, మీరు మాత్రం హైరానా పడకండి"

"నేను హైరానా పడను, నువ్వు కంగారు పడకు. నవ్వనంటే మరొక్క విషయం, పొద్దున్నే లేచి సాగనంపకు నాకేదో గిల్టీగా ఉంటుంది" అని నచ్చ చెప్పాను.

మూడున్నరకి అలారం మ్రోగగానే నవ్వొచ్చింది, కలత నిద్రకి మ్రోతల అవసరం లేదు, రాత్రంతా నాలో నేను తగువు పడుతూనే ఉన్నాను, అస్థిరత్వపు నీడల వెనుక బలవంతపు నడకని ద్వేషిస్తూనే ఉన్నాను, నడుస్తూనే ఉన్నాను.

మళ్ళీ అదే చీకటి, అవే నిశ్శబ్ద ఘడియలు. లాప్టాప్ బాగ్, స్త్రోలర్, నేను అంతా ఒకేసారి ఇంటి బయటపడ్డాము, వీధి మౌన ముద్రలో ఉంది, ఎదురుగా వరుసలో పేర్చిన సోలార్ దీపాలు అమావాస్య చీకటిని పారదోలడానికి పట్టుదలగా ప్రయత్నిస్తున్నాయి, నాలోని ప్రాక్టికాలిటీ ఇంచుమించు అలాంటి యుద్ధమే చేస్తూ నడిపిస్తోంది.

★★★★★★★★★★

సగం దూరం డెన్వర్ చేరుకునేసరికి కనెక్టింగ్ ఫ్లైట్ ఆలస్యమని తెలిసింది. వాతావరణం మెరుగుపడి ఫ్లైట్ బయలుదేరుతుందని ఆశగా ఎదురుచూస్తున్నాను. గంటలు గడిచాయి, చీకటి పడింది. నమ్మకం వదిలేసుకున్న ప్రయాణికులు అక్కడక్కడ కుర్చీలలో సర్దుకుని, సామాన్లు తలకింద పెట్టుకుని రక, రకాల భంగిమలలో పడుకుంటున్నారు, నిద్రని కంటి రెప్పలపై మోస్తూ ఎయిర్లైన్ డెస్క్ వైపు చూస్తుంటే నా ఇంటర్వ్యూ గుర్తొచ్చింది.

"ఈ ప్రాజెక్ట్ చెయ్యడానికి నువ్వు సరైన వ్యక్తివని ఎలా అనుకుంటున్నావు?" డైరెక్టర్ గొంతులో కాస్త అపనమ్మకం, బోలెడు అసహనం స్పష్టంగా తెలుస్తోంది.

"మీ రిక్వైర్మెంట్స్ బాగా అర్థం చేసుకున్నాను, వాటికి నా స్కిల్స్ సరిగ్గా సరిపోతాయని నమ్మకముంది"

"మా టైం లైన్స్ చాలా టైట్ గా ఉంటాయి. వారానికి అరవై, డెబ్బై గంటల సమయం ప్రాజెక్టుపై పెట్టాలి, మీకు ఓకేనా?"

"నేను వాచీ చూసి పని చెయ్యను, పనయ్యాకా వాచీ చూసుకుంటాను" అని నొక్కి చెప్పాను.

"గుడ్, నేను అప్ ఫ్రంట్ చెబుతున్నాను. ఇది చాలా కష్టమైన ప్రాజెక్టు, చిన్న టీంతో పని చేయించాలి. ఇది వరకో పేరు మోసిన గ్లోబల్ కంపెనీ నాలుగు నెలలు ప్రయత్నించి చెయ్యలేక చెయ్యెత్తేసింది"

"మీకు నా రెస్యూం చూస్తే అర్థమవుతుంది, నేను ఇప్పటిదాకా పని చేసిన ప్రతి ప్రాజెక్టు ప్రెషర్ కుక్కర్ లాంటిదే.. అసలు సులువనే మాటతో నాకు పరిచయం లేదు" మానేజ్మెంట్ రోల్ కావాలన్న ఆత్రుత పైకి తెలియకూడదనుకున్నా మాటలు అదుపు తప్పి దొర్లిపోతున్నాయి.

"ఆఖరి విషయం, మీరు రిసోర్సెస్తో గట్టిగా పని చేయించాలి, చేయించగలరా?"

"తప్పకుండా, యువర్ సక్సెస్ ఈజ్ మై ప్రయారిటీ" అని ముగించాను.

నా జవాబులు నచ్చి తీసుకున్నారో లేక మారుమూల ప్రాంతానికి ఎవరూ రాక తీసుకున్నారో తెలీదు కానీ మొత్తానికి అవకాశం దొరికింది.

టెర్మినల్ పలచబడుతుంటే ఎయిర్లైన్ డెస్క్ దగ్గరకి వెళ్లి "ఏమైనా అప్డేట్స్ ఉన్నాయా? అని అడిగాను, అప్పటికి బహుశా మూడోసారి అడిగి ఉంటాను. నాలా ఎందరికో జవాబు చెప్పి, చెప్పి విసిగిపోయారేమో "పొద్దున్న దాకా ఏమీ చెప్పలేము" అని కాస్త చిరాగ్గా

చెప్పారు. ఆ నిముషం నిస్సత్తువ ఒక్కసారిగా ఆవరించింది, వెంటనే దగ్గరగా ఓ ఖాళీ కుర్చీ వెతుక్కుని చతికిలపడ్డాను. పరుగు పందాలు అలవాటయిన శరీరానికి తీరుబడిగా కూర్చోవడం కాస్త కొత్తగా, గాలిలో తేలుతున్నట్టుంది.

ఎదురుగా రన్వే ఎడ్జ్ లైట్లు మిణుకు, మిణుకుమంటూ మెరుస్తున్నాయి, ఆ కాంతిలో మంచు కరుగుతూ కనపడుతోంది, వాతావరణమిచ్చిన తెరిపికి ఒక ఫ్లైట్ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ కదులుతోంది. నాకంతటి అదృష్టం లేదు, నా రన్వే నిండా అస్పష్టత, సంపాదన పరుగులో ఖర్చవుతున్న జీవితం కనిపిస్తోంది. పాకుడు రాళ్ళపై పట్టు కోసం నా ప్రయత్నం కనిపిస్తోంది...*సీనే మే జలన్.. ఆన్ఖోన్ మే తుఫాన్స క్యోన్ హై*...గొంతు దాటని భావాలకి మ్యూజిక్ ప్లేయర్ వంత పాడింది.

ఈ అలజడికి రాధికతో మాట్లాడడం విరుగుడు అనిపించి సెల్ తీసి చూస్తే ఛార్జ్ అయిపోయింది. లాప్టాప్ బాగ్ వెతికినా చార్జర్ దొరకలేదు, ప్రయాణం హడావిడిలో పెట్టుకోవడం మర్చిపోయాను. నాకు రాధిక సంగతి తెలుసు, ఫోన్ చేసి పరిస్థితి చెప్పకపోతే కంగారు పడుతూ, మేలుకుని ఉంటుంది. ఏమీ పాలుపోక చుట్టూ చూసాను, కాస్త దూరంలో ఓ స్త్రీ బహుశా ముప్పై, ముప్పై అయిదేళ్ళు ఉంటాయేమో ఫోన్లో మాట్లాడుతోంది, కాస్త వీలు దొరకగానే దూకినంత పని చేసి దగ్గరకి వెళ్ళాను.

"ఎక్స్ క్యూస్ మి! మీరేమీ అనుకోపోతే ఓ సహాయం కావాలి" అని అడిగాను

"చెప్పండి"

"నా సెల్ ఛార్జ్ అయిపోయింది, చార్జర్ కూడా మర్చిపోయాను"

"ఒకే"

"నా కాల్ కోసం మా ఆవిడ ఎదురుచూస్తూ ఉంటుంది, మీరు చార్జర్ ఇచ్చినా లేక ఓ రెండు నిముషాలు సెల్ ఇచ్చినా చాలా సహాయం చేసినవారవుతారు" అన్నాను, నా మాటకి మొదట మొహం ఇబ్బందిగా పెట్టింది, తర్వాత ఏమనుకుందో చార్జర్ తీసిచ్చింది.

రాధికతో మాట్లాడాకా చార్జర్ తిరిగి ఇస్తూ "చాలా, చాలా థాంక్స్.. బై ది వే, నా పేరు శశాంక్"

"నా పేరు మేరీ," కరచాలనానికి చెయ్యి అందించింది.

"నేను సాస్కటూన్ వెళుతున్నాను, అక్కడ టైటాన్ కంపెనీలో ప్రాజెక్టు మేనేజర్గా రేపు జేరుతున్నాను. పొద్దున్న రిపోర్ట్ చేసి తీరాలని షరతు పెట్టారు. నేనేమో ఇక్కడిలా చిక్కడిపోయాను" అని బలహీనంగా నవ్వి చేయి కలిపాను.

ఆవిడ కళ్ళలో ఒక ఆశ్చర్యపు మెరుపు.

"నిజమా? భలే కోయిన్సిడెన్స్. నేనూ అదే ప్రాజెక్టుకి సిస్టం ఆర్కిటెక్ట్ గా వెళుతున్నాను, అంటే మీరు నా బాస్, ఇది మొదటి టీం మీటింగన్న మాట" అని నవ్వింది. నేనూ నవ్వాను, ఆ క్షణం మేరీ వల్ల నా జీవితం పెద్ద మలుపు తిరుగుతుందని నాకు తెలియదు.

★★★★★★★★★

ప్రాజెక్ట్ లో చేరి మూడు నెలలు గడిచింది, రోజూ పని ముగించుకుని రాత్రి హోటల్ చేరాకా రాధీ, చందులతో వీడియో సంభాషణలు చేసి మీ పక్కనే ఉన్నానని మాయ చేసేవాడిని. కంప్యూటర్ మూయగానే అగాధమయిన వెలితి తోడుగా మిగిలేది. ప్రతి వారం ఇంటికి వెళ్ళే వీలుపడక రెండు, మూడు వారాలకోసారి వెళ్ళేవాడిని. వీడ్కోలు చెప్పే రోజు మాత్రం శరీరంలో ఒక భాగం తీసినట్టుగా,

ఎయిర్పోర్ట్ ఆ పాపం మూటగట్టుకున్న ఆపరేషన్ థియేటర్లా అనిపించేది. అప్పుడు రాబోయే రోజులని మంచి రోజులుగా తలుచుకుని ఓదార్పు పొందేవాడిని.

సాస్కటూన్లో ప్రకృతి వెలుతురు చాలా తక్కువసార్లు చూసాను, ఎక్కువ భాగం కాన్ఫరెన్స్ రూం లైట్ల కింద దీపపు పురుగులా గడిపేవాడిని. ఇంటర్వ్యూలో చెప్పినదానికంటే పని ఎన్నో రెట్లు కష్టంగా ఉండడంతో డైరెక్టర్ మితబాషని అర్ధమయ్యింది. కొత్త అనుభవమయినా టీంని బాగా మానేజ్ చేస్తున్నాను, సమయానికి డెలివరబుల్స్ అందజేస్తున్నానని నమ్మకం కలిగింది.

ఆ రోజు స్టేటస్ మీటింగ్లో టీం లీడ్ కాస్త ఇబ్బందిగా కనపడ్డాడు, ప్రాజెక్ట్ మేనేజర్గా అపశకునాలని కనిపెట్టడం నా బాధ్యత కాబట్టి ముందుగా అతన్ని పలకరించాను.

"డేవిడ్ కాస్త నెర్వస్గా కనపడుతున్నావు, ఏమిటి ప్రాబ్లం?"

"శషాంక్..డిజైన్ ముగిసి వారం రోజులయ్యింది, ఆ రోజు నుండి ప్రోటోటైప్కి సిస్టం కావాలని అడుగుతున్నాము"

"మేరీతో మాట్లాడావా?"

"మాట్లాడాను కానీ సరైన జవాబు లేదు, ఇలా ఇంకో మూడు రోజులు గడిస్తే ప్రాజెక్ట్ డెడ్ లైన్స్ మార్చాలి"

"మానేజ్మెంట్కి ప్రాజెక్టుపై నమ్మకం తక్కువ, డెడ్ లైన్ మార్చమని అడిగితే అందరినీ ఇంటికి పంపించేస్తారు"

"ఇప్పుడు మేమేం చెయ్యాలి?"

"మీరు వేరే పనులు చూసుకోండి, నేను మేరీతో మాట్లాడి ఏ విషయమో ఇంకో రెండు గంటల్లో చెప్తాను, డోంట్ పానిక్" అని భరోసా ఇచ్చి పంపాను.

మేరీ టీం మీటింగ్కి రాకపోవడం ఇది మొదటిసారి కాదు, గత నాలుగు వారాలుగా ఇదే తంతు. ఎప్పుడూ సెల్లో మాట్లాడుతూ ఆఫీసు బయట కనిపిస్తుందని, కంట నీరు పెట్టుకుంది....బాయ్ ఫ్రెండ్తో బ్రేకప్ అని రకరకాల మాటలు విన్నాను. నాకు వ్యక్తిగత విషయాలతో సంబంధం లేదు, ఆ వైఖరి టీంకి పాకుతుందని నా భయం. ఆవిడ విషయం పైదాకా పాకి, డైరెక్టర్ తో అత్యవసర మీటింగుగా మారింది.

"సిస్టం డెలివరబుల్స్ రెడ్లో ఉన్నాయి, కారణం తెలుసుకోవచ్చా?" అని అడిగాడు జాక్.

"కారణం తెలుసు, పూర్తి వివరాలు కనుక్కుని మీకు సాయంత్రం లోగా చెప్తాను" అన్నాను.

"శశాంక్! మీరు కష్టపడితే సరిపోదు, టీంని అదుపులో పెట్టాలి. ఎవరైనా సరిగ్గా సహకరించకపోతే ఫైర్ చేసే అధికారం మీకుంది"

"ఇప్పటిదాకా ఆర్కిటెక్ట్ ఇచ్చిన సిస్టం కన్సిడరేషన్స్ చాలా బావున్నాయి, ఎకనామికల్గా ఉన్నాయి. మంచి అనుభవం ఉన్న ప్రొఫెషనల్. ఎటొచ్చి ఆవిడతో సమస్యల్లా కమ్యూనికేషన్, నేను మాట్లాడి సరి దిద్దుతాను" అని సంజాయిషీ ఇచ్చాను.

"మనం మనుషుల్ని అర్ధం చేసుకుని, వారిని చక్కదిద్దేంత సమయం లేదు. కాంట్రాక్టర్లని నోటిస్ లేకుండా ఫైర్ చెయ్యొచ్చు, జస్ట్ త్రో దెం" అని మండిపడ్డాడు.

"మీరు చెప్పింది నిజమే కానీ మనకి అంత సులువుగా దొరికే స్కిల్ కాదు. పైగా మనకంత సమయం లేదు, నేనే ఏదోలా సరిదిద్దుతాను" అని బయట పడ్డాను.

డైరెక్టర్ మనుషుల్ని పెన్సిల్, ఇరేసర్లాగ మాట్లాడడం, కాంట్రాక్టర్ అంటే ఫైర్ చెయ్యడానికి వెసులుబాటులా మాట్లాడడం నచ్చలేదు. నా లక్ష్యం చేరుకోవాలంటే సున్నితమైన ఆలోచనలని ప్రాక్టికాలిటీ అనే ఇనుప తెర వెనుకకు నెట్టడం తప్పదని

నిశ్చయించుకున్నాను. క్యూబ్కి వెళ్లి చూసినా, కారిడార్లో వెతికినా మేరీ కనపడలేదు. చివరకి కెఫీటేరియాలో ఓ మూల సెల్ పట్టుకుని విచారంగా కనపడింది.

"హలో మేరీ... మీతో ఒక అర్జంట్ విషయం మాట్లాడాలని అన్ని చోట్లా వెతుకుతున్నాను"

"శశాంక్! ఇంటి నుంచి అర్జెంటుగా కాల్ చెయ్యమని మెసేజ్ వచ్చింది..... డాక్టర్...." అని ఏదో చెప్పబోతుంటే మధ్యలో అడ్డుపడ్డాను.

"సారీ టు ఇంటరప్ట్.... అందరికీ వ్యక్తిగత సమస్యలు ఉంటాయి. నా మటుకు నేను కుటుంబానికి దూరంగా ఉంటున్నా ఆఫీస్ సమయంలో పని మాత్రమే చేస్తాను. బయట కాల్స్ తీసుకోను, కాల్స్ చెయ్యను. మీ వల్ల పని ఆగిపోయిందని టీం నుండి కంప్లైంట్లు వస్తున్నాయి"

"ఎన్విరాన్మెంట్ ఆలస్యానికి నేను కారణం కాదు, డాటాబేస్ ఇష్యూస్ కారణం. నిన్న అర్థరాత్రి దాకా ఆ టీంతో పనిచేసాను" అని చెప్పింది.

"ఆ స్టేటస్ ఏదో మీ దగ్గర దాచుకోకండి, కాస్త అందరితో పంచుకోండి" అని వెటకారంగా అన్నాను, ఏదో సమాధానం చెప్పబోతూ మధ్యలో ఆగిపోయింది.

"చూడు మేరీ! జాక్ కొత్త కన్సల్టెంట్ని తెచ్చుకోమని ప్రతీ మీటింగ్లో చెప్తున్నాడు. నేను మిమ్మల్ని కాపాడడానికి ప్రయత్నిస్తున్నాను...ప్లీజ్ హెల్ప్ మి టు హెల్ప్ యు" అని సున్నితంగా హెచ్చరించి ముగించాను. నొప్పించే విధంగా మాట్లాడడం అలవాటు లేకపోవడం వలన కాస్త ఇబ్బందిగా అనిపించినా నాకు వేరే దారి లేదు.

★★★★★★★★★

వీకెండ్ సాస్కటూన్ వదిలి ఇంటికొచ్చినా సాస్కటూన్ నన్ను వెంటాడుతూనే ఉంది. రాధిక పలకరింపుల వెచ్చదనం, కిటికీలోంచి వీస్తున్న చిరుగాలులు తాకుతున్నా స్పందించే అవకాశం లేదు, సేద తీర్చుకునే సమయం లేదు, అసలు ఇంటికి ఎందుకొచ్చానా అనిపించేది. చీకటి గుహ అలవాటయిన ప్రాణానికి వెలుతురు వింతగా, భయంగా ఉంటుంది.

ఆ రోజు "నాన్నా! నాన్నా! లాప్టాప్ పక్కన పెట్టు, మనం బాస్కెట్బాల్ ఆడదాము" అని చందు వెనకాల పడ్డాడు.

"లేదురా ఇప్పుడు అర్జెంట్ మీటింగ్ ఉంది, సాయంత్రం ఆడదాం" అని కాస్త నొక్కి చెప్పాను

"నో ఇప్పులే ఆడాలి" అని పెంకిగా చెయ్యి లాగాడు, ఆ అదురుకి మౌస్, లాప్టాప్ కింద పడ్డాయి. ఇక నా కోపం అదుపుతప్పింది.

"గెట్ అవుట్" అని గట్టిగా అరిచాను.

వాడు ఏడ్చుకుంటూ వాళ్ళ అమ్మ దగ్గరకి వెళ్ళిపోయాడు. ఆ ఏడుపు వినగానే పని మత్తు దిగిపోయింది. చాలా తప్పు చేసాననిపించింది. రెండు వారాలకోసారి ఇంటికి వస్తాను, రోజున్నర ఇంట్లో ఉంటాను, నన్ను ప్రతి నిముషం మిస్సవుతాడు కాబట్టి నాతో గడుపుదామని అనుకుంటాడు, నేనేమో ఇలా...?

అప్పుడే రూమ్లోకి అడుగుపెట్టిన రాధిక "మీరు చాలా మూడీగా అయిపోయారు" అంది

"రాధీ! ఐ యాం రియల్లీ సారీ, ఈ ప్రాజెక్ట్ నా పర్సనాలిటీ మార్చేస్తోంది. ప్లీస్ ఒక్కసారి చందుని పిలువు" అన్నాను.

"వాడి విషయం పట్టించుకోకండి, కార్టూన్ ఛానెల్ పెడితే నిముషంలో మర్చిపోతాడు" అంది రాధిక

"షెడ్యూల్, బడ్జెట్లు చాలా టైట్గా ఉన్నాయి, డైరెక్టర్కి గంట, గంటకి స్టేటస్ చెప్పాలి. వీటికి సాయం మేరీ అనే సిస్టం ఆర్కిటెక్ట్ పెద్ద న్యూసెన్స్ గా మారింది, అస్సలు కమ్యూనికేట్ చెయ్యదు.... మాట్లాడదామంటే మనిషి కనపడదు. మొన్న ఉన్న పళాన రెండు రోజులు మాయమయ్యింది. అస్సలు టైం లేదురా దేవుడా అంటే ఆవిడని కంటికి రెప్పలా కనిపెట్టుకుని పని చేయించుకోవాలి, ఇవన్నీ తెలుసుకుని జాక్ ఆవిడని ఫైర్ చెయ్యమంటాడు"

"మీరు బాగా నలిగిపోతున్నారు, జాక్ చెప్పినట్టు చెయ్యొచ్చు కదా"

"ఆయనకేం.... ఏదైనా చెప్తాడు, ఇప్పుడున్న షెడ్యూల్కి కొత్త కన్సల్టెంట్ని తీసుకునేంత అవకాశం లేదు. ఆ మారుమూల ఊరికి నాలాంటి తల మాసినవాడు తప్ప ఎవ్వడూ రాడు.. అందుకే భరిస్తున్నాను" అన్నాను.

★★★★★★★★★★

రోజు మొదలయ్యాకా జాక్ నా క్యూబ్ చుట్టూ ఐదు ప్రదక్షిణాలు చేసాడు. వచ్చిన ప్రతీ సారి మైగ్రేషన్ షెడ్యూల్ రెడీనా... రెడీనా? అని అడిగి వెళ్ళాడు. ఇంకో పది సార్లు అడిగినా నా దగ్గర జవాబు లేదు. వీకెండ్ లోపు షెడ్యూల్ పంపుతానని చెప్పి వెళ్ళిన మేరీ ఇచ్చిన మాట నిలుపుకోలేదు, పొద్దున్న ఏడింటికి రావలసిన మనిషి మధ్యాహ్నం రెండయినా అడ్రస్ లేదు.

"ఇంకో గంటలో స్టీరింగ్ కమిటీ మీటింగ్. మైగ్రేషన్ వివరాలు లేకుండా వెళితే, ఎప్పుడేమి చేస్తారో తెలియకుండా ప్రాజెక్టుని భలే మిస్టీరియస్గా మేనేజ్ చేస్తున్నామని గ్రిల్ చేస్తారు. అసలే గో, నోగో అని నిర్ణయించే లీడర్షిప్ మీటింగ్....వుయ్ నీడ్ దట్ డామ్ డాక్యుమెంట్....!" అని అరిచినంత పని చేసి వెళ్ళాడు జాక్.

ప్రాజెక్ట్ నోగో అని నిర్ణయిస్తే నా కష్టమంతా ఆవిరయిపోతుంది. అసలు తప్పంతా నాదే, మేరీని తీసెయ్యమని జాక్ ఎన్నో సార్లు చెప్పాడు, నేనే చేతకాని వాడిలా నాన్చాను. నా మూలంగా నేను కూరుకుపోతున్నాను. మానేజ్మెంట్ అనుభవం, అద్భుతమైన రెఫరెన్సులు....ఇంటి పక్క ఉద్యోగం అన్నీ పేక మేడల్లా కుప్ప కూలిపోతున్నాయి.

నా కోపం అదుపు తప్పింది, రేపు ప్రాజెక్ట్ ఉంటుందా, ఊడుతుందా అనేది ఇక అనవసరం, ఆ రోజు హోదాలో మేరీకి మెయిలు చెయ్యడం మొదలుపెట్టాను – "మైగ్రేషన్ షెడ్యూల్ కోసం మిమ్మల్ని చేరడానికి శత విధాల ప్రయత్నం చేసాను. నా ఫోనుకి, ఈమెయిలుకి జవాబు లేదు. మీ నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రాజెక్ట్ పెద్ద రిస్కులో పడింది. ఈ నేపథ్యంతో మిమ్మల్ని తీసివేయాలని మేనేజ్మెంట్ నిర్ణయించుకుంది" వాక్యాలు రెండు, మూడు సార్లు తృప్తిగా చదువుకున్నాను. పంపే ముందు చివరిసారి తప్పులు సరి చూసుకుంటుంటే చాట్ మేసేజ్లర్లో మేరీ ప్రత్యక్షమయ్యింది.

గొంతు చించుకుని అరవాలనిపించింది, అయినా సహనం నటిస్తూ "హై మేరీ" అని పలుకరించాను

"శశాంక్! ఐ యామ్ సారీ, ఈ రోజు...ఐ మీన్ ఇక సాస్కటూన్ రావడం వీలుపడదు"

"థాంక్స్! కనీసం ఇప్పుడైనా చెప్పారు, కారణం తెలుసుకోవచ్చా?" అని వ్యంగ్యంగా అడిగాను.

"రాత్రి జాన్.. నా హస్బెండ్ హాస్పిటలైజ్ అయ్యారు"

"అయ్యో! హోప్ హి ఇస్ ఫైన్ నౌ?" అని పొడిపొడిగా అడిగాను.

"అదే మాట మా పిల్లలు అడుగుతున్నారు, నా దగ్గర జవాబు లేదు"

అర్థం కాక "ఎందుకు?" అని అడిగాను.

"జాన్ కాన్సర్ ఫైనల్ స్టేజెస్లో ఉన్నారు"

అవి మాటలయితే మరో మారు అడిగేవాడిని కాని అవి అక్షరాలు, స్పష్టమైన అక్షరాలు, ఎన్ని సార్లు చదివినా మారని అక్షరాలు. ఆ క్షణం వాస్తవం పొరలు, పొరలుగా విడిపోతూ ఒక దృశ్యం కళ్ళ ముందు నిలిపింది. చిక్కి శల్యమైన భర్త, బాధని దిగమింగుకుని పిల్లలని ఓదారుస్తున్న భార్య.. నేను ఊహించని దృశ్యం. అంత వరకు ప్రాజెక్ట్ చుట్టూ తిరిగిన గాజు ప్రపంచం ముక్కలు, ముక్కలుగా పగిలి కళ్ళు చెమ్మగిల్లాయి.

"వీకెండ్ మైగ్రేషన్ షెడ్యూల్ పంపాలనుకుని ప్రయత్నించాను కానీ వీలు పడలేదు, ఇప్పుడే మీకు మెయిల్ చేసాను" అంది మేరీ.

అనంతమైన విషాదాన్ని గుండెకి అదుముకుని, అలుముకున్న చీకట్లలో ఎలా నడుస్తున్నావని... టైపు చెయ్యాలని ఉంది, కానీ వణికే వేళ్ళు సహకరించలేదు. మేరీ పట్ల నా అసహనం, హెచ్చరింపులు, వ్యంగ్యం అప్పటికే నన్నో నలుసుని చేసాయి.

"శశాంక్...పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా హెల్త్ ఇన్సురెన్స్ కోసం ప్రాజెక్ట్ తీసుకోక తప్పలేదు. రోజూ ఫోన్లో పిల్లలకి, భర్తకి ధైర్యం చెప్పాల్సి వచ్చేది, మనసు బాగోలేక సక్రమంగా కమ్యూనికేట్ చెయ్యలేకపోయేదాన్ని"

ఏదో చెప్పాలని మేరీ ఎన్నో సార్లు ప్రయత్నించింది, నేను అవకాశం ఇవ్వలేదు. అయినా నడిచే పనిముట్లతో మాటలేమిటి? నా లోకంలో అంతా వేగంగా, యాంత్రికంగా, లక్ష్యం వైపు చేరిపోవాలి. వృత్తిపరంగా అదేం తప్పు కాదు. నా ఆలోచనలు రెండు భాగాలుగా విడిపోయాయి.

"....ఎన్ని ఇబ్బందులు పడ్డా మీరు నా పట్ల చాలా ఓర్పుగా ఉన్నారు, ఐ యామ్ గ్రేట్ఫుల్ టు యు"

"నేను ఓర్పుగా లేను.. భరించాను..నమ్మిన విలువలని స్వార్థం కోసం తిరగరాసుకున్నాను. తోటి మనిషిని అవసరపు అంచుల్లోంచి తప్ప రక్త, మాంసాలతో చూడనివ్వని వినియోగదారుల వ్యవస్థ, ఆ వ్యవస్థకి కేంద్ర బిందువుగా మారాను" అని చెప్పాలనుకున్నాను.

"ఏమైనా ప్రాజెక్టు ఇన్ఫర్మేషన్ కావలిస్తే చెప్పండి, వీలు చూసుకుని పంపుతాను" అంది.

"మేరీ! ఇంత ఒడిదుడుకుల్లో ఉన్నారని తెలియక మీ పై చాలా వత్తిడి పెట్టాను, ఐ యాం సారీ. మీ సమయం ఈ ప్రాజెక్ట్ కంటే ఎన్నో రెట్లు విలువైనది..ప్లీస్ టేక్ కేర్ అఫ్ యువర్ ఫామిలీ" అని భారమైన మనసుతో ముగించాను.

మైగ్రేషన్ డాక్యుమెంట్లు ప్రింట్ అవుట్లు తీసి డైరెక్టర్ టేబుల్ పైన పెట్టాను, వాటిని చేతిలోకి తీసుకుని నాకేసి ప్రశ్నార్థకంగా చూసాడు.

"జాక్! దిస్ ఇస్ మై ఫైనల్ డెలివెరబుల్, బై ది వే పీపుల్ ఆర్ మోర్ దెన్ రిసోర్సెస్" అని చెప్పి నా సామాన్లతో ఆఫీసు బయటకి నడిచాను. జాక్ అంటున్న మాటలు లీలగా చెవిని తాకుతున్నాయి కానీ పట్టించుకునే అవసరం నాకు లేదు.

ఇనుప తెరల వెనుక దాగుడు మూతలు నాకు సరిపడవు, పనిని రాబట్టే యంత్రంలా కాదు మనిషిగా మిగలాలని ఉంది, అందుకే నడుస్తున్నాను, నా దారి నేనే సృష్టించుకుందుకు నడుస్తున్నాను...ఎదురుగా ఎయిర్పోర్ట్ మొదటిసారి ఆహ్వానిస్తూ కనపడింది.

★★★★★★★★★




# శ్లాప్ వసుంధర

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

*ఈ ప్రపంచంలో ఎందరో మహానుభావులు. వారిలో కొందరికి గుర్తింపు వస్తుంది. కొందరికి రాదు.*

***ఇంచుమించు ప్రతి మనిషికీ తానొక మహానుభావుడన్న భావన ఉంటుంది. ఆమేరకు తనకు గుర్తింపు రాలేదన్న అసంతృప్తి ఉంటుంది. గుర్తింపుకోసం తాపత్రయం ఉంటుంది. ఆ తాపత్రయం ఒకొక్కరిలో ఒకోవిధంగా బయటపడుతుంది. అయినవాళ్లు దాన్ని అర్థం చేసుకుంటే అదో తృప్తి. కానీ చాలామందికి కన్నతల్లి విషయంలోనే ఆ అవగాహన ఉండదు.*** ఎవరి సంగతో ఎందుకు – నేనే ఉన్నాను!

ముప్పై ఏళ్లకు పైనాటి మాట....

కట్నం పదివేలు. పెళ్లిఖర్చులు మరో పన్నెండువేలు. మా ఊళ్లో మా పెంకుటింటి మండువా ఇంట్లో నా మూడో చెల్లెలి పెళ్లి జయప్రదంగా జరిపించి – దాన్ని అత్తారింటికి సాగనంపాను.

బంధుమిత్రులు, గ్రామస్థులు నన్నూ నా భార్యనీ పొగడ్తలతో ముంచెత్తారు – బాధ్యతలు తీసుకున్నందుకూ, బాగా నిర్వహిస్తున్నందుకూ.

ఇంటికి పెద్దకొడుకుని. నా తర్వాత ఐదుగురు చెల్లెళ్లు. ఓ తమ్ముడు. ఇప్పుడే మూడో చెల్లి పెళ్లయింది. తీర్చాల్సిన అప్పు పన్నెండు వేలుందని లెక్క తేలింది. ఇంకా ఇద్దరు చెల్లెళ్ల పెళ్లిళ్లు చెయ్యాలి. తమ్ముణ్ణి చదివించాలి. మనసులో బాధ్యతల బరువు లెక్క వేసుకుంటున్నాను. అంతలో అమ్మ వచ్చింది.

"ఊరంతా నా అదృష్టమే అదృష్టమంటున్నారురా – పెళ్లి బాగా జరిపించావు" అంది అమ్మ.

అమ్మ నోటినుంచి చిన్న పొగడ్త వస్తే నా మనసు పొంగిపోతుంది. అమ్మంటే నాకు చాలా ఇష్టం.

"ఏంచేసినా నీ దీవెనల బలంతోనే అమ్మా!" అన్నాను ఉత్సాహంగా.

"అన్నీ బాగా జరిపించావు. మరి ఇంటిమీద శ్లాప్ ఎప్పుడు వేయిస్తావురా?" అంది అమ్మ.

శ్లాప్ అన్న మాట ఛెళ్లున తగిలింది నాకు.

అమ్మ ఉద్దేశ్యంలో శ్లాప్ అంటే శ్లాబ్. మా పాత పెంకుటింటి మండువా ఇంటిని – శ్లాబ్ వేయించి డాబా ఇంటిగా మార్చాలని తన కోరిక.

ఎలాగో తమాయించుకుని, "డబ్బు చూసుకోవాలి కదమ్మా!" అన్నాను.

"ఏం చేసినా నా దీవెనల బలంతోనే అన్నావుగా. మళ్లీ డబ్బు మాటెందుకు?" అంది అమ్మ.

అమ్మకి హాస్యస్ఫూర్తి ఉంది. సమయస్ఫూర్తి ఉంది. చిన్నప్పుడా స్ఫూర్తులు నన్నలరించేవి. కానీ ఇప్పుడన్న మాటలో హాస్యాన్ని వ్యంగ్యం కబళించేసింది. ఇంటిమీద శ్లాబ్ వేయించడానికి నా సమస్య డబ్బు కాదనీ, నేను తన కోరికను పట్టించుకోవడం లేదనీ అమ్మ అనుకుంటోందని నాకు తెలుసు.

"ఏదో మాటవరసకి అంటాం కానీ, దీవెనలు కూడు పెడతాయా, డబ్బులిస్తాయా?" అందామనుకున్నాను. కానీ ఆ విషయం అమ్మకి తెలియదా?

బాధగా అమ్మవైపు చూస్తే – ఆమె కళ్లలో శ్లాబ్‌పట్ల కోరిక ఒకటే కనబడింది.

"అమ్మ ఎంత మారిపోయింది?" అనుకున్నాను.

అమ్మంటే తప్పటడుగులు వేసే నా చేయి పట్టుకున్న వేలు. భయమేస్తే నా ముఖాన్ని దాచిన చీర చెరగు. ఆకలేస్తే నా నోటిని బువ్వతో నింపిన అమృతహస్తం.

అమ్మంటే నన్ను మైమరపించే కథ. నాకు మత్తెకించే జోలపాట.

అమ్మ నాకు అక్షరాలు దిద్దించిన తొలిగురువు. పద్యాలు, ఎక్కాలు బట్టీ పట్టించిన శిక్షకురాలు. అమ్మ నా భవిష్యత్తుకి బంగారు బాట వేసిన శ్రామికశక్తి.

అమ్మ నాకు వరాలిచ్చే దేవత. తన జీవితాన్ని కుటుంబానికి అంకితం చేసిన నిస్వార్థ వనిత.

ఈ రోజున పన్నెండు వేల అప్పు, ఇంకా మిగిలిన గురుతర బాధ్యతలతో సతమతమౌతున్న నన్ను చూసి, "వెర్రి నాయనా! ఈ బరువంతా ఎప్పటికి దిగుతుందిరా నీ నెత్తిమీంచి!" అని జాలి పడుతుందనుకున్నాను. ఆ ఒక్క మాట తనంటే, నిజంగానే నాకు సగం బరువు దిగిపోతుంది కూడా. కానీ –

"అన్నీ బాగా జరిపించావు. మరి ఇంటిమీద శ్లాప్ ఎప్పుడు వేయిస్తావురా?" అనడిగింది అమ్మ.

అడిగింది వేరెవరైనా ఐతే – అప్రయత్నంగా శ్లాప్ చేసేవాణ్ణేమో ఆ పరిస్థితుల్లో – కానీ అడిగింది అమ్మ!

అమ్మ నాకు శత్రువు కాదు. దర్శనమాత్రాన నాలో అలౌకికానందాన్ని నింపే దేవతాస్వరూపం ఆమె.

తన మాట విని నేను శ్లాబ్ వేయించడం గురించి ఆలోచిస్తున్నానని అనుకుందో ఏమో – "నీ ఇబ్బందులు నాకూ తెలుసురా! శ్లాప్ వేయించావంటే అద్దె పెంచుతాను. మొత్తం నెలకి వంద రూపాయలొస్తుంది. అది నీకే ఇచ్చేస్తానులే" అంది అమ్మ.

ఏడవాలో నవ్వాలో తెలియలేదు నాకు.

మాది పది గదుల పెద్ద ఇల్లు. శ్లాబ్ వేయించే ముందు ఇంట్లో కూడా కొన్ని మార్పులు చెయ్యాలి. అన్నింటికీ కలిపి లక్ష పైనే ఔతుంది. ఆ లక్షా పోస్టాఫీసులో వేస్తే నెలకి వెయ్యి రూపాయల వడ్డీ వస్తుంది. అమ్మ వంద రూపాయలు నాకు తాయిలం అనుకుంటోంది.

అమ్మముందు ఇలాంటి తర్కంవల్ల ప్రయోజనముండదని తెలుసు. ఐనా ఉక్రోషమో, చాదస్తమో – వివరాలు చెప్పబోయాను. అమ్మ వినలేదు. "ఈ ఇంట్లో నా మాటెప్పుడు సాగింది కనుక! అప్పుడాయన. ఇప్పుడు మీరు. ఒకళ్లకీ నా మాటంటే గడ్డిపోచ విలువ లేదు. కొన్ని జీవితాలంతే" అని కోపంగా అక్కణ్ణించి వెళ్లిపోయింది.

కోపం నాకూ రావాల్సిందే – అమ్మ గతం తెలియకపోతే!

అమ్మకి చదువుకోవాలని మనసు. తను చాలా తెలివైనది కూడా. ఎలాంటి విషయాన్నీ ఇట్టే అవగాహన చేసుకునేది. కానీ పెద్దలు ఆమెకి ఏడో ఏటే పెళ్లి చేసేశారు. ఆడుకునే ఆ వయసులో ఇష్టమున్నా లేకపోయినా పెద్ద ముత్తయిదువలా ఏటా పూజలు, నోములు, వ్రతాలు. పద్నాలుగోఏట అత్తింట అడుగుపెట్టింది. కోడలిగా ఇంటి బాధ్యతలు అంటుకున్నాయి. బాధ్యతలంటే చెప్పి చేయించడం కాదు – చెప్పింది చెయ్యడం! కొన్నేళ్లు అత్తమామలు చెప్పిందీ, ఆతర్వాత మొగుడు చెప్పిందీ...

నాకు తెలిసి అమ్మ ఒక్కసారి కూడా షాపుకెళ్లి చీర కొనుక్కోలేదు. ఎవరో పెట్టినవో, కొనితెచ్చినవో తీసుకుని సరిపెట్టుకోవడమే. అందుకని పెద్దయ్యాక నేను తనకి ఆ సరదాలు తీర్చాలనుకున్నాను. కానీ నాకా అవకాశమేదీ? ఉద్యోగంలో చేరేసరికే నాకు పెళ్లీడు చెల్లెళ్లు, చదువీడు తమ్ముడు, చేతులెత్తేసిన నాన్న!

అప్పటికీ నా మనసు తెగ పీకుతుంటే, అమ్మని చీరల షాపుకి రమ్మని బలవంత పెట్టానొకసారి!

"ఈ వయసులో నాకు షాపింగేమిట్రా? అంతగా నాకోసం ఏమైనా చెయ్యాలనుంటే మనింటిమీద శ్లాప్ వేయించు" అంది అమ్మ.

అలా మొదలైంది ఈ శ్లాబ్ వ్యవహారం.

అప్పుడు నాకు కోపం రాలేదు. ఎలాగో అలా అమ్మ కోరిక తీర్చాలని మనస్ఫూర్తిగా అనుకున్నాను.

అమ్మకీ ఆ ఇంటికీ ఉన్న అనుబంధం నాకు బాగా తెలుసు.

ఏడేళ్ల పెళ్లికూతురిగా మొదటిసారి ఆ ఇంటిని చూసినప్పుడు – స్నేహితురాళ్లతో ఆడుకుందుకు బాగుంటుందని సంబరపడిందిట. పద్నాలుగేళ్ల వయసులో ఆ ఇంటికి కాపురానికి వచ్చినప్పుడు – ఎప్పటికీ ఆ ఇంట్లోనే ఉండిపోవాలనుకుందిట. ఆ సంకల్పబలమో ఏమో – మరో నాలుగేళ్లలో నాన్నకి ఆ ఊళ్లోనే టీచరు ఉద్యోగం వచ్చింది. అప్పట్నించీ అమ్మకి ఆ ఇల్లే కాదు, ఆ ఊరు కూడా తన తనదయిందిట.

కొన్ని దశాబ్దాలక్రితం తాతగారు పొట్ట చేతపట్టుకుని ఆ ఊరికొచ్చారుట. తెలివికి స్వయంకృషి తోడై ఊరికి పెద్ద కామందు అయ్యారుట. అమ్మకి ఆ ఇంటితో ఏర్పడ్డ అనుబంధం అర్థం చేసుకున్నారో ఏమో – తాతగారు తన తదనంతరం పొలాలు ఒక్కగానొక్క కొడుక్కీ, ఇల్లు కోడలికీ చెందేలా వీలునామా వ్రాశారు.

అమ్మకి పాతికేళ్లొచ్చేసరికి అత్తమామలిద్దరూ పోయారు. అప్పట్నించీ తనే ఆ ఇంటి యజమాని.

ఆ ఇల్లు తనదని అమ్మకి గర్వంగా ఉండేది. ఇల్లు పెద్దది. అందులో రెండు వాటాలు వేరు చేసి అద్దెకిచ్చింది. నాన్న ఊరికే ఇమ్మన్నాడు కానీ, "ఈ ఇల్లు నాది. ఎవరికిచ్చుకుంటానో, ఎలా ఇచ్చుకుంటానో నా ఇష్టం. నా ఇంట్లో ఉంటున్నారని మిమ్మల్నేం అద్దె అడగడంలేదు. సంతోషించండి" అంది అమ్మ గర్వంగా.

వసూలైన ఇంటద్దెకోసం అమ్మ ఊళ్లో పోస్టాఫీసులో సేవింగ్స్ అకౌంట్ కూడా ఓపెన్ చేసుకుంది.

మా ఇంటి పెరట్లో మామిడి, సపోటా, పనస, కొబ్బరి, అరటి, నిమ్మ చెట్లున్నాయి. కూరల పాదులున్నాయి. కరివేప చెట్టు కూడా ఉంది. నాన్నయితే – పళ్లు, కూరలు. ఆకులు పంచిపెట్టాలనేవాడు కానీ, "ఈ ఇల్లు నాది. ఈ ఇంటి పెరటి పంటపై మీ పెత్తనమేమిటి?" అని ఆయన మాట కొట్టిపారేసేది అమ్మ.

నాన్నకి కోపమెక్కువే. కానీ అలాంటప్పుడు మాత్రం అమ్మని చూసి ముచ్చట పడేవాడుట. అమ్మ పెరటి ఫలసాయాన్ని కూడా పోస్టాఫీసులో దాచుకునేది.

ఏం దాచుకున్నా అమ్మ డబ్బెప్పుడూ తనకోసం ఖర్చు పెట్టుకోలేదు. మా ఫీజులకి, పుస్తకాలకి, బట్టలకి తరచుగా తనే డబ్బిచ్చి ఆ విషయం గర్వంగా చెప్పుకునేది. 'పోనీలే, వేణ్ణీళ్లకి చన్నీళ్లుగా ఉపయోగపడుతోందని' ఎవరైనా అంటే ఒప్పుకునేది కాదు. "డబ్బుని మంచినీళ్లలా

ఖర్చుపెట్టే ఆయన దగ్గిర వేణ్ణీళ్లూ ఆగవు, చన్నీళ్లూ ఆగవు. ఇల్లు గడుస్తోందంటే – ఈ ఇంటిమీది ఆదాయంతోనే. ఆయన జీతం ఆయనకే చాలదు'' అనేది.

నాన్నకి సంబంధించి అమ్మ మాటల్లో కొంత నిజం లేకపోలేదు.

నాన్న బడిలో మంచి టీచరు. ఊళ్లో గొప్ప సోషల్‌వర్కరు. ఇల్లు మాత్రం పట్టేది కాదు.

యాభై ఎకరాల ఆసామీ ఆయన. కానీ వ్యవసాయం పట్ల ఆసక్తిలేక మొత్తం అమరకానికి ఇచ్చేశాడు.

దేనికీ ఎవర్నీ నొక్కించడం తెలియదు. అందర్నీ అన్నింటికీ నమ్మేస్తాడు. అవసరంలో ఉన్నవారిని ఆదుకుందుకు వెనకాముందూ ఆలోచించడు. అవసరానికి చేయి చాచాలంటే పౌరుషం. ఆపైన పదిహేనేళ్లలో పదిమంది పిల్లలు. అందులో ముగ్గురు చనిపోగా మిగిలినది ఏడుగురు. ఆదాయంకంటే వ్యయమే ఎక్కువుంటే ఆశ్చర్యమా?

ఆస్తి ఉన్నా నిర్వహణా సామర్థ్యం లేదు. తెలివి ఉన్నా లౌక్యం లేదు. పెద్ద కుటుంబం. మంచి మనసు. ఊరు, బడి పట్టినంతగా ఇల్లు పట్టదు. పొలంమీద రాబడితో కాక, పొలం అమ్ముకుని ఇల్లు నడపాలనే తత్వం. ఆస్తి కరిగిపోదూ?

నాకు పదహారేళ్లు వచ్చేసరికి నాన్నగారికి సెంటు భూమి లేదు. ఇల్లు కూడా అమ్మేసేవారే – అమ్మ ఒప్పుకోలేదు. పొలమమ్మినా, నగలమ్మినా కిమ్మనని అమ్మ ఇంటి విషయం వచ్చేసరికి రచ్చ చేసి తన మాట నెగ్గించుకునేది.

పదహారేళ్లకి నేను పియుసి ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యాను. పై చదువులు తనవల్లకాదని నాన్న చేతులెత్తేశాడు.

ఇంటికి పెద్దకొడుకుని. ఐదుగురు చెల్లెళ్లకీ, ఓ తమ్ముడికీ – తండ్రి తర్వాత తండ్రి అంతటివాణ్ణి. నాన్న ఎలాంటివాడో తెలిసిన అమ్మ ఆశలన్నీ నామీదే పెట్టుకుంది. నేను పై చదువులకు వెళ్లాలని తన పట్టుదల.

నాన్న చేతులెత్తేశాడని అమ్మ ఊరుకోలేదు. పెద్దమామయ్య – అంటే తన అన్న విశ్వనాథాన్ని కదిపింది.

మామయ్య నాన్నకంటే ఓ ఏడాది పెద్ద. ఆ పెద్దరికంతోనూ, బావ అన్న చనువుతోనూ – ఆయన చాలామార్లు ఇంటి బాధ్యతల విషయంలో నాన్నని హెచ్చరించాడు.

అయితే పెళ్లాం తరఫువారిని తక్కువ చేసే సంప్రదాయానికి వారసుడు నాన్న. సాధారణంగా సౌమ్యంగా ఉండే ఆయన, మామయ్యతో పరుషంగా వ్యవహరించేవాడు. మామయ్యకూడా నాన్న దగ్గిర కాస్త తగ్గి ఉండేవాడు.

నాన్న పెళ్లినాటికి పెద్దమామయ్యకి పదెకరాల పొలముండేది. తను పట్నంలో ఉంటూ, పల్లెటూళ్లో వ్యవసాయం చేసేవాడు. అటు పట్నంలో చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ క్రమంగా ఊళ్లో పదెకరాల్నీ ఇరవై ఎకరాలు చేశాడు. అదీ ఆయన సామర్థ్యమని – అమ్మ నాన్నకి ఆదర్శంగా చెప్పేది. నాన్న ఆయన్ని దోపిడీదారని నిరసించేవాడు.

అమ్మ మాటమీద మామయ్య నన్ను చదివిస్తానన్నాడు. నాన్న పౌరుషపడితే, ''మా అన్నయ్య మనవాడిమీద ఎంత ఖర్చుపెట్టాడో, అంతా అణాపైసలతో లెక్క రాస్తాడు. చదువయ్యేక, వాడే ఆ బాకీ తీర్చుకుంటాడు. లేదూ – నా ఇల్లు తనఖాపెట్టి తీర్చేద్దాం'' అని సద్దిచెప్పింది అమ్మ.

అన్నింటికీ మనం మనం అనే అమ్మ – ఇంటి విషయానికొస్తే నేను, నాది అంటుంది. అందుకు కారణం – మనది అన్నదేదీ నాన్న మనకు మిగలనివ్వడన్న భయం కూడా కావచ్చు.

నాన్న కాస్త దిగి వచ్చి, ''వీడు చదువుకోవడం నాకూ ఇష్టమే. బాగా చదివి పెద్ద ఉద్యోగంలో చేరి – చెల్లెళ్ల పెళ్లిళ్ల దగ్గిర్నించి ఇంటి బాధ్యతలన్నీ వాడే తీసుకోవాలని నాకూ ఆశగా ఉంది. ఐతే ముందే చెబుతున్నాను. మీ అన్నయ్య ఏంచేసినా కొంత దూరాలోచనా,

దురాలోచనా ఉంటాయి. తన కూతుర్నీ ఇంటికోడల్ని చెయ్యాలన్న ప్లాన్లో ఉన్నాడేమో – మేనరికానికి నేను ససేమిరా అని ముందే చెప్పేసేయ్" అని ఓ మెలిక పెట్టాడు.

మామయ్యకి ముగ్గురు కూతుళ్లు. ఒక్కడే కొడుకు. పెద్దపిల్ల లక్ష్మిని నాకివ్వాలన్న ఉద్దేశ్యం ఆయనకి లేకపోలేదు. కానీ ఏ మాట ఎప్పుడనాలో, ఎప్పుడనకూడదో తెలిసిన లౌక్యుడాయన. అన్నింటికీ తలూపి నన్ను తనతో పట్నం తీసుకెళ్లాడు.

వాళ్లింట్లోనే ఉంటూ బీయస్సీ, ఎమ్మెస్సీ చదివాను. ఆ ఇంట్లో ఉండగా ప్రతి క్షణం అమ్మని తల్చుకునేవాణ్ణి.

మా ఇంట్లో అమ్మ నన్ను రాజాలా చూసేది. నేనూ రాజాలాగే ఫీలవుతూ అంతా నన్నలాగే చూస్తారనుకునేవాణ్ణి.

మామయ్యింట్లో నా రాక అత్తయ్యకి ఇష్టంలేదు. మా కుటుంబమంటే ఆమెకి చిన్నచూపు. నన్నామె మేనల్లుడిలా కాక పరాయివాడిలా చూసేది. మామయ్యకు తెలియకుండా నాకు పనులు చెప్పేది. నన్ను మాటలనేది. నేను రాజాని కాదనీ, డబ్బు లేక వాళ్ల పంచన చేరాననీ తరచుగా నాకు అనిపించేలా ప్రవర్తించేది. మొదట్లో ఆమె మహా దుర్మార్గురాలని ద్వేషించే◌ాణ్ణి – కానీ రవి మాటలు నన్ను మార్చాయి.

రవి నా క్లాస్‌మేట్. పదేళ్ల వయసులో తల్లి చనిపోతే తండ్రి మళ్లీ పెళ్లి చేసుకున్నాడుట. అంతవరకూ రాజాలా బ్రతికిన రవి జీవితం అప్పట్నించీ దౌర్భాగ్యమైపోయిందిట. "అమ్మ ఉంటే ఎవరైనా, ఎక్కడున్నా రాజాయే. అమ్మ లేనివాడు ఎవరైనా ఎక్కడున్నా దౌర్భాగ్యుడే" అన్నాడు రవి.

రవి ఆ మాట చెప్పేక అత్తయ్యను గమనిస్తే – ఆమె నాకు మాత్రమే చెడ్డదనీ, తన పిల్లల్ని ఆమె రాజాల్లాగే చూసుకుంటోందనీ గ్రహించాను. అప్పట్నించీ నేనామెను ద్వేషించడం మాని ఆమెలోని అమ్మని గౌరవించడం నేర్చుకున్నాను.

నాకోసం తన పిల్లలు కొన్ని సదుపాయాలు త్యాగం చెయ్యాల్సివస్తుందని భయం. నాబోటి దౌర్భాగ్యుడికిస్తే లక్ష్మి భవిష్యత్తు ఏమౌతుందోనని భయం. తను కాదన్నా లెక్కచెయ్యక మామయ్య మా ఇద్దరికీ పెళ్లి జరిపించేస్తాడని భయం. అత్తయ్యలోని అమ్మలో ఇన్ని భయాలు!

ఆమె తన పిల్లలకి పప్పు, కూరలు ఎక్కువపెట్టి నాకు ఊరగాయలు ఎక్కువేసేది. వాళ్లకి గడ్డపెరుగు పోసి నాకు నీళ్లమజ్జిగ పోసేది. పదార్థాలు వాళ్లకి తాజావి, నాకు నిలవవి వడ్డించేది. అన్నింటా వాళ్లని పొగిడి నన్ను తక్కువ చేసేది.

మామయ్యకివన్నీ తెలియకపోవు. కానీ అన్నింటా కలగజేసుకుంటే రోజూ అత్తయ్యతో గొడవపడాలి. "నీకే సమస్యొచ్చినా నాకు చెప్పు" అని ఆదిలోనే నాకు భరోసా ఇచ్చినా – నేను ఫిర్యాదు చెయ్యకుండా సద్దుకుపోతేనే ఆయనకి సంతోషమని నాకర్థమైంది. అదీకాక తరచుగా, "వీణ్ణి చూసి నేర్చుకోండి. అన్నింటికీ సద్దుకుపోతాడు. దేనికీ ఫిర్యాదు చెయ్యడు" అని తన పిల్లలకి నన్ను ఆదర్శంగా చెప్పేవాడు. అది ముందరి కాళ్లకి బంధం.

లక్ష్మికి గొప్ప సంబంధం తేవాలని అత్తయ్య కల. అది నెరవేరాలంటే – తన కుటుంబంపట్ల నా మనసు విరిగిపోవడం ఒక్కటే మార్గం. అందుకే నన్ను కించపరుస్తోందని నాకు అర్థమైంది.

అమ్మ నా మేలు కోరి నా చదువు భారం స్వీకరించడానికి తన అన్నయ్యని ఒప్పించింది. అత్తయ్య తన కూతురి మేలు కోరి నేనా ఇంటికి విముఖుడినయ్యేలా ప్రవర్తిస్తోంది.

ఆడదానిలోని అమ్మని అర్థం చేసుకోగలిగితే – నస్త్రీ ద్వేషానికర్హతి.

అత్తయ్య ఎలాగున్నా – నేను, మామయ్య పిల్లలు స్నేహంగా ఉండేవాళ్లం. లక్ష్మితో ఐతే ఆ స్నేహం ఇంకా ఎక్కువ. పెద్దల తీరుని విశ్లేషించడంలో ఇద్దరి భావాలూ ఒకేలా ఉండేవి. మాకు తెలియకుండానే క్రమంగా పరస్పరం ప్రేమలో పడ్డాం. అత్తయ్య సంగతి తెలుసు కాబట్టి మా అనుబంధాన్ని రహస్యంగానే ఉంచాం.

లక్ష్మికి మా ఇంటి పరిస్థితులు క్షుణ్ణంగా తెలుసు. పెళ్లయ్యాక మా ఇంటి బాధ్యతల్ని నాతో సమంగా స్వీకరించడానికి తనూ మానసికంగా సిద్ధపడి ఉంది.

ఎమ్మెస్సీ ప్యాసవగానే మా ఊరికి పది కిలోమీటర్ల దూరంలోని కాలేజిలో లెక్చరర్ ఉద్యోగమొచ్చింది నాకు.

"ఈ ఇల్లే నిన్ను చదివించింది. ఉద్యోగానికీ ఈ ఇంట్లోంచే వెడుతున్నావు. అదృష్టమంటే నీదిరా" అని మురిసేది అమ్మ. నాకు పెళ్లిసంబంధాల జోరు హెచ్చి, మగపిల్లాడి తండ్రిగా తన హోదా పెరిగిందని నాన్నా మురిసాడు కానీ అది మూణ్ణాళ్ల ముచ్చటే!

మామయ్య లౌక్యం, అమ్మ పట్టుదల, నాకూ లక్ష్మికీ ఏర్పడిన అనుబంధం – నా పెళ్లి లక్ష్మితో స్థిరపరిచాయి.

అనుకున్నంతా జరిగిందని – నాన్న భగ్గుమన్నాడు, అత్తయ్య భోరుమంది.

అప్పటికి మామయ్య నా చదువు బాధ్యతతోపాటు, నా పెద్ద చెల్లెలి పెళ్లికి కూడా కొంత డబ్బిచ్చి ఆదుకున్నాడు. అదంతా కట్నం కింద చెల్లు వేసేశాడు. కానీ –

"మనవాడికి లక్షల్లో కట్నమొస్తుంది. మీ అన్నయ్య ఈ సంబంధం చవగ్గా కొట్టేశాడు" అని నాన్న భగ్గు.

"పూటకి గతిలేనివాళ్ల కొంపలో పడేసి నా కూతురి గొంతు కోసేస్తున్నారు" అని అత్తయ్య భోరు.

"అబ్బాయిది కట్నం లేని పెళ్లని చెప్పుకుంటే – అది మనకే మంచిది. వాడికి లక్షలు తీసుకుంటే మీకింకా నలుగురు ఆడపిల్లలున్నారు. ఒకటికి నాలుగౌతుంది" అంటూ అమ్మ నాన్న భగ్గుని చల్లార్చింది.

"పిల్లా పిల్లాడూ ఇష్టపడ్డారు. వాళ్ల పెళ్లి వాళ్లే చేసుకోకుండా మన మర్యాద నిలిపినందుకు సంతోషించాలంతే!" అంటూ మామయ్య అత్తయ్య భోరుని ఓదార్చాడు.

అత్తయ్య భోరులో న్యాయం లేకపోలేదు. విభజన జరిగిన మరుక్షణంనుంచీ ఆంధ్ర, తెలంగాణలకు ఋణమాఫీ భారంలా – పెళ్లైన మరుక్షణంనుంచీ లక్ష్మికి నా తోడబుట్టినవాళ్ల బాధ్యత తనదయింది. నా చెల్లెళ్లు, తమ్ముడు, ఆఖరికి అమ్మకూడా – తమకేం కావాలన్నా నన్ను కాదు, తననే అడిగేవారు. ఆ బాధ్యతా నిర్వహణలో – తనకి కొత్తగా పెళ్లయిందనీ – తనకీ కొన్ని సరదాలు, అవసరాలు ఉంటాయనీ కూడా మర్చిపోయిందామె.

ఆఫీసరుగా ప్రమోషనొచ్చినవాడికి కొత్తగా పెర్సనల్ సెక్రటరీ వస్తే ఎలా ఉంటుంది? అమ్మకి అత్త పోస్టు అలా ఉంది. ఇంటి బాధ్యతలన్నీ లక్ష్మి చూసుకోవడంతో – తనకి పెత్తనాలకీ, పుస్తకపఠనానికీ, రేడియో వినడానికీ వీలు చిక్కింది. ఇంటికెవరొచ్చి అడిగినా లక్ష్మిని పిలిచి ఆ పని అప్పగించేది. తన హోదా చూపిస్తున్నట్లు అనుకునేది కానీ, ఇంటి పెత్తనమంతా చేజారి కోడలి చేతిలోకి వెళ్లిపోతోందని గ్రహించలేదు.

లక్ష్మి కాపురానికొచ్చిన ఏడాదిలో ఇంట్లో అమ్మ ప్రాధాన్యం పూర్తిగా తగ్గిపోయింది. పిల్లలందరికీ వదిన. ఇంటికొచ్చినవారు కూడా అమ్మని మాటవరసకి ఓసారి పలకరించి, వచ్చిన పని నేరుగా లక్ష్మికే చెప్పేవారు.

నిజానికిప్పుడు అమ్మ జీవితం బాగుంది. కానీ ఎవరూ ఆమెని పట్టించుకోరు. పెత్తనంనుంచి లక్ష్మిని తప్పించొచ్చు. కానీ కుటుంబ బాధ్యతల బరువు సామాన్యమా? అట్లాసులాంటి అమ్మకి, లక్ష్మిలో హెర్క్యులిస్ రూపం గోచరించింది. తను చిన్న పొరపాటు చేసినా మళ్లీ ఆ బరువు తన నెత్తిమీదకొస్తుందని భయపడింది.

ఇంటికొచ్చినవాళ్లూరుకోరు కదా! 'కోడలొచ్చేక బాగా సుఖం మరిగావు' అనేవారు కొందరున్నా – 'ఏంటీ, కోడలొచ్చి నిన్ను మూల కూర్చోపెట్టినట్లుందే' అనేవారే ఎక్కువ.

అమ్మకి సమయస్ఫూర్తికదా, "మూల కూర్చుందామనున్నా – అందరు కోడళ్లూ కూర్చోనిస్తారా? నా కోడలైనా అంత సుఖసుఖాల ఒప్పుకుందా? ఈ ఇల్లు దానికే రాసిచ్చేస్తానన్నాను. దాంతో పడిపోయింది" అనేది కొందరితో.

"చేతిలో మీదంటూ పొలమో, పుత్రో ఉంచుకోండి. లేకపోతే వచ్చిన కోడలు తనో మూల కూర్చుని, మిమ్మల్ని ఇంట్లో మూలమూలలూ తిప్పుతుంది" అనేది మరికొందరితో.

"పిల్లలంటే రెక్కలొచ్చి ఎగిరిపోయేవాళ్లే కదా! వాళ్లతో ఎక్కువ అనుబంధం పెంచుకోకూడదు. మనమున్నన్నాళ్లే కాదు, మనం పోయాక కూడా మనకోసం మిగిలేది ఇల్లొక్కటే! రేపు నేను పోయినా దీన్ని కామేశ్వరమ్మ ఇల్లనే అంటారు మరి" అనేది ఇంకా కొందరితో. ఏదిఏమైనా ఇంటి బాధ్యతలు తప్పేక, అమ్మ తన అనుబంధాన్ని ఇంటితో ముడి పెట్టుకుంది. తన ప్రాధాన్యాన్ని ఆ ఇంటిలో చూసుకునేది.

నచ్చినప్పుడు ఎవరుపడితే వాళ్లకి ఇల్లు రాసిస్తాననేది. అలా ఆమె కూరగాయల నందయ్య, మంచినీళ్ల వీరన్న, షాహుకారు సరయ్య వగైరాలు చాలామందికి చెప్పింది. తమ్ముడోసారి అమ్మతో, "అందరికీ మాటిస్తున్నావ్. ఏదోరోజున ఊరంతా వచ్చి ఈ ఇల్లు మాదని గొడవపెట్టి ముందు మననింట్లోంచి తరిమేయగలరు" అన్నాడు.

"నువ్వు మరీ చెబుతావురా. నోటిమాట చెల్లుబడవదు. విల్లు వ్రాయాలి. నువ్వు బుద్ధిగా ఉంటూ నన్ను బాగా చూసుకో. ఈ ఇల్లు నీకే వ్రాస్తాను" అంది అమ్మ.

"ఈ ఇల్లా, నాకా? – ఛీ వద్దుకాక వద్దు" అన్నాడు తమ్ముడు.

"ఏమిట్రా – ఇంద్రభవనంలాంటి ఇల్లొద్దంటావ్. సిరి రా మోకాలొడ్డడం అంటే ఇదే!" అని అమ్మ మందలిస్తే, "కాకిపిల్ల కాకికి ముద్దు. ఈ పాతకాలపు పెంకుటిల్లు నీకు ఇంద్రభవనంమేమో. నాక్కాదు" అన్నాడు తమ్ముడు.

శ్లాబ్ వేసి డాబా ఇల్లుగా మార్చకపోతే – ఆ ఇంటికీ, ఆ ఇంటి యజమానిగా తనకీ విలువుండదన్న భావం అప్పుడే కలిగింది అమ్మలో. అయితే శ్లాబ్ విషయం నాదాకా రావడానికి కొన్నేళ్లు పట్టింది. కారణం లక్ష్మి.

"ఎవరికేం మాటిచ్చినా – నిజానికీ ఇల్లు నీదేనే! కోడలికి ఇల్లివ్వడం మన సంప్రదాయం కూడాను" అని మొదలెట్టి, "ఇంటికి శ్లాపేయించవే. చూడాలనుంది" అంది అమ్మ ఓసారి లక్ష్మితో.

అమ్మ విషయం తెలుసు కదా, "అలాగే అత్తయ్యా" అని అప్పటికి దాటేసి, తర్వాత నాకు చెప్పింది లక్ష్మి.

"పాతవి తీర్చడం. కొత్తవి చెయ్యడం. సంసారం అప్పులమీదే నడుస్తోందని చెప్పలేకపోయావూ?" అన్నాను.

ఆ మాట నా మాటగా అమ్మకి చేరేసింది లక్ష్మి. దానికి అమ్మ వెంటనే, "నాకు తెలియదేమిటే – వాడివింకా లేత రెక్కలు. మీ నాన్నకి చెబుతావని నీకు చెబితే – నువ్వెళ్లి మొగుడికి చెప్పావ్" అని రిటార్టిచ్చింది. ఆపైన, "మీ నాన్నకేం లేదా పోదా? ఐనా ఇచ్చేది కూతురికే కదా!" అని సమర్థించుకుంది కూడా.

లక్ష్మి నొచ్చుకోలేదు. "అమ్మో, నాన్నంటే నాకు భయమత్తయ్యా! నీకు అన్నయ్యేగా, నువ్వే అడుగు" అంది.

"చాల్లే చెప్పొచ్చావ్! పిల్లనివ్వకముందే వాడు నాకు అన్న. ఇప్పుడు వాడు నా వియ్యంకుడు. ఇంత ఇంటికి ఓనర్ని. ఇందరు పిల్లల తల్లిని. పేరున్న పావనరావుగారి పెళ్లాన్ని. నా అవసరానికి వియ్యాలవారిముందు చేయి చాస్తానా?" అని అమ్మ ఆ విషయాన్ని అక్కడితో విడిచిపెట్టింది.

నా రెండో చెల్లి పెళ్లికి ఇంటిమీద అప్పు తేవాల్సి వచ్చింది. అప్పు నేనే తీర్చినా, అమ్మ మాత్రం తనే ఆ పెళ్లి ఖర్చు పెట్టినట్లు ఫీలై పదిమందికీ చెప్పుకుంది. లక్ష్మి అమ్మని అర్థం చేసుకుంది కాబట్టి కానీ – చాలా ఇళ్లలో గొడవలొచ్చేది ఇలాంటి విషయాల్లోనే మరి!

నేను మూడో చెల్లికి పెళ్లి ప్రయత్నాల్లో ఉంటే అమ్మ ఇంటి శ్లాబ్ గురించి అడిగింది. పెళ్లయ్యాక కూడా అడిగింది. అలాగే మిగతా ఇద్దరు చెల్లెళ్ల పెళ్లిళ్లయ్యాయి. ఆదాయం, అప్పులు బేరీజు వేసుకుంటూ సతమతమయ్యే మాకు అమ్మనుంచి అడపాతడపా శ్లాప్ తగులుతూనే ఉండేది.

ఒకోసారి నెమ్మదిగా బదులిచ్చేవాణ్ణి. ఒకోసారి విసుక్కునేవాణ్ణి. ఒకోసారి కోప్పడేవాణ్ణి. ఒకోసారి అరిచేవాణ్ణి. అరిచినప్పుడు అమ్మ ముఖం చిన్నబుచ్చుకుని వెళ్లిపోయేది.

"అత్తయ్య కోరిక చిన్నదే! మన హోదా ఆ కోరిక తీర్చేటంతగా ఎదగలేదు" అని లక్ష్మి మందలించేది నన్ను.

ఈలోగా తమ్ముడి చదువు పూర్తయి, ఉద్యోగం కూడా వచ్చింది.

"పెద్దాడెలాగూ నన్ను పట్టించుకోడు. నువ్వయినా ఇంటికి శ్లాప్ వేయించరా?" అంది అమ్మ వాడితో.

"నా ఉద్యోగం ఢిల్లీలో. ఈ ఇంటితో నాకేం పని?" అన్నాడు తమ్ముడు. అప్పుడు అమ్మ ముఖం చూస్తే జాలేసింది నాకు. ఎలాగోలా శ్లాబ్‌కని కూడబెడదామంటే పిల్లలు ఎదుగుతున్నారు. అవసరాలు పెరుగుతున్నాయి.

ఒకసారి నా జీతాలు పెరిగి అరియర్స్ రెండులక్షల రూపాయలొచ్చాయి. ఇంటికి శ్లాబ్ వేయిద్దామని లక్ష్మికి చెబితే, "నిన్న నాన్న ఫోన్ చేశాడు – మామయ్యకి అరవై నిండాయి కదా – షష్టిపూర్తి ఏర్పాట్లు చేస్తున్నారా అని" అంది లక్ష్మి.

పెద్ద కుటుంబం మాది. షష్టిపూర్తికి బాగానే ఖర్చవుతుంది. శ్లాబ్ విషయం మళ్లీ వాయిదా వెయ్యాలి.

"అమ్మనడుగుతాను. షష్టిపూర్తి కావాలా, శ్లాబ్ కావాలా – అని" అన్నాను.

"అడిగితే అత్తయ్య శ్లాబ్ అనే అంటుంది. ఇలా షష్టిపూర్తి చేసుకునే అవకాశం అందరికీ రాదు. అత్తయ్యకిప్పుడు శ్లాబ్ మాట చెప్పొద్దు. సరదాగా వేడుక జరిపిద్దాం" అంది లక్ష్మి.

షష్టిపూర్తి అనగానే అమ్మ చాలా సంబరపడింది. బయటపడలేదు కానీ నాన్న కూడా సంబరపడ్డాడు. ఆ వేడుక ఘనంగా జరిగింది. ఖర్చు అనుకున్నకంటే ఎక్కువై మళ్లీ లోటు బడ్జెట్‌కి వెళ్లిపోయాం. కానీ ఇంటాబయటా నాకూ, లక్ష్మికీ లభిస్తున్న ప్రశంసల పరంపరల మత్తులో ఆ బాధ తెలియలేదు. అమ్మ కూడా నాతో, "చాలా తృప్తిగా ఉందిరా. ఇంటిమీద శ్లాప్ కూడా వేయించేయ్ – ఇక నాకే కోరికలూ లేవు" అంది. అదీ అమ్మ!

ఆ సమయంలో నాకు అమెరికా ఆఫర్ ఒకటి వచ్చింది. రెండేళ్ల ట్రిప్పు. మామూలుగా ఐతే వెళ్లను. కేవలం డబ్బుకోసం ఒప్పుకున్నాను. ఫామిలీకి ఖర్చెక్కువని ఒక్కణ్ణే వెళ్లాను. అక్కడ అద్దె కలిసొస్తుందని నాగేశ్ అనే తెలుగువాడితో రూం షేర్ చేశాను. అతడు ఏడాది ట్రిప్పుమీద అమెరికా వచ్చాడు. సబ్జక్ట్ సైకాలజీ.

అమెరికానుంచి ఇంటికి ఫోన్లు చేసి విశేషాలు అందరితో పంచుకునేవాణ్ణి. అమ్మతో మాట్లాడినప్పుడు, "నేను తిరిగిరాగానే మనింటికి శ్లాబ్ వేయించేస్తానమ్మా!" అని పదేపదే చెప్పేవాణ్ణి.

నేను వెళ్లిన ఏడాదికి కాబోలు – అమ్మ అదోలా ఉంటోందంది లక్ష్మి. ఎప్పుడూ ఏదో ఆలోచనలో ఉంటుందిట. ఎవరితోనూ మాట్లాడదట. తిండి సరిగ్గా తినడం లేదట. చిక్కిపోతోందిట. డాక్టరుకి చూపిస్తే, "అనారోగ్యమేం లేదు. మానసికం. కొడుకు గురించి బెంగేమో!" అన్నాట్ట.

అమ్మకి నేనంటే ప్రాణం. నిజంగానే నాకోసం బెంగెట్టుకుందేమో! అప్పట్నించీ వారానికొకసారైనా అమ్మకి ఫోన్ చేసి, "ఇండియా రాగానే మనింటికి శ్లాబ్ వేయిస్తానమ్మా!" అనేవాణ్ణి. ఒకసారి ఊఁ అంది. ఒకసారి అదీలేదు. ఇక పదిరోజుల్లో ఇండియా వెడతాననగా, "మీ ఇష్టం! మీకు కావాలంటే వేయించుకోండి" అంది.

శ్లాబ్ విషయంలో అమ్మ అంత నిర్లిప్తత చూపించడం అదే మొదటిసారి.

ముందు కళ్లలో నీళ్లు తిరిగాయి. అంతలో భోరున ఏడ్చేశాను.

అప్పుడు నా పక్కనే ఉన్న నాగేశ్ ఆశ్చర్యపడి విషయమడిగి తెలుసుకుని, "మన దేశంలో ఆడవాళ్లు కుటుంబానికే అంకితం. కానీ వాళ్ల సేవలకీ, త్యాగాలకీ గుర్తింపుండదు. బాధ్యతలుండగా వారికి గుర్తింపు బాధ ఉండదు. బాధ్యతలైపోయేక గుర్తింపుకోసం ఏదో ఆసరా వెతుక్కుంటారు. అలా మీ అమ్మ తన ఇంటిని ఆసరా చేసుకుంది. ఆ ఇంటికి శ్లాబ్‌ని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ శ్లాబ్ వేయిస్తే ఆమెకి వేరే జీవితలక్ష్యం ఉండదు. జీవితంమీద ఆసక్తి పోతుంది. జీవితంమీద ఆసక్తి పోవడం – ముఖ్యంగా ఈ వయసులో చాలా ప్రమాదం" అన్నాడు.

షాక్ తిన్నాను. నేను నాగేశ్‌లా సైకాలజిస్టుని కాకపోవచ్చు. కానీ ఈ మాత్రం తెలుసుకుందుకు కామన్‌సెన్స్ చాలదూ? బాధ్యతలు మోస్తున్నానని అనుకోవడమే తప్పు – మా గురించే ఆలోచిస్తూ మమ్మల్ని పెంచి పెద్దచేసి ఇంతవాళ్లుగా తీర్చిదిద్దిన అమ్మకి మా దైనందిన కార్యకలాపాల్లో ప్రాధాన్యమివ్వాలని ఎందుకు నాకు తోచలేదు? ఆమెకు ఆర్థిక బలహీనతే అందుకు కారణమా? జీవితంపై ఆసక్తి పుట్టడానికి ఇంటి శ్లాబ్‌నే ఆసరా చేసుకోవాల్సిన అగత్యం ఆమెకి అందుకే వచ్చిందా?

నేను వెంటనే అమ్మకి ఫోన్ చేశాను. "ఇక్కడ అనుకున్నట్లు డబ్బు మిగలలేదమ్మా! ఇప్పట్లో శ్లాబ్ వేయించడం ఔతుందనుకోను" అన్నాను. అమ్మ మాట్లాడలేదు. కానీ అంతా నేననుకున్నట్లే జరిగింది.

నేను ఇండియా చేరుకుని మా ఇంట్లో అడుగు పెట్టగానే, "నువ్వు లేక ఇన్నాళ్లూ ఇల్లు చిన్నబోయిందిరా! నిన్ను చూడగానే మనసంతా సంతోషంతో నిండిపోయింది. ఇంటికి శ్లాప్ కూడా వేయిస్తే...." అంది అమ్మ.

శ్లాప్ అన్నమాట ఛెళ్లుమంది నాకు. కారణంమాత్రం ఇదివరకటిది కాదు.

నాకిప్పుడు మా ఇంటికి శ్లాబ్ వేయించే ఉద్దేశ్యమే లేదు. శ్లాబ్ గురించి కాక మా కుటుంబం గురించిన జీవితలక్ష్యం ఏర్పరచుకునేటంత ప్రాధాన్యం ఆమెకి ఎలా ఇవ్వాలా అని ఆలోచిస్తున్నానిప్పుడు!

కథా కౌముది

# పరిమళం

నాదెళ్ళ అనూరాధ

తెల్లవారి లేస్తూనే గుమ్మం ముందు పాల ప్యాకెట్ తీసుకుంటూ, ఇంటి కాంపౌండ్ లోనూ, బయటా అరడజను పైగా స్కూటర్లు ఉండటం గమనించింది శారద. విషయం అర్థం కాలేదు.

తలుపు మూసి పనుల్లో పడిన శారద ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. క్రిందపోర్షన్ లో వాళ్లు వచ్చి మూడు నాలుగు నెలలవుతోంది. ఇంటావిడ రాజమ్మమ్మ పద్ధతిగా ఉండే మనిషి. ఆవిడ పెట్టే రూల్సన్నీ అద్దెకొచ్చేవాళ్లు ఒప్పుకుని తీరవలసిందే. సిటీలో కొడుకు దగ్గర ఉంటూ , అప్పుడప్పుడు వచ్చి కొన్నాళ్ళు స్వంత ఇంట్లో ఉండి వెళ్తూంటుందావిడ.

శారదకి ఈ ఊళ్లో ఉద్యోగం వచ్చిందని తెలియగానే మేడమీద గదులు శుభ్రం చేయించి ఆమెకోసం సిద్ధం చేయించింది రాజమ్మగారు. ఆవిడ శారద అమ్మమ్మకి స్నేహితురాలు అవటంతో శారదకి రాజమ్మమ్మ అయింది.

క్రిందింట్లోవాళ్లు వచ్చిన క్రొత్తలోనే రాజమ్మగారు ఊరు వెళ్లవలసి రావటంతో మేడమీదకొచ్చి శారదకి అప్పగింతలు పెట్టింది ఆవిడ.

‘ శారదా, మనింట్లో అద్దెకు దిగిన వాళ్లు ఏలూరు నుండి వచ్చారు. ఆయన అక్కడేదో మిల్లులో పని చేసేవాడుట. ఇక్కడేదో మెరుగైన పని దొరికిందని మకాం మార్చేరుట, ఆవిడ, అదేలే ఆ అమ్మాయి సావిత్రి చెప్పింది వివరాలు.

వాకిట్లో ముగ్గు, పెరట్లో మొక్కల బాధ్యత వాళ్లదే అని చెప్పేను. వాళ్లు కాస్త అలవాటు పడేవరకూ ఉండి వెళ్దాం అనుకున్నాను, కాని మా అన్నగారు హైదరాబాదు లో ఉన్నాడు కదూ, ఆయన బాత్రూమ్ లో జారి పడ్డాడుట. ఫ్రాక్చర్ ఏమీ కాలేదు కానీ బాగా భయపడిపోయాడు, ఈ వయసులో ఏదైనా సమస్య వస్తే ఏమైపోయేది అని.

నేను వెళ్తే కాస్త ధైర్యంగా ఉంటాడని మా వదిన ఫోన్ చేసి చెప్పింది. బయలుదేరుతున్నాను’ అంటూ.

వాళ్లు వచ్చినప్పటినుండీ శారదకి చక్కని సుప్రభాతాలు మొదలయ్యాయి. తెల్లవారకముందే నూతిగట్టు మీద పనులుచేసుకుంటూ సావిత్రి శ్రావ్యంగా గొంతు విప్పి పాడుతూంటుంది. ఎంత చక్కని గొంతు, ఎంత తియ్యని పాట!ఆ కాస్సేపు పెరటినిండా వెన్నెల ఒలుకుతున్నట్లుంటుంది.

అంతలోనే ఆమె మీద అతని విసుగులు, గదమాయింపులు వినిపిస్తుంటాయి.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

శారద తయారై ఆఫీసుకు వెళ్తూన్నప్పుడు ఇంట్లోనూ , ఇంటిబయటా ప్రొద్దున్నే కనిపించిన ఒక్క స్కూటరూ కనిపించలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

ఆ సాయంత్రం క్రిందింటి సావిత్రి వచ్చి 'క్షమించండి. మావారు దొడ్డమ్మగారి గది తాళం అడిగి తీసుకున్నారుట కదూ. ప్రొద్దున్న వాళ్లంతా వెళ్ళేక, గది శుభ్రం చేసేసరికి మీరు డ్యూటీకి వెళ్లిపోయారు.' అంటూ తాళం చెవి ఇచ్చింది.

అది అందుకుంటూ, ' ఎవరో బంధువులు వస్తున్నారని, అమ్మమ్మని అడిగితే వాడుకొమ్మందని చెప్పి నిన్న సాయంత్రం తాళం పట్టుకెళ్లారు శివయ్యగారు.' ప్రశ్నార్ధకంగా సావిత్రి ముఖంలోకి చూసింది శారద.

ఆమె కళ్లు వాల్చుకుని చెప్పింది.

' బంధువులు కారు. వాళ్లంతా పేకాట కోసం ఎక్కడో ఒక చోట చేరుతుంటారు'

శారద విస్మయంగా వింది.

క్రితం సాయంత్రం వచ్చి ఎంత నమ్మకంగా చెప్పాడావ్యక్తి!

అసలు అమ్మమ్మ ఆవిడ కోసం ఉంచుకున్న గదిని ఎప్పుడూ ఎవరికీ ఇచ్చిన జ్ఞాపకమూ లేదు శారదకి.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★

ఆఫీసుకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు సావిత్రి ఏదో పని చేసుకుంటూ కనిపించేది. ముఖపరిచయం క్రమంగా చిన్నచిన్న పలకరింపులవరకూ వచ్చింది.

సావిత్రి వెనుకవెనుకే తిరుగుతూండే ఆమె పదేళ్ల కూతుర్ని చూసి శారద ఓ మారు అడిగింది. ,

' పాపని ఏ స్కూల్లో జాయిన్ చేసేరు?'

' ఇంకా స్కూల్లో వెయ్యలేదు. ఇంట్లోనే చదవటం, రాయటం నేర్పిస్తున్నాను. ఈయన ఉద్యోగంలో కాస్త నిలదొక్కుకున్నాక జేర్పించాలి.'

వాళ్ల ఆర్థిక పరిస్థితి అర్థమైంది. అవసరమైన వాళ్లకోసం ఖర్చు పెట్టడంలో ఉన్న ఆనందం శారదకు తెల్సున్నదే.

'ఫీజు తాను కడతానంటే ఏమనుకుంటారో, చిన్నబుచ్చుకుంటారా?పోనీ వీలు చిక్కి నప్పుడు ఇచ్చేయమంటే సరి!'

తనలో తాను తర్జనభర్జన పడి శారద అదే మాట పైకి అంటే సావిత్రి ఏమీ మాట్లాడలేదు.

అతను మాత్రం సాయంత్రం పనిగట్టుకుని వచ్చి తలుపు తట్టాడు.

'మా పావనిని స్కూల్లో జేర్పిస్తానన్నారటకదా'

శారదకి ఒక్కక్షణం ఖంగారనిపించింది. ఎలా తీసుకున్నాడో ఆవిషయాన్ని అని.

' మీ అంతట మీరే అన్నారు కదా. నాకైతే ఏమీ అభ్యంతరం లేదు. ' అతని మాటలకి నిశ్చింతగా ఊపిరి తీసుకుంది.

ఆఫీసులో పర్మిషన్ పెట్టి మరునాడే సావిత్రికి తోడుగా వెళ్లి దగ్గర్లో ఉన్న స్కూల్లో పావనిని జేర్పించింది శారద. అతను మాత్రం తనకెలాటి సంబంధం లేదన్నట్లు ప్రొద్దున్నే తనదారిన తాను బయటకు వెళ్లిపోయాడు.

పావని క్రొత్త యూనిఫామ్ చూసుకుని మురిసిపోయింది.

★★★★★★★★★★★★★★★★

ఒకరోజు ప్రొద్దున్నే సావిత్రి పాట కంటే ముందే అతని గొంతు ఖంగున వినిపించింది.

' వెధవ ఉద్యోగం, ఈరోజునుండీ వెళ్లే పని లేదు. అడ్డమైన వాళ్లక్రిందా పని చెయ్యలేను. వాళ్లు పురమాయించే పనులు చేస్తూ బ్రతకటం నా వల్ల కాదు. ఉద్యోగం, ఉద్యోగం అంటూ నస పెట్టకు. '

ఒక్క క్షణం ఆగి మళ్లీ అన్నాడు, 'చేతనైతే నువ్వు చెయ్యి. చదువు లేకపోయినా శుభ్రంగా వండగలవు కదా' అతనా మాటలు ఏ క్షణాన అన్నాడో కానీ అది వెంటనే కార్యరూపం సంతరించుకుంది.

సావిత్రి కమ్మగా వండగలదనీ, సౌమ్యురాలనీ వండిపెట్టమంటూ ఒక్కక్కరుగా రావటం మొదలుపెట్టేరు.

వీధిలో కూర్చుని వచ్చిన వాళ్లందరితో కబుర్లు చెప్పటం మాత్రమే చేసేవాడు శివయ్య.

'మా సావిత్రి బ్రహ్మాండంగా వండుతుంది. చూస్తున్నారుగా. తొందర్లోనే ఇక్కడ 'మెస్' పెడతాం. దొడ్డమ్మగారొస్తే ఆవిడ చేతే ప్రారంభోత్సవం చేయిస్తాను'

అతని ధోరణి ఇలా సాగుతోంది. నాలుగైదు కుటుంబాలకి వాడుకగా వండి, క్యారేజీల్లో సర్ది తీసుకెళ్లి ఇస్తూండేది సావిత్రి. కనీసం ఆ పార్సిళ్లు పట్టుకెళ్లి ఇవ్వటం కూడా చేసేవాడు కాదు అతను.

ఉన్నట్టుండి మళ్లీ ఏదో ఉద్యోగంలో చేరినట్టున్నాడు. ఇంటికి తాళం వేసి ఉంటే భార్య వచ్చేవరకు ఎదురు చూసి, ఆవిడ మీద పోట్లాటకి దిగేవాడు.

' ఎండవేళ ఎక్కడికెళ్లేవ్? ఆకలితో వస్తాను, ఇంటిదగ్గర ఉండాలని తెలీదూ? టైముకి వెళ్లకపోతే అక్కడ మాట పడాలి. నాకు కుదరవు అవన్నీ.' అతను ఎన్ని మాటలు మాట్లాడినా మౌనమే ఆమె సమాధానం.

★★★★★★★★★★★★★★★★★★★★★★

ఇంట్లో వంటలు చేసుకునే వాళ్లు తగ్గిపోతున్నారా అనిపించేది సావిత్రిని చూస్తే. రెండిళ్లు, నాలుగిళ్లు కాస్తా మరిన్ని కుటుంబాలకు వండుతోందామె. మధ్యాహ్నం భోజనాలయ్యాక పెరడంతా పరుచుకున్న వంటసామాను ఆమె ఒక్కతే శుభ్రం చేసుకోవటం గమనించిన శారద ఊరుకోలేక పోయింది.

' సావిత్రీ, మీకిప్పుడు చేతినిండా పనిఉంది. అంతోఇంతో రాబడి ఉంది. చేతిక్రింద మనిషిని పెట్టుకోండి, ఇంత శ్రమ ఒక్కరివల్లా అయ్యేది కాదు'

' నాకా ఆలోచనే రాలేదు. అదీకాక ఆ పదిరూపాయలు మరోఖర్చుకి ఉంటుందని...'

వాక్యం పూర్తి చెయ్యకుండా నిలబడింది సావిత్రి.

' వద్దు సావిత్రీ, శక్తి కి మించిన పని చేసి అనారోగ్యం తెచ్చుకోకండి' శారద మాటల్లో వాస్తవం ఆమె గ్రహించింది.

ఆ తర్వాత నాలుగురోజులకే సావిత్రి వెనుక పనులు అందుకుంటూ తిరుగుతున్న మనిషిని చూసి శారద తృప్తి పడింది.

'శారదగారూ,.....' అంటూ వచ్చిన సావిత్రిని ' రండి ' అంటూ ఆహ్వానించింది శారద. ఆమెను చూస్తూంటే ఇదివరకటి సావిత్రిలా కాక ముఖంలో ఒక క్రొత్త ఉత్సాహం, ఇదివరకు కనిపించని ఆత్మ విశ్వాసం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

' ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులు పెద్దగా లేవు శారదగారూ, ఆయనా పని చూసుకున్నారు. పావని ఫీజు మీరు కట్టకండి ఇంకపైన. ఇన్నాళ్లూ చేసిన సహాయానికి ఎలా కృతజ్ఞతలు చెప్పలో తెలియటం లేదు' అంటూ సూటిగా తను చెప్పదలచుకున్నది చెప్పింది సావిత్రి.

' పావని చదువు నాకేం బరువు కాదు. ఆ డబ్బు జాగ్రత్త చేసుకోండి. రేపు ఏదైనా అవసరానికి ఉంటుంది.' శారద ఒక ఆత్మ బంధువులా చెప్పింది.సావిత్రి ఏదో చెప్పబోతే ఆమెను వారించింది.

నిస్సహాయంగా వెనుతిరిగిన సావిత్రి కి శివయ్య ఎదురొచ్చేడు.

' నేను చెప్పలేదూ! పావనిని చదివించటం ఆవిడకి శ్రమ కాదు' అంటూ ఓ నవ్వు నవ్వి భార్యతో సహా క్రిందకెళ్లిపోయాడు.

శివయ్య తీరు తెలిసున్నదే అన్నట్టు నిలబడిపోయింది శారద. ఆమెకేమీ ప్రశంసలూ, సన్మానాలూ అక్కర్లేదు. కాని, కష్టపడకుండా , అనాయాసంగా వచ్చే సౌకర్యాల పట్ల ఉన్న ఆ వ్యామోహానికి అతని పట్ల ఒక వ్యతిరేకత కలిగింది.

★★★★★★★★★★★★★★★★★★

రాజమ్మగారు యధాలాపంగా ఫోన్ చేసినప్పుడు అడిగింది,

'క్రిందింటి వాళ్లు ఎలా ఉన్నారు? ఇల్లు శుభ్రంగా ఉంచుతున్నారా? మొక్కల సంరక్షణ చూస్తున్నారా?' అంటూ

'అంతా బాగానే ఉంది అమ్మమ్మా. ఆమధ్య మీతో మాట్లాడేరుట కదా శివయ్యగారు'

'ఎప్పుడూ? మాట్లాడలేదే...........ఏమిటిట? ఏమైనా పని పడిందా?' ఆవిడ మాటలకి తెల్లబోయింది శారద. అయితే ఆయన అబద్ధం చెప్పి గది తాళం పట్టుకెళ్లేడా? ఇప్పుడు రాజమ్మమ్మకి తెలిస్తే అనవసరమైన గొడవ.

శారద మౌనం చూసి ఆవతల నుండి రాజమ్మ రెట్టిస్తుండటంతో,

' పనేంలేదు అమ్మమ్మా, ఊర్కేనే ఫోన్ చేసి పలకరిస్తానన్నాడాయన' అంటూ మాట తప్పించేసింది.

'వద్దామనుందే శారదా, ఒకసారి ఇల్లు చూసుకుని , మొక్కల్ని పలకరించి ఓ నాలుగు రోజులు అక్కడ గడుపుదామని ఉంది.'

' వద్దమ్మమ్మా, ఎండలు బాగా ఉన్నాయి. తట్టుకోలేవు. అయినా ఇల్లు, తోట చూసుకుందుకు మేమంతా ఉన్నాంకదూ ఇక్కడ'

'అన్నట్లు, ఆ పనసచెట్టు , మామిడి చెట్లు సోములుకే అప్పచెప్పు. వాడు ఏళ్ల తరబడి మన ఇంటిని నమ్ముకుని ఉన్నాడు. తియ్యని పళ్లు మన చుట్టుప్రక్కల ఎక్కడా లేవు ఇలాటివి'

ఆవిడ తాపత్రయానికి నవ్వుకుంది శారద.

' ఎప్పుడో తొందర్లోనే రావాల్సిఉందిలే' అంటూ ముగించిందావిడ.

★★★★★★★★★★★★★★★★★★

ఆ ఫోన్ కాల్ వచ్చిఎన్నో రోజులు అవనే లేదు, ఉన్నట్టుండి ఒకరోజు ప్రొద్దున్నే ఇంటిముందు ఆటో దిగిన రాజమ్మగారిని చూసి ఆశ్చర్యపోయింది శారద. ఎదురెళ్లి ఆవిడ చేతిలో బ్యాగ్ అందుకుంటూ , ఇంటిమీద బెంగ పెట్టుకున్నావా అమ్మమ్మా?' అంటూ వేళాకోళం చేసింది.

' లేదులేవే, పని తోసుకొచ్చిందిలే.' అందావిడ.

సావిత్రి పెరట్లో ఉన్నట్టుంది.

'రంగమ్మ వచ్చేక గది శుభ్రం చేస్తుంది, మేడ మీదకొచ్చెయ్ అమ్మమ్మా, ' అంటూ ఆవిణ్ణి పైకి తీసుకెళ్లింది.

రాజమ్మగారు స్నానం చేసివచ్చి, కాఫీ గ్లాసు పుచ్చుకుని కూర్చుంది. ఇంటిముందు లక్షణంగా ఉన్న ముగ్గు ఆవిడకి మనశ్శాంతినిచ్చింది.

ఖాళీ గ్లాసు ప్రక్కన పెట్టి,' క్రిందకెళ్లి ఓ మాటు పలకరించి వస్తాను' అంటూ లేచింది.

క్రింద వ్యవహారం చూసి ఆవిడ రియాక్షనెలా ఉంటుందో అనుకుంటూ పనిలో పడింది శారద.

'అమ్మమ్మా, వంట గదిలో గట్టు మీద అన్నీ సర్ది పెట్టేను. టైమయ్యాక వచ్చితిను' అంటూ క్రింద గదిని శుభ్రం చేస్తున్న రంగమ్మతో కబుర్లలో మునిగిన రాజమ్మగారికి చెప్పి ఆఫీసుకు బయలుదేరింది శారద.

రాజమ్మగారు పెరట్లో కుర్చీ వేయించుకుని కూర్చుంది. అక్కడ జరుగుతున్న విషయం ఆకళింపు చేసుకుంది.

' మరైతే సావిత్రీ, గుడివాడలో స్వంతిల్లుందంటున్నావ్. స్వంత ఊరు,ఇల్లు వదిలి వచ్చేరేం?'

' స్వంతిల్లేనండీ. అత్తయ్యగారికి ఈయన పద్ధతి నచ్చదు. ఒక్కడే కొడుకు. చదువు సరిగా అబ్బలేదు. స్థిరమైన ఉద్యోగం ఏదీ లేకుండా ఊళ్లో వాళ్ల వ్యవహారాల్లో తిరగటం , రాత్రీ పగలూ అని లేకుండా పేకాటలో కూర్చుని డబ్బు పోగొట్టుకోవటం......................ఆవిడా చెప్పిచెప్పి విసిగిపోయారు.

చిన్నచిన్న విషయాలకి గొడవ పెట్టుకుని చేసే ఉద్యోగం వదిలేస్తూంటే అత్తయ్య కేకలేసేరు. నేనేదైనా చేద్దామన్నా సరైన చదువు లేదు. వంట పనిలాటివి చేసేందుకు అక్కడ చుట్టుప్రక్కలంతా బంధువులు. ఆక్షేపణగా ఉంటుంది.

తల్లితో పంతానికి పోయి, 'నీకూ నాకూ ఇంక ఏ సంబంధం లేద'ని చెప్పి ,ఊరొదిలేసి వచ్చేసేరు. నన్నూ, పిల్లని, ఇష్టమైతే కూడా రమ్మన్నారు లేదా ఉండిపొమ్మన్నారు.

అత్తయ్యని వదిలి రావాలంటే మనసొప్పలేదు. అయినా ఇల్లు వదిలి ఏ ఆధారం లేకుండా ఒక్కరూ బయటకు వెళ్తే ఎలాటి పరిస్థితులు ఎదురవుతాయో అని అత్తయ్య మమ్మల్ని అందరినీ కల్సే వెళ్లమని చెప్పారు....................'

సావిత్రి చెప్పటం ఆపి రాజమ్మగారి ముఖం వంక చూసి, తను చెప్పేది కొనసాగించింది.

' ఇక్కడికి వచ్చేనాటికి ఏ ఉద్యోగమూ లేదండి. చేతిలో కాస్త డబ్బుంది.ఎక్కడా పట్టుమని ఆరునెలలు కుదురుగా పనిచెయ్యరు. ఇల్లు గడుపుకుందుకు నాకు చేతనైన పని నేను చెయ్యాలనుకున్నాను. ఆయనా అదే అన్నారు.'

రాజమ్మగారు నిట్టూర్చింది. శివయ్య సంగతి అవగాహన కొచ్చింది. పెరడంతా పచ్చని అరటిమొక్కలు, వాటినంటి ఉన్న అరటిపిలకలూ, రకరకాల ఆకుకూరల మడులూ, పూలమొక్కలతో కళకళలాడుతోంది.

ఆవిడకి సావిత్రిని చూస్తే ముచ్చటేసింది. సంసారం కోసం సర్వ విధాల కష్టపడుతోంది. పిల్లని పొందిగ్గా చదివించుకుంటోంది. బాధ్యత తెలియని భర్తతో సంసారం రోడ్డున పడకుండా, ఒక క్రమంలో నడుపుకొచ్చే ప్రయత్నం చేస్తోంది.

'మీ అత్తయ్యకి క్షేమ సమాచారాలు తెలియచేస్తున్నావా?'

'ఆవిడకి ఇక్కడ జరిగేదంతా చెబుతూనే ఉన్నానండీ. ఇక్కడికి వచ్చేనాటికి ఏంచెయ్యాలన్న ఊహ లేకపోయినా , ఇప్పుడు నాకు ఒక జీవిక ఏర్పడింది. అది మీ దయే దొడ్డమ్మగారూ,' అంటూ చటుక్కున వంగి ఆవిడ పాదాలకు నమస్కరించింది.

రాజమ్మగారు చటుక్కున పాదాలు వెనక్కి తీసుకుంది సావిత్రి చర్యకి.

' నేనిలా వంటలు మొదలు పెట్టేను. మీకు ముందుగా మాట మాత్రంగానైనా చెప్పలేదు. ఏమీ అనుకోకండమ్మా. అప్పుడున్న పరిస్థితికి ఇంకఏమీ తోచలేదు' సావిత్రి మాటలు తలపంకించి వింటోందావిడ.

ఇంట్లోకొచ్చి , పెరట్లో సన్నివేశం చూసి ఊపిరి ఆడనట్టు ఫీలయ్యాడు శివయ్య ఒక్కక్షణం. అంతలోనే,

' నమస్కారం అమ్మా, మీరు చెప్పాపెట్టకుండా వచ్చేసేరు. చెప్పిఉంటే స్టేషన్ కి వచ్చి ఉండేవాడిని కదా'

' ఇక్కడికి వచ్చేందుకు చెప్పిరావటం ఏమిటి శివయ్యా, ఇది నాఊరు, నాఇల్లు' అతి వినయం ప్రదర్శిస్తున్న శివయ్యను వారించింది.

' అమ్మా, మీరు ఈ పూట మాతో పాటు భోజనం చెయ్యాల్సిందే. సావిత్రి వంట చూద్దురుగాని'

' అవునూ, నువ్వు మెస్ ఏదో ప్రారంభిస్తున్నావని తెలిసింది. నేనే రిబ్బను కత్తిరించాలన్నావట.' సమాచారమంతా సేకరించే వచ్చిందన్నమాట ఈ పెద్దావిడ అనుకున్నాడు.

' అవునమ్మా, మీరు అనుమతిస్తే ముందు వరండాలో కుర్చీలూ, బల్లలు వేసి చుట్టూకాస్త దడి కట్టించుకుంటాను. మీపేరు చెప్పుకుని ఈ ఇంట్లో నలుగురు భోజనం చేసి వెళ్తారు.' అతని కబుర్లకి ఆవిడ నవ్వుకుంది.

ఈ కబుర్లకి బలం భార్య పడే శ్రమే అయినా తన ప్రతాపమే ఇదంతా అన్నట్టూ చెబుతున్నాడు.

‘ అలాగే కానియ్యి శివయ్యా, ఇల్లు పాడు పెట్టకుండా మనుష్యులతో కళకళలాడుతుందంటే నేను మాత్రం ఎందుకు వద్దంటాను. కాని ఇదివరకు మీకు ఇచ్చింది రెండు గదుల పోర్షనే కనుక అద్దె కొంచమే. ఇప్పుడు పెద్దపని పెట్టుకుంటున్నావు కనుక అద్దె పెరుగుతుంది మరి’

‘ ఎంత మాట. అలాగేనమ్మా’ ముఖంలో అసంతృప్తి కనపడకుండా కాస్త నవ్వు పులుముకున్నాడు. ఈ ముసలావిడకి డబ్బు యావ బాగానే ఉందనుకున్నాడు.

‘అన్నట్టు ఈ ఏడాది మామిడిచెట్లు, పనస చెట్టు మంచి రేటు వస్తుందని సోములు క్కాకుండా మరెవరికో అమ్మించేవుట. శారదకి ఇవ్వన్నీ తెలియవు, నాకు లాభం అని అనుకున్నట్టుంది నీ మాటలు విని. ఏళ్ల తరబడి వాటికి ఏదో లెక్కకట్టి ఫలసాయం తీసుకుంటున్నాడు సోములు.

వాడికి తోచింది ఇచ్చి పట్టుకెళ్లటమే కానీ ‘రేటు ఇంత’ అని నేను ఏనాడూ చెప్పలేదు.ఇంతకీ ఆ వచ్చిన డబ్బు శారదకిచ్చేవా? అద్దెతో పాటు బ్యాంకులో వేసేవా?

సోములు కంటి ఆపరేషన్ చేయించుకుంటాడుట. ఆ డబ్బు తీసుకొస్తే వాడి ఖర్చుకి పనికొస్తుంది.ఇంకోమాట శివయ్యా, వీధి చివర బ్రహ్మం లేడూ, పాలప్యాకెట్లు వేసే బ్రహ్మం! కూతురి పెళ్లి కుదిరిందని చెప్పేడు. అసలందుకే వచ్చేనిప్పుడు.

మనమేడ మీద పెళ్లి చేసుకుంటానన్నాడు. తీరిక చేసుకుని పెళ్లి పనుల్లో ఓచెయ్యి సాయం వెయ్యి. పెరట్లో అరటిగెలలు, అరటి ఆకులు పెళ్లికి అట్టేపెట్టు’

ఆవిణ్ణి వింటూ అలాగే నిలబడ్డాడు అతను. అతని జీవితంలో మొదటిసారిగా మనసు ఆర్ద్రం అయింది.

అద్దెఇంటికోసం వచ్చినరోజున రాజమ్మగారి తీరు చూసి, ‘అమ్మో గట్టి మనిషి. ఏదో చిన్న పోర్షన్ కాస్త తక్కువ అద్దెకు దొరుకుతుందంటే , ఇంటి బాధ్యత, ఊరంత పెరడు, మొక్కల బాధ్యతా మొత్తం భుజాలమీద మోపింది’ అనుకున్నాడు.

డెబ్భైయేళ్లు పైబడిన వయస్సులో ఆవిడ అంత ఆరోగ్యంగా , ఆనందంగా ఉండటం వెనుక ఉన్న కారణమేదో అర్థం అయినట్లనిపించింది శివయ్యకి.

జీవితాన్ని అందంగా అనుభవించటం అంటే చుట్టూ ఉన్న మనుష్యుల సుఖఃదుఖాఃల మధ్య జీవించడమేనేమో!

అతని కళ్లు చెమర్చాయి . ఊళ్లో ఉన్న తల్లి అప్రయత్నంగా జ్ఞాపకానికొచ్చింది.

ఆ ఇంటినిండా కమ్ముకున్న పరిమళం పెరట్లో విరబూసిన మొక్కలది మాత్రమే కాదని ఆ క్షణంలో అతనికి అర్థమైంది.

***




# నీ వల్లే

శశికళ అబ్బరాజు

**"రావుగారూ...** ఏంటండీ ఇది? సరిగ్గా రిపోర్ట్ రాయకుండా సంతకం చేయమంటే ఎలా? నాకిది సరిపడదు. మళ్ళా రాసి తీసుకురండి" గట్టిగా అరిచాడు సుధాకర్.

"అదికాదు సర్!" మెల్లగా సర్దిచెప్పబోయాడు, అతని కంటే ఇరవైయ్యేళ్ళు పెద్దవాడూ, ఆఫీసులో సీనియర్ స్టాఫ్ మెంబరూ అయిన రాజారావు.

"బతిమాలితే పనులు జరగవు. మళ్ళా సరిగ్గా ఎంక్వైరీ చేసి రిపోర్ట్ తెండి. నీవల్ల పనంతా ఆగిపోయింది" ఫైలుని టేబుల్ మీద విసిరికొడుతూ అన్నాడు.

మారు మాట్లాడకుండా ఫైలు అందుకున్నాడు రావు. పక్కనే బెంచీల మీద ఉన్న N.R.I పార్టీల ముందు తన గొప్పతనం ప్రదర్శించుకోవడానికి ఇంకాస్త హెచ్చుమీరుతున్నాడు సుధాకర్.

"పాత తెలుగు రిపోర్ట్లు చదవాలంటే కళ్ళు తేలేస్తాడు. బోడి దాదాగిరి వెలగబెడుతున్నాడు. ఎవరైనా ఉంటే ఇంకాస్త ఎక్కువ చేస్తాడు. వయసుకి కూడా బొత్తిగా విలువ లేకుండా పోయింది....ఛీ...ఛీ!"

ఈ మాటలు పైకి అనే ధైర్యం లేక లోలోపలే గొణుక్కున్నాడు. నెమ్మదిగా పక్కగదిలో తన టేబుల్ దగ్గరికి వచ్చాడు.

ఎదురు సీట్లో కంప్యూటర్ ఆపరేటర్, సెల్‌ఫోన్‌లో వీడియో చూస్తూ తనలో తానే నవ్వుకుంటుంది.

పాతబడి పెచ్చులూడిపోయిన పైకప్పు, రంగులు వెలిసిపోయిన గోడలు, లోపల మాత్రం రంగురంగుల బట్టలు, చలువ కళ్ళజోళ్ళు, హైహీల్స్, సామ్‌సంగ్ ఫోన్‌లూ, కంప్యూటర్‌లూ, ఖద్దరు చొక్కాలూ వెరసి వృద్ధపెళ్ళికూతురిని తలపిస్తోందా ప్రభుత్వ ఆఫీసు.

"కాఫీ సార్" తరిణయ్య ట్రే పట్టుకుని వచ్చాడు.

"పెద్దసారు రమ్మంటున్నారు" రావుని చూస్తూ అన్నాడు.

అందుకున్న కప్పుని కాస్తా తిరిగి ట్రేలో పెట్టి, రెండు పాతఫైల్లు చేతబట్టుకుని ఇంజనీరు గదిలోకి వెళ్ళాడు రావు.

అక్కడ రెండు ఖద్దరు చొక్కాలున్నాయి. నవ్వుతూ వాళ్ళతో ఏదో మాట్లాడుతున్న వాడల్లా, రావుని చూస్తూనే సీరియస్‌గా మొహం పెట్టాడు ఇంజనీరు దొరవారు.

"సీనియర్స్! మీరు కూడా ఇలా చెప్పించుకుంటే ఎలా? ఇక్కడ ఫిగర్స్ చూడు. తేడా వచ్చింది. నీవల్ల జరిగిన పొరపాటుకి ఎంత నష్టమో తెలుసా?" టేబుల్ మీద కాగితాలు చూపిస్తూ కటువుగా అన్నాడు.

''సరి చేస్తాను..సార్!'' చిన్నగా గొణిగి బయటకు వచ్చాడు. అన్నీ సరిగ్గా ఉన్నవాటిని ఎలా సరిచేయాలో, ముప్పై అయిదేళ్ళ అనుభవం ఉన్నా తికమకపడుతూనే ఉన్నాడు రావు.

తిరిగి తన సీటు దగ్గరకు వచ్చాడు.

పాత చెక్క అలమరల నిండా పేరుకున్న ఫైళ్ళు వాటిని కంప్యూటరైజ్ చేయడానికి మూడు కంప్యూటర్‌లు ఉన్నా, ఏ విధంగానూ మోక్షం పొందలేక త్రిశంకు స్వర్గంలో వేళ్ళాడుతూ ఉన్నట్టున్నాయి.

''ఈ కాఫీ ఇట్లా చల్లగా ఏడ్చిందేం?'' పక్క గదిలో తరిణయ్యి మీద సుధాకర్ అరుపులు.

ఎన్ని ఊళ్ళు ట్రాన్స్‌ఫర్‌లతో తిరిగినా ప్రతిచోటా ఇదే వాతావరణం, ఇవే అనుభవాలు, పాతగోడల్లో, బూజుపట్టిన ఫైల్స్ మధ్య జీర్ణమైపోతున్న జీవితం.

ఇరవైయ్యేళ్ళకే ఉద్యోగంలో చేరాడు రావు. ఒక ఆటా-పాటా రాదు. ఏ పుస్తకమో, పురాణమో చదివే అలవాటు లేదు. డబ్బుని రకరకాలుగా ఇన్వెస్టు చేసి రూపాయికి - రూపాయి పెరుగుతూ ఉంటే ఆనందపడిపోయే తత్త్వమూ కాదు. సినిమాలూ - షికార్లూ ఎరగడు. వ్యసనాలు అంతకన్నా లేవు.

వీటిల్లో ఏ ఒక్కటన్నా లేకపోతే జీవితం నిస్సారంగా ఉంటుందన్న స్పృహకూడా లేదు.

తోచినంత వరకు పనిచేసి, ఇంజనీరు వెళ్ళాక, సొరుగుకి తాళం వేసి లేచాడు.

వానాకాలం కావడం వల్లేమో త్వరగా పొద్దుపోయినట్టనిపించింది. సన్నగా చినుకులు ప్రారంభం అయ్యాయి. చిన్నగా రోడ్డుమీదకు వచ్చాడు. బస్సుకోసం ఎదురుచూసే ఓపిక లేకపోయింది. ఆటో ఎక్కాడు.

మరో అయిదు నిముషాలకి వాన హెచ్చింది.

పక్కగా బైకు మీద యువజంట. ఒకరికొకరు హత్తుకుని వెళుతున్నారు. రోడ్డు పక్కగా ఉన్న హోర్డింగ్ మీద బొమ్మలు వాన జల్లుకి మసగ్గా కనబడుతున్నాయి. వాన ఎంత హడావుడిగా వచ్చిందో, అంత హడావుడిగా వెళ్ళిపోయింది. కొద్దిసేపటి వానకే, ఇంటి ముందు బురదగుంట. ఆటో దిగుతూనే కాలు జారిపడ్డాడు.

రెండు సార్లు కాలింగ్ బెల్ కొట్టినా తలుపు తెరుచుకోలెదు. స్పేర్‌కీతో తలుపు తీశాడు.

''రాజీ..రాజీ..'' పెద్దగా పిలిచాడు. సమాధానం రాలేదు. ముందురోజు జరిగిన గొడవ గుర్తొచ్చింది రావుకి.

కొడుకు బిజినెస్ పెట్టడానికి డబ్బు కావాలంటాడు. అన్ని తెలివితేటలూ, సమర్థత కొడుక్కి ఉన్నాయో, లేవో రావుకి తెలియదు. ఆ మాటకొస్తే తనకే సామర్థ్యం ఉందో, తనే ఎప్పుడూ బేరీజు వేసుకోలేదు.

చివరికి, డబ్బు ఇవ్వలేనని తేల్చి చెప్పాడు.

కొడుకు అలిగి ఇంట్లో నుంచి వెళ్ళి, అమ్మమ్మ గారింట్లో తిష్ట వేశాడు. భార్య కొడుకు పక్షం వహించి కూడా వెళ్ళింది.

కూతురు, ఎదిరించి పెళ్ళిచేసుకుని ఏనాడో వెళ్ళిపోయింది. రావుకి అర్థం కాని విషయం ఏమిటంటే, ఇవన్నీ నీవల్లే జరిగాయంటారందరూ.

బురద బట్టలు మార్చుకుని, టీ కాచుకుందామని వంటింట్లోకి వెళ్ళాడు. కిటికీలో నుంచి, ఎదురింటి వరండా ముందు హడావుడిగా షామియానా వేయడం కనిపించింది.

ఆ ఇంట్లో ముసలాయన చచ్చిపోయాడు. వచ్చినవాళ్ళు కూర్చోడానికి కుర్చీలు వేస్తున్నారు. ఏడ్చేవాళ్ళు ఏడుస్తున్నారు. శవాన్ని చూసి వెనక్కి వెళుతున్నవాళ్ళు పెద్దగా మాట్లాడుకోవడం రావు చెవిన బడింది.

"ఉన్నన్నాళ్ళు ఏడిపించుకు తిని చచ్చాడు. ఆయన వల్లే ఆ కుటుంబం అధోగతిపాలయ్యింది."

అప్పటిదాకా, ఏ ఆలోచనలూ, స్పందనలు లేని రావు మెదడు హఠాత్తుగా పనిచేయడం మొదలుపెట్టింది. కొన్ని దృశ్యాలు మస్తిష్కంలో ఫ్లాష్‌లా కనబడ్డాయి.

చచ్చిన ముసలాయన స్థానంలో రావు పడివున్నాడు.

"నీ వల్లే... పరిస్థితి ఇలాగైంది" భార్య ఏడుస్తూ ఉంది.

"పిల్లలు కూడా నీవల్లే.. నీ వల్లే" అంటున్నారు.

ఆఫీసులో సుధాకర్, ఇంజనీరు.. అందరూ నీ వల్లే.. ఇలా జరిగింది అనడం గుర్తొచ్చింది.

ఇన్నాళ్ళూ ఒక వెజిటబుల్‌లా బతికి, సంపాదించి చేసిందేమిటో అర్థం కాలేదు. తక్కున పొయ్యి కట్టేసి, బయటికి నడిచాడు.

చీకట్లో నడుచుకుంటూ వెళుతున్న రావుకి లైట్ల వెలుతురులో సందడిగా ఉన్న రైల్వే స్టేషన్ కనబడింది. ఏ ప్రమేయం లేకుండానే అడుగులు అటువైపుకి పడ్డాయి. వస్తూ, పోతూ ఉన్న జనాన్ని నిర్లిప్తంగా చూస్తూ కూర్చున్నాడు.

దూరంగా, ముష్టివాడు కనిపించాడు. ఒక చేతిలో కర్ర, మరో చేతిలో మూతలేని సత్తు కారేజీ పట్టుకుని నెమ్మదిగా నడుస్తూ ఉన్నాడు. అతని బట్టలు మురికితోళ్ళులా వేల్లాడుతున్నాయి.

రావుకి కాస్తంత దూరంలోకి రాగానే, అతను చటుక్కున తూలిపడిపోయాడు. రావు హృదయం స్పందించింది. ఈ వెజిటబుల్ బ్రతుక్కి ఒక పరమార్థం దొరికిందనుకున్నాడు.

గబుక్కున వెళ్ళి ఆ ముసలివాడిని లేవదీశాడు. అతని నోటి నుంచి చొంగలాంటిది కారుతూ ఉంది. ఉన్నట్టుండి అతను పెద్దగా బెక్కి భళ్ళున వాంతి చేసుకున్నాడు.

రావు రెండు నిముషాల క్రితం కలిగిన జాలిస్థానంలో, చీదర, అసహ్యం కలిగాయి. ముసలివాడిని వదిలేసి, గబగబా పక్కస్టాల్‌లో డెట్టాల్ ఎరువడిగి చేతులూ, కాళ్ళు పంపు కింద శుభ్రంగా కడుక్కుని బయటకు వచ్చేశాడు.

కొద్దిదూరం నడువగానే, మరో వెలుగుల మజిలీలా గుడి కనిపించింది. అటువైపుకి నడిచాడు.

మైకులో ఒక భక్తుడు భజనగీతాలు పాడుతూ ఉంటే, మిగిలిన వారు తాళాలు వాయిస్తూ తన్మయత్వంతో ఊగిపోతున్నారు.

గుడి అంతటా పరిచిన పాలరాతి బండలు ఎలక్ట్రిక్ దీపాల వెలుతురులో మెరిసిపోతున్నాయి.

విశాలమైన ఆ ఆవరణలోనే మూలగా, ఒక సన్యాసి కూర్చుని కనిపించాడు. అటుగా వెళుతున్న భక్తులు ఒకరిద్దరు ఆయన ముందు మోకరిల్లుతున్నారు.

సురేంద్రానంద స్వామిజీ, పూర్వాశ్రమంలో సురేంద్ర. రావు స్నేహితుడు. రావు మెదడులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది.

సంబరంగా స్వామీజీ వద్దకు వెళ్ళాడు.

"ఐహిక బంధాల నుండి విముక్తి కలిగించి, నాకు సన్యాసం ప్రసాదించండి స్వామీ!" అని ప్రార్థించాడు.

స్వామీజి చిరుమందహాసం చేశాడు.

"చూడు రావూ! సన్యాస్రాశమం స్వీకరించడం అంటే అంత సులభం కాదు. ఇప్పుడు అన్ని రకాల మఠాలూ శిష్యపరమాణువులతో నిండుగా ఉన్నాయి. కొత్తవారిని చేర్చుకోవడం కష్టం. నీకు ఏ మఠం ఆశ్రయం ఇవ్వలేదనుకో, పాలూ - పండ్లూ సమకూర్చడానికీ, మందూ - మాకూ ఇవ్వడానికి ఎవ్వరూ ఉండరు. నీకుగా డబ్బు నిలువ చేసుకోగూడదు. సర్వం త్యజించడానికి సిద్ధంగా ఉండాలి. ఏదైనా తేడా వచ్చిందా! నీ వల్లే.. హిందూ ధర్మం మంటగలిసిందని మీడియా కోడైకూస్తుంది.

ఇంకా, నీకు సన్యాసం స్వీకరించాలనిపిస్తే, ఒక పని చెయ్యి. ఇంటా - బయటా ఎవరు ఏమన్నా కోపం తెచ్చుకోకుండా, కామాన్ని అదుపులో ఉంచుకుని, మానాన్ని - అవమానాన్ని సమానంగా తీసుకుంటూ ఓ రెండేళ్ళు నీ మామూలు జీవితాన్ని గడిపి నాకు మళ్ళా కనిపించు'' అని బోధచేశాడు.

స్వామిజీ ఉపదేశం అంతా రావు చెవికెక్కలేదు. ''నీ వల్లే..'' అన్న పదం దగ్గరే ఆగిపోయాడు.

ఆ పదం విశ్వరూపం దాల్చి తనని అణగద్రొక్కుతున్నట్టనిపించింది. తిరిగి - తిరిగి అర్ధరాత్రికి ఇల్లు చేశాడు.

❦❦❦

ప్రొద్దుటే లేచి, ఎప్పటిలాగే తయారై, ఆఫీసుకి వెళ్ళాడు.

నిన్న సగంలో వదిలి వెళ్ళిన పని గురించి, ఇంజనీరు పిలిచి చీవాట్లేశాడు.

విసురుగా బయటకు వచ్చిన రావుకి ఎదురుగా తరిణయ్య కనిపించాడు. ''తరిణయ్యా! నీకసలు నేను కనిపిస్తున్నానా? నేనంటే లెక్కవుందా? తలపగిలి పోతుంటే ఒక వేడి కాఫీ తగలెయ్యొచ్చు కదా నా మొహాన. నీవల్ల నేను పని పూర్తి చేయలేకపోయా!'' అరిచి తన సీటు దగ్గరికి వెళ్ళాడు.

ఎదురుగా కూర్చునే అమ్మాయి, సెల్‌ఫోన్‌లో టెక్స్ట్  టైప్ చేస్తూ కనిపించింది. ''నీ వల్లే.. పని ఆగిపోయిందని ఇంజనీరుగారు చిందులు  టైప్ తొక్కుతున్నారు. త్వరగా సిస్టమ్‌లోకి, డి సెక్షన్ ఫైల్సన్నీ ఎక్కించు'' గట్టిగా చెప్పాడు.

ఆ అమ్మాయి రావు వంక విచిత్రంగా చూసింది.

❦❦❦

సాయంత్రం ఇల్లు చేరేసరికి, భార్య వచ్చివుంది. రావుని చూస్తూనే మొహం పెడగా తిప్పుకుంది. రావు ఒంటికాలు మీదలేచాడు.

''ఇదంతా నీవల్లే! నీ పెంపకం వల్లే పిల్లలిట్లా తయారయ్యారు. నువ్వు సంపాదించక పోవడం వల్లే మన పరిస్థితి ఇలా తయారైంది. వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా నువ్వూ సంపాదిస్తే, కొడుక్కి కిరీటం పెట్టి, నెత్తిన పెట్టుకు ఊరేగించేవాళ్ళం.. అంతా నీ..వల్లే.''

నోరు తెరుచుకుని చూడడం రాజేశ్వరి వంతయ్యింది.

ఆ రోజు నుంచీ రావు ఎంతో అసహ్యించుకునే ''నీ..వల్లే'' అన్న పదం అతనికి ప్రీతిపాత్రమయ్యింది.




# ఎర్రచందనం పుట్టగుంట గోపీకృష్ణ

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ**

**కల్వర్ట్ కింద పెట్టిన బాంబు** పేలే సమయానికి నేను ప్రయాణిస్తున్న జీపు ఇంకా ప్రమాదానికి చేరువకాలేదు.

బాంబు పేల్చినతను రెండు సెకన్లు ముందు పేల్చాడో, మా డ్రైవర్ అనుకున్న వేగానికంటే ఆఖరు నిమిషంలో నెమ్మదించాడో కానీ మా ప్రాణాలు నిలిచాయి.

జీపు కంట్రోలు తప్పి రోడ్డు పక్కన ఉన్న పల్లంలోకి జారిపోయి ఒక చెట్టుని గుద్దుకుని ఆగింది.

విస్ఫోటనం కలిగించిన భీకర శబ్దానికి నా మెదడు బ్లాంకుగా మారింది. దాని నుండి తేరుకునే లోపే తల వెళ్ళి డాష్ బోర్డుకు కొట్టుకోవటంతో నేను పూర్తిగా స్పృహ కోల్పోయాను.

అలా ఎంతసేపు ఉన్నానో తెలియదు. ఎర్రగా కాల్చిన సూదులతో తల లోపల కెలుకుతున్నట్లు కలుగుతున్న బాధ తీవ్రతకు మెలుకువ వచ్చింది. కళ్ళు తెరవకముందే అసంకల్పితంగా చేతులు తల దగ్గరకు వెళ్ళబోయాయి. కానీ, అవి కట్టేసి ఉండటంతో ఆ పని చేయటం కుదరలేదు. బలవంతంగా కళ్ళు తెరచి చూశాను. ముందు మసక మసగ్గా కనిపించిన పరిసరాలు కాసేపట్లోనే స్పష్టమయ్యాయి.

అది ఒక పూరిపాక. దాని వైశాల్యం మొత్తం కలిసి ఒక బెడ్ రూమంత ఉంటుందేమో. నేను నేలమీద కూలబడి ఉన్నాను. గుడిసె మధ్యలో ఒక గుంజ ఉంది. నా చేతులు వెనక్కి విరిచి ఆ గుంజ చుట్టూ తిప్పి కట్టెయ్యబడి ఉన్నాయి. చేతులతో గుంజని కదిలించి చూశాను. భూమిలో బాగా లోపల వరకు దిగ్గొట్టినట్లున్నారు. ఏమ్రాతం బెసకలేదు. పూరిపాక మీద వాన పడుతున్న చప్పుడు రిథమిక్‌గా డ్రమ్స్ వాయిస్తున్నట్లుంది. పైకప్పు కంతల్లో నుండీ నీరు చుక్కచుక్కగా కారి కింద నేల తడిసిపోతోంది.

నెమ్మదిగా లేచి నిలబడ్డాను. గుడిసెమధ్య ఉన్న గుంజకి కట్టెయ్యబడి ఉండటంతో గుడిసెలో సగమే కనిపిస్తోంది. గుడిసెలోని మిగిలిన సగభాగం వైపు చూడటానికి అటు వైపు తిరిగిన నేను ఉలిక్కిపడ్డాను.

అప్పటివరకు అక్కడ నాతో పాటు మరో మనిషి ఉంటాడని ఊహించక పోవటంతో హఠాత్తుగా కనిపించిన వ్యక్తి నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తాడు.

"ఎవర్నువ్వు?" అడిగాను నేను. అంత బాధలోనూ నా స్వరం అధికారయుతంగానే ధ్వనించింది.

అతను సమాధానం చెప్పలేదు. అతని చూపులు నన్ను కాకుండా శూన్యంలోకి చూస్తున్నాయి. అసలతనికి నేను మాట్లాడిన మాటలు వినిపించాయా? వినిపిస్తే అర్థమయ్యాయా? అనే ప్రశ్నలు నాలో పొడచూపాయి.

మళ్ళీ అదే ప్రశ్న అతన్ని అడుగుదాం అనుకున్నంతలో అతని చూపు శూన్యం నుండి నా మీదకు మరలింది.

''పకీరయ్య'' గొణుగుతున్నట్లు అన్నాడతను.

'అమ్మయ్య' అనుకున్నాను. ఈ ఏరియాలో తెలుగు సరిగా అర్థం కాని గిరిజనులు ఎక్కువ. ఎదుటి వ్యక్తి నా ప్రశ్నకు సమాధానం ఇచ్చాడంటే అతనికి నా మాటలు బాగానే అర్థమయ్యాయన్నమాట.

అతన్ని మరొకసారి ప్రశ్నించే ముందు పరికించి చూశాను. బద్ధకంగా కదులుతున్నాడతను. ఏనాడూ తైల సంస్కారం ఎరుగని జుట్టు చిందరవందరగా ఉంది. నల్లగా ఉన్న చర్మం మీద పదిరోజులుగా పెరిగిన తెల్లని గడ్డం వరి నూర్పిళ్ళు చేసిన నల్లరేగడి పొలంలో మిగిలిన మొదళ్ళలా ఉంది.

''పకీరయ్యా!.. నన్నెందుకిలా కట్టేశావ్?'' సూటిగా అడిగాను.

అర్థంకానట్లు చూశాడతను. తల దించుకుని కాసేపు పేడతో అలికిన నేలవైపు చూస్తూ ఉండిపోయాడు. కింద తడిచిన నేలమీద కాలివేలితో సున్నాలు చుడుతున్నాడతను. ''నేనెవరో తెలుసా? గవర్నమెంటు ఆఫీసర్ని. నన్నిలా కట్టెయ్యటం నేరం. ఈ పని చేసినందుకు నిన్ను జైల్లో పెడతారు. మర్యాదగా నా కట్లు విప్పు.''

అతను సమాధానం ఇవ్వలేదు. ఏ ఆచ్ఛాదనా లేని ఎముకల గూడులాంటి శరీరం మీద ఎక్కడి నుండో వచ్చి ఒక ఈగ వాలింది. అతను నెమ్మదిగా దానిని తోలాడు. ఎగిరినట్లే ఎగిరి వెంటనే వచ్చి అదే ప్రదేశంలో మళ్ళీ వాలింది ఆ ఈగ. ఈసారి అతను దానిని తోలలేదు. అతను కట్టుకున్న పంచె ఏనాడూ ఉతకటానికి నోచుకున్న దాఖలాలు లేక కావిరంగుకు మారిపోయి ఉంది. అసలే మోకాళ్ళపైన ఉన్న ఆ పంచని ఇంకా పైకి జరిపి తొడమీద గోక్కున్నాడు. అతను గోకినచోట నల్లటి చర్మం మీద తెల్లని చారలు గీతలుగా పడ్డాయి.

ఇక అతను నా ప్రశ్నకి సమాధానం ఇవ్వడనుకుంటున్న తరుణంలో, ''కట్టేసింది నేను కాదు'' అన్నాడు.

''మరి ఎవరు ఆ పని చేసింది?''

చెయ్యి పక్కకి జరిపి తడిమాడతను. అక్కడ అప్పటివరకు నాకు కనిపించని ఒక భారీ గొడ్డలి ఉంది. దానిని చేతిలోకి తీసుకుని పదునైన అంచును చేతితో తడుముతూ, ''ఎర్రచందనం కోసం వచ్చిన సేట్లు'' అన్నాడు.

''వాళ్ళు సేట్లు కాదు, దొంగలు..'' కసిగా అన్నాను. మళ్ళీ తన కోపమే తన శత్రువు అన్న సామెత గుర్తుచేసుకుని ''కట్లు విప్పటానికి కట్టేసింది ఎవరయితేనేం? ముందీ చేతి కట్లు విప్పు. ఇంకాసేపు ఇలాగే ఉంటే రక్తప్రసరణ లేక చేతులు చచ్చుబడిపోతాయి.'' అన్నాను బ్రతిమాలాడుతున్న ధోరణిలో.

అర్థం కానట్లు చూశాడు పకీరయ్య. అనుభవం మీద అప్పటికే అతని సంగతి నాకు బాగా తెలిసింది. అతనికి మనం చెప్పిన మాటలు అర్థం కావటానికి కాస్త సమయం పడుతుంది. అందుకే మళ్ళీ నా మాటలు రిపీట్ చేసే ప్రయత్నం చెయ్యలేదు నేను.

''నన్ను నీకు కాపలా పెట్టారు. వదిలేత్తే సంపేత్తారు.'' యధాప్రకారం ఎప్పటికో చెప్పాడు.

''ఎక్కడ ఉన్నారు వాళ్ళు?'' అడిగాను.

అతను లేచి గుడిసె బయటకు వెళ్ళాడు. తడికల్తో చేసిన తలుపు తీయగానే ఏర్పడిన ఖాళీలోనుండి బయటి దృశ్యం కనిపించింది. వాన అనుకున్నదానికంటే భారీగా పడుతోంది. దూరంగా కొట్టేసిన పెద్దపెద్ద మానులు కనపడుతున్నాయి. వాటినన్నిటినీ తీసుకెళ్ళటానికి వీలుగా లారీలు తయారుగా ఉంచారు. ఆ దుంగలు రక్తచందనం దుంగలని నాకు ఎవరూ చెప్పనవసరం లేదు. వాటిని

అరమైలు దూరం నుండి చూసి పోల్చుకోగలను. ప్రస్తుతం నా మెదడు కొట్టి పడేసిన ఆ దుంగల విలువని అంచనా వేసే పనిలో పడింది. దాదాపు ఇరవై కోట్ల సరకు అది.

అన్నట్లు నేనెవరో చెప్పలేదు కదూ! ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్లో డివిజనల్ అధికారిగా పనిచేస్తున్నాను. ఈ మధ్య కాలంలో విపరీతంగా పెరిగిపోయిన ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టటానికి ప్రత్యేకంగా ఏర్పరిచిన విభాగానికి అధికారిని.

నేను అధికారిగా వచ్చిన కొద్దికాలంలోనే అంతకుముందు ఎన్నడూ లేనంతగా ఎర్రచందనం పట్టుకున్నాను. ఎన్నో రివార్డులూ, అవార్డులూ అందుకున్నాను. సరాసరి ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రశంసాపత్రం తీసుకున్నాను.

నేను అధికారిగా వచ్చాక స్మగ్లింగ్ బాగా తగ్గిపోయిందని అందరూ అంటున్నారు.

ఇంతలో ఒక వార్త - స్మగ్లింగ్ చేయటానికి దినమణి రంగంలోకి దిగాడని.

దినమణి ముఠా అంటే తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలో ప్రస్తుతం బాగా యాక్టివ్‌గా ఉన్న ముఠా. వాళ్ళు ఇప్పుడు ఇంతదూరం వచ్చి ఇక్కడ కూడా యాక్టివిటీ మొదలు పెట్టారంటే అది విస్తరిస్తున్న ఎర్రచందనం దొంగతనాలకు పరాకాష్ఠ.

వీరప్పన్ తరువాత తిరిగి ఆ స్థాయి స్మగ్లర్ అతను. అడ్డువచ్చిన వాళ్ళని లేపేసి అయినా తన పని చేసుకుపోతాడు. ఆ వార్త విని అందరూ భయపడ్డారు. నేను మాత్రం ఆనందించాను. ఆ విషయాన్ని అతన్ని పట్టుకోవటానికి దొరికిన అవకాశంగా తీసుకున్నాను. నిఘాని మరింత విస్తృతం చేశాను.

నాలుగు రోజుల క్రితం ఒక కుర్రాడు అడవిలో సంచరిస్తూ అనుమానాస్పద పరిస్థితుల్లో మా ఫ్లయింగ్ స్క్వాడ్‌కి దొరికాడు. తీసుకు వచ్చి నాలుగు ఉతికాం. మొదట ఏమీ చెప్పలేదు. నేను ఇంటరాగేషన్ మొదలు పెట్టగానే ఒక పెద్ద రహస్యం చెప్పేశాడు. ఏనాడూ లేనంత పెద్దమొత్తంలో అడవిలో ఎర్రచందనం చెట్లు నరికారనీ, వాహనాలలో వాటిని తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయనీ చెప్పాడు.

ఆ చెప్పిన వాడికి సరిగ్గా వాటి విలువ తెలియకపోయినా వాడు చెప్పిన దుండగుల సంఖ్య, సైజుల వివరాలను బట్టి వాటి విలువ ఎంత ఉంటుందో నేను మనసులోనే అంచనా వేసుకున్నాను. రాష్ట్ర చరిత్రలోనే కాదు. దేశ చరిత్రలోనే ఇంత విలువయిన ఎర్రచందనాన్ని స్మగ్లర్ల చేతుల నుండి విడిపించిన సంఘటన ఇంతవరకు జరగలేదు. అలాంటి అసాధ్యాన్ని నేను సాధించానంటే నాకు రాబోయే ప్రమోషన్ సంగతి పక్కన పెడితే, దానివలన నాకు వచ్చే పేరు తలచుకుంటే మనసు ఉప్పొంగిపోతోంది.

అయితే తరలిస్తున్నది దినమణి అయినపుడు వాడి ఎత్తుకు తగిన పై ఎత్తులు మేంకూడా వెయ్యకపోతే ఎస్టైన్‌మెంట్లో విఫలమవటమే కాదు ఒకొకసారి ప్రాణాలకు కూడా ప్రమాదం కలగవచ్చు,

అందుకే మరింత సమాచారం కోసం దొరికిన కుర్రాడి మీద ఇంటరాగేషన్ తీవ్రతరం చేశాను. కానీ, ఏమీ ఉపయోగం లేకుండా పోయింది. ఆ కుర్రవాడికీ, స్మగ్లింగ్ ముఠాకీ ఏ సంబంధమూ ఉన్నట్లు అనిపించలేదు. వాళ్ళు చెట్లు నరకటానికి తీసుకువెళ్ళిన అనేకమందిలో ఇతను ఒకడు.

సీక్రెట్ ఆపరేషన్సులో సమాచారం ఎంత విలువయినదో నాకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. మూడో మనిషికి తెలిసిన సమాచారం ఎప్పటికీ రహస్యం అనిపించుకోబడదని నాకు అనుభవం నేర్పిన పాఠం. అందుకే ఈ విషయం సహచరులకి కానీ, పై అధికారులకి కానీ చెప్పలేదు. ఈ వృత్తి చేపట్టిన కొత్తలో మా సహచరులని నమ్మి చేపట్టిన అనేక ఆపరేషన్స్ ఫెయిల్ అయిన తరువాత కానీ లోపం ఎక్కడ ఉందో నాకు తెలియలేదు. అప్పటి నుండి నేను చేపట్టే సీక్రెట్ ఆపరేషన్సుకు సంబంధించిన ఏ విషయము ఆఖరిక్షణం వరకు ఎవరికీ తెలియనివ్వను.

ఈసారి కూడా ఆ కుర్రాడు చెప్పిన విషయాన్ని నాలోనే దాచుకున్నాను. అతన్ని ఎవరికీ అందుబాటులో లేని నా పర్సనల్ కస్టడీలో పెట్టుకున్నాను.

నా కస్టడీలో ఉన్న కుర్రాడు ఇచ్చిన సమాచారం ప్రకారం అడవిలో ఎర్రచందనం నరుకుతున్న ప్రదేశం నక్కలదొడ్డికి తూర్పు దిక్కున నాలుగయిదు కిలోమీటర్ల దూరంలో ఉంది. నక్కల దొడ్డి వరకూ వాహనం వెళ్తుంది. ఆ తరువాత కాలినడకనే వెళ్ళాలి.

ఆ రాత్రి దాడి మొదలుపెడుతున్నాం అన్నప్పుడు కూడా నేను మా సిబ్బంది ఎవరికీ ఎక్కడకు వెళ్తున్నామో చెప్పలేదు. అయితే ఇలాంటి దాడులకు వెళ్ళేటపుడు తీసుకువెళ్ళవలసిన సామాగ్రిని సరిచూసుకోమని ఒకటికి రెండు సార్లు హెచ్చరించాను. మా సిబ్బందిలో మెరికల్లాంటి ఆరుగురిని సెలక్ట్ చేశాను. అందరికీ ఆయుధాలు ఇప్పించాను. అందరం కలసి జీపు ఎక్కాక నక్కల దొడ్డికి తీసుకు వెళ్ళమని డ్రైవర్ని ఆదేశించాను.

నక్కలదొడ్డి దగ్గరకు వచ్చేశామని అనుకుంటుండగా జరిగింది.. ఎవరూ ఊహించని బాంబుదాడి. తరువాత ఏమి జరిగిందో మీకు తెలిసిందే!

ఇంతలో నా ఆలోచనలకు భంగం కలిగిస్తూ బయటకు వెళ్ళిన ముసలాడు లోపలకు వచ్చాడు. "వానకి అందరూ ఎటో పోయారు" అన్నాడు. నాకు అర్థం కాలేదనుకున్నాడేమో, "ఆళ్ళుంటే అడిగి నీ కట్లు ఇప్పుదామనుకున్నా" అని వాళ్ళని వెతికిన కారణం చెప్పాడు.

"నువ్వడిగినా వాళ్ళు ఒప్పుకోరులే" అని నా మనసులో అనుకున్నా. పైకి మాత్రం "పెద్దాయనా! వాళ్ళని తరువాత అడగవచ్చులే. ముందు కట్లు విప్పు. చేతులు చచ్చుబడిపోతున్నాయ్." అన్నాను.

గడ్డం గోక్కుంటూ ఆలోచనలో పడ్డాడు అతను.

అతన్ని పూర్తిగా ఆలోచించుకోనివ్వకుండా, "తప్పించుకుపోవటానికి నాకేమన్నా దారి తెలుసునా? కట్లు విప్పు పెద్దాయనా.." అని త్వరపెట్టాను. ఈ మొత్తం సెటప్‌లో ఇతనే వీక్ లింక్ అనిపిస్తోంది. ఇంత భారివాన లేకపోతే బయటకు వెళ్ళిన దొంగలందరూ వచ్చేసే వారే. వారు వస్తే నా పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేను. అటవీ అధికారులని నిర్దయగా చంపిన వీరప్పన్ వారసుడు దినమణి.

నెమ్మదిగా నడుచుకుంటూ నా వెనక్కి వచ్చాడు పకీరయ్య. చేతి కట్లు విప్పాడు. కట్లు విప్పిన చాలాసేపటి తరువాత కూడా నా చేతులు పూర్తిగా స్వాధీనంలోకి రాలేదు. రక్తప్రసరణ కోల్పోయిన భాగాలలోకి తిరిగి ప్రసరిస్తున్న రక్తం తీవ్రమయిన స్పందనల్ని కలిగిస్తోంది.

కాసేపటికి కోలుకున్న నేను లేచి ఒళ్ళు విరచుకున్నాను.

పారిపోవటానికి రెడీ అవుతున్నాననుకున్నాడేమో, పకీరయ్య గొడ్డలి పట్టుకుని లేచి నిలబడ్డాడు నన్ను అడ్డుకోవటానికి అన్నట్లు.

అతని ప్రయత్నం చూసి మనసులో నవ్వుకున్నాను. చేతిలో గొడ్డలి ఉన్నా పారిపోదలిస్తే అతను నన్ను ఆపలేడు. నా శారీరక ధారుఢ్యం ముందు అతను నాకు ఒక లెక్కలోకి రాడు. అయినా, నేను ఆలోచిస్తోంది అదికాదు. పారిపోయి చేయగలిగింది ఏముంది? ఇక్కడ నుండి బయటపడటానికి దారి నాకు తెలియదు. ఉపయోగం లేదని అనిపిస్తున్నా ఒకసారి మొబైల్ తీసి చెక్ చేశాను. సిగ్నల్స్ లేవు. ఇక్కడనుండి ఎలాగయినా నేను బయటపడాలి. అదీ త్వరగా. దొంగలు వచ్చేలోపే. అలా జరగాలంటే ఒకటే మార్గం. ఈ ముసలాడిని ఉపయోగించుకోవాలి. ఇంతకంటే నాకు కాపలా పెట్టటానికి ఆ దినమణికి వేరే డఫర్ ఎవరూ దొరకలేదనుకుంటే నాకు నవ్వు వస్తోంది.

నవ్వును నాలోనే అణచుకుని, "భయపడకు పకీరయ్యా! నేనేమీ పారిపోవటం లేదులే!" అంటూ వచ్చి తిరిగి గుడిసె నేల మీద కూర్చున్నాను.

ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి. "నువ్విక్కడెందుకున్నావ్?" అన్నాను.

"కడుపు కాలి వచ్చానయ్యా! కడుపు కాలి" నిష్టూరంగా అన్నాడు పకీరయ్య. కాసేపాగి. "వారం రోజులాయె.. ఈ సన్నాసోళ్ళు మా గూడేనికి దిగబడి. కట్టెలు కొట్టే మడుసులు కావాలన్నారు. అప్పుడు నాకేం ఎరిక ఇది ఎదవ పనని. దండిగా డబ్బిస్తారని వచ్చాను. వచ్చేటోడ్ని ఒక్కడ్నే వచ్చినా పోయేది. కొడుకును కూడా లాక్కొచ్చి ఈ రొంపిలోకి దింపాను.."

అతని నోటి నుండి అన్ని మాటలు ఆపకుండా వినటం ఆశ్చర్యంగా ఉంది. అతను మాట్లాడే ప్రతి మాటలోనూ అవకాశాన్ని వెతుకుతూ నా మెదడు కంప్యూటర్ వేగంతో పనిచేస్తోంది. అతని మాటల్లో రెండు విషయాలు తెలిశాయి. ఈ ముసలాడు తన ఇష్టప్రకారం ఈ పని చెయ్యటంలేదు. పైగా అతని కొడుకును ఇందులో ఇరికించినందుకు బాధపడుతున్నాడు కూడా.

"అంత దుర్మార్గులా వీళ్ళు?"

"అయ్యో! నాయనా.. ఈ నాయాళ్ళు సామాన్యులుగాదు. మడుసుల పానాలంటే అసలు లెక్కేలేదు."

"నీ కొడుకేడి?"

ఒక్కసారిగా పకీరయ్య మొహం మ్లానమయింది. "అదేనయ్యా నా బాధ.." అంటూ అరచేత్తో నెత్తిని చరచుకుంటూ భోరుమన్నాడు.

"ఏమయింది?"

ఏడవటం అయ్యాక చెప్పటం మొదలు పెట్టాడు. "చెట్లు నరకటం పూర్తయి నాలుగు రోజులయిందయ్యా! ఆటిని తీసుకుపోవటానికి వచ్చిన లారీ చెడిపోయి సచ్చింది. మెకానిక్కుని తీసుకురమ్మని నా కొడుకును పంపారు. ముందు ఆడిని ఆ పనికి పంపటానికి నేను ఒప్పుకోలా. ఆ ఇసయాలు ఆడికి తెలియదని చెప్పా! నా మాట ఇనిందెవరు? పైగా పోకపోతే నన్ను సంపుతామన్నారు. నాకోసం ఆడుపోయాడు. ఇంతవరకు రాలేదు. ఏమయ్యాడో తెలియదు."

పకీరయ్య మాటలు నా చెవుల్లో అమృతాన్ని ఒలికిస్తున్నట్లున్నాయి. నాలుగు రోజుల క్రితం నా చేతుల్లో చిక్కింది పకీరయ్య కొడుకే. ఎందుకంత ఖచ్చితంగా చెప్పగలనంటే నేను ఇంటరాగేషన్ చేస్తున్నపుడు వాడు ఇదే చెప్పాడు - లారీ మెకానిక్ కోసం తనను స్మగ్లర్లు పంపారని.

"నీ కొడుకు పేరేంటి? పోతురాజా?" అడిగాను.

ఒక్కసారిగా కొడుకు పేరు నా నోటి నుండి రావటంతో ఉలిక్కిపడ్డాడు పకీరయ్య "అయ్యా! నా కొడుకు పేరు మీకెట్టా తెలుసు?" నా ఎదురుగా వచ్చి గొంతుకు కూర్చుని ఆశగా నా మొహంలోకి చూస్తూ అన్నాడు.

"జుట్టు ఉంగరాలు తిరిగి ఉంటుంది కదూ. తెల్లచొక్కా, ఖాకీ నిక్కరు తొడుక్కుని ఉన్నాడు. ముందు పన్ను సగం విరిగి ఉంటుంది."

"అయ్యా! వాడేనయ్యా నా కొడుకు. వాడిని ఎలాగయినా కాపాడండయ్యా!" అంటూ నా కాళ్ళ మీద పడ్డాడు పకీరయ్య.

నేను అతన్ని నాకాళ్ళ మీద నుండి లేపే ప్రయత్నం చేయలేదు. నా బుర్ర మరింత వేగంతో ఆలోచిస్తోంది. ఇదే అవకాశం అని నా మనసు పదే పదే చెప్తోంది. వచ్చిన అవకాశాన్ని వాలుకోకుండా ఎలాగయినా ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నాను. దానికిగానూ రకరకాల ప్రణాళికలు నా మెదడులో సిద్ధమవుతున్నాయి.

"నీ కొడుకు నా సంరక్షణలో ఉన్నాడు. అతనికేం భయం లేదు." నెమ్మదిగా చెప్పాను.

"అయ్యా! వాడు అన్నెం పున్నెం ఎరగనోడయ్యా! వాడిని ఇడిపించండయ్యా.." ఇంకా గట్టిగా కాళ్ళు పట్టుకుంటూ అన్నాడు పకీరయ్య.

"నువ్వు నన్ను కాపాడు. నేను నీకొడుకును కాపాడతాను."

అర్థం కానట్లు అయోమయంగా చూశాడు పకీరయ్య. "నేను మిమ్మల్ని కాపాడేది ఏందయ్యా?" అనుమానంగా అడిగాడు.

"మరి నేను బయటపడితేనేగా నీ కొడుకును నేను విడిపించగలిగేది. నువ్వే ఆలోచించు."

పకీరయ్య చేయలేనిది అదే - ఆలోచించటం. ఆ సంగతి నాకు బాగా తెలుసు. నేను అనుకున్నట్లే అతను అయోమయంగా చూస్తున్నాడు.

"ఇక్కడ నుండి బయటపడే దారి నీకు తెలుసా?"

"అడవిలో పుట్టినోళ్ళం. అడవి దారులు తెలియకుండా ఉంటాయా అయ్యా?" మొదటిసారి ధైర్యంగా మాట్లాడాడు పకీరయ్య.

"అయితే ఆలస్యం ఎందుకు? పద లారీ తీసుకువెళ్దాం. మనం బయటపడ్డాక నీ కొడుకును విడిపిస్తాను."

"మీకు లారీ నడపటం?" అనుమానంగా అడిగాడు అతను.

నవ్వాను. "వచ్చు. ఆలస్యం చెయ్యకుండా పద"

ఒకసారి తలగోక్కున్నాడు ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు.

"నువ్వు ఎవరికీ భయపడనవసరంలేదు. నేను తప్పించుకోవటం ఆలస్యం నీ కొడుకుని విడిపించిపెట్టే పూచీనాదీ.." భరోసా ఇచ్చాను.

ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది పకీరయ్యకి. గుడిసె తలుపు తీసి, అటూ ఇటూ చూసి ఎవరూ లేరని నిర్ధారించుకుని నన్ను లారీ దగ్గరకు తీసుకువెళ్ళాడు.

ఈలోపు వాన కుంభవృష్టిగా మారింది. బహుశా తుఫానేమో! ఇప్పుడప్పుడే తగ్గే సూచనలు కనబడటం లేదు. ఆ మట్టి రోడ్డు మీద అంత లోడుతో ఉన్న లారీని నడపటం ఎంత కష్టమో నాకు తెలుసు. అయినా అంతకుమించి అక్కడనుండి తప్పించుకోవటానికి మరో మార్గం కనబటంలేదు.

లారీ ఎక్కి స్టార్ట్ చేశాను. వెంటనే స్టార్ట్ అయింది. మెకానిక్ పనితనం బానే ఉంది. దొంగలకు సహకరించిన ఆ మెకానిక్ ఎవరో కనుక్కొని వాడిని కూడా విరగదియ్యాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది. కానీ, అది సమయం కాదని ఊరుకున్నాను. పకీరయ్య నా పక్కన కూర్చున్నాడు. లారీ ముందుకు కదిలింది. మొదట కాసేపు గుండె గుబగుబలాడింది - దొంగలు ఏ చెట్టు చాటు నుండి వచ్చి ఆపుతారో అని. కానీ ఎవరూ ఆపలేదు.

నెమ్మదిగా కదిలిన లారీ ముందుకు నడిచింది. జోరున కురుస్తున్న వానకు నేలంతా బురదగా మారిపోయి ఉంది. అలాంటి ప్రదేశాల్లో నడపటం అలవాటు లేక రెండు మూడు సార్లు స్కిడ్ అవబోయింది. కానీ నా అనుభవాన్నంతా రంగరించి ముందు నడుపుతున్నాను.

పకీరయ్య కళ్ళు చిట్లించుకుని అద్దంలో నుండి బయటకు చూస్తూ నాకు మార్గదర్శనం చేస్తున్నాడు. నేను ఏకాగ్రతతో డ్రైవింగ్ మీద దృష్టి పెట్టాను.

ఒక గంటలో మట్టి రోడ్డు దాటి పక్కా రోడ్డు ఎక్కింది లారీ. అక్కడ నుండి డ్రైవింగ్ అంత కష్టం కాలేదు. టెన్షన్ అంతా తీరి రిలాక్సయ్యాను.

"నమ్మలేకుండా ఉన్నాను. దినమణి లాంటి స్మగ్లర్ల చేతుల్లో చిక్కుకుని ప్రాణాలతో బయటపడటం ఎలా సాధ్యమైందో నాకే అర్థం కావటంలేదు" అన్నాను నేను నాలో నేను అనుకుంటున్నట్లు.

"అది కూడా ఇంత కలపతో.." అన్నాడు పకీరయ్య.

అప్పటిదాకా నాకు ఆ సంగతే గుర్తులేదు. లారీ నిండా ఎర్రచందనం కలప నింపి ఉంది. మిగిలిన లారీల సంగతి పక్కన పెడితే ఈ ఒక్క లారీలో ఉన్న ఎర్రచందనం చాలు. నేను అనుకున్న విజయం తెచ్చిపెట్టడానికి.

"ఈ తుఫాను దెబ్బకి అందరూ ఎటో పోయుంటారు. మీరు తప్పించుకోగలరని ఆళ్ళు అనుకోరు. ఆళ్ళుండుంటే మనకి ఈ సాన్సు దొరికేది కాదు. ఆళ్ళు శానా దుర్మార్గులయ్యా."

"ముందు ఆ లారీని ఊర్లోకి చేర్చి తరువాత పోలీసులను తీసుకుని మరలా వస్తాను. ఎవడ్నీ వదలను. అందర్నీ పట్టుకుంటాం."

"అయ్యా! ముందు నా కొడుకు సంగతి చూడయ్యా" వేడుకుంటూ అన్నాడు పకీరయ్య.

"వెళ్తున్నాం కదా!"

"ఎట్టా ఉన్నాడో? ఒకసారి ఫోనులో కనుక్కొని విడిపించండయ్యా" కళ్ళెమ్మట నీరు కారుతుంటే దీనంగా అడిగాడు.

ఆలోచించాను. ఇక పోతురాజు ఉన్నా లేకున్నా భయం ఏముంది? ఈ పకీరయ్య నాదగ్గర ఉండగా ఆ పోతురాజుతో ఏం పని? అనుకున్నాను.

లారీ పక్కకి తీసి ఆపి జేబులోని సెల్ ఫోన్ తీశాను. సిగ్నల్స్ ఉన్నాయి. ఫోన్ చేశాను. మా ఆఫీసర్ ఆంజనేయులు ఫోన్ ఎత్తాడు.

నాతోపాటు బయలుదేరిన మిగిలిన వారి పరిస్థితి అడిగాను. వారందరూ క్షేమంగా ఉన్నారనీ, అందరూ తిరిగి ఆఫీసుకు చేరుకున్నారనీ, నాగురించే ఆందోళన పడుతున్నారనీ చెప్పాడు. నేను కూడా వారిలా వెనక్కి వచ్చి ఈ వానల వలన ఎక్కడన్నా చిక్కుకుపోయానో, లేదా కిడ్నాప్ అయ్యానో తెలియక భయపడుతున్నారంట.

"డోంట్ వర్రీ! కిడ్నాప్ అవటమూ జరిగింది. బయట పడటమూ జరిగింది" గర్వంగా చెప్పాను.

"మీరు సామాన్యులు కాదు సార్" నన్ను ఆకాశానికి ఎత్తాడు ఆంజనేయులు.

కష్టడీలో ఉన్న పోతురాజుని వదిలేయమని చెప్పి ఫోన్ పెట్టేశాను.

"సంతోషమా?" అడిగాను పకీరయ్య వైపు చూస్తూ.

ఎటూ కాకుండా తల ఊపాడు.

అంతలో మా ఫారెస్ట్ డిపార్టుమెంట్ వాళ్ళ చెక్ పోస్ట్ వచ్చింది. అక్కడ అందరూ నన్ను లారీలో చూసి ఆశ్చర్యపోయారు. వరుసగా నిలబడి సెల్యూట్ చేశారు. "అప్పుడే ఏమయ్యింది? ఇంకా ఇలాంటి లారీలు మరో మూడు ఉన్నాయి." అని గర్వంగా చెప్పకుండా ఉండలేక పోయాను. తరువాత చెక్ పోస్ట్ దగ్గర అయితే ఎవరూ ఆపనేలేదు. నేను లారీలో ఉన్నానని ఇంతకు ముందు చెక్ పోస్ట్ వాళ్ళు ఫోన్ చేసి చెప్పి ఉంటారు. నా కాన్ఫిడెన్స్ ఇంతకు ముందుకంటే రెట్టింపు అయింది.

రెండవ చెక్‌పోస్ట్ దాటిన కాసేపటికి "అయ్యా! ఒకసారి ఆపుతారా?" అన్నాడు పకీరయ్య.

"ఎందుకు?" విసుగ్గా అడిగాను. ఇదే వేగంతో వెళితే ఇంకో గంటలో మా ఆఫీసుకు చేరుకుంటాం. అక్కడ నాకు ఎదురవబోతున్న స్వాగతాన్ని తలచుకుని ఏ కాస్త ఆలస్యాన్నీ భరించలేకపోతున్నాను.

చిటికిన వేలు ఎత్తి మిగిలిన వేళ్ళు మడిచి చూపించాడు.

నాకు కూడా అదే సెన్సేషన్ ఉండటంతో ఆపి దిగాను. రోడ్డుకు చెరో పక్కకి వెళ్ళాం.

ఎదురుగా కనిపిస్తున్న కొండల్ని చూస్తూ పని కానిస్తున్నాను. ఆ కొండలు తమిళనాడులో ఉన్నాయి. అక్కడకు చేరుకోవాలంటే ఇక మన రాష్ట్ర చెక్‌పోస్ట్‌లు ఏమీ లేవు. తమిళనాడు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ చెక్ పోస్ట్ వారిని మేనేజ్ చేస్తే ఎంతలోడయినా తేలిగ్గా అక్కడకు తీసుకుపోవచ్చు. అదంతా దినమణి సామ్రాజ్యం. అక్కడ అతడ్ని ఎవరూ పట్టుకోలేరు. అతడు ఈసారి ఈ ఏరియాని సెలక్ట్

చేసుకోవడానికి కూడా అదే కారణం అయి ఉంటుంది. ఒకటి రెండు చెక్‌పోస్టులు దాటిస్తే సరాసరి తన రాష్ట్రానికి వెళ్ళిపోవచ్చు. కాకపోతే కాస్త కాన్ఫిడెన్స్ ఎక్కువయి ఈసారి నా ఇలాకాలోకి వచ్చాడు. నాలాంటివాడు ఎదురవుతాడని అనుకుని ఉండడు.. అనుకుంటుంటే, 'ఫట్'.. అని శబ్దం అయింది.

ఆ శబ్దం ఐరన్ రాడ్ నా తల వెనుక భాగానికి తగిలినపుడు కలిగిన శబ్దం అని వారం తరువాత హాస్పిటల్లో మెలుకువ వచ్చాక తెలిసింది.

నేను దాటి వచ్చిన చెక్‌పోస్టల నుండి మరో మూడు లారీలు నా వెనుకే వెళ్ళిపోయాయని తరువాత తీరిగ్గా తెలిసింది. ముందు లారీలో నేను ఉండటంతో అవి కూడా నా కంట్రోల్లో ఉన్నాయనుకున్న చెక్‌పోస్ట్ వాళ్ళు వాటిని ఆపలేదంట. ఆ విషయం మరో రెండు రోజుల తరువాత తెలిసింది.

దినమణిని ఓడిస్తున్నాననుకున్నాను. కానీ, నన్నే దినమణి ఓడించాడు. ఎదురుగా నిలిచిన ప్రత్యర్థిని గుర్తించలేక బోర్లా పడ్డాను.

హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయినా ఇంకో చిన్న అనుమానం నన్ను పీడిస్తోంది.

ఇంతకీ దినమణి ఎవరు?

కొడుకును విడిపించుకు పోయిన ముసలాయనా?

తండ్రి చేత నాటకం ఆడించి కలపతో సహా రాష్ట్రం దాటిపోయిన పోతురాజా?




# దృశ్యం డా.సుభద్ర వేదుల

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

"ఎంత బాగుందో సినిమా, ఎంకటేష్ యాక్టింగ్ సూపరసలా, కదే వరలక్ష్మీ? ఆ కుర్రోడు సచ్చిపోయినందుకు కూసింత బాదేసిందనుకో, అయినా మీనావోల్లు కావాలని సంపలేదు కదా ఆడిని." అడుగుతోంది శివాలక్ష్మి తన స్నేహితురాలిని.

వెంకటేష్, మీనా జంటగా నటించిన 'దృశ్యం' సినిమా చూసి వస్తున్నారా స్నేహితురాళ్ళిద్దరూ. ఔనన్నట్టు మౌనంగా తల ఊపింది వరలక్ష్మి.

"ఏటే వరాలూ, మాతాడతల్లేవు? ఏటయింది?, ఒంటో బాగోనేదా? సోడా తాగుదారా? "అని ఆత్రంగా అడిగింది శివాలక్ష్మి, ఎప్పుడూ గల గలా మాట్లాడే స్నేహితురాలు ఆ రోజు ముభావంగా ఉండడం చూసి.

"వద్దెహే, నేను బాగానే ఉన్నాను, పద ఎళదారి, బస్ అందదు లేకపోతే" అంటూ వేగంగా అడుగులు వేసింది వరలక్ష్మి.

బస్ వేగాన్ని మించిన ఆలోచనలు వరలక్ష్మి మనసులో. సినిమా చూసినప్పటినించీ మరీ ఎక్కువయ్యాయి, అందుకే మౌనంగా కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది. స్నేహితురాలేమీ మాట్లాడకపోయేసరికి సీటుకి ఆనుకుని కునుకు తియ్యసాగింది శివాలక్ష్మి.

★★★

వారిద్దరిదీ అమలాపురానికి దగ్గరలో ఉన్న అప్పనపల్లి అనే ఊరి పక్కనున్న పల్లెటూరు. ఇద్దరికీ దూరపు చుట్టరికం ఉన్నా, స్నేహమే ఎక్కువ. ఇద్దరూ చేలల్లో పనులకెళతారు. శివాలక్ష్మి భర్త సత్తిబాబు దింపులు తీయిస్తాడు, తీస్తాడు, అంటే కొబ్బరి కాయలు దింపించడం, అవన్నీ లెక్క పెట్టి జాగ్రత్తగా యజమానులకి అప్పచెప్పటం, వారిచ్చినది పుచ్చుకోవడం అతని ఉద్యోగం. వరలక్ష్మి భర్త వీర్రాజుకి అప్పనపల్లి వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర కొబ్బరికాయలు, పూలు, పళ్ళూ అమ్మే కొట్టుంది.

వరలక్ష్మీ, వీర్రాజులకి ముగ్గురు ఆడపిల్లలు, వీర్రాజుకింకా కొడుకు కావాలని ఆశ. ఉన్నవాళ్ళు చాలు, వాళ్ళు ఆడైనా, మగైనా బాగా చదువు చెప్పించి మంచి ఇళ్ళల్లో పెళ్ళిళ్ళు చెయ్యాలని వరలక్ష్మి కోరిక, అందుకే వాళ్ళని స్కూల్లో చదివిస్తుంది, వాళ్ళు చక్కగా యాస లేకుండా మాట్లాడుతూ, బాగా చదువుకుంటున్నందుకు ఆమెకెంతో సంతోషంగా ఉంటుంది. చిన్నదో, పెద్దదో, ఏదో ఒక పని

చేసుకుంటూ వాళ్ళు తమ కాళ్ళ మీద తాము నిలబడాలని ఆమె ఆశ.  శివాలక్ష్మికి ఒక కొడుకు, కూతురు. ఇద్దరూ ఎప్పుడూ జంటగానే కలిసి తిరుగుతారు, కలిసే పనిలోకి వెళతారు

ఇద్దరివీ చిన్న ఇళ్ళే, ఈ మధ్యనే తాటాకు కప్పులు తీసి సగంవరకూ  పెంకులేసుకున్నారు. వెనకొక చిన్న వంటగదీ, దానినానుకుని ముందుకో గదీ, చూరు బాగా కిందకి దిగినచోట గుమ్మానికి అటూ, ఇటూ చిన్న అరుగులు. వెనక వైపు చిన్న పెరడూ, దాంట్లోనే కొబ్బరాకులతో కట్టిన స్నానాలగదీ. వానాకాలం కాలవ దగ్గరకెళ్ళి స్నానాలు చెయ్యడం కష్టంగా ఉందని ఈ మధ్యనే అవి కట్టుకున్నారు.  వెనక చిన్న పెరడు కలిపే ఉంచుకున్నారు.

రోజూ పొద్దున్నే ఇంటికి కావలసిన నీళ్ళు దగ్గరలో ఉన్న కాలవకెళ్ళి తెచ్చుకుంటారు ఇద్దరూ. తెచ్చి గోలేల్లో పోసుకుని, బిందెల్లో తెచ్చుకుని అవే వాడుకుంటారు వంటకీ, మిగతా అవసరాలకి. బట్టలు కాలవగట్టు దగ్గరే ఉతుక్కుని తెచ్చి ఇంటి వెనక తీగమీద ఆరేసుకుంటారు.

ఊడుపులూ, కోతలూ, కలుపు తీయడాలూ, ఎరువు చల్లడాలూ లాంటి పంటచేల పనులు సంవత్సరం పొడవునా ఉండవు, అందులోనూ చాలా మటుకు పంటచేలని రొయ్యలచెరువులుగా మార్చేశాకా ఆ పనులు మరీ తగ్గిపోయాయి. అందుకని అలాంటి పనుల్లేని సమయ్యాల్లో వీళ్ళు నాలుగిళ్ళల్లో కారాలూ, పసుపూ లాంటివి దంచడాలూ, చింతపండు గింజలు తీయడాలూ, వడియాలూ, వరుగులూ లాంటివి పెట్టి, వాటినీ, కొబ్బరి మట్టలని సేకరించి వాటిల్లోంచి ఈనుపుల్లలు చీరి కొబ్బరి చీపుళ్ళు తయారు చేసి అవి అమ్మడమూ లాంటి పనులేవో ఒకటి చేస్తూనే ఉంటారు. దగ్గరలో ఓ మాదిరి టవున్ మామిడికుదురు లో ఈ మధ్యనే వచ్చిన ఒక పెద్ద పచారీకొట్టుకి పప్పులూ, బియ్యమూ అవీ శుభ్రం చేసే పని కొత్తగా వారు ఒప్పుకున్న పనుల్లో ఒకటి. ఆ కొట్టు కుర్రాడు వచ్చి తూకం వేసిన సరుకులు ఇచ్చి వెళతాడు, సాయంత్రం మళ్ళీ తీసుకెళ్ళేడప్పుడు తూకం వేసి తీసుకెళతాడు.

ఇలా నాలుగు రకాలైన పనులు వెతుక్కుని మరీ చేసి ఇంటికోసమే అహరహమూ శ్రమ పడుతూ ఉంటారు. ఎందుకంటే వారి భర్తల సంపాదనెంతో వారికి తెలియనే తెలీదూ  అంటే దానిక్కారణం దాంట్లో సింహభాగం బ్రాకెట్ లేదా పేకాటకీ, కల్లు దుకాణాన్ని పోషించడానికే సరిపోతుంది. వాళ్ళకిష్టమైనంత ఇస్తారు ఇంట్లోకి, అంతే.

" ఆడిని మార్చేదానికి నా వల్ల కాదు, ఆ పాటిదానికుత్తపున్యాన గొడవెందుకు? రోజూ పిల్లల ముందు "అని వరలక్ష్మి గట్టిగా ఎప్పుడూ మాట్లాడదు కానీ శివాలక్ష్మి మాత్రం ఊరుకోలేక నాలుగురోజులకొకసారి అరిచి, గొడవపడి,  దెబ్బలూ, తన్నులూ తింటుంది. తెల్లారేసరికి కాలవలోకొచ్చే కొత్తనీరులా ఆ పాత నీరుని మర్చిపోతుంది, ఆ పేటలోని చాలా ఇళ్ళల్లో ఇదే పరిస్థితి.

ఆ పేట ఆడవాళ్ళందరిలోనూ కాస్త చదువుకున్నది వరలక్ష్మే కావడాన ఆమే కావలసిన సలహాలు చెప్తూ ఉంటుంది. 'నెలకొక వంద రూపాయల పొదుపు' అని ఒక ఆలోచన చేసి అందరినీ కాస్తో, కూస్తో దాచుకుని, చిట్టీ పాడుకుని అవసరానికి కాస్తైనా డబ్బు వెసులుబాటుండేలా చూస్తుంది. ఆ డబ్బుని తీసుకెళ్ళి మామిడికుదురు లోని టీచర్ అరుణమ్మ దగ్గర దాస్తుంది, నెల నెలా వెళ్ళి తెచ్చుకుని పాట పాడినవాళ్ళకి ఇస్తుంది. ఇలాంటివన్నీ ఎంతో బాగా చేస్తుందనే అందరికీ వరాలంటే అభిమానం.

★★★

మర్నాడు భర్తలు పనుల్లోకీ, పిల్లలు స్కూళ్ళకీ వెళ్ళాకా, భోజనం చేసి ఒంటిగంటవేళ వరలక్ష్మి ఇంటికి వచ్చింది శివాలక్ష్మి.

"ఏటే వరాలూ, గుడ్ల పులుసెట్టావా? ఇల్లంతా ఓ ఘుమ ఘుమలాడిపోతాంది " అంది ముక్కు ఎగబీలుస్తూ.. చూరు నీడలో కూర్చుని మట్టని చీలుస్తున్న వరలక్ష్మి మాట్లాడలేదు, పక్కన కూర్చోమన్నట్టు గా సైగ చేసింది.

"నీకేటయిందసలు?? మూడురోజులబట్టీ మాటానేదు, పలుకూ నేదు, ఎంత అడిగినా మాటాడవు, ఏటయింది?" అంది పక్కనే కూర్చుంటూ.

" ఏమీ లేదొలే సివాలూ, మనసెందుకో బాగోనేదు చాన్నాళ్ళబట్టీ "అంది రవ్వంత ఆవేదనగా.

" నాతో సెప్పకూడదా? సిటికెలో తీరవలేను గానీ, ఎద్దైనా సలహా సెప్పగలనేమో, నీకిట్టం నేకపోతే వద్దులే, అట్టీపెట్టేసుకో" అంది నవ్వుతూ.

" నీగ్గాక ఇంకొకరికి సెప్పుకోగలనా? , అయినా ఇషయమే అట్టాంటిది" అంది భారంగా.

వారం, పది రోజులబట్టీ పెద్దది ఒక్క పూట కూడా సరిగ్గా అన్నం తినడమే మానేశింది, మారడిగితే కడుపునొస్తోంది, వద్దంటంది" అంది ఎటో చూస్తూ.

" అంతేనా, నేనింకా ఏటో అయిపోనాదనుకుని మా సెద్ద భయపడిపోయాను, నీ ఆలకం సూసి. రేపు అది స్కూల్ నించి రాగానే డాక్టరమ్మ కాడికి తీసుకెళదారి, నువ్వేం బెంగ పెట్టుకోమాక" అంది శివాలక్ష్మి అనునయంగా.

"హు" అని నిట్టూర్చింది వరాలు.

"అసలు సంగతి నీకర్ధమవతల్లేదు శివమ్మా, అది కావాలని బోయనం మానేసి పేణం మీదకి తెచ్చుకుంటాంది" అంది.

" కావాలనా? అదేటి? ఎందుకు?" అనడిగింది ఆశ్చర్యంగా శివాలక్ష్మి.

అప్పటికే వరలక్ష్మి వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. ఆమెనలా చూసేసరికి శివాలక్ష్మి కి కంగారు వేసింది. రెండు నిమిషాల పాటు ఏడుస్తూనే ఉంది వరలక్ష్మి.

శివమ్మ ఆమె వీపు మీద చెయ్యి వేసి "ఊరుకో, ఏదో కడుపు మందం సేసుంటది, దానికే ఇంత గాభరా పడతావా?" అంటూ అనునయించసాగింది.

ఏడుపు ఉధృతం తగ్గాకా కళ్ళనీళ్ళని పైట చెంగుతో తుడుచుకుంటూ ఎక్కిళ్ళ మధ్యలో చెప్పింది నెమ్మదిగా అసలు విషయం.

" అన్నం మాములుగా, కడుపుకి సాలినంత తింటే బయటకు రోజూ ఎల్లాల్సొస్తదని దాని బాధ, అందుకని కావాలని కడుపు మాడ్చుకుంటాంది " అంటూ.

ఒక్క క్షణం తాను విన్నది నిజమో, కాదో అర్థం కాలేదు శివాలక్ష్మికి. అర్థం అయ్యాకా ఆశ్చర్యంతో మాట రాలేదు ఆమెకి.

ఆ పేటలోని వారెవ్వరికీ ఇళ్ళల్లో టాయిలెట్లు లేవు, వారందరూ ఊరి చివర ఉన్న బీడులాంటి బహిర్భూమికి, లేదంటే బాగా దూరంగా కాలవ దగ్గరకో వెళ్ళవలసిందే. అది అందరికీ, ముఖ్యంగా ఆడవారికి అసౌకర్యం గా ఉంటుంది. వరలక్ష్మి, శివాలక్ష్మి లాంటి వారు చిన్నప్పటినించీ అలవాటు గనక చాలా చీకటివేళనో లేదా సాయంత్రం పొద్దుపోయాకో వెళ్తూ ఉంటారు. బాగా చిన్నపిల్లలకి పరవాలేదు కానీ యుక్తవయస్సులోకి అడుగిడుతూ, చదువుకుంటూ, ఇప్పుడిప్పుడే ప్రపంచాన్ని కొద్ది కొద్దిగా తెలుసుకుంటున్న ఆడపిల్లలకి అదెంతో అవమానకరంగానూ, సిగ్గుగానూ ఉంటుంది.

వరలక్ష్మి పెద్దకూతురు పదో క్లాస్ లోకి వచ్చింది, ఆ అమ్మాయికీ, తన తోటి పిల్లలకీ ఇదెంతో భరించరానిదిగా ఉంది. ఈ మధ్య ఇంచుమించు రోజూ ఆ విషయం తల్లితో చెప్తూనే ఉంది శాంతి. ఆ బయలు ప్రదేశం దూరం కావడాన ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు కలిసి వెళతారు, అది చూసి తరచూ వీరి వెనకే చేరి అసభ్యంగా మాట్లాడుతూ అవమానపరిచే కుర్రకారు వెనకపడుతుంటే అది మరింత కంటకప్రాయమైపోసాగింది వారికి.

భారత దేశం సాధిస్తున్న ప్రగతీ, అభివృద్ధీ అవీ పాఠాల్లో చదువుకుంటూ, టీచర్ల నించీ తెలుసుకుంటూ ఉన్న ఆ పిల్లలకి తామిలా కనీస సౌకర్యాలు కూడా లేకుండా ఎలా ఉన్నాము? అనేది అర్థం కాని ప్రశ్నే.

మొదట్లో కూతురు చెప్పిన మాటలు పెద్దగా పట్టించుకోలేదు వరమ్మ,

" ఎహే, సాయంత్రమో, తెల్లారుఝామునో గుట్టు సప్పుడు కాకుండా ఎల్లండి, ఊరంతా ఇనబడేలా టముకేసుకునెల్తారా ఏటి? అందరికీ తెలీడానికి " అని కసిరింది.

దానికి శాంతి "అమ్మా, రోజూ అలా బయటకి వెళ్ళాలంటే మా సెడ్డ సిరాకమ్మా, పైగా అలా బయటకెళితే జబ్బులొచ్చే ప్రమాదం కూడా ఉందట, టీచరమ్మ సెప్పింది, దానికి తోడు మన ఊరి కుర్రోళ్ళు. నిన్న రాత్రి నేనూ, గంగా లాంతర్ తీసుకుని వెళుతూండగా వెనకాలే రావడం మొదలెట్టారు కోటిగాడు, బాబి గాడు.

" లండన్ ప్రయాణమా? మాట్లాడరేం దొరసానులూ?" అంటూ చిరాగ్గా మాట్లాడారు

రామయ్య మావయ్య ఎదురొచ్చి ఇద్దరినీ బాగా తిట్టేసరికి వెళ్ళిపోయారు, అయినా సరే మేము వెనక్కి వచ్చేశాము, ఇంకెవరైనా కనబడతారేమో అన్న భయంతో. మనింట్లోనే టాయిలెట్ ఉంటే ఈ బాధలుండవు కదమ్మా" అంది కళ్ళ నిండా నీళ్ళు ఆ పిల్లకి అప్పటికే.

"టాయిలెట్టా? అంటే ఏంటే?" అంది వరమ్మ.

"టాయిలెట్ అంటే మరుగుదొడ్డమ్మా, టీవీల్లో కూడా సూపిత్తన్నారు కదా, అందరూ ఇంట్లోనే కట్టుకోవాలని, అదే" అంది శాంతి.

ప్రముఖ హిందీ సినిమా నటి విద్యాబాలన్ ( ఆమె పేరు వారికి తెలీదు) నటించిన ప్రకటనలు గుర్తొచ్చాయి వరలక్ష్మికి.

" నిజమే కానీ, ఇప్పటికిప్పుడు అంత డబ్బంటే ఎలా?"అనుకుంది.

కానీ ఆ తర్వాత ఆపిల్లలో వచ్చిన మార్పు కన్నతల్లిగా ఆమె హృదయాన్ని మెలిపెట్టింది. రోజూ రోజుకీ నీరసపడడం తెలుస్తోంది, కడుపుకి సరిపడా తినకపోయేసరికి అప్పుడప్పుడు కడుపు నొప్పి వస్తోంది కూడా. అవన్నీ చూస్తుంటే సుడులు తిరిగిన ఆ బాధే ఈ జడికి కారణం.

" మొదట నేనూ సెప్పి సూశాను, నాలుగు నాళ్ళుంటాది, ఆ తర్వాత అలవాటయిపోద్దిలే అనుకున్నాను కానీ తిండే మానేస్తుందనుకోలేదు శివా, నీరసమొచ్చుద్ది, నీకు పాణమని గుడ్లేసి వాటంగా పులుసొండానంటే, ఒక్క ముద్ద తిని గంజి నీళ్ళు తాగేసి లెగిసిపోయింది" అంది.

ఈ బాధలు శివాలక్ష్మికి తెలియనివి కావు, కానీ సమస్యని సాధించే మార్గమే ఆమెకీ తట్టడం లేదు, ఆ చుట్టుపక్కల చిన్న ఊర్లన్నింటిలోనూ చాలామందికి ఉన్న సమస్యే అది, కానీ చాలా రోజుల వరకూ అదొక సమస్య అనే వారికి తెలియలేదు. ఆ మాటకొస్తే పెద్దోరిళ్ళల్లో కూడా ఈ మధ్యనే పాయిఖానాలు కట్టించుకున్నారు.

"ఇక చిన్నోళ్ళిద్దరూకూడా రేపో మాపో పెద్దోళ్ళవుతారు, ఈళ్ళందరితోనూ ఏం కట్టాలు పడాలో ఏటో, అరదమవుతల్లేదనుకో " అంది వరలక్ష్మి దిగులుగా.

ఇద్దరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు. "నేనోపాలి సెప్పి సూత్తాలే, తక్కిన పిల్లలతో జతగా పొద్దున్నే ఎల్లి రమ్మని" అంది వరలక్ష్మి ని సముదాయిస్తున్నట్టు. మౌనంగా, పెరట్లో స్నానాలగదికి నాలుగు అడుగుల దూరంలో శివాలక్ష్మి ఇంటి భాగంలో ఉన్న కొబ్బరి చెట్టుకేసే చూస్తూ పుల్లలు తీయసాగింది వరలక్ష్మి. ఇంతలోనే పరుగు, పరుగున వచ్చారు వరలక్ష్మి రెండో కూతురూ, శివాలక్ష్మి కూతురూ.

"అమ్మా, శాంతక్క స్కూల్లో కళ్ళు తిరిగి పడిపోయింది, నిన్ను టీచరమ్మ బేగే కేకేసుకురమ్మంది" అంటూ. ఎక్కడిపని అక్కడ వదిలేసి స్కూల్ కి పరిగెత్తారు ఇద్దరూ. వాళ్ళు వెళ్ళేసరికి స్కూల్లో నేల బెంచీమీద తోటకూర కాడలా వాలి, పడుకున్న కూతుర్ని చూడగానే వరలక్ష్మి కే కాదు, శివాలక్ష్మికీ కళ్ళ నీళ్ళు తిరిగాయి.

" ఎప్పటిలాకాకుండా ఈ మధ్య శాంతి బాగా డల్ గా ఉంటోంది, మునుపటి హుషారు లేదు పిల్లలో, ఒంట్లో నలతగా ఉందేమో అనుకున్నాను కానీ ఈ రోజు మధ్యాహ్నం ఉన్నట్టుండి కళ్ళు తిరిగి పడిపోయింది, నీళ్ళు చల్లితే తేరుకుని లేచింది కానీ చాలా నీరసంగా ఉంది, ఒకసారి డాక్టర్ దగ్గరకి తీసుకెళితే మంచిది" అంది టీచరమ్మ.

ఇద్దరూ కలిసి పిల్లని రిక్షా ఎక్కించి ఇంటికి తీసుకొచ్చారు. చాప వేసి పడుకోబెట్టింది శాంతిని, నీరసానికి నిద్రపోయింది. నిద్రపోయేముందు కూడా తినడానికేమీ వద్దంది.

"కొంచం టీ ఉంటే ఇవ్వమ్మా" అంది.

"ఒద్దమ్మా, పాలు తాగు, టీలో బలం ఏటున్నది?" అంటూ తనవాటా టీకి ఉంచుకున్న పాలు కూడా పోసి వేడిగా తాగించింది. అవి తాగి నిద్రపోయింది శాంతి.

"సూశావా శివాలూ, ఇదీ దీని వరస, ఎట్టా ఉండే పిల్ల ఎలా అయిపోయిందో సూడు" అంది వరమ్మ దిగులుగా పీక్కుపోయిన శాంతి చెంపలు నిమురుతూ. అంతవరకూ విషయాన్ని కాస్త తేలిగ్గా తీసుకున్న వాళ్ళిద్దరికీ ఆ చిన్న పిల్ల పడుతున్న బాధ బాగా అర్ధం అయింది. కానీ ఏం చెయ్యాలో తెలియని పరిస్థితి.

★★★

మరో వారం రోజుల తర్వాత ఎప్పుడూ లేంది వరలక్ష్మి ఇంట్లోంచి వీర్రాజు కేకలు వినిపిస్తుంటే శివాలక్ష్మి ఆశ్చర్యపోయింది. గబగబా పరిగెత్తింది వరలక్ష్మి ఇంటివైపు.

"ఏటీ? ఇంట్లో మరుగుదొడ్డికట్టిత్తావా? దానికోసం తాళిబొట్టు అమ్మేశావా? పైగా ఈ సారి చిట్టీ పాడేసుకున్నావా? నీ కూతుళ్ళు మహారాణీలా? అందరితో పాటు ఊరవతలకి ఎల్లలేరా? మతుండే మాతాడతన్నావా? అహ, అసలు మతుందా? పోయిందా అని. నీ బుద్దేమైనా గాడిదలు కాసిందా? " అంటూ తిట్ల పురాణం విప్పుతున్నాడు వీర్రాజు.

"అసలు నిచ్చేపంలాంటి తానాల గది ఉండగానే, అది వల్లకాదు, అక్కడ తానమాడను అని నీ పెద్దకూతురు అన్నప్పుడే రెండు తగిలించాల్సింది, ఈ టెక్కు ఏషాలు లేకపోను, ఆవిడ గారడగ్గానే వంటగదిలో తానాలాడమన్నావు కదూ! ముందది, ఇప్పుడిది. రేపు ఈ సగం పాక నాకు నచ్చలేదు, డాబా ఏసేసి, నాకో పెషల్ గది కావాలంటది, అప్పుడెక్కడనించొచ్చుద్ది? బుర్రుందా నీకు? పైగా తాళిబొట్టమ్ముతావంటే? సిగ్గునేదూ, నేను ఉన్నాననుకున్నావా? పోయాననుకున్నావా?" కోపంతో మాటలు రావడం లేదు వీర్రాజుకి. అతని ముఖం రోషంతో అదురుతోంది, వీలుంటే వరలక్ష్మిని రెండు వేసేట్టు కనపడుతున్నాడు. అతనన్న మాటలన్నీ ఓపిగ్గా వింది వరలక్ష్మి.

"తాళిబొట్టు తాకట్టెట్టడం మనకేమీ కొత్త కాదు, కిందటిపాలు అయ్యగోరు పేకాటలో నిలువుదోపిడీకొస్తే సుబ్బయ్య గారి దగ్గర తాలిబొట్టు తాకట్టెట్టే డబ్బు కట్టాము, అప్పుడూ నా మెళ్ళో పసుపు కొమ్మే కట్టుకున్నాను, ఆ ఇషయం నువ్వు మరిసిపోయావేమో, నేను మరిసిపోలేదు. ఇప్పుడూ అంతే" అంది విసురుగా.

" సాల్లే ఎదవమొకందానా, సేసిందతా సేసి ఎదురు సమాదానాలు సెప్తున్నావా? మతోయిందే నీకు? ఓ కొడుకుని కనడం తెల్దు గానీ, ఈ ముగ్గురినీ ఎనకేసుకు రావడం బాగా తెల్సు, దొడ్డంట, దొడ్డి, పైగా 'టాయిలెట్టు' అంటో దానికో ఇంగ్లీసు పేరు. ఊరికే

వస్తుందా? ఎన్నేలు కావాలో తెల్సా అసలు? అసలేఏదవిచ్చాడే నీకీ సలహా? ముందేమో ఆళ్ళ సదువులన్నావు, ఇప్పుడిదా? " అంటూ మీద మీదకి రాబోతున్న వాడిని శివాలక్ష్మి ఆపబోయింది.

"ఊరుకో అన్నయ్యా, వరాలు ఏం చేసినా ఆలోచించే చేస్తది కదా, ఉత్తిపున్నేన ఎందుకు గొడవ?" అని.

"నువ్వూకో సివాలమ్మా, దాన్నెనకేసుకురాకు, ఈ రోజు అదో, నేనో తేలిపోవాల. ఎప్పుడైనా నేనేమన్నా ఎదురు మాటాడిందా? ఇప్పుడిలాంటి పని సేస్తదా? మొగుడంటే లక్షముందా దానికి? తింగరిదా? " అంటూ ధుమ ధుమ లాడసాగాడు.

"ఏటన్నావే? నాకోసమోపాలి తాకట్టెట్టావా? అదేదో పొరపాటున అన్నీ ఓడిపోతే మరో దారి లేక అలా జరిగింది, దాన్ని ఇప్పుడు పైకి తెచ్చి రాద్ధాంతం సేస్తన్నావా? సంసారం లో గుట్టూ, రోగానికి రట్టూ ఉండాలనే ఇషయమూ తెలీదేటే నీకు? తెలిసుంటే మొగుడ్నిలా నడి ఈదిలో ఎడతావా? అయినా తాకట్టెట్టదవూ, అమ్ముకోడమూ ఒకటేనా?" అన్నాడు కోపంగా.

"అదే నేనూ అంటన్నాను, పిల్లల కోసమని ఎంతో ఆలోచించి చేశిన పని ఇది, నాకిట్టమయ్యో, నా సుకంకోసమో సేసినది కాదు అందుకే ఈ పాలికి మాటాడకుండా ఊరుకో. అన్నీ బాగుంటే వచ్చే ఏడాదికి మళ్ళీ చేయించుకుంటాను, అంతవరకూ నాకు పోయిందేటి? కల్లెదురుగా నువ్వున్నావు, మెళ్ళో పసుపుతాడున ఉన్న కొమ్ముకొన్నాది" అంది వరలక్ష్మి స్థిరంగా.

ఆమె వాలకం చూస్తుంటే వీర్రాజుకి మరింత కోపం తన్నుకు వస్తోంది, తనకొక్క మాటైనా చెప్పలేదని కొంతా, ఇప్పుడు కూడా తాను చేసిన పనికి క్షమాపణ అడగకపోగా, ఎదురు తిరిగి తనకే సమాధానం చెప్తోందని కొంతా, వీటివల్ల అతని కోపం రెట్టింపైంది.

"మొండికెత్తినదాన్ని మొగుడేం సేత్తాడు? అన్న సామెత నీకులాంటోళ్ళని సూసే పుట్టిందే? పిల్లలంట, పిల్లలు, ఎప్పుడూ ఆళ్ళ ఊసే గానీ, మొగుడి మాట ఇందామనే జ్ఞానం లేదే నీకు, అందుకే ఇలా తయారయ్యావ్, నీ.. "అని ఇంకా ఏదో అనబోతుంటే,

అప్పటివరకూ ఎంతో సహనంతో వింటున్న వరలక్ష్మి ఒక్కసారి గట్టిగా అరిచింది.

" ఇక సాల్లేవయ్యా, ఆపు, పెద్ద సెప్పొచ్చాడు మొనగాడు, నా ఇట్టం, నా పిల్లలకోసం నేనేదైనా సేత్తాను, నీలా సంపాదనంతా తాగుళ్ళకీ, పేకాటకీ తగలెయ్యడం లేదు కదా, ఇంకెందుకా గోల? ఈడొచ్చిన, సదూకుంటున్న పిల్లలు రోజూ బయటకెల్లడానికెంత ఇబ్బంది పడతన్నారో నీకేం తెలుసు? ఏనాడైనా అడిగావా? ఆలోసించావా? మూడు వారాలుగా తిండి తినడం లేదు శాంతి, నువ్వు సూశావా? సరిపడా తింటే రోజూ బయటకు ఎల్లాల్సి వస్తాదని, నీళ్ళూ, గంజీ తాగి కడుపు నింపుకుంటాంది బిడ్డ, ఇది ఇంటే నీకెలాగుందో నాకు తెల్దు గానీ, నా మనసంతా పీకేసినట్టయింది. ఎన్ని సార్లు ఏడ్చానో, శివాలమ్మని అడుగు సెప్తుంది, ఓ రంకెలేస్తున్నాడు." ఆయాసంతో ఒక్క క్షణం ఆగింది.

అన్నీ విన్నా ఆమె మాటలోని నిజాన్ని ఒప్పుకోనివ్వని అహం అతనిలో,

"ఐతే ఏంటే? మహా నీకే ఉన్నారా వయసొచ్చిన పిల్లలు, మిగతావోళ్ళకి లేనిది ఈవిడగారికేటంట? నిక్కూ, టెక్కూ కాకపోతే" అన్నాడు చిరాగ్గా.

" ఏటన్నావు? మిగతావోళ్ళకి లేదా? ఓ పాలెల్లి ఆ పిల్లల్నో, ఆళ్ళ అమ్మల్నో అడిగి వత్తే తెలుస్తది, ఆళ్ళు పడే ఇబ్బంది. అదే కట్టమనుకుంటే, ఎనక బడుతూ పోకిరీ నాయాళ్ళు, మరీ పొద్దున్నేనో, రాత్రో ఎల్దారంటే పామే ఉంటదో, పురుగే ఉంటదో అనో బయం. అది సాలనట్టు ఈ మద్దెన పెతీ వాడూ ఓ సెల్ ఫోనట్టుకు ఇష్టం వచ్చిన సోటల్లా ఫోటోలూ, విడియోలూ తీసెయ్యడమే. పిల్లలు బయటకెళ్ళినప్పుడో, కాలవదగ్గరకెళ్ళినపుడో ఏ పోరంబోకు యెదవో ఓ ఫోటోవో, వీడియోవో తీసి ఆ తర్వాత "దృశ్యం" సినిమాలో సూపినట్టు పిల్లల్ని బెదిరిస్తే? ఆ ఫోటోలూ అయ్యీ బయటెడితే, నలుగురికీ సూపెడితే సిన్నపిల్లలేటయిపోతారు?"

" బలవంతాన పళ్ళకొట్లోనూ, సంబరంగా సారా కొట్లోనూ కూకునే నీకు పిల్లలని సూసుకునే ఇషయమే పట్టదు? ఎదైనా ఐతే ఆ సినిమాలో ఎంకటేష్ లా కాపాడగలవా? ఎర్రబడిన ముఖంతో రోషంగా అడిగింది భర్తని.

"అది  సినిమాయే అని తీసిపారేశేలా లేదు, నిజంగా జీయితాన్ని సూసినట్టుంది. మూడు వారాలుగా కడుపునిండా తిండి తినని పిల్లని సూసే బాదపడతన్న నాకు ఆ సినిమా సూసినప్పుడు పిల్లలకి ఎన్ని రకాల పెమాదాలు జరగొచ్చో తెలిసింది. ఎదుగుతున్న పిల్లలని, ఆళ్ళు ఆడైనా, మొగైనా ఎంత జాగ్రత్తగా, సెద్దగా సూసుకోవాలో ఎంత బాగా సూపెట్టారో తెలుసా? అందులో ఆడపిల్లలని మరీ కంటికి రెప్పల్లా సూసుకోవాలి అని అర్ధం అయింది.

అందుకే దాని బాద సూడలేక వెంటనే టీచర్ అరుణమ్మ దగ్గరకెళ్ళి కావలసిన రొక్కం అమరించుకొచ్చాను. అరుణమ్మ సెప్పింది రేపు పంచమి మంచిదంట, మేస్త్రీ నారాయడన్న వచ్చి పని మొదలెడతాడు, సిమెంటూ, ఇసకా, మిగతాయన్నీ ఆయన తెత్తాడు, మనల్ని పైన పరవడానికి రేకులు తెచ్చుకోమన్నాడు. రేపు పొద్దున్నే నువ్వు మామిడికుదురెళ్ళి తెచ్చిపెట్టు" అంది స్థిరంగా.

ఆమె మాటలు పూర్తిగా విని అప్పటికి మెత్తబడ్డ వీర్రాజు,

"రేకులెందుకే, గోడలంటన్నావు, తలుపుంటది కదా, సాలదా? పైన కప్పు మానేస్తే కూసింత డబ్బు మిగులుద్ది కదా?" అన్నాడు.

"సాలదు, కప్పెయ్యాల్సిందే, సెప్పానుగా, ఈ ఒక్కపాలికీ నా మాటకి అడ్డు సెప్పకు, సక్కగా పై కప్పు ఏయిద్దారి.అయినా యన్నీ మేస్త్రీ సూసుకుంటాడులే, మనకెందుకు? నువ్వు మాత్రం ఈపాలికి నా మాట కాదనకుండా రేకులు పట్రా" అంది వరలక్ష్మి.

ఇంట్లో స్నానాలకీ,  వాటికీ తమకంటూ సొంత టాయిలెట్ ఉండాలని పిల్లలముందూ, శివాలక్ష్మి ముందూ వీర్రాజుకి  గట్టిగా చెప్పిన వరలక్ష్మి పై కప్పుకోసం తను ఎందుకంత పట్టు పడుతోందో,  మాత్రం గట్టిగా చెప్పలేకపోయింది. దానిక్కారణం ఆవిడకీ, పెద్ద కూతురుకీ మాత్రమే తెలుసు. ఆమెని విపరీతంగా కలచివేసిన ఆ విషయం ఎవరికీ చెప్పుకోలేనిది, ముఖ్యం గా భర్త వీర్రాజుకీ, స్నేహితురాలు శివాలక్ష్మికీ అసలు చెప్పుకోలేదు.

దాదాపు రెండు నెలల క్రితం ఓరోజు..

" అమ్మా, నేను తానాల గదిలోకి ఎల్లనమ్మా, నీ వొంటంతా అయిపోయాకా రెండు తలుపులూ గడెట్టుకుని వంటింట్లోనే స్నానం చేస్తాను"  అంది శాంతి.

"అదేటే? తానాలగది బాగానే ఉంది కదా, మొన్నే మీ నాన్న తడికె గట్టిగా, దగ్గిరగా అల్లి మరీ బిగించాడు, ఇంతలోకేటయింది?"  అంది

"మరి, ఏటంటే "అంటూ నసగసాగింది శాంతి.

" ఏటే? ఆ నీళ్ళు నమలడం? నాంచుడాపి అసలు విషయం సెప్పు"  అంది

" మొన్న పొద్దున్న నేను పాట పాడుకుంటూ స్నానానికి వెళ్ళబోయానా?, కోయిల కూత విని పైకి సూస్తే, అత్తమ్మా వాళ్ళింట్లో ఉన్న కొబ్బరి సెట్టు మీద సత్తిబాబు మావయ్య కనిపించాడు, నేనేమీ అడక్కుండానే, " దింపు తియ్యాలి కదా, కాయలు ఎలా ఉన్నాయో? సూద్దామని ఎక్కానే, దిగుతాలే, నువ్వు తానమాడడానికొచ్చావుగా" అంటూ  అంటూ అదోరకంగా  నవ్వాడు, ఎప్పుడూ లేంది మావయ్యనలా సూత్తే ఎందుకో తెలీదు గానీ భయమేసిందమ్మా? అప్పటినించీ ఒకటికి నాలుగుసార్లు చుట్టూ సూసి మరీ వెళ్తున్నాను,  " అంది భయంగా.

ఒక్క క్షణం కట్రాట లా నిలబడిపోయింది వరలక్ష్మి."తమ పిల్ల పెద్దదయిందని ఇంట్లో వారికంటే,  ఊరివారికే ముందు తెలుస్తుంది"  అన్న ఏదో సినిమాలోని డైలాగ్  అనుకోకుండానే గుర్తొచ్చింది. భయంతో ఒళ్ళు గగుర్పొడిచింది.

"అలాగా? నిజమేనంటే? అలాగైతే   నువ్వూ, సెల్లీ కూడా రేపటినించీ వంటగదిలోనే తానం సెయ్యండి, తానాలగదికాడికెల్లొద్దు." అంది వెంటనే, అది మాత్రమే అనగలిగింది.

అందుకే రెండు నెలలనించీ వీర్రాజు వద్దన్నా, విసుక్కున్నా లెక్కచెయ్యలేదు, ఆ మాట చెప్తున్నప్పుడు శాంతి కళ్ళల్లో కనిపించిన భయం ఆమెని అంతలా కట్టేసింది, కుదిపేసింది.

"ఇదేటన్నయ్యా? నీ కళ్ళముందు పెరిగిన పిల్ల, ఇలాంటి పని సేయబోవడం నీకు నాయవా?" అని సత్తిబాబుని ఏ రకంగానూ నిలదీసి అడగలేదు, ఇలా జరిగిందని ఎవరితోనూ చెప్పుకోలేదు కనకే **పైకి** చెప్పలేని అలాంటి సంఘటనలు పునరావృతం అయ్యే వీలు కల్పించడంకంటే **పైకప్పు** వేసుకుని పరిష్కారం చూసుకోవడమే మేలనే అలా చెప్పింది.

ఇప్పుడామె కళ్ళల్లో ఒకటే "దృశ్యం" కనిపిస్తోంది, తన పిల్లలూ, తనూ దర్జాగా తమ ఇంట్లోనే టాయిలెట్ వాడుకుంటూ హాయిగా ఉండడం. అంతకంటే శుభకరమైన పని లేదన్నట్టుగా ఆ అమ్మ హృదయాన్ని మరింత దగ్గరగా హత్తుకుంది పచ్చని పసుపుకొమ్ము.

కథా కౌముది

# కర్తవ్యధర్మం వరుణ్ పారుపల్లి

"ఫ్రెండ్స్... ఈ మీటింగ్ దేనికో మీలో కొందరికి తెలిసి ఉండొచ్చు. వచ్చే వారం మన ఆఫీసుని చూడ్డానికి ఉత్తర అమెరికాలో ఒక ప్రముఖ బ్యాంకు ప్రతినిధులు రాబోతున్నారు. వారు వచ్చి, మన పనితీరుని, ఇక్కడి వసతులని సమీక్షించి తీసుకోబోయే నిర్ణయం మీదనే మనకి వారి ప్రాజెక్ట్ దక్కేదీ లేనిదీ ఆధారపడి ఉంది. ఈ ప్రాజెక్ట్ గనక మనకి వచ్చిందంటే మన కంపెనీ ముఖచిత్రమే మారిపోతుంది. దేశంలో ఉన్న 100 మిలియన్ డాలర్ల కంపెనీల సరసన మన సంస్థ కూడా సగర్వంగా చేరుతుంది. కాబట్టి రాబోయే ఈ పదిరోజులు మనకి, మన సంస్థ భవిష్యత్తుకీ చాలా కీలకమైనవి. ఇప్పుడు చెయ్యాల్సిన పనుల్ని టీమ్స్ వారీగా చదువుతాను. ఏమైనా సందేహాలుంటే అడగండి" అంటూ అనర్గళంగా సాగిపోతోంది, సీనియర్ మేనేజర్ మృదుల ప్రసంగం. ఆమె మాటల్ని సభ్యులంతా శ్రద్ధగా వింటున్నారు, ఒక్క వినయ్ తప్ప.

వినయ్, మృదుల – ఒకేసారి ఆ సంస్థలో ట్రైనీలుగా చేరారు. పని సామర్థ్యం విషయంలో ఇద్దరూ ఇద్దరే. ఎటొచ్చీ వినయ్ ప్రవర్తనతోనే అసలు సమస్య. వినయ్ పేరులో ఉన్న వినయం అతని నడవడికలో లేదు. అతనికి తన మేనేజర్లు అంటే అస్సలు పడేది కాదు. అతని బాస్ గా ఎవరొచ్చినా వినయ్తో తలనొప్పి తప్పేది కాదు. పోనీ ఉద్యోగం నుండి తీసేద్దామా అంటే అతడి అనుభవం, క్లైంట్ దగ్గర అతనికున్న మంచిపేరు ఆపని చెయ్యనివ్వవు. అసలు ఎప్పుడు ఆఫీసుకి వస్తాడో ఎప్పుడు సెలవు పెడతాడో ఎవరికీ తెలిసేది కాదు.

ఏ సంస్థకైనా ఖచ్చితమైన ప్రవర్తనా నియమావళి (కోడ్ అఫ్ కండక్ట్) ఉంటుంది. దానిని ఉల్లంఘించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం మేనేజర్లకి ఉంటుంది. ఒక వ్యక్తి హోదాలో ఎంత పెద్దవాడైనా దానికి అతీతుడు కాదు. ఎవరినీ లెక్క చేయని అతని వైఖరివల్ల వినయ్ కి సమయానికి రావాల్సిన పదోన్నతులు ఆగిపోయాయి. అన్నీ సవ్యంగా జరిగుంటే ఈరోజు మృదుల స్థానంలో వినయ్ ఉండాల్సింది.

ఒక వంక మృదుల తన పనితీరుతో, అందరితో కలిసిపోయే ప్రవర్తన తో పైపైకి ఎదుగుతుంటే, మరో పక్క వినయ్ మాత్రం ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయాడు.

ఆఖరికి పరిస్థితి ఎలా తయారయ్యిందంటే, ఒక ప్రాజెక్టులో వినయ్ పని చేస్తున్నాడంటే ఆ ప్రాజెక్ట్ ని చూసుకోవడానికి ఏ ఒక్క మేనేజర్ ముందుకు రాలేదు. సరిగ్గా అప్పుడే మృదుల ఆ బాధ్యత తీసుకుంది. అప్పటికి వినయ్ మీదే మొత్తం ప్రాజెక్ట్ ఆధారపడే స్థితి ఉండేది. మెల్లమెల్లగా టీంలో మిగిలినవారిని సానబట్టి వినయ్ ప్రాముఖ్యతని తగ్గించసాగింది, మృదుల. తన సీటు కిందకి నీళ్ళు వస్తున్నాయని

గ్రహించిన వినయ్ బయట ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాడు. కానీ ఈ సంస్థలో ఉన్నంత స్వతంత్రం వేరే చోట దొరకదని ఒకపక్క మనసు లాగుతూనే ఉంది.

ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా ఉన్నవాడు "వినయ్" అన్న పిలుపుతో ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు. "వినయ్, బ్యాంకింగ్ ప్రాజెక్ట్ లు సమర్ధవంతంగా నిర్వహించడంలో మన సంస్థ నైపుణ్యం గురించి వచ్చే వారం క్లైంట్స్ ముందు మన డైరెక్టర్ ఇవ్వబోయే ప్రెజెంటేషన్ మీరే తయారు చెయ్యాలి. అందులో ఉండాల్సిన వివరాల గురించి నేను తర్వాత మీకు ఇమెయిల్ చేస్తాను." అన్న మృదుల మాటలకు అర్ధమనస్కంగానే తలూపాడు, వినయ్.

అన్నట్టుగానే ప్రజెంటేషన్ కి కావాల్సిన విషయాలతో వినయ్ కి అర్ధగంటలో ఈమెయిలు పంపించింది, మృదుల. అందులో పొందుపరిచిన విషయాలని కొంచెం విపులంగా రాయమని, పూర్తయిన డాక్యుమెంట్ ని తనకి సాయంత్రం లోగా పంపమని అడిగింది.

రాత్రి ఎనిమిదింటికి మృదుల చెప్పిన ప్రెజెంటేషన్ పూర్తి చేసి ఆమెకి తిరుగు ఇమెయిల్ లో పంపి భోజనం చెయ్యడానికి వెళ్ళాడు, వినయ్.

తిరిగొచ్చిన వినయ్ ని మృదుల తన క్యాబిన్ కి పిలిచింది. వినయ్ వెళ్లేసరికి ఏదో పనిలో ఉన్నట్టుంది, వినయ్ రాకని గమనించలేదు. 'నేను వచ్చాను' అన్నట్టు చిన్నగా దగ్గాడు, వినయ్.

"ఓహ్ వచ్చావా... కూర్చో. నీ ప్రజెంటేషనే చూస్తున్నా. ఒక్క రెండు నిముషాలుంటే అయిపోతుంది" అని తిరిగి పనిలో నిమగ్నమైంది. రెండు నిముషాల తర్వాత "బాగుంది వినయ్, తొంభై శాతం నీ డాక్యుమెంట్ బాగుంది. అక్కడక్కడ కొన్ని మార్పులు చెయ్యాలి, నేను వాటిని మార్క్ చేసి పెట్టాను. కొంచెం అవి పూర్తి చేసి రేపు పొద్దునకల్లా పంపించు" అంది.

"ఏంటి, రేపా? అసలు నేను రేపు ఆఫీసు కే రావడంలేదు. మాఊరికి వెళ్తున్నా. ఇంకో గంటలో చందానగర్ లో బస్సు అందుకోవాలి. నన్నొదిలెయ్" అన్నాడు.

"అదేంటి వినయ్, అసలు నువ్వు రేపు రావడం లేదన్నమాట నాకు ఇంతవరకు చెప్పనేలేదు!!" ఆశ్చర్యంగా అడిగింది, మృదుల,

"నేను క్లైంట్ కి చెప్పాను. వాళ్ళు సరే అన్నాకే నేను టికెట్లు బుక్ చేశా. ఈ పని మా టీం లో ఎవరో ఒకరికి అప్పజెప్పు. నేను వెళ్తున్నా" అంటూ తలుపు హేండిల్ మీద చెయ్యి వేసాడు.

"ఎవరితోనో చేయించుకో అని నువ్వు నాకు చెప్పక్కర్లేదు. వేరేవాళ్ళు కాదు, నువ్వయితేనే ఈ పనికి సరిపోతావని కదా ఈ పని నీకు అప్పగించింది? నీకు లక్ష సార్లు చెప్పాను, సెలవు కావాలంటే నాకు చెప్పు అని. అదేమీ లేకుండా నువ్వు డైరెక్ట్ గా క్లైంట్ తో మాట్లాడితే ఇంక నేనెందుకు? అయినా ఇంత ముఖ్యమైన పని పెట్టుకొని ఊరెళ్తున్నా అనడం బాలేదు. ఏం చేస్తావో నాకు తెలీదు. రేపు ఉదయం పదింటికల్లా నాకు ఈ డాక్యుమెంట్ కావాలి" కచ్చితంగా చెప్పింది, మృదుల.

"కుదరదు. నేను ఎల్లుండి సాయంత్రం హైదరాబాద్ వస్తా. కావాలంటే ఆరోజు రాత్రి చేసిపెడతా." అంతే మొండిగా సమాధానమిచ్చాడు, వినయ్.

"నువ్వు ఎల్లుండి రాత్రి డాక్యుమెంట్ తయారు చేస్తే నేను డైరెక్టర్ కి ఎప్పుడు పంపాలి? నీకర్ధం కావట్లేదు, ఈ ప్రజెంటేషన్ గనక అటూఇటూ అయితే మన కంపెనీకి ఎంత నష్టమో. ఆఖరిసారి చెప్తున్నా, కంపెనీకి నష్టం కలిగించే వాళ్ళెవరినీ ఉపేక్షించేది లేదు. అది ఎవరైనా సరే"

"అంటే ఏంటి? ఉద్యోగం లోనుండి తీసేస్తావా? నువ్వు తీసెయ్యడం కాదు నేనే వదిలేస్తా... ఇంతోటి బోడి ఉద్యోగం ఎవడైనా

ఇస్తాడు. నేను ఎవడికీ భయపడను. నీలా పైవాళ్ళకి మస్కాలు కొట్టడం నాకు రాదు. అందుకే ఉద్యోగంలో చేరి ఇన్ని సంవత్సరాలైనా డెవలపర్ గానే మిగిలిపోయా. నీకు చేతనైంది చేస్కో పో" అని విసురుగా తలుపు తీసుకొని వెళ్ళిపోయాడు.

వినయ్ వెళ్ళిపోయాక చాలాసేపు మృదుల ఆలోచిస్తూనే ఉంది.

★★★

ముప్పావుగంట తర్వాత...

వినయ్ తన గదికి చేరుకున్నాడు. అతని మనసంతా కల్లోలంగా ఉంది. పదేళ్ళుగా తన జీవితంలో భాగమైన ఉద్యోగం ఇక తనకి లేదు. ఈ పదేళ్ళ కాలంలో ఏర్పడిన పరిచయాలు, సాధించిన విజయాలు, ఎదుర్కొన్న కష్టాలు అన్నీ కళ్ళముందు కదిలాయి. ఈ సంవత్సరం మేనేజర్ గా ప్రమోషన్ వస్తే పెళ్లి చేసుకుందామనుకున్నాడు, కానీ ఇప్పుడు ఉన్న ఉద్యోగమే వదులుకున్నాడు. ఊరికి వెళ్తున్నా అని మృదులకి చెప్పాడు కానీ నిజానికి తనకి ఎక్కడికీ వెళ్ళే ఉద్దేశ్యం లేదు. ఇప్పుడిక ఉద్యోగం లేదు కాబట్టి ఆ అబద్ధాన్ని నిజం చేస్తూ సొంతూరు వెళ్లొద్దాం అనుకుంటూ పక్క సర్దుకుంటున్నాడు. అదే సమయంలో ఫోన్ మోగింది. చూస్తే మృదుల నుండి ఫోన్. ఆ పేరు చూస్తూనే మండిపడ్డాడు. అదే కోపంతో ఫోన్ ని నేలకేసి కొట్టాడు. చలువరాతి గచ్చుకి తగిలి ఫోన్ విడిభాగాలన్నీ చెల్లాచెదరుగా గదినిండా పడ్డాయి.

తెల్లారి పొద్దున్నే లేచి స్నానం చేసి తయారయ్యాడు. ముక్కలుగా పడున్న ఫోన్ భాగాలన్నీ తీసి తిరిగి అమర్చాడు. ఫోన్ బాగానే పని చేస్తుంది, గట్టి పిండం! ఒక మూలాన కొంచెం పగిలినట్లుంది. చిట్లిన చోట టేప్ అతికించి బస్టాండుకి బయల్దేరాడు.

బస్టాండుకి వెళ్లేసరికి మధిర వెళ్ళే బస్సు సిద్ధంగా ఉంది, ఎక్కి కూర్చున్నాడు. ఏడుగంటల ప్రయాణం తర్వాత మధిర చేరాడు. అక్కడినుండి వాళ్ళ ఊరికి వెళ్ళాలంటే వేరే బస్సు ఎక్కాలి. ఆ బస్సు బస్టాండుకి రాదు. అది నాగేశం మామయ్య హోటల్ దగ్గరనుండి బయల్దేరుతుంది. నాగేశం మామయ్య అసలుపేరు నాగేశ్వరరావు. వినయ్ తండ్రికి చిన్ననాటి స్నేహితుడు.

ఐదే నిముషాల్లో అక్కడికి చేరుకున్నాడు. ఆ సమయానికి నాగేశం మామయ్య తన కొడుకులిద్దరికీ క్లాస్ తీసుకుంటున్నారు. అయన మాటలు పెద్దవాడు బుద్ధిగా వింటుంటే చిన్నోడు మాత్రం చెప్పేది వినకుండా దిక్కులు చూస్తూ నిలబడ్డాడు.

'బాగున్నారా మామయ్యా' అంటూ పలకరించిన వినయ్ ని చూసి "బాగానే ఉన్నాం రా! ఇదిగో ఈ చిన్నోడితోనే మా దుంప తెగుతుంది. బడి ఎగ్గొట్టి ఆడుకోవడానికి పోయాడంట. బడి వదిలే టైంకి ఇంటికొచ్చాడు. బళ్లోకి పోతున్నాడని మేమనుకున్నాం, బడి ఎగ్గొట్టిన సంగతి పెద్దోడు చెప్తేగాని తెలియలేదు. తప్పు చేసింది కాక ఎట్లా నిలబడ్డాడో చూడు... సర్లే, వీడి గోల మాకు ఎప్పుడూ ఉండేదేగానీ ఏంటి ఎలా ఉన్నావు?" అంటూ టీ అందించారు.

టీ తాగుతూ "బాగున్నా మామయ్యా, చిలుకూరు బస్సు ఇంకా రాలేదా?" అనడిగాడు.

దానికి వినయ్ పక్కన కూర్చున్న వ్యక్తి "ఈపాటికి రావాల. ఇయ్యాల కోటయ్యగారు కదా డైబరు, టిపిన్ క్యారేజీ తీసుకోవడానికి దెందుకూరు స్టేజీ కాడ ఆగాడేమో. అట్లయితే ఇంకో పదినిముషాల్లో వస్తది." అని బదులిచ్చాడు.

ఇంతలో మధిర, నందిగామ మధ్యలో తిరిగే బస్సొకటి వచ్చి ఆగింది. ఎరుపు రంగు చొక్కా, ఖాకీ ప్యాంటు వేసుకున్న ఒక ముసలాయన బస్సు పైకెక్కి సామాను దించుతున్నాడు. చూస్తె కూలీలాగా ఉన్నాడు. ఆ ముసలాయన్ని ఇంతకుముందు చూసినట్లే ఉంది గానీ ఎప్పుడూ పెద్దగా పట్టించుకుంది లేదు. అతను దించే సామాను అందుకోవడానికి కింద ఇంకో కూలీ నిల్చొని ఉన్నాడు. పైనున్న కూలీ సామాను ఎత్తుతూ తొణకడం చూసి "ముసలోడు తాగినట్టున్నాడు, అక్కడి నుండి పడితే గానీ బుద్ది రాదు" అనుకున్నాడు వినయ్.

సామాను దించడం పూర్తయిన తర్వాత నెమ్మదిగా నిచ్చెన దిగి కిందికి వచ్చాడు, ఆ కూలీ.

రెండడుగులు వేసాడో లేదో వినయ్ పక్కనున్న వ్యక్తి అరిచాడు "వెంకన్నా, కొంచెం కుడిపక్కకి... నీ ఎదురుగా బురదుంది"

అని.

"సరే సరే... " అంటూ పక్కకి జరిగి అడుగులు లెక్కపెట్టుకుంటూ వచ్చి వినయ్ కి పది అడుగుల దూరంలో ఉన్న జెండా దిమ్మె మీద కూర్చున్నాడు.

అతన్ని చూసి ఈసడింపుగా "నిండా తాగినట్టున్నాడు. పట్టపగలే తాగి పనికొచ్చాడు, ఇలాంటి వాళ్ళని పనిలోంచి పీకేయాలి. వీళ్ళని అదుపులో పెట్టేవాడు ఎవడూ లేడా?" అని పక్కనున్న వ్యక్తిని అడిగాడు, వినయ్.

దానికి నాగేశం మామ, "పొరపాటు పడ్డావు వినయ్, వెంకన్న తాగుబోతు కాదు, అసలు ఇప్పుడు కూలీనే కాదు. వెంకన్న కథ తెలిస్తే నువ్వు ఇలా అనవు.

ఈ వెంకన్న నాలుగేళ్ల కింద వరకు ఇక్కడ ఇదే బస్టాండులో లైసెన్స్ కూలీ. రోజుకి పదిహేను గంటలు పనిచేసేవాడు. పొద్దున్నే మొదటిబస్సు వేళకి వచ్చినవాడు రాత్రి ఆఖరిబస్సు వెళ్ళిపోయాకగానీ ఇంటికి వెళ్ళేవాడు కాదు.

నిజానికి వెంకన్న చదువుకి తగిన ఉద్యోగం కాదిది. పాపం... ఆ రోజుల్లోనే పది ప్యాసైనా, పుట్టింది ప్రభుత్వం దృష్టిలో ముందుకులం కావడం వల్ల ఎక్కడా ఉద్యోగం రాలేదు. సొంతంగా వ్యాపారం పెట్టేంత తాహతు కూడా లేదు. అలాంటి పరిస్థితుల్లో ఎవరో సిఫారసు చేస్తే ఇక్కడ కూలీగా లైసెన్స్ దొరికింది. పేరుకి కూలీనే... కానీ ఇక్కడ అందరికీ వెంకన్న అయినవాడు. చదువులేని వాళ్ళకి ఉత్తరాలు రాసిపెట్టడం, బస్టాండులో రద్దీ లేనప్పుడు ఇక్కడి పిల్లలతో కలిసి ఆటలాడడం, ఇలా మా అందరికీ తల్లో నాలుకలాగా కలిసిపోయాడు. తనకు రావాల్సిన కూలీ వదిలిపెట్టేవాడు కాదు, అలాగే మాట్లాడుకున్న కూలీ కంటే ఒక్క రూపాయి కూడా తీసుకునేవాడు కాదు. లేనివాళ్ళెవరైనా అవసరంలో ఉంటే ఉచితంగా కూడా సామాను మోసేవాడు.

ఈ వెంకన్న వయసులో ఉన్నప్పుడు ఒకరోజు ఎందుకో వాళ్ళ మేస్త్రీ తిడితే మౌనంగా పడ్డాడు గానీ ఎదురు మాట్లాడలేదు. అనవసరంగా నోరుపారేసుకున్నానని తెలుసుకున్న ఆ మేస్త్రీ అదే సాయంత్రం వెళ్లి క్షమాపణలు అడిగితే వెంకన్న ఏమన్నాడో తెలుసా, 'ఏం పర్లేదన్నా... నేనేదో తప్పు చేసుంటా, అందుకే తిట్టావు. నీలాంటి పెద్దవాళ్ళు కోపంలో అనే వందమాటల్లో తొంభై మాటలు మేము కూడా మీ అంత వాళ్ళం కావాలని చెప్పేవే ఉంటాయి. అయినా తప్పుని తప్పు అని చెప్పకపోతే ఆ తప్పు దిద్దుకునేదెలా?' అని. ఒక మామూలు కూలీ అయిన వెంకన్నకి ఉన్న జ్ఞానం ఎంతమందికి ఉంటుంది చెప్పు?

కాలం గడిచింది, వెంకన్న పిల్లలు పెరిగి చేతికొచ్చారు. కొడుకు సింగరేణిలో ఉద్యోగం సంపాదిస్తే కూతురు ఈ ఊళ్లోనే బడిపంతులుగా పనిచేస్తోంది. తండ్రి కూలిపని చెయ్యడం నామోషీగా అనిపించిందేమో, మానెయ్యమని పిల్లలు చెప్తే, 'కూలిపని చిన్నది, వేరేపని పెద్దది కాదురా. అన్నం పెట్టే ప్రతిపనీ అమ్మతో సమానం. అలాంటి పనిని సవ్యంగా చేయడమంటే భగవంతుణ్ణి పూజించడం లాంటిదే. ఇంకెప్పుడూ అలా మాట్లాడకండి. మీరు కూడా చేసే పనిని ప్రేమించండి.' అని వాళ్ళకి కర్తవ్యబోధ చేసాడు, వెంకన్న. తన పని అంటే అంత ఇష్టం ఆ మనిషికి.

ఆ ఇష్టంతోనే, నాలుగేళ్ల క్రితమే చూపు పోయినా రోజూ మూడు నాలుగు గంటలకి బస్టాండుకి వస్తాడు. ఒక గంట ఇలా సామాన్లు దించడంలో ఒక చెయ్యి వేస్తాడు. సాయంత్రం ఐదింటికి వెంకన్న కూతురో, మనవడో వచ్చి తీసుకువెళ్తారు. కళ్ళు లేవనే గానీ ఈ బస్టాండులో ప్రతి అంగుళం వెంకన్నకి తెలుసు. ఏ బస్సు ఎన్నింటికి వస్తుందో, అది తిరిగి ఎన్నింటికి బయల్దేరాలో వెంకన్నకి తెలిసినంతగా ఆ బస్సులు నడిపే డ్రైవర్లకి కూడా తెలియదేమో.

చెప్పిన పనినే సరిగ్గా చెయ్యకుండా తలెగరేసే జనాలున్న ఈరోజుల్లో వెంకన్న లాంటి మనిషి దొరకడం చాలా కష్టంరా." అన్నాడు.

ఆ ఆఖరి మాటలు  వినయ్ కి చెళ్ళున తగిలాయి. తనకి చేసిన తప్పు అర్థమైంది. వినయ్ లో అంతర్మథనం మొదలైంది.

"అసలు ఉద్యోగం ఎందుకు వదిలిపెట్టాను? అప్పగించిన పనిని చెయ్యమని మృదుల గట్టిగా అడగబట్టేగా?

నిజానికి ఇప్పుడు సెలవు ఎందుకు? – పని నుండి పారిపోవడానికే కదా!

అసలెందుకు పారిపోతున్నాను? – పని చెయ్యడం చేతగాకనా?

కాదే... మరి? – పని పట్ల విముఖత వల్ల.

ఎందుకా విముఖత? – ఎంత పని చేసినా నా స్థితి ఇంతేనన్న భావన వల్ల.

నా స్థితిలో ఎదుగుదల ఎందుకు లేదు? – ఎందుకంటే మంచి చెప్పేవారి మాట పెడచెవిన పెట్టడం వల్ల, పట్టువిడుపులు లేని నా ప్రవర్తన వల్ల.

పైవాళ్ళు చెప్పింది వినడం అంటే 'చెంచాగిరి' చేసినట్లా?

వెంకన్న మాటలే నిజమైతే నా మేనేజర్లు చెప్పిన పదిమాటల్లో కనీసం ఒక్కటైనా నా మంచి కోసం ఉండదా? కానీ నేనేం చేశా? నువ్వేంటి నాకు చెప్పేది అన్నట్టుగా ప్రవర్తించా. గడచిన పదేళ్ళలో ఎంతోమందిని ఇబ్బంది పెట్టి ఉంటాను. తన జీవితంలో రోజుకి వందరూపాయలు కూడా సంపాదించి ఎరుగని వెంకన్నకి ఉన్నపాటి ఇంగితం కూడా నెలకి వేలకివేలు సంపాదించే నాకు లేకపోయింది. ఇప్పటికైనా మించిపోయింది లేదు, నాకు అప్పగించిన బాధ్యతని నేనే పూర్తి చేస్తా. ఇచ్చిన పని సరిగ్గా చేస్తే ఎప్పటికైనా ఫలితం రాకపోదు. ముందు మృదులతో మాట్లాడాలి..." అనుకుంటూ ఫోన్ తీసాడు.

ఆ క్షణాన వెంకన్న వినయ్ కి కళ్ళులేని ఒక మామూలు కూలీలా కాదు, కర్తవ్యధర్మానికి నిలువెత్తు రూపంలా కనిపించాడు

★★★

ఆరునెలల తర్వాత...

పొద్దున్నే ఆఫీసుకి వచ్చిన వినయ్ తనకి వచ్చిన ఇమెయిల్ చూసుకొని పట్టరాని ఆనందంతో 'ఓహ్ మై గుడ్ నెస్.." అని పెద్దగా కేకపెట్టాడు. కారణం, అతని పనితీరుకి మెచ్చి అతనికి 'సీనియర్ మేనేజర్' గా డబుల్ ప్రమోషన్ ఇచ్చి, సంవత్సరం పాటు అమెరికాలో తమ కొత్త ఖాతాదారు దగ్గర పనిచేసేందుకు వీసా ప్రక్రియ మొదలుపెట్టబోతోంది, సంస్థ యాజమాన్యం.

'ఏంటి బాస్, మెయిల్ వచ్చేసిందా? పార్టీ ఎక్కడ ఇస్తున్నావు?' అని నవ్వుతూ అడుగుతున్న మృదులని కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ ఉండిపోయాడు, వినయ్!



కథా కౌముది

# దృక్పథం నాగలక్ష్మి వారణాసి

'జాజి పూవులు రాలి జామురాతిరి వేళ, మల్లె పూవులు విరిసి మధ్యరాతిరి వేళ
ఆకాశ పందిరిలో ఆదమరచిన మేను, నిదురమేల్కొంటేను ఎంత హాయి?
ఎంత హాయి? ఎంత హాయి? ఎంత హాయీ ఈ రేయి ?'

మండు వేసవే అయినా సాయంత్రం తిరిగిన చల్ల గాలి, మధ్య రాత్రికి కూడా అలాగే ఆహ్లాదకరంగా వీస్తోంది. కిటికీ పక్కనున్న విరజాజి తీగ పూలు నక్షత్రాల్లా విచ్చుకుని సువాసనలు చల్లుతున్నాయి. మూడు వారాల పాటు ఇల్లొదిలి వెళ్ళి, తిరిగి మా పొదరింటికి చేరుకుని, మా పక్క మీద నిద్రించి, మధ్య రాత్రి వేళ విరజాజుల పరిమళాలకి మెలకువ వస్తే ఎప్పుడో విన్నపాట జ్ఞాపకం వచ్చింది. కలత చెందిన మనసుకి మళ్ళీ ఏదో హాయి అనుభవం లోకొచ్చింది. ఇద్దరు యువ జంటలనీ చూసొచ్చాక నా మనసులో చోటు చేసుకున్న వెలితి, రాఘవతో మాట్లాడాక తీరిపోయింది.

పక్క మంచం మీద హేమ నిద్రలో ఉంది. మూడొంతులు నెరిసిపోయిన వంకుల జుట్టు దిండు మీద పరుచుకుని ఉంది. ప్రయాణపు అలసట ఇంకా ఆమె మొహంలో కనిపిస్తోంది. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు కుటుంబ బాధ్యతలు నెరవేర్చటంలో గుర్తింపు లేని సేవ చేసింది హేమ. నాకు పదవిలో ప్రమోషన్లు వచ్చాయి. చుట్టపక్కాలలో సమర్ధుడనే పేరు ప్రఖ్యాతులొచ్చాయి. భార్యా పిల్లలకి కావలసినవన్నీ అమర్చాననే మెచ్చుకోలు లభించింది! నిజానికి నాకూ, పిల్లలకీ కావలసినవన్నీ అమర్చింది తనే. ఎంత తెస్తే అంతలో సంసారాన్ని పొదుపుగా నడిపించి, బయటి వాళ్ళెవరికీ తెలియని పాత్ర తను పోషించింది. ఈ విషయాన్ని ఎవరికీ నా అంత నేను చెప్పలేదు, తెలిసేలా ప్రవర్తించలేదు. ఎవరు పొగడినా ఆ పొగడ్తలని మొడెస్టీ ప్రదర్శిస్తూ నేనే అందుకున్నాను.

కిందటి నెల్లో రాజు ఉద్యోగ రీత్యా , భార్యా పిల్లలతో అమెరికా వెళ్ళాడు. సంవత్సరం పాటు కనిపించరు కదా అని వాళ్ళని చూసి నాలుగు రోజులు వాళ్ళతో గడిపి వద్దామని హేమ అనడంతో ఢిల్లీలో వాడింటికి వెళ్ళాం ఇద్దరం, వాడి ప్రయాణానికి వారం ముందుగా. చివరి వారం రోజులూ సెలవు పెట్టాడని తెలిసి, ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్న పుత్ర సమాగమం గురించీ , కలిసి చెప్పుకోబోయే కబుర్ల గురించి ఆశ పడుతూ వెళ్లాం. వెళ్ళిన రోజు నించీ వచ్చేరోజుదాకా అనుక్షణం కోడలు నందిని వాడిని అంటిపెట్టుకునే వుంది. సంభాషణ మొదలు పెట్టబోయే లోపే ఆ చోటు తను ఆక్రమించేస్తుంటే ఇద్దరం తెల్లబోయాం. యువజంట ఒకరినొకరు అంటిపెట్టుకుని వుంటే నిజానికది ఆనందించే విషయమే గాని, రాక రాక వచ్చిన అత్తమామల ముందు, వాళ్లున్న వారం రోజుల్లోనూ తమ అన్యోన్యతని అంతగా

ప్రదర్శించేయాలా అని నాకే ఆశ్చర్యం కలిగింది. ఆ సాన్నిహిత్యంలో హుందాతనానికి బదులు ఎగ్జిబిషనిజం కనిపించి ఎబ్బెట్టుగా అనిపించింది. అదంతా తమ అన్యోన్యతాప్రదర్శన మాత్రమే కాక, మానుంచి వాడిని రక్షించే కంచెగా తనని ప్రకటించుకునే ప్రయత్నం అని తర్వాత అర్ధమయింది. తన ప్రవర్తన ఎంత ఎబ్బెట్టుగా, అసహజంగా ఉందో స్పష్టంగా కనిపిస్తున్నా రాజు కీ ఇచ్చిన బొమ్మలా ప్రవర్తించడాన్ని మేమిద్దరం జీర్ణించుకోలేక పోయాం.

మేం వచ్చామని తెలిసి ఒక రోజు కింది అంతస్తులో ఉంటున్న రాజేష్ తల్లీ తండ్రీ వచ్చారు, మమ్మల్ని పలకరించడానికి. వాళ్ళు వెళ్ళీ వెళ్ళగానే " అమ్మో వాళ్ళు చాలా గడుసు వాళ్ళు అత్తగారూ. రాజేష్ వైఫ్ సీమా కోసం, సీమా వాళ్ళ అమ్మా, నాన్నా కొనిచ్చిన అపార్ట్ మెంట్ అది. అందులో కూతురూ అల్లుడూ ఉండాలని వాళ్ళు కొనిస్తే, తగుదునమ్మా అని వీళ్లొచ్చి పద్దారు వాళ్ళ నెత్తిమీదికి " అంది నందిని. హేమా నేనూ నివ్వెరపోయాం. 'తల్లిదండ్రులు కొడుకు ఎక్కడుంటే అక్కడ ఉంటారు గాని ఆ ఇల్లు ఎవరిచ్చారో వాళ్లకెందుకు? ఏడాది తర్వాత వీళ్లు తిరిగొస్తే మనం మూటాముల్లే సర్దుకుని వచ్చి నెత్తిన పడిపోతామో అని భయం పాపం నందినికి' అంటూ వెలితిగా నవ్వింది హేమ.

వాడెదురుగా ఉన్నప్పుడు ' నడుం లాగేస్తోం 'దనో, ' చెయ్యి పట్టేసిం 'దనో అంటూ, 'ఏదైనా పెయిన్ కిల్లరు తెచ్చిపెట్టండి' అంటూ అత్త మామల సేవలో అలసిపోతున్న అభిప్రాయం కలగజేయడం, వాడు పన్ల మీద బయటికి వెళ్లినపుడు ఇంటి పని హేమ మీద వదిలేసి ఫోను పట్టుకు కూర్చోవడం! వాడేమో సందు దొరికినప్పుడల్లా తన అత్త గారి జ్ఞాన సంపద గురించో, మామగారు చేసిన గుప్త దానాల గురించో చెపుతూ భార్య అహాన్ని సంతృప్తి పరచే ప్రయత్నం చెయ్యడం. పిల్లవాడిని కని పెంచి పెద్ద చేసి, ఇరవయ్యొనిమిదేళ్ళపాటు వాడికి చక్కని చదువు సంస్కారాలందించిన మాకు వాడితో తీరుబాటుగా కూర్చుని చిన్నప్పటి జ్ఞాపకాలు నెమరేసుకునే అవకాశమే దొరకలేదు.

ఇద్దరూ మగ పిల్లలే అని వదిలెయ్యకుండా చిన్నప్పటి నుంచీ పిల్లలిద్దరికీ ఇంటి పనులన్నీ నేర్పించింది హేమ. ఏ కారణం చేతనయినా తనకి పనెక్కువైతే ఇద్దరు పిల్లలూ వంటింటిలో ఎంతో సాయం చేసే వారు. నందిని వాడికేమీ చేతకాదన్నట్టు మాట్లాడుతూనే తను వాడికెన్నెన్ని నేర్పిస్తోందో, తన తోబుట్టువులూ, తల్లిదండ్రులూ తమకెంత అండదండా అందిస్తున్నారో, రాజు ఈ స్థితికి రావడం వెనక తన కృషి ఎంత వుందో చెప్పేది. అందువల్ల మేం కూడా వాళ్ళకి ఋణపడి ఉండాలన్నట్టుండేది ఆమె ధోరణి.

తనేవేవి ఎక్కడ సర్దిందో, పిల్లలు అడిగినపుడు ఏ బాగులోంచి ఏది తీసివ్వాలో, అక్కడి మిత్రుల కోసం తెచ్చిన బహుమతులు ఎందులో పెట్టిందో అవసరం లేని వివరాలన్నీ చెపుతూ నందిని రాజు వెంటే తిరుగుతుంటే, హేమ పిల్లలకి కావలసినవి చేసిస్తూ, వంటా వార్పూ చూసుకుంటూ గడిపింది. ఏ పనీ తోచని నేను చిందర వందరగా పడేసిన పేపర్లూ, పత్రికలూ సర్దుతూ, పిల్లల్నాడిస్తూ కాలక్షేపం చేసుకున్నాను. ఆఖరికి ఎయిర్ పోర్టుకి వెళ్లేదారిలో కూడా వాడితో మాకు పది నిముషాలైనా అంతరాయం లేకుండా మాట్లాడే అవకాశం దొరకలేదు. ' నువ్వుండు నందినీ ! అవన్నీ ఫ్లయిట్ లో మాట్లాడుకోవచ్చు. అమ్మతో కొంత సేపు మాట్లాడనీ ' అని ఒకసారైనా రాజు అనలేదని నొచ్చుకుంది హేమ.

ఉన్న వారం రోజుల్లో రాజు మాకెంతో దూరంగా అనిపించాడు. బొడ్డుతాడు తెగినపుడు భౌతికమైన వేర్పాటుకి వాడు ఏడిస్తే, పేగు బంధాన్ని, కళ్ళకి కనిపించని మానసిక బంధాన్ని ఇప్పుడెవరో తెంచేసినట్టు తను బాధపడింది. చెట్టు నించీ కాయకి పోషకాలు అందడమే గాని కాయ నించి చెట్టుకి ఏం అందుతుంది? ఇది తెలిసిన విషయమే అయినా ఏదో భ్రమ మనిషికి పిల్లల పట్ల అలవి మాలిన మమకారాన్నికలిగిస్తుందేమో ! వాళ్ళకి వీడ్కోలిచ్చి బరువెక్కిన మనసుల్తో వైజాగ్ బయల్దేరాం చిన్నవాడు రవి ఇంటికి.

రవి నాలుగేళ్ల క్రితమే ఉద్యోగం మానేసి సొంత బిజినెస్ పెట్టుకున్నాడు. అలా పెట్టుకునే ముందు మమ్మల్నిసలహా అడగలేదు. మాకు చెప్పలేదు. ఇన్నేళ్ళ నా అనుభవ జ్ఞానం వాడికి పనికొస్తుందేమో అనే ఆలోచనే రాలేదు వాడికి. వ్యాపారం చాలా బాగా నడుస్తోందని వాడు చెపుతూ ఉంటె మేమూ నమ్ముతూ వచ్చాం. ఇద్దరు పిల్లలూ మూడూ, నాలుగూ తరగతుల్లో ఉన్నారు. మేమున్న పదిరోజుల్లో మా

కర్థమైనదేమంటే వాళ్ళు పిల్లల స్కూలు ఫీజు కూడా సరిగా కట్టడం లేదు.

ఇంట్లో ఒకవైపు విచ్చలవిడి ఖర్చులు నడుస్తుంటే, రెండో వైపు రోజూ వాడుకునే పరికరాలూ, వస్తువులూ పాడైతే కూడా బాగు చేయించని అశ్రద్ధ, నిర్లక్ష్యం. బాత్రూములు అపరిశుభ్రంగా మురికోడుతూ ఉన్నాయి. ప్రతిరోజూ రెండు పూటలా అవసరం లేనంత వండుకోవడం, ఏ పూట కాపూట మిగిలిపోయినవన్నీ పారెయ్యడం. పెద్దదిక్కుగా హేమ ఏదైనా చెప్పబోతే 'నేను చూసుకుంటాను అత్తగారూ, మీరు వర్రీ అవకండి! తక్కువ వండితే ఎదిగే పిల్లలకి సరిపోదు, పిల్లలకి మిగిలిపోయినవి పెడితే మందబుద్ధులైపోతారు' అంటూ కోడలు అపర్ణ.

రవిని కూర్చోపెట్టుకుని వాడి ఆర్థిక స్థితి గతులు ఆరా తీద్దామని ప్రయత్నిస్తే, వాడు దాట వేసేశాడే గాని విషయం చెప్పాడు కాదు. అన్నిటికీ అపర్ణకి నందినితో వంతు. పొదుపుగా, తీరువుగా ఇంటిని చక్కదిద్దుకునే నేర్పు తనకి లేకపోగా చూసి నేర్చుకోవాలనే కోరికా, అడిగి తెలుసుకోవచ్చనే ఆలోచనా కూడా లేని ఆ అమ్మాయిని చూస్తే రవి జీవితం చుక్కాని లేని నావలా ఎటు వెడుతుందో తెలియనట్టయింది. వాళ్ళు పయనిస్తున్న దారి సరైనది కాదని స్పష్టంగా తెలిసినా 'మీ జోక్యం మాకక్కరలే'దనే వాళ్ళకి ఏమని చెప్పగలం ? భవిష్యత్తులో ఎన్నో చిక్కు సమస్యల్లో చిక్కుకు పోతారని తెలుస్తూనే ఉన్నా ఏమీ చెయ్యలేని పరిస్థితి ! ఇద్దరి జీవితాల్లోనూ మాకు చోటు లేదని తెలిశాక ఏదో వెలితి నిండిన మనసులతో వెనక్కి తిరిగొచ్చాం.

ఊరెళ్ళి వచ్చామని తెలిసి నిన్ననా మిత్రుడు రాఘవ వచ్చాడు. నా మాటల్లో బయట పడబోయిన కొన్ని భావాలు, ఆశాభంగాలని కష్టం మీద అదుపు చేసుకున్నాను.

మా ప్రయాణ విశేషాలు వింటూ " బావుందిరా చక్కగా. పిల్లల సంసారాలు చూసి హాయిగా తిరిగొచ్చారు. పిల్లలిద్దరూ పిల్లాపాపలతో ఎవరి జీవితం వాళ్ళు గడుపుకుంటున్నారు! ఎంత సంతోషించదగ్గ విషయం ! ఎందఱో కోరుకునే గొప్ప అవకాశం మీకు దొరికింది!" అన్నాడు.

నేను తెల్లబోయి చూశా.

"అదేరా .. నానా అవస్థా పడి పిల్లల్నికని, పెంచి, పెద్ద చేసి, పెళ్ళిళ్ళు చేసి, హమ్మయ్య అనుకునే లోపే వాళ్లకి పిల్లలు పుట్టడం , ఆ అవసరం ఈ అవసరం అంటూ వాళ్ళు వెంటపడడం... మా పెద్దది పిల్లలిద్దర్నీ మా దగ్గర వదిలి ఎం బియ్యే చెయ్యాలని వెళ్ళింది, ఇంకా పెద్ద ఉద్యోగం, జీతాల కోసం. పిల్లలు చిన్నవాళ్ళు. ఈ కాలపు చదువులు చదివించడం మాకెంత కష్టమో ఆలోచించు. డబ్బుల గురించి కాదు. ఆ హోం వర్కులూ , అసైన్ మెంట్లూ ...ప్చ్.

"చిన్నదాని ఇల్లు మా పక్క వీధిలోనేగా. రోజూ పసి వాడిని మా దగ్గర వదిలి ఉద్యోగానికి వెళుతుంది. ఆఫీసు నించి వెనక్కొస్తూ తీసుకు పోతుంది .. పాలపీకె సరిగ్గా కడగ లేదనో, పనిపిల్ల సరిగా చెయ్యకపోతే చూసుకోలేదనో తల్లి మీదా, నా మీదా కోపగించుకుంటుంది. రోజంతా పిల్లని చూసుకున్నా వస్తూనే మొహం మాడ్చుకుని ముభావంగా వెళ్తుంటే కష్టం గా ఉంటుంది. 'ఇలా అంత్య నిష్టూరం కన్నా ఆది నిష్టూరం మేలు, ఎక్కడైనా క్రెష్ లో చేర్పించమని చెప్పు' అంటాను గాని గాని, రేవతి ఒప్పుకోదు. ' ఇల్లూ ఉద్యోగం రెండూ నిభాయించుకోలేక నలిగిపోతోందండీ పాపం, ఆ చికాకు ఎవరిమీదా చూపించలేక మనమీద విసుక్కుంటుంది' అంటుంది.

ఎందుకంత సంపాదించాలని యావ ? ఈ వయసులో మామీద ఇంత బాధ్యత పెట్టి కనీసం కృతజ్ఞతా భావం కూడా లేకుండా ప్రవర్తిస్తుంది. ఇవన్నీ చెయ్యడం మా బాధ్యతే అన్నట్టుంటుంది. అన్నీ మౌనంగా భరిస్తుందని, నేనూ రేవతి మీదే విసుక్కుంటాను. 'ఎన్నాళ్ళు లెండి పిల్లలు కాస్త పెద్దైతే మన అవసరం ఉండదు' అంటుంది. అలా మా అవసరం లేకుండా వాళ్ళు ఎప్పుడుంటారా అని ఎదురుచూస్తున్నా! సగం జీవితం బాధ్యతల నిర్వహణలో గడిపేసి, అవి తీరాక చేద్దామనుకున్న పనులు, తీర్చుకుందామనుకున్న సరదాలూ అన్నిటినీ వదిలేసి ఇంకా వాళ్ళ పిల్లల కోసం మిగిలిన సగం జీవితాన్ని కూడా కోల్పోతున్నాం ! ఎప్పటికి మాకు తీరిక దొరుకుతుంది మాకోసం జీవించడానికి

?" అన్నాడు రాఘవ .

వాడు వెళ్ళిపోయాక కూడా ఆ మాటలే నా చెవిలో ప్రతిధ్వనిస్తూ ఉండిపోయాయి. కిటికీ లోంచి పడుతున్న వెన్నెల వెలుగులో వడలినట్టున్న హేమ మొహాన్ని ఆపేక్షగా పరికించి, ముంగురులు సవరించి, మళ్ళీ నిద్రకుపక్రమించాను.




# ఆ బిడ్డ నాకు కావాలి! డా.కె.జి. వేణు

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ**

"**ఆ బిడ్డ నాకు కావాలి**.. ఆ బిడ్డ నాకు కావాలి... ఆ బిడ్డ నాకు కావాలి!" అంటూ గొంతు నరాలు తెగిపోయేలా అరుస్తోంది సుమతి.

"నోర్ముయ్. నీ కేమైనా పిచ్చి పట్టిందా?" అంతే గొంతుతో కళ్ళెర్ర చేసి అరిచాడు సుమతి అన్నయ్య ఆనంద్.

అమ్మవారిలా కళ్ళు పెద్దవి చేసి "అవును నాకు పిచ్చే పట్టింది. ఆ బిడ్డ కావాలన్న పిచ్చి నాకు పట్టింది." అంటూ మళ్ళీ గట్టిగా అరిచింది సుమతి. భర్తను చుట్టేసుకుని "ఏవండీ మీరైనా చెప్పండి. ఆ బిడ్డ నాకు కావాలి. నాకు కావాలని చెప్పండి." అంటూ భర్తను ప్రాధేయపడుతూ పాదాలు పట్టుకుంది. భార్యను లేవనెత్తి గుండెలకు హత్తుకున్నాడు సుమతి భర్త. అతని కళ్ళల్లో కూడా నీళ్ళు జల, జలారాలాయి.

ఇదంతా చూస్తున్న ఆనంద్‌కు చాలా చిరాకేస్తోంది, కోపం పట్టలేకపోతున్నాడు. చెల్లెలకి ఎదురుగా వచ్చి "చూడు.. నేను చెప్పింది విను. నేను చెప్పినట్లు చేద్దాం. నా మాట వింటే ఎవరికి ఏ సమస్యా ఉండదు. కాదని మొండికేస్తే తరువాత నువ్వే చాలా విచారిస్తావు." అన్నాడు. అయినా సుమతి పట్టు వదల్లేదు. "ఆ బిడ్డ నాకు కావాలి... ఆ బిడ్డ నాకు కావాలి" అంటూ మళ్ళీ గట్టిగా అరిచింది.

చెల్లెలిని చంపేటంత కోపం వచ్చేస్తోంది ఆనంద్‌కు "చూడు, నువ్వు ఎంత ఏడ్చినా మొత్తుకున్నా సరే నేననుకున్నదే చేస్తాను. అంతే. మరేం మాట్లాడకు" అన్నాడు ఆనంద్.

సుమతి కళ్ళల్లో నీళ్ళు వరదలై పోతున్నాయ్. విసురుగా వచ్చి, ఆనంద్ ముందు నిలబడి "నీ నిర్ణయాలతో నాకు పనిలేదు. ఆ బిడ్డను నేను తీసుకెళ్తాను. కాదనే హక్కు ఎవరికీ లేదు. నువ్వు కాదు ఆ దేవుడు దిగి వచ్చినా నన్ను ఆపలేరు. అంతే" ఆసుపత్రి గోడలు దద్దరిల్లిపోయేలా అరిచింది సుమతి. కిటికీల గుండా వీస్తున్న గాలి స్థంభించి చాలా సేపయింది. గదంతా బాగా వేడెక్కిపోయింది.

ఈ సంఘటన జరిగి అపుడే ఏడాది పైగా దాటిపోయింది. ఆ తరువాత అన్నా, చెల్లెలు మధ్య అసలు మాటలే లేవు. కలుసుకునే సందర్భాలు కూడా ఎందుకో ఇద్దరి మధ్య కలిసి రాలేదు. ఇదిగో ఈ రోజు కొరియర్‌లో సుమతి దగ్గరి నుంచి తన బిడ్డ మొదటి పుట్టిన రోజు వేడుకల కార్డు అందింది. కార్డు చేతిలోకి తీసుకుని చాలా సేపట్నుంచి చూస్తున్నాడు ఆనంద్.

ఇన్విటేషన్ కార్డు చాలా అందంగా ఉంది. కార్డు కంటే, కార్డు మీద ఉన్న బాబు ఫోటో మరింత అందంగా ఉంది. ఫోటోను తదేకంగా చూస్తూ.. ''సుమతి కొడుకు ఎంత ముద్దుగా ఉన్నాడో'' అనుకున్నాడు మనసులో ఆనంద్.

''గంటసేపట్నుంచి అరుస్తున్నాను. వినిపించటం లేదా. అసలు ఏం చేస్తున్నారు మీరిక్కడ.'' రుస, రుసలాడుతూ హాల్లోకొచ్చింది భార్య వైశాలి.

వైశాలి వచ్చిందంటే ఓ పెద్ద సుడిగాలి వచ్చినట్లే లెక్క. కోపం ఎపుడూ ఆమె కళ్ళల్లో కాపురం చేస్తూనే ఉంటుంది.

భార్యను చూశాడు ఆనంద్ చెప్పాలో వద్దో అనుకుంటూ తటపటాయిస్తూ ''సుమతి కార్డు పంపించింది. వాళ్ళ బాబు ఫస్ట్ బర్త్‌డే ఫంక్షనట'' కార్డు చూపిస్తూ భయంగానే చెప్పాడు.

''అయితే మనం వెళ్ళాలా?'' వ్యంగ్యంగా అడిగింది వైశాలి.

ఆమె వ్యంగ్యం అర్థమైపోయింది ఆనంద్‌కు. అయినా ధైర్యం తెచ్చుకుని ''వెళ్ళాలి కదా'' అన్నాడు.

త్రాచు పాములా లేచి పడగ విప్పింది వైశాలి. ''ఆవిడకు సిగ్గులేకపోతే మీకు సిగ్గులేదా? ఆ రోజు మిమ్మల్ని ఎన్ని మాటలందో అపుడే మరిచిపోయారా మనిషన్నవాడు ఆ మాటలు భరించగలడా. అనవలసిన అన్ని మాటలు అనేసి, పైగా ఇపుడు వాళ్ళ బాబు పుట్టిన రోజని, సిగ్గులేకుండా మనల్ని రమ్మంటూ కార్డు పంపిస్తుందా?'' భర్త చేతిలోని కార్డును బలవంతంగా తీసుకుని ముక్కలు చేసి విసిరేసింది.

వచ్చి భర్త కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ''అసలు ఏమిటి ఆవిడ ఉద్దేశ్యం?'' పళ్ళు పట, పటా కొరుకుతూ అడిగింది.

''వేరే ఉద్దేశ్యాలు ఏముంటాయ్'' అన్నాడు మెల్లగా ఆనంద్.

''ఆహా! చెల్లెలి మీద ప్రేమ పొంగి పోతోంది. వెనకేసుకొస్తున్నాడు సిగ్గులేకుండా. చూడండి ఆవిడ ఉద్దేశ్యాలు మీకు తెలియక పోయినా నాకు బాగా తెలుసు. మళ్ళీ ఈ ఇంటితో సంబంధాలు కలుపుకుని ఉన్న ఆస్తుల్లో సగభాగం కోసం కుట్రలు పన్నుతోంది. అవసరమయితే రేపు కోర్టుకు కూడా వెళుతుంది. నీ చెల్లెలు సంగతి నాకు బాగా తెలుసండి .. ఛీ ఎలా పుట్టారండి సిగ్గులేకుండా మీరంతా. కొడుకు పుడితే ఎవరైనా ఫోన్ చేయరా. పోనీ బారసాలకైనా పిలిచిందా? మనం అంత కానివాళ్ళమై పోయామా? ఇపుడేమో బర్త్‌డే కార్డు పంపి ఫంక్షన్‌కు రమ్మని ఆహ్వానిస్తుందా! బోడి ఆహ్వానం. దాన్ని చూసి ఈయనగారు మురిసిపోవటం చెల్లెల్ని సమర్ధించటం. ఛీ! నాకయితే ఒళ్ళు కంపరమెక్కుతోంది.'' కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ పూనకం వచ్చిన దానిలా ఊగిపోయింది వైశాలి.

రాత్రి పడుకున్నాడే కానీ, ఆనంద్‌కు నిద్రపట్టటం లేదు. ప్రక్కన వైశాలి మాత్రం గురకలు పెడుతూ నిద్రపోతోంది. మెల్లగా పైకి వరండాలోకి వచ్చాడు. బయట వెన్నెల పలకరించటానికి సిద్ధంగా ఉంది. వెన్నెల్లో మెరిసిపోతున్న ఆకాశం వైపు చూస్తూ చాలాసేపు అక్కడే ఉండిపోయాడు ఆనంద్.

చిన్నప్పుడు సుమతి, ఆనంద్‌లు సఖ్యంగానే ఉండేవారు. సాధారణంగా చిన్నపిల్లల మధ్య బయలుదేరే దెబ్బలాటలు కూడా ఆ ఇంట్లో ఎపుడూ చూసిన దాఖలాలు లేవు. స్కూల్లో ఎవరో ఒక పెంకి పిల్లోడు సుమతి జడలాగి ఏడిపించాడని వాడి డొక్కలో పిడి గుద్దులు గుద్ది వాడ్ని చంపేంత పనిచేశాడు. ఏదైనా ఒక పూట ఇంటికి తండ్రి రావటం ఆలస్యమయితే తానే అన్నం కలిపి, ముద్దులు చేసి చెల్లికి తినిపించేవాడు.

తన ఇద్దరు పిల్లల్ని చూసి పావనమూర్తి ఎంతగానో ఆనందించేవాడు. సుమతి పుట్టినప్పుడు భార్య కాత్యాయని ప్రసవం చాలా కష్టమై పోయి, డాక్టర్లు ఎంత ప్రయత్నం చేసినా బిడ్డను బ్రతికించగలిగారే తల్లిని బ్రతికించలేకపోయారు.

"పిల్లలు చాలా చిన్నవాళ్ళు ఈ కుటుంబానికి ఆడదాని అవసరం చాలా ఉంది, మా మాట విని మళ్ళీ పెళ్ళి చేసుకో" అంటూ బంధువులంతా పావనమూర్తి పెళ్ళి మీద చాలా వత్తిడి తెచ్చారు. ఎవరి వత్తిళ్ళకు లొంగలేదు పావనమూర్తి పైగా మరెప్పుడూ తన పెళ్ళి ప్రస్తావన దయచేసి తీసుకురావద్దని బంధువులకంతా తేల్చి చెప్పేశాడు.

తన పిల్లలు సవతి తల్లి నీడన బ్రతక కూడదని అతని ఉద్దేశ్యం. అందుకు జీవితాంతమూ తాను ఇలాగే ఉండిపోవటానికి సిద్ధపడ్డాడు. భార్య కాత్యాయని ఫోటో దగ్గర నిలబడి ఒక్కటే నిర్ణయానికి వచ్చాడు. "తన పిల్లలకు ఏనాడూ కూడా తల్లిలేని లోటు కనిపించకూడదు. అవసరమయితే వందమంది తల్లుల ప్రేమను తాను ఒక్కడే అందించగలగాలి. యస్ నేను అందిస్తాను. కాత్యాయిని నీ మీద ప్రమాణం చేసి చెబుతున్నాను నేను పిల్లల కోసమే బ్రతుకుతాను. వాళ్ళకు ఆనందాన్ని అందించటానికే నా జీవితాన్ని త్యాగం చేస్తాను. నీమీద ఒట్టు" అన్నాడు పావనమూర్తి. అనటమే కాదు అక్షరాలా అలాగే చేశాడు. ఇంకాచెప్పాలంటే అనుకున్న దానికంటే ఎక్కువే చేశాడు. ఏ తల్లికీ సాధ్యం కాని ప్రేమను తండ్రిగా, తల్లిగా తన పిల్లకు అందించాడు. ఊరూ వాడా అతని ప్రేమకు ముగ్ధులై పోయారు. ఈ పిల్లలు ఎంత అదృష్టవంతులో అంటూ దీవెనలు అందించేవారు. పావనమూర్తి అందించే ప్రేమను కథల్లా చెప్పుకోవటం మొదలు పెట్టారు.

ఇద్దరు పిల్లల్లో కూతురు సుమతి చాలా ప్రత్యేకంగా పెరుగుతూ వచ్చింది. వయసుతోపాటు బాధ్యతల పట్ల ఆసక్తి కూడా సుమతిలో కనిపించింది. వద్దన్నా వినకుండా చిన్న, చిన్న పనుల్లో తండ్రికి సాయపడుతూ వచ్చేది. ఆనంద్‌కు ఎప్పుడూ ఆటలే. ఇంటిపట్టున సరిగా ఉండేవాడు కాదు. చిల్లర స్నేహాలు కూడా ఈ మధ్య ఎక్కువైపోయాయి.

తాను ఇంజనీర్నవుతానని ఒక పెద్ద కార్పొరేట్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఎం.పి.సి గ్రూపులో చేర్పించేదాకా ఆనంద్ వినలేదు. అలాగే చేర్పించాడు పావనమూర్తి. కాలేజీకి వేలకు, వేలు ఫీజు చెల్లించాడే కానీ, కొడుకు ఆసక్తిని చదువుల వైపు మళ్ళించలేకపోయాడు.

ఒక రోజు కూతుర్ని దగ్గర కూర్చోపెట్టుకుని "తల్లీ! భవిష్యత్తులో నీ లక్ష్యం ఏమిటిరా?" అంటూ అడిగాడు తండ్రి.

"నాకు డాక్టరు కోర్సు, ఇంజనీరు కోర్సు చదవాలని లేదు నాన్న. నేను టీచర్నవుతాను నాన్నా." అంది సుమతి.

"ఎందుకు నాన్నా?" అడిగాడు పావనమూర్తి ఆనందంగా.

"ప్రపంచానికి వెలుగునిచ్చేది సూర్యుడయితే మనిషి జ్ఞానానికి వెలుగునిచ్చేది ఉపాధ్యాయుడు. మనం చదువుకుంటే ఒక డాక్టరో, లేక ఒక ఇంజనీరో కావచ్చు. అదే మనం టీచరమయితే కొన్ని వందల, వేల మంది ఇంజనీర్లను, డాక్టర్లను తయారు చేయవచ్చు. ఇంజనీరో, డాక్టరో అయితే విదేశాల మీద మోజు పెరగవచ్చు, ఆ తరువాత దేశం వదిలి వెళ్ళిపోవచ్చు. అదే టీచరయితే తన సేవలన్నీ నా మాతృదేశానికే అందుతాయి. అందుకే నేను టీచరు కావాలనుకుంటున్నాను నాన్నా" అంది సుమతి.

అనర్గళంగా ఒక ఉపన్యాస ధోరణిలో మాట్లాడుతున్న తన చిన్న కూతుర్ని చూసి ఎంత ఆశ్చర్యపోయాడో, అంత పావనమూర్తి.

నాన్నంటే సుమతికి మహాప్రాణం. నాన్న త్యాగాన్ని చిన్నతనంలోనే తన కళ్ళల్లో నమోదు చేసుకుంది. చిన్నప్పుడు నాన్న భుజాల మీద ఎక్కి ఊరేగుతున్నప్పుడు బంగారు రథంలో ఊరేగే దేవుడి కంటే తానే గొప్పదాన్ననుకునేది. అందరి ఆడపిల్లల్లాగా జుట్టు పొట్టిగా కత్తిరించుకోమంటే అసలు ఒప్పుకునేది కాదు. "నాకు పూలజడలంటే ఇష్టం నాన్నా" అనేది. రెండు జడలు ముందుకు వేసుకుని, కళ్ళు గుండ్రంగా త్రిప్పుతూ కూతురు మాట్లాడుతుంటే, పావనమూర్తికి తన తల్లి శివపార్వతమ్మ గుర్తుకు వచ్చేది. వయసుకు మించిన ఆలోచనలతో అన్ని రంగాలలోనూ సుమతి గొప్ప పరిణితిని సాధించింది.

కొడుకు ఆనంద్ గురించి గొప్పగా చెప్పుకోవటానికి విషయాలేవీ మిగల లేదు.

ఏదో తంటాలు పడి ఆనంద్ ఇంటర్ పాసయ్యాడు కానీ, ఎం.సెట్ పరీక్షల్లో ర్యాంకు లక్షల్లో వచ్చింది. మేనేజ్ మెంటు కోటాలో తప్ప నేరుగా తన కొడుక్కి సీటు ఇచ్చే అవకాశం ఎక్కడా కనిపించటంలేదు. డిగ్రీ చేయిద్దామనుకున్నాడు. కాదు ఇంజనీరింగే

చదువుతానని పట్టుపట్టాడు. డొనేషన్ కట్టి తనను ఇంజనీరింగ్ కాలేజీలోనే చేర్పించమని నానాగొడవ చేశాడు. చివరకు కొడుకు గోల భరించలేక పెద్ద మొత్తంలో డొనేష కట్టి పేరున్న పెద్ద కాలేజీలోనే ఆనంద్ కోరిన కోర్సులో తండ్రి చేర్పించాడు.

కుక్క తోక వంకర, వంకరే. సెమిష్టర్ పరీక్షల్లో మార్కుల సంగతి ఏమిటో కానీ, కొడుకు ఖర్చుల జాబితాలో రోజు, రోజుకు క్రొత్త క్రొత్త విషయాలు చేరి పోతున్నాయ్. పావనమూర్తి బ్యాంకు బ్యాలెన్స్ కూడా చిక్కిపోవటం ప్రారంభించింది. డబ్బు గురించి పావనమూర్తి ఏ రోజూ బెంగపడలేదు. తన విచారమంతా కొడుకు గురించే. ఈ మధ్య ఎదిరించటం కూడా మొదలు పెట్టాడు. అసలు తండ్రి మాటను ఖాతరు చేయటం లేదు.

సుమతి బి.యి.డి కోర్స్ పూర్తిచేసింది. ఆ వెంటనే ఉద్యోగం కూడా వచ్చింది. మరో ఆరునెలల్లో మంచి సంబంధం కూడా కలిసివచ్చింది. సుమతి, పావనమూర్తి ఇద్దరూ ఆ సంబంధాన్ని చాలా ఇష్టపడ్డారు. వియ్యంకులు కూడా చాలా సంస్కారవంతులు. పెళ్ళి ఖర్చులు కూడా వాళ్ళే భరించుకున్నారు. అంతా శుభంగా జరిగిపోయింది. కూతురు సుమతి కూడా చాలా ఆనందంగా తన సంసారాన్ని జరుపుకుంటోంది. సుమతి గుర్తుకు వచ్చినపుడల్లా సంతోషంతో పావనమూర్తి కళ్ళల్లో కన్నీళ్ళు ఉప్పొంగిపోతూ ఉంటాయ్.

చదువు తరువాత ఆనంద్ ఏం చేస్తున్నాడో తండ్రికి చెప్పటం లేదు. ఎక్కడికి వెళ్తున్నాడో అసలు చెప్పటం లేదు. ఇంటికొస్తున్నాడు తండ్రి వండింది తింటున్నాడు. తండ్రితో మాట్లాడటం కూడా చాలా తగ్గించాడు.

ఓ రోజు సాయంకాలం టీ త్రాగి న్యూస్ పేపరు చదువుకుంటున్నాడు పావనమూర్తి. ఇంటిముందు టాక్సీ ఆగింది. ఎవరా? అనుకుంటూ కళ్ళద్దాలు సరిచేసుకుని వరండాలోకొచ్చాడు పావనమూర్తి. టాక్సీలో నుంచి క్రొత్తదంపతులు దిగారు. సరాసరి ఇంట్లోకి వెళ్ళిపోయారు. మాటలు కరువైపోయిన పావనమూర్తికి రెప్పాడని కళ్ళు అలాగే నిలబడి పోయాయి. గంట తరువాత గదిలోనుంచి బయటకి వచ్చాడు ఆనంద్. "నేను పెళ్ళి చేసుకున్నాను.." అన్నాడంతే. రెండవ మాట మాట్లాడకుండా వెంటనే మళ్ళీ గదిలోకి వెళ్ళిపోయాడు.

ఏం జరిగిందో చెప్పటం కానీ, చెప్పకుండా పెళ్ళి చేసుకున్నందుకు క్షమాపణలు కానీ ఏవీ లేవు. వీటి గురించి పావనమూర్తి పెద్దగా బాధపడటం లేదు. తాను ఎంతో జాగ్రత్తగా పిల్లల్ని పెంచాడు. వాళ్ళు ఆణిముత్యాలు కావాలని ఆశించాడు. అమ్మాయి తులసి మొక్కయితే, వీడెందుకిలా గంజాయి మొక్కయ్యాడో పావనమూర్తికి అర్థం కావటంలేదు.

కొత్త కోడలు రాకతో కష్టాల పర్వం ప్రారంభమయింది పావనమూర్తికి. ఇంట్లో ఇపుడు తనకు యజమానుల సంఖ్య పెరిగింది. కొత్త యజమానురాలు దాదాపు తనను బానిసలాగే చూస్తోంది. పనుల మీద పనులు, ఇంటి పనులు, బయటి పనులు అన్నీ మోయటం చాలా కష్టమైపోతోంది పావనమూర్తికి. భార్య దగ్గర తన ప్రతాపం చూపటానికి తండ్రి మీద కావాలనే ఆనంద్ కేకలు వేసేవాడు. ఇలాంటి అవకాశమే కోడలు కూడా ఎదురు చూస్తూ ఉండేది.

మానసికంగా చాలా కృంగిపోయాడు పావనమూర్తి. ఒకరోజు ఆకలితో తూలిపోతూ, భార్య ఫోటో దగ్గర నిలబడి "అనాథలంటే తల్లీ, తండ్రి లేనివాళ్ళే కాదు. ఈ లోకంలో భార్యలు లేని భర్తలు కూడా అనాథలే. అందుకు నేనే ఉదాహరణ కాత్యాయని.." కన్నీళ్ళు పెట్టుకున్నాడు అనుకున్నాడు పావనమూర్తి.

ఒక రోజు సుమతి వచ్చింది. తండ్రిని చూసి బావురుమంది. పరిస్థితంతా ఆమెకు అర్థమైపోయింది. ఇక లాభంలేదనుకుని ఒక నిర్ణయానికి వచ్చి "నేను నాన్నను తీసుకెళ్తున్నాను. ఇకనుంచీ నాన్న నా దగ్గరే ఉంటారు" అంది ఆనంద్‌తో. అంతవరకు సుమతి ఏడుపులు వింటూ చిరాకు పడుతున్న ఆనంద్ భార్య వైశాలి ఒక్కసారిగా రుద్రకాళి అవతారమెత్తింది.

"ఏం మేం ఆయన్ని సరిగా చూసుకోవటం లేదా. ఇన్నాళ్ళూ నువ్వే చూసుకున్నావా! అయినా ఇక్కడ ఏం కష్టపడి పోతున్నారో ఆయన్నే చెప్పమనండి. తిండి పెట్టడం లేదా? లేక సరిగ్గా చూసుకోవటం లేదా? ప్రతినెలా ఆయన మందుల కోసం ఎంత ఖర్చుపెడుతున్నామో నీకు తెలుసా? మాట్లాడేముందు అన్నీ తెలుసుకుని మాట్లాడాలి. నోరుంది కదాని ఏదేదో మాట్లాడటం మంచిది కాదు." అంటూ మూతి ముప్పయి వంకర్లు తిప్పి సుమతి వైపు అసహ్యంగా చూసింది వైశాలి.

సుమతి చాలా బాధ పడింది. "ఇప్పుడు నేనేమన్నాను వదినా. మా నాన్నను నా వెంట తీసుకెళుతానన్నాను అన్నాను. కూతురుగా అది నా బాధ్యత కాదా. దానికే ఇంత రాద్ధాంతం చేయాలా?.." అంది చాలా నెమ్మదిగా.

ఆ మాటలు భరించలేక పోయింది వైశాలి. "అవును నేనేం మాట్లాడినా అది రాద్ధాంతమే. చూడు బాధ్యతలు మాకూ తెలుసు, ఎవరేం గుర్తు చేయనక్కరలేదు."

భార్య మాటలకు వత్తాసు పలుకుతూ "చూడు సుమతి నాన్నను చూడటానికి వచ్చావ్, చూసి వెళ్ళిపో అనవసరమైన మాటలు వద్దు" అన్నాడు ఆనంద్.

"ఏం నాన్న నా దగ్గర ఉండకూడదా?" ప్రశ్నించింది సుమతి.

ఆ మాటకు వైశాలి ముందుకొచ్చి "ఉండవచ్చు కానీ చూసే వాళ్ళు ఏమనుకుంటారు? కొడుకు, కోడలు పరమ దుర్మార్గులు, పోషించలేక తరిమేస్తే తండ్రి వెళ్ళి కూతురు ఇంట్లో ఉంటున్నాడు. చూశారా ఎంత ఘోరం జరిగిపోయిందో. అని ఊరూవాడా దుమ్మెత్తి పోయరా? అందరి ముందు మమ్మల్ని అవమానపరచాలని నీ ఉద్దేశ్యమా? ఏమిటి చెప్పు. అయినా వచ్చిన ప్రతిసారీ ఏదో ఒక విషయం మీద గొడవ పెడుతూనే ఉన్నావ్. గొడవ పెట్టుకోవటానికే ఇక్కడికి వస్తూ ఉంటావా? గొడవలు మేం పడలేం. ఆ ఓపిక మాకులేదు. దయచేసి ఈ ఇంటికి రావొద్దు. " రెండు చేతులెత్తి దండం పెడుతూ చెప్పింది వైశాలి.

కోపం కట్టలు తెంచుకుంది సుమతికి సాధారణంగా తనకు కోపం రాదు. తన పుట్టింటికి తననే రావద్దంటుందా? దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. "నా ఇంటికి రావద్దని చెప్పటానికి నువ్వెవరు?" నడుంకు కొంగు బిగిస్తూ అడిగింది సుమతి.

"ఈ ఇంటికి నేను కోడల్ని. అలా మాట్లాడే హక్కు నాకుంది" ధీమాగా పలికింది వైశాలి.

"నువ్వు కోడలివి అయితే నేను కూతుర్ని. ఈ ఇల్లు కూడా నాదే. మరిచిపోవద్దు" అంది సవాలుగా సుమతి.

"ఎలా నీదవుతుంది. పెళ్ళయి పోయాక ఇక ఈ ఇంటితో నీకేం సంబంధం లేదు. నీ సంబంధాలన్నీ నీ అత్తగారింట్లోనే. అందుకే ఎక్కువ మాట్లాడొద్దని చెపుతున్నాను. మీరేమిటండి అలా చెక్కముక్కలా నిలబడి పోయారు చెప్పండి" అంటూ మొగుడ్ని మోచేత్తోఓ పొడిచింది వైశాలి.

"చూడు సుమతి గొడవలు వద్దు. నాన్న ఇక్కడ్నుంచి రాడు. రాద్ధాంతాలేవీ చెయ్యొద్దు. దయచేసి ఇక్కడ్నుంచి వెళ్ళిపో" అన్నాడు.

సుమతి తండ్రి వైపు చూసింది. తండ్రి కన్నీళ్ళు కూడా తనను వెళ్ళిపొమ్మని బ్రతిమాలుతున్నాయి. ఏడుస్తూనే ఇంట్లోనుంచి వెళ్ళిపోయింది సుమతి

ఇంకా వైశాలి శాంతించలేదు. "అసలు ఆవిడ ఎందుకొచ్చింది. మీరేమైనా రమ్మని కబురు పెట్టారా?" పావనమూర్తిని నిలదీసింది.

కోడలు కోపాన్ని చూసి బెదిరిపోయాడు పావనమూర్తి. "నేనెవర్ని పిలవలేదమ్మా" అన్నాడు బేలగా చూస్తూ.

కళ్ళు గిరగిరా త్రిప్పుతూ "ఆవిడ ఎందుకొచ్చిందో నాకు బాగా తెలుసు." అంది వైశాలి. ఏమిటి అన్నట్లు భార్య వైపు చూశాడు ఆనంద్. చెప్పటం మొదలు పెట్టింది వైశాలి.

"ఏదో ఒకలాగా ఈయన్ని తీసుకుపోయి, ఇంట్లో తన దగ్గర ఉంచుకుంటే జబ్బుల్తో ఉన్నాడు కదా, ఇంకెంతకాలం బ్రతుకుతాడూ ఈలోగా ఈయన పేరుమీదున్న ఆస్తిని తన పేరు మీద రాయించుకోవచ్చని ఆవిడ పన్నిన పన్నాగం.. ఆవులా ఉంటూ

పులిలా మేసే రకం ఆవిడ. ఎన్ని ఎత్తులు వేసుకుని ఈ ఇంటికి వచ్చిందో. నా దగ్గరా ఈ దొంగ నాటకాలు. పైగా దొంగ కన్నీళ్ళు కారుస్తుంది.. ఛీ'' అంటూ పావనమూర్తి వైపు అసహ్యంగా చూసింది.

''ఆపు. మరొక్క మాట నా కూతుర్ని గురించి తక్కువ మాట్లాడితే మర్యాద ఉండదు'' నిలబడలేక వణికి పోతూనే కేకలేశాడు పావనమూర్తి.

''అబ్బో! కూతుర్ని ఒక్కమాట అనగానే ఈయనగారికి ఎంత రోషం పొడుచుకు వచ్చిందో'' గాల్లో చేతులు త్రిప్పుతూ చిటపటలాడింది వైశాలి.

కోపం పట్టలేకపోకయాడు పావనమూర్తి. ''నా కూతురు నీలాగా ఎపుడూ ఆలోచించదు. ఆమె మనసు నీకు రావాలంటే వెయ్యి జన్మలెత్తాలి. అసలు సంగతి మీకు తెలుసా? ఈ ఆస్తుల్లో చిల్లిగవ్వ కూడా తనకక్కర్లేదని వ్రాతపూర్వకంగా ఏనాడో రాసిచ్చింది కావాలంటే చూడండి'' అంటూ అలమార లోపల్నుంచి కాగితాలు తీసి కొడుకు, కోడలు మొహాల మీద విసిరికొట్టాడు పావనమూర్తి.

కాలం కరిగిపోతున్నట్లే, పావనమూర్తి ఆరోగ్యమూ రోజు, రోజుకూ క్షీణించుకు పోతోంది. మనుష్యుల పలకరింపులు లేవు. మమకారాలు అసలే లేవు. ఇంటి జైల్లో ఒంటరి జీవితం గడపలేకపోతున్నాడు. మాటలు లేని మూగ జీవితాన్ని భరించలేక పోయాడు పావనమూర్తి మానసికంగా చాలా కృంగిపోయాడు. ఒకరోజు ఉన్నట్టుండి వరండాలో కూలిపోయాడు. వెంటనే నర్సింగ్ హోంలో చేర్పించారు. విషయం తెలిసి సుమతి కూడా అక్కడికి పరుగెత్తుకొచ్చింది.

బెడ్ మీద తండ్రి నిర్జీవంగా పడివున్నాడు. ఒంటికి సెలైన్ ఎక్కిస్తున్నారు. కన్నీళ్ళ పర్యంతమై పోయింది సుమతి. డాక్టర్లు వస్తున్నారు, చూస్తున్నారు. అన్ని టెస్టులు రొటీనుగా చేస్తూనే ఉన్నారు. అసలు విషయం ఎవరూ చెప్పటంలేదు. ఒక రోజు ఉదయం బి.పి కంట్రోలు కాక పావనమూర్తి కోమాలోకి వెళ్ళిపోయాడు. ఆనంద్‌ని పిలిచి అసలు విషయాన్ని డాక్టరు చెప్పేశాడు.

''అంటే ఆయనకు మళ్ళీ తెలివిరాదా డాక్టర్?'' అడిగాడు ఆనంద్.

''ఆయన మళ్ళీ మాములు మనిషి కావటం చాలా కష్టం. నా అబ్జర్వేషన్ ప్రకారం చనిపోయేదాకా ఇతని పరిస్థితి ఇంతే..'' పెదవి విరిసేశాడు డాక్టర్ మధుసూదనరావు.

''మరి ఈ పరిస్థితి ఇంకా ఎంతకాలం డాక్టర్?'' కంగారుగా అడిగాడు ఆనంద్.

''ఎంతకాలమంటే ఎలా చెప్పటం? ఇలా ఉండటం వారం రోజులు కావొచ్చు, నెలరోజులు కావొచ్చు, రెండు నెలలు కావొచ్చు లేక సంవత్సరం పట్టవచ్చు. ఒక్కటి మాత్రం నిజం ఆయన తిరిగి కోలుకోవటం అసాధ్యం. ఇప్పుడు ఇంతకంటే ఎక్కువ ఏం చెప్పలేం'' అంటూ డాక్టర్ వెళ్ళిపోయాడు.

కోడలు వైశాలికి కంపరం మొదలైంది. ''ఇపుడు ఈ దరిద్రాన్ని ఇంట్లో ఎలా పెట్టుకుంటామండి?'' ప్రక్కకు పిలిచి భర్త చెవిలో రుస, రుసలాడింది.

''ఆ సంగతి నాకు తెలియదా? ఇద్దరం ఉద్యోగస్తులం. పైగా రోజూ ఇద్దరం బిజీ, బిజీగా ఉంటాం. అందుకే నేను ఒక నిర్ణయానికి వచ్చాను. ఇలాంటి వాళ్ళను చూసుకోవటానికి మన ఊర్లో ఒక సంస్థ ఉంది. నెలకింత డబ్బు వాళ్ళకు పడేస్తే అన్నీ వాళ్ళే చూసుకుంటారు. మనిషి పోయాక ఆ కబురు మనకు చెపుతారు. ఆ తరువాత జరిగేవన్నీ మామూలుగా జరిగిపోతాయి. దీన్ని గురించి నువేం వర్రీ కాకు. అవన్నీ నేను చూసుకుంటాను'' భార్యకు అభయమిచ్చాడు ఆనంద్.

''ఆపు ఏమిటి నువ్వు మాట్లాడుతున్నావ్? నాన్నని దిక్కులేని వాడిలాగా ఎక్కడో వదిలేస్తారా! మనల్ని నాన్న ఎంత గొప్పగా చూసుకున్నాడా తన జీవితాన్ని మొత్తం మనకోసం త్యాగం చేశారు. అలాంటి తండ్రి వెయ్యి జన్మలెత్తినా ఎవరికైనా దొరుకుతార్రా! అసలు

నీకు మనసు ఎలా వచ్చిందిరా ఆయన్ని ఎక్కడో వదిలివేయటానికి. ఆయన దేవుడ్రా. దేవుడు గుడిలో ఉండాలే తప్ప దయ్యాల కొంపల్లో కాదు. నీ అభిప్రాయం చాలా తప్పు. నువ్వు మనిషిలా ఆలోచించటం లేదు. నీ ఆలోచనను మార్చుకో" హెచ్చరించింది సుమతి.

కోపం పట్టలేకపోయాడు ఆనంద్. "ఏమిటి మార్చుకునేది ప్రతిదానికీ అడ్డుపడుతుంటావ్. చూడు ఆయన నా ఇంటిమనిషి. అన్ని నా నిర్ణయాలే ఇక్కడ అమలు జరుగుతాయి. ఇక నువ్వేమీ మాట్లాడకు. మాట్లాడినా నేనేం వినదలచుకోలేదు."

"నువ్వు వింటావో చస్తావో నాకనవసరం. బెడ్ మీద ఉన్న ఆయన నాకు ఒక బిడ్డలాగా కనిపిస్తున్నారు. ఆ బిడ్డ మాత్రం నాకు కావాలి. ఆ బిడ్డను నేను చూసుకుంటాను. ఆ బిడ్డ నా దగ్గర ఉంటే చాలు. ఆ బిడ్డను నాకివ్వండి. ఆ బిడ్డ నాకు కావాలి" తండ్రిని చూపిస్తూ బావురుమంది సుమతి.

"నీకు తెలియదు. ఆ తరువాత చాలా ప్రాబ్లమ్స్ వస్తాయి. నేను చెప్పేది విను" కసురుకున్నాడు ఆనంద్.

"ఎన్ని వచ్చినా సరే ఆ బిడ్డ నాకు కావాలి" అంటూ తండ్రిని తన రెండు చేతుల్తో చుట్టేసుకుంది.

"ఏమిటండీ ఈ గోల? ఏమిటి ఆవిడతో మాటలు" భరించలేకపోతోంది వైశాలి.

"గోలా లేదు, గీలా లేదు. అంతా నేను అనుకున్నట్లే జరిగిపోతుంది. మరో ఐదు నిమిషాల్లో వ్యాను వస్తుంది. దాంతో మేటర్ మొత్తం ఫినిష్" అన్నాడు భార్య చెయ్యి పట్టుకుంటూ ఆనంద్.

కంగారుపడిపోయింది సుమతి. "లేదు. అలా జరగటానికి వీల్లేదు. ఆ బిడ్డ నాకు కావాలి. ఒరేయ్ ఆ బిడ్డ నాకు కావాల్రా... ఆ బిడ్డ నాకు కావాలి" మోకాళ్ళ మీద కూర్చుని రెండు చేతుల్తో దండం పెడుతూ. దిక్కులు దద్దరిల్లేలా ఆరుస్తోంది సుమతి.

ఆ సంఘటన జరిగి అపుడే సంవత్సరం పైగా దాటిపోయింది. ఇంతకాలం తనకు సుమతి అసలు గుర్తుకు రాలేదు. చివరికి ఆమే గుర్తుపెట్టుకుని కార్డు పంపించింది. ఎక్కడో రక్తపాశం చిన్నగా మేల్కొంది ఆనంద్‌కు. "సుమతి కొడుకు చాల అందంగా ఉన్నాడు. ఎందుకో వాడ్ని చూడాలనిపిస్తోంది. ఎవరేమనుకున్నా సరే వెళ్తాను. ఈ ఫంక్షన్‌కి తప్పకుండా వెళ్తాను." అనుకున్నాడు. తన ధైర్యానికి తానే ఆశ్చర్యపోయాడు ఆనంద్.

అది సరిగమ ఇంటర్నేషనల్ హోటల్. పార్వెల్ హాల్లో ఫంక్షన్ జరుగుతోంది. గుమ్మం దగ్గరే నవ్వుతున్న బాబు ఫోటో పెద్ద కటౌట్ అందర్నీ ఆహ్వానిస్తూ ఉంది. చాలాసేపు బాబు ఫోటోను చూస్తూ అక్కడే నిలబడిపోయాడు ఆనంద్. తరువాత అందరితోపాటు తాను లోపలికి వెళ్ళాడు. "చాలా ఖరీదుగానే పార్టీ ఏర్పాటు చేశారు. లోపల హాలంతా చాలా రిచ్‌గా డెకరేట్ చేసి ఉంది" ఆనంద్ వెళ్ళి వెనక వరుసలో కూర్చున్నాడు.

ఇంతలో హోటల్ బాయ్ వచ్చి "మిమ్మల్ని పిలుస్తున్నారండి ఆ గదిలోకి వెళ్ళండి" అంటూ చెప్పి వెళ్ళిపోయాడూ.

"ఎవరు పిలుస్తున్నారా" అనుకుంటూ మెల్లగా ఆ గదిలోకి వెళ్ళిపోయాడు ఆనంద్.

"వచ్చావా?" అంటూ ఎవరో పిలిచేసరికి, వెనక్కి తిరిగి చూశాడు. ఎదురుగా ఎవరో కాదు తన చెల్లెలు సుమతి. "నువ్వు వస్తావనుకోలేదే" అంది కొంచెం వ్యంగ్యంగా.

ముందే కోపిష్టి. కోపం ఆపుకోలేకపోయాడు ఆనంద్. "అనుకోవు. నువ్వేమీ అనుకోవు. బాబు పుడితే ఆ సంగతి నాకు చెప్పావా! కనీసం వాడి బారసాలకైనా కబురు పెట్టావా? ఇపుడేమో ప్రేమ ఒలికిపోతూ ఈ బర్త్‌డేకి పిలిచావ్."

"చెల్లెలిని కాబట్టి ఆ మాత్రం అభిమానం నాకుంది కాబట్టి పిలిచాను సంతోషించు" అంది సుమతి.

"ఆహా ఎంత గొప్ప అభిమానమో! నాన్నపోతే నాకెందుకు కబురు పెట్టలేదు?" ప్రశ్నించాడు ఆనంద్ "నేను ఆయన కొడుకును. తలకొరివి నేనే కదా పెట్టాలి"

"ఏం తలకొరివి కూతురు పెట్టకూడదా?"

"తలకొరివి కొడుకులే పెట్టాలి"

"ఎవరు చెప్పారామాట? తలకొరివి పెట్టటానికి కొడుకు పోస్టు అక్కరలేదు. కావలసింది ప్రేమ, అనురాగం, ఆప్యాయత. ఇవి వెతికినా కనిపించని నీకు తలకొరివి పెట్టే అర్హత ఏనాడో కోల్పోయావ్. అయినా ఇవన్నీ ఇపుడు అనవసరం నా బిడ్డ ఫంక్షన్‌కి వచ్చావు అందరిలాగే ఫంక్షన్ చూసి, డిన్నర్ చేసి వెళ్ళు" అంటూ భర్త వైపు తిరిగి "ఏమండి టైమవుతోంది కేక్ కట్ చేయాలి బాబును తీసుకురండి. అదిగో వాళ్ళ మేనమామ కూడా వచ్చాడు వాడు ఎంత అదృష్టవంతుడో వెళ్ళి బాబును తీసుకురండి" అంది.

"బాబుని ఎత్తుకుని రమ్మంటావా? లేక నడిపించుకుని రమ్మంటావా?" అడిగాడు సుమతి భర్త.

"బాబు అడుగులేసి నడుస్తున్నాడు కదా.. నడిపించుకునే రండి" అంది సుమతి.

రెండు నిమిషాల్లో సుమతి భర్త బాబును నడిపించుకుంటూ వచ్చాడు.

"చూడు నా బాబును చూడు. అందంగా ఉన్నాడు కదూ!?" ఆనంద్‌ని గుచ్చి, గుచ్చి అడిగింది సుమతి.

ఆనంద్ మాట్లాడలేకపోయాడు. ఆ దృశ్యాన్ని చూసి మాటలు లేని శిలలాగా చూస్తూ ఉండిపోయాడు.

"నా బిడ్డను చూసిన తరువాత నీకు మాటలు రావని నాకు తెలుసు. పుట్టిన బిడ్డ ఏడాదికే ఆరడుగుల మనిషి ఎలా అయిపోయాడా అని ఆశ్చర్యపోతున్నావా? 'ఆ బిడ్డ నాకు కావాలి. ఒరేయ్ ఆ బిడ్డ నాకు కావాల్రా అంటూ' ఎవరికోసమయితే ఆ రోజు దిక్కులు దద్దరిల్లేలా అరిచానో ఆ బిడ్డే ఈ బిడ్డ. ఈ బిడ్డ పుట్టిన రోజే ఈ రోజు జరుగుతోంది" అంటూ ఎదురుగా తన తండ్రిని చూపించింది.

సుమతి భర్త ముందుకు వచ్చి "ఈయన్ని మీరు వదిలేసి వెళ్ళిపోయాక అదే ఓ గొప్పవరమనుకుని ఆయన్ని మా ఇంటికి తెచ్చుకున్నాం. ఆమె ఒక సంవత్సరం పాటు ఉద్యోగానికి సెలవు పెట్టింది. తన కడుపున పుట్టిన బిడ్డకంటే ఎక్కువగా ఆయన్ని చూసుకుంది. ఒక తల్లిలా సేవలు చేసి, ఆయనకు బిడ్డగా పుట్టినందుకు ఆమె తన రుణం తీర్చుకుంది" అన్నాడు.

"నా సంగతి ప్రక్కన పెట్టు. ఈ విషయంలో నా భర్త దేవుడురా. మనసు నాదయితే సేవలు ఆయన చేశాడు. మల, మూత్రం దేన్నీ కూడా ఆయన అసహ్యించుకోలేదు. ఆ రెండూ చేతులతో ఎత్తి సేవలు చేశాడ్రా. సమస్తం తన బాధ్యతే అనుకున్నాడు. తోడూ, నీడగా నా వెంట నిలిచాడు. నాన్నకు ఆయుష్షు నిలపటానికి నేరుగా నాతోపాటు దేవుడితో యుద్ధం చేశాడ్రా ఆయన. ఏం జరిగిందో విచిత్రం మాకు తెలియదుకానీ అనుకోకుండా సరిగ్గా ఇదే రోజు నాన్న కళ్ళు తెరిచారు. మా ఆనందానికి అంతులేదు. సంతోషంతో ఎగిరి గంతులేశాం. మా శ్రమ ఫలించి మెడికల్ చరిత్రలో ఒక క్రొత్త అధ్యాయాన్ని తిరిగి రాయగలిగాం" అంది కన్నీళ్ళను తుడుచుకుంటూ సుమతి.

"అంతేకాదు. నాన్న పునర్జన్మ పొందిన ఈ రోజును ఆయన పుట్టిన రోజుగా ఫంక్షన్ చేస్తున్నాం. అయితే ఆ బాబు ఫోటో ఎవరిదని కదూ నీ అనుమానం. ఆ ఫోటో నాన్నదే ఆయన చిన్నప్పటి ఫోటో. నా చిన్నతనంలో ఒకరోజు తన చిన్ననాటి ఫోటోను నాకు కానుకగా ఇచ్చారు. దాన్ని ఇన్నాళ్ళూ జాగ్రత్తగా దాచుకుని, ఇపుడు కలర్ ప్రింటు చేయించి ఇలా వాడుకున్నాను" అసలు విషయం చెప్పింది సుమతి.

"సుమతి టైం అవుతోంది నాన్నను తీసుకుని పైకిరా. కేకు కట్ చేద్దాం" అన్నాడు సుమతి భర్త.

"అలాగేనండీ" అంటూ తండ్రిని నడిపించుకుంటూ వేదిక మీదకి వెళ్ళింది సుమతి.

కేక్ కట్ చేయబోతూ ఆగి ఒక్కమాట అందరూ వినండి అన్నాడు పావనమూర్తి. అంతా నిశ్శబ్దం ఏం చెబుతాడోనని అందరూ ఆయన మాటల కోసం ఎదురు చూస్తున్నారు.

"ఏ తల్లయినా పుట్టబోయే బిడ్డకు జన్మనిస్తుంది. కానీ ఈ తల్లి" అంటూ సుమతిని చూపించి "చనిపోతున్న బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఈ తల్లి నేను బాధపడితే ఆ కన్నీళ్ళు ఆమె కళ్ళల్లో రాలాయి. తండ్రి బ్రతకాలన్న ఒక తపనతో రాత్రీ, పగలు విసుగు పడకుండా నాకు సేవలు చేసి, నన్ను బ్రతికించమని రోజూ వెయ్యిదేవుళ్ళకు మొక్కుకునేది. "అవసరమైతే నా ప్రాణాన్ని తీసుకుని మా నాన్నని బ్రతికించండి దేవుడా!" అంటూ పూజలు చేసేది. ఇలాంటి ఈ తల్లి రుణాన్ని వెయ్యి జన్మలెత్తినా నేను తీర్చగలనా? తీర్చుకోలేను. వచ్చే జన్మలోనైనా నేను ఆమె బిడ్డగా పుట్టి రుణం తీర్చుకోవాలని ఉంది" పావనమూర్తి గొంతు బొంగురు పోయింది. ఆయన కళ్ళల్లో తడి జారటం అందరూ గమనిస్తున్నారు. ఆ తడి అందరి కళ్ళల్లోకి జారటం మొదలు పెట్టింది.

ప్రక్కనున్న సుమతి భర్తను చూపిస్తూ "ఇదిగో ఈయన నా అల్లుడు కాదు. ఏకంగా ఈ పునర్జన్మకు తండ్రి ఆయనే. నేను పుట్టకముందే నా కన్నతండ్రి చనిపోయాడట. కానీ నన్ను బిడ్డగా లాలించటానికి మళ్ళీ ఈ రూపంలో నా తండ్రి ఇలా వస్తాడని నేను అనుకోలేదు. నా తండ్రి వచ్చాడు. నన్ను బ్రతికించాడు" అంటూ అల్లుడ్ని కౌగిలించుకుని కళ్ళు తుడుచుకున్నాడు పావనమూర్తి.

అందరూ చాలా ఆసక్తిగా వింటున్నారు ఈమారు పావనమూర్తి కంఠం గంభీరంగా మారింది. "కోమాలోకి వెళ్ళిన ప్రతివాళ్ళూ చచ్చిపోతారనుకోనక్కరలేదు. మనిషిని బ్రతికించడానికి మందుల కంటే ముందు, మనుష్యుల ప్రేమకావాలి ఆ ప్రేమలు లేకే ఆయుష్షు కంటే ముందే జబ్బు పడిన మనుష్యులు చచ్చిపోతున్నారు. మనిషి ఎలా బ్రతికాడో కాదు ముఖ్యం చివరి దశలో అయిన వాళ్ళనుంచి కావలసినంత ప్రేమను పొందుతూ ఎంత ఆనందంగా చనిపోయాడో అది కావాలి. ఆ ఆనందం కేవలం మన ప్రేమ ద్వారా మాత్రమే వస్తుంది. మనుష్యుల్ని ప్రేమించాలి. జబ్బుతో ఉన్నవాళ్ళని మరింతగా ప్రేమించాలి. చావుకు దగ్గరైన వాళ్ళు మనం చూపిస్తున్న ప్రేమను చూసి, ఆ ప్రేమకోసమైనా సరే తిరిగి బ్రతకాలన్న ఆశను వాళ్ళల్లో కలిగించాలి. ఆశతో వాళ్ళ ఆయుష్షు పెరగవచ్చు. అలా జరిగితేనే అదే నిజమైన ప్రేమ అవుతుంది. అపుడే మనం మనుషులుగా ఆ అర్థానికి ధీటుగా నిలబడగలుగుతాం." వచ్చిన అతిధుల మనసుల్లో ఏదో కదలిక మొదలైంది.

కూతురు సుమతిని, అల్లుడ్ని దగ్గరగా తీసుకుంటూ "ఆ ప్రేమను ఈ బిడ్డలు నాకు ఎంత ఇచ్చారో కొలవటానికి ఈ ప్రపంచంలో ఏ సాధనమూ చాలదు. ఆ ప్రేమ వల్లే తిరిగి నాకు పునర్జన్మ లభించింది. వాళ్ళు నా బిడ్డలు కాదు. ఈ జన్మకు వాళ్ళే నా తల్లి, తండ్రులు. అందుకే చెబుతున్నాను. నాకు భగవంతుడు ఇవెన్ని జన్మలు ప్రసాదించినా ప్రతి జన్మకూ ఈ అమ్మా, నాన్నలే నాకు కావాలి. ఈ అమ్మా, నాన్నలే నాకు కావాలి.. ఈ అమ్మా, నాన్నలే నాకు కావాలి" అంటూ గట్టిగా అరిచాడు పావనమూర్తి. అంతే చప్పట్లతో హాలు దద్దరిల్లిపోయింది.

అతిధుల వెనక నిలబడ్డ ఆనంద్ మరో క్షణంలో తండ్రి పాదాల మీద పడిపోయి ఉన్నాడు.

కథా కౌముది

# కప్పదాట్లు

కర్లపాలెం హనుమంతరావు

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ**

కె.డి. వి.వి.వి.కప్ప(కప్పదాటు వీర వేంకట వెంకప్ప) గారు అబ్బల కాలం బట్టీ దిబ్బలగూడెం నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు. పదవులు వారికి తృణప్రాయంతో సమానం. కానీ కొన్ని ప్రాణాలకు ఆ తృణమే జీవనాధారం గదా! రెండు దఫాలుగా వెంకప్పగారికి ఆ తృణం ఫణమైనా అందకుండా పోయింది. వయసా మీద పడిపోయింది. ఇంత బతుకూ బతికి ప్రైవేట్ ఖాతాలో చావడం ఎవరికి మాత్రం హితవు? సిగ్గు బిడియాలకు తిలోదకాలు యీయడమే సద్గతి ప్రాప్తికి ఉత్తమ మార్గంగా తోచింది వెంకప్ప గారికి.

అధికార పార్టీ పెద్దలతో లోపాయికారీ మంత్రాంగం నడుస్తోంది. మంత్ర పదవికీ ఒక్కటే మెలిక. ఎన్నిక చేసిన పార్టీ ప్రతిపక్షంలో ఉంది. ఆ పార్టీ గుర్తు చూసి గుద్ది గెలిపించిన ఓటర్ల నుంచి ఏకగ్రీవ తీర్మానం తేవాలి. కార్యకర్తలంటే సరే.. స్వామి కార్యాన్ని తమ కార్యంగా నిర్వహించే నిస్వార్థ కర్తలు. నియోజక వర్గ ప్రజలు అలా కాదే! ఇదేమని నిలదీస్తే బదులేం చెప్పాలి?!

వెంకప్పగారీ మధనలో ఉండగానే గది తలుపులు ధడాల్మని తెరుచుకున్నాయి.

ఎదురుగా అల్లుడు గారు. ఆయన మెడా నిండా పూల దండలు. పక్కన అమ్మాయి. ఆ పిల్ల మొహం నిండా పూలదండలే. ఆనందంతో తబ్బుబ్బయిపోయారు మామగారు. పూలలో పెట్టుకుని చూసుకోడం అంటే ఇదే కామోసు! ఆషాఢం ఇంకా రానే లేదు. అమ్మాయి మీద ఎంత శ్రద్ధో! పుట్టింట్లో దిగబెట్టడానికి స్వయంగా దిగబడి పోయారు!

"సారీ.. మాజీ మామాజీ! మీ పిల్లను దిగబెట్టేందుకు వచ్చిన మాట నిజమే. కానీ అందుక్కారణం ఆషాఢం కాదు. ఈ శ్రావణిని పెళ్ళాడ్డం." పక్కనున్న పిల్లను చూపించి అన్నాడా మాజీ అల్లుడు గారు.

అప్పటి దాకా ఎక్కడ నక్కి ఉందో గాని పిచ్చి తల్లి.. భోరుమంటూ తండ్రి గుండెల మీదకు వచ్చి పడింది కూతురు. కన్నబిడ్డను చూసి గడ్డకట్టుకు పోయారు వెంకప్పగారు. ఆనక పిచ్చి కోపంతో రెచ్చి పోయారు. "అన్యాయం! కట్నం కింద పది కోట్లు, కమ్మంగా పండే తోటలు, దొడ్లు దొబ్బి ఇప్పుడిలా నమ్మక ద్రోహం చేస్తావా అబ్బీ!" అదీ మామగారి ఆక్రోశం.

పకాల్మని నవ్వి అన్నాడూ ఆ అల్లుడబ్బి "అన్ని కోట్లు అప్పనంగా కుమ్మరించారంటే మీ అమ్మాయిగారెంత కాకి బంగారమో అర్థమవుతూనే ఉంది. ఆర్నెల్లు ఈ కాకితో కాపురం వెలగ బెట్టాను. అందుకు మీరే ఈ గోరింక కింకో పది కోట్లు బాకీ"

"'నాతి చరామి' అంటూ ఈ కాకి చెయ్యి పట్టుకునే గదా సామీ వాగ్దానం చేసిందా నాడు పెళ్ళిలో పదిమంది పెద్దల ముందూ! ఇప్పుడు నమ్మక ద్రోహం చేయడం నేరం" వెంకప్పగారి లా పాయింటు.

" హీఁ..హీఁ..హీఁ ! ధర్మపన్నాలా! మరి దిబ్బలగూడెం జనాలకు ఎన్నికలప్పుడు తమరు చేసిన హామీలో? అధికార పార్టీలోకి జంపు.. ఏ ప్రజా సేవకో సెలవిస్తారా మాజీ మామాజీ!"

వెంకప్పగారేం జవాబేం చెప్పాలా అని తడువుకుంటూండగానే...

"కెవ్వు" మని కేక. ధడాల్మనేదో బరువుగా పడ్డట్లు చప్పుడు. అటు చూస్తే ఏడుపులు.. పెడబొబ్బలు. పడింది గారాబాల కూతురు. ఏడుపులు గాభరా పడే భార్యామణివి. పెడబొబ్బలు అంబులెన్సు కోసం!

క్షణాల్లో సీను మారి పోయింది.

ఒన్ నాట్ యైట్ వాహనంలో అమ్మాయి యములాడితో ఫైటు. "డ్రైవర్.. తొందరగా పోనీయ్.. అపోలోకి!' వెంకప్పగారి హుకూం.

నింపాదిగా అడిగాడు అంబులెన్సు చోదకుడు " అపోలో పది మైళ్ళు. అప్పలాచారి ఆసుపత్రి పదడుగులు. ఎటు పోదాం సార్ మరి మన మిప్పుడు?"

"అమ్మాయి ప్రాణం ముఖ్యం ముందు. అలోపతైతే సరి.. అప్పలాచారైనా నో వర్రీ"

అంబులెన్సు డాక్టర్ అప్పలాచారి గారి డిస్పెన్సరీ ముందాగింది. క్షణాల్లో స్పందన.. బిల్లు చెల్లింపుల సిబ్బంది నుంచి. అడ్వాన్సుగా ఐదు లక్షలు వదిలింది. ఆ తరువాతే నింపాదిగా చికిత్స మొదలైంది.

ఏవేవో మూలికలు, మండలు, కషాయాలు, నూనెలు, కల్వాల్లో చూర్ణాలు నూరుతున్న చప్పుళ్ళు! వైద్యనారాయణులవారి దర్శన భాగ్యం ఆఖరి సన్నివేశంలో గాని కాలేదు. నుదుటి నామాలకు పట్టిన చెమటలు తుడుచుకుంటూ విషాద వదనంతో గంభీరంగా ప్రకటించారా వైద్యశిఖామణులు "మానవ ప్రయత్నం మనం చేసాం! దైవమే అనుకూలించింది కాదు. ఎన్ని చూర్ణాలు.. గుళికలు.. దట్టించినా ప్రాణయోగం లేక పోయింది జీవికి. తులసీ తీర్థం గొంతులో పోసుకోండి.. పోండి!"

"చూర్ణాలు.. గుళికలా! ఇదేం మాయదారి అలోపతి వైద్యం డాక్టర్?" గంపెడంత దుఃఖంలోనూ గయ్యిమన్నారు వెంకప్పగారు .

"హలో.. అలోపతి అని ఎవరన్నార్ సార్! మాది ఆయుర్వేదం" నింపాదిగా డాక్టర్ అప్పలాచారి సమాధానం.

"మోసం.. దగా! ఆ సంగతి ముందే చెప్పాలి గదా?"

"ముందే చెబితే అపోలోకి పారిపోతారు గదా! ఎన్ని లక్షలు పోస్తే వచ్చిం దిక్కడ ఈ పట్టా! తమరు మాత్రం తక్కువ తిన్నారా! ఎన్నుకున్న పార్టీకి వెన్ను చూపించారా లేదా? మంచి పదవుల కోసం అధికార పార్టీలోకి దూకడం లేదా? నాది మోసమైతే మీది పచ్చి మోసం కాదా!"

నోట మాట రాకుండా నిలబడి పోయారు అట్లాగే వెంకప్పగారు.

సీను మారింది మళ్లీ!

పియ్యే పరుగెత్తుకుంటూ వచ్చాడీ సారి రొప్పుకుంటో.

"సార్ మీకు ఫోన్. అర్జంటుగా కలవమని కబురు"

"అధికార పార్టీ అధిష్ఠానం నుంచేనా?" ఆనందంగా లేచి నిలబడ్డారు వెంకప్పగారు.

"అధికారి నుంచే గానీ.. పార్టీ తాలూకు కాదనుకుంటా ! పంజగుట్ట పోలీస్ స్టేషన్నుంచి. ఎవరో పెద్దాఫీసరు!"

తెల్లబోయి ఫోనందుకున్నాడు వెంకప్ప.

"సార్! ఈ గాడిద కొడుకు మీ కొడుకేనా?" పోలీసాఫీసరు సింహ గర్జన.

"ఏ గాడిదో తెలిస్తేనే గదయ్యా కొడుకో కాదో చెప్పగలిగేదీ!"

వివరాలన్నీ ఇచ్చి " మీ పేరే చెబుతున్నాడు సార్! పోలికల బట్టి నిజమే ననిపిస్తోంది. మీరే ఓ సారి నిర్ధారించాలి. పేకాట క్లబ్ గోడ దూకుతుంటే రెడ్ హ్యాండెడ్ గా పట్టేసుకున్నాం! " పోలీసాఫీసరు దబ్బా.

" గోడలు దూకే వాడైతే మా ఘనుడేనయ్యా కచ్చితంగా! ఐనా క్లబ్బు గోడతో పనేమిటా పింజారీ వెధవకి? ఒకసారీ ఫోన్ వాడి చేతికి ఇవ్వండి!"

లైన్లో కొచ్చిన పుత్రరత్నం దర్జా వెలగ బెట్టి చెప్పిన వివరాల్ని బట్టి గౌ॥ వివివి కప్పగారు గత వారం బట్టే ఆర్థికంగా కుప్ప కూలినట్లు! అబ్బ అడ్డంగా కూడబెట్టింది బిడ్డలా నీళ్ళలా బెట్టింగుల్లో పెట్టి తగలేసాడన్న మాట. పరా పరా రాసేసొట్ట ప్రాంసరీ నోట్లు తన వాటా కొచ్చే లెక్కలు తరవాతైనా తీరిగ్గా చూసుకోవచ్చు లెమ్మని. "బాకీపడ్డ పీనుగలు కత్తి గొంతుమీద పెడితే గత్తర పడకేం చేస్తాం చెప్పు డాడీ!" అని ఆ సుపుత్రుడి సన్నాయి నొక్కులు!

"నువ్వు రాసేసావు సరేరా! నోటు రాయించుకున్న ఆ పెద్ద మనుషులకైనా బుద్ధీ జ్ఞాన ముండక్కర్లే! నెత్తిమీదచిల్లి కాణీ పెట్టినా అర్థ కాణీకి కొరగాని సన్నాసి వెధవ్వి నువ్వని తెలుసుండక్కర్లా!"

"పిచ్చి డాడీ! అక్కడే నువ్వు పప్పులో కాలేస్తున్నావు. నోట్లు రాసే నాటికి నేను నీ ఆస్తి మొత్తానికి సంపూర్ణ హక్కుదారుణ్ణి. దాన వినిమయ విక్రయాదులాది సర్వ సంపూర్ణ హక్కుభుక్తులతోసహా నువ్వు నీ యావదాస్తిని నాకు ఇచ్ఛాపుర్వకంగా పూర్తి స్పృహలో ఉండి ధారాదత్తం చేసేసావు. లాయర్లు పక్కాగా తయారు చేసిన దస్తావేజులు డాడీ.. నువ్వు నా కాలేజీ దరఖాస్తు అనుకుని బరబరా సంతకాలు గిలికినవీ!"

"కన్న తండ్రిని నన్నిలా మోసం చేస్తావా! సిగ్గ నిపించలేదేమిట్రా నీకు?"

"ఏరు దాటించిన తెప్పను నువ్వు మాత్రం తగలెయ్యడంలా! దిబ్బల గూడెం జనాలు నిన్నెలా ఛీదరించుకుంటున్నారో తెలుసా! నీ బిడ్డగా పుట్టినందుకు సిగ్గనే అనిపిస్తోంది డాడీ!"

"నిజంగా నువ్వు నా కడుపున పుట్టిన బిడ్డవేన్రా?"

కోపంతో కొయ్యబారి బోవడం వెంకప్పయ్యగారి వంతయి పోయింది.

సీను మారిందింకో సారి.

"సారీ! ఇప్పటికైనా నిజం కక్కకపోతే నా బతుక్కిక నిష్కృతి లేదండీ!" వెక్కి వెక్కి ఏడుస్తోంది పక్కనే పక్కలో సతీ సావిత్రీదేవి.

"ఏవిటే సావిత్రీ.. నీ బతుక్కి నిష్కృతి లేని ఆ నిజం?" బిక్కు బిక్కు మంటూ భార్యామణి వైపు చూసి అడిగాడు వెంకప్పగారు గాభరాగా.

"నా కడుపున పుట్టిన బిడ్డల్లో ఒకరు.. ఒకరు.. మీ రక్తం పంచుకోలేదేమోనని అనుమానంగా ఉందండీ! భగవంతుడా! ఏ ఆడదానికీ రాకూడదయ్యా ఇంత పెద్ద కష్టం" పాత కాలంనాటి అరవ కథానాయికి నయం సతీ సావిత్రమ్మగారి శోకరసాభినయం ముందు.

"ఒకరు నా రక్తం పంచుకుని పుట్టలేదా?! ఈ దౌర్భాగ్యంలో కూడా మళ్లీ సస్పెన్సా.. నా ఖర్మానికి?! ఎవరే సావిత్రీ ఆ ఒక్కరూ?" కత్తి వేటు పడకుండానే నెత్తురు చుక్క లేకుండా పోయింది వెంకప్పగారి ముఖారవిందంలో.

"ఏమోనండీ.. ఎంత గింజుకున్నా గుర్తుకొచ్చి చావడం లేదు! గుర్తొస్తే.. ఇది చెప్పిందాన్ని.. అది మాత్రం చెప్పనా! నా శీలాన్నే శంకించడం న్యాయమా?"

నవ్వాలో ఏడ్వాలో అర్థం కాని పరిస్థితి గౌరవనీయులు వెంకప్పగారిది. "ఇప్పటిదాకా గుట్టుగా పెట్టి ఇప్పుడా ఈ నిప్పుమూటను నా గుప్పేట్లో పెట్టేది! ఈ వయసులో ఎలానే నేనీ షాకును తట్టుకునేదీ!.. పాపిష్టి దానా!"

"పిల్లల్ని చూసి మీరలా కుమిలి పోతోంటే నిమ్మళంగా ఉండలేక పోయానండీ! ఐనా తప్పంతా నా మీదే తోసెయ్యడం న్యాయంగా లేదండీ! పెళ్లి చూపుల కొచ్చినప్పుడు ఉప్మాలో అల్లం పచ్చి మిర్చి ఉందో లేదో చూసుకున్నారు గాని కట్టుకోబోయేదాని కడుపువంక చూడాలన్న కనీస జ్ఞానం కూడా లేక పాయ మీకు! నాదా తప్పు? ఆడపిల్లని. నోరు విడిచి కాబోయే మొగుడితో కడుపు విషయాలెలా మాట్లాట్టం? మా ఇంటా వంటా లేదు అంతలా బరితెగించడం. పిల్ల గుణవతా?.. ధనవతా?.. చదువుల సరస్వతా?.. అంటూ ఆరాలు తీసుకున్నారే గానీ అత్తా మామలు.. గర్భవతో కాదో కనుక్కోలేదు.

లొసుగంతా మీ మీద పెట్టుకుని నన్నిలా తూలనాడ్డం ఏవీ బావో లేదు. మహిళా హక్కుల సంఘానికి మా పెద్దమ్మే చైర్ పర్సన్. ఆ విషయం మర్చిపోవద్దు" సతీ సావిత్రి ఉక్రోషం.

"మహ బాగుందే. మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కడ మంటే ఇదే! తాళి కట్టిన వాడిని ఇలా దగా చేసింది చాలక.."

"ఆగండక్కడ! మీరు చేసే మోసం ముందు నాది చీమ తలకాయంత దోషం. ఎన్నికైన తరువాత అది చేస్తా ఇది చేస్తానని మన దిబ్బల గూడెం జనాలకి తెగ హామీలు గుప్పించి గెలిచారు. మంచి పదవుల కోసం ఇప్పుడు గోడ దూకుతున్నారు. తమరు చేసేది మహా పుణ్య కార్యం.. నేను చేసింది కిరాతకమూనా!"

సతీ సావిత్రీ దేవి గర్జనలకి ఉలిక్కి పడి గబుక్కున లేచి కూర్చున్నారు వెంకప్పగారు. నిద్ర తేలిపోయింది. పోతే పోయింది పాడు నిద్ర. తనిప్పటి దాకా కన్నది వట్టి పీడకలేనని తేలి పోయింది. మనసు తేలిక పడింది.

"తేలిక పడ్డానికి కారణం పీడకల నుంచి బైట పడ్డం కాదప్పా! పీడాకారపు శరీరాన్నుంచి బైట పడ్డం! ఎంత సేపట్లా నిలబడి గుర్రు కొడ్తావ్ కానీ..లే! నరకం కావాలా? స్వర్గం పోతావా? ముందది తెముల్చు" గంభీరమైన ఆ గొంతుక్కు గభాలున ఈ లోకంలోకి ఊడి పడ్డారు వెంకప్పగారు.

సీను మారిందని.. తను ఇప్పుడున్నది వేరే లోకాల కెళ్లే దారుల కూడలి ప్రధాన ద్వారం దగ్గరనీ.. అప్పుడు గానీ బుర్ర కెక్కింది కాదు వెంకప్పగారికి.

ఎదురుగా యమ భటులు.. దేవ దూతలు.. తన బదులు కోసమే ఎదురు చూస్తూ నిలబడి ఉన్నారు.

"ఇదేంటీ! నేనెప్పుడు చచ్చి పోయాను? ఎవరు చంపేసారు నన్నిట్లా అన్యాయంగా?" వెంకప్పగారి ఆక్రోశం.

"ఎవరికి పట్టిందబ్బా నిన్ను చంపడానికి! నీకై నువ్వే కోరి తెచ్చుకున్నావీ చావుని. మొన్నటి ఎన్నికల్లో గెలిచి చట్టసభలోకి అడుగు పెట్టిన మొట్ట మొదటి రోజు నువ్వేం చేసావో గుర్తుందా వెంకప్పా?" ఓ కింకరాకారం ప్రశ్న.

"సభాపతి గారి సమక్షంలో పదవీ స్వీకార ప్రమాణం చేసానూ..అదీ తప్పే?! దానికే ఇంత పెద్ద శిక్షా!"

"అదిగో.. ఆ చావు తెలివితేటలే నీ కొంప ముంచింది. దైవ సాక్షిగా చేసిందయ్యా ఆ ప్రమాణం. అందుకే నీకిప్పుడది ప్రాణాంతకమై కూర్చుంది ప్రజా ప్రతినిధి మానవా!"

'కప్పదాటు వీర వేంకట వెంకప్ప అను నేను దిబ్బలగూడెం నియోజక వర్గ ప్రజల ఆంకాక్షల మేరకు నిస్వార్థంగా కర్తవ్యం నిర్వహిస్తానని, నా ప్రజల యొక్క హక్కులకు భంగం కలగనీయనని, భయ రాగ ద్వేషాలకు అతీతంగా భారత రాజ్యాంగానికి లోబడి పని చేస్తానని దైవ సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను'- ప్రమాణం గుర్తుకొచ్చింది వెంకప్ప గారికి.

"దైవ సాక్షిగా చేసిన ప్రమాణం అది. ఉల్లంఘిస్తే ఇలాగే మూడుతుంది మరి. సొంత లాభం కోసం గోడ దూకాలని నిర్ణయించుకున్న తక్షణమే నువ్వు రాజకీయంగా మృతుల జాబితాలో చేరిపోయావప్పా! మళ్లా ఎన్నికల దాకా అవకాశం రాదు గదా అని ఓడ మల్లయ్యల్ని నువ్వు పిచ్చి పుల్లయ్యల్ని చేసుండచ్చు. కానీ నమ్మక ద్రోహం చేసిన నేరానికి దేవుడైతే అస్సలూరుకోడు.. తెలుసా!"

"కహానీలొద్దు! మీ లెక్కనైతే మా లోకం చట్ట సభల్లో ఎక్కడా ఒక్క పురుగు మిగల్దు"

"చర్చల కిదేమీ మీ టీ వీ చానెళ్ల బఠానీల కార్యక్రమం కాదు గానీ.. స్వర్గమో.. నరకమో తొందరగా తెముల్చు. అవతల నీ లాంటి పాపులు చాలా మందుండి చచ్చారు క్యూలో" విసుక్కున్నాడో దైవ దూత.

పక పక నవ్వి అన్నారు వెంకప్పగారు " చూస్తూ చూస్తూ ఏ పిచ్చి కుంకన్నా నరకం కోరుకుంటాడుట్రా కింకరుల్లారా? రంభా ఊర్వశి తిలోత్తమ లుండే ఆ స్వర్గసీమే కావాలి నాక్కూడాను. రాజకీయాల్లో పడి ఎంజాయ్మెంటన్న మాటే మర్చిపోయాను ఈ మధ్య చాలా కాలం బట్టీ"

వెంకప్ప గారికోసం స్వర్గ ద్వారాలు బార్లా తెరుచుకున్నాయి.

దర్జాగా ఆయనగారు లోపలికి అడుగు పెడుతుండగా ...

సీను మారిపోయింది మళ్లా! అయోమయంగా ఉంది వెంకప్పగారికి ఇక్కడ పరిస్థితంతా.

ధ్వని కాలుష్యం. వాయు కాలుష్యం. రాష్ట్ర రాజదాని తాతమ్మ లాగుందీ నగరం. బొగ్గు రైళ్ల మాదిరి బళ్ళు కాలిదారి మీద నుంచి దౌడు తీస్తున్నాయి. పాద చారులు బళ్ళ దారి నడి మధ్యలో పడి వాటితో పరుగు పందేలు పెడుతున్నారు.

వీధుల్లో దుర్గంధం. సైడు కాలువల్లో పొంగి పొర్లే బురద నీళ్ళు. చూస్తేనే కడుపులో దేవుతున్నట్లుందీ దేవ నగరం.

"బురద నీళ్లేంటి? బిగ్గరగా అనకు.. పెద్ద గొడవవయి పోద్ది. స్వర్గ వాసులు నిత్యం తాగే మంచి తీర్థం బాబూ ఇది. బురదంటే అలా గుంటుంది " పరిగెత్తి పోయే ఓ బురదాకారాన్ని చూపించాడు దైవ దూత.

" స్వర్గంలో అసలు బురదుండడమే అబ్బురం అనుకుంటే.. ఆ కీచడ్ తో వీధుల వెంట పడి ఇలా క్రీడా వినోదాలా! "

"మరీ కప్పలా అలా తెరవకు బాబూ నోరు.. నోట్లో ఈగలు దూరగలవు. ఆ పరిగెత్తేది కీచడ్ కాదప్పా! మీ లోకం తాలూకు కీచకుడు. ఆడమనిషి కనబడితే చాలు వావి వరసలు కూడా చూడకుండా వెంట పడ్తార్టగా నీచులు! అప్పట్లో వాళ్లు కార్చిన ఆ చొంగంతా డ్రమ్ముల్లో పట్టి ఉంచుతారు ఇక్కడ. ఆ వెంట బడి చల్లేది స్త్రీ దూతలు. రోజూ ఓ బక్కెట చొప్పున వాడిమీదిలా చల్లుతుంటారు. ఎవడి కోటా దమ్ములు ఖాళీ ఐతే వాడికీ వసంతాలాట నుంచీ విముక్తి"

వణికి పోయారు వెంకప్పగారు "ఇదేం స్వర్గంరా బాబూ! మరి రంభా..ఊర్వశీ.. మేనకా..తిలోత్తమా..?!"

"నీ చాదస్తం కూలా! ఎప్పటి వాళ్ళయ్యా వాళ్ళంతా! మీ ముత్తాతల ముత్తాతల ముత్తాతలతో తైతక్కలాడిన తాతమ్మల్తోనా ముచ్చట్లు? మీలాంటోళ్లందరూ చేర బట్టే ఆ అమ్మళ్లలా పాపం నరకానికి పారి పోయింది! మా తాతలెంత అదృష్టవంతులో కదా!" దైవదూత నిట్టూర్పులు.

"గాంధీ తాత, బోసు బాబు, భగత్‌సింగు, పటేల్ సాబ్, పూలే జీ, గురు ఠాగూరు, బాబా అంబేద్కరు, థెరిసా తల్లి, సరోజినీదేవి నాయుడమ్మ, కామ్రేడ్ సుందరయ్యల్లాంటి మహాత్మలందరికీ సేవలందించే భాగ్యం అబ్బింది వాళ్ళకి. మాకే ఈ స్వర్గంలో మీలాంటోళ్ళతో దిక్కుమాలిన చెర!" కసి పట్ట లేక వెంకప్పగారి పెడ రెక్కలు మరింత గట్టిగా విరిచి ముందుకు తోసాడా దైవదూత.

వెంకప్పగారి వెర్రానందమంతా ఒక్క పుటలోనే పూర్తిగా ఆవిరై పోయింది.

ఈ మధ్యే చచ్చిన పాప్యులర్ పాపులంతా స్వర్గలోకంలోనే దర్శనమిస్తున్నారు. బాంబులతో విధ్వంసం సృష్టించిన అల్లరి మూకలు, ఆస్తుల కోసం కన్నవాళ్లనే కడతేర్చిన నీచులు, ఫ్యాక్షను గొడవల్లో పడి ప్రాణాలను మంచినీళ్ళ ప్రాయంగా తీసిన కసాయిలు, ఆడపిల్లల మీద అఘాయిత్యం చేసి ఆనందించే నికృష్టులు, ఆడబిడ్డలుంటే పరువు తక్కువని, బరువు బాధ్యత లెక్కువని భ్రూణహత్యలు చేసే భ్రష్టులు, ఆలు బిడ్డలుండగానే మరో ఆడదానితో చాటు మాటు సంసారం వెలగబెట్టే సరసులు, వేలు కళ్ల చూడందే ఫైలు మీద వేలైనా కదపని కర్మచారులు, మందులో సైతం కల్తీ కలపందే అమ్మబుద్ధి కాని నీచ బేహారులు, డబ్బుకోసం లేని జబ్బులకు దొంగవైద్యం చేసే వైద్యులు, కాకి లెక్కల్తో మంది సొమ్మును నొక్కేసే రాకాసులు, ఇసుక నుంచి బొగ్గు దాకా సృష్టిలోని సమస్తం వ్యాపార సరుకేనని మనసారా నమ్మే అక్రమార్కులు, పిల్లకాయల పరీక్ష పత్రాలనుంచి, పెద్దవాళ్ల పించన్ల దాకా చేతివాటం చూపకుండా నాటకం నడపించబుద్ధికాని బదుద్ధాయిలు, శరీర అవయవాలు, ఖరీదైన భూములు, అత్యవసర పత్రాలు, సర్కారువారి పనులు, కంట్రాక్టులు, ఉద్యోగాలు, పదవులు, కళాశాల సీట్లు, విదేశీ ఉపాధులు, ఆస్తి తగాదాల వేటి మధ్యలోనైనా మధ్యవర్తుల మిషతో దూరి ఏకమొత్తంగా సింహభాగం భోంచేసే దళారులు.. అంతా మళ్లీ పోగైతే ఏర్పడ్డ భూలోకం అడ్డాకు నకలుగా ఉందీ స్వర్గంలో కంగాళీ.

నీరజాక్షులు లేని ఈ నీరస లోకంలో మొదలే బోరు. పైపెచ్చు రోజుకో రకం శిక్షను కన్నార్పకుండా చూడ్డం అన్నింటికన్నా పెద్ద శిక్ష.

తన వంతు ఎప్పుడొస్తుందో తెలీదు. ఎలాంటి శిక్షలో చెప్పరు. ఎన్నాళ్లీ కుళ్లులోనో తేలదు. ఎవరొచ్చి ఎప్పుడు ఏ ఫిర్యాదు చేస్తారో.. ఏ అభియోగానికే విచారణ ఎప్పటి దాకానో.. నిర్ధారణైన నేరాలకు పడే శిక్షలు ఏ సెక్షన్లవో.. తెమల్చరు!

ఎంత స్వర్గమైనా ఇది నరకాని కన్నా హీనమని అనుభవ పూర్వకంగా అర్థమైంది వెంకప్పగారికి.

దేవుడు ఎలాగూ దర్శనమీయడు ఇక్కడ. ఏ కష్టం చెప్పుకోవాలన్నా ఆయనగారి దూతలే గతి. వాళ్లకైనా కేవలం విని 'ఊ'కొట్టడం వరకే డ్యూటీ. పైవాడి స్పందన ఏ విధంగా ఉండబోతుందో ఆ పైవాడి కొక్కడికే తెలుసు.

"స్వర్గం ఇంత దరిద్రంగా ఉంటుందని ముందే ఎందుకు చెప్ప లేదయ్యా? మీరిక్కడ చేస్తున్నది మాత్రం పచ్చి మోసం కాదా?" అని అక్కడికీ ఓ రోజు ఉండబట్ట లేక ఎదురు తిరగనే తిరిగారు వెంకప్ప గారు ఇక తప్పక.

అప్పుడు పలికింది దైవ వాణి "ఇప్పటికి తెలిసొచ్చిందా కష్టమంటే ఏంటో నీకు వెంకప్ప మానవా! నీ నియోజక వర్గం ప్రజలు ప్రతి క్షణం పడే క్షోభ ఇంతకు పదింతలు. కొత్త బంగారు లోకం పునర్నిర్మిస్తానని వాగ్దానాలు కుమ్మి గట్టెక్కావు గుర్తుందా ఎన్నికల్లో? గెలిచిన మరుక్షణం నుంచే జనం సంగతే మరిచావు. కార్యకర్తల మంచి చెడ్డలు చూడ వలసిందే. కానీ అంతకన్నా ముందు నీ సేవా భాగ్యం దక్కవలసింది నిన్నీ అందలం ఎక్కించిన దరిద్ర నారాయణులకే గదా! స్వర్గమని ఉహించిన లోకం నరకం కన్నా హీనంగా హింస పెడుతుంటే ఆ సలుపు ఎలా ఉంటుందో స్వానుభవంలో తెలుసుకుంటావనే నిన్నిక్కడకు రప్పించింది. నీవు వద్దనుకున్న నరకం ఇప్పుడెలా ఉందో ఓ సారి చూస్తావా?"

"అక్కర్లేదు స్వామీ! బాపుజీనుంచి.. బాబా అంబేద్కరు దాకా అక్కడే ఉన్నారంటున్నారుగా అందరూ! అహింసను, అసమానతనీ, అన్యాయాన్నీ అణువంతైనా సహించని పెద్దలంతా ఉన్నది నరకమెలా అవుతుందిలే?!"

"మరి అదే పెద్దల బాటలో నడుస్తున్నామని పొద్దస్తమానం సుద్దులు చెప్పి గద్దెలెక్కుతున్న పెద్ద మనుషులు కదా మీరంతా? కానీ వాస్తవంలో చేస్తున్నదేమిటి?"

తలొంచుకున్నారు కప్పదాటు వీర వేంకట వెంకప్పగారు.

"ఇదంతా పశ్చాత్తాపమేనని నమ్మవచ్చునా? ప్రాయశ్చిత్తం చేసుకునే ఉద్దేశముంటే చెప్పు. మరో అవకాశమివ్వడానికి నేను సిద్దం. మీ లోకానికే పోయి మళ్ళా ప్రజా సేవ చేసుకుందువు గాని. నీ నియోజక వర్గ ప్రజా బాహుళ్యం నిజంగా నిన్ను తమ ప్రతినిధిగా చట్టసభలో చూడ్డం భాగ్యంగా భావించాలి. ఆ రోజునే నీ పాపాలన్నింటికీ విముక్తి. అప్పుడు నీవసలు ఈ స్వర్గం సంగతే తలుచు కోవు. 'జన్మభూమే స్వర్గానికన్నా గరీయసి' అన్న మాట విన్నావుగా!"

రెండు చేతులు జోడించి తలాడించేసారు కెడివివివి కప్పగారు.

" ఎలాగూ వచ్చావు. ఓ సారి నరకం కూడా చూసి పో! మీ ప్రజా నేతలంతా ఆ భూమిని స్వర్గధామం చేయడానికి అనుక్షణం ఎలా తపిస్తున్నారో తెలిసొస్తుంది."

గభాలున మెలుకవ వచ్చింది వెంకప్ప గారికి. సీను మారింది మళ్లీ! గిచ్చుకుని చూసుకుంటే తెలిసొచ్చింది ఇదే అసలైన వాస్తవ జీవితమని.

పక్కనున్న సెల్ ఫోన్ అదే పనిగా మోగుతున్నది. నెంబరు చూస్తే అధికార పార్టీ మధ్యవర్తిది. అప్పటి దాకా తాను తహ తహ పడ్డది.

చివరి సీనులో భగవంతుడొచ్చి చేసిన బోధంతా మళ్లీ గుర్తుకొచ్చింది! సెల్ ఫోన్ అందుకున్నారు కెడివివివి కప్పగారు.

'గోవిందా.. గోవిందా అనవయ్యా!' అని సెల్ ఫోను అదే పనిగా భజన చేస్తున్నది. పీక నొక్కి ఆ సెల్ ఫోన్నో పక్కకు గిరాటేశారు కప్పదాటు వీర వెంకట వెంకప్ప గారు!

ఆయన మనసంతా ప్రశాంతంగా ఉందిప్పుడు

★★★★

కథా కౌముది

# ఋణం తీరిపోయింది! తిరుమలశ్రీ

'మౌనబాబా' విచ్చేసాడన్న వార్త ఆ ప్రాంతమంతా చైతన్యం కలిగించింది. బాబాకి దేశవ్యాప్తంగా గొప్ప పేరుంది. ఆ ప్రాంతాల జనం తమ వ్యాపకాలకు, వ్యవహారాలకు విశ్రాంతి నిచ్చేసి బాబా దర్శనానికి ఎగబడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం దగ్గర ఉన్న ఏనుగువానిలంకలో గోదావరి ఒడ్డున మజిలీ చేసాడు బాబా.

కాషాయ వస్త్రాలు ధరించే మౌనబాబా సన్నగా, పొడవుగా ఉంటాడు. గడ్డం, మీసాలు అతని ముఖకవళికలను కప్పివేస్తూంటాయి. అనిర్వచనీయమైన తేజస్సు, చూపులలో తీక్ష్ణతాను. అతని వయసును అంచనా వేయడం కష్టం. కాని, బాబా వయసు వందేళ్ళపైనేనని చెప్పుకుంటారంతా. కాయసిద్ధి, తపోదీక్షల ఫలంగా వయసు కనిపించదన్నది వారి నమ్మకం. మౌనమే అతని భాష్యం. అతను మూగవాడో, లేక మౌనదీక్ష వహించిన యోగిపుంగవుడో ఎవరికీ తెలియదు. ఎవరేమి అడిగినా చూపులే సమాధానమౌతాయి. వాటికి అతని శిష్యులే తాత్పర్యం చెబుతూంటారు.

గత పదిహేనేళ్ళుగా సరస్వతీనిలయమైన బాసరలో గోదావరీ తీరాన స్థిరాశ్రమం కల్పించుకుని ఉంటూన్న మౌనబాబాకి స్వదేశంలోనేకాక విదేశీ భక్తులూ ఎక్కువే. ఎన్నడూ ఆశ్రమం వదలి ఎరుగని బాబా తొలిసారిగా ఆశ్రమం నుండి కదలడం విశేషం. హఠాత్తుగా శిష్యగణంతో పాదయాత్రకు పూనుకున్నా డతను. మధ్య మధ్య మజిలీలతో సాగిన మౌనబాబా పాదయాత్ర కడకు ఏనుగువానిలంకను చేరుకుంది. గ్రామస్థులు పూర్ణకుంభంతో బాబాకి స్వాగతం పలికారు. కొద్ది రోజులపాటు బాబా అక్కడే గడపబోతున్నట్లు తెలుసుకున్న వారి ఆనందానికి మేర లేకపోయింది. ఊరి చివర గోదావరి ఒడ్డున టెంట్ హౌస్ నిర్మించి బస ఏర్పాటుచేసారు.

నిత్యమూ పరిసర ప్రాంతాలనుండి జనం తండోపతండాలుగా వచ్చి బాబాను దర్శించుకోసాగారు. తమ తమ శక్తి కొద్దీ ధన, కనక, వస్తు రూపాలలో భక్తితో కానుకలు సమర్పించుకోసాగారు. తమ కష్టసుఖాలను వెళ్ళబోసుకుని ఆశీస్సులను పొందసాగారు. మౌనబాబా కేవలం తన దృక్కులతో భక్తుల ఇక్కట్లను బాపి శుభాలు కలుగజేస్తున్నాడంటూ ప్రచారం జరిగింది. దాంతో ఎక్కడెక్కడినుండో వచ్చే దర్శకుల సంఖ్య కూడా నానాటికీ పెరిగిపోయింది. ఫలితంగా ఆశ్రమంలో 'హుండీలు' వెలసాయి.

రోజూకు మూడుసార్లు ఓ గంటసేపు బాబా దర్శనం లభిస్తుంది. మిగతా వేళల్లో బాబా లోపల ధ్యానముద్రలో ఉంటాడు! ఆ సమయంలో భజనలు జరుగుతాయి. రాత్రులు పురాణశ్రవణం జరుగుతుంది.

- 2 -

సుమారు పదిహేనేళ్ళ క్రితపు మాట _

మొగల్తూరు జమీందారుల బంధువైన రుద్రమరాజు ఏనుగువానిలంకలో ఉంటాడు. మిక్కిలి ఆస్థిపరుడు. చుట్టుపక్కల గ్రామాలన్నిటికీ మకుటంలేని మహారాజు. రాజకీయాలను సైతం శాసించగల దిట్ట.

ముప్పై ఐదేళ్ళ రుద్రమరాజు ఆజానుబాహుడు. దృఢమైన శరీరంతో రాజసం ఉట్టిపడుతూంటాడు. ఐశ్వర్యం, అధికారం, రాజకీయ పలుకుబడి తెచ్చిన ఠీవి, దర్పం, గాంభీర్యం, అహంకారం అతని సొత్తులు.

రుద్రమరాజు భార్య శకుంతల అతనికంటె ఐదేళ్ళు చిన్నది. తెల్లగా, సన్నగా, పొడవుగా, అందంగా ఉంటుంది. రాజుల పిల్లే ఐనా దిగువ మధ్య తరగతికి చెందినది. భీమవరానికి చెందిన శకుంతలను ఓసారి మావుళ్ళమ్మ జాతరలో రుద్రమరాజు చూడడం జరిగింది. ఆమె అందం ఆకట్టుకోవడంతో, పెద్దల అంగీకారంతో ఆమెను పెళ్ళిచేసుకున్నాడు.

శకుంతల అప్పటికి డిగ్రీ ఫైనలియర్లో ఉంది. చదువు పూర్తయేంతవరకు పెళ్ళిచేసుకోనంది. కాని, గొప్పింటి సంబంధం. అయాచితంగా వచ్చింది. ఉబ్బితబ్బిబ్బైన ఆమె తల్లిదండ్రులు ఆమెను ఒప్పించి పెళ్ళి జరిపించేసారు.

రుద్రమరాజు భార్యను ప్రేమగా చూసుకునేవాడు. ఆమె కూడా అనుకూలవతి ఐన భార్య. సామాన్య కుటుంబం నుండి వచ్చిన శకుంతల పుష్కలమైన పాడిపంటలు, పలువురు నౌకర్లు చాకర్లతో కళకళలాడే ఆ ఇంట్లో అడుగుపెడుతున్నప్పుడు భయపడింది. సిగ్గు, బిడియము, బెరుకుతనము పెనవేసుకున్నాయి. ఐతే క్రమంగా ఆ జమీందారీ పద్ధతులకు, ఆచారవ్యవహారాలకు అలవాటుపడిపోయింది. అత్తింట అందరినీ మెప్పించగలిగింది.

అష్టైశ్వర్యాలు ఇచ్చిన భగవంతుడు రుద్రమరాజు దంపతులకు ఓ తీరని లోటు చేసాడు. అదే, సంతాన లేమి! పెళ్ళయి పదేళ్ళైనా వారికి పిల్లలు పుట్టలేదు. దంపతులు గుళ్ళూ గోపురాలూ తిరిగారు. పూజలూ పునస్కారాలూ చేసారు. వ్రతాలూ, హోమాలూ చేసారు. ఫలితం లేకపోయింది.

తమ వంశం కొడుకుతోనే అంతమైపోతుందేమోనన్న భయం పట్టుకుంది రుద్రమరాజు తల్లి లక్ష్మీదేవమ్మను. దంపతులకు వైద్య పరీక్షలు చేయిస్తే బాగుంటుందని సలహా ఇచ్చారెవరో. దాన్ని త్రోసిపుచ్చిందామె. తన కొడుకు మగసిరి గల మన్మథుడు. అతనిలో ఎట్టి లోపమూ ఉండదుగాక ఉండదు. కనుక కోడలే గొడ్రాలన్న నిర్ణయానికి వచ్చేసింది. వంశాభివృద్ధి కోసం కొడుక్కి రెండో పెళ్ళి చేయాలన్న ఆలోచనలో పడింది.

శకుంతలకు పిల్లలంటె మక్కువ. పెళ్ళై అన్నేళ్ళైనా పిల్లలు పుట్టకపోవడంతో లోపం ఎక్కడ ఉన్నదో తెలియక బెంగపడింది. తన తల్లికి ముగ్గురు సంతానం. అమ్మమ్మకూ అంతే. అటువంటిది, తాను గొడ్రాలు ఔతుందంటే నమ్మలేకపోతోంది. ఓసారి పుట్టింటికి వెళ్ళినప్పుడు రహస్యంగా డాక్టర్ చేత పరీక్షలు చేయించుకుంది ఆమె. తనలో ఏ లోపమూ లేనట్టు తేలింది. కనుక లోపమంటూ ఉంటే భర్తలోనే ఉండాలనిపించింది.

భర్త ఆరోగ్యవంతుడే. సంసారసుఖాన్ని అందించడంలో సమర్థుడే. ఐనా సంతానం కలగకపోవడానికి గల కారణమేమిటో ఆమెకు బోధపడలేదు...ఆమె భర్త కూడా వైద్య పరీక్షలు చేయించుకుంటే, స్వల్ప లోపం ఏదైనా ఉంటే వైద్యంతో సరిచేసుకోవచ్చునంది డాక్టర్. కాని, శకుంతల లేడిపిల్ల లాంటిది. సింహాన్ని శాసించే ధైర్యము, సాహసమూ ఆమెకు లేవు. సంతానవైఫల్యం నిమిత్తం డాక్టర్ని సంప్రదించడమన్నది ఘోర అవమానంగా భావించే రాజుల కుటుంబమది!

అత్తగారు తనకు విడాకులు ఇప్పించి కొడుక్కి రెండో పెళ్ళి చేసే ప్రయత్నంలో ఉందన్న వార్త లోపాయకారిగా శకుంతల చెవిని సోకింది. ఆ కుటుంబంలో అత్తగారు ఎంత చెబితే అంత! ఆమె మాటను త్రోసిపుచ్చగల ధైర్యం రుద్రమరాజుకు కూడా లేదు. ఆమె తలచుకున్నది నెరవేరి తీరుతుంది...కాళ్ళ క్రింద భూమి కృంగిపోతున్నట్టనిపించింది శకుంతలకు. ఆందోళనతో నిద్రాహారాలు కరవయ్యాయి...

లక్ష్మీదేవమ్మ చెల్లెలి కొడుకు నరసరాజు చించినాడలో ఉంటున్నాడు. అతను చానాళ్ళుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఓసారి రుద్రమరాజు ఊళ్ళో లేని సమయంలో నరసరాజుకు సీరియస్ గా ఉందని కబురు వచ్చింది. లక్ష్మీదేవమ్మ వెంటనే కోడల్ని తీసుకుని కారులో చించినాడకు వెళ్ళింది.

నరసరాజు పరిస్థితి విషమంగా ఉంది. అతన్ని ఆ స్థితిలో వదిలి ఇంటికి వెళ్ళిపోవడానికి లక్ష్మీదేవమ్మకు మనస్కరించలేదు. ఐతే మూడు రోజులుగా కొనసాగుతూన్న తుఫాను వాతావరణం ముదిరి పెద్ద గాలివానకు దారితీసింది. కుంభవృష్టితో వరదనీరు గ్రామాలను ముంచెత్తే ప్రమాదం ఏర్పడింది. ఇంటివద్ద పరిస్థితి ఎలా ఉన్నదో తెలియదు. పాలేళ్ళు, పనివాళ్ళు గొడ్డు గోదాని జాగ్రత్తగా చూసుకుంటున్నారో లేదో తెలియదు. అందువల్ల వాతావరణం భీభత్సరూపాన్ని దాల్చే సూచనలు కానవస్తున్నా, జాగ్రత్తగా తీసుకువెళ్ళమని డ్రైవర్ కి చెప్పి, కోడల్ని ఇంటికి బైలుదేరదీసింది లక్ష్మీదేవమ్మ. తాను చెల్లెలికి తోడుగా ఉండిపోయింది.

కొంత దూరం వెళ్ళేసరికి తుఫాను తాకిడి ఉధృతమైంది. వృక్షాలు గాలికి నేలకూలాయి. కారు ముందుకు కదలలేని పరిస్థితి. దారికడ్డుగా పడ్డ చెట్లను తొలగించడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు డ్రైవర్ రాముడు. పాతికేళ్ళుంటాయి వాడికి. ఇంకా పెళ్ళి కాలేదు.

ఉరుములు, మెరుపులు తోడవడంతో ప్రకృతి భీభత్సంగా ఉంది. గాలి తాకిడికి కారు ఏటిలోని నావలా అల్లాడిపోతోంది. లోపల కూర్చున్న శకుంతలకు, రాముడికీ ఏ క్షణంలో ఏ చెట్టు కారుపైన కూలుతుందోనని భయంగా ఉంది... మెరుపుకాంతిలో సమీపంలో ఓ దాబా కనిపించింది. కారు దిగి వర్షంలో తడుస్తూనే అటువైపు నడిచారు ఇద్దరూ. అది ఓ ప్రభుత్వ పాఠశాల. మూసియుంది. వరండాలో నిల్చుని తడిసి ముద్దైన దుస్తుల్ని పిండుకోసాగింది శకుంతల.

అదే సమయంలో పెద్ద శబ్దం చేస్తూ చేరువలో ఎక్కడో పిడుగు పడింది. అదరిపడ్డ శకుంతల భయంతో పక్కనే ఉన్న రాముణ్ణి గట్టిగా కావలించుకుని వాడి వక్షానికి బల్లిలా అతుక్కుపోయింది.

#

ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో గోదావరి ఒడ్డున ఉన్న గ్రామమది. నదీతీరాన తలకు తీవ్రగాయాలతో, ముఖమంతా గాట్లతో అపస్మారక స్థితిలో కొన ఊపిరితో పడున్న ఓ వ్యక్తిని చూసిన గ్రామస్థులు వెంటనే అతన్ని ఆసుపత్రిలో చేర్పించారు. మూడు రోజుల తరువాత కాని తెలివిలోకి రాలేదు అతను. ఆ యువకుడు ఏ ప్రాంతపువాడో తెలియలేదు. తన ప్రాణాలు కాపాడినందుకు కనులతోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాడే తప్ప పెదవి విప్పలేదు అతను. తలకు తగిలిన గాయం కారణంగా నోటిమాట పడిపోయిందేమో ననుకున్నారు. లేదన్నారు డాక్టర్లు. ట్రౌమా కారణం కావచ్చునన్నారు.

నెల్లాళ్ళ తరువాత కోలుకున్నాడతను. ఆరోగ్యం పూర్తిగా నయమైపోయింది కాని, నోరు మాత్రం మెదపడంలేదు. తన వివరాలు చెప్పడంలేదు. విసుగెత్తిన గ్రామస్థులు అతన్ని గ్రామం నుండి పంపేయాలనుకున్నారు.

ఐతే సూరపురెడ్డి అసలు సిసలైన రాజకీయవేత్త. స్వప్రయోజనం, స్వలాభం చేకూర్చే వ్యాపార దక్షత అతని సొంతం. ఆగంతకుణ్ణి చూస్తూంటే సూరపురెడ్డి బుర్రలో 'ఐడియా' సెల్ ఆగకుండా మ్రోగింది. అతగాడిలో కోట్ల ఆదాయం కన్నులకు కట్టింది. గ్రామపెద్దలతో సంప్రదింపులు జరిపాడు.

ఫలితంగా – అక్కడికి సుమారు వంద మైళ్ళ దూరంలో ఉన్న బాసరలో సరస్వతీదేవి ఆలయానికి ఆమడ దూరంలో ఓ శుభదినాన 'మౌనబాబా' వెలసాడు..!!

'బాబా' హిమాలయాల నుండి విచ్చేసాడనీ...అతని వయసు నూటయాభైకి పైచిలుకేననీ...మౌనమే అతని భాష్యమనీ...అతని చూపులు పడ్డవారి జన్మ ధన్యమౌతుందనీ, భక్తుల ఇక్కట్లు పిక్కబలం చూపవలసిందేననీ...విశేషంగా ప్రచారం జరిగింది.

'ఏ పుట్టలో ఏ పాముందో!' అనుకునే గొర్రె మనస్తత్వం కలిగిన జనాలు, 'ఏ సాములోరి దగ్గర ఏ మహాత్మ్యముందో!' అనుకుంటూ, 'మౌనబాబా' దర్శనానికి తండోపతండాలుగా వచ్చారు. శిష్య, భక్త గణాలు ఏర్పడిపోయాయి. బాబా కట్నకానుకలను స్వీకరించడు. కనుక వాటికోసం ఆశ్రమమంతా హుండీలు వెలసాయి. భక్తులు బాబాకి తమ కష్టాలను నివేదించుకుని, 'నైవేద్యం' ఆ హుండీలలో వేసేవారు.

అనతికాలంలోనే ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన రెండు వందల ఎకరాల స్థలంలో పక్కా ఆశ్రమం ఏర్పడి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిపోయింది. బెల్లం ఉన్న చోటే చీమలూ చేరడం సహజం. ఆశ్రమ నిర్వహణ నిమిత్తం ఓ ట్రస్ట్ ఏర్పడింది. దానికి సూరపురెడ్డి అధ్యక్షుడైతే, ఆ గ్రామానికి చెందిన మోతుబరులంతా సభ్యులు.

మౌనబాబా మహాత్మ్యం, అతీత శక్తులను గూర్చి దేశవిదేశాలలో అశేష ప్రచారం జరగడంతో విదేశీ భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిపోయింది. దాంతోపాటే ఫారిన్ ఫండ్స్ కూడా ధారాళంగా వచ్చిపడ్డాయి...కాలక్రమాన ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు, ఆసుపత్రులు కూడా వెలసాయి. ట్రస్ట్ ఆదాయంతోపాటు సూరపురెడ్డి బృందం యొక్క ఆస్తిపాస్తులూ దినదినాభివృద్ధి చెందడం విశేషం!

#

శకుంతల నీళ్ళోసుకోవడంతో అందరి అనుమానాలు, సందేహాలూ పటాపంచలైపోయాయి. అందరికంటె మిక్కిలి సంతోషించింది లక్ష్మీదేవమ్మే, ఎట్టకేలకు వారసుడొకడు ఉద్భవించబోతున్నాడని. కొడుక్కి రెండో పెళ్ళి చేసే ఆలోచనను విరమించుకుంది. నెలలు నిండాక పండంటి కొడుకును కన్నది శకుంతల. తల్లి అందం, రంగూ పుణికిపుచ్చుకుని ముద్దులొలుకుతూన్న కొడుకును చూసుకుని మురిసిపోతూ మీసం మెలేసాడు రుద్రమరాజు. అతని తల్లి కూడా చంటాణ్ణి క్షణం వదలడంలేదు.

ఓ రోజున కొడుకుతో ఆడుకుంటూన్న రుద్రమరాజు చూపులు పసివాడి ఎడమ అరచేతిలో ఉన్న శంఖం గుర్తుపైన పడ్డాయి. చంటాడు ఎప్పుడూ గుప్పిళ్ళు మూసుకుని ఉండడంవల్ల అంతవరకూ అది రుద్రమరాజు కంట పడలేదు. ఇప్పుడు దాన్ని చూడగానే విభ్రాంతికి గురయ్యాడు. ఏదో అనుమానపు వీచిక అతని మదిని బలంగా తాకింది. అందుక్కారణం–డ్రైవర్ రాముడి ఎడమ అరచేతిలో సరిగా అదే చోట శంఖపు గుర్తు ఉండడమే!

తల్లి నిజం, తండ్రి నమ్మకమూ నంటారు. రుద్రమరాజు భార్యను అనుమానించలేకపోతున్నాడు. అలాగని, రాముడికి ఉన్న చోటే, అదే గుర్తు తన కొడుక్కి ఉండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. తన అనుమానాలను బైటపెట్టలేదు అతను. భార్యను, రాముణ్ణీ రహస్యంగా కనిపెట్ట నారంభించాడు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించలేదు. అలాగని, ఎంత ప్రయత్నించినా మనసుకు సరిపెట్టుకోలేకపోతున్నాడు. ఎక్కడో, ఏదో జరిగిందనిపిస్తోంది. ఏం జరిగిందో, ఎలా జరిగిందో మాత్రం బోధపడడంలేదు.

బారసాల రోజున పిల్లాడికి కృష్ణంరాజని నామకరణం చేయబడింది. అదే రోజు రాత్రి డ్రైవర్ రాముడు అదృశ్యం కావడం విశేషం!

## 3

ఏనుగువానిలంకలో గోదావరి ఒడ్డున కొలువైయున్న 'మౌనబాబా' దర్శనం కోసం జనం విశేషంగా ఎగబడడంతో అక్కడ నిత్య తిరునాళ్ళే ఐంది. అజ్ఞాత స్త్రీ ఒకామె బాబా దర్శనానికి అప్పుడప్పుడు వస్తూండేది. ముఖానికి చీరచెంగు కప్పుకుని, దూరం నుండే బాబా దర్శనం చేసుకుని వెళ్ళిపోతూండేది. పళ్ళు, ఫలహారాలూ తీసుకొచ్చేది.

డ్రైవర్ రాముడు అదృశ్యమయ్యాక అతని తల్లి, చెల్లెలు అనాథలయ్యారు. ఎలాగో గంతకు తగ్గ బొంతను చూసి కూతురికి పెళ్ళి చేసేసిన రాముడి తల్లి సుబ్బాయమ్మ, ఒంటరిదై పేదరికంలో మ్రగ్గుతోంది. దానికి తోడు కొంతకాలంగా క్షయవ్యాధి పట్టి పీడిస్తోంది ఆమెను. కుటుంబానికి ఆదరువైన ఒక్కగానొక్క కొడుకు ఏమైపోయాడో తెలియక కుమిలిపోయినా, ఏనాటికైనా తిరిగి రాకపోతాడా అన్న ఆశ ఆమెను జీవింపచేస్తోంది.

ఊళ్ళోకి బాబా ఎవరో వచ్చాడంటూ అతని మహిమలను గూర్చి అంతా గొప్పగా చెప్పుకుంటూంటే, సుబ్బాయమ్మ కూడా వెళ్ళింది. బాబాకి తన గోడు వెళ్ళబుచ్చుకుని, తాను కన్ను మూసేలోపున కొడుకును ఓసారి కళ్ళారా చూసుకోవాలనుందనీ, తన ఆ చివరి కోర్కెను తీర్చమనీ కన్నీళ్ళు పెట్టుకుంది.

ఆ వృద్ధురాలి కళ్ళలోకి నిశితంగా చూసాడు బాబా. బాబా కరుణారస దృక్కులు ఆమె పైన నర్తించాయనీ, ఇక ఆమెకు మంచిరోజులు వచ్చినట్టేననీ అన్నారంతా.

ఐతే, సుబ్బాయమ్మ కొడుకు తిరిగిరాలేదు కాని, మూడో రోజు రాత్రి అదృశ్య శక్తి ఏదో సుబ్బాయమ్మ గుడిసెలో డబ్బుల సంచి ఒకటి పడేసిపోయింది. లెక్కిస్తే, అక్షరాలా కోటి రూపాయలు ఉన్నాయి అందులో!...అదంతా బాబా మహిమేనంటూ కీర్తించారంతా. కొడుకు తిరిగి రాకపోతేనేం, సుబ్బాయమ్మ కష్టాలు తీరిపోయాయన్నారు.

రుద్రమరాజు కొన్నాళ్ళుగా పాక్షిక పక్షవాతంతో బాధపడుతున్నాడు. శరీరంలోని కుడిభాగం దాదాపు చచ్చుపడిపోయింది. ఖ్యాతిగాంచిన వైద్యుల ఆధ్వర్యంలో ఖరీదైన వైద్యం జరుగుతున్నా పెద్దగా ఫలితం కనిపించలేదు. సుబ్బాయమ్మ ఉదంతం ఆలకించడంతో, 'ఏ స్వాములోరిలో ఏ మహాత్మ్యం ఉందో!' అన్న తలంపు రుద్రమరాజు మదిని తట్టింది. తెలియని ఆశ ఏదో చిగురించింది.

రుద్రమరాజు ఆ ఊరి జమీందారు కావడంతో మౌనబాబాతో ఏకాంత సమావేశం ఏర్పాటుచేయబడింది. తన అనారోగ్యం గురించి విపులంగా చెప్పాడు రుద్రమరాజు. నయం చేయవలసిందిగా అర్థించాడు. నిశ్శబ్దంగా ఆలకిస్తూన్న బాబా చురుకైన చూపులు రుద్రమరాజు వదనం పైన స్థిరంగా నిలిచిపోయాయి. చివరగా బాబాకి శిరస్సుతో నమస్కరించి లేచాడు రుద్రమరాజు. బాబా రెండు చేతులూ ఎత్తి ఆశీర్వదించాడు.

బాబా ఎడమ అరచేతిని చూసిన రుద్రమరాజు పెద్దగా ఉలికిపడ్డాడు. మస్తిష్కంలో ఏదో మెరుపు మెరవడంతో అయోమయానికి గురయ్యాడు. అనుమానంగా ఎడమచేతి చూపుడువ్రేలు బాబా వంక చూపుతూ ఏదో అనబోయాడు. కాని, నోరు పెకల్లేదు. షాక్ తో మాట పడిపోవడమే అందుక్కారణం! అంతలోనే మైకం క్రమ్మినట్టయి స్పృహతప్పి పడిపోయాడు.

డాక్టర్ ఇచ్చిన ఇంజెక్షన్ తో తెలివిలోకి వచ్చినా, నోటి మాట మాత్రం రాలేదు రుద్రమరాజుకు. పక్షవాతం ముదిరిందన్నాడు డాక్టర్.

శరీరం చచ్చుపడిపోయినా, మాట పడిపోయినా – రుద్రమరాజు మస్తిష్కం మాత్రం చురుగ్గానే పనిచేస్తోంది. ఆ రాత్రంతా మౌనబాబా గురించిన ఆలోచనలే కలవరపెడుతూ నిద్రపట్టలేదు అతనికి. ఎన్నో సందేహాలు, ప్రశ్నలు, అనుమానాలూను. వేటికి సమాధానాలు లేవు. ఎవరికీ చెప్పుకోలేని దుస్థితి! తెల్లవారాక తన సందేహాలను తీర్చుకునే ప్రయత్నం చేయాలనుకున్నాడు.

ఐతే తెల్లవారకముందే రుద్రమరాజుకు గుండెపోటు వచ్చింది. అది మైల్డ్ స్ట్రోకేననీ, భయపడవలసిన అవసరంలేదనీ చెప్పాడు డాక్టర్. ఫస్ట్ ఎయిడ్ అనంతరం రుద్రమరాజును ఏలూరులోని ఓ సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ కి తరలించడం జరిగింది.

రుద్రమరాజు హాస్పిటల్ పాలైన పక్షం రోజుల తరువాత మౌనబాబాకి హఠాత్తుగా జబ్బుచేసింది. రక్తం కక్కుకున్నాడు. అది తెలిసి భక్తగణం తల్లడిల్లిపోయింది.

వైద్యబృందం పరీక్షించి బాబా క్యాన్సర్ తో బాధపడుతున్నాడనీ, వ్యాధి చివరి దశలో ఉందనీ తేల్చింది. ఖంగుతిన్నారంతా. మౌనమే మంత్రంగా, కంటిచూపే తంత్రంగా ప్రజల రోగాలను నయంచేసే బాబా అంతటి భయంకర రోగంతో బాధపడుతున్నాడంటే నమ్మలేకపోయారెవరూను. ఆ వార్త అందరినీ కలచివేసింది. భగవంతుడైనా మానవజన్మ ఎత్తాక కర్మఫలం అనుభవింపక తప్పదన్నారు బాబా శిష్యులు. బాబా కొన్నాళ్ళుగా ఆ వ్యాధితో బాధపడుతున్నా, భక్తులు ఆందోళన చెందుతారని ఆ సంగతి గోప్యంగా ఉంచబడింది.

బాబా కోలుకోవాలని దేవాలయాలలో ప్రత్యేక పూజలు జరిపించారంతా. వారి ప్రార్థనలలో బలం లేదో, లేక అవి భగవంతుణ్ణి చేరలేదో కాని...పది రోజుల తరువాత మౌనబాబా నిదట్లోనే ప్రశాంతంగా కన్నుమూసాడు.

ఎదురుచూడని ఆ దుర్ఘటనకు శోకసముద్రంలో మునిగిపోయారంతా. ఎక్కడ పుట్టాడో, ఎక్కడ పెరిగాడో...చివరికి అక్కడ జీవితం చాలించాలని రాసిపెట్టి ఉందనుకున్నారు.

బాబా భౌతిక కాయాన్ని భక్తుల దర్శనార్థం మూడు రోజులపాటు అట్టేపెట్టారు. సామాన్యులేకాక ప్రముఖ రాజకీయవేత్తలు, ఉన్నత పదవులలో ఉన్నవారు – పలువురు దేశం నలుమూలల నుండీ అధిక సంఖ్యలో తరలి వచ్చి బాబాకి శ్రద్ధాంజలి ఘటించారు. అజ్ఞాత భక్తురాలు కూడా ఎప్పటిలా దూరం నుండే ఆ దివంగతుడికి అశ్రుతర్పణం చేసింది.

తెలిసి మౌనబాబాకి రక్తసంబంధీకులంటూ ఎవరూ లేరు. తలకొరివి ఎవరు పెట్టాలన్న ప్రశ్న తలెత్తింది. ట్రస్ట్ ప్రముఖులు, గ్రామపెద్దలు ఆ విషయమై తర్జనభర్జనలు జరుపుతూంటే, రుద్రమరాజు భార్య శకుంతలాదేవి నుండి కబురు వచ్చింది.

ఐహిక సుఖాలను త్యజించి, ఆధ్యాత్మిక చింతనతో, ప్రజాశ్రేయస్సుకు జీవితాన్ని అంకితం చేసిన మహాత్ములకు తలకొరివి పెట్టడం పరమ పుణ్యకార్యం. ఆ అదృష్టం అందరికీ పట్టదు. అందుకే తన కొడుకుచేత మౌనబాబాకి తలకొరివి పెట్టించడానికి తాను సుముఖంగా ఉన్నట్లు తెలియపరచిందామె. ఆ సుకార్యం వల్ల తన భర్త త్వరగా కోలుకోగలడన్న ఆశాభావం వ్యక్తం చేసింది... జమీందారిణి ప్రతిపాదన ఆశ్చర్యం గొలిపినా, దాన్ని కాదనడానికి కారణాలేవీ కనిపించలేదు ఎవరికీను.

తల్లి ఆనతి ప్రకారం – తరలివచ్చిన జనసందోహం సాక్షిగా...మౌనబాబా చితికి నిప్పంటించాడు పదిహేనేళ్ళ కృష్ణంరాజు. దూరం నుండే మండే చితికి చేతులెత్తి నమస్కరించింది శకుంతలాదేవి, చెమ్మగిల్లిన కన్నులతో.

కథా కౌముది

# కనువిప్పు

అంజన. కె.

"ఎక్కడ్నుండి ఫోన్" కాఫీ కప్ చేతికి అందిస్తూ అడిగింది పార్వతి

"ఇంకెక్కడనుండి – కాకతీయ మారేజి బ్యూరో నుండి. అతి కష్టం మీద మనకు సరిపోయే అమ్మాయి దొరికిందంట కాకపోతే మనవాడి కంటే సంవత్సరం పెద్దదంట. అభ్యంతరం లేకుంటే వివరాలు ఈమెయిలు చేస్తారంట" కాఫీ తాగుతూ తాపీగా చెప్పాడు రాజారావు.

"అయ్యో! ఆయుఃక్షీణం. అయినా దేశం గొడ్డు పోయిందా, ఇలాంటి సంబంధాలు చెపుతున్నారు?" చిరాకు పడింది

"ఇప్పటికి ఐదు సంవత్సరాలుగా రకరకాల మారేజి బ్యూరోల్లో నమోదు చెసుకొని, నీ కొడుకు పెళ్లి చేయలేకపోయాం. విసుగొస్తుంది నాకు"

"కొడుకు బాగా చదువుకొని, మంచి కంపెనీ లో ఉద్యోగం సంపాదిస్తే మీ కొడుకు ప్రయోజకుడయ్యాడని గర్వపడ్డారు. అందరికి చెప్పుకున్నారు. ఇప్పుడు పెళ్ళి అవ్వకపోతే, నా కొడుకు అయ్యాడా?" దెప్పింది పార్వతి

"అయినా నీది నీ కొడుకుది తప్పు. మొదట్లో మంచి సంబంధాలే వచ్చాయ్. కానీ మీ గొంతెమ్మ కోర్కెలకు తట్టుకొలేక పారిపోయారు. వాడేమో అందమైన అమ్మాయి, ఉద్యోగం చెయ్యాలి అని అన్నాడు. నువ్వేమో బాగా వంట చెయ్యాలి, సాంప్రదాయం గా ఉండాలి, లాంఛనాలు కట్నం దండిగా ముట్టాలని పట్టుపట్టావు. అన్ని కుదరాలంటే సాధ్యమేనా?"

"మధ్యలో నేనే దొరికానా.. అయినా వీడేమో ఉద్యోగంలో సెట్టిల్ అవ్వాలి అని 28 ఏళ్ల దాకా పెళ్ళి మాట ఎత్తనివ్వలేదు. 35 ఏళ్లు దగ్గర పడుతుంటే పిల్ల దొరకటం ఎలా" దిగులుగా సోఫాలో కూలబడింది

పార్వతి రాజారావు దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకుకి పెళ్లి అయ్యి ఆరు ఏళ్లు అయ్యింది. ఒక పాప, ఉళ్లోనే ఉంటారు. చిన్న కొడుకు పెళ్లికే ఈ తిప్పలన్ని. పెద్దకొడుకు రాహుల్ పెళ్లి అంతా తాము అనుకున్నట్లే జరిగింది. సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం అవ్వటంతొ భారీ కట్నంతో అందమైన అమ్మాయిని తెచ్చుకున్నారు. సుమతి చాలా నిదానం, అందుకే పార్వతి తన అత్తరికం బాగానే నిలబెట్టుకుంది.

ఈ ఆలోచనల్లో ఉండగానే చిన్న కొడుకు రాజీవ్ ఫోన్ చెశాడు.

"అమ్మ సాయంత్రం ఫ్రెండ్స్ తో బైటికి వెళుతున్నా. భోజనానికి రాను, మీరు తినేసి పడుకొండి"

"ఏంటో వీడి వ్యవహారం. తనతో పాటు చదువుకున్న వాళ్ళు పెళ్లిళ్లు చేసుకొని హాయిగా వున్నారు. వీడికింకా ఎన్నాళ్లు ఈ బ్రహ్మచర్యం, ఇల్లు పట్టకుండా తిరుగుతాడు" విసుక్కుంది పార్వతి.

--------------

మారేజి బ్యూరో ఆఫీసులోకి అడుగు పెట్టారు రాజారావు దంపతులు. ఇవాళ్ళ ఎలాగైనా ఒక మంచి సంబంధం పట్టుకోవాలని ధృఢసంకల్పంతో వచ్చారు. అక్కడి కంప్యూటర్ లో వెతికితే ఎవరో ఒకరు దొరకరా అన్న ఆశతో ప్రొద్దున్నే ఆఫీసు తెరిచే టైమ్ కు వచ్చేశారు.

వినయంగా పలకరించిన రిసెప్షనిస్ట్ ని పట్టించుకోకుండా "అర్జెంటు గా శ్రీధర్ ని కలవాలి. మాది చాలా పాత ఎకౌంటు. ఆయన లేరు అని చెప్పద్దు, ఇప్పుడే లోపలికి వెళ్ళటం చూశాం" అన్నాడు రాజారావు

ఫోనులో ఎదో లోగొంతుకతో మాట్లాడి, "అటు వైపు ఆఫీసులోకి వెళ్ళండి" అని చెప్పింది.

"రండి రాజరావు గారు. ఏంటి ఇలా వచ్చారు? ఏమన్న కొత్త ఎకౌంట్లు తెలిస్తే నేనే ఫోన్ చేసే వాడిని కదా"

"ఏమి చేస్తున్నావో ఎమిటో. ఐదు ఏళ్ళ నుండి మా అబ్బాయి పెళ్ళి చెయ్యలేకపోతున్నావు" అన్నాడు రాజారావు

"నేనేమి చేసేదండి. ఇది వరకటి రొజులు కావు ఇవి. పదేళ్ళ నుండి ఈ బిజినెస్సు లొ వున్నా, ఎన్నో మార్పులు చూశా. ఏదో మీరు పాత కస్టమర్ అన్న అభిమానం తో చాలా శ్రద్దగా చూస్తున్నా, ఐనా కుదరటం లేదు. అయినా ఇది మీ ఒక్కరి ప్రాబ్లం కాదులెండి. ఆమ్మయిల సంఖ్య తగ్గింది, దానితో అబ్బాయిలకు భార్యలు దొరకటం లెదు"

"ఏంటి ఇలా అంటావు? మావాడికి ఏమి తక్కువ. బాగుంటాడు, మంచి ఉద్యోగం,.. ఇంకా అంత కంటే ఏమి కావాలి?" విసురుగా ప్రశ్నించింది పార్వతి

"చూడండమ్మా! ఇదివరకటి రోజులు పోయాయి. ఆమ్మాయిలు బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు చెస్తున్నారు. నిజం చెప్పలంటే వాళ్ళదే పై చెయ్యిగా ఉంది ఇప్పుడు. అసలే అమ్మాయిల సంఖ్య తక్కువై సతమతమౌతున్నారు అందరు. మీ డిమాండ్లు అన్ని కాన్సిల్ చెయండి. సమయానుకూలంగా మనల్ని మనం మార్చుకోవాలి" నచ్చచెప్పాడు శ్రీధర్

"ఏమి చెయ్యాలి ఇప్పుడు?"

"వచ్చే ఆదివారం మేము ఒక పరిచయ వేదిక పెడుతున్నాం. ఇదివరకు ఫామిలీల కోర్కెల లిస్టు ప్రకారం ఎవరికి ఎవరు సరిపోతారో కంప్యూటర్ లో వెతికి కలిపే వాళ్ళం. కాని మేము కూడా కాలం తొ పాటు కొత్త ఐడియాలు వేయాలి. అసలు కథ ఏంటంటే – ఈ వేదిక లో అమ్మాయిలు అబ్బాయిలను ఇంటర్వ్యూ చేస్తారు, వాళ్ళకు నచ్చితే ముందుకు వెళ్ళచ్చు. ఏమంటారు?"

"సర్లేండి, ఇదో ప్రయత్నం. మా అబ్బాయిని తీసుకొని ఆదివారం వస్తాం" అంటూ ఇద్దరూ బైట పడ్డారు.

"ఇదివరకు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయటానికి కాళ్ళు అరిగేలాగా తిరిగేవాళ్ళు. ఇప్పుడు మగపిల్లాడి కోసం ఈ తిప్పలు" నిట్టూర్చింది పార్వతి

------------

ఆదివారం ముగ్గురూ కలిసి పరిచయ వేదిక జరిగే ఒక స్టార్ హొటల్ కు వెళ్ళారు. రిజిస్ట్రెషన్ దగ్గర ఎక్కువమంది అబ్బాయిలే కనిపించారు, చాలా కొద్దిమంది అమ్మాయిలు ఉన్నారు. ఆశ్చర్యం గా గమనిస్తూ లొపలికి వెళ్ళారు ముగ్గురూ.

లోపల ఒక 20 టేబుల్స్, చెరొకవైపు కుర్చీలతో వున్నయి. శ్రీధర్ వచ్చి మైకు లో చెప్పడు – టేబుల్స్ దగ్గర అమ్మాయిలు కూర్చుంటారని, అబ్బాయిలు వాళ్ళకు ఇచ్చిన ఫారమ్స్ నింపి, ఒక్కో అమ్మాయి దగ్గరకు వెళ్ళాలని. ఒకవేళ ఏ అమ్మాయికైనా నచ్చితే వాళ్ళను ఫైనల్ సెలెక్శన్ లిస్ట్ లొ పెడతారంట.

"ఇదేమి దిక్కుమాలిన ఐడియా! ఇంకా నయ్యం కన్యాశుల్కం అడిగారు కాదు" పార్వతి ఉవాచ.

"అది కూడా మొదలవుతుందిలే" విసుక్కున్నాడు రాజారావు "అయినా ఏముందిరా ఆ ఫారమ్ లో" బరాబరా గీకేస్తున్న కొడుకును అడిగాడు

"మీరే చూడండి" రాజీవ్ ఇచ్చాడు. వరసగా పది ప్రశ్నలు వున్నాయి——

హైటు, వైటు

జిమ్ కు వెళ్ళే అలవాటు వుందా?

సిక్స్ ప్యాక్ శరీరం వుందా?

జీతం ఎంత, అప్పులు ఏమైనా వున్నాయా?

ఏ వాహనం ఉన్నది?– సొంతమా / లోనుమీద కొన్నారా?

తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారా? – వంట చెయటం వచ్చా?

పబ్ లకు పార్టీ లకు వెళతారా?

లైఫ్ ఇన్సురెన్స్ ఉన్నదా?

మెడికల్ రిపోర్ట్ జత చేయండి

అది చదివేసరికి నోట మాట రాలేదు ఇద్దరికి. ఒక రెండు గంటల రకరకాల ఇంటర్వ్యూల తరవాత నీరసంగా బైటికి వచ్చాడు రాజీవ్.

"ఏంట్రా ఎవరన్నా నచ్చారా?" ఆత్రంగా అడిగింది పార్వతి

"అమ్మా నువ్వు ఇలాంటి ప్రశ్నలు మానేయి. నాకు వాళ్ళు నచ్చారా అన్నది ప్రశ్న కాదు. వాళ్ళకు నేను నచ్చలేదు. ఒకొక్కరికి ఒక్కొ పాయింటు మీద నచ్చలేదు. జిమ్ అలవాటు లేదు, తల్లిదండ్రులతొ ఉంటున్నా– సొంతంగా ఉండే కెపాసిటీ లేదంట. ఇక నాకు పెళ్ళి అవుతుందన్న నమ్మకం లేదు. పదండి ఇంటికి వెళదాం. పోనీ నేనే ఒక అమ్మాయిని చూసుకుందామా అంటే – మొదటి నుండి అమ్మాయిలకు దూరంగా ఉండాలని పెంచటం మూలాన, వాళ్ళతొ ఎలా మాట్లాడాలొ అర్థం కాదు. ఛ ఎలా అయ్యింది నా బ్రతుకు!?" విసురుగా బైటికి వెళ్ళి పోయాడు రాజీవ్

———————

"నేను పెళ్ళి చేసుకుంటున్నా" సాయంత్రం ఆఫీసు నుండి వస్తూనే ప్రకటించాడు రాజీవ్

"అదేంట్రా.. ఎవర్నీ..ఏంటి? ఏదో పరాయి వాళ్ళకు చెప్పినట్లు చెపుతావేంటి? మా అభిప్రాయం తో పని లేదా?" ప్రశ్నల వర్షం కురిపించారు

"నాకు మీరు అనుకునే రీతిలో పెళ్ళి అవుతుందనే నమ్మకం లేదు. అందుకే ఇప్పుడు పెళ్ళిళ్లు ఏ పద్దతిలో జరుగుతున్నాయో, దానికే ఒప్పుకున్నా. ఆడపిల్ల పుడితే తప్పు అనుకొని కడుపులోనే చంపేశారు చాలామంది. దానితో వాళ్ళ సంఖ్య చాలా తగ్గింది. ఒకప్పుడు బహుభార్యత్వం – మరి ఇప్పుడు బహుభర్తత్వమ్"

"అదేంట్రా..ఆ పిచ్చి మాటలు ఆపు. ఒక అమ్మయికి ఎక్కువ మంది భర్తలేంట్రా" వాపోయింది పార్వతి

"ఇప్పుడు చాల పెళ్ళిళ్ళు ఇలానే జరుగుతునాయి.ఇది వరకు మొగాళ్ళు రెండు పెళ్లిళ్ళు చెసుకుంటే ఎవ్వరేమీ ఆశ్చర్యపోలేదే. అదీ కాకుండా, పురాణాల్లో ద్రౌపది ఐదుగురు భర్తలతో కాపురం చెస్తే ఎవ్వరూ తప్పు పట్టలేదు కదా. అందుకే ఎలాంటి నిర్ణయం తీసుకున్నా. మా ఆఫీసులోనే పని చెస్తుంది దీప్తి. నాలోని కొన్ని గుణాలు, అశోక్ లొవి కొన్ని నచ్చాయంట తనకు. 33 ఏళ్లు నాకు. ఇంకా ఎన్నాళ్ళు ఇలా వుండేది నేను. ఈ మధ్య కాలంలో ఇలా చాలా మంది చెసుకుంటుంన్నారు."

"అదేంట్రా..ఒకే అమ్మయితో ..ఒకే ఇంట్లో ఎలా కాపురం చెస్తారూ?"

"మాకు లేని అభ్యంతరం మీకేంటి? మేమంతా ఫ్రెండ్స్. ఇక ప్రాబ్లం ఏముంది? నాకు తెలుసు మీకు నచ్చదని, అందుకే నా వస్తువులు తీసుకొని రేపు ఆదివారం వెళ్లిపోతాను. దీప్తి కి సొంత అపార్ట్మెంటు వున్నది, అక్కడే వుంటాము ముగ్గురం. ఆదివారమే పెళ్ళి గుడిలో" టకటక చెప్పేసి తన గది లోకి వెళ్ళిపోయాడు.

------

పూర్తిగా మనస్కరించకపోయినా, ఆరు నెలలు అయ్యింది కొడుకును చూసి అని అతనుండే అపార్టుమెంటుకు వెళ్ళారు పార్వతి రాజారావు.

"రండి అమ్మా లొపలికి. ఫోను చేయకుండా వచ్చారే – అంటే నా మీద కోపం తగ్గిందా?" ఆనందంగా ఆహ్వానించాడు రాజీవ్

"ఎలా వున్నావురా..కనీసం మాతో మాట్లడాలి అని కూడా అనిపించలేదా?" ఏడుపు గొంతుతో ప్రశ్నించింది పార్వతి

"మీ కోపం తగ్గేదాక కొన్నాళ్ళు దూరంగా ఉందామనుకున్నా"

పార్వతి చుట్టూ గమనించటం మొదలెట్టింది. చాలా నీటుగా సర్ది ఉంది.

"ఎవరూ వచ్చింది?" లొపలి నుండి వచ్చింది దీప్తి. చక్కటి చుడీదార్ వేసుకొని, కడిగిన ముత్యం లాగా ఉంది.

పరిచయం చెసాడు రాజీవ్ అందరిని.

"నమస్తే కూర్చోండి. మీరు భోజనం చెసి వెళ్ళాల్సిందే ఇవాళ్ళ. మీరు మాట్లాడుకుంటూ వుండండి, నేను కాఫీ తెస్తాను" నవ్వుతూ మాట్లాడి లోపలికి వెళ్ళింది.

"ఆ ఇంకో అబ్బాయి కూడా మీతోనే వుంటాడా?" లోగొంతుకతో ప్రశ్నించాడు రాజారామ్

"కూరగాయలు, చికెన్ తీసుకురావటానికి బైటికి వెళ్ళాడు. ఇవ్వాళ్ళ ఆదివారం కదా!" చాలా మామూలుగా చెప్పాడు రాజీవ్ "నేను వంట బాగానే నేర్చుకున్నా ఈ ఆరు నెలల్లో. ముగ్గురం కలిపి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఆదివారం వంట పూర్తి చెస్తాం. మిగతా రొజుల్లో ఎవరు ముందు వస్తే వాళ్ళు వంట మొదలుపెడతారు."

కాసేపు కూర్చొని వెళదాం అని వచ్చిన వాళ్ళు, సాయంత్రం దాకా ఉండి పోయారు. ముగ్గురూ మంచి స్నేహితుల్లాగా కలిసిపోయి నవ్వుకొవటం, కబుర్లు చెప్పుకొవటం ఎంతో ఆశ్చర్యం వేసింది.

"వెనకటి రోజుల్లో ఎవరన్నా మొగళ్ళు రెండు పెళ్ళిళ్ళు చేసుకున్నా, పెద్దిల్లు చిన్నిల్లు అన్న పోటీ అసూయా వుండేవి. ఇదేంటండి ఇంత చక్కగా కలిసిపోయారు?" ఇంటికి తిరిగ్ వెళ్ళేటప్పుడు పార్వతి అన్నది ఆశ్చర్యం గా.

"తప్పదని సర్దుకుపోయారేమో"

"వీళ్ళకు పిల్లలు పుడితే ఎవరి పేరు రాస్తారు--- పిత్రుస్వామ్యం పోయి మాతృస్వామ్యం వస్తుందా?"-------..

---

---

ఉల్లిక్కిపడి నిద్ర లేచింది పార్వతి. ఏంటి ఇదంతా కలా? ఇంత విపులంగా, స్పష్టంగా ఉంది. నిజంగానే కొడుకు ఇటువంటి పెళ్లి చెసుకుంటాడా?

బుర్ర వేడి ఎక్కిపోయింది--- కంగారుగా భర్తను లేపింది

"మనం మారేజి బ్యూరోకి వెళ్ళి కట్నం పట్టింపు లేదు, బాగా కలిసి పోయే అమ్మాయి చాలు అని అడుగుదాం. ఇంకా కొన్నాళ్ళు ఇలా పిచ్చి పట్టుదలలు పోయామంటే, మన అబ్బాయి బ్రహ్మచారిగానే మిగిలి పోతాడు. లేకుంటే, మరే విపరీతమైన నిర్ణయాలు తీసుకుంటాడో!?"

"ఏమయ్యింది ఇంత పొద్దున్నే నీకు?"

"నేను మీకు చెప్పలేను. మనం తప్పు చేశాం. మగపిల్లవాడిని కన్నాం అన్న అహం తో గొంతెమ్మ కోరికలు కోరాము. నా కళ్ళు తెరుచుకున్నాయి. ఇద్దరిని సహజీవనం లోకి పంపే ఈ బంధం – ఒకరికి భారం తో కష్టంతో మొదలవ్వకూడదు. సంతోషంగా మనసుకు నచ్చిన వ్యక్తిలో తోడు వెతుక్కోవాలి. కట్నం వద్దు కన్యాశుల్కం వద్దు. కట్నాలు ఇచ్చి పెళ్ళిళ్ళు చేయలేక కదుపులోనే చంపెయ్యటం అసలే వద్దు. ఈ పాపాలన్ని ఇక ఇంతటితో ఆగిపోవాలి" ఏకధాటిగా మాట్లాడుతున్న భార్యను సాలోచనగా చూస్తూవుండిపోయాడు రాజారావు.

★★★★★

కథా కౌముది

# దానిమ్మగింజలు తాడికొండ కె. శివకుమార శర్మ

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ**

*కలవారై గుణవంతులై లలితులై కల్యాణ పాథోధులై*
*లలనా మన్మథులై సముజ్జ్వల వచో లాలిత్యులై నిత్యులై*
*బలవిభ్రాజితులై యశోభరితులై భాసిల్లు భాగ్యోదయుల్*
*తొలిజన్మంబున నిన్ను కొల్చిన మహాత్ముల్ వారు సర్వేశ్వరా!*

@ @ @

"దాదాపు ఇరవయ్యేళ్లుగా ప్రతీ యేటా ఇంట్లో అభిషేకం చేయిస్తున్నాం. అయిదారుగురిదాకా పూజార్లు మాచేత ఈ కార్యక్రమాన్ని చేయించారు గానీ ఇవాళ్టి ప్రత్యేకత ఇంతకు ముందెన్నడూ లేదు."

"డాక్టరుగారికి పూజార్లు నచ్చడం తక్కువ. నచ్చితే ఒక పట్టాన వదల్రు. మామూలుగానే ఆ అభిషేకం జరుగుతున్నంతసేపూ ఆయన లోకం ఆయనది. అలాంటి ఆయన్ని ఇవాళ మరేదో లోకానికి తీసుకెళ్లారు."

"అలాంటి లోకానికి తీసుకెడతానంటే మటుకు వస్తాననే వాళ్లెంత మందుంటారమ్మా? ఇవాళ ఇక్కడ పూజ చేయించినందుకు నాకూ ఆనందంగా వుంది. నేను మా నాన్నగారితో కలిసి చేసినప్పటి దానితో సమంగా తులతూగడం దానికి మొదటి కారణం. నాతో ఈ నాలుగ్గంటలూ వారు గొంతు కలపడం రెండవ కారణం. దాన్లో ఆయన తన్మయత్వం జెందడం మూడవది."

"ఆయన ఇంతలా తన్మయత్వం జెందడాన్ని చూసింది దాదాపు పదిహేనేళ్ల క్రితం అనుకుంటాను. విశ్వేశ్వరశాస్త్రి గారని, ఒకాయన చేయించినప్పుడు. అయితే, అది ఒక్కసారే జరిగింది. ఇప్పటికీ ఆయన్ని తల్చుకోని రోజుండదు."

"నేను ఎంత ఏకాగ్రతతో సర్జరీలని చేస్తానో ఆయన అంత ఏకాగ్రతతోనూ, శ్రద్ధగానూ చేయించారు. నేను సర్జరీలని చేసేటప్పుడు మాన్యువల్స్ చూస్తూ చేస్తానంటే కుదుర్తుందా? అలాగే, ఆయన కూడా ఏ పుస్తకాన్నీ చూడకుండా మొత్తం కార్యక్రమాన్ని చేయించారు. అదీ ఆయన గొప్ప. మళ్లీ, ఇదిగో, ఇవాళ మీరు. అప్పటి విశ్వేశ్వరశాస్త్రి గారికంటే కనీసం పదేళ్లు చిన్న. నిజం చెబుతాను. మీరు మా యింట్లో అడుగు పెడుతున్నప్పుడు మిక్స్‌డ్ ఫీలింగ్స్ కలిగాయ్. ఒక పక్కనేమో ఇంత చిన్న కుర్రాడేం చేయిస్తాడని! రెండో పక్కనించీ, ప్రస్ఫుటంగా కనిపించిన మీ మొహంలోని వర్చస్సు. "

"ఇంక ఆయన మిమ్మల్ని వదల్రు. ఇక్కడున్నన్నాళ్లూ  మీరు మా యింట్లో కార్తీక పౌర్ణమికీ, మహాశివరాత్రికీ బుక్కయిపోయారు."

"ఆవిడ చెప్పింది అక్షరసత్యం. మా బావమరిది మనవడు నాకొక వజ్రాన్ని అందించాడు."

"వాడు ఎంత చెప్పినా ముందీయన వినలేదు. 'నా రూమ్మేట్ తాతయ్యా!' అని మొత్తుకున్నాడు. పైగా, 'వాళ్లింట్లో పూజా పునస్కారాలుంటే వాడికి వీటిగూర్చి సరిగ్గా తెలిసేది!' అన్నారు నాతో. వాణ్ణి గుచ్చి, గుచ్చి మరీ అడిగారు – 'ఆయన ఏ గుళ్లో పనిచేస్తున్నార్రా?' అని. వాడు జవాబివ్వకుండా దాటేశాడు. అది ఈయన అపనమ్మకాన్ని ఇంకా పెంచింది. వాడికి మర్చిపోకుండా థాంక్స్ చెప్పండి! ఒరేయ్ రమేషూ, ఇలా రారా! మీ తాతయ్య నీకు థాంక్స్ చెబుతార్ట!"

"నేను చెప్పేదాకా పోరుతూనే వుంటావుగానీ, ... వాడికి వినపడ్డట్టు లేదు. ఎవరితోనో మాట్లాడుతున్నాడు. పంచామృతాలతో అభిషేకం చెయ్యడం తెలుసు. పళ్లరసాలతో గూడా చేశాం. ఈ దానిమ్మగింజలతో చెయ్యడమే ప్రత్యేకంగా వుంది. ఇది మీ శాఖ ప్రత్యేకతా?"

"మా నాన్నగారి ప్రత్యేకత. దాన్ని వివరించాలంటే ఒక కథ చెప్పాలి. బాగా పొద్దుపోయింది. మిగిలిన గెస్టుల సంగతికూడా చూడాలేమో?"

"శ్రీకృష్ణుడు మథురానగరిలో కంసుడింటికి వెళ్లేదారిలో సుదాముడి ఇంటి ముందాగుతాడు. ఆ సుదాముడు ఎంతకాలంనుండో శ్రీకృష్ణుణ్ణి చూడాలని తపిస్తున్నాడు. అతణ్ణి, నీకేం కావాలో కోరుకొమ్మన్నాడు కృష్ణుడు. సుదాముడు,

"నీపాద కమలసేవయు

నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం

తాపార భూతదయయును –

"తనకిమ్మంటాడు. మీకీ పోతన పద్యం తెలిసే ఉంటుంది. ఇప్పుడిక్కడ రెండవపాదం వర్తిస్తుంది. అలా కూర్చొని చెప్పండి."

@ @ @

"ఏమ్మా, బజారంతా వెదుకుతున్నావు? నీక్కావల్సిందేమీ దొరకలేదా?"

"ఎవరండీ మీరు?"

"ఎవరేమిటమ్మా, ఈ సందు చివర్లో ఎప్పట్నించో వుంటున్నాం, నీకు తెలీదా? అవున్లే, ఈ మధ్యనేగా ఆయింట్లో చేరారు! ఇంకా ఊరూ, వాడా కొత్తగా వుండడంలో వింతేముంది?"

"మిమ్మల్ని చూస్తుంటేనేమో, ఒకపక్క మా అమ్మమ్మలాగా నిండైన తెల్లని, వత్తైన జుట్టుతో, నుదుటేమో రూపాయబిళ్లంత బొట్టుతో కనిపిస్తున్నారు. కానీ, నామీదో కన్నేసి వుంచినట్లు నా వివరాలని చెబుతుంటేనే భయమేస్తోంది!"

"మీరు అమెరికానించీ తిరిగొచ్చినవాళ్లు కారూ? ఆ సంగతి ఈ వీధిలో ఎవరిని అడిగినా చెబుతారుగదా! నాకు తెలియడంలో వింతేముంది?"

"అక్కడికి వెళ్లేముందర కూడా ఈ ఊళ్లోనే వున్నాం గదా! అది గుర్తుకు రాదేం ఎవరికీ?"

"అప్పుడు మీరీ వీధిలో లేరు గదమ్మా?"

"ఆయనక్కడ రెండేళ్లున్నారు. నేను పట్టుమని పదినెల్లుగూడా లేను. అందరిలాగానే మీరూ నోరు నొక్కుకునుంటారు – బంగారంలాంటి ఉద్యోగాన్నొదిలేసి వెనక్కి రావడమేమిటని! పైగా, గ్రీన్‌కార్డ్ కూడా చేతికొచ్చిన తరువాత."

"దానిదేముందమ్మా, మీకు వెనక్కి రావాలనుంది, వచ్చారు. ఆ మల్లికార్జునస్వామే మిమ్మల్ని రప్పించుకున్నారేమో!"

"అలా అని మీరు నమ్ముతారేమోగానీ ఇంకెవరూ నమ్మరు. అంది వచ్చిన అవకాశాన్ని చేతులారా జారవిడుచుకుంటున్నామనే అంటున్నారంతా – మా అమ్మానాన్నలతో సహా! ఆ సోమేశ్వరశాస్త్రి గారయితే సరేసరి. ఆయన నోటిముందు కూదుని తన్నుకుపోయినట్లు వాళ్లావిడ ఎంత ఇదయిపోతోందో తెలుసా? ఆవిడకెన్ని విషయాలు తెలుసో! ఆర్నెల్లపాటు అమెరికాలో లేకపోతే గ్రీన్‌కార్డ్ మురిగిపోతుందట! వాళ్లకే ఇలాంటి అవకాశమొస్తే చచ్చినా వదులుకోమని చెప్పింది."

"మీ ఆయన గుళ్లో సెలవుపెట్టి అమెరికాలో వున్నన్నాళ్లూ ఆ పోస్ట్‌లో టెంపొరరీగా పనిచేశాడు గదా! మీరు అక్కడే సెటిలయితే ఆ పోస్టులోనే పర్మనెంట్ అవుతానని ఆశపడ్డాడు! ఇప్పుడేమో, వేరే పూజార్లు సెలవు పెట్టినప్పుడు మాత్రం వారానికి ఒకట్రెండు రోజులు గుళ్లో పని. మిగిలిన సమయంలో పెద్దగా వెసులుబాటు కావట్లేదు మరి! మీరు తిరిగొచ్చి అప్పుడే అయిదునెలలు కావట్లేదూ? ఈ నెలరోజుల్లో తన బతుకుబాట ఎటువైపు మళ్లుతుందో నన్న ఆందోళన అతనిది. ఇంతకీ మీ ఆయన మనసు ఎటువైపు మొగ్గుతోంది?"

"మా కాశీనాథ్‌కి రెణ్ణెల్లక్రితం ఉపనయనమైందని మీకు తెలిసేవుంటుంది. వాడికి ఎనిమిదవ ఏడు రాగానే ఆ కార్యక్రమం చేద్దామనే అక్కడ ఉద్యోగాన్నొదిలేసి వచ్చింది. తరువాత ఆయన దారిలోనే వెళ్లి వాణ్ణి వేదపాఠశాలలో చేరుద్దామని సంకల్పం. కానీ, వెనక్కి వచ్చిన తరువాత ఒక నెలనించీ ఆ నిర్ణయం సరైనది కాదేమోనని సందేహం. కానీ, నాతో ఏమీ చెప్పరు. మూడీగా వుంటున్నా రీమధ్య."

"సందేహమెందుకమ్మా? తండ్రిదారిలోనే కొడుకు వెళ్లడంలో తప్పేముంది? అది మంచిదారికాకపోతే అనుకోవాలిగానీ!"

"వెనక్కి వచ్చేముందర అక్కడ ఒకళ్లింట్లో అభిషేకం చేయించారు. ఇంటికొచ్చిన దగ్గర్నుంచీ, అదెంత పెద్దయిల్లో, ఆ యింటాయన ఎంత శ్రద్ధగా అభిషేకం చేశాడో, అవుతున్నంతసేపూ తనతో గొంతెట్లా కలిపాడో, అంత పెద్ద ఉద్యోగం అక్కడ చేస్తూకూడా ఆయనకి వేదమంత్రాలు ఎన్ని కంఠతా వచ్చోనని ఒకటే పొంగిపోవడం!"

"నేను సందేహం దేనికని అడిగితే, ఇది చెబుతున్నావేంటి?"

"అటే వస్తోంది. ఆయన తనని తాను ఒకటే తంత్రం తెలిసిన మాంత్రికుడిలాగానే చూసుకోవడం మొదలుపెట్టారు. అదే, ఆ అమెరికా ఆయన అయితే – గొప్ప ఉద్యోగం చేస్తున్నారు, ఇటు వేదాలూ నేర్చుకున్నారు. కొడుకు కూడా అలానే రెండు రంగాల్లో నిష్ణాతుడయ్యే అవకాశముంటే తను దాన్ని అనవసరంగా చెడగొడుతున్నానేమోనని సంకోచిస్తున్నారని నా నమ్మకం."

"మరి, బయట బళ్లోవేసి చూడొచ్చుగదా కొన్నాళ్లు?"

"ఆ బడికెళ్లొచ్చి చివరకు ఈయన ఆశయాలకి విలువనివ్వడం మానేస్తాడేమోనని భయం. ఇదంతా మీకెందుకు చెబుతున్నానో నాకు అర్థంకావడంలేదు. మా అమ్మావాళ్లింటికెళ్లి వచ్చిన దగ్గర్నుంచీ – అదే, అమెరికానించీ వచ్చిన తరువాత – ఆయన పరిస్థితి చూస్తుంటే బెంబేలెత్తుతోంది. ఎవరికి చెప్పుకోవాలో తెలియట్లేదు. అందుకే కాబోలు మీతో ఇలా లొడలొడా వాగేస్తున్నాను!"

"అలా అనకమ్మా! నువ్వేకదా, నన్ను మీ అమ్మమ్మలా వున్నానన్నవు? అంటే, అమ్మని గన్న అమ్మని. నాకు చెప్పుకోవడానికి భయమెందుకు? ఆయన నిన్నేమయినా అన్నాడా?"

"అయ్యో రామ! ఆయన నన్నేమయినా అంటే – ముందసలు ఆయన నాతో మాట్లాడినట్లు గదా!"

"పోనీ, నువ్వు మీ వాళ్లింటి కెళ్లొచ్చినందు కేమయినా కోపమా?"

"ఛ. ఛ. అదేం లేదండీ! కొవ్వూరునించీ వచ్చిన తరువాత అక్కడ విశేషాలు చెబుతూ, మహాశివరాత్రినాడు ఏమయిందనుకున్నారు? అంటూ మొదలుపెట్టాను. అక్కడ గోదావరి ఒడ్డున గోపాదలింగేశ్వరస్వామివారి ఆలయ ముంది కదా! అక్కడికి, మా అమ్మ కాశీని తీసుకుని వెళ్లింది. వాడు, గోదావరిలోంచి బిందెలు బిందెలు నీళ్లు మోసుకొచ్చి శివలింగమ్మీద పొయ్యడం చూశాడు. అట్లా నీళ్లు గుమ్మరిస్తుంటే శివుడికి ఊపిరెట్లా ఆడుతుందని అడిగాట్ట. నీకు మీ నాన్న బుద్ధులొచ్చెయ్‌రా అని ఆవిడ ఒకటే మురిసిపోవడం."

"మనవడికి ఆవిడ జవాబిచ్చారా, లేదా?"

"మీరూ ఆయనలాగే అడిగారు. ఆ శివుడి నెత్తిన గంగమ్మే వుండగా, ఈ బిందెల నీళ్లెంతరా? అన్నదిట మా అమ్మ. అవునుగదా, ఆ సంగతే మర్చిపోయాను – అన్నాట్ట వాడు."

"మరి మీ ఆయనకి ఆ జవాబు నచ్చిందా?"

"నేనిలా చెప్పానా? ఆయనట్లా గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయారు – ఎలక్ట్రిక్ షాక్ కొట్టినవాడిలాగా. అప్పట్నించీ ఇంట్లో వున్నప్పుడల్లా ఏదో ఆలోచిస్తూనే వుంటారు. ఆ గుళ్లో ఏం చేస్తుంటారో ఆ దేవుడికే తెలియాలి!"

"ఆయనకి తెలుస్తూనే వుందమ్మా. ఇంతకీ నువ్వు దేనికోసం బజార్లో వెదుకుతున్నావు?"

"చూశారా, ఎక్కడ మొదలుపెట్టి ఎక్కడికి చేరామో? మిమ్మల్ని చూడగానే హృదయం విప్పి చెప్పుకోవాలన్న ఆతృతలో మర్చేపోయాను. ఆయనకి దానిమ్మపళ్లంటే ఇష్టం. మామూలుగా అయితే, పొద్దున్నపూట వచ్చి కొనుక్కెడుతూంటాను. ఈయన గూర్చిన ఆందోళనలోపడి ఇవాళ చీకటిపడిన తరువాత గానీ ఆ సంగతి గుర్తుకు రాలేదు. ఇప్పుడు ఎక్కడా ఒక్క పండూ కనిపించట్లేదు."

"ఓస్ అంతేనా! ఈ సంచీ తీసుకో. దీన్నిండా దానిమ్మపళ్లే."

"అన్నింటినీ నాకిచ్చేస్తే మీరేం తింటారు? ఒక పండు చాలు."

"తీసుకోమ్మా! పిల్లలు కలదానివి. ఓ రెండ్రోజులు తినండి."

"మీరు గుడివైపు నడుస్తున్నారు. గుళ్లోకి తీసుకెడుతున్నారేమో?"

"తనకివ్వడానికి తీసుకెడుతున్నదాన్ని నీలాంటివాళ్లకిస్తే ఆ శివుడేమీ అనుకోడమ్మా. పైగా, ఆనందిస్తాడు కూడాను!"

"ఒకటి, రెండు పళ్లకయితే చేతిలో డబ్బులున్నయ్ గానీ, ఇన్ని పళ్లకి లేవు. మీ ఇంటి అడ్రస్ చెప్పండి. రేపు వచ్చి డబ్బులిస్తాను."

"గుడివీధిలో భ్రమరాంబగారి ఇల్లంటే ఎవరయినా చెబుతారు."

@ @ @

"విశాలా! ఇవాళ గుళ్లో ఎంత అద్భుతం జరిగిందో తెలుసా?"

"మీ మొహంలో ఇంత ఆనందాన్ని ఈ మధ్యకాలంలో చూళ్లేదు! అంటే, అది అద్భుతమే అయ్యుండాలి. ముందీ నీళ్లు తాగి ఆయాసాన్ని తీర్చుకుని చెప్పండి."

"గుళ్లో ఎవర్ని కలిశానో తెలుసా? మనం ఇండియా తిరిగివచ్చే ముందర డాక్టరుగారింట్లో చేసిన అభిషేకంగూర్చి చెప్పాను, గుర్తుందా? ఆయన్ని!"

"ఆయన మిమ్మల్ని వెనక్కి తీసుకెళ్తానన్నారా?"

"అసలా ప్రసక్తి రానే రాలేదు!"

"మరి?"

"గుళ్లో లింగందగ్గర కూర్చుని ఆ లింగంమీద అందరూ నీళ్లు పోస్తున్నప్పుడు ఆయన 'నమస్సోమాయ చ' అంటూ గొంతు విప్పగానే తలెత్తి చూసి గుర్తుపట్టాను. ఆయన నా ఎదురుగానే, లింగానికి అవతలపక్క కూర్చున్నారు గానీ నన్ను చూళ్లేదు. ఆయన దోసిలి పడితే వాళ్లావిడ ఒక చిన్న సంచీ విప్పి ఆయన దోసిట్లో ముత్యాలు పోసింది. వాటితో ఆయన ఆ మల్లయ్యకి అభిషేకం చేశారన్నమాట! ఆయన ఎర్ర ఉత్తరీయం, ఆవిడ ఎర్ర పట్టుచీరె రంగులో ఆ ముత్యాలు బలే మెరిసిపోయెయ్‌లే. అక్కడున్న అందరం విస్తుపోయాం. అలాంటిదెప్పుడూ

నేనే గాక ఎంతో కాలంగా అక్కడ పనిచేస్తున్నవాళ్లుకూడా ఎవరూ చూళ్లేదట! తరువాత బయటికొచ్చి ఆయన్ని కలిసి మాట్లాడాను. 'మీరు రత్నాల తోటీ, వజ్రాలతోటీ అభిషేకం చేసేలా ఆ శివుడనుగ్రహించు గాక!' అని ఆయన్ని మనసారా ఆశీర్వదించాను. దాని కాయన ఏమన్నారో తెలుసా? 'రత్నాలూ, వజ్రాలూ రాళ్లు కదండీ! అవి ఆయనకు గుచ్చుకొని బాధపెడతాయి.' అని ఒక్క క్షణం ఆగి, 'ఈ మల్లికార్జున లింగం చిన్నది కాబట్టి నా దోసిలిలో ముత్యాలు సరిపోయాయి. మీరు ఒక్క అనువాకంతో సరిపెట్టకుండా నమకంలోని పదకొండు అనువాకాలూ చదివితే చాలేవి కాదనుకోండి, అది వేరే సంగతి. ఇంతకు ముందొకసారి ఇక్కడికి వచ్చాను కాబట్టి ఇక్కడ పద్ధతి తెలిసి ఆ ఒక్క అనువాకానికీ తయారయి వచ్చాను. అందుకని ఏ అమరావతిలోనో, అరుణాచలంలోనో, కాళహస్తిలోనో ఒక్క అనువాకానికయినా సరే – ఆ లింగానికి కావలసినన్ని ముత్యాలతో – బిందెలలో నింపిన ముత్యాలతో అభిషేకం జరపగలిగేలా ఆశీర్వదించండి చాలు,' అన్నారు. అవాక్కై నిలబడిపోయాను."

"మీ నోట వింటుంటే నాక్కూడా ఆశ్చర్యంగానే వుంది. వాళ్లని మనింటికి రమ్మనమని చెప్పకపోయారా?"

"నోట మాటరాక నిలబడిపోయానని చెప్పాగా! చేత్తో దీవించానుగానీ ఏమన్నానో గుర్తులేదు. మళ్లీ ఈ ప్రపంచంలోకి వచ్చేసరికి వాళ్లక్కడ లేరు."

"పోన్లెండి. ముందు కాళ్లు కడుక్కుని భోజనం చెయ్యండి. ఇవాళ బోల్డు దానిమ్మపళ్లు దొరికాయి. భోజనమయిన తరువాత వలిచిపెడతాను.

@ @ @

"ఈ దానిమ్మగింజలు ఎంత మధురంగా వున్నయ్యో! ఇలాంటివి ముందెప్పుడూ తినలేదనిపిస్తుంది."

"ఇవాళ బజారుకి సాయంత్రం వెళ్లాను. దానిమ్మపళ్లెక్కడా కనిపించలేదు. వట్టిచేతులతో తిరిగొస్తుంటే ఒకావిడ ఈ సంచీ యిచ్చింది."

"ఏదో మాట్లాడలనిపిస్తోంది విశాలా. ఒక పక్కనించీ ఆనందం. ఇంకో పక్కనించీ ఏదో వెలితి."

"ఆనందం దేనికో అర్థమైనట్లు అనిపిస్తోంది గానీ, వెలితి దేనికండీ?"

"ఆ మల్లికార్జునుడిమీద నా నమ్మకం సంపూర్ణం కాదన్న ఎరుకవల్ల."

"మీకు నమ్మకంలో లోటని ఎవరన్నారు?"

"ఎవరో అనాలా? ప్రస్ఫుటంగా కనిపిస్తుంటే! మన కాశీ కొవ్వూర్లో గోపాదలింగేశ్వరస్వామిని శివలింగ మనుకోలేదు – సాక్షాత్తూ ఆ శివుడేనని నమ్మాడు. ఇవాళ ఆ డాక్టరుగారూ అంతే. అమెరికా వెళ్లేముందూ, తిరిగొచ్చిన తరువాతా కూడా ఈ శ్రీశైలంలో పూజారిగా వుండడం అదృష్ట మనుకుంటూనే వున్నాగానీ, ఆ శివుడి సన్నిధిలో వున్నానన్న ఆనందాన్నెప్పుడూ పొందలేదు. అదీ వెలితి."

"ఎక్కువగా ఆలోచించి మిమ్మల్ని మీరు బాధపెట్టుకుంటున్నారు."

"కాదు విశాలా. ఆ శంకరాచార్యులు శివానందలహరిలో, 'నా మనస్సు ఒక కోతి! దాన్ని నీతో తిప్పుతూ భిక్షాటనం చేసుకో; నా మనస్సు ఒక అడవి! అందులో క్రూరమృగాలుంటయ్. అందులోవుండి వాటిని వేటాడుకో. నా మనస్సు అతి మెత్తనయిన తామరపువ్వు! దానిమీద నీ సున్నితమైన పాదాలనుంచు! అని ఆ శివుణ్ణి కోరతారు. ఆ మొదటి రెండు ఉపమానాలూ నాకు సంపూర్ణంగా వర్తించడంవల్ల ఆ మూడవదాని ప్రసక్తే రాదు. మూడూకూడా ఆ శివుణ్ణి పూర్తిగా నమ్మినవాళ్లకి! కానీ, నాలాగా ఆయన ఉనికిమీదే కొద్దిగా అపనమ్మకమున్న వాళ్లకి కాదు. ఒక పక్కనించీ శివుడున్నాడని నమ్ముతూనే శివలింగాన్ని శివుడిలాగా కాక రాయిలా చూసే నాలాంటి వాళ్లకొక ఉపమానం దొరికితే ఎంత బావుణ్ణు!"

"శంకరాచార్యులవారు ఆ శివానందలహరిని ఇక్కడే రచించారంటారు కదా! ఆ మల్లయ్యే దారి చూపకపోడు."

"అబ్బ!"

"ఏమయిందండీ?"

"దానిమ్మగింజల్లో పిప్పి పళ్లసందులో ఇరుక్కుంది. గింజలు రసాన్నూరుతూ మధురంగా వుంటేనేం? వాటిని తినాలంటే ఈ పిప్పి బాధ తప్పదు కదా!"

"...... ఆ చిరునవ్వేమిటండీ?"

"మల్లయ్య మార్గం చూపించాడు. అందుకు!"

"ఎలా?"

"నా మనస్సుని ఈ దానిమ్మగింజతో పోల్చి!"

"కొంచెం ఈ మట్టి బుర్ర కర్థమయ్యేలా చెప్పండి!"

"నా మనస్సులో ఆ శివయ్యమీద భక్తి లేదని అనగలవా?"

"నేను అమెరికా వెళ్లిరాలేదని అనగలనా?"

"అదే మనస్సులో ఓ మూల ఆ శివయ్య ఉనికిమీదే అపనమ్మకముందని నాకు తెలుసు. అయితే, భక్తిని మనసునంతా ఆక్రమింపజేసి, ఆ అపనమ్మకాన్ని మనసులోంచి బయటికి పారద్రోలడానికే అహోరాత్రాలూ కృషిచేస్తున్నది. నా మనసుకి ప్రతీక ఈ దానిమ్మగింజ. ఎర్రగా మెరుస్తూ, మధుర రసాల నిముద్చుకుని మురిసిపోతూంటుంది – పిప్పిని బ్రహ్మాండంగా కప్పేస్తూ. వింతేమిటంటే, దానిమ్మపళ్లు విరగకాసేది ఆ పిప్పిని ఆధారం చేసుకుని మొలిచిన చెట్లనుంచే! కొంచెం అపనమ్మకం భక్తిని వేలంవెర్రిగా కాపు కాసేలా ఎలా చేస్తుందో?"

"ఆయన కెవరికో నెత్తిమీద యాపిలుపండు పడితే జ్ఞానోదయ మయిందట! ఈ శాస్త్రిగారికి ఒకావిడ ఇచ్చిన దానిమ్మపళ్లు తింటూ – "

"ఆవిడ అన్ని పళ్లెందుకిచ్చిందో అర్థమయింది. రేపు పొద్దున్న మన ఇంట్లో ఆ గింజలతో అభిషేకం చేద్దాం. కెంపులతో అభిషేకం చెయ్యొచ్చనే ఊహే నాకు రాలేదు ఇవాళ్టిదాకా. కానీ, ఈ గింజలు మెరుపులో వాటికేమీ తీసిపోవు. ఆ కెంపులు మెత్తదనంలో గానీ, మాధుర్యంలోగానీ వీటి దరిదాపులకి కూడా రాలేవు. ఆ శివుడికి ఎర్రటి దానిమ్మగింజలిచ్చే మెరుపుని చూడాలనుంది.

*"శ్రీ విద్యుత్కలితాజవంజవ మహాజీమూత పాపాంబుధా*
*రా వేగంబున మన్మనోబ్జ సముదీర్ణత్వంబు గోల్పోయితిన్*
*దేవా! నీ కరుణా శరత్సమయ మింతే చాలు; చిద్భావనా*
*సేవన్ దామర తంపరై మనియెదన్ శ్రీశైల మల్లేశ్వరా!*

"నీ దయ అనే శరత్కాలం వచ్చి నా మనస్సనే పద్మం వికసించిందయ్యా! ధన్యుణ్ణి! "

"మామయ్యగారు శ్రీకాళహస్తీశ్వరా అని పాడినట్లు గుర్తు."

"ఇద్దరూ ఒకళ్లేగా!"

"ఇంతకీ ..."

"ఏమిటి సందేహిస్తున్నావు? అభిషేకం గూర్చా?"

"అహఁ. గ్రీన్‌కార్డ్ – అదే, ఆర్నెల్లపాటు అక్కడ లేకపోతే మురిగిపోతుందటగా? తేలిగ్గా వచ్చింది కాబట్టి మీకు దాని విలువ తెలియట్లేదని అందరూ అంటుంటేనూ — ఈ నెలాఖర్లోగా వెడుతున్నారా అని ఆ సోమేశ్వరశాస్త్రిగారి భార్య మరీ మరీ అడుగుతోంది."

"నీకు వెళ్లాలనుందా?"

"అందరూ అంటున్నారని — అక్కడ మాత్రం నాకు బోర్ కొట్టింది. రోజంతా ఆ గుళ్లో మీరు, దాని పక్కన చిన్న ఇంట్లో ఇంకో రెండు మనలాంటి కుటుంబాలతో నేను. రోజంతా ఆ గుడివాళ్లిచ్చిన చిన్న టీవీ ముందు కూర్చోవడం లేకపోతే గుళ్లోకి పూలదండలని కట్టడానికో లేక కావలసిన వస్తువుల సమర్చడానికో పిలిస్తే వెళ్లడం. గుళ్లో సహాయం చేసినందుకు నాకు వాళ్లు ముట్టజెప్పిందేమీ లేదు. ఎక్కడికయినా బయటికెళ్లాలంటే కారు లేనిదే వీలుకాని వ్యవహారం. మీరు డ్రైవింగ్ నేర్చుకున్నారు కాబట్టి కొంచెం వారాని కొకసారయినా మమ్మల్ని బయటికి తీసుకువెళ్లగలిగారు. ఆ ఇంగ్లీషా అర్థంకాదు. నాకు మాట్లాడుకోవడానిగ్గానీ పిల్లలకి బయటికి వెళ్లి ఆడుకోవడానిగ్గానీ ఎవరూ లేరు. మూడేళ్లే కాబట్టి ఎప్పుడూ నా వేలు పట్టుకునే తిరగడంవల్ల మీనాక్షికి తెలియలేదుగానీ నాకూ, కాశీకి కూడా ఇక్కడికొచ్చిన తరువాత తెరిపిన పడ్డట్లయింది. అయితే, అక్కడ గ్రీన్‌కార్డ్ పుచ్చుకుని ఐదేళ్లుంటే సిటిజెన్‌షిప్ వస్తుందటగదా, అదేదో ముక్కుమూసుకుని గడిపేస్తే అప్పుడు వెనక్కి రావచ్చుగదా అని –"

"నాకు మాత్రం వెళ్లాలని లేదు విశాలా. ఈ మల్లయ్య సన్నిధిలోనే వుంటే ఎప్పుడో ఒకప్పుడయినా ఆయన తత్త్వాన్ని అర్థం చేసుకునేటంత భక్తి అబ్బకపోతుందా అని ఆశ. మూడేళ్ల క్రితం — గ్రీన్‌కార్డ్ మాటటుంచు. అసలు నేను అమెరికా వెడతాననుకున్నానా? అది రాసిపెట్టుంటే ఎలాగూ మళ్లీ రానే వస్తుంది."

"మీరు మళ్లీ వెనక్కి వెళ్లకపోతే, ఆ అమెరికా ఉద్యోగానికి మా ఆయన్ని మీరు రికమెండ్ చేసిపెట్టకూడదా అని ఆ సోమేశ్వరశాస్త్రిగారి భార్య ఒకటే పోరు పెడుతోంది. "

"ఎలాగూ వాక్శుద్ధి వున్నవాడే. పోనీ అలాగే చేద్దాం. "

"మరి కాశీ చదువు – వాడికి వేదపాఠశాలేనా లేక –"

"వాణ్ణి నా మార్గంలోనే నడిపిద్దామనుకున్నది మొదటగా నాకు దొరుకుతున్న ఆనందం వాడుకూడా దక్కించుకుంటాడని. అంతకన్నా కూడా, నన్ను ఇబ్బంది పెడుతున్న ఈ అపనమ్మకం వాడి జోలికి రాకుండా వుంటుందేమో, చూసి తరిద్దామని. ఈ ఇంగ్లీషు చదువులు ఆ అపనమ్మకానికి అగ్నికి ఆజ్యంలా తోడై మొదటికే మోసమొస్తుందని భయ మెలాగూ వుంది. కానీ, ఆ డాక్టరుగారిని చూసిన తరువాత ఆ చదువులకీ భక్తి లేకపోవడానికీ లంకె పెట్టనక్కర్లేదనిపిస్తోంది. "

@ @ @

"నువ్వు విశ్వేశ్వరశాస్త్రి గారబ్బాయివి! ఆయన్ని చివరిసారి కలిసింది శ్రీశైలంలోనే."

"మీ నాన్న చేయించినట్లుగా ఇంకెవరూ చేయించట్లేదని — ఆ సోమేశ్వరశాస్త్రి గారితో కలిపి — దాదాపు పదిహేనేళ్లుగా ఈయనకి అసంతృప్తి."

"మా నాన్నకీ, అమ్మకీ మీరు దైవం. నేను అమెరికా వచ్చేముందు మా అమ్మ ఈ కథని చెప్పి మిమ్మల్నొకసారి కలవమని చెప్పింది. అప్పుడు తెలిసింది — నేనివ్వాళ ఈ మార్గంలో వుండడానికి కారణం మీరు మా నాన్నకి రోల్‌మోడల్ అవడంవల్ల అని. అది నా అదృష్టమేనని చెప్పాలి — ఎందుకంటే, మా నాన్నకిలాగా శ్రీశైలం ఆలయంలో రోజూ కూర్చో గలిగే అవకాశం నాకు దాదాపు శూన్యం. ఆ ఉద్యోగాలు ప్రభుత్వ మిచ్చేవి గానీ వంశ పారంపర్యంగా సంక్రమించేవి కావుకదా! మీతో కలిసి మీ ఇంట్లో అభిషేకం చేసే అదృష్టాన్ని

పొందాలని అప్పుడే అనుకున్నాను. రమేషూ, నేనూ ఒకే కంపెనీలోనే పనిజేస్తూ ఇక్కడికి రావడం, అతను నా రూమ్మేటవడం ఈశ్వర కల్పితం. మాటల్లో రమేష్‌కీ మీకూ వున్న చుట్టరికం తెలిసింది. మీ ఇంట్లో చేసే అభిషేకాలగూర్చి అందరూ ఎంతగా చెప్పుకుంటారోనని చెప్పాడు. నేను వెంటనే ఫోనెత్తి మీ ఇంట్లో అభిషేకం చేయిస్తానంటే అది అంత తేలిగ్గా జరగదని అనుమాన మొచ్చింది. ఎందుకంటే, నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ని. అది నా వృత్తి. ఇది నా ప్రవృత్తి మాత్రమే గనుక ఏ గుళ్లోనూ పూజలు చేయించట్లేదు. అయితే, నేను రోజూనూ, వారాంతాల్లోనూ చేసే పూజలని చూసిన తరువాత రమేష్ మీకు రికమెండేషన్ ఇస్తాడన్న నమ్మకముంది. నా పూజలు చూసి భయపడి, ముందు ఎపార్ట్‌మెంట్ మారిపోతాడేమోనన్న అనుమానం కూడా వచ్చిందనుకోండి."

"మా ఇంట్లో అభిషేకం చేయించిన ఒకట్రెండు వారాల్లో మీ నాన్న ఇండియా తిరిగివెళ్లినట్లు గుర్తు. ఆయన నీకు ఉపనయనం చేసిన తరువాత ఆయన గురువుగారివద్దే చదువుకునేలా నిన్ను వేదపాఠశాలలో చేర్పిస్తానన్నప్పుడు, నీకు ఈ చదువుల ఆప్షన్‌ని అందుబాటులో ఉంచితే బావుండేది కదా అని అనిపించింది. అంటే, ఇంగ్లీషు చదువుల బళ్లో నిన్ను చదివిస్తూనే వేదాలు ఆయనే నీకు చెప్పేలా అన్నమాట – మా నాన్న నాకలాగే చెప్పారు. మీ నాన్నతో అంత చనువు లేకపోవడంవల్ల చెప్పలేకపోయాను. ..... నిజం చెబుతావన్న నమ్మకంతో అడుగుతున్నాను – నువ్వు దానిమ్మ గింజవా లేక మేలిముత్యానివా? "

"మీతో నిజం చెప్పకపోతే నన్నా శివుడు క్షమించడు. మా నాన్న కూడా మీలాగే అడగాలా వద్దా అని చాలా సందేహించిన తరువాత నన్నా ప్రశ్న వేసి జవాబు విని నిరాశ పడ్డారు."

"నువ్వలా నిజం చెప్పినందుకు నేను మాత్రం సంతోషిస్తున్నాను. ఎందుకంటే, నేను నీకు ఒక నిజం చెప్పాలి. ఆ రోజు శ్రీశైలంలో మీ నాన్నతో అలా అన్న తరువాత నన్ను నేను ప్రశ్నించుకున్నాను – నాకు నిజంగా అంత నమ్మకమున్నదా ఆయన ఉనికిమీద అని. నా గుండెమీద చెయ్యివేసి 'ఉన్నది' అని మాత్రం చెప్పలేనని అర్థమైంది. మనసులోలేని నమ్మకం మాటల్లో ఎలా బయటపడ్డదా అని ఇప్పటికీ ఆశ్చర్యపోతాను. దోసెడు ముత్యాలు ఆయనమీద పొయ్యడం నాకు ఆనందాన్నిచ్చిన మాట నిజమే గానీ, దోసెడు వజ్రాలతో అభిషేకం చెయ్యగలగడానికి నేను అంబానీనయ్యే సూచనలేం లేవు అప్పుడూ, ఇప్పుడూ కూడా. అయితే, అభిషేకం చేసేటప్పుడు అక్కడ ఉన్నది శివుడే అని అనుకోలేకపోతే, ఫలితం చేకూరడంమాట అటుంచి, అది ఒక తతంగా మాత్రమే మిగిలిపోతుందని నా అభిప్రాయం. అక్కడే నా సర్జరీల అనుభవం నాకు ఊరట కలిగించింది. నేను చేసిన సర్జరీలు అన్నీ సక్సెస్ కాలేదు. కానీ, అన్నింటిలోనూ నా ప్రయత్నం ఒక్కలాగే వున్నదని ఖచ్చితంగా చెప్పగలను, ఫెయిల్ అయిన ప్రతీదానికీ తిరుగులేని కారణాలని చూపించగలను. అందుకే, మీ నాన్న మా యింట్లో అభిషేకంలో చూపించిన శ్రద్ధ అన్నా, ఏకాగ్రతన్నా నాకు అంత గౌరవం – ప్రొఫెషనల్ కర్టెసీ అన్నమాట. ఆయన కూడా ఆ అభిషేకాన్ని ఫలితంకోసం చేయించలేదు – అదెవరు రాసివ్వగలరు? నా సర్జరీల్లోలాగే, అదేదో చేసేవాళ్ల కర్మఫలితాన్ననుసరించి వుంటుంది. సర్జరీల్లో అయితే ప్రి-ఎక్జిస్టింగ్ కండిషన్లవల్ల అంటాంలే. .... మీ నాన్న మంచి ఉపమానాన్నిచ్చారు. నేనూ ఒక దానిమ్మగింజనేనయ్యా. శంకరాచార్యులవారు శివానందలహరిలో అంటారు –

*"ఫలాద్వా పుణ్యానాం మయి కరుణయా వా త్వయి విభో*
*ప్రసన్నేపి స్వామిన్ భవదమల పాదాబ్జ యుగలం*
*కథం పశ్యేయం మాం స్థగయతి నమః సంభ్రమ జుషో*
*నిలింపానాం శ్రేణిర్నిజ కనక మాణిక్య మకుటైః –*

"అని. అంటే, నీ కరుణవల్ల నేను కైలాసానికి వచ్చినా, నాకంటే ముందు వచ్చి నీకు ప్రణమిల్లే దేవతలు తమ మణిమయ స్వర్ణకిరీటాలతో అడ్డంవచ్చి నీ పాదాలని నాకు కనిపించనియ్యకుండా చేస్తారు, నీ పాదాలనెట్లా చూడగలనయ్యా? అని. ఈ దానిమ్మగింజలిచ్చే ఆ ప్రభని ఇంకెవరూ అడ్డులేకుండా ఇక్కడే సంపూర్ణంగా తనివిదీరా ఆస్వాదించవచ్చు! మీ నాన్న ఇక్కడికి ఎంత తొందరగా రాగలరో అడుగు. టిక్కెట్టు కొంటాను. ముగ్గురం కలిసి చేద్దాం అభిషేకం దానిమ్మగింజలతో."

"అవునయ్యా, ఇంతకీ మీ అమ్మ ఆ భ్రమరాంబ గారిల్లు కనుక్కుని ఆవిడకి డబ్బులిచ్చిందా?"

"ఈ బామ్మగారు లూజ్ ఎండ్స్‌ని కలపకుండా కథని ముగించనీదు."

"మీకు కాబట్టి చెబుతాను. ముందు ప్రయత్నించిందట. ఎంత వెదికినా ఆ ఇల్లు దొరక్కపోయేసరికి, శ్రీశైలంలో గుడివీధిలో అందరికీ తెలిసింది ఒకే భ్రమరాంబ గారిల్లు అని అర్థం చేసుకున్నదట. ఉద్యోగంలో చేరిన తరువాత నా మొదటి నెల జీతమంతా అమ్మ ఆవిడ హుండీలోనే వేయించింది. సగం మల్లికార్జునస్వామివారి హుండీలో వేద్దామని నాన్న అన్నారు గానీ, ఆయన అర్థనారీశ్వరుడు గనుక ఎలానూ సగం పుచ్చుకుంటాడన్నది అమ్మ."

★★★★

(మా నాన్నగారి స్మృతికి - రచయిత)



# కథా కౌముది

## ఎవరికెవరు ఈ లోకంలో

కాకాని చక్రపాణి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ**

"**నా కొడుకు** బిజినెస్‌మాన్! మా వంశంలోనే లేరు వ్యాపారం చేసినవాళ్ళు. వీడికెలా వచ్చాయో ఆ తెలివితేటలు!" అన్నాడు రామస్వామి మహదానందంగా వెంకటేశ్వర్లుతో.

వెంకటేశ్వర్లు తన ఊరివాడు. అతడిని చూశాక రామస్వామికెంతో ఆనందం కలిగింది. చిత్తూరులో హైస్కూల్ హెడ్ మాస్టరుగా పనిచేసి రిటైరయ్యాడు. వెంకటేశ్వర్లు పలమనేరు నుండి వచ్చాడు. జిల్లా ముఖ్యం పట్నం కనుక చిత్తూరు రావాల్సి ఉంటుంది అప్పుడప్పుడు వెంకటేశ్వర్లకు.

"ఊరి సంగతులేమిటో చెప్పు?" అనడిగాడు రామస్వామి.

"ఏమున్నయ్! మామూలే! రాజకీయాలు! ఇది వరకు ఇట్టా ఉండెడిదికాదు. అన్నట్లు మర్చినా, మీ ఇల్లు అమ్మకానికి వచ్చినాది" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నిజమా ఎంత చెప్తున్నారు?"

"పది లక్షలు."

"నేను యాభైవేలకు అమ్మేసినా!"

"అదెప్పుడు, ఎనభైల్లో కదా? రూపాయి విలువ పడిపోలా?"

రామస్వామి గదిలో ఉన్న కొడుకును పిల్చి, "విన్నావా? మన ఇల్లు అమ్మకానికి వచ్చినాదట! మా తాతలకాలం నాటిది. నా దౌర్భాగ్యం, నేను అమ్ముకోవాల్సి వచ్చింది. పదిలక్షలు చెప్తున్నారంట!" అన్నాడు.

అతడు తన ఉద్వేగాన్ని అదుపులో పెట్టుకుని మాట్లాడినా తనకా ఇంటి మీద ఉన్న ప్రేమను అతడు దాచుకోలేకపోయాడు.

"ఇప్పుడు మనకా ఇల్లు ఎందు? మనం పలమనేరులో ఉండే పనిలేదు. ఒకవేళ కొని అద్దెకిచ్చినా పెట్టుబడిమీద వడ్డీకూడా రాదు" అన్నాడు సుందరం.

"అన్నీ డబ్బుతో తూచి చూస్తామా? సెంటిమెంటు అంటూ ఉంటుంది కదా? నువ్వా ఇంట్లోనే పుట్టావు. నీకు పదేళ్ళొచ్చే వరకు మనం ఆ ఇంట్లోనే ఉంటిమి. ఆ తరవాత గదా నాకు పుంగనూరుకు బదిలీ అయినాది. చివరకు చిత్తూరులో తేలినా, పలమనేరును మర్చిపోలేను"అన్నాడు రామస్వామి, స్పష్టంగా ఆ ఇంటిని కొనమని కొడుక్కు చెప్పకుండా.

"ఐదు లక్షల్లో వస్తే కొనొచ్చు" అన్నాడు కొడుకు మనస్సులోనే పెట్టుబడి ఐదులక్షలకు సుమారుగా వచ్చే అద్దెకూ లెక్క కడుతూ. ఇవాళ ఐదులక్షలు పెట్టినా, ధరలు పెరిగేవే కనుక, ఆ మాత్రం డబ్బుకు తనకు ధోకా ఉండదు.

"మీరే లోకంలో ఉన్నారు, బాబూ! పది చెప్పినవాడు ఐదులక్షలకు దిగుతాడా? అంతగా అయితే ఓ పదివేలు, ఇరవై వేలు తగ్గుతాడేమో" అన్నాడు వెంకటేశ్వర్లు.

"అయినా మనకనవసరంలేదు నాయనా! మనమేం అక్కడకు వెళ్ళి ఉండబోతుంటిమా? డబ్బు దండగ తప్ప మరేం ప్రయోజనం లేదు" అన్నాడు సుందరం.

"అదేం మాట! నేను వెళ్ళి ఉండవచ్చు. మీరూ రిటైరయినతర్వాత తాతలకాలపు ఇల్లని ఉండవచ్చు" అని మాత్రం అన్నాడు, కానీ, ఇంక ఆ విషయంపై వత్తిడి తీసుకు రావటం ఆయనకు ఇష్టం లేదు.

'నువ్వొక్కడివీ వెళ్ళి అక్కడ ఎలా ఉంటావు? కడుపు నొప్పొచ్చిన, కన్ను నెప్పొచ్చినా ఇబ్బంది కదా?' అని కొడుకు అనిఉంటే ఆయన అంత నొచ్చుకుని ఉండేవాడు కాదు. కానీ, సుందరం మాట్లాడకుండా వెళ్ళిపోయాడు, తన గదిలోకి.

వెంకటేశ్వర్లు ఆ మాటా ఈ మాటా చెప్పి "పనుంద"ంటూ వెళ్ళిపోయాడు.

రామస్వామి ఆలోచనలో పడిపోయాడు. తనకు ఆ ఇంటిమీద ఎంతో వ్యామోహం. తన తండ్రి ఉద్యోగం చేసినవాడు కాదు. స్వతంత్రమైన రైతు. వర్షాలొస్తే పొలం పండేది. లేకుంటే దుర్భిక్షమే. ఆయన జీవితంలో సుఖపడింది లేదు. తన విషయంలో తండ్రి పొరపాటు చేయలేదు. తన్ను చదివించాడు. బతుకు యుద్ధంలో పొలాలు అమ్ముకోవాల్సి వచ్చింది, కానీ, ఇంటిని అమ్ముకోవాలనే ఆలోచన ఎప్పుడూ రాలేదు. చివరకు చీనీ తోట అమ్ముతున్నప్పుడు ఆయనకు కళ్ళల్లో నీరు బొటబొటా రాలాయి. అలా భూమి పోయినా, ఇల్లు తమని కాపాడింది. తనకు తండ్రి ఇచ్చిన ఆస్తి ఆ ఇల్లే. తన బాల్యజీవితం, యవ్వనం ఆ ఇంటితో ముడిపడినవే. ఎస్.ఎస్.యల్.సి వరకు ఊరి హైస్కూలులోనే చదువుకుని, డిగ్రీకి మదనపల్లి వెళ్ళాడు. బి.టీ మద్రాసులో చేశాడు. చివరకు తను చదువుకున్న స్కూలులోనే తనకు ఉద్యోగమయింది. తండ్రి ఎవరి కాళ్ళు పట్టుకుని తనకు అక్కడ ఉద్యోగమేయించాడో తెలీదు. తనకు ఉద్యోగమైన మరుసటేడే పెళ్ళయింది. పార్వతి ఆ ఇంటికే కాపురానికి వచ్చింది. ఆ మరుసటేడే తండ్రిపోయాడు. తన తల్లి 'కొత్త కోడలు వచ్చింది, మామపోయాడ'నలేదు. ఆ కాలంలో కూడా అంత విచక్షణ ఉన్న మనిషి తన తల్లి. "ఆ పిల్లేం చేస్తది. మన కర్మ ఇట్టాంటిది" అన్నది, తన్ను సముదాయించవచ్చిన అమ్మలక్కలతో.

పోయే ముందు తన తడ్రి చెప్పాడు తనకు. "ఇక్కడ పుట్టినం, ఇక్కడ పెరిగినం. మనం ఎక్కడ పుట్టవల్నో మనం ఎంపిక చేసుకొనలేదు, ఎట్ల పోవల్నో మన ఇష్టం కాదు. నా బతుకు నాకు నేర్పింది నేను చేసినా. మా నాయన నాకిచ్చిన ఆస్తినంతా కరిగించి తింటిని. భూమిని నమ్ముకుని బాగుపడినవాడు లేడు రాయలసీమలో. అందుకనే నీకు చదువు చెప్పించినా. అంతా పోయింది కానీ, ఇల్లుంది, దీన్ని అమ్మకు. మా ముత్తాత మాతాత కిచ్చినాడు, మా తాత మా నాయనకిచ్చినాడు. నేను ఇది మాత్రమే మిగిల్చి నీకిస్తుంటిని. నీకు అన్నదమ్ముల్లేరు, అక్కచెలెళ్ళు లేరు, వాళ్ళతో పంచుకొనటానికి. ఇల్లు నాకు చెరుపు చేయలేదు. నువ్వు నీ కొడుక్కు ఇవ్వు. నీ కొడుకేం చేసుకుంటాడో నాకు తెలవదు. నా కొడుకు వరకేగా నేను చెప్పుకోగలను!"

అయితే, తను ఇంటిని నిలుపుకోలేకపోయాడు. ముందు ఖాళీస్థలం. వీధివాకిలి కటూ ఇటూ పెద్ద అరుగులు. ముందు ఖాళీస్థలం దాటగానే వసారా, దాన్ని ఆనుకునే పెద్ద హాలు, ఆ వెనక పడమటిల్లు, ఆ తర్వాత వంటిల్లు. ఇంటికి రెండు పక్కలా దొడ్డి ఉండేది. తల్లి పూలమొక్కలూ, కూరమొక్కలూ పెట్టుకునేది. వీధివైపు ఖాళీ స్థలంలో పారిజాతం చెట్టు ఉండేది. అమ్మ పూజకు తను ఆ పూలు సేకరించి తీసుకుని వచ్చి ఇచ్చేవాడు. వెనకవైపు బావి, దానిచుట్టూ పళ్ళెం. నీళ్ళు ఎక్కడో పాతాళంలో ఉండేవి. అదృష్టం బాగుండి వర్షం కురిసిన ఏడు కావల్సిన నీళ్ళు లభ్యమయ్యేవి. హాలులోనే తడికె పెట్టి ఒక భాగంలాగా చేసి, ఊరికి కొత్తగా వచ్చిన వారికి తన తండ్రి ఇచ్చేవాడు. ఆ రోజుల్లో అద్దెకివ్వటమంటూ లేదు. స్కూలుకు కొత్తగా వచ్చిన పంతులుగారో, తాలుకా ఆఫీసు గుమాస్తానో ఎవరో ఒకరు తమకు బదిలీ అయి వెళ్ళిందాకానో, లేక కొత్త ఇల్లు కట్టుకుని వెళ్ళిందాకానో ఉండేవాళ్ళు. ఆ రోజుల్లో మంచితనమలా ఉండేది. డబ్బుకు కరువేగానీ, డబ్బుకు గడ్డి కరిచేవారు కాదు.

తనకు ఇద్దరు ఆడపిల్లల తర్వాత కొడుకు సుందరం పుట్టాడు. వర్షాధారం మీద ఆధారపడిన బతుకు కాదు కనుక బడిపంతులుగా తన బతుకు ఆటుపోట్లకు గురికాకుండా ఎద్దుబండిలా సాగింది. కుదుపులు తప్పలేదు కానీ, పెద్ద గుంతలు రాలేదు. తన పెద్ద కూతురి పెళ్ళి అక్కడే చేశాడు.

పెద్దకూతురుకు స్కూలు ఫైనల్‌తో చదువు ఆపేయించి పెళ్ళిచేసినా, చిన్న కూతురుకు డిగ్రీదాకా చదువు చెప్పించాడు. ఆమె వివాహం సమయానికే తను కొంత ఇబ్బందుల్లో పడ్డాడు. తను ముందు జాగర్త ఉన్న మనిషి కనుక, ఆమె పెళ్ళికి వేరుగా డబ్బు దాచి ఉంచాడు. తనకేం ఇబ్బంది లేకుండా కూతురి పెళ్ళిచేయగలననుకున్న తరుణంలో అనుకోని అవాంతరమొచ్చింది. మన బతుకు మనం బతుకుతున్నాం, మనకే ఇబ్బంది లేదు అనుకోటానికి వీలు లేదు. మనిషి సంఘంలో బతుకుతున్నాడు కనుక సంఘపు ఆటుపోట్లకు గురికాక తప్పదు.

ఒకరోజు స్కూలులో తన సన్నిహిత మిత్రుడు రామనాథం తన దగ్గరకు వచ్చాడు, "రామస్వామీ! ఈ తరుణంలో నువ్వు తప్ప నన్ను ఆదుకునేవాళ్ళెవరూ లేరు. నాకు అత్యవసరంగా ముప్ఫయివేలు కావాలి. ఊరిలో ఇంటిమీది తాకట్టు విడిపించాలి. వేలంలోకి వచ్చింది. తాకట్టు విడిపించేస్తే మా అమ్మా నాయనా ఉండటానికి ఇబ్బంది ఉండదు. పొలమెలాగో పనికి రాకుండా ఉంది. బేరం పెట్టాను. ఇంకా బేరం రాలేదు. బేరం కుదరగానే నీ డబ్బు నీకు పువ్వుల్లో పెట్టి ఇస్తాను" అన్నాడు.

తన దగ్గర వేరుగా ఏ డబ్బూ లేదు. రెండో కూతురు పావని పెళ్ళికోసం ఫిక్స్ చేసిన డబ్బే. వడ్డీ కలిపి ముప్ఫయి, ముప్పై ఐదువేలు రావచ్చేమో! అదే మాట తను అతడికి చెప్పాడు.

"నెల రోజుల్లోపల నీకు నీ డబ్బు వాపసు చేస్తే సరికదా" అన్నాడు రామనాథం.

"సరే రేపు రా, చూద్దాం" అని అతడిని పంపించేశాడు తను.

అయితే, ఇంటిలోకి వెళ్ళగానే తన భార్యా, కొడుకూ తనని తగులుకున్నారు.

"పిల్లదాని పెళ్ళికోసం అట్టిపెట్టిన డబ్బు మీరాయనకెట్టా ఇస్తనంటరు? ఆ కడప సంబంధం కుదిరేటట్లు ఉండె పెళ్ళి సమయానికి అతడు ఆ డబ్బు సర్దలేకపోతే మనం ఉరి వేసుకుని చావాల్సిందే" అంది తన భార్య పార్వతి.

"మన చిన్న బతుకుల్లో పెద్ద ప్రామిస్‌లు చెయ్యకూడదు, నాయనా!" అన్నాడు కొడుకు.

అప్పుడతడు మద్రాసులో ఐ.ఐ.టి చదువుతున్నాడు. తనకే సలహాలు ఇస్తున్న కొడుకు మీద కోపం వచ్చింది తనకు. అయినా తమాయించుకుంటూ చెప్పాడు తను.

"నాది చిన్న బతుకే. కానీ, నేను ఈ సమాజంలో ఓ బతుకుతున్న మనిషిని. ఒకరి కష్టాలకు మరొకరు సాయపడకుండా మనం సమాజంలో ఎలా బతకగలమో నాకు తెలవదు. రేపు నాకవసరపడితే రామనాథం సాయం చెయ్యడూ?" అని.

"ఆc చేస్తాడు, రెండేళ్ళ క్రితం పిల్లవాణ్ణి మద్రాసు పంపించటానికి వెయ్యిరూపాయలు కావాలంటే ఇచ్చినాడా? 'లేవు, ఏమీ అనుకోవద్దు' అన్నాడు. అతడి దగ్గర ఎప్పుడూ ఉండదు" అంది పార్వతి.

"బావుంది, అందరూ డబ్బు రూపేణా మాత్రమే సాయపడతారా? పెద్ద దానికి కాన్పుకాక, గుర్రం వాతం వచ్చినప్పుడు ధైర్యం చెబ్తూ రాత్రల్లా ఆస్పత్రిలో మనతో కూచున్నది ఎవరూ రామనాథం కాదూ?" అన్నాడు తను.

"డబ్బు విషయం వేరు, నాయనా! ఆయన ఇవ్వలేని పరిస్థితిలో మనం ఇబ్బందుల్లో ఇరుక్కున్నట్టే కదా! వీధిలో పోయే మహమ్మారిని ఇంటిలోకి తెచ్చుకోవటం నువ్వు చేసే పని!" అన్నాడు కొడుకు.

తను ఇద్దరి మాటలూ వినలేదు. మర్నాడు బాంకుకు వెళ్ళి ఎఫ్. డి సరెండర్ చేసి రామనాథం అడిగిన ముప్పయివేలూ ఇచ్చాడు. అతడు డబ్బు పుచ్చుకుని తన ఊరు వెళ్ళాడు. ఇంటి తనఖా విడిపించుకున్నాడు, కానీ, మనిషి తిరిగి బస్సులో వస్తూ, ఏక్సిడెంటయి మరణించాడు.

తనకు ఏం చెయ్యాలో కాళ్ళూ చేతులూ ఆడలేదు. వెంటనే వెళ్ళి అతడి భార్యకు చెప్పటానికి తనకు మనస్కరించలేదు. నెలరోజుల తర్వాత ఒక రోజు వెళ్ళి తనతని భార్యను కలిసి తన దగ్గర రామనాథం అప్పుతీసుకున్న సంగతి చెప్పాడు.

"డబ్బు సంగతి నాకు తెలీదండీ! అంతా మా మామగారే చూస్తారు. ఆయన ఊరినుండి రేపొస్తారు. రేపొచ్చాక ఆయన్ని అడగండి" అందామె.

మర్నాడు తను వెళ్ళేటప్పటికి రామనాథం తండ్రి ఎక్కడికో వెళ్ళబోతున్నాడు. తను వచ్చిన పని చెప్పాడు.

"పత్రమేమన్నా ఉండినదా?" అనడిగాడు ఆయన.

"మీ ఇంటి తనఖా విడిపించటానికే అతడు డబ్బు తీసుకు వెళ్ళినాడు. స్నేహంలో, నేనేలాంటి పత్రం రాయించుకోలేదు" అని చెప్పాడు తను.

"తనఖా విడిపించటానికి అప్పుతీసుకున్నాడని నలుగురు వచ్చినారు. మీ దగ్గర పత్రం లేకుంటే మేమేమీ చేయలేం" అన్నాడాయన ముఖం కంటగింపుగా పెట్టుకుని.

తన కర్థమయింది ఆయన వ్యవహారం. పత్రంలేదు కనుక, తనకు డబ్బొచ్చేది కల్ల అని. తనలాంటి పరిస్థితిలో ఉన్నప్పుడు కడప సంబంధం ఖాయమయింది. కట్నమే ముప్పయి ఐదువేలు. పెళ్ళికి ఎంతలేదన్నా మరో ముప్పయివేలన్నా కావాలి. తన ప్రావిడెంటు ఫండులో లోను తీసుకున్నా తనకు పాతికవేలకు పైన రాలేదు. పోనీ ఆ సంబంధం వదులుకుని వేరే సంబంధం చూసుకుందామన్నా, మంచి సంబంధం. ఆడపిల్ల పెళ్ళికావటమే కష్టం. అలాంటి పరిస్థితుల్లో ఇల్లు అమ్మాల్సి వచ్చింది. యాభైవేలకు బేరం సెటిలయింది.

"మీ పిల్లవాడు కూడా వ్యక్తారి వచ్చినవాడు కనుక, అతడు కూడా పత్రంలో సంతకం చేశాడు కానీ, తనంటే మహా కోపంగా ఉన్నాడు సుందరం. తన తెలివి తక్కువ వల్లే ఇల్లును పోగొట్టుకోవల్సి వచ్చిందని అతడి నమ్మకం. అందుకే ఆ ఇంటి పేరెత్తితేనే అతడికి మంట. తనకు న్యాయంగా రావల్సింది రాకుండా చేశాడు తను అని తనమీద విపరీతమైన కోపం. తల్లిపోయినా, తనో ఇంటివాడైనా, ఇద్దరు పిల్లల తండ్రి అయినా, తన మనసులోని కినుకను అతడు విస్మరించలేదు.

కొడుకు సుందరం చురుకైన పిల్లవాడు. అతడిని మద్రాసు ఐ.ఐ.టిలో చదివించాడు. ఇంజనీరుగా స్థిరపడతాడనుకుంటే, ఎం.బియే చదివి సొంతంగా బిజినెస్‌లోకి దిగాడు. ఉద్యోగం చేసుకుంంటుంటే జీవితం స్థిరంగా గడిచిపోతుందన్నది తన అభిప్రాయం. తను చెప్పి చూశాడు కొడుక్కు ఉద్యోగం చూసుకోమని.

"ఉద్యోగంలో ఏమొస్తాది, నాయనా, ఎవడికో ఊడిగం చేయటం తప్ప. తాత రైతు, భూమిని నమ్ముకుని ఆయన ఏం బాగుపడినాడు. అందుకే ఆయన నీకు నిలకడైన ఉద్యోగం చేసుకుని బతకమని దారిచూపినాడు. నువ్వు సగటు బతుకు బతికినావు.

తాతలా ముందు చూపు చూడటంలేదు. నీలా సగటు బతుకు బతకమని ఆదేశిస్తుంటివి. నాకలా బతకటం ఇష్టంలేదు'' అన్నాడు కొడుకు, తనను ఎద్దేవా చేస్తున్నట్లు.

''నీకు పెట్టుబడికి నేను ఏమీ ఇవ్వలేను'' అన్నాడు తను.

''మనం పెట్టట మెందుకు? పెట్టేవాళ్ళు ఉన్నారు. తన డబ్బు పెట్టి వ్యాపారం చేసేవాడు తెలివైన బిజినెస్‌మాన్ కాదు, ఇతర్ల డబ్బుతో చేసేదే బిజినెస్''

కొడుకు బిజినెస్ మొదలెట్టాడు. తనలాగా తెలివి తక్కువవాడు కాదు అతడు. త్వరలోనే అభివృద్ధిలోకి రాసాగాడు. తన బిజినెస్ పార్టనర్ చెల్లెల్ని ప్రేమించానన్నాడు. పిల్లల్ని ప్రేమిస్తారు తల్లిదండ్రులు, కానీ, వాళ్ళ మనస్తత్వం తెలియకుండా ఉండదు వాళ్ళకు. తెల్సినా మమకారపు పొర కళ్ళకు కప్పేస్తుంటుంది. అరుణ బాగానే ఉంటుంది. తమ కులం పిల్లే. కానీ, ఆమె వెనక ఉన్న డబ్బే తన కొడుకుని కట్టిపడేసిందని తనకు తెల్సు. తన కొడుకు, కోడలు పిసినారులు. వాళ్ళకున్న ఆదాయానికి వంట మనిషిని పెట్టుకోవచ్చు కానీ, పెట్టుకోరు. ''మన పని మనం చేసుకోకపోతే ఎల్లా, మామయ్యగారూ?'' అంటుంది కోడలు. అది తనకు నీతిబోధ.

రిటైరయ్యాక వచ్చిన గ్రాట్యుయిటీ, ప్రావిడెంటు ఫండు వగైరా రిటైర్‌మెంటు బెనిఫిట్లను అతడు ఖర్చుచేశాడు, ఇద్దరి కూతుళ్ళకు చెరి లక్ష ఇచ్చి కొడుక్కు మిగిలిన మూడు లక్షలూ ఇచ్చాడు. తనకు పెన్షను వస్తుంది కనుక, తన దైనందిన జీవితానికి ఇబ్బందిలేదు. రోగం రొష్టూ వస్తే పిల్లలే ఉన్నారన్న ధీమా అతడిది.

ఆ ధీమా రిటైరయిన కొత్తల్లోని మాట. అతనికి ఇప్పుడంత ధీమా లేదు. తనకు రోగం వస్తే ఇంట్లో ఎవరూ పట్టనట్టు ఉంటారు. తాముంటున్న దగ్గరనే డాక్టరు క్లినిక్ ఉంది కనుక తనే వెళ్తాడు. తనకు డ్యూటీలున్నాయి. పొద్దునే లేచి పాలు తేవాలి. మనవడు పొద్దున స్కూలుకు వెళ్ళే బస్సు ఉదయం ఏడున్నరకు వస్తుంది, వీధిమూలకు. తను పిల్లవాడిని తీసుకు వెళ్ళి బస్సు ఎక్కించి రావాలి. మనవరాలి స్కూలు దగ్గరలోనే. కనుక పిల్లను స్కూలులో దించి రావాలి. ఎలక్ట్రిసిటీ బిల్లు, వాటర్ బిల్లు కట్టి రావాలి. కొడుకూ, కోడలికి తీరిక ఉండదు. వారానికి ఒక రోజు మార్కెట్టుకు వెళ్ళు కూరలు తేవాలి.

పిల్లలను స్కూలుకు దించటం తనకు ఆనందమనిపించింది. అయితే, ఒంట్లో బాగుండక పోయినా తన పని తనే చెయ్యాలన్నట్లు కొడుకూ, కోడలూ ప్రవర్తించటంతో అతడికి కష్టమనిపించిది. ఒకసారి, ఇలాగే బద్ధకించి, వెళ్ళలేకపోతే, ''ఏమిటీ పిల్లల్ని దింపటానికి వెళ్ళటంలేదట'' అనడిగాడు కొడుకు.

''నాకు ఒంట్లో బావుండలేదు. నువ్వు దింపి రా'' అన్నాడు.

సుందరం ఒళ్ళు పట్టి చూసి, ''జ్వరం లేదు. నాకు వీలుకాకేగా ఆ బాధ్యత నీకప్పగించింది. పొద్దున లేచినప్పటినుంచీ లాప్‌టాప్‌లో లెక్కలు చూసుకోటమే సరిపోతున్నది. లేచి దించిరా'' అన్నాడు సుందరం.

''బద్ధకంగా ఉందిరా. ఇవాల్టికి ఆ లాప్‌టాప్ పని కట్టి పెట్టి వెళ్ళిరా.''

''బద్ధకంగా ఉందంటే ఎలా నాయనా! మన పని మనం చేసుకోకపోతే ఎవరు చేస్తారు? అరుణ మనందరికీ వండి పెట్టటంలా బద్ధకిస్తున్నదా?'' అన్నాడు.

ఆ మాటలతో తనకు మండిపోయింది. ''ఏమిటిరా, ఈ డ్యూటీలు చేస్తేనే నాకు తిండి పెడ్తారా?''

''నువ్వు పరాయి మనిషిలా మాట్లాడితే ఏం చెప్పగలను? నీకూ పొద్దుపోతుంది కదా అని ఆ పని అప్పచెప్పాను, మేం చేసుకోలేక కాదు. ఇట్లా తిక్కగా మాట్లాడతావనే అమ్మ ఎప్పుడూ బాధ పడేది'' అంటూ దురుసుగా కొడుకును, ''పదరా, వెధవా? రోజూ నిన్నెవరో ఒకళ్ళు దింపాలా? వెళ్ళి చావలేవూ?'' అని కొడుకుని ఒక దెబ్బ వేశాడు. వాడు ఏడవటం మొదలు పెట్టాడు.

వంటింట్లోనుండి కోడలు పెద్దగా అరిచింది, ''వయసు మళ్ళిన వాళ్ళు మునగదీసుకు పడుకుంటుంటే, నా కొడుకు, పసివెధవను చావమని తిట్టటమెందుకూ? మీరెవరూ దిగబెట్టనక్కరలేదు, నేను దిగబెట్టి వస్తాను. ఎవరికి తప్పినా నాకు తప్పదు కదా? కుంభం లాగించడానికందరూ సిద్ధమే, పనంటే బద్ధకంగా ఉంటుంది'' అని భర్తను విదిలించి కొడుకుని తీసుకు వెళ్ళింది.

ఆ తర్వాత కూతురునూ దిగబెట్టి వచ్చింది. అయితే, ఆ పూట తిండిలోకి వ్యంజనాలేం లేవు. ఇన్ని పనులు చెయ్యటం సాధ్యంకాదు కదా? తనూ ఆఫీసుకు వెళ్ళాలి కదా? కొడుకు ఏదో కతికి వెళ్ళాడు. తనకు బ్రేక్‌ఫాస్టులూ వగైరా తినే అలవాటు లేదు. తన పూజా పునస్కారమై, పన్నెండు గంటలకు భోజనం చేద్దామని కూర్చుంటే అన్నం తప్ప కోడలు వండిందేం లేదు. ఆవకాయ, మజ్జిగ పోసుకుని లేవాల్సి వచ్చింది.

ఇవాళ తను బద్ధకించాడు కదా అని తన డ్యూటీలు మారవు. తను చేయవలసిందే. చేయకపోతే, బద్ధకిస్తే మామను ఎలా దారికి తీసుకురావాలో కోడలుకు తెలుసు. ఎప్పుడైనా ఆహారంలోకి సరిగా లేక, ''వంట బాగా లేదమ్మా ఇవాళ'' అని అన్నాడా, ఇంక ప్రమాదం ముంచుకొస్తుంది.

''కూరలు తరగటం నుండి అన్నీ నేనే చేసుకు ఛస్తున్నాను. ఇంట్లో ఎంత మందున్నా నా సాయానికి ఎవరైనా వస్తారా అంటే ఎవరికీ తీరికుండదు. చేస్తున్నది కాక వంకలు. మిమ్మల్ని కాదులెండి మామయ్యగారు. ఆయన సంగతి. వంకాయ పచ్చడి ఎండుమిరపకాయలతో చేశానట. మీకు పచ్చి మిరపకాయలతో చేస్తే పడదని ఎండు మిరపకాయలతో చేశాను. నా ఖర్మ. ఒళ్ళు విరిగేట్టు చేసినా ఎవర్నీ మెప్పించలేను.''

పక్కన భోజనం చేస్తున్న కొడుకు, జోకు వేస్తున్నట్లు, ''ఈవిడ ఇలాగే చేస్తుంది. హోటల్లో తినేద్దాం, నాయనా! అప్పుడు తిక్క కుదురుతుంది'' అన్నాడు.

ఆ తిక్క ఎవరికో తనకర్థం కాకపోలేదు. తన్ను హోటల్లో భోజనం చెయ్యమని అన్యాపదేశ సందేశం. అప్పుడే తనకక్కడనుండి పారిపోవాలనిపించింది. కానీ ఎక్కడికి వెళ్తాడు కొడుకుని వదిలిపెట్టి? అది ఇద్దరకు పరువుతక్కువ పని అవుతుంది. ఈ పరువు తనను బతకనిచ్చేట్టూ లేదు చావనిచ్చేట్టూ లేదు.

''నాయనా! నాకు అర్జెంటుగా మూడు లక్షలు కావాలి. నీ పెన్షనులో ఏం ఖర్చు కావటం లేదుగా? బాంకులో ఏమాత్రం బాలెన్సు ఉందేం?'' అనడిగాడు ఓ సారి కొడుకు.

''ఏమో, గుర్తులేదు. నువ్వడిగిన డబ్బిస్తాను. ఎప్పుడిస్తావు?'' అనడిగాడు తను.

కొడుకు ఇలా డబ్బు తీసుకోటం మొదటిసారి కాదు, ఐదారుసార్లు అయింది. తనకు ముప్ఫయి వేల దాకా పెన్షను వస్తుంది. పూజా పునస్కారాలకు, దానధర్మాలకు అయ్యే ఖర్చు తప్ప మరో ఖర్చు లేదు. తిండి తింటున్నందుకు కొడుక్కు డబ్బివ్వాలని తెలియని అజ్ఞానంలో తనున్నాడు. నాలుగు సార్లు డబ్బు తీసుకుని తిరిగి ఇవ్వకపోయిన మీదటగానీ, తనకా విషయం అర్థం కాలేదు. వారం రోజుల్లో తిరిగిస్తానని తీసుకుని ఆ మాటే మర్చిపోయేవాడు సుందరం. అందుకే అలా అడగాల్సి వచ్చింది తనకు. తన బాంకులో డబ్బు మురిగిపోకుండా జాగ్రత్తపడుతున్నాడు కొడుకు.

''నువ్వు మాత్రం ఏం చేసుకుంటావు? తిరిగ్గా ఇస్తాను. ఇప్పుడు కొంచెం ఇబ్బందిలో ఉన్నాను'' అన్నాడు స్పష్టంగా. తనకు అర్థమయింది.

ఆ తర్వాత కొడుకు డబ్బు అడిగినా, ''నా దగ్గర అంత డబ్బు లేదురా! ఈ వయసులో కాస్తంత బాంకులో డబ్బు ఉంచుకోకపోతే, మిమ్మల్నే 'నువ్విస్తావా, నువ్విస్తావా' అని అడగాల్సి వస్తుంది'' అని మరో మాటకు తావివ్వకుండా తను గుడికి వెళ్ళిపోయాడు.

ఇలా మరి రెండు సార్లు జరిగాక సుందరం ఏమనుకున్నాడో తన్ను డబ్బు అడగటం మానేశాడు.

వెంకటేశ్వర్లు వచ్చి వెళ్ళిన సాయంత్రం రామస్వామి గుడికి వెళ్ళి అప్పుడే తిరిగి వస్తున్నాడు. పిల్లలు ఆడుకుంటున్నారు. సుందరం, అరుణ కాఫీ తాగుతూ మాట్లాడుకుంటున్నారు. "ఈ తద్దినాన్నికూడా మనతో చెన్నయ్ తీసుకు వెళ్ళాలా?" అంటోంది కోడలు.

"చూద్దాం, నువ్వు దిగులు పడకు. నేను ఏదో ఒకటి చేస్తాగా?" అన్నాడు కొడుకు. ఆ పిమ్మట తండ్రి రావటం చూసి, "అదుగో నాయన వచ్చినాడు, ఆయనకు కాఫీ ఇవ్వు" అన్నాడు.

అయితే రామస్వామికి అప్పుడు ఆ తద్దినమెవరో అర్థం కాలేదు. రెండు రోజుల తర్వాత కొడుకు వచ్చి తన పక్కలో కూర్చుని, "మొన్న నేను పుంగనూరు వెళ్ళి వచ్చాను. నీకా ఇంటిమీద ఉన్న వ్యామోహం నేను అర్థం చేసుకోగలను. వెంకటేశ్వర్లు మామయ్యను కలిసి ఆయనను తీసుకుని ఇంటి యజమానితో మాట్లాడాను. కిందా మీదా పెడితే చివరకు ఎనిమిది లక్షలకు బేరం సెటిలయింది. యాభైవేలు అడ్వాన్సు ఇచ్చాను. రేపు గురువారం రిజిస్ట్రేషను. నా దగ్గర డబ్బు కొద్దిగా టైట్‌గా ఉంది. చెన్నయ్‌లో బ్రాంచి ఓపెన్ చేస్తున్నానా? అందుకే ఆ పరిస్థితి. నీ దగ్గర ఎంత డబ్బుంది? ముందా ఇల్లు మన సొంతమయితే మిగతా సర్దుబాటులు మనం చూసుకోవచ్చు" అన్నాడు.

రామస్వామికి కొడుకు చెన్నయ్‌లో బిజినెస్ ప్రారంభం చేస్తున్నాడన్నది వార్త. అయితే అతడి దృష్టి దానిమీద లేదు. కొడుకు తన ఇంటిని తిరిగి తనకు కొని ఇస్తున్నాడని ఆనందమేసింది. "ఏడు లక్షలుంటాయేమోరా? మరి రిజిస్ట్రేషను అదీ ఎంతవుతుందో?" అన్నాడు.

"ఆ డబ్బు డ్రా చేసి పెట్టు. గురువారం పొద్దున పుంగనూరుకు వెళ్తున్నాం. ఇంటికి ఇమీడియెట్‌గా చెయ్యాల్సిన రిపేర్లు ఏవీలేవు. వాళ్ళ బుధవారమే ఇల్లు ఖాళీచేసి, రిజిస్ట్రేషను కాగానే మనకు హాండోవర్ చేస్తారు. నువ్వు అక్కడ ఉండి ఏవేం చెయ్యాలో చూడు. నేను తిరిగి రాగానే ఫామిలీని చెన్నయ్‌కి షిఫ్టు చేస్తాను. నువ్వు మెల్లగా వద్దువుగాని. కనుక, నీ బట్టలు, నీ వస్తువులు, కావాల్సిన సామానులు తీసుకుని బయలుదేరు."

తన ఇల్లు వశమవటం రామస్వామికి ఆనందదాయకం. ఇల్లు రిజిస్ట్రేషను అయింది. రామస్వామి మళ్ళా తన ఇంటి యజమాని అయాడు. ఆ అనందంలో కొంత కాలం ఓలలాడాడు. స్వతంత్రంలో కొంత కష్టం కూడా ఉంటుంది. అది శారీరిక కష్టమే కానీ మానసికమైన కష్టం కాదు. వంట వండుకోవాలి. లేకపోతే హోటల్‌లో తిని రావాలి. పనిమనిషిని పెట్టుకున్నాడు. అంతా బాగానే ఉంది అనుకున్నాడు.

కొడుకు తనకు జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాక, తన ఆనందం కొంత ఉపశమించాక, అప్పుడు గుర్తుకు వచ్చింది, తన కొడుకూ, కోడలి సంభాషణ అతనికి. ఇప్పుడు అతనికి అర్థమయింది ఆ 'తద్దిన' మెవరో. తన కొడుకు తనను వదిలించుకోవాలని చూశాడు కానీ, తనకూ వాళ్ళన్ని వదిలించుకునే మార్గం చూపాడని అతనికి తెలియనందుకు సుందరం మీద జాలిపడ్డాడు రామస్వామి. అలా అనుకున్నా, తన మనుమలనుండి దూరమవటం అతడికి కొద్దిగా బాధనిపించింది. అయినా వాళ్ళు తన పిల్లలు కాదు. వాళ్ళ పిల్లలు. తన పిల్లవాడే తనక్కరలేదు అనుకునే తరుణంలో, వాళ్ళెవరు తనకు అనిపించిందతనికి. తన తండ్రి అన్నాడు, "నా కొడుకు వరకేగా నేను చెప్పుకోగలను" అని. తను ఆ పరిస్థితిలో కూడా లేడు.

అలా అనుకునీ మనస్సును అదుపులో పెట్టుకోలేకపోయాడు. రెండు నెలలయినా కొడుకు ఫోను కూడా చేయలేదు. తను చేస్తే, "ఇప్పుడు బిజీగా ఉన్నాను నాయనా, తరవాత నేనే చేస్తాను" అని జవాబిచ్చాడు కానీ, ఆ తరవాత మళ్ళీ ఫోను చెయ్యలేదు. అయినా తను బతగ్గలడు.

కూరలు తెచ్చుకోటానికి సంచితో బయల్దేరి, 'ఎవరికెవరు ఈలోకంలో' అనుకున్నాడు రామస్వామి.

రోజులు మారిపోయాయి. తల్లిదండ్రులకూ స్వేచ్ఛకావాలి. పిల్లలే తన బతుకు అనుకునే రోజులు కావివి. ఆ రోజులు ఉమ్మడి కుటుంబాలు విఘటితమవటంతోనే పోయాయి. వ్యక్తి కుటుంబాలు వచ్చాక కొడుకు కుటుంబం వేరు, తండ్రి కుటుంబం వేరు. ఆర్థికపరంగానూ, మరో విధంగానూ ఒకరిపై ఒకరు ఆధారపడకూడదు. ఆధారపడితే సహించే రోజులు కావివి. కొడుకుకే కాదు, తండ్రికీ తన వైయుక్తిక జీవితం అవసరం.




# చివరకు మిగిలేది

నాగేశ్వరరావు

నాకు వరదరాజులంటే కోపం. వాడి తిక్క పనులు తలతిక్క ఆలోచనలు చూస్తే ఎవడికైనా చిరాకు పుడుతుంది. ఒక్కోప్పుడు అనిపిస్తుంది ఇలాటివాళ్ళు కూడా ఉంటారా అని. అందుకే వాడిని వదిలించుకోవాలని ఎన్నోసార్లు ప్రయత్నం చేసాను. నావల్ల కాలేదు. ఎందుకంటే వాడంటే నాకు ఇష్టం కూడా ! వరదరాజులు నా బాల్యమిత్రుడు. ఆరోతరగతినుండి నా సహధ్యాయి. అప్పటినుండి కూడా నాకు వాడు శత్రువే. వాడు NTR ఫాన్, నేను ANRకు. అగ్గిపిడుగు సినిమాలో కళాఖండము చూడమనేవాడు, నాకు మండేది. ఏ మూగమనసులులోనో, బాటసారిలోనో చూడగలము కానీ బోడి అగ్గిపిడుగు, బందిపోటులో చూడలేముగా. పైగా అవి NTR సినిమాలు. ఆ మాటంటే తగాదాకు వచ్చేవాడు. తన్నుకునేవాళ్ళము.

అయినా వాడిని వదులుకోలేకపోయేవాడిని. కారణం వాడితో కాలక్షేపం బాగుండేది. నవ్వించేవాడు. ఏదో విషయం మీద కబుర్లు చెప్పేవాడు. పైగా వాడి దగ్గర ఎప్పుడూ పావలాకు తగ్గకుండా ఉండేది. అప్పట్లో పావలాకు చాలా వచ్చేవి. నాకు మానాన్న ఎప్పుడూ పైసాకూడా ఇచ్చేవాడు కాదు. మరి ఎట్లా పట్టేవాడో కానీ వాడు రోజూ పావలాతో స్కూలుకు వచ్చేవాడు. అంటే నా కన్నా ధనికుడన్నమాట. దారంటా ఆ పావలాతో ఏమేమి కొనుక్కుని తినవచ్చో ఊరించి ఊరించి చెప్పేవాడు. పైసాకొకటిచ్చే మామిడికాయముక్కల గురించి వాటి అద్భుతమైన రుచి గురించి దారంటా వివరణాత్మకంగా వర్ణించి చెప్పేవాడు. వాడు చెబుతున్నంతసేపూ నాకు నోరూరిపోయేది. ఇంకేముంది స్కూలుకు వెళ్ళంగానే చేసే మొదటిపని ఇదేనని ఆశపడేవాడిని. తీరా కొనేప్పుడు మామిడికాయ ముక్కలు కాకుండా ఏ జాంకాయో కొనేవాడు. నాకు ఏడుపొచ్చేసేది. మండిపోయి తగాదాకు దిగేవాడిని. వాడు ఊరడించకపోగా "ఎందుకురా ఏడుస్తావు? మనము మామిడికాయను తినేసామనుకో దాని మీద థ్రిల్లు పోతుందిరా, అదే తినలేదనుకో దాని మీద ఇంట్రస్టు అట్లాగే ఉంటుంది మళ్ళీ ఇంకోసారెప్పుడైనా తినాలనిపిస్తుంది. " ఆ వెధవ లాజిక్కు వినగానే ఒళ్ళుమండి నాలుగు తన్నాలనిపించేది. కానీ తన్నలేకపోయేవాడిని. అది నా బలహీనత.

లక్కీగా పీయూసీ లో వాడు నాకు తగలలేదు. హమ్మయ్య అనుకున్నాను. ఇక వీడి పీడ శాశ్వతంగా వదిలిపోయింది అని ఆశించాను. ప్రశాంతంగా చదువుకోవచ్చనుకున్నాను. చదువుకున్నాను కూడా !

కానీ విధి బలీయం. రాతను ఎవరు తప్పించగలరు. నాకు పీయూసీలో మంచి మార్కులు వచ్చాయి. కాలేజీలో చేరాను. క్లాసులోకి అడుగుపెట్టగానే స్తాణువునై నిలబడిపోయాను. ఎదురుగా వరదరాజులు. నన్ను చూసి ఇకిలిస్తున్నాడు. ఖర్మరా అనుకున్నాను. నాకు బాక్‌బెంచ్ కావాలి. వీడూ అక్కడే తగలడ్డాడు. తప్పలేదు. వాడి పక్కనే కూర్చున్నాను. వదిలించుకోలేని, వదులుకో బుద్ధికాని మా స్నేహం

మళ్ళీ మొదలు. అయితే ఈసారి వాడి మీద ఆధారపడాల్సిన అవసరం నాకు లేదు. ఏందుకంటే మానాన్న నాకు డబ్బులిస్తున్నాడు. అయినా వాడిని వదిలించుకోలేక పోయాను.

ఆరోజుల్లోనే డ్రీమ్‌గరల్ హేమమాలిని నటించిన సప్నోంకాసౌదాగర్ రిలీజయ్యింది. హేమమాలినిని చూస్తూంటే మాకు ఒళ్ళు పులకరించి పోయేది. సరిగ్గా ఆ సమయంలోనే మా కాలేజిలో కూడా ఒక డ్రీమ్‌గరల్ జాయినయ్యింది. మళ్ళీ మాకందరికీ పులకరింతలు మొదలు. ఆ అమ్మాయి పేరు విశాల. ఆమె  ఎవరినీ పట్టించుకున్నట్లు దాఖలాలేమీ లేవు. అయినా మానవప్రయత్నాలు చేయాలిగా. ఎవరి ప్రయత్నాలు వాళ్ళు గుంభనగా చేసుకునేవారు. అన్నీ ఒన్ వే ట్రాఫిక్కులే ! నిజాయితీగా చెప్పాలంటే నేను ఇలాటి ఐహికవాంచలకు అతీతుడ్ని. అందుకే నా రుమాలు విసరలేదు. వీళ్ళను మాత్రము గమనిస్తుండేవాడిని.

ఒకరోజు వరదరాజులు దిగులుగా కనిపించాడు. మామూలుగా వాడిమూలంగా నేను దిగులుగా ఉండాలి. మరి వాడెందుకున్నట్లు.

"ఏమైందిరా? " అని ఆడిగాను.

"ఇంజినీరింగ్ కాలేజీలో సీటు వచ్చింది, జాయినవ్వాలి " అని చెప్పాడు.

"మరి చేరొచ్చుగా? " అని ఆడిగాను.

"నాకు ఈ కాలేజీ వదలి వెళ్ళాలని లేదురా ! "

"ఏం ? "

"ఏమో మరి, వెళ్ళను. "

అలాగే వెళ్ళకుండా భీష్మించుకు కూర్చున్నాడు. చివరకు వెళ్ళలేదు. సీటు వదులుకున్నాడు. ఇంట్లోవాళ్ళు ఎంత గొడవ చేసినా లాభం లేకపోయింది. ఆ రోజుల్లో ఇంజినీరింగుకు డిమాండు బాగానే ఉండేది. అయినా ఈ తిక్కవెధవ సీటు వదులుకున్నాడు.

తర్వాతెప్పుడో అడగ్గా అడగ్గా కారణం చెప్పాడు. "విశాలను వదిలి వెళ్ళలేకపోయానురా " అని. నాకు అందులో పెద్దగా ఆశ్చర్యపడాల్సిందేమీ కనపడలేదు. ఎందుకంటే ఇలాటి తిక్కవెధవ ఇంతకంటే గొప్పగా ఏమి చేస్తాడు ?

"అటువైపునుండి ప్రోత్సాహమేమైనా ఉన్నదేమిరా ? " అని అడిగాను.

" లేదు " అని క్లుప్తంగా చెప్పాడు.

ఉండదని నాకు ఖాయంగా తెలుసు. ఎందుకంటే పోటీపడుతున్న ఔత్సాహికుల్లో చాలా మంది కంటే వీడు నాసి. అయినా స్నేహధర్మంగా వాడికి సహాయం చేయాల్సిన బాధ్యత నా మీద ఉంది. అంతేకాక వాడు ఓడిపోతే చూడాలని ఏ మూలో కోరిక కూడా ఉన్న మాటా వాస్తవం.

ఆ అమ్మాయిని ఎలాగైనా పలుకరించమని ప్రొత్సహించేవాడిని. ధైర్యం చెప్పేవాడిని. నాలుగైదుసార్లు నా బలవంతం మీద పలుకరిస్తానికి ప్రయత్నం చేసాడు. వాడికి ధైర్యం కలిగించడానికి నేను కొంచెం దూరంలో నిలబడి ఉండేవాడను. ప్చ్. దగ్గరకు వెళ్ళేప్పటికి పలుకరించటము సరే ఒళ్ళంతా తడిసి ముద్దయి  పోయేది. నా దగ్గర గంటలు గంటలు సొల్లు కబుర్లు చెప్పేవాడు కానీ తీరా దగ్గరకు వెళ్ళేప్పటికి వెధవకు నాలుక పిడచకట్టుకు పోయేది. నోరు పెగిలేది కాదు. పారిపోయి వచ్చేసేవాడు.

ఈ పాటికి నాకు కూడా ఈ విషయంలో ఇన్వాల్వుమెంటు పెరిగిపోయింది. ఎందుకంటే ఇప్పుడు నాది గురువు హోదా ! వాడిప్పుడు నా శత్రువు కాదు శిష్యుడు. ఎలాగైనా వాడిని గెలిపించాలి. ఫేస్ టూ ఫేస్ జరిగే పని కాదని తేలిపోయింది. మనసుంటే మార్గాలే కరువా ! నోరు పనిచేయకపోతే మాత్రమేమి చేతులున్నవిగా. చాలా కష్టపడిఇద్దరమూ కలసి ఒక అద్భుతమైన ప్రేమలేఖ తయారు చేసాము.

కాళిదాసు వర్ణించిన మేఘసందేశం కంటే మేము తయారు చేసిన లేఖసందేశం గొప్పదని నాకు ఇప్పటికీ గొప్ప నమ్మకము. అయినా ఏమి లాభం. ఆ ఉత్తరాన్ని విశాలకిచ్చే ధైర్యం చేయలేకపోయాడు. ఈ ప్రయత్నం కూడా వృధా అయిపోయింది.

వరదరాజులు మూగప్రేమ ఆ విధంగా సాగిపోతుండగానే, కాలం కూడా తన దారిన తనూ సాగిపోయింది. మా డిగ్రీ చదువు పూర్తి అయిపోయింది. ఎవరిదారిన వాళ్ళు కాలేజీనుండి బయటకు వచ్చేసాము. ఎవరి జీవితమూ మరొకరి కోసం ఆగదు కదా !

ఒకరోజు వరదరాజులు రొప్పుకుంటూ వచ్చి చెప్పాడు "విశాలకు పెళ్ళిరా " అని. మనిషి బాగా డీలా పడిపోయాడు. వాడి ఓటమి చూసి ఆనందపడదామనుకున్న నేను, నిజం చెప్పాలంటే వాడిని చూసి చాలా బాధ పడ్డాను. వాడి కంటే నేనే ఎక్కువ బాధ పడ్డాను. వాడైనా నేనైనా చేయగలిగేది ఏమీలేదు. ఒక్కోప్పుడు నిశ్శబ్దం కూడా చాలా ఓదార్పునిస్తుంది. అందుకే నిశ్శబ్దాన్ని ఆశ్రయించాను. అంతకంటే చేయగలిగింది కూడా ఏమీ లేదు.

కాలం గడిచిపోతూనే ఉన్నది. వాడికి మంచి ఉద్యోగమే వచ్చింది. నాక్కూడా! తిట్టుకుంటూనో కొట్టుకుంటూనో ఇద్దరమూ కలిసే ఉన్నాము. ఇద్దరమూ రిటైరైపోయాము. మా ఊళ్ళోనే సెటిల్ అయిపోయాము.

ఎలా పరిచయమైందో కాని విశాల వాళ్ళ దగ్గరి బంధువు మాధవి వరదరాజులుకు పరిచయమైంది. వీడికి మాధవి ద్వారా విశాల విషయాలు తెలుస్తూ ఉండేవి. వాటన్నిటినీ పూసగుచ్చినట్లు నాకు చెబుతుండే వాడు. నాకు చిరాకు కలిగేది. నీ పద్ధతి తప్పని వారించేవాడిని. వాడు మారలేదు. పాపంపుణ్యం నాదే ! నేనింతేననేవాడు.

ప్రొద్దున వరదరాజులు ఫోన్ చేసాడు. సాయంకాలం ఏ ప్రోగ్రాం పెట్టుకోవద్దు నీతో చాలా ముఖ్యమైన పని ఉంది వస్తానన్నాడు. నాకూ వేరే ఏమీ పనిలేదు. వాడి కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. నాలుగింటికనుకుంటా వాడు మహా ఉత్సాహంగా వెలిగిపోతూ వచ్చాడు.

"ఏమిటిరా ! అంత వెలిగిపోతున్నావు ? ఏమైందిరా? " అని అడిగాను.

వాడు మహా ఉత్సాహంగా చెప్పుకుంటూ పోయాడు. "ఈ రోజు మాధవి నాకు ఫోన్ చేసిందిరా. విశాల ఈ రోజు వాళ్ళ ఇంటికి వచ్చిందట! నా గురించి విశాలకన్నీ తెలుసటరా. విశాల ఎందుకోగానీ నన్ను కలుసుకోవాలనుకుంటున్నది ఈ సాయంకాలం మా ఇంటికి రాగలవా అని అడిగిందిరా! నాకంతా విభ్రమంగా ఉందిరా ! నా నలభయ్యేళ్ళ కల నెరవేరబోతుందిరా! నేను విశాలను కలుసుకుని మాట్లాడబోతున్నానురా ! " అంటూ ఉబ్బితబ్బిబ్బైపోతున్నాడు.

వాడి ఆనందం చూసి నాకూ ఆనందమనిపించింది.

వాడే మళ్ళీ " నన్ను కాస్త మాధవి వాళ్ళ ఇంటి దగ్గర దింపరా! నేను నా బండి నడిపే పరిస్థితిలో లేనురా " అని అడిగాడు.

"సరే " అని నా బండి బయటకు తీసి ఇద్దరము మాధవి వాళ్ళ ఇంటికి బయలుదేరాము. మాధవివాళ్ళ ఇల్లు కాస్త దూరం. మొదట్లో హుషారుగా మాట్లాడుతున్నవాడల్లా నెమ్మదిగా స్తబ్దుగామారిపోయాడు. మాధవి ఇల్లు అల్లంత దూరంలో ఉండగా సడెన్‌గా బండిని ఆపమన్నాడు.

"ఏమైందిరా? మాధవివాళ్ళ ఇల్లు వచ్చేసిందిగా!? "

వరదరాజులు ఏమీ మాట్లాడలేదు. చాలాసేపు మౌనం. తర్వాత నెమ్మదిగా చెప్పాడు.

"వద్దురా.. వెనక్కి వెళ్ళిపోదాం పద " అన్నాడు.

"నాకేమీ అర్థం కాలేదు. ఏమైందిరా నీకు? " అని అడిగాను.

కాసేపు మౌనం తర్వాత వాడు నెమ్మదిగా ఒక్కో అక్షరం పలుకుతూ చెప్పసాగాడు.

"విశాలను కలుసుకోవటం నాకు నలభైయేళ్ళ కల. అది ఎప్పటికీ సంభవం అనుకోలేదు రా! ప్రొద్దునా సాయంత్రము ఆ ఊహతోనే బతికాను. ఇవాళ నేను విశాలను కలుసుకుంటే రేపటినుండి కల కనటానికి ఏమీ ఉండదురా! "

అని ఆగి "ఇంక బ్రతకటానికి నాకు ఏ థ్రిల్లూ మిగలదు " అని పూర్తి చేసాడు.

ఎందుకో తెలియదు నాకు కళ్ళు చెమర్చినవి. ఒక విషాదవీచిక నా మొహాన్ని సన్నగా తాకుతూ వెళ్ళిపోయింది.

వీడు తిక్కవెధవ కాదని మొదటిసారి అనిపించింది.



కథా కౌముది

# ఏక్సిడెంట్ ఆనంద్ వేటూరి

"పది లక్షలు అవుతుంది ఆపరేషన్ కి" డాక్టర్ రఘు అన్నాడు.

"సర్ ఇది చాల అన్యాయం సర్ ఏదో మైనర్ కిడ్నీ ప్రాబ్లం అని హాస్పిటల్ లో జాయిన్ అయ్యే ముందర చెప్పారు కాని ఇప్పుడేమో ఆపరేషన్ చేయాలి అంటున్నారు" కోపంగా అన్నాడు ఆనంద్.

"దానికి నన్నేంచేయ్యమంటావయ్యా? తీసుకొచ్చిన వెంటనే తెలిసిపోవడానికి ఇది ఏమైనా చిన్ననా చితక జ్వరమా! కిడ్నీ ప్రాబ్లం.. సో ఎంత పెద్ద డాక్టర్ కి అయినా ప్రపంచంలో నువ్వు ఎక్కడికి తీసుకువెళ్ళినా తెలుసుకోవడానికి టైం పడుతుంది. అర్ధం చేసుకోవడానికి ప్రయత్నించు" అంతే ఆవేశంగా చెబుతూ "మీకు మీ భార్య ప్రాణాలు దక్కాలంటే పది లక్షలు రెడీ చెయ్యండి. లేదంటే మీ వైఫ్ ని డిస్చార్జి చేసేస్తాం తీసుకెళ్ళిపొండి. కాని ఒకటి మాత్రం నిజం ఆపరేషన్ చేయకుండా తీసుకువెళ్తే మాత్రం మీ వైఫ్ ఇంకో ఆరు నెలలకు మించి బతకదు" అని చెప్పి ఉన్న విషయాన్నీ నిర్మొహమాటంగా బయట పెట్టాడు డాక్టర్ రఘు.

ఏం చెయ్యాలో తోచక ఆనంద్ అక్కడే నేల మీద కూలబడ్డాడు. ఆనంద్ ని చూడగానే డాక్టర్ రఘు కి కొంచం జాలి కలిగింది. అతను ఆనంద్ దగ్గరకు వెళ్లి "చూడండి మిస్టర్ ఆనంద్ నిజం చాలా కఠినంగా వుంటుంది బట్ వుయ్ హావ్ టు ఫేస్ ది రియాలిటి.ఆపరేషన్ చేయ్యకపోతే మీ భార్య చనిపోతుంది అన్నది ఎంత నిజమో ఆపరేషన్ చేస్తే బతుకుతుంది అన్నది అంతే నిజం. కాబట్టి మీరు ఎంత త్వరగా డబ్బు రెడీ చేస్తే అంత మంచిది. ఆలస్యం అయ్యే కొద్ది ప్రమాదం ఎక్కువ ఆవుతుంది" కొంచెం చనువుగా హెచ్చరించాడు డాక్టర్ రఘురాం.

"కాని ఇప్పటికిప్పుడు పది లక్షలు అంటే కష్టం కదా డాక్టర్. అందులోను నాకు ఉద్యోగం లేదు. ఆస్థి అంతస్తులు లేవు తల్లి తండ్రులతో గొడవపడి సంధ్యను పెళ్లి చేసుకున్నాను.ఈ పరిస్థితులలో ఆ డబ్బు నేను ఎలా సర్ధగలను" కళ్ళనీళ్ల పర్యంతం అయ్యాడు ఆనంద్. అతను తన భార్యను హైదరాబాద్ లో ఒక పెద్ద కార్పోరేట్ హాస్పిటల్ లో జాయిన్ చేసాడు. మొదట మాములు జ్వరమే అన్నారు కాని ఇప్పుడు ఆ జ్వరం కిడ్నీ ప్రాబ్లం కింద మారి దాని ఖరీదు పది లక్షలు అయ్యింది.

"చూడు మిస్టర్ ఆనంద్, మీరు ఇలా బాధపడడంవల్ల ప్రయోజనం ఏమిలేదు. యాజ్ ఏ డాక్టర్ డబ్బు తెచ్చే వరకు నేను కూడా చెయ్యగలిగింది ఏమిలేదు. కాని మీ తండ్రిగారికి నేను చిన్ననాటి స్నేహితుడిని అవ్వడం వల్ల ఒక చిన్న మాటసాయం చేమాత్రం చెయ్యగలను" అన్నాడు డాక్టర్ రఘురాం. ఆ మాటలు వినగానే ఆనంద్ లో ఏదో చిన్న ఆశ కలిగింది. మొదటిసారి తన భార్యను తను రక్షించుకోగలను అనే నమ్మకం కలిగింది. డాక్టర్ వైపు ఆనందంగా చూసాడు.

"డాక్టర్ మీరు నాకా మాట సహాయం చేయ్యగల్గితే నేను మీకు జీవితాంతం ఋణపడి వుంటాను. చెప్పండి డాక్టర్ నన్ను ఏం చెయ్యమంటారు?" అని అడిగాడు ఆనంద్. డాక్టర్ తన రివోల్వింగ్ చైర్ లో కొంచం సర్దుకుని

"నీకు మహేంద్ర గారు తెలుసు అనుకుంటాను" అని అన్నాడు.

"అంటే మహేంద్ర అండ్ మహేంద్ర గ్రూప్ అఫ్ కంపెనీస్ చైర్మన్ మహేంద్ర గారే కదా" కొంచెం ఉత్సాహంగా అడిగాడు ఆనంద్. "అవును ఆయనే చిన్నప్పుడు మా వూరిలో ఉండేవారు. అయన నేను ఒకే చోట చదువుకునేప్పుడు నేను అయన చాల మంచి స్నేహితులం. నీకు తెలిసే ఉంటుంది మహేంద్ర గ్రూప్ పేరిట చారిటబల్ సర్వీసెస్ ఎన్నో చేపట్టారు.కావాలంటే నువ్వు ఆయనదగ్గరకు వెళ్ళు నేను నీ పేరుని రికమెండ్ చేస్తాను.ఆయన ఏదో ఒక మార్గం చూపించకపోడు. యాజ్ ఏ డాక్టర్ అండ్ యువర్ ఫామిలీ ఫ్రెండ్ నేను ఇంతకన్నా నీకు ఎక్కువ సహాయం చెయ్యలేను" అని చప్పి మహేంద్ర గారి ఇంటి అడ్రస్ తో పాటు ఒక లెటర్ కూడా రాసి ఆనంద్ కు అందచేసాడు డాక్టర్ రఘురాం.

★★★★★

"కౌన్ హాయ్ ఆప్ క్యా చాహియే ఆప్కో" ఆ ఇంటి వాచ్ మాన్ అడిగాడు.అదొక పెద్ద భవంతి తన చారిటీస్ ద్వార ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించిన రాజా మహేంద్ర భూపతి నివాసముండేది అక్కడే. పది ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడిన అత్యంత ఆధునికమైన భవనం అది. ఆ ఇంటి చుట్టూ ఉన్న ప్రహారీ గోడ ప్రపంచంలోని ఏడు వింతలలో ఒకటైన చైనావాల్ ను తలపిస్తోంది.

"రాజా సాబ్ కో మిల్నా హై"తను వచ్చిన పని ఏంటో చెప్పకుండా గూర్ఖని అడుగుతున్నాడు ఆనంద్.

"అభి నహి సాబ్ సో రహే హై. అభీ జావో ఆర్ బాద్ మే ఆవొ" నేపాలి గూర్ఖ తన ఇంటి యజమాని పట్ల విశ్వాసం చూపించడానికి అన్నట్లు ఆనంద్ ని ఆపుతున్నాడు. ఎంత బతిమాలిన ఆనంద్ కి అనుమతి లభించట్లేదు. ఇంకా ఆశ వదులుకుని వెను తిరిగిన సమయంలో "రాంలాల్, ఉస్ ఆద్మికో అందర్ భేజో" అనే స్వరం వినిపించింది. "జీ అచ్చ సాబ్" అని గేటు తెరిచాడు వాచ్ మాన్. ఆనంద్ లోపలి ప్రవేశించాడు. ఎదురుకుండా అతనికి ఒక పెద్ద విగ్రహం దాని చుట్టూ ఉన్న వాటర్ ఫౌంటైన్ కనిపించాయి. అతను మెల్లగా గార్డెన్ దాటుకుని ఇంటిలోపలకి ప్రవేశించాడు. లోపల ఎంతో సృజనాత్మకత తో నిర్మించిన కట్టడాన్ని అతను చూసాడు.

"కూర్చోండి మిస్టర్ ఆనంద్" అన్నాడు మహేంద్ర. అయన గొంతులో ఒక రకమైన గాంభీర్యత ఉంది. అది ఎలాంటి వారినైనా ఒక క్షణం భయం తో కూడిన గౌరవానికి గురి చేస్తుంది.

"నీ పేరు నాకెలా తెలుసు అని అనుకుంటున్నావా? నాకు డాక్టర్ రఘురాం ఫోన్ చేసి నీ గురించి అంతా చెప్పాడు" విస్మయంతో చూస్తున్న ఆనంద్ ని ఉద్దేశించి అన్నాడు.

"సర్ మీకు డాక్టర్ గారు చెప్పే ఉంటారు నా సమస్య గురించి. కాబట్టి నేను ఉన్న విషయం సూటిగా చెప్తున్నాను. నాకు అర్జెంటు గా మీ సంస్థ తరపు నుండి పది లక్షలు కావలి సర్ " అన్నాడు ఆనంద్. అనవసరమైన విషయాలతో కాలయాపన చెయ్యడం అతనికి ఇష్టం లేదు.

"మిస్టర్ ఆనంద్ మా సంస్థ నుంచి మీకు పది లక్షలు ఇవ్వడానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. కాని మీరు ఏదో ఒక ఉద్యోగం చేసే వారైతే మా పని కొంత వరకు సులభమవుతుంది. మీకేమో ఉద్యోగం లేదని రఘురాం చెప్పాడు. మీరు ఏదైనా ఒక ఉద్యోగం చేస్తూ ఉంటె నేను మీకు తప్పకుండా పది లక్షలు గ్రాంట్ చేయిస్తాను. ఈ విషయమ్ ఫోన్ లో చెప్పడం నాకు ఇష్టం లేక నీకే స్వయంగా చెప్దామని నిన్ను రమ్మన్నాను " అని తన నిస్సహాయతను తెలిపాడు మహేంద్ర.

"అంటే ఇంకా ఏ విధంగాను నా భార్య బతికే అవకాసం లేదా?" అని నిరాశగా అన్నాడు ఆనంద్.

"నో నో అలా ఎందుకు నిరుత్సాహపడతారు. మీ ప్రయత్నం మీరు చెయ్యండి. నేను కూడా ట్రై చేస్తాను కాని మా సంస్థ నుంచి సహాయం అందాలి అంటే తప్పనిసరిగా ఉద్యోగం ఉండాలి" అని ఉన్న విషయాన్ని బయటపెట్టాడు భూపతి. కర్ర విరగకుండా పాము

చావకుండా చెయ్యడం అంటే ఇదేనేమో అని మనసులో అనుకున్నాడు ఆనంద్. ఏమి చెయ్యాలో తోచని పరిస్థితిలో అక్కడే కాసేపు తన భార్య సమస్య గురించి మహేంద్ర గారితో అన్ని రకాలుగా చర్చించి లాభం లేదని తెలిసాక తిరిగి ఇంటి దారి పట్టాడు ఆనంద్.

★★★★★★

"ఇక్కడి నుంచి హైదరాబాద్ ఎంత దూరం?" చాయ్ బండి వాడిని అడిగాడు ఆనంద్. అతనిప్పుడు విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్ళే జాతీయ రహదారి మీదున్న ఒక చాయ్ దుకాణంలో ఉన్నాడు. మహేంద్ర గారి సంస్థ విజయవాడ లో ఉంది. అక్కడ పని సఫలం కాకపోవడం వలన అతను తన బండి మీద తిరుగు ప్రయాణం అయ్యాడు. "ఇక్కడి నుంచి ఒక వంద కిలో మీటర్లు ఉంటుంది సర్ " చెప్పాడు చాయ్ బండి అతను.

ఆనంద్ కి చాలా నిరుత్సాహంగా ఉంది. దానికి కారణం లేకపోలేదు. చిన్నపటినుంచి అతను తనకు ఏ విధంగా ఇతరులు సహాయపడతారా అనే ఆలోచించేవాడు కాని తన పని తాను చేసుకునే వాడు కాదు. అతను ఇంజనీరింగ్ చదువుతూ ఉండగా సంధ్య పరిచయం అయ్యింది. అందరి లాగే సంధ్య కూడా నాలుగవ సంవత్సరం కాంపస్ లో సెలెక్ట్ అయ్యింది. సంధ్యకి మొదటి నుంచి ఆనంద్ అంటే వాళ్ళ మాలిన అభిమానం, ప్రేమ. కారణం ఆనంద్ అమాయకత్వం, తెలివితేటలు కావచ్చు లేదా మరింకేదైనా కావచ్చు. జీవితంలో కొన్ని కొన్ని సంఘటనలు చాల యాదృచ్ఛికంగా మాములుగా జరిగినా అవి మన మీద బలమైన ప్రభావం చూపిస్తాయి.కారణం ఏమైనప్పటికీ సంధ్యకి మొదట్లోనే ఆనంద్ బాగా నచ్చాడు.

కాని ఆనంద్ ఎప్పుడు సంధ్య విషయంలో ప్రేమ గురించి ఆలోచించలేదు. ఎందుకంటే అప్పటికింకా అతను నిరుద్యోగి. పైగా తల్లి తండ్రులంటే అభిమానం గౌరవం భయం ఉన్నాయ్. కాని సంధ్య అంటే ఏ మూలో ప్రేమ లేకపోలేదు. ఒకసారి సంధ్య కొంత చొరవ తీసుకుని ఆనంద్ పట్ల తన ఇష్టం తెలియచేసింది. ఎలాగో తను ఉద్యోగం చేస్తుంది కదా ఏదో ఒక విధంగా ఆనంద్ కి కూడా తన కంపెనీ లో ఉద్యోగం వేయించ వచ్చు అని సంధ్య ఆలోచించింది. సంధ్య కాంపస్ లో సెలెక్ట్ అవ్వడం వరకు బాగానే ఉంది కాని ఆ కంపెనీ నష్టాల్లో ఉండడం వాళ్ళ ఇంజినీరింగ్ పూర్తి అయ్యి ఆరు మాసాలు గడచినా ఇంకా జాయిన్ కావడానికి పిలుపు రాలేదు. ఇంకా ఎక్కువ కాలం ఇంట్లో ఉండటం ఇష్టం లేక ఏదో ఒక విధంగా బతకవచ్చు అని ఆనంద్, సంధ్య కొంత డబ్బు తీసుకుని హైదరాబాద్ వచ్చారు. ఆనంద్ సంధ్యలు ఇద్దరు ఒకే రూంలో ఉండడం గమనించిన చుట్టుపక్కల వాళ్ళు ఆరా తియ్యడం మొదలు పెట్టారు. ఇలా మంచిది కాదని ఆనంద్ సంధ్య ఇద్దరు కొంతమంది స్నేహితుల సహాయంతో వివాహం చేసుకున్నారు.

ఒకసారి అనుకోకుండా షాపింగ్ చేస్తుంటే డాక్టర్ రఘురాం కనిపించాడు. అయన వెంటనే ఆనంద్ ను గుర్తు పట్టాడు. విషయం అడగగా ఇంట్లో నుండి వచ్చేసిన విషయం సంధ్యతో పెళ్లి వివరంగా చెప్పాడు ఆనంద్. డాక్టర్ రఘురాం ఆనంద్ కి మంచి జరుగుతుందనే ఉద్దేశంతో ఆనంద్ వాళ్ళ తల్లితండ్రులకు విషయం తెలియ చేశాడు.

ఈ విషయం తెలుసుకున్న ఆనంద్ తల్లితండ్రులు జీవితంలో మళ్ళీ అతన్ని చూడకూడదు అనే నిశ్చయానికి వచ్చి అదే విషయాన్నీ అతనికి తెలిపారు. పెళ్లి ఐన ఒక సంవత్సరం వరకు కూడా సంధ్యకి తను సెలెక్ట్ ఐన కంపెనీ నుండి పిలుపు రాలేదు. వాళ్ళిద్దరూ చేసే చిన్న చితకా ఉద్యోగాలు ఇద్దరినీ బతికించేవి. మొన్న మొన్నే ఇద్దరికీ పార్ట్ టైం జాబ్స్ కూడా పోయాయి దానికి కారణం కూడా అందరికి తెలిసిన అంతర్జాతీయ ఆర్ధిక సంక్షోభమే. సంధ్యకి అనారోగ్యంగా ఉంటే మొదట కొన్ని మందులు వాడాడు తగ్గకపోతే లాభం లేదని డాక్టర్ రఘురాం సహాయంతో కార్పొరేట్ హాస్పిటల్ లో జాయిన్ చేశాడు. అప్పుడు అతనికి డాక్టర్ రఘురాం చెప్పిన అసలు విషయం తెలిసింది. ఇప్పుడు అతను తన భార్యను ఏ విధంగా ఐనా బతికించుకోవాలనే తపనలో ఉన్నాడు.

★★★★★★

తన భార్యను ఎలా అయినా బతికించుకోవాలని పరధ్యానంగా ఆలోచిస్తూ బండి మీద చాయ్ దుకాణం నుంచి ప్రయాణం అయ్యాడు ఆనంద్. రోడ్ మీద చాల వేగంగా వెళ్తున్నాడు.ఎంత ఆలోచించినా అతని కి ఎటువంటి దారి "కనిపించలేదు. "హెల్ప్ హెల్ప్"అని శబ్దం వినిపించడంతో ఆలోచనలనుంచి బయటకి వచ్చి బండిని రోడ్ పక్కన ఉన్న ఒక చెట్టు కింద ఆపాడు. శబ్దం ఐతే వినిపించింది కాని అతనికి ఆ చుట్టూ పక్కల ఎక్కడా మనిషి జాడ కనిపించలేదు. రోడ్ మీద అడపాదడపా వెళ్ళే వాహనాలు తప్ప మళ్ళీ ఆ శబ్దం కూడా వినిపించలేదు. తన భ్రమ అయ్యుంటుందని బండి దగ్గరకు వచ్చి తిరుగు ప్రయాణం అవుదాం అనుకోగానే "హెల్ప్ హెల్ప్" అని మళ్ళీ అదే ఆర్తనాదం వినిపించింది. ఈ సారి లీలగా ఆ ధ్వని వచ్చిన వైపు చూపు సారించాడు. రోడ్ కి ఎడం పక్కగా ఆ శబ్దం వస్తున్నట్లు గమనించాడు. మెల్లగా ఆ ధ్వనిని అనుసరిస్తూ పొదల మధ్యకు వెళ్ళాడు. అయినా అతనకేమి కనిపించలేదు. ఇంకొంచెం ముందుకు వెళ్లగా అతనికి మూలుగులతో కూడిన ఆర్తనాదాలు దగ్గర అయ్యాయి.

పొదలను తప్పించుకుని ఎదరకు వెళ్ళిన అతను హతాశుడయ్యాడు. కారణం అతనికి ఎదురుగా ఒక పెద్ద చెట్టుకు గుద్దుకుని నేల మీద చావు బతుకుల మధ్య వున్న ఒక వ్యక్తి చేసిన ఆక్రందనలు అవి. అతన్ని చూడగానే ఆనంద్ భయకంపితుడై "ఆక్సిడెంట్ ఆక్సిడెంట్" అంటూ రోడ్ మీదకు పరుగు పెట్టలనుకున్నాడు. కాని ముందు అతని పరిస్థితి చూడాలనుకుని దగ్గరకు వెళ్లి ముక్కు దగ్గర చెయ్యి పెట్టి చూసాడు. అతనింకా కొన ఊపిరితో ఉన్నాడు. ఆనంద్ చెయ్యి పెట్టగానే గట్టిగా మూలిగాడు అతను. భయంతో ఆనంద్ వెను తిరగబోతుంటే "సర్" అని పిలిచాడు.

"ఏంటి?" అన్నట్లు చూసాడు ఆనంద్.

"నన్ను ఈ ఆక్సిడెంట్ కి గురి చేసింది ఎవరో తెలీదు ఇప్పుడు మీరు నన్ను హాస్పిటల్ కి తీసుకు వెళ్ళే అంత వరకు నేను బతుకుతానో లేదో కూడా తెలీదు. మీరు నాకొక చిన్న సహాయం చెయ్యాలి" అన్నాడు ఆ వ్యక్తి. ఆనంద్ కి చూచాయగా విషయం అర్థం అయ్యింది. ఎవరో హైవే మీద తాగేసి వాహనం నడుపుతూ ఈ ఆక్సిడెంట్ చేసి ఉండాలి. ప్రమాదంతో అదుపు తప్పి బండి రోడ్ మీద కాకుండా ఇలా పొదల్లోకి వచ్చి పడింది. హై వే కదా ఎవరికీ కనిపించడం లేదని తెలుసుకున్న ఆక్సిడెంట్ చేసిన వాళ్ళు. తమ మీదకు కేసు రాకుండా ఉండాలని చల్లగా జారుకున్నారు. విషయం తెలీక తను వచ్చి ఇతని దగ్గర ఇరుక్కున్నాడు. ఇప్పుడు ఇతను ఏం సహాయం అడుగుతాడో ఏంటో.

"సర్ మా తల్లిగారు చావు బతుకుల మధ్య వున్నారు సర్. ఆమెకు ఆపరేషన్ కు పది లక్షలు అవసరం అయ్యింది" ఆయాసం తీర్చుకోవడానికి అన్నట్లు ఆగాడు ఆ వ్యక్తి.

కుతూహలం తట్టుకోలేక ఆ వ్యక్తిని అడిగాడు ఆనంద్.

"ఏ హాస్పిటల్ లో జాయిన్ చేసారండి?" అతను కొంత ఊపిరి తీసుకుని "కేర్ ఎమర్జెన్సీ హాస్పిటల్ లో"

వెంటనే ఆనంద్ గుండె ఝల్లుమంది ఎందుకంటే తన భార్య సంధ్యను కూడా తను అదే హాస్పిటల్ లో జాయిన్ చేశాడు.

"మా తల్లిగారికి కిడ్నీ ప్రాబ్లం సర్. ఆపరేషన్ కి పది లక్షలు అవసరమైనది.నేను విజయవాడ నుంచి మా మావయ్యగారి దగ్గర మాకు రావాల్సిన డబ్బులు తీసుకుని వస్తూ ఉండగా ఈ ఆక్సిడెంట్ జరిగింది. నేనింకా ఎంత సేపు బతుకుతానో కూడా తెలీదు. మీరు దయ చేసి సాయంత్రం నాలుగు గంటల లోపల ఎలాగైనా ఈ డబ్బు హాస్పిటల్ లో కట్టి నా తల్లిగారి ప్రాణం కాపాడండి సర్ " అని చెప్పే తన చేతుల్లో ఉన్న బాగ్ ఆనంద్ చేతిలో పెట్టి స్పృహ కోల్పోయాడు ఆ వ్యక్తి. హతాశుడై అతని వంక చూస్తున్న ఆనంద్ అతను ఇచ్చిన బాగ్ చూసి ఉలిక్కిపడ్డాడు. ఆ బాగ్ చివర అంచు కొంత మేర రక్తంతో తడిసి ఉంది.

★★★★★

"పేరేంటి అన్నారు?" అడిగింది కాష్ కౌంటర్ లో ఉన్న మధ్య వయసు స్త్రీ. "వీ.ఆర్. సంధ్యా దేవి" చెప్పాడు ఆనంద్. ఆ వ్యక్తి ఇచ్చిన డబ్బును తీసుకుని హాస్పిటల్ కు చేరుకొని ఆ డబ్బును ఆపరేషన్ కోసమై కాష్ కౌంటర్లో కడుతున్నాడు ఆనంద్. ఆ డబ్బును తన భార్య ఆపరేషన్ కి వాడుకోవడం ఎంత వరకు సమంజసమో అతనిప్పుడు ఆలోచించే స్థితిలో లేడు. తన ముందు ఉన్న లక్ష్యం తన భార్య ప్రాణాలు కాపాడుకోవడం. దానికోసం ఇంకొకరి ప్రాణాలు వెల కట్టడం ఎంత వరకు న్యాయం. ఆనంద్ లో ఇప్పుడు పాపభీతి తొంగి చూసింది. తన భార్య పేరున ఆ డబ్బు కడుతున్నప్పుడు ఆ బాగ్ అంచున చివర ఉన్న రక్తం మరక అతనిని వెక్కిరించింది. ఇంకా హాస్పిటల్లో ఉండలేక తన భార్య ఆపరేషన్ ఇంకొక రెండు గంటలలో మొదలుతుందని తెలిసి కూడా తన ఇంటికి బయల్దేరాడు ఆనంద్.

ఒక పక్క తన భార్య ఆపరేషన్ విజయవంతం అవుతుందా లేదా అనే ఆలోచన, ఇంకొక పక్క ఇతరుల అత్యవసరమైన డబ్బులు తన స్వార్ధం కోసం వాడుకుంటున్నాను అనే పాపభీతి తో పరధ్యానంగా బండి నడుపుతున్నఆనంద్ ఎదురుగా వస్తున్న ఎద్దును ను గమనించలేదు, అయితే అప్పటికే వలసిన నష్టం జర్గిపాయింది. సడన్ బ్రేక్ వెయ్యడంతో కీచు మని శబ్దం చేస్తూ చెట్టుకు గుద్దుకుంది బైక్. అంత ఎత్తున ఎగిరి ఎడం వైపుగా పడ్డాడు ఆనంద్. ""ఆక్సిడెంట్"" ఎవరో గట్టిగా అరిచారు.

★★★★★

"గుడ్ ఈవినింగ్ మిసెస్ సంధ్య ఆనంద్.మీకొక గుడ్ న్యూస్" ఉత్సాహంగా డోర్ తెరుచుకుని వచ్చిన డాక్టర్ రఘురాం అన్నాడు.

"గుడ్ ఈవినింగ్ డాక్టర్. నేను ఇక్కడున్నాను ఏంటి"నాకు ఏంజరిగింది?"అయోమయంగా అడిగింది సంధ్య. వారం రోజుల క్రితం జ్వరం తగ్గట్లేదని ఆనంద్ తనను తీసుకు వచ్చి కేర్ హాస్పిటల్లో జాయిన్ చేశాడు. అంతవరకే తనకు గుర్తుంది.ఆ తరువాత ఏమి జరిగిందో తెలీదు.

"జస్ట్ రిలాక్స్.. మిసెస్ సంధ్య మీకు ఏమి కాలేదు. మా వల్లే ఒక చిన్న పొరపాటు జరిగింది" కొంచెం ఇబ్బందిగా చెప్పాడు డాక్టర్ రఘు

"మీరు అందుకు మమ్మల్ని క్షమించాలి"అన్నాడు.

"పొరపాటా ? ఏమిటది డాక్టర్.నేను మిమ్మల్ని క్షమించడం ఏంటి" కొంచెం ఖంగారుగా అడిగింది సంధ్య.

"మిసెస్ సంధ్య నేను చెప్పేది ఖంగారు పడకుండా చివరిదాకా వినండి.వారం రోజుల క్రితం మీ భర్త జ్వరం తగ్గట్లేదని మిమ్మల్ని ఈ హాస్పిటల్ లో జాయిన్ చేశాడు. టెస్ట్లు అన్ని చేసాక మీకు కిడ్నీ ప్రాబ్లం ఉందని తెలిసింది"అని చెప్పి కొంచెం సేపు ఆగాడు. "నో" అని అరవబోతున్న సంధ్యను వారించి "ప్లీజ్ మిసెస్ సంధ్య నేను చెప్పేది పూర్తిగా వినండి. డోన్ట్ గెట్ ఎగ్జైటేడ్" అని మళ్ళి విషయం కొనసాగించాడు."మీకు కిడ్నీ ప్రాబ్లం అని తెలిసిన తరువాత మీ భర్త ఆనంద్ చాల బాధపడ్డాడు. ఎలాగైనా మిమ్మల్ని బతికించుకోవాలని నన్ను బతిమాలుకున్నాడు.నేను ధన సహాయమై నా స్నేహితుడు మహేంద్రను కలుసుకోమని మీ భర్తను విజయవాడ పంపాను. ఆయన ఇంకా తిరిగి రాలేదు. నేను ఆయన సెల్ కి రెండు గంటల నుంచి ట్రై చేస్తున్నాను స్విచ్ ఆఫ్ అని వస్తోంది" అని మళ్ళీ సంధ్య వైపు చూసాడు.

"మరి నా ఆపరేషన్ కు డబ్బు ఎలా సమకూరింది డాక్టర్?" కొంచెం కుతూహలంగా అడిగింది సంధ్య

"అదే చెప్పబోతున్నాను సంధ్య గారు.. ఈ విషయం లోనే మీరు నన్ను మా హాస్పిటల్ స్టాఫ్ అందరిని క్షమించాలి. నిజానికి మీకు వచ్చింది మాములు మలేరియా జ్వరమే కాకపోతే కొంచెం సీరియస్ గా వచ్చింది. కాని మా స్టాఫ్ అజాగ్రత్త వల్ల వేరే వాళ్ళకు వెళ్ళాల్సిన ఎక్స్ రే రిపోర్ట్స్ తారుమారు అవ్వడం వల్ల మీకు కిడ్నీ ప్రాబ్లం అనుకుని అదే విషయం మీ భర్తకు చెప్పాను" అంటూ విషయం వివరించాడు డాక్టర్ రఘురాం.

“మరి నాకు కిడ్నీ ప్రాబ్లం లేదనే విషయం మీకు ఎలా తెలిసింది?“ అడిగింది సంధ్య .

“మీ దగ్గరకు రావడానికి ముందర నేను ఒక యాభై సంవత్సరాలు పైబడిన స్త్రీకి కిడ్నీ ఆపరేషన్ కి అవసరం ఐతే మీ పక్కనున్న ఐ సి యు లోకి వెళ్ళాను. అక్కడ ఆమె కేస్ షీట్ ,రిపోర్ట్స్ చూడగానే నేను షాక్ అయ్యాను, ఎందుకంటే అందులో కిడ్నీ ప్రాబ్లంకి సంబంధించిన రిపోర్ట్స్ లేవు. ఏదో మాములు జ్వరం గురించినవి వున్నాయి అంతే. అనుమానం వచ్చి నేను ఆమె పేరు చూస్తే ఆర్. సంధ్యా దేవి అని ఉంది. నాకు వెంటనే మీ పేరు గుర్తు వచ్చింది. మీరు వీ. ఆర్. సంధ్య దేవి కదా“ అడిగాడు డాక్టర్ రఘు. అవునన్నట్లు తలూపింది సంధ్య.

“వెంటనే నేను మీ రిపోర్ట్స్ తీసుకువచ్చి చూస్తే ఆవిడ ఉన్న స్థితికి సరిపోయాయి. నాకు విషయం అర్థమయ్యింది. నేను వెంటనే మీ అయన సెల్ కి ట్రై చేసాను. మీరు సెడటివ్ డోస్ వల్ల ఇంకా మగత నిద్రలో ఉన్నారు. అందుకే మీరు లేచిన తరువాత మీకు విషయం చెప్పాను” అని ముగించాడు డాక్టర్ రఘు.

”ఇంతకి డాక్టర్, ఆ కిడ్నీ ప్రాబ్లం ఉన్న ఆమెకి ఇప్పుడు ఎలా ఉంది?” కొంచెం కుతూహలంగా అడిగింది సంధ్య.

“గాడ్ ఈజ్ దేర్. ఆవిడ ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. ఇప్పుడు ఆమె క్షేమంగానే ఉంది” అన్నాడు డాక్టర్ రఘు.

“మరి పది లక్షలు అవసరం అయ్యింది ఆమె కిడ్నీ ప్రాబ్లం కి కదా వాళ్ళ బంధువులెవరైనా కట్టారా?”అడిగింది సంధ్య.

“అదే నాకు అర్థం కావడం లేదు. హాస్పిటల్ మొత్తం విచారించిన ఆపరేషన్ అయ్యిన తరువాత ఆవిడకు సంబంధించిన వాళ్ళు ఒక్కరూ కనబడలేదు. కాని ఆపరేషన్ కి అయ్యిన డబ్బు పే చేసినట్లు రిజిస్టర్ లో ఉంది. ఇది ఎలా జరిగిందో మరి“ కొంచెం అయోమయంగా అన్నాడు డాక్టర్.

“ఎలా జరిగినా కాని ఆమె క్షేమంగానే ఉంది కదా అంత దేవుడి దయ. ఇంతకి ఆనంద్ ఏమైనట్టు?””” అర్థం కానట్టు అడిగింది సంధ్య.తనకి కూడా తెలీదు అన్నట్లు భుజలెగారేసాడు డాక్టర్ రఘురాం.

★★★★★

“చాలా అదృష్టవంతుడివయ్యా. త్రుటిలో ఈ రోజు నీకు ప్రాణాపాయం తప్పింది” తన పక్కనున్న వ్యక్తి అనడంతో మెళకువ వచ్చిన ఆనంద్ చుట్టూ చూసాడు. అతని పక్కన ఒక పది మంది వరకు గుంపుగా మూగి ఉన్నారు.

”నాకు ఏమైంది?” అయోమయంగా అడిగాడు ఆనంద్.

“ఏమి కాలేదు బాబు. ఎద్దు ఎదురు పడడం వల్ల బైక్ అదుపుతప్పి చెట్టుకు గుద్దుకుంది నువ్వు అంత ఎత్తున గాలి లోకి ఎగిరావు. కానీ అదే సమయానికి అటుగా వచ్చిన ఇసుక లారీలో పడడం వల్ల నీకు స్పృహ తప్పింది. కాని ఎటువంటి నష్టం జరగలేదు” ఇందాక తనను లేపిన మధ్య వయసు అతను అన్నాడు.

ఆనంద్ కి మెల్లిగా విషయాలు అన్ని గుర్తుకురాసాగాయి. ఆ ఆక్సిడెంట్ అయిన వ్యక్తి, తన భార్య కిడ్నీఆపరేషన్ కోసం అతను ఇచ్చిన డబ్బును తన భార్య పేరు మీద చెల్లించడం, ఎద్దు ఎదురు రావడంతో బండి అదుపు తప్పడం అంతా కళ్ళముందు కదిలాయి. వెంటనే అతను తన భార్యకు ఎలా వుందో అని ఖంగారుగా బయల్దేరుదాం అనుకున్నాడు. కాని ఆక్సిడెంట్ కారణంగా బండి పూర్తిగా ధ్వంసం అవ్వడంతో ఆటోలో హాస్పిటల్ కి చేరుకున్నాడు. డాక్టర్ రఘు తన భార్య వున్నా ఐ సి యు లో ఉన్నాడని తెలుసుకుని అక్కడకు పరిగెత్తాడు. డోర్ తెరుచుకుని లోపలి ప్రవేశించగానే డాక్టర్ తో నవ్వుతూ కబుర్లు చెప్తున్న సంధ్యను చూసి అతని మనసు కుదుట పడింది.

“డాక్టర్ సంధ్యను బతికించినందుకు చాలా కృతజ్ఞతలు డాక్టర్ “ అంటూ ఎంతో ఉద్వేగంతో డాక్టర్ను అభినందించాడు ఆనంద్.

“కూల్ డౌన్ మిస్టర్ ఆనంద్. ఇప్పుడే మీ భార్యకు విషయం మొత్తం చెప్పాను. మీకు కూడా చెప్పాలి” దయ చేసి నేను చెప్పింది పూర్తిగా వినండి.“ అంటూ జరిగిన విషయం మొత్తం ఆనంద్ కు వివరించాడు డాక్టర్ రఘురాం. అంత విన్న తరువాత కొంచెం

అయోమయంగా "అంటే నా భార్యకు కిడ్నీ ప్రాబ్లం లేదన్నమాట. మరి ఆ కిడ్నీ ప్రాబ్లం ఉన్న స్త్రీకి డబ్బులు ఎవరు కట్టారు. ఆమె తాలూకు వాళ్ళు ఎవరు లేరన్నారు కదా?" అడిగాడు ఆనంద్.

"ఈ విషయం, గురించే నువ్వు వచ్చేముందు మీ భార్యతో చర్చిస్తున్నాను. కాని ఎంత ఆలోచించినా మాకు అర్థం కాలేదు." అని అన్నాడు డాక్టర్ రఘు.

"నాకు అర్థం అయ్యింది. ఇది కూడా మీ హాస్పిటల్ స్టాఫ్ చలవే. నేను **వీ.ఆర్. సంధ్యదేవి** పేరున కట్టిన డబ్బులు వాళ్ళు **ఆర్. సంధ్యా దేవి** పేరున కట్టి ఉంటారు " అంటూ ఉన్న విషయాన్ని బయట పెట్టాడు ఆనంద్.

"మరి నీకు ఇంత డబ్బుఒక రోజులో ఎలా దొరికింది?" అనుమానంగా అడిగాడు డాక్టర్ రఘు. ఇంతలో ఒక కంపౌండర్ ఖంగారుగా అక్కడకు వచ్చి "డాక్టర్ ఒక ఆక్సిడెంట్ కేస్ వచ్చింది. కండిషన్ చాలా సీరియస్ గా ఉంది. మీరు అర్జెంటు గా రావాలి" అని తొందరపెట్టాడు. వెంటనే ఆ సంభాషణ అంతటితో ఆపి ఆ ఆక్సిడెంట్ కేసు దగ్గరకు వెళ్ళాడు డాక్టర్ రఘు. ఆయనను అనుసరించి వెళ్ళిన ఆనంద్ బెడ్ మీద ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆక్సిడెంట్ తాలూకు వ్యక్తిని చూసి ఉలికిపడ్డాడు. కారణం అతను ఉదయం హైవే మీద తనకు డబ్బిచ్చి స్పృహ కోల్పోయిన వ్యక్తే.

"ఆనంద్ ఏమిటలా చూస్తున్నావ్? ఇతను మహేంద్ర గారి మేనల్లుడు" అని అన్నాడు డాక్టర్ రఘు. వెంటనే ఆనంద్ బయటకి వచ్చేసాడు. తను చేసిన తప్పుకి అతను చాల పశ్చాతాప్పడ్డాడు. డాక్టర్ రఘు మహేంద్ర గారి మేనల్లుడిని ట్రీట్ చేసి ఒక గంటలో సబ్ ఆర్డినేట్స్ కి పని అప్పగించి వచ్చి ఆనంద్ ను కలుసుకున్నాడు."ఏంటి ఆనంద్ ఆందోళనగా ఉన్నావ్? నీ భార్యకు ఏమి ప్రాబ్లం లేదుగా" అడిగాడు డాక్టర్ రఘు.

"అదికాదు డాక్టర్" అంటూ విజయవాడ హై వే మీద ఆక్సిడెంట్ విషయం మహేంద్ర గారి మేనల్లుడు తన చేతిలో డబ్బు ఉంచి స్పృహ కోల్పోవడం ఈ విషయం అంతా బయట పెట్టాడు ఆనంద్.

"డోన్ట్ వర్రీ ఆనంద్. నువ్వు ఇందులో బాధ పడాల్సింది ఏమి లేదు. నువ్వే కనుక సమయానికి ఆ డబ్బు చెల్లించకపోయి ఉంటే అతని తల్లిగారికి ఆపరేషన్ జరిగి ఉండేది కాదు. నీ ఉద్దేశం వేరైనప్పటికీ మంచే జరిగింది. ఆవిడతో పాటు నీ భార్యను కూడా బతికింది.అఫ్ కోర్స్ నీ భార్యకు ఏ ప్రాబ్లం లేదనుకో నేను మహేంద్ర గారి మేనల్లుడితో మాట్లాడి నువ్వు చేసిన సహాయానికి నీకు ఏదో ఒక ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తానులే" అన్నాడు డాక్టర్ రఘు సంతోషంతో డాక్టర్ రఘు చెయ్యి ఊపుతూ.

"థాంక్ యు వెరీ మచ్ డాక్టర్ నేను జీవితాంతం మీకు ఋణపడి ఉంటాను" అంటూ ఉద్వేగంతో అన్నాడు ఆనంద్.

★★★★★



# కథా కౌముది

## ఫోటో నవ్వుతోంది

దావులూరి జయలక్ష్మి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ**

**బయట నుండి** కూడా తీసే వీలున్న తాళం అది. అది వేసాడు. తనగది తలుపులు ఓరగా వేసాడు. బెడ్ పక్కనే కంప్యూటర్ టేబుల్, కుర్చీ. బెడ్ పైనే ఫాన్.

పిల్లలిద్దరూ స్కూలుకు వెళ్ళారు. సృజన ఆఫీసుకు వెళ్ళింది. రంగరాజు ఆఫీసుకు వెళ్ళినవాడే మధ్యలో ఆగి వెనక్కి తిరిగి ఇంటికి వచ్చాడు.

మనసంతా దిగులు. మరి మూడురోజుల్లో తన ఉద్యోగం ఊడిపోతుంది. కంపెనీకి వచ్చిన నష్టాలవల్ల కొన్ని ఉద్యోగాలు తొలగిస్తున్నారు. అందులో తనది ఒకటి. తరువాత? తరువాత? ఆఫీసుకు వెళ్ళాలనిపించలేదు. తన కొలీగ్సును చూడలేడు. చూసి హాయిగా ఉండలేడు. మనసులో ఏదో వేదన. చిన్నతనం. తన ఉద్యోగమే ఎందుకు పోవాలి? తను అసమర్ధుడా? పని చేతకానివాడా? కాదే తన పనిని ఎన్నిసార్లో అధికార్లు మెచ్చుకున్నారు. మరి ఇప్పుడు ఇలా ఎందుకు జరిగింది? ఈ ప్రశ్నే రంగరాజును వేధిస్తోంది. మనసుకు స్థిమితం లేకుండా చేస్తోంది. భవిష్యత్తు అంటే భయం కలిగేలా చేస్తోంది.

సృజన అంత నిబ్బరంగా ఎలావుండగలుగుతోంది? "పోనీలెండి. ఎలా జరగాలనుంటే అలా జరుగుతుంది. మీ సమర్ధతకు తగిన పని దొరక్కపోదు. నాలుగురోజులు ఆలస్యం అవొచ్చు. అంతమాత్రానికే అధైర్యపడితే ఎలా? నా ఉద్యోగం ఉందిగా" అంది.

కానీ తనకు ఆ మాటలు తృప్తినివ్వడంలేదు. సృజన ముఖం చూడాలంటే చిన్నతనంగా ఉంది. సిగ్గుగా ఉంది. భర్త ఇంత చాతకానివాడు అని అనుకోదా?

మళ్ళీ ఉద్యోగం దొరికేదెప్పుడు? తనేం చెయ్యాలి? భార్య జీతం మీద ఆధారపడి బతకాలా? పద్దా ఈ లోనులన్నీ ఎలా తీర్చాలి? తమ జీతాలు చూసుకునేకదా ఈ ఇల్లుకొన్నది. ఈ ఫర్నీచర్ కొన్నది.. ఇవన్నీ ఎలా? సమాజంలో తన పరువేమౌతుంది? బంధువులు ఎంత హేళన చేస్తారు? నలుగురిలో ఆ అవమానం కన్నా ఇదే నయం. ఇదే నయం.

ముఖంలో ఆందోళన. మనసులో ఆవేదన. దుఃఖం. బాధ. ఏదో తెలియని ఆవేశం. అనేక చిత్రాలు వింత వింతగా కళ్ళముందు కదలాడుతుంటే భవిష్యత్తంటే భయం మరింత పెరిగింది. ఎవరో తరుముకు వస్తున్నట్లు ఖంగారు ముందుకు తోసింది. అంతే. కళ్ళుమూసుకున్నాడు. ఫానుకు కట్టిన చీరను మెడకు తగిలించుకున్నాడు. కాళ్ళు పెట్టిన స్టూలును ప్రక్కకు నెట్టాడు.

ఉరిబిగుసుకుంటోంది. తెలియకుండానే ఒక్కసారి కళ్ళు తెరిచాడు. వళ్ళు తిరిగిపోతోంది. కళ్ళు తిరిగిపోతున్నాయి. కాళ్ళు తేలిపోతున్నాయి. తల తిరిగిపోతోంది. ఎదురుగా ఎప్పుడో గోడకు తగిలించిన ఫోటో. మసగ మసగగా కనిపిస్తోంది. తనను చూసి నవ్వుతోంది. ఆ నవ్వులో ఏడుపు, హేళన, ఆర్తి, ప్రేమ, ఆవేదన ఎన్నో. ఆ స్థితిలో కూడా ఉలిక్కిపడ్డాడు. కాళ్ళక్రింద స్టూలు కోసం తడుముకున్నాడు. అందలేదు. కాలు చాపాడు. ప్రక్కనే ఉన్న కుర్చీ అందింది. కాలుపెట్టాడు. ఏదో అయిపోతోంది. అయినా బలవంతంగా శక్తినంతా కూడగట్టుకుని చీరముడి విప్పాడు. నిలబడలేక ధన్‌మని మంచం మీద పడిపోయాడు.

మనసు మనసులో లేదు. శరీరం స్వాధీనంలో లేదు. ఏదో మగతా, ఆ మగతలో ఏవో దృశ్యాలు.

"నాన్నా! రాజూ!" మనసు ఉలిక్కిపడింది అవును తననే. అమ్మపిలుస్తోంది.

"అమ్మా!"

"రా నాయనా! అన్నం పెడతా. తొరగా బడికి పోదువుగాని." అమ్మ అన్నం కలిపి నోట్లో పెడుతోంది. కడుపునిండా పెట్టింది. మూతికడిగింది. తన కొంగుతో తుడిచింది. పుస్తకాల సంచి ఇచ్చింది. "జాగ్రత్తగా వెళ్ళునాయనా. బాగా చదువుకో." పూరి గుడిసె. మట్టి ఇల్లు. చాలావరకు మట్టిపాత్రలే. తను బడినుండి వచ్చేసరికి అమ్మ ఇంకా పొలం నుండి వచ్చేదికాదు. తనకోసం గంజిలో ఉప్పేసి కాసిని మజ్జిగ పోసి జొన్న అన్నం కలిపి పిడతలో పెట్టి ఉట్టిమీద పెట్టేది.

రోజూ అదే జొన్న అన్నం. ఎంత రుచిగా ఉండేది.

అమ్మ వచ్చి ఇంటి పనంతా చేసి అన్నం వండి ఏదో తొక్కు నూరేది. అందరూ కడుపు నిండా తృప్తిగా తినేవారు.

అడుగో తాత. కుక్కి మంచంలో పడుకున్నాడు. తనను రమ్మంటున్నాడు.

"ఏంటి తాతా?"

"రారా రంగడు."

తనను దగ్గరకు తీసుకున్నాడు.

"బాగా చదువుతున్నావంట్రా!"

"తొమ్మిదో తరగతి పుస్తకాలు అన్నీ కొనుక్కోలేదు తాతా! అమ్మ డబ్బులు లేవంటుంది. కొనేవరకు ఏదన్నా పుస్తకం అవసరమైతే శేఖర్ని అడగమంటోంది. నాకేమో మొహమాటంగా ఉంది. వాడూ చదువుకోవాలిగా తాతా!"

తాతయ్య నవ్వుతున్నాడు.

"ఎందుకు తాతయ్యా నవ్వుతున్నావ్?"

"ఒరేయ్ రంగా! ఒకరి వస్తువు దొంగతనం చేయడం తప్పుకానీ అడగటంలో తప్పులేదురా! నీకు ఉన్నది ఇతరులకు ఇవ్వు. నీకు అవసరమైంది ఇతరులను అడుగు."

తనదగ్గరేముంది? తను బాగా చదువుతాడు. తనకు తెలిసినవి స్నేహితులకు చెపుతాడు. అదేనా ఇవ్వగలిగింది?

అందరూ తనను అభిమానంగా చూస్తారు. మాష్టారుకూడా తనను అభిమానిస్తారు. అభినందిస్తారు. అది తనకు ఎంత సంతోషమో.

తను ఆటలు కూడా బాగా ఆడతాడు. ఒకసారి జరిగిందది. పక్క స్కూలుకు 'ఫుట్‌బాల్' పోటీలు జరిగాయి. ఆ టీములో తనుకూడా ఉన్నాడు. కానీ - కానీ తనకు షూస్ కొనుక్కునే స్థితిలేదు. ఇంటికి వచ్చి ఏడ్చాడు. "ఎందుకునాన్నా ఏడుస్తావు? మనకు ఉన్నంతలో మనం బ్రతుకుతున్నాం. అందరికీ అన్నీ ఉండవుకదా! తృప్తే ప్రధానం. మీ సార్‌కు చెప్పు కొనుక్కోలేనని" అంది నానమ్మ.

తనను దగ్గరకు తీసుకుని వెన్ను నిమిరింది. నానమ్మ కళ్ళలోకి చూస్తున్నాడు తను. ఆ కళ్ళు ఎంత ప్రశాంతంగా ఉన్నాయి? ఆ ముఖంలో చిరునవ్వు? "నానమ్మా!" అన్నాడు అంత మగతలోనూ రంగరాజు ఆ నుదుట ఎఱ్ఱని కుంకుమ మెరిసిపోతోంది. ఎందుకో ఆ కుంకుమ చూస్తే రంగరాజుకు ఉత్తేజం కలుగుతుంది.

తర్వాత సార్ షూస్ కొనిచ్చారు. ఆ పోటీలో తమ స్కూల్ గెలిచింది. అంతే తనను ఆకాశానికి ఎత్తేసారు. తనకు బహుమతి కూడా ప్రత్యేకంగా ఇచ్చారు. ఆనందంతో ఇంటికి వెళ్ళిన తనకు ముందు నానమ్మ చిరునవ్వు, కుంకుమే కనిపించాయి. అమాంతం నానమ్మను ముద్దుపెట్టుకున్నాడు.

అడుగో నాన్న. నాన్న తనవంకే చూస్తున్నాడు. ఎంత ఇబ్బందులలో ఉన్నా తనను కాలేజీలో చేర్పించారు. పొరుగూరికి వెళ్ళాలి. నాలుగు మైళ్ళు నడవాలి. కొంతమంది సైకిలుపై వచ్చేవాళ్ళు ఉన్నారు. తను కూడా సైకిలు కొనుక్కుంటే బాగుండుననిపించింది. ఆ మాటే అడిగాడు.

"చూడు రాజు. నేనూ మీ అమ్మా రోజూ పదిమైళ్ళు నడుస్తాం. రోజంతా నిలబడే చేయాలి. అదే మన బ్రతుకు తెరువు. కాస్త కష్టమైనా చదువే మన అవసరం. అప్పుచేసి అందలాలు ఎక్కాలనుకోవడం సరికాదు. మన చేతిలో రూపాయినే చూసి ఖర్చుపెట్టుకోవాలి" అన్నాడు నాన్న. తనకు ఆ మాటలు నచ్చలా.

డిగ్రీ చేయడానికి పట్నం వచ్చాడు. ఇక్కడి స్నేహితులు, సౌకర్యాలు, కాలేజీ, పరిసరాలు అన్నీ తనలో కొద్దికొద్దిగా మార్పుతేవడం మొదలుపెట్టాయి.

నాన్న ఇచ్చే డబ్బు ఆ సుఖాలు అనుభవించడానికి సరిపోవడంలేదు. ఊరికి వెళ్ళినప్పుడు అడిగాడు. "అమ్మా! పట్నంలో చదువు. నాన్న ఇచ్చే డబ్బు ఏమాత్రం సరిపోవటంలేదు. పుస్తకాలకే బోలెడు ఖర్చు అవుతోంది. ఇతర ఖర్చులు కూడా ఉంటాయి కదా!" అన్నాడు.

అమ్మ తనను ఎగాదిగా చూసింది. ఒక్క నిముషం ఆగి "చూడు రాజు. నువ్వు పెద్దకొడుకువి. ఇంటికి అండ అవుతావని మా ఆశ. నీ తమ్ముళ్ళను చదివిస్తావని, నిన్నుచూసి వాళ్ళుకూడా బాగా చదువుకుంటారని మా తపన. అందుకే ఇష్టంలేనిపని అయినా నీకోసం, నీ చదువుకోసం అప్పు చేయక తప్పటంలేదు. ఇంతకన్నా ఎక్కువకావాలంటే ఇచ్చేవాళ్ళూ లేరు. అక్కడ చదవలేకపోతే వచ్చేయ్. ఇక్కడే ఏదో పని చూసుకుందాం."

ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. ఉలిక్కిపడ్డాడు. అమ్మ మీది నమ్మకంతో అడిగాడు. మరి అమ్మ ఇలా అన్నదేమిటి? ఎందుకు అన్నది?

తనను తను చూసుకున్నాడు. తన బట్టలు, తన బూట్లు, తన బ్యాగ్. ఇవన్నీ ఖరీదయినవే. ఇప్పుడు తన మాటలూ ఖరీదయినవే. అమ్మ గుర్తించింది. తన బాధ్యతను చెప్పకనే చెప్పింది. పట్నం వచ్చాడు. స్నేహితులకు తెలియకుండా రెండు ట్యూషన్లు కుదుర్చుకున్నాడు. కొంచెం ఖర్చులు జాగ్రత్త పడ్డాడు.

"అదిగో వాడెవడు? వాట్. దారిలో ఎదురుపడ్డాడు. కుష్టురోగి.. చేతలకు వేళ్ళులేవు. కాళ్ళకు కూడా లేవనుకుంటా. పాతబూట్లు వేసుకున్నాడు. చేతికి ఓ డబ్బా తగిలించుకున్నాడు. దారిన పోయేవారు ఎవరికి తోచినంత వాళ్ళువేస్తున్నారు." మరో దృశ్యం కనిపిస్తోంది.

జాలి కలగలా. అయ్యోపాపం అనిపించలా. పైగా ఇలాంటి జీవితం ఎలా భరిస్తున్నాడు? ఎందుకు భరిస్తున్నాడు? జుగుప్స. అడిగితే బాధ పడతాడేమోనని కూడా ఆ క్షణం అనిపించలా. అడిగేసాడు. తన వంక ఒక్క క్షణం చూసాడు. ''మీలా ఎవరూ నన్ను అడగలేదు బాబూ! నేనూ మొదట మీలా మాములుగానే ఉన్నా. కష్టపడి పనిచేసా. కుటుంబాన్ని పైకి తీసుకువచ్చా. నాకూ ఇద్దరు పిల్లలున్నారు బాబు. బాగానే సంపాదిస్తున్నారు. విలాసాల్లో పడి సంపాదించింది పారబోసుకుంటున్నారు. వాళ్ళ హోదాకు నేను అడ్డుగా ఉన్నా. అందుకే బయటకు వచ్చేసా. జీవితంలో ఏది ఎప్పుడు సంభవిస్తుందో చెప్పలేంగా బాబూ. నేను చేసిన పొరపాటు నా సంపదంతా నా పిల్లలే అనుకున్నా. పర్వాలేదు బాబూ! సంపాదన లేకపోయినా సంతోషంగానే ఉన్నా. మీలాంటి దయామయులు ఉన్నంతకాలం మేం బ్రతగ్గలం బాబు'' అన్నాడు. అతని మాటలకు ఆశ్చర్యపోయాడు. అనుకోకుండానే జేబులో ఉన్న పదిరూపాయలు ఇచ్చేసాడు.

మంచి ఉద్యోగం వచ్చింది. అందరూ సంతోషించారు. అప్పుడే నాన్న అన్నాడు. ''డబ్బు విలువ తెలుసుకుని మసులుకో. ఆడంబరాలకుపోతే అనర్థమే. ఆనందం ఆడంబరాలతో లేదు. మనసు తృప్తి పడటంతో ఉంది. నలుగురికి సాయపడటం, నవ్వుతూ బతకటం - అంతకు మించిన తృప్తి ఉండదు. జాగ్రత్త.''

''అబ్బ నాన్న ఎప్పుడూ ఇలాగే చెపుతాడు'' అనుకున్నాడు.

అదిగో తాతయ్య. నవ్వుతూ దగ్గరకు రమ్మంటున్నాడు.

''ఏమిటి తాతయ్యా?''

''ఒరేయ్ రంగా మా అందరికీ దూరంగా ఉండటం నీకు అలవాటయిందిరా. కానీ మాకు మాత్రం నీవు క్షణం క్షణం కళ్ళముందే ఉంటావు. జాగ్రత్త నాయనా! ఎప్పుడూ నేల విడిచి సాము చేయకు'' అన్నాడు.

అర్థంకాలా. తాతయ్య పెద్దవాడు. ఏదో చెపుతూనే ఉంటాడు అనుకున్నాడు.

అదిగో నానమ్మ నవ్వుతోంది. ''ఒరేయ్ నాన్నా! మనవరాలిని ఎప్పుడు తీసుకువస్తావురా?'' అంది.

నవ్వుతూ తలవంచుకున్నాడు.

అదిగో అమ్మ అమ్మ ఏమీ మాట్లడటం లేదేం? అలా చూస్తోందేం? ఆ చూపులో ఏదో ఆశ. ఆ ముఖంలో ఏదో ద్వైదీభావం ఏం చెప్పాలనుకుంటోంది? ఏం చెప్పలేకపోతోంది? ఆలోచనకు అందటంలా.

అదుగో స్పజన. పిల్లలు. ఆ కళ్ళల్లో ఎంత నిర్భీతి.

''మీరున్నారు. నాకేంటి?'' అనే ధైర్యం తనపిల్లలు. ఎంత అమాయకంగా చూస్తున్నారు. నాన్న వాళ్ళకొక రక్షకకవచం. స్పజన తన జీవితానికి నూతన వసంతం. సుఖాలు, దుఃఖాలు, ఆనందాలు, హోదాలు, అంతస్థులు అన్నీ ఒక్కొక్కటిగా చోటు చేసుకున్నాయి. స్పజన కూడా ఉద్యోగస్తురాలే. పిల్లలిద్దరూ బడికి వెళుతున్నారు.

దృశ్యాలు ఒకటొకటి మారిపోతున్నాయి. మరో దృశ్యం. అబ్బ మధ్యలో వీడెవడు? అవును వాడే గుడిదగ్గర పూలు అమ్ముతున్నాడు. ఓ చేయి మొండిగా ఉంది. అయినా పని నేర్పుగా చేస్తున్నాడు. సరదాగా పక్కవాళ్ళతో కబుర్లు చెపుతూ వ్యాపారం చేస్తున్నాడు.

పూలు కొన్నారు. కానీ అతన్ని చూస్తే చిన్నచూపు కలిగింది చెయ్యిలేనివాడని. కానీ అతనిలో ఆ లోటు ఉన్నట్లు బాధ ఎక్కడా కనిపించడంలేదు. ఆశ్చర్యం.

''చెయ్యి ఎలా పోయింది?'' తన ఆరాటం అడిగించింది. అతను నవ్వాడు. ఆ నవ్వు అంత నిర్మలంగా ఎలా ఉంది?

''దేవుడు అన్నీ ఇచ్చినా మనం నిలుపుకోవడంలో ఉంటుంది బాబూ! కాయకష్టం చేసేవాణ్ణి. అవలీలగా రాళ్ళు ఎత్తేవాణ్ణి. అదేపని. ఓసారి రాయిపొరపాటున చెయ్యి మీదపడింది. చెయ్యిపోయింది. అయినా ఇంకో చెయ్యి బాగానే ఉందిగా. ఇప్పుడు పూలు అమ్ముతున్నా. ఇదీ బాగానే ఉంది.'' ఎంతో ప్రశాంతంగా అన్నాడు. ''పోయిన దాన్ని గురించి బాధపడకూడదు. కొత్తదారి వెతుక్కోవడమే జీవితం'' మరొకరికి పూలు ఇచ్చేపనిలో పడ్డాడు.

ఇదో వేదాంతం. వేదాంతం ఇలాగే పుట్టుకొస్తుంది కాబోలు అనుకున్నాడు.

అరే జగన్నాథం. అలా ఉన్నాడేంటి? చాలా నిరాసక్తంగా ఉన్నాడు. తన ఆలోచన దగ్గరకు వచ్చాడు.

''చాలా రోజులయిందిరా నిన్నుచూసి'' అన్నాడు తను నవ్వుతూ

''మా ఊరెళ్ళిపోతున్నారా?'' అన్నాడు వాడు జవాబుగా.

అదేమిటన్నట్లు చూసాడు.

''ఇక్కడ ఇంత సంపాదిస్తున్నా, ఇంత సుఖంగా ఉన్నా ఏదో అసంతృప్తిగా ఉందిరా''

''మా వాళ్ళ దగ్గర అందరం కలిసి ఉన్నప్పటి సుఖం, తృప్తి ఇవి ఇవ్వలేకపోతున్నాయిరా''

''అందుకే అక్కడే ఏదన్నా ఉద్యోగం చూసుకుంటా. తక్కువ జీతమైనా పర్వాలేదు. కలిసివుంటేనే నాకు తృప్తి''

''ఎవరి వెర్రి వారికి ఆనందం'' అనిపించింది.

మత్తు విడిపోతోంది. మగతనుండి - కాదు గతం నుండి మెలుకువలోకి వస్తున్నాడు. దృశ్యాలు ఒక్కొక్కటి కనులముందు రీలులా తిరుగుతూ కనుమరుగవుతున్నాయి.

రంగరాజు స్పృహలోకి వచ్చాడు.

చుట్టూ పరికించి చూసాడు. తనను తను చూసుకున్నాడు. ''ఇప్పుడు తను చేస్తున్న పనేమిటి? ఇదా! ఇదా! ఇంత వెర్రిపని చేయబోయాడా? ఉద్యోగం పోతోంది. ఆడంబరాలు చేసిన అప్పులు మిగిలాయి. ఆ అప్పులు ఎలా తీర్చాలన్న ఆందోళన జీవితాన్నే ముగించమంది. మరి - మరి - సృజన - పిల్లలు - అమ్మ, నాన్న, తాతయ్య, నానమ్మ ఎవరూ గుర్తుకు రాలేదు ఎందుకని, తన బలహీనతా? అతన అవివేకమా? తన తొందరపాటా? జీవితాన్ని ఇదేనా తను అర్థం చేసుకుంది?''

''ఆ రోజు - ఆ రోజు. అమ్మ చెప్పాలనుకున్నదేమిటో? చెప్పలేకపోయిందేమిటో ఇప్పుడు అర్థమవుతోంది. జీవితం విలువైనది. దాన్ని సార్థకం చేసుకోవాలి. అంతే.'' గబుక్కున లేచాడు. ఎక్కడివక్కడ సర్దేసాడు. ''సృజనకు ఈ విషయం తెలియకూడదు.'' అనుకున్నాడు.

వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళాడు. చల్లని నీళ్ళతో ముఖం కడుక్కున్నాడు. ఫోటో దగ్గరకు వెళ్ళాడు. తనివి తీరా చూస్తున్నాడు.

ఆ ఫోటో నవ్వుతోంది ఆ నవ్వులో ఎన్ని అర్థాలో!




వసంతంలో మూగవోయిన కోయిల

డా. యండమూరి సత్యకమలేంద్రనాథ్

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

**ఆకాశం నిద్రపోతోంది.** నక్షత్రాలు తమ ఉనికిని చాటుకోవటానికి ప్రయత్నిస్తున్నాయి. అక్కడక్కడ వినీల మేఘాలు అతిథుల్లా సంచరిస్తున్నాయి. ఈ విషయాలతో తనకేమీ సంబంధం లేనట్లు గాల్లో చేతులూపుతూ వ్రేళ్ళతో ఏదో రాస్తూ వరండాలో పచార్లు చేస్తున్నాడు దశరథరామయ్య మధ్య మధ్యలో తనలో తనే మాట్లాడుకుంటున్నాడు.

కాలం ఇంద్రజాలం. ఇష్టమైతే ఆకాశం అంచులకి చేరుస్తుంది లేదంటే అగాధపు అంచుల్లోకి నెట్టేస్తుంది.

ఇదే వరండాలో దశరథరామయ్య పడక కుర్చీలో కూర్చుని గ్రామస్థులతో కాలక్షేపం చెయ్యడమూ, సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించడమూ చేసేవాడు - ప్రస్తుతం భర్త చేస్తున్న వింత చేష్టలని చూస్తూ ఏం చెయ్యాలో తోచక - ఏం చెప్పాలో తెలియక భారమైన మనస్సుతో కూర్చుని ఉంది. సమయం గడుస్తున్నా తెలియటంలేదు సూర్యోదయం తన ఆగమనాన్ని - తూర్పున తెలవారే కిరణాలని ప్రసరింపజేస్తూ తెలియజేస్తోంది ఇంటి గుమ్మం గడపమీద కూర్చుని ఉంది దశరథరామయ్య భార్య కౌసల్య.

ముప్ఫై అయిదు సంవత్సరాల వైవాహిక జీవితంలో - ఏనాడూ లేని భయం, ఇప్పుడు ఎదురవుతూ ఉంటే తట్టుకోలేకపోతోంది. సరదా ప్రలోభాలు - వెక్కిరింతలు - తుళ్ళింతలు చిరుకోపాల సవ్వడులు మాత్రమే అనుభవించిన కౌసల్యకి జీవితంలో ఊహించని పరిణామం. ఎదుర్కొనలేని అనుభవం.

తనని తాను ఎంత సముదాయించుకోవటానికి ప్రయత్నం చేసినా పరిస్థితులకి తలొగ్గి పెద్దకొడుకుకి రమ్మంటూ ఉత్తరం రాసింది. ఉత్తరం అందగానే పరుగుపరుగున వచ్చాడు రామచంద్ర. గుమ్మంలో అడుగుపెడుతూనే "ఏమయింది నాన్నకి?" అన్నాడు కంగారుగా.

"షష్టిపూర్తి వేడుక కాగానే - మీరు పిల్లలు వెళ్ళిన తర్వాత రెండు నెలలవరకు బాగానే ఉన్నారు. పైగా రత్నాల్లాంటి పిల్లలు - వజ్రంలాంటి అల్లుడు ఇక మనకు జీవితంలో ఏ చీకూ చింతా లేదు అనేవారు. ఆ తర్వాత ఆయనలో మార్పు రావటం మొదలయింది - రాత్రుళ్ళు నిద్రపోరు - వరండాలో పచార్లు చేస్తూ ఉంటారు - ఏం చేస్తుంటారో ఆయనకే తెలియదు - ఆయన పరిస్థితి చూస్తుంటే చాలా భయంగా ఉందిరా" అంది కౌసల్య.

గదిలోకి వెళ్ళి చూడగానే అవాక్కయిపోయాడు రామచంద్ర. చిక్కిశల్యమైపోయాడు దశరథరామయ్య. మొహం కళావిహీనమై ఉంది. తండ్రిని చూడగానే ఏడుపు వచ్చింది. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ "నాన్నా" అన్నాడు - పలకలేదు దశరథ రామయ్య. వెర్రిచూపులతో తలెత్తి చూశాడు. కొడుకుని గుర్తుపట్టలేదు - రామచంద్ర మనసు అంతా తడితడిగా అయిపోయింది.

తల్లి వైపు చూసి "ఎప్పట్నించి ఇలా ఉన్నాడు?" అన్నాడు.

"రాశానుగా! వారం నుంచీ మరీ ఎక్కువగా మార్పు వచ్చింది" అంది కౌసల్య.

"కంగారుపడకమ్మా! రేపు ఉదయాన్నే మన ప్రయాణం - మా ఊరు వెళ్ళి మా డాక్టరుగారిని సంప్రదిద్దాం - ఆయన సలహాను బట్టి ఆ తర్వాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం" అన్నాడు రామచంద్రం.

పైకి గంభీరంగా మాట్లాడినా రామచంద్ర మనస్సులో ఆందోళనా సముద్రం కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి.

తమ ఊరు వెళ్ళగానే తన ఫామిలీ డాక్టరు దగ్గరకు తీసుకుని వెళ్ళాడు ఆయన అన్ని పరీక్షలు చేసి "చూడండి రామచంద్రగారూ! నాన్నగారికి శారీరకంగా ఏ లోపమూ కనిపించడంలేదు మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉన్నట్లుంది మానసిక వ్యాధుల డాక్టరుగారికి చూపిస్తే మంచిది" అన్నాడు.

"ఏ డాక్టరుగారి దగ్గరకు వెళ్ళాలో మీరే సలహా ఇవ్వండి డాక్టరుగారూ!" అన్నాడు రామంచంద్ర.

"డా.మల్లికార్జున రావు దగ్గరకు వెళ్ళండి ఆయన మన ఊళ్ళో అందరికంటే సీనియర్ - నేను ఉత్తరం రాసి ఇస్తాను" అంటూ ఉత్తరం రాసి ఇచ్చాడు.

సుమారు ఎకరం స్థలం - ఎండ కనపడనీయకుండా ఎదిగిన మామిడి చెట్లు మధ్యలో అక్కడ మామిడి చెట్లను దాటి ఆకాశం వైపు చూస్తున్న కొబ్బరి చెట్లు - ఆ తోట మధ్యలో మండువా లోగిలి. ఇంటిముందున్న ఖాళీ స్థలంలో రంగు రంగుల హరివిల్లులాంటి పూదోట.

ఇంటి ప్రతిగుమ్మానికి మామిడి తోరణాలు - గడపలకి పసుపు కుంకమ కలయికల ముద్రలు. ఇంటికి కాస్త దూరంగా తాటాకు పందిరి. పందిట్లో రాటనుంచి రాటకు చిన్నపిల్లల పరుగులు - అరుపులు - కేరింతలు అల్లర్లు.

ఆ హడావుడంతా ధశరధరామయ్యగారి పెళ్ళిసందడి - ఆ పిల్లలు ఆయన మనవలు - మనవరాళ్ళు - ఆ పెళ్ళి జీవితంలో ఒకసారే జరిగే షష్టిపూర్తి వివాహం.

దశరధరామయ్య ఆనందాతిశయంతో తనగది నలువైపులా చూస్తున్నాడు. పుట్టిపెరిగిన ఇల్లు, ప్రతివస్తువూ - గోడలు ఇనుమడించిన అందంతో కనిపిస్తున్నాయి. అవన్నీ తనకు అభినందనలు తెలియజేస్తున్నట్లున్నాయి - ఉదయం నుంచీ కౌసల్య కొత్తపెళ్ళికూతురిలా అనిపిస్తోంది.

మరో గదిలో జాహ్నవి - తల్లిని సింగారిస్తోంది.

ఆరుబయట బాజాలు, భజంత్రీలు వినిపిస్తున్నాయి

ఇద్దరి మనస్సులోనూ హేమంతాలు - శిశిరాలు కలగలిపి వసంతంలా వెల్లివిరుస్తున్నాయి హృదయంలో పెల్లుబికే ఉత్సాహంతో కనుదోయి వెంబడి ఆనందభాష్పాలు జాలువారుతుంటే దశరధరామయ్య ఉత్తరీయంతో తుడుచుకుంటూ ఉంటే కౌసల్య కొంగుతో అద్దుకొంటోంది

ఉపకారికి పర్యాయపదం దశరధరామయ్య. ఆ గౌరవంతో ఊరంతా తరలి వచ్చింది. పందిరి నిండుగా కళకళలాడుతోంది.

ఇంకా ఎంత ఆలస్యం నాన్నా! అవతల అతిధులంతా వచ్చేశారు. త్వరగా తెమిలిరా! మర్చిపోయేవు సుమా! ఉత్తరీయం భుజం మీద వేసుకో'' అన్నాడు రామచంద్ర గుమ్మం బయట నిలబడి.

పందిట్లో ఆహుతులకి కావల్సిన సదుపాయాలు చూస్తున్నాడు చిన్న కొడుకు లక్ష్మణ్.

అల్లుడు, కొడుకులు దశరథరామయ్యని తోడ్కొని వస్తే - కోడళ్ళు, కూతురు కౌసల్యని తీసుకుని వచ్చారు. వధూవరులు పీటలమీద కూర్చున్నారు.

తప్పట్లు - తాళాలు - భజంత్రీలు - మూడుముళ్ళు - ఏడడుగులు

లయబద్ధంగా పురోహితుని మంత్రాలు - ఆ పై యజ్ఞం.

అంబరాన్ని చుంబించే - ఆనంద హేల.

మనస్సులో ఏనాడో జరిగిన వివాహపు తంతు మర్చిపోయిన భార్యాభర్తల మనస్సులో గత స్మృతుల సంబరాలు - అత్తగారి ప్రక్కన కోడలు పరాచికాలు - తల వాల్చిన అత్తగారి మోమున సిగ్గుతో ముసిముసినవ్వులు - అల్లుడి చిలిపిమాటలు - బుంగమీసాల మాటున పెదవులపై మామగారి చిరునగువులు

ఆ వంక ఈ వంక ఏవంక చూసినా వసంతమే. కోయిల కూజితాలే

తంతు ముగిసింది - షడురుచోపేతమైన విందు ఆ పై నవయవ్వన వృద్ధదంపతులకు పెద్దల ఆశీర్వాదాలు. పిల్లలు - సమవయస్కుల నమస్కారాలు

ఆ రోజు సాయంత్రం పిల్లలు పందిట్లో ఆడుకుంటున్నారు. దశరథరామయ్య కుటుంబం వరండాలో కూర్చుని ఉంది.

''నాన్నా! షష్టిపూర్తి జరిగింది - నేటివరకు నువ్వెంత కష్టపడ్డా మాకేమీ తెలియనీయకుండా నువ్వే భారం వహించావు. ఈరోజున మేమందరం మా కాళ్ళమీద నిలబడే స్థితికి వచ్చాం - ఇక మీదట నువ్వేమీ కష్టపడకుండా అమ్మా నువ్వు సుఖంగా ఉంటేచాలు'' అన్నాడు రామచంద్ర.

''నువ్వేమయినా చెప్పాలా?'' అన్నట్లు చిన్నకొడుకు వైపు చూశాడు దశరథరామయ్య.

''అన్నయ్య చెప్పింది సబబేకదా! ఈ వేడుక జరగడానికి ముందే మేమంతా ఒక నిర్ణయానికి వచ్చాం - ఇకమీదట మీరు కష్టపడటం మానెయ్యాలి - మాతో ఎవరిదగ్గరైనా ఉండండి. ఏ అవసరం ఉన్నా కనుసైగలతో చెప్పింది - కనుల ముందు ఉంచే బాధ్యతమాది. ఇంతకాలం ఎండనక - వాననక కష్టపడ్డారు. ఇప్పట్నించి బాధ్యతారహితంగా ప్రశాంత జీవనం జీవనదిలా అనుభవించండి'' అన్నాడు లక్ష్మణ్.

''నిజమే మామగారూ! నాకు పెళ్ళయినప్పట్నించి చూస్తున్నాను. మీరు పడ్డ శ్రమకి తగ్గట్లు అందరూ పైకి వచ్చారు. నేనూ మీ కొడుకులాంటివాడినే. ఇహ మీదట మీరు విశ్రాంతి తీసుకోండి. నా దగ్గర ఉన్నా మీ కూతురు మిమ్మల్నిద్దరినీ పువ్వుల్లో పెట్టి చూసుకుంటుంది'' అన్నాడు అల్లుడు.

ముగ్గురివైపు చూస్తూ ''చూడండి! చిన్నప్పటి నుంచీ ఈ ఊరి మట్టిలో పుట్టి పెరిగినవాణ్ణి నేను. తొలకరిజల్లులు ఆరిపోయిన మట్టినేల మీద పడగానే వచ్చే మట్టివాసన నన్ను మరో సంవత్సరం వరకు ఉత్తేజితున్ని చేస్తుంది. అదే నాకు వెయ్యిఏనుగుల బలం నాలో జవసత్త్వాలు ఉన్నంతవరకు బలవంతం చెయ్యకండి. ఆ తర్వాత అంటారా మీరు ఎలా చెబితే అలా నడుచుకుంటాను నేను'' అన్నాడు దశరథరామయ్య.

"ఈరోజు మీరు చెప్పిన మాట మేం ఎవరూ కాదనలేదు. ఎదిరించి మాట్లాడలేదు. ఈ ఊళ్ళోనే మీ సన్నిహితుల మధ్య శేష జీవితం సుఖంగా ప్రశాంతంగా ఉంటుందంటే అలానే చెయ్యండి. మీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తెలియచెయ్యడానికి - నేను కానీ - తమ్ముడు కానీ వచ్చి మీ అవసరం తీరుస్తాం" అన్నాడు రామచంద్ర.

"అలానే చేద్దాం. కానీ క్రమం తప్పకుండా ఉత్తరాలు రాస్తూ ఉండండి - నాకు ఫోన్‌లో మాట్లాడటం ఇష్టం ఉండదన్న విషయం మీకు తెలుసు. మా ఉత్తరాలు చదువుతూ ఉంటే - మీరు ఎదురుగా నిలబడి మాట్లాడుతున్నట్లే ఉంటుంది. మాకు మీరు ఎప్పుడు గుర్తు వచ్చినా నేను కానీ అమ్మకానీ మీ ఉత్తరాలు చదువుతూ కాలక్షేపం చేస్తాం. మాకు కాస్త బెంగతీరుతుంది - ఆ ఆనందమే వేరు" అన్నాడు దశరధరామయ్య.

దశరధరామయ్యకి మధ్యాహ్నం పూట పడక కుర్చీలో కూర్చుని కౌసల్య ఉత్తరం చదువుతూ ఉంటే - ప్రతీ అక్షరం వింటూ ఆనందించటం అలవాటు. అందుకే పిల్లలు ముగ్గురూ ప్రతివారం ఉత్తరం రాసేలా అలవాటు చేశాడు. వాళ్ళు కూడా వారంలో వేరు వేరు రోజులు ఉత్తరాలు అందేలా రాస్తారు. దశరధరామయ్య ఇంట ఇచ్చే ఆతిధ్యం కోసం, ఆయనకు ఉత్తరం ఎప్పుడు వస్తుందా? వెళదామా? అని ఎదురు చూస్తూ ఉంటాడు పోస్ట్‌మేన్.

"నాన్నా! మరొక్క విషయం. అడిగితే కాదనకూడదు" అన్నాడు రామచంద్ర.

"చెప్పు"

"అలవాటు ప్రకారం అప్పులు ఇవ్వడం - వడ్డీ వసూలు చెయ్యడం - ఎవరైనా కష్టపడుతూ ఉంటే దానాలు చెయ్యడం - ఈ ఆర్ధిక లావాదేవీలు మానెయ్యాలి"

"ఉన్నంతలో ఎదుటవాడికి దానం చెయ్యడంతో తప్పేం ఉందిరా" అన్నాడు దశరధరామయ్య.

"అదికాదు నాన్నా! తరాలు మారుతున్నాయి. విశ్వాసం - నిజాయితీ - కృతజ్ఞత వాటిదారి అవి చూసుకొన్నాయి. ఎవరినీ నమ్మలేని రోజులు. ఇంతకాలం చేశావంటే అర్ధం ఉంది. ప్రస్తుతం అవసరం ఏముంది? ఎవరికో ఇవ్వడం, తిరిగి ఇచ్చేంతవరకు నిద్రపట్టకపోవడం - ఆరోగ్యం దెబ్బతినడం - ఇవన్నీ ఈ వయస్సులో నీకు అవసరం అంటావా?" అన్నాడు లక్ష్మణ్.

"అదికాదురా! అవసరం కొద్దీ వస్తారు. ఉన్నంతలో ఇస్తాం. తర్వాత వాళ్ళే తీరుస్తారు. కొద్దిరోజులు అటో ఇటో తేడా అంతే. మన ఊళ్ళో మోసం చేసే వ్యక్తులు ఉన్నారని నేను అనుకోను" అన్నాడు దశరధరామయ్య.

"ఆ నమ్మకమే వద్దన్నది. ఈ రోజుల్లో కూడా అంతా హరిశ్చంద్రులే అంటావేంటి నాన్నా! మనుష్యుల్లో ఎంత స్వార్ధం పెరిగిపోతోందో చూశావా? ఆస్థి రాసేస్తే తల్లిదండ్రులనే పిల్లలు చూడటంలేదు. ఇచ్చేవరకు ఇంద్రుడు - చంద్రుడు అని పొగుడుతారు. తీరా పని అయిపోయిన తర్వాత మొహం చాటేస్తారు. అడిగితే అప్పటిదాకా ఉన్న బంధాలు తెగిపోతాయి. పొగిడిన వాళ్ళే వెటకారంగా మాట్లాడతారు" అన్నాడు రామచంద్ర.

"సరే ఏం చెయ్యమంటారో చెప్పండి" విసుగ్గా అన్నాడు దశరధరామయ్య.

"సంపాదన గురించి ఆలోచించకండి. తుఫాను వచ్చి పంట చేతికి రాకపోయినా బెంగపడకండి ఏరోజున కూడా ఒంటరిగా ఉండొద్దు. కష్టమనిపిస్తే ఆ క్షణం మాలో ఎవరో ఒకరి దగ్గరకు బయలుదేరి వచ్చేయండి" అన్నాడు రామచంద్ర.

"ఈ విషయంలో మాకు మాట ఇవ్వండి మామగారూ! ఇన్నాళ్ళకి కొడుకు మాట విన్నారనే ఆనందంతో వెళ్ళిపోతాం" అన్నాడు అల్లుడు.

భార్యవైపు చూశాడు దశధరామయ్య.

"వాళ్ళు అడిగిన దాంట్లో తప్పేం ఉందండి - పిల్లలేమీ అడ్డమైన కోరికలేమీ అడగటం లేదుకదా" అంది కౌసల్య.

ఇక చేసేదేమీ లేక ''సరే మీ ఇష్టప్రకారమే కానివ్వండి. అలానే చేస్తాను'' అన్నాడు దశరథరామయ్య.

తండ్రి మాట ఇస్తే జవదాటడనే నమ్మకంతో కుటుంబ సభ్యులంతా వెళ్ళిపోయారు.

దశరథరామయ్య హృదయం నవనీతం. పరుల కష్టాన్ని చూస్తే ఇట్టే కరిగిపోతాడు. ఎవరైనా కష్టపడుతూ ఉంటే ఆర్థికంగా సహాయం చేసి నోటు రాయించుకున్నా బలవంతంగా పీడించి వసూలు చెయ్యడు. అవతలి వ్యక్తి మరీలేనివాడయితే వడ్డీకూడ వసూలు చెయ్యడు, నోటి మాట జారడు.

షష్టిపూర్తి జరిగిన నెలరోజుల తర్వాత పొల నుండి తిరిగి వస్తుండగా దారిలో నూకయ్య కలిశాడు. నూకయ్య సన్నకారు రైతు అయినా నిజాయితీ పరుడు. మోసం అంటే ఎరుగనివాడు. చిన్నప్పట్నించి దశరథరామయ్యకు సన్నిహితుడు.

ఎదురుగా వస్తూనే ''నమస్కారం బాబూ! '' అంటూ చేతులెత్తి నమస్కరించాడు.

''చాలాకాలం అయింది నూకయ్యా - నిన్ను చూసి ఎలా ఉన్నావ్?'' అడిగాడు దశరథరామయ్య.

''క్షేమంగానే ఉన్నాను బాబయ్యా! ఆ మధ్య తమకు షష్టిపూర్తి జరిగిందని విన్నాను. రాలేకపోయాను క్షమించండి.''

''ఫర్లేదులే ఏంటి అంత అర్జంటుపని''

''అమ్మాయికి పెళ్ళి సంబంధం వచ్చింది. ఆ విషయమై మాట్లాడటానికి రమ్మంటే వెళ్ళాను.''

''కుదిరిందా? అబ్బాయ్ ఏం చేస్తున్నాడు?''

''ఇద్దరూ ఒకరికొకరు నచ్చారు. అబ్బాయి ప్రభుత్వోద్యోగి. బాగున్నాడు.. సంప్రదాయం బాగుంది''

''మరి ఇకనేం. వాళ్ళు అడిగిందేదో ఇచ్చేసి పెళ్ళి చేసేస్తే ఒక్కగానొక్క కూతురు జీవితం స్థిరపడిపోతుందికదా'' అన్నాడు దశరథరామయ్య.

''అంత సులువా బాబయ్యా! ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. నాలాంటి రైతుకి లక్షలంటే మాటలా'' అంటూ ఏదో అడగబోయి - సందేహిస్తూ ఆగిపోయాడు.

''ఏం నూకయ్యా! ఏదో అడగాలని ఆగిపోయినట్లున్నావ్?'' అన్నాడు దశరథరామయ్య.

''ఏంలేదు బాబయ్యా'' అంటూ వెళ్ళిపోయాడు.

నాలుగురోజుల తర్వాత దశరథరామయ్య వరండాలో కూర్చుని ఉండగా నూకయ్య వచ్చాడు. ''ఏం చేశావ్ అమ్మాయి పెళ్ళి?'' అడిగాడు దశరథరామయ్య. చేతులు కట్టుకుని తలదించుకుని నిలబడ్డాడు మౌనంగా.

''అలా ఉన్నావే?''

''ఏం లేదు బాబయ్యా! కొంచెం డబ్బు సర్దుబాటు కాలేదు మీరు రెండు లక్షలు సర్దితే'' అంటూ నసిగాడు.

''చూడు నూకయ్యా! ఇదివరకులా నేను ఎవ్వరికీ డబ్బు ఇవ్వడంలేదు. ఇవ్వనని పిల్లలకు మాట ఇచ్చాను''

''ఒక్కగానొక్క కూతురు. అది ఇంటిదైపోతే నా భుజాల మీద ఉన్న భారం తొలిగిపోతుంది. నేనూ మా ఆవిడ కూలిపని చేసుకునైనా బ్రతికేస్తాం. నామీద దయతలచండి బాబయ్యా! ఉన్న రెండెకరాల పొలం కాగితాలు మీ దగ్గర పెడతాను. తిరిగి మూడు నెలల్లో ఇచ్చే బాధ్యతనాది. ఈ ఊళ్ళో ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నన్ను మీరే దేవుడిలా కాపాడారు. ఈ ఒక్కసారికి గట్టెక్కించి పుణ్యం కట్టుకోండి'' అని కాళ్ళకు దండం పెట్టాడు.

దశరథరామయ్య మౌనంగా ఉండిపోయాడు. కొంచెం సేపు వేచి ఏం చెయ్యాలో తోచక నూకయ్య వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి దశరథరామయ్యకి నిద్రపట్టలేదు - నూకయ్య కూతురు. తనకి పౌత్ర సంతతి లేనప్పుడు ''తాతా'' అంటూ తన చుట్టూ తిరుగుతూ ఆడుకోవడం గుర్తుకు వచ్చింది. ఒక వైపు పిల్లలకిచ్చిన మాట. మరోవైపు తన కళ్ళ ఎదురుగా పెరిగిన అమ్మాయి జీవితం. ఎటూ తేల్చుకోలేలపోయాడు. చివరకు పిల్లలకిచ్చిన బాస ముందు అమ్మాయి జీవితం, పరోపకారాపేక్ష, మానవత్వం నెగ్గాయి. నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రశాంతంగా నిద్రపోయాడు.

అప్పటికే నూకయ్య వచ్చి మూడురోజులయింది. ఉదయాన్నే నూకయ్య ఇంటికి వెళ్ళాడు

''నూకయ్యా! నేను మాట ఇస్తే తప్పనని నీకు తెలుసు. కానీ మీ అమ్మాయి జీవితం కోసం మొదటిసారిగా మాట తప్పుతున్నాను. పిల్లలికిచ్చిన మాట నిలపుకోలేకపోతున్నాను ఇదిగో నువ్వడిగిన డబ్బు. ఎట్టి పరిస్థితుల్లోనూ మూడునెలల్లో ఇచ్చేయాలి. ఈ విషయం నీకూ - నాకూ తప్ప మూడో మనిషికి తెలియకూడదు'' అన్నాడు దశరథరామయ్య.

ఆయన దాతృత్వం ముందు నూకయ్య మనసు మూగవోయింది కళ్ళలో నీళ్ళు పెల్లుబికాయి. నోట మాట రాలేదు. కాళ్ళమీద పడిపోయాడు. తేరుకుని ''మూడు నెలల్లో మీ డబ్బు మీకు అందజేస్తాను. మీకు మాట రానివ్వను. నన్ను నమ్మండి'' అన్నాడు నూకయ్య.

డా.మల్లికార్జున రావు ఛేంబర్లో డాక్టరు ఎదురుగా కూర్చుని ఉన్నాడు రామచంద్ర దీనవదనంతో.

''చూడండి రామచంద్రగారూ! మీ నాన్నగారి మానసిక ఒత్తిడికి కారణం ఇదీ'' అంటూ నూకయ్య విషయం చెప్పాడు డాక్టరు. వినగానే తండ్రిమీద జాలిపడాలో - నూకయ్య చేసిన మోసానికి తగిన శిక్ష వేయాలో బోధ పడలేదు రామచంద్రకి. డాక్టరు దగ్గర మందుల చీటీ తీసుకుని తండ్రిని కూడా తీసుకుని ఇంటికి వెళ్ళాడు. డాక్టరుగారి మందులవల్ల దశరథరామయ్యకి నిద్రపడుతోంది కానీ, నలుగురితో మాట్లాడటం ఇదివరకటి ఉత్సాహం కరువైంది. తల్లి బలవంతం మీద తండ్రిని తీసుకుని స్వంత ఊరు వచ్చాడు. రాగానే చుట్టుప్రక్కల విచారిస్తే నూకయ్య ఊరువదిలి వెళ్ళిపోయాడని అతను ఉన్న ఊరు పేరు చెప్పారు మరుసటి రోజు తెలవారకముందే నూకయ్య ఇంటికివెళ్ళాడు ''నూకయ్యా..'' పిలిచాడు.

నూకయ్య ఇంటిలోనుంచి బయటకు వచ్చాడు.

''మీరా పెదబాబుగారూ!'' అన్నాడు

''నూకయ్యా! నువ్వు నాన్నగారి దగ్గర డబ్బుతీసుకున్నావా?'' అడిగాడు.

నూకయ్య మాట్లాడలేదు. అపరాధిలా తలదించుకుని నిలబడ్డాడు.

''నాన్నగారు చెప్పకపోయినా తెలిసింది. ఇచ్చేంతవరకు ఇంటి చుట్టూ తిరుగుతారు. అవసరం తీరగానే మొహం చాటేస్తారు. ఆయన పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుసా? పైగా ఊరు వదిలి వచ్చేశావ్''

''క్షమించండి పెద్దబాబూ! పెళ్ళిలో కట్నం గురించి గొడవ మొదలయింది అందుతుంది అనుకున్న సొమ్ము అందలేదు. అందుకని నాకున్న రెండెకరాలలో ఒకటి రాసి ఇచ్చేశాను. రెండవది అమ్మేసి డబ్బు ఇచ్చేద్దామనుకున్నాను. అమ్ముదామనుకునేసరికి సగం రేటుకి అడుగుతున్నారు. ఏవిధంగానైనా తీర్చేస్తాను. ఆఖరుకి పాలేరుగానైనా పనిచేసి తీరుస్తాను. నన్ను నమ్మండి పెద్దబాబూ!'' అన్నాడు నూకయ్య.

''నటనలో మిమ్మల్ని మించిన వాళ్ళులేరు. సగానికి అమ్ముతావో పూర్తిగా అమ్ముతావో అనవసరం. ఈ విషయం నీకు - నాకు - నాన్నగారికి తప్ప మరొకరికి తెలియదు. తెలిసేలోపల ఇచ్చేస్తే అందరి పరువు దక్కుతుంది. జాగ్రత్త!'' అని రామచంద్ర వెళ్ళిపోయాడు.

పదిహేనురోజుల తర్వాత ''అమ్మా'' అనే పిలుపు వినబడేసరికి ఇంట్లో పనిచేసుకుంటున్న కౌసల్య వరండాలోకి వచ్చింది. ఎదురుగా నూకయ్య. మనిషి చిక్కిపోయాడు. గడ్డం పెరిగింది చేతిలో చిన్న గుడ్డ సంచి.

"ఏం నూకయ్యా! అయ్యగారిని చూడటానికి వచ్చావా?"

తలదించుకుని నిలబడ్డాడు నూకయ్య.

"నూకయ్యా నువ్వెళ్ళి పలకరించినా బాబుగ్గారు నిన్నుగుర్తుపట్టే స్థితిలో లేరు. నీ మొహంలో బడలిక చూస్తూంటే ఎంతో కష్టపడి వచ్చావని అర్థమవుతోంది. వెళ్ళు. వరండాలో మూలనున్న గదిలో ఉన్నారు" అంది కౌసల్య.

నెమ్మనెమ్మదిగా మనసులో జరుగుతున్న సంఘర్షణల అలజడిని తట్టుకోవటానికి ప్రయత్నిస్తూ అడుగులు గదివైపు వేశాడు. గుమ్మం దగ్గరకు చేరేసరికి ఆ గదిలో ప్రక్కకు తిరిగి గాల్లో చేతులు ఊపుతూ కూర్చుని ఉన్నాడు దశరధరామయ్య.

ఆ స్థితిలో ఆయన్ని చూడగానే నూకయ్య గుండె తరుక్కుపోయింది. అడుగులు తడబడ్డాయి. దీనికి మూలకారణం తనే అనుకునేసరికి హృదయం పశ్చాత్తాపంతో ద్రవించింది. దగ్గరకు నడిచాడు. అడుగుల చప్పుడుకి కూడా ఎటువంటి స్పందనలేదు. భయపడుతూ దగ్గరకు వెళ్ళాడు. "బాబయ్యా" పిలిచాడు.

వెర్రిచూపులతో దశరధరామయ్య తలేత్తి చూశాడు. ముఖంలో ఏ భావంలేదు నిర్లిప్తంగా ఉంది.

"నేను బాబయ్యా నూకయ్యని" గట్టిగా చెవిలో చెప్పాడు.

కళ్ళలో కదలికలు - మొహంలో మార్పు. కళ్ళు విప్పారించి చూశాడు దశరధరామయ్య. మరొకసారి తనెవరో చెప్పాడు నూకయ్య.

"నువ్వా! వచ్చావా నూకయ్యా! ఎన్నాళ్ళయింది నిన్ను చూసి రా...రా ఇలా కూర్చో" అన్నాడు ఆనందం, ఆశ్చర్యం మిళితమైన స్వరంతో దశరధరామయ్య.

"నేనే బాబయ్యా! క్షమించండి. మాట నిలబెట్టుకోలేకపోయాను. మిమ్మల్ని చాలా బాధపెట్టాను" అన్నాడు.

"ఫర్లేదులే నూకయ్యా! ఎవరి కష్టాలు వారివి. ఇంతకీ అమ్మాయి పెళ్ళి బాగా జరిగిందా! అల్లుడూ, అమ్మాయి కులాసాగా ఉన్నారా?" యధాస్థితికి వచ్చాడు దశరధరామయ్య. పాతరోజుల్లోలాగా.

ఆయన విశాల హృదయానికి మనస్సులోనే జోహార్లు అర్పించకుండా ఉండలేకపోయాడు. భుజం మీద కండువాతో కన్నీళ్ళు తుడుచుకుంటూ దశరధరామయ్య కాళ్ళమీద పడిపోయాడు నూకయ్య.

"తప్పు - లే" అంటూ నూకయ్యని లేపి భుజాల మీద చేతులు వేసి దగ్గరకు తీసుకున్నాడు.

"బాబయ్యా ఆలస్యం అయింది క్షమించండి" అంటూ సంచిలో డబ్బు తీసి మంచం మీద పెట్టాడు. దశరధరామయ్య మనసు విహంగంలా ఎగిరింది. ఆనందం దిగంతాలకు వ్యాపించింది. డబ్బు తీసి కనపడకుండా తలగడ క్రిందపెట్టి "కౌసల్యా" అంటూ ఇల్లంతా ప్రతిధ్వనించేలా పిలిచాడు. ఈ మధ్య కాలంలో భర్తనోట వినబడని పేరు వినేసరికి విస్మయంతో పాటు ఆనందం కూడా కలిగింది. హర్షాతిశయంతో వస్తున్నానంటూ, వంటింట్లో చేస్తున్న పని వదిలేసి, కొంగుతో చేతులు తుడుచుకుంటూ పరుగు పరుగున వచ్చింది కౌసల్య.

"నూకయ్య వచ్చాడు. పాపం మనిషి చూడు ఎంత నీరసంగా ఉన్నాడో. కాస్త భోజనం పెట్టి పంపించు" అన్నాడు.

ఆ మాటలు వింటూంటే దశరధరామయ్యలో దేవుడు కనబడ్డాడు నూకయ్యకి.

భర్త పూర్వపు రోజులలోలాగానే అతిధి మర్యాదలు చేయమనేసరికి, భర్తలో కలిగిన మార్పుకి కౌసల్య మనసంతా పున్నమి వెన్నెలలా అయింది. మొహం పున్నమి చంద్రుడిలా వెలిగింది.

మండువా లోగిలిలో మళ్ళీ నవవసంతం వెల్లివిరుస్తోంది. దీపాలు దేదీప్యమానంగా రంగులు వెదజల్లుతున్నాయి. దశరథరామయ్య తనచుట్టూ మనవ్వలు మనవరాళ్ళని పెట్టుకుని ఆడుకుంటున్నాడు. కౌసల్య వంటింట్లో పిండివంటలు చేస్తోంది.

దూరంగా మామిడి చెట్టుక్రింద రామచంద్ర, భార్య జానకి మాట్లాడుకుంటున్నారు.

"మామగారిలో మళ్ళీ ఇలా ఉత్సాహం, ఆనందం వస్తాయని అనుకోలేదండీ. మీరు మొదట నాతో సంప్రదించినప్పుడు ఇలా జరుగుతుందని ఊహించలేదు" అంది జానకి.

"జానకీ గడిచిన ఆరునెలలు ఎంత మానసిక ఒత్తిడికి గురయివుంటారోకదా! ఆ ఒత్తిడి తగ్గేసరికి మాములు మనిషయిపోయారు. ఆయనతో డబ్బుగురించి ఆలోచించవద్దు. పోయినా ఫర్లేదు అని చెప్పొచ్చు కానీ జీవితాంతం ఈ విషయం ఆయన మనసుని దొలుస్తూనే ఉంటుంది. ఇప్పుడు ఉన్నంత సంతోషంగా ఉండడు. కాదంటావా? అది ఆలోచించి నూకయ్యని పిలిచి తన ద్వారానే రెండు లక్షలు పంపించాను. అది ఎవరికీ తెలియనివ్వద్దన్నాను. నూకయ్య మనకి తిరిగి ఇస్తాడా లేదా అనేది అప్రస్తుతం. కానీ నాన్నగారి ఆరోగ్యం బాగుపడింది కదా. కొడుకుగా నాకు ఇంతకంటే ఏంకావాలి" అన్నాడు రామచంద్ర.

"ఎంత అయినా దశరథరాముని కొడుకేకదా శ్రీరాముడు" అంది జానకి నవ్వుతూ.

కథా కౌముది

# అట్టు

శ్రీకళ అబ్బరాజు

**అచ్చ తెలుగు అట్టు** అంటే తెల్లగా, మెత్తగా, కాస్తంత మందంగా, ఆవకాయతో నంజుకున్నా అద్భుతంగా, నోట్లో వేస్తే కరిగిపోయేలాగా, గుర్తొస్తే అప్పటికప్పుడే ఓ అరడజను లాగించేలాగా ఉంటుందంటే అతిశయోక్తికాదు.

తాత ముత్తాతల కాలం నుంచీ అప్రతిహతంగా సాగిన బిజినెస్ ఏదయ్యా అంటే, అట్ల బిజినెస్సే. తెలుగునాట, వాడవాడలా వెలిసిన అట్లకొట్లే ఇందుకు అసలు సిసలైన ఉదాహరణ. ఈ అట్ల కొట్లలో ఎంతోమంది ఘనులు వెండిపళ్ళాలు సైతం తాకట్టు పెట్టారు (ట).

ఇంట్లో, మా ఆవిడ వారానికి రెండుసార్లు అట్లు వేసినా, బయట హోటళ్ళలో పేపర్ రోస్టులూ, మసాలా దోశలూ ఎన్ని తిన్నా, నేటివ్ టేస్ట్ కోసం, నేనూ మా పక్కవీధిలో ఉండే వెంకాయమ్మ కొట్టుకి వెడుతూనే ఉంటాను.

వెంకాయమ్మ ఆంగికం, వాచకం అచ్చంగా బాపూ సినిమాలో సూర్యకాంతాన్నే తలపిస్తాయి. పొయ్యి వేడికి చిరాగ్గా లేకుండా నడినెత్తికి పెట్టిన పిడక చుట్ట, రోజులో ఎక్కువ భాగం కూర్చుని ఉండడం వల్ల తయారైన ఊబకాయం.. నూనె సెగకి జిడ్డోడుతూ ఉండే ముఖం. ఇదీ వెంకాయమ్మ ఆకారం.

అయితేనేం, ఎత్తైన పీట మీద కూర్చుని, పిండిలో గరిటె తిప్పే, వేడి వేడి పెనం మీద లాఘవంగా నెరుపుతూ అట్టు వేసిందంటే, సాక్షాత్తూ అట్లకాడ పట్టుకున్న అన్నపూర్ణమ్మలానే అనిపించేది.

ఇక మాటా, మంతికి వస్తే వెంకాయమ్మ నోరెత్తితే మైకు లేకుండానే నాలుగూళ్ళకి వినబడాలి. తిట్లకి లేచిందంటే, ఎదుటివాడికి కౌంటర్‌గా తిట్టడానికి ఒక్క తిట్టు మిగలకూడదు.

కొట్టు ముందు చేరిన వాళ్ళని, "అన్నాయ్.. ఇంకోటేస్కో..", "ఏరా శీనుగా.. ఎప్పుడు డబ్బిచ్చేదీ?", "ఏమయ్యోయ్ ఆయనక్కాస్త చట్నీ ఎయ్. (ఈఏమయ్యోయ్ వెంకాయమ్మ మొగుడు).. ఇలా పొయ్యి ముందు నుంచి కదలకుండానే పన్లు చక్కబెడుతూ ఉంటుంది.

సెల్‌ఫోన్‌లో "నాలుగట్లు పంపించు వెంకాయమ్మ!" అని వచ్చే ఆర్డర్లకీ, నలుగురిలోకి రావడానికి మొహమాటపడే ఆడపిల్లలకీ, ఇంట్లో లంచ్‌బాక్స్ లేటయ్యిన స్కూలు పిల్లలకీ పార్శిళ్ళు అందించడానికో పనికుర్రాడు.

"ఏమయ్యోయ్" అని అదిలిస్తూనే చేతులు కట్టుకుని నిలబడే మొగుడు. తిని, డబ్బు ఇవ్వడానికి మాలాంటి వాళ్ళు. వెరసి, ఆనందంగా సాగిపోతూ ఉంది వెంకాయమ్మ అట్ల సంసారం.

ఎల్లప్పుడూ ఒకేలా సాగిపోతే దానిలో ఏముంటుంది కిక్కు? లోకంలో ఎన్ని మార్పులు జరిగాయి!! మా ప్రాంతంలో కొత్త రాజధాని వచ్చింది. చిన్న సెంటర్‌లు బిజీ సెంటర్‌లు అయిపోయాయి. ఇళ్ళన్నీ అపార్టుమెంటు అవతారాలెత్తుతున్నాయి. ఈ పరిణామంలో వెంకాయమ్మ కొట్టు ఆనుకుని ఉన్న ఇల్లు కూడా అపార్టుమెంటుగా మారబోతూ ఉంది. కట్టుబడి జరుగుతూ ఉంటే, సిమెంటూ - ఇటుకరాయి దువ్వ కలిసిన అట్లు అమ్మలేక వెంకాయమ్మ కొట్టు మూసేసుకుంది.

"వెంకాయమ్మ చేసే మెత్తని అట్లు, ఉల్లికారం ఇక తినలేము కదా! " అని నేనూ విచారపడిపోయాను.

ఒకరోజు పొద్దున్నే గలగలా మాటలూ, మధ్య మధ్య సుత్తితో మోదినట్టు ఖంగు ఖంగుమని ఆడగొంతుక వినిపిస్తూ ఉంటే, "ఏమిటీ న్యూసెన్సు?" అని చిరాగ్గా బయటికి వచ్చి చూశాను.

మా ఇంటి ఎదురుగ్గా అపర అట్ల దేవతలా వెంకాయమ్మ కొట్టుతో సహా వెలిసింది.

నెలవు తప్పితే మిత్రులే శత్రువులు అవుతారని సుమతీ శతకంలో చెప్పినట్టు, ఆ రోజు నుంచి నేనెంతో అభిమానిచే వెంకాయమ్మ నాకు పరమశత్రువుగా మారింది.

పొద్దుట ఆరింటినుంచి మధ్యాహ్నం పన్నెండుగంటలవరకూ ఇంటి ముందు ఒకటే న్యూసెన్సు. ప్రశాంతంగా పేపరు చదవుకోవడానికి కూడా వీల్లేకుండాపోయింది. ఒక్కోరోజు పేపరే మాయం అవుతుంది.

ఆకతాయి కుర్రాళ్ళు ఇళ్ళల్లోకి తొంగి చూడడాలు... చెంబులూ, తప్పేలాలూ మాయమవ్వడాలూ. తెలిసినవాళ్ళెవరైనా అట్లకోసం వస్తే, అక్కడ నిలబడలేక పనిగట్టుకు మరీ ఇంటికి వచ్చి వేళాపాళా లేకుండా హస్కు వేయడాలూ పెద్ద తలనొప్పిగా తయారయ్యింది.

ఒక సాయంత్రం, ఎదురింటి సుబ్బారావు కనిపించాడు.

ఈ విషయం అతనితో చర్చిద్దామని, "చూశారా! వెంకాయమ్మ కొట్టు పెట్టాక ఎంత న్యూసెన్సుగా ఉందో?" అన్నాను.

"మీకు ఒక్క న్యూసెన్సే, మాకు డబుల్ న్యూసెన్స్‌గా ఉంది. మా గోడ పక్కనే కదా!" అన్నాడు.

"మా సత్తుబక్కెట్, ప్లాస్టిక్ టబ్బు పోయాయండీ. ఎప్పుడూ అక్కడ జనం. ఎవళ్ళెత్తుకెళ్ళారో ఏమిటో!?"

"మా సైకిలూ, సోప్‌బాక్సూ పోయాయి. మాకు మరీ గోడపక్కనే కదా!"

"మాకు చిరాకొస్తుందండీ"

"మాకు పొగ కూడా వస్తుంది, మరీ గోడపక్కనే కదా!"

"నాకు మనశ్శాంతి పోయింది"

"మా గోడకు రంగు కూడా పోయింది. పక్కనే కదా!"

ఇలా అభిప్రాయాలు కలిసిపోయాక, ఇద్దరం కలిసి వెంకాయమ్మ కొట్టుని అక్కణ్ణుంచి తరలించేట్లు చేయాలని సంకల్పించాం.

ఆమె మీద వ్యక్తిగతంగా కోపం లేదు. ఆ కొట్టుని మాత్రం కొట్ల బజారువైపు పెట్టుకుంటే బావుంటుందని చెప్పాలని కూడా నిర్ణయించాము.

"మీ గోడ పక్కనే ఉంది కాబట్టి మీరు చెబితేనే బావుంటుంది" అన్నానాయనతో ఆయనా, 'సరే'నన్నాడు.

మర్రోజు ఉదయాన, సుబ్బారావు ఎలా చెప్పాడోగానీ, పెద్దగా అరుస్తూ ఉంది వెంకాయమ్మ. ఆమె నోటికి ఆయన జడవలేదు. మిడిల్ క్లాసు మొహమాటాన్ని అధిగమించి మరీ లడాయికి దిగాడు. బాగా హోరాహోరీగా సాగింది మాటల యుద్ధం.

మధ్యలో అట్లు తినడానికి వచ్చిన పెద్దమనుషులూ, ఊరికే ఉండలేదు. టెక్నికల్‌గా, వెంకాయమ్మ కొట్టు (పాక) మున్సిపాలిటీ స్థలంలో ఉందా? గోడకీ, కొట్టుకీ మధ్య ఎంత దూరం ఉండాలి? మున్సిపాలిటీ కుళాయి ఉంటే ఎక్కువ న్యూసెన్సా, కొట్టు ఉంటేనా? అని అక్కర్లేని డిస్కషన్స్ అన్నీ చేస్తూ మరి నాలుగు అట్లు ఎక్కువే లాగించారు.

సుబ్బారావూ, అంత త్వరగా ఓటమిని అంగీకరించలేదు. కొత్త, కొత్త ప్రయోగాలూ, పాయింట్లూ సిద్ధం చేసుకుని రోజూ గొడవ పడుతూనే ఉండేవాడు. దానివల్ల వెంకాయమ్మ సేల్సు రెట్టింపు అయ్యాయి కానీ, మరోటి జరగలేదు.

నేనూ, ఆయనకి నైతికంగా మద్దతు ప్రకటించాలని నిర్ణయించుకున్నాను. మా వీధిలో ఉన్న ప్రతి ఒక్కరి ఇంటికీ వెళ్ళి, అట్లు ఆరోగ్యానికి ఎంత హానికరమో, కొలెస్ట్రాల్ లెవల్స్ వాటి వల్ల ఎలా పెరుగుతాయో, వీధిలో పెట్టి అమ్మడం ఎంత ఇన్‌హైజనిక్కో, పాయింట్లు.. పాయింట్లుగా వివరించి కరపత్రాలు పంచాను.

"ఇలాగే కొనసాగితే రేపు మన ఇళ్ళముందు నడవడానికి కూడా సందులేకుండా కొట్లు, బండ్లు తయారైతే మన పిల్లలు రోడ్డుమీద క్రికెట్ ఎట్లు ఆడుకుంటారు? మన గోడలకి వేసిన గోపీరంగు ఎవళ్ళకైనా కనబడుతుందా? ఈ అట్లు తిని లావయితే ఒబేసిటీ తగ్గించుకోవడానికి ఎంత ఖర్చవుతుంది?..." అని ఆవేశంగా ఉపన్యాసం కూడా దంచేశాను. దాని ప్రభావం బానే కనిపించింది.

మా వీధిలోని వాళ్ళందరూ, "వెంకాయమ్మ దగ్గర మేం అట్లు కొనం" అని మా దగ్గర ఒట్లు కూడా వేశారు.

నాలుగు రోజుల పాటు, వాళ్ళకి మేము చెప్పినవి గుర్తున్నాయి. అయిదవరోజు నుండి ఒట్టు తీసి గట్టున పారేసి, మేము చూడకుండా కొనుక్కుపోవడం మొదలుపెట్టారు.

ఇలా లాభం లేదని పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాం. పోలీసతను వచ్చి వెంకాయమ్మను దబాయించి ఇంకో వంద ఎక్కువగా, "మామూలు" తీసుకుని వెళ్ళాడు. "ఉపయోగం లేదండీ. ఇదే అమెరికా అయితే, ఎవడన్నా ఇలా చేయగలడా? మనది భారతదేశం. ఇక్కడ మిడిల్ క్లాసు వాడు ఎందుకూ కొరగాడు" నీరసపడి అన్నాడు, సుబ్బారావు.

"మీరేం బాధపడకండి. ఈసారి కమీషనర్ గారి దగ్గరికెళ్దాం. ఎలా పని జరగదో చూద్దాం!" అని ధైర్యవచనాలు చెప్పి ఉత్సాహం నింపాను.

వీధిలోని వాళ్ళందరి దగ్గరా సంతకాలు సేకరించి, టౌన్ ప్లానింగ్ కమీషనర్‌కి, ఎన్విరాన్మెంటల్ డిపార్టుమెంటువారికి, పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కి, ఇంకా మాకు టౌన్లో ఎవరు పెద్ద ఆఫీసరుగా తోస్తే వాళ్ళందరికీ పంచి ఇచ్చాం.

మా ప్రయత్నం వృధా పోలేదు.

ఒకరిద్దరు ఆఫీసర్లు వెంకాయమ్మ కొట్టుకి వచ్చివెళ్ళారు.

"ఏం జరుగుతుందా?" అని నేనూ, సుబ్బారావూ ఆసక్తిగా ఎదురుచూస్తూ ఉన్నాం. తెల్లవారేసరికల్లా వెంకాయమ్మ కొట్టుకాస్తా మాయం అయ్యింది. కానీ, దాని స్థానంలో ఒక మొబైల్ బండి ప్రత్యక్షమయ్యింది. దాన్లో పిండిగిన్నెలు పెట్టుకోడానికి అరలు, పైన టాపు, క్రింద కూర్చుని అట్లు వేస్తుంటే ఎండపడకుండా ఒక ఎడ్జస్టబుల్ సన్‌షేడ్‌తో అట్టహాసంగా ఉంది. స్ట్రీట్ వెండర్ లైసెన్సు కూడా తీసుకుంది వెంకాయమ్మ.

"ఆ లైసెన్సు తిరిగి అమ్ముకునేవారికి కదండీ? ఇలా పర్మినెంటుగా ఒకచోటే ఉండి బిజినెస్ చేసేవారికి వర్తిస్తుందంటారా?" సుబ్బారావు "లా" పాయింటు లాగడానికి ప్రయత్నం చేశాడు.

"ఎవరన్నా వచ్చి అడిగితే, ఇది మొబైల్ బిజినెస్సే, ఇప్పుడే ఇక్కడికి వచ్చాం. ఓ అరగంటలో వెళతాం అంటారు. ఇహ లాభం లేదండీ" అన్నాను మూతి విరుస్తూ.

ఆ తర్వాత సుబ్బారావు కొన్ని రకాల ప్రయత్నాలేవో చేశాడు కానీ, ఏవీ ఫలించలేదు. ఎటూ పాలుపోక ఇద్దరం మిడిల్ క్లాస్ మంత్రం ప్రయోగించాం. అంటే, నోర్మూసుక్కూర్చోవడం అన్నమాట.

వెంకాయమ్మ మాత్రం మావల్ల మొబైల్ బండి కొనాల్సి వచ్చినందుకూ, లైసెన్సుకి డబ్బు కట్టాల్సి వచ్చినందుకూ.. ఒళ్ళు మండినప్పుడల్లా దండకం ఎత్తుకుంటూనే ఉంది.

ఏం చేయలేక, అట్లు తినాలన్నా, వాటి వాసన చూడాలన్నా గిట్టనట్టుగా ప్రవర్తించి, నన్ను నేను శాంతపరచుకోవడానికి ప్రయత్నించాను. సుబ్బారావు కూడా వెంకాయమ్మతో పోరాటం ఆపేసి స్తబ్దుగా అయిపోయాడు.

ఆర్నెల్ల తర్వాత. మా అమ్మాయిని ఇంజనీరిగ్ కాలేజీలో చేర్పించడానికి వెళ్ళి, నాలుగురోజులు ఉండి, తిరిగి వచ్చాను.

బస్టాపులో దిగి ఇంటివైపుకు నడుస్తూ ఉన్నాను. ఎప్పుడూ కనిపించే దృశ్యం. కిటకిటలాడుతూ అట్లబండి దగ్గర మూగిన జనం.

నాలుగడుగులు వేశాక, అట్లు పోస్తున్న వ్యక్తిని చూసి కొయ్యబారిపోయాను. అతను సాక్షాత్తూ మా సుబ్బారావు.

"నా పరిస్థితి ఇల్లు అమ్ముకుని రోడ్డున పడేదాకా వచ్చింది మాస్టారూ! దానికంటే, రోడ్డు మీద నిలబడి అట్లు అమ్ముకోవడమే నయం అనిపించింది." అని చెబుతున్నప్పుడు సుబ్బారావు కళ్ళల్లో సన్నని నీటి తెర.

వెంకాయమ్మకి నూనె సెగలు ఏళ్ళ తరబడి పీల్చీ... పీల్చీ... ఊపిరితిత్తులు పాడైనాయి. ఊబకాయం వల్ల కీళ్ళ వాతం వచ్చింది. అందుకే, బండిని సుబ్బారావుకే అమ్మి, ఇంట్లో కూర్చుని వడ్డీవ్యాపారం చేసుకుంటూ ఉంది.

మధ్య తరగతి కుటుంబీకుడైన సుబ్బారావు, పరువుకి పెద్దపీట వేసి, ఏ నుయ్యో, గొయ్యో చూసుకోకుండా, అట్లు అమ్మడం మేలే అనుకున్నాను. వెంకాయమ్మ ఎపిసోడ్‌లో సుబ్బారావు మిడిల్‌క్లాసు మొహమాటాన్ని వదుల్చుకోగలిగాడు. బతుక్కి ఓదారి వెతుక్కున్నాడు.

నాకు అర్థం అయ్యిందేమంటే, అట్ల బిజినెస్‌ని ఆపడం ఎవ్వరితరంకాదని.

అట్లు జరిగెన్.



కథా కౌముది

# రిటైర్మెంట్

అంజన కె.

ఫంక్షన్ హాల్ చాలా అందంగా అలంకరించబడింది. పిల్లల కేరింతలు, పెద్దవాళ్ల కబుర్లు, కమ్మని వంటకాల సువాసనలతో ఆ ప్రాంగణమంతా నిండిపోయింది.

"మీ అమ్మ పుట్టిన రోజు చాలా గ్రాండ్ గా చేస్తున్నారోయి! చాలా సంతోషం" మధు భుజం మీద తట్టి చెప్పాడు మేనమామ వరస అయ్యే పెద్ద మనిషి.

"తన షష్ఠిపూర్తి కదా.! అదికాకుండా ఇన్నాళ్లుగా గవర్నమెంట్ కి పని చేసి రిటైర్ అయ్యింది. ఐదేళ్ల క్రితం నాన్నకు కూడా అమ్మ ఇలానే చేసింది. ఇప్పుడు అమ్మ వంతు.."

"ఈ రోజుల్లో తల్లితండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు పిల్లలు. అలాంటిది మీరు ఇలా ఉండటం నిజంగా మీ వాళ్ళు చేసుకున్న అదృష్టం."

కొంచెం గర్వంతో కూడుకున్న చిరునవ్వు తొంగి చూసింది మధు మొహం మీద.

మధు, రఘు, రజని– వీరు ముగ్గురు రాధిక, శ్రీనివాస్ దంపతుల పిల్లలు. అందరు జీవితంలో బాగానే స్థిరపడ్డారు. రాధిక శ్రీనివాస్ లు ఇరువురు ప్రభుత్వ ఉద్యోగాలు చేసి రిటైర్ అయ్యారు. ఇద్దరు కూడా మధ్యతరగతి కుటుంబం లోని బాధ్యతలు, వొడిదుడుకుల మధ్య, నిరాశ నిస్పృహలని దాటుకుంటూ వచ్చారు.

శ్రీనివాస్ కు ఇద్దరు చెల్లెళ్ళు. అన్నగా పెట్టుపోతలకు బాగానే ఖర్చు చేసే వాడు. రాధిక కూడా చాలా తెలివిగా ఖర్చులకు డబ్బు దాచిపెడుతూ, అటు ఆడపడుచులకు కానీ, ఇటు పిల్లలకు కానీ తమ ఆర్ధిక ఇబ్బందులు తెలియకుండా పెంచింది. తమ మర్యాదకు లోటు రానివ్వకుండా రజని కి మంచి సంబంధం చూసి, మంచి కట్నం తో పెళ్లి చేశారు.

పిల్లలు అనుకున్నట్లే రాధిక షష్ఠిపూర్తి మహోత్సవం చాలా ఆనందంగా, బంధు మిత్రుల సమక్షంలో జరిగింది. అందరూ వారి కుటుంబాన్ని ఎంతో మెచ్చుకున్నారు. రాధిక మొహం లో పెద్దగా ఏ భావం ప్రకటించలేదు, చిన్న చిరునవ్వు తప్ప. చాలా సేపటికీ శ్రీనివాస్ గమనించాడు రాధిక నిర్లిప్తత.

"ఏమయ్యింది నీకు?చాలా మౌనంగా వున్నావు. ఫంక్షన్ బాగానే జరిగింది కదా, ఇద్దరం రిటైర్ అయ్యాము, ఇక హాయిగా కొడుకుల దగ్గరే ఉండిపోయి, మనుమళ్లతో ఆడుకుంటూ కాలక్షేపం చేయచ్చు".

రాధిక కు ఆశ్చర్యం వేసింది, శ్రీనివాస్ తన గురించి ఇంత గమనింపుతో తన మూడ్ సంగతి అడిగినందుకు. ఏనాడూ పెద్ద పట్టించుకోలేదు, తన మనసులో ఏముందో, ఏమౌతోందో!

"మిమ్మల్ని ఇదివరకే అడిగాను, మీరు సరైన సమాధానం చెప్పలేదు. రిటైర్ అయ్యాక ఈ జీవితం ఎలా గడుపుదాం?"

"ఏముంది చెప్పటానికి? నాకు ఐదేళ్లుగా ఈ జీవితం అలవాటు అయ్యింది కదా. మార్నింగ్ వాక్, వాపసు వచ్చాక పేపర్ చదివి టిఫిన్ తినటం, టీవీ, లంచ్, కాసేపు అలా కునుకు తీసి, సాయంత్రం నాలాంటి రిటైర్ అయ్యిన ఫ్రెండ్స్ తో కాలక్షేపం. తరవాత డిన్నర్, టీవీ, నిద్ర. ఐన నాలాగా కాదులే నీ కాలక్షేపం వేరేగా ఉంటుంది. నువ్వు బాగా బిజీ అవుతావు. మనువళ్లను పెంచాలి కదా. చాలా కాలక్షేపం నీకు" రాధిక మొహం లో మారుతున్న రంగును గమనించకుండా చెప్పుకు పోయాడు శ్రీనివాస్.

★★★★★★★★★

మర్నాడు పిల్లలందరిని హాలులోకి రమ్మనమని పిలిచింది రాధిక. పొద్దున్నే టిఫిన్ హడావుడి ఐపోయింది. అందరు ఎవరెవరి పరిధిలో ఆలోచించారు ఎందుకా ఈ సమావేశం అని.

" ఆస్తిని వాటలేస్తున్నారేమో" అల్లుడి గారి ఆశ.

"ఎక్కడ ఉండాలో నిర్ణయించుకున్నారేమో! ఆవిడ సాయం మాకు చాలా అవసరం. ఈ డేకేర్ లో పిల్లలను పెడుతుంటే, సంపాదించిందంత అటే పోతుంది" చిన్న కోడలు మనసులో మాట చెప్పింది.

ఎవరి ఆలోచనలు, వారివారి కుతూహలంతో హాల్ లోకి వచ్చి కూర్చున్నారు.

"ఎందుకు పిలిచానా మిమ్మల్ని అందర్నీఅని మీకు చాలా కుతూహలం గా ఉండొచ్చు," నిదానంగా మొదలుపెట్టింది రాధిక.

"నేను నా జీవితం లో పెద్ద భాగం ఈ కుటుంబానికే కేటాయించాను, నాలాంటి ఎందరో ఆడవాళ్ళ లాగానే. నాకంటూ ఒక మంచి కెరియర్, మంచి కుటుంబం ఉన్నాయి. నాకు జీవితం లో పెద్ద కోరికలు కూడా ఏమీ లేవు. ఎవరైనా నా జీవితం చూసి, ఎంత అదృష్టం అని కూడా అనుకోవచ్చు. కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే ఏదో అసంతృప్తి"

"అలా మాట్లాడతావేంటీ. నీకు మేమందరం లేమా? ఇంకా ఏమీ కావాలి నీకు?" ప్రశ్నించాడు శ్రీనివాస్.

"కాలేజ్ ఐపోతూనే ఇరవై సంవత్సరాల వయస్సులోపెళ్లి ఐపోయింది. అప్పటికీ గవర్నమెంట్ ఉద్యోగం కూడా వచ్చింది. ఇంట్లో అందరి అవసరాలు తీర్చాను అనే అనుకుంటున్నా. ఈ ప్రయత్నంలో, ప్రయాణంలో – ఇంట్లోనూ ఆఫీస్ లోను కూడా మంచి పేరే సంపాదించుకున్నా. మంచి భార్య, మంచి తల్లి, మంచి పనిమంతురాలు – మంచి మంచి... ఇలా ఉండటం కూడా ఒక వ్యసనం, ఒక మాయ. ఒకసారి మంచి పేరు సంపాదించుకుంటే చాలా కిక్ వస్తుందేమో. మనలో మనం ఎంత సర్దుకుపోయినా ఆ పేరు మాత్రం కావాలి అనిపిస్తుంది

మీకు తెలుసా – నేను కాలేజ్ లో చాలా ఏక్టివ్ గా ఉండేదాన్ని. వకృత్వపు పోటీలు, సామాజిక అంశాల మీద డిబేట్స్, సామాజిక సేవ లో పాల్గొనటం, పాటలు వినటం పాడటం నా ప్రాణం, పోటీల్లో కూడా పాల్గొన్నా. పెళ్లి అవుతూనే ఇవన్నీ మరచి పోయా, మానేసా. పెళ్లి ఐన తరవాత అత్తగారింట్లో ఎలా ఉండాలన్న విషయం మీద చాలా నేర్పించారు. అందరి అమ్మయిల్లాగానే నేనుకూడా నా అస్తిత్వం వదులుకుని, కోత ఇంట్లో వొదిగిపోయా. నా అలవాట్లు, అభిప్రాయాలు పక్కన పెట్టి సంసారంలో అందరి కోసం అన్నట్లుగా బ్రతికా. చాలా మందికి దాంట్లో పరిమితి ఎంతో అర్థం కాదు. ఐతే నా కెప్పుడూ అనిపించేది... సంసారాన్ని చక్కదిద్దుకోవాలంటే ఆడవాళ్ళు తమ ఉనికిని కోల్పోవాలా? తమ ఇష్టాలను పక్కన పెట్టాలా?"

రాధిక ఒక నిమిషం ఆగి మంచి నీళ్ళు తాగింది. అందరు చాలా అయోమయంగా చూస్తున్నారు ఆమె వంక. ఈ సంభాషణ ఎటు వెళ్తుందో ఎవ్వరికీ అర్థం కాలేదు.

"నా కుటుంబాన్ని చూసుకొని నేనేదో చాలా గొప్ప పని చేశాను లేదా గొప్ప త్యాగాలు చేశాను అని నేను అనటం లేదు. కానీ చాలా ఏళ్లుగా ఒక శూన్యత, స్తబ్దత.. నన్ను బాధిస్తున్నాయి. అది ఏమిటో కూడా చాలా ఏళ్లు అర్థం కాలేదు, తెలుసుకోలేక పోయాను. పిల్లలు బాగా చదువుకున్నారు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు, సంసారాలు – అంత బాగానే ఉంది కదా! కానీ నాకంటూ ఒక తృప్తి లేదు. పర్సనల్ గ్రాటిఫికేషన్. పెళ్లి ఐన కొత్తలో నేనూ కూనిరాగాలు తెస్తుంటే– మీ నాన్న వెక్కిరించేవాళ్ళు, జోక్స్ వేసేవాళ్ళు. అంతే.. నాకు ఎంతో ఇష్టం ఐన పాటల్ని వదిలేశా. కొంచెం కొంచెంగా నాకు ఇష్టం ఐనవన్నీ మానేశా. ఇప్పుడూ కష్టపడి, ఆలోచించాల్సి వస్తోంది.. ఒకప్పట్టి నా ఇష్టాలు ఏమిటా అని." రాధిక ఒక భారీ నిట్టూర్పు విడిచి అందరి వంక స్థిరంగా చూసింది.

"నేను ఒక నిర్ణయానికి వచ్చాను. ఉద్యోగం నుండి రిటైర్ అయ్యాను, ఇప్పుడు గృహిణిగా కూడా రిటైర్ అవుదామనుకుంటున్నా. నేను మరీ పెద్దదాన్ని అవ్వలేదు. ఇంకా ఒంట్లో ఓపిక ఉన్నది. ఈ వూళ్లోనే, ఒక రిటైర్మెంట్ కమ్యూనిటీ ఉన్నది. రిటైర్ ఐన లైక్ మైండెడ్ వాళ్ళు అక్కడ వుంటున్నారు. ఇది ఓల్డ్ ఏజ్ హోం కాదు. పిల్లలు వదిలేసిన వాళ్ళు కాదు ఉండేది ఇక్కడ. ఒంట్లో ఇంకా శక్తి ఉండి సమాజానికి తమ వంతు సహాయం చేద్దామనుకునే వాళ్ళు ఉంటారు. వారి వారి సామర్ధ్యం బట్టి, ఎవరు ఏ గ్రుప్‌లో పని చేయాలనుకుంటే దాంట్లో చేయచ్చు. వీధి పిల్లలకు చదువు చెప్పటం, హాస్పిటల్ లో వాలంటరీ పని, జీవితం మీద ఆశ వదిలేసుకొని మృత్యుమోహం లో ఉన్న పేషెంట్ల తో మాట్లాడటం, ఎయిడ్స్ రోగులకు కౌన్సిలింగ్, ఉచిత వైద్యం ఉన్న చోటికి తీసుకు వెళ్ళటం –– ఇలా చాలా రంగాల్లో వాలంటీర్లుగా చేస్తారు. మీ నాన్న కూడా రావచ్చు నాతో – కావాలనుకుంటే, కానీ ఆయన వచ్చినా రాకున్నా నా నిర్ణయం మారదు"

అందరు ఒకేసారి మాట్లాడటం మొదలెట్టారు – వాళ్ళకు ఏమీ అర్థం కాలేదు.. రాధిక కు ఏమయ్యిందా అని.

" ఇంకో మాట – నేను నా పేరు మీదావున్న డబ్బులు, అదే రిటైర్ ఐనప్పుడు వచ్చినవి, నా నగలు– అన్ని నాతోనే ఉంచుకుంటాను. మీ అందరికి ఇచ్చేయంగా మిగిలినది ఆది. నాకే విధంగా ఖర్చు చేయదల్చుకుంటే అలా చేస్తాను."

"ఇలా ఎలా వదిలేస్తవమ్మా మమ్మల్ని? నువ్వు మాతో ఉంటావనుకున్నా. నీ మనవడికి చాలా కష్టం ఐపోతుంది" రఘు నిలదీసాడు.

"ఇటువంటి నిర్ణయాలు ఎలా తీసుకోగలిగావు? ఎవరిచ్చారు ఇంత చెత్త సలహా నీకు. డబ్బుల కోసం ఇలాంటి సంస్థలు ఏవో మాయా మాటలు చెపితే నమ్మేసావా?మేము కొత్త అపార్ట్మెంట్ బుక్ చేద్దాం అనుకుంటున్నాం, డౌన్ పేమెంట్ కి నువ్వు సహాయం చేస్తావు నీ రిటైర్మెంట్ డబ్బులతో అని మేము అనుకుంటుంటే, ఎవరో పరాయి వాళ్ళకు ఇస్తావా నీ డబ్బులు?" రజని కోపగా ప్రశ్నించింది.

చిన్నగా నవ్వింది రాధిక, "మీరు ఏమీ మాట్లాడటం లేదే?"భర్తను ప్రశ్నించింది.

"చెప్పటానికి ఏముంది? నీ స్వార్థం నువ్వు చూసుకుంటుంటున్నావు. నీకు నేనన్నా పిల్లలన్నా లెక్క లేదు."

"ఏ బంధం లో ఐనా ఇవ్వటం తీసుకోవటం ఉంటుంది. ఇన్నేళ్ల మన కాపురంలో నాకంటూ ప్రత్యేకంగా ఏమీఇచ్చారు మీరు? ఎప్పుడన్నా పూలు తెచ్చారా నాకు, ఏనాడైనా డిన్నర్కి వెళ్లామా ఇద్దరం? లేదు – కేవలం మనిద్దరమే కూర్చొని స్నేహితుల్లాగా మాట్లాడుకున్నామా? మన మాటలు ఎప్పుడు సమస్యలు, పిల్లలు, డబ్బు లెక్కలు. వీటన్నిటిలోనూ మీకు ఖాళీ దొరికితే – మీ కాలక్షేపాలు, టీవీ, లేదా మీ ఫ్రెండ్స్ తో పేకాట్లు. నేను ఎప్పుడన్నా కూర్చొని కాస్త ఆహ్లాదంగా ఉండే విషయాలు మాట్లాడుదాం అని అనుకుంటే, నేనేదో సినిమా లో లాగా ప్రవర్తిస్తున్నా అనేవాళ్ళు. ఎన్నో సార్లు చెప్పటానికి ప్రయత్నించాను. మన వయస్సు పెరిగే కొద్ది, మనిద్దరి మధ్య స్నేహం పెరగాలని. కానీ పట్టించుకోలేదు మీరు. నేను మీకు ఇస్తూనే పోయాను, అన్ని టైమ్ కి సమకూర్చాను. ఇంకా ఐపోయింది నేను ఇవ్వటం, మీరు తీసుకోవటం."

ఇంకా పిల్లల విషయం కి వస్తే – మీ అవసరాలను ఎప్పుడు కాదనలేదు, ఏది తక్కువ చేయలేదు. డబ్బుల ఇబ్బందులు మీ దాకా రానివ్వలేదు.అది కూడా తప్పేనేమో. పిల్లలకు డబ్బు విలువ, సంపాదించుకుని ఉన్నదాంట్లో బ్రతకటంనేర్పించాలి. కానీ నా ఈ పెంపకం మూలాన, మీరు ఇంకా నా నుండి ధనసహాయం కోరుకుంటున్నారు. పశుపక్ష్యాదులు కూడా పిల్లలు పెరిగాక, గూటిలో నుండి వెళ్లగొడతాయి,

స్వతంత్రంగా బ్రతకమని. కానీ మీరు ఆర్థికంగా బాగానే ఉన్నా ఇంకా మా వంక చూస్తున్నారు. నిన్నటి పార్టీ ఖర్చు కూడా నేనే పెట్టుకున్నా, మీకు తెలుసు అది. మీరు చేశారు అని అందరు పొగిడితే, చాలా ఆనందించారు మీరు, అది కుద గమనించా"

ఐన మిమ్మల్ని ఏమీ వదిలేసుకోవటం లేదు. మీ ఇళ్లకు వస్తు పోతూ ఉంటాను, అలాగే మీరు కూడా నన్ను కలవటానికి రావచు. కానీ సమాజానికి ఏదన్నా తిరిగి ఇవ్వాలి నేను...ఇంకా వొంట్లో శక్తి మిగిలి ఉండగానే. చాలా మంది, ముఖ్యంగా ఆడవాళ్ళు, కుటుంబం కోసం శక్తి అంతా ధార పోసి, సమాజానికి పనికి వచ్చే విషయాలని పక్కకి పెడుతుంటారు. ఇంకొన్నాళ్ళు అయ్యాక చూద్దములే అనుకుంటుంటే ఆది ఎన్నటికీ రాదు. అలా అలా వొంట్లో శక్తి అంత హరించుకు పోతుంది. ప్రతి మనిషికి ఒక ఆత్మ తృప్తి ఇచ్చే పని ఉంటుంది – రాయటం, పాడటం, బొమ్మలు వేయటం, సామాజిక సేవ – వీటిని వొదులుకో కూడదు. నా కుటుంబ బాధ్యతలు అన్ని నెరవేర్చాను. ఇక నుండి నాకోసం నేను బ్రతుకుతాను. నా వల్ల సమాజానికి వీలైనంత సహాయం చేస్తాను. ఒక తల్లిగా , గృహిణిగా రిటైర్ అవుదామనుకుంటున్నా!!."

అందరూ నోళ్ళు వెళ్ళబెట్టి చూస్తుండగా, రాధిక లేచి తన గది లోకి వెళ్ళి పోయింది.

- సమాప్తం-